# ఆంధ్ర మహాభాగవతం - మహిళల మహనీయత


***పరిశోధకురాలు***

## కాకుమాను భూలక్ష్మి

ఎమ్.ఏ., ఎమ్.ఫిల్.,

***పర్యవేక్షకురాలు***

## ఆచార్య తేళ్ళ సత్యవతి

ఎమ్.ఏ., పిహెచ్.డి (తెలుగు)

తెలుగు ప్రొఫెసర్., ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం

గుంటూరు


## ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్.డి పట్టాకై

సమర్పిస్తున్న సిద్ధాంత గ్రంథం

గుంటూరు

**2011**

# ప్రకటన

**"ఆంధ్ర మహా భాగవతం - మహిళల మహనీయత"** అనే సిద్ధాంత గ్రంధాన్ని నేనే స్వయంగా రాసానని దీనిని ఏ ఇతర పట్టాకోసం గాని, డిప్లమా కోసం గాని, మరి ఏ ఇతర బిరుదు కోసం గాని, ఇంతకు ముందు ఏ విశ్వ విద్యాలయానికి, మరి ఏ ఇతర సంస్థకి సమర్పింపలేదని ఇందు మూలంగా ప్రకటిస్తున్నాను.

**కాకుమాను భూలక్ష్మి**

పరిశోధకురాలు

# ధ్రువీకరణ పత్రం

**"ఆంధ్ర మహా భాగవతం - మహిళల మహనీయత"** అనే సిద్ధాంత గ్రంధాన్ని **కాకుమాను భూలక్ష్మి** రాసిందని ఈ పరిశోధన ఆమె స్వయంకృషి అనీ ధ్రువీకరిస్తున్నాను.

ప్రొఫెసర్ తేళ్ళ సత్యవతి

పర్యవేక్షకురాలు

# కృతజ్ఞతా నివేదనం

అమృతమహాంబురాశి ఆంధ్రమహాభాగవతంపై, పరిశోధన చేయాలనే సత్సంకల్పం కలిగించిన, అనంత వాక్ప్రవాహ తరంగిణి, వాగధిష్ఠాన దేవత శ్రీ మహా సరస్వతీ దేవికి తొలి అభివందన అక్షర పారిజాతం.

పరిశోధనకు అనుమతించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు. అడిగిన వెంటనే పరిశోధన మార్గదర్శకత్వానికి అంగీకరించి, పరిశోధన ప్రారంభించిన నాటి నుండి నేటివరకు కన్నతల్లి వలె కనికరంతో కనిపెట్టి, సముచిత సలహాలతో సద్గురుమూర్తియై, అంతర్జాతీయ సదస్సు, శ్రీమద్భాగవతమ్, తిరుపతికి వ్యాస సమర్పణ చేయించి, సప్తగిరికి వ్యాసాలు పంపింప జేసి సత్యకాలపు నామధేయాన్ని సార్థకం చేస్తున్నట్లుగా నన్ను వెన్నంటి ప్రోత్సహించి, ఆంధ్ర మహాభాగవతాన్ని అమృతాయమానంగా ఆస్వాదింపజేసి, సన్మార్గ దర్శియైన మా మేడమ్‌గారు ప్రొఫెసర్. శ్రీమతి తేళ్ళ సత్యవతిగారికి ఆజన్మాంతం హృదయపూర్వక కృతజ్ఞతలు. సొంత బిడ్డను చూసినంత ఆనందంగా నన్ను చూసి అమ్మాయి! భూలక్ష్మి వచ్చిందని మా మేడమ్‌గారికి తెలియజేసే వారి మాతృమూర్తి శ్రీమతి తేళ్ళ మనోహరి గారికి నమస్సులు. ఆత్మీయతతో పలకరిస్తూ, నన్ను నా కుటుంబ శ్రేయస్సునడిగి తెలిసికొనే పినతండ్రి తుల్యులు శ్రీ గుదె రామతీర్థ గారికి హృదయపూర్వక నమస్సుమాంజలులు. వృత్తిరీత్యా తెలుగు ఉపన్యాసకురాలినైన నన్ను ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గుంటూరులో సంస్కృత ఉపన్యాసకురాలిగా నియమించి, పార్ట్-టైం పరిశోధన చేయటానికి అనుమతి అడిగిన వెంటనే, భగవంతుడిచ్చిన తండ్రివలె ఆమోద ముద్రతో ఆశీర్వదించి, నో అబ్జక్షన్ లెటర్ ఇచ్చిన, నాటి "విద్యా సంస్కరణల చక్రధారి" 2008 మార్చి ఇంటర్మీడియట్ బోర్డు కమీషనర్ పూజ్యులు శ్రీ డి.చక్రపాణి గారికి హృదయపూర్వక నమస్సుమాంజలులు.

భాగవతం మీద పరిశోధన ప్రారంభించానండి అని అంటే భగవత్తత్త్వాన్ని గూర్చి అనర్గళంగా మూడు గంటల పాటు చెప్పి, వారు రచించిన 'శ్రీరామ తత్త్వం' గ్రంథం నాకిస్తూ "సాహిత్య తపస్విని" అని నన్ను సంబోధించి ఆశీర్వదించి కర్తవ్యాన్ని గుర్తు చేసిన పెద్దలు, గౌరవనీయులు శ్రీ షేక్ మౌలా అలీగారికి హృదయ పూర్వక ధన్యవాదాలు.

సెమినార్స్‌కి వెళ్ళమని అనుమతించి, కళాశాల గ్రంధాలయానికి భారత భాగవత గ్రంధాలు కొని, ఖాళీ సమయంలో చదవమని ప్రోత్సహించిన గౌరవనీయులు మా ప్రిన్సిపాల్ డా. కె. నగజా కుమారి గారికి హృదయ పూర్వక నమస్సులు.

మా అమ్మాయి విద్యాభ్యాసంలోనే మూడు బంగారు పతకాలు సాధించింది. సంస్కృతాంధ్ర భాషల్లో ఎమ్.ఏ చేసింది. భాగవతం మీద పరిశోధన చేస్తే, భాగవతాన్ని క్షుణ్ణంగా చదివి భగవంతుని దర్శించగలదన్న అపార నమ్మకాన్ని నాపై పెట్టి నన్ను ప్రోత్సహించిన నా తల్లి దండ్రులు శ్రీమతి వెంకట భారతి, శ్రీ కాకుమాను అప్పారావు గార్లకు అభివందన అక్షర మందారాలు.

విశ్వ విద్యాలయంలో పరిశోధనకు చెల్లించాల్సిన ఫీజులు మరచిపోకుండా నాకు గుర్తు చేసి, వెళ్ళి సకాలంలో చెల్లించి, నా పరిశోధనకు సహకరించిన మా శ్రీవారు ఆలపాటి రాధామాధవ్ గారికి హృదయ పూర్వక ధన్యవాదాలు. నా పరిశోధన పని తీరు చూస్తున్న మా అమ్మాయిలు పి.హెచ్.డి అంటే మామూలు మాటలు కాదని తెలిసికొని, డాక్టరేట్ ఉన్నవారిని గౌరవించటం నేర్చుకున్న పెద్దమ్మాయి శ్రీవాణికి, చిన్నమ్మాయి వాణి అపర్ణకు నా శుభాశీస్సులు.

భాగవతం మీద పరిశోధన గ్రంధమనే గౌరవభావంతో శ్రద్ధగా కంప్యూటర్ వర్క్ చేసిన కె.యల్.కోటేశ్వరరావు గారికి హృదయపూర్వక నమస్కారాలు.

# ప్రస్తావన

కనిపించే తల్లి ప్రకృతి. ఈ ప్రకృతిలో పుట్టిన ప్రతి ప్రాణి ప్రకృతి ధర్మాన్ని అనుసరించి జీవించాల్సిందే. దానినతిక్రమిస్తే ప్రకృతి ఆక్రోశించి విలయతాండవం చేస్తుంది. అదే ప్రళయం. ఆ ప్రళయం నుండి కాపాడడం ఎవరి తరం కాదు. ఒక్క పరమాత్మకే సాధ్యం. ఆ పరమాత్మ ఎవరు? ఎక్కడుంటాడు? అతని తత్త్వమేంటి? ఇవి మానవ మేధస్సులో మెదిలే ప్రశ్నలు. ఆ ప్రశ్నలన్నింటికి సమాధాన మివ్వగల్గింది భాగవత పురాణం.

భగవంతుడంటే అవ్యక్తుడైన పరమాత్మ. వ్యక్తమైన చరాచర జగత్తు అంతా ప్రకృతి, (ప్రాచేతసులకు రుద్రుడు యోగాదేశమనే నారాయణ స్తోత్రాన్ని ఉపదేశించటంలో చతుర్థ స్కంధం, 702 నుండి 705వరకు పద్యాల్లో, దశమ స్కంధ ఉత్తర భాగంలో రుక్మిణీదేవి శ్రీకృష్ణునకు ప్రకృతీ పురుష లక్షణాలు తెలియ చేయటంలో స్పష్టమౌతుంది) అని తెలియ చేస్తుంది భాగవత పురాణం. ఈ ప్రకృతి యొక్క సృష్టి స్థితి, లయాలు ఆ పరమాత్మ అధీనమే. పరమాత్మ అధీనమైన ప్రకృతిలో, సర్వ ప్రాణికోటిలో, స్త్రీ పురుష భేదముంది. ఇది బాహ్యదృష్టికి కనిపించేది మాత్రమే. కాని అసలు ప్రకృతి అంతా స్త్రీమయం. "స్త్రీ ప్రాయమితరం జగత్" (బ్రహ్మ వస్తువు కంటె భిన్నమైన ఈ ప్రకృతి అంతా స్త్రీప్రాయం) పరమాత్మ ఒక్కడే పురుషుడు. ఆ స్థితి కూడ ప్రకృతి నిర్మాణం చేయాలనుకొన్నపుడు మాత్రమే. అదీ లేకపోతే అంతా శూన్యం. అదే బ్రహ్మజ్ఞానులు వచించే నిరాకార నిర్గుణ పరబ్రహ్మం.

ఈ విషయాలన్నింటిని తెలియజేయగలిగిన భాగవత పురాణంపై అనేక పరిశోధనలు జరిగాయి. సిద్ధాంత గ్రంధాలు, లఘు సిద్ధాంత గ్రంధాలు, అనేక వ్యాసాలు వెల్లి విరిశాయి. కానీ భాగవతంలో మహిళల మహనీయత గూర్చి ప్రత్యేకంగా, సమగ్రంగా ప్రస్తావించిన గ్రంధాలు రాలేదు. అది నా పురాకృత పుణ్య విశేషంగా భావించి "ఆంధ్రమహాభాగవతం - మహిళల మహనీయత" అనే అంశం పరిశోధనగా ఎంచుకున్నాను.

"ఆంధ్ర మహాభాగవతం - మహిళల మహనీయత" అనే సిద్ధాంత వ్యాసం విషయ సౌలభ్యం కోసం ఐదు అధ్యాయాలుగా విభజింపబడింది.

**మొదటి అధ్యాయం** "భాగవతనేపథ్యం". ఈ అధ్యాయంలో భాగవత నిర్వచనం, భాగవతా విర్భావం, సహజ పండితుడైన పోతన జీవిత విశేషాలు, పోతన మహాకవి ప్రత్యేకత, పోతన రచనా పరిచయం, భాగవతాను వాద నేపధ్యం, రాజకీయ మత సారస్వత పరిస్థితులు, భక్తి ప్రస్థానంలో భాగవత స్థానం వివరింపబడింది.

**రెండవ అధ్యాయం** "భాగవతం - స్త్రీపాత్ర పరికల్పన". ఈ అధ్యాయం రెండు ఉపవిభాగాలు 1. ప్రధాన పాత్రలు. 2. అప్రధాన పాత్రలు. ఈ రెండు విధాలైన పాత్రల్లోను స్త్రీలు. 1. దేవజాతి 2.బ్రాహ్మణ జాతి. 3.క్షత్రియజాతి 4.ఇతర స్త్రీలుగా విభజింపబడ్డారు. క్షత్రియ జాతి స్త్రీలల్లో ఉప విభాగాలున్నాయి. 1. మనువంశ స్త్రీలు 2.ప్రజాపతి స్త్రీలు 3.కురువంశ స్త్రీలు 4.యాదవవంశ స్త్రీలు 5.సముద్ర రాజ తనయలు 6.భల్లూక రాజ తనయ 7.వానరజాతి స్త్రీ 8.రాక్షస జాతి స్త్రీలు 9.సర్పజాతి స్త్రీలు. ఈ స్త్రీల స్వభావ చిత్రణ కూలంకషంగా పరిశీలించబడింది. ప్రధాన పాత్రలు 123, అప్రధాన పాత్రలు 168 ఉన్నాయి. విదురుని తల్లి, నారదుని తల్లి, జడ భరతుని తల్లి మొదలైన అనామక పాత్రలున్నాయి. హస్తినాపుర సుందరులు, మధురానగర స్త్రీలు, ద్వారకానగర కాంతలు, 16000 మంది రాజ కన్యలు మొదలైన సామూహిక పాత్రలున్నాయి. ఒకే పేరుతో ఇద్దరిద్దరున్న పాత్రలు కన్పిస్తున్నాయి. దేవజాతిలో సరస్వతి, తార, సూనృతలు. నామం లేని పాత్రల గూర్చి చెప్పేటపుడు భర్తనామం. స్త్రీల సంతాన నామాలు చెప్పటం జరిగింది. జాతి భేదాల ననుసరించి స్త్రీ పాత్ర విభజన జరిగినప్పటికి స్కంధాల వారిగా పాత్రల విషయంలో వరుసక్రమం పాటించటం జరిగింది.

**మూడవ అధ్యాయం** "భాగవత సమాజం - స్త్రీలసామాజిక స్థితిగతులు". ఇది నాలుగు ప్రధాన భాగాలుగా విభజింపబడింది. 1. పురాణ లక్ష్యం 2.భాగవత పురాణం 3.కాల నిర్ణయం 4.భాగవత కాలం - సామాజిక జీవన చిత్రణం. ఇది 1. కృతయుగం - స్రీల సామాజిక స్థితి, ఉదా. బ్రహ్మచర్యం - స్త్రీలు, వివాహ వ్యవస్థ, గృహస్థాశ్రమంలో ధార్మికత్వం, పుత్రికాధర్మ పద్ధతి, వంశోద్ధరణ, బహు భర్తృత్వం, పర స్త్రీ వ్యామోహం, పరదారాపహరణం మొదలైన విషయాలు చర్చించ బడ్డాయి, 2. త్రేతా యుగం - స్త్రీల సామాజిక స్థితి, 3. ద్వాపర యుగం - స్త్రీల సామాజిక స్థితి, 4. కలిప్రవేశం. కృతయుగంలో వలె త్రేతాయుగంలో కూడ వివాహ వ్యవస్థ అన్ని జాతుల్లో ఏ విధంగా ఉందనే విషయం. సామాజిక జీవనం చర్చింపబడింది. ద్వాపరయుగంలో సామాజిక అంశాలతో పాటు

రాజరిక వ్యవస్థ ప్రాధాన్యతను సంతరించుకున్న విషయం చర్చింపబడింది. కలి ప్రవేశం, కలి నివాస ప్రదేశాలు తెలియచేయటమైంది.

**నాల్గవ అధ్యాయం** "భాగవత స్త్రీల సౌజన్యం - జీవన ధర్మం". ఇది నాలుగు ఉపవిభాగాలు చేయ బడింది. 1.భాగవత ధర్మాలు - ధర్మ నిర్వచనం, ధర్మ భేదాలు, భాగవతుల లక్షణాలు వివరించ బడ్డాయి. 2. కృతయుగం 3.త్రేతాయుగం 4.ద్వాపరయుగాల్లో అన్ని జాతుల్లోను సౌజన్యవంతులైన స్త్రీల గుణ గణాలును, వారు సమాజ జీవనానికి ఏ విధంగా ఆదర్శప్రాయు లయ్యారనే అంశాలు, వారి వారి కర్తవ్య నిర్వహణా విధానాలు తెలియచేయబడ్డాయి.

**ఐదవ అధ్యాయం** "భాగవత మహిళల మహనీయత". మహనీయత అంటే అత్యున్నత మానసిక స్థితి. ఘనత, గొప్పతనమని అర్థాలు. ఈ మహనీయత మహిళల్లో మూడు మార్గాల్లో అభివ్యక్త మవుతుంది. 1.శక్తి మార్గం 2. భక్తి మార్గం 3. యుక్తి మార్గం. ఈ మూడు ఉప విభాగాల్లో భాగవత మహిళలు తమ ఘనతని లోకానికి చాటిన విషయం ఈ అధ్యాయంలో స్పష్టం చేయబడింది.

**ఉపసంహారం**

మహనీయతను సాధించడానికి మహిళలకు ఏదీ అడ్డంకాదని ప్రవచించి, వారు తమ సాధనతో భగవంతుని చేరుకోగలిగారన్న సత్యాన్ని స్థిరీకరించడం జరిగింది. ఉపసంహారం, ఉ పయుక్త గ్రంథపట్టిక, సాంకేతిక పద సూచిక పొందుపరచ బడ్డాయి. ఈ పరిశోధన పండితుల ఆమోదం పొందగలదని విశ్వాసం. వారి సూచనలు, సలహాలు శిరోధార్యంగా స్వీకరిస్తాను.

# విషయ సూచిక

కృతజ్ఞతా నివేదనం

ప్రస్తావన

**1. భాగవత నేపథ్యం** **01 - 28**

**1.1 భాగవత నేపథ్యం**

1.1.1 భాగవత శబ్ద నిర్వచనం

1.1.2 భాగవత నిర్వచనం

1.1.3 భాగవతావిర్భావం

**1.2. సహజ పండితుని సంగతి**

1.2.1 పోతన కులగోత్రాలు

1.2.2 పోతన దేశకాలాదులు

1.2.3 కవి ప్రత్యేకత

1.2.4 పోతన రచనా పరిచయం

**1.3 భాగవతాను వాద నేపథ్యం**

1.3.1 రాజకీయ పరిస్థితులు

1.3.2 మత సారస్వత పరిస్థితులు

**1.4. భక్తి ప్రస్థానంలో భాగవత స్థానం**

1.4.1 భక్తి నిర్వచనం

1.4.2 భక్తి శ్రేష్ఠత్వం

1.4.3 భాగవతం - భక్తి

1.4.4 భాగవతం - అజరామరం

**2. భాగవతం - స్త్రీపాత్ర పరికల్పన** **29 - 309**

**2.1 ప్రధాన పాత్రలు**

2.1.1 దేవజాతి స్త్రీలు

2.1.2 బ్రాహ్మణ జాతి స్త్రీలు

2.1.3 క్షత్రియజాతి స్త్రీలు

2.1.3.1 మనువంశ స్త్రీలు

2.1.3.2 ప్రజాపతి వంశ స్త్రీలు

2.1.3.3 కురువంశ స్త్రీలు

2.1.3.4 యాదవ జాతి స్త్రీలు
2.1.3.5 యాదవజాతి కోడళ్ళు (ఇతర రాజవంశ స్త్రీలు)
2.1.3.6 సముద్ర రాజ పుత్రికలు
2.1.3.7 భల్లూక రాజ తనయ
2.1.3.8 వానరజాతి స్త్రీలు
2.1.3.9 రాక్షస జాతి స్త్రీలు
2.1.3.10 సర్పజాతి స్త్రీలు
2.1.4. వైశ్యజాతి స్త్రీలు
2.1.5. అన్య స్త్రీలు

2.2 అప్రధాన పాత్రలు
2.2.1 దేవజాతి స్త్రీలు
2.2.2 బ్రాహ్మణ జాతి
2.2.3 క్షత్రియ జాతి స్త్రీలు
2.2.3.1 మనువంశ స్త్రీలు
2.2.3.2 ప్రజాపతి వంశ స్త్రీలు
2.2.3.3 కురువంశ స్త్రీలు
2.2.3.4 సర్పజాతి స్త్రీలు
2.2.3.5 యాదవజాతి స్త్రీలు
2.2.3.6 రాక్షస జాతి స్త్రీలు
2.2.3.7 అన్య స్త్రీలు

3. భాగవత సమాజం - స్త్రీల సామాజిక స్థితి గతులు 310 - 347
3.1 పురాణ నేపథ్యం
3.2 పురాణ లక్ష్యం
3.3 భాగవత పురాణం
3.4 కాల నిర్ణయం
3.5 భాగవత కాలం - స్త్రీల సామాజిక జీవన చిత్రణం
3.5.1 కృత యుగం - స్త్రీల సామాజిక స్థితి
3.5.2 త్రేతాయుగం - స్త్రీల సామాజిక స్థితి
3.5.3 ద్వాపరయుగం - స్త్రీల సామాజిక స్థితి

3.5.4 యాదవ వంశ రాజరిక వ్యవస్థ
3.5.5 రాక్షస స్త్రీలు - వివాహ వ్యవస్థ
3.6 కలి నివాసము

**4. భాగవత స్త్రీల సౌజన్యం - జీవన ధర్మం 348 - 372**

4.1 భాగవత ధర్మాలు
4.2 ప్రహ్లాదుడు చెప్పిన భాగవత ధర్మాలు
4.2.1 ధర్మ నిర్వచనం
4.3 భాగవతుల లక్షణాలు
4.3.1 భాగవత స్త్రీలు
4.3.2 కృతయుగ స్త్రీలు
4.3.3 త్రేతాయుగ స్త్రీలు
4.3.4 ద్వాపరయుగ స్త్రీలు

**5. భాగవత మహిళల మహనీయత 373 - 387**

5.1 భక్తి మార్గం
5.2 శక్తి మార్గం
5.3 యుక్తి మార్గం

ఉప సంహారము 388 - 391
ఉపయుక్త గ్రంధ పట్టిక 392 - 394
సాంకేతిక పదసూచిక 395 - 396

# మొదటి అధ్యాయం

# రెండవ అధ్యాయం

# మూడవ అధ్యాయం

# నాల్గవ అధ్యాయం

# ఐదవ అధ్యాయం

# ఉపసంహారము

# 1. భాగవత నేపథ్యం

## 1.1. భాగవత నేపథ్యం

### 1.1.1. భాగవత శబ్ద నిర్వచనం

'భగవత: ఇదం భాగవతమ్' అని వ్యుత్పత్తి. భగవంతుడంటే భగం కలవాడు. అతనికి సంబంధించింది భాగవతం. 'భగ: అస్య అస్తీతి భగవాన్". భగమంటే

*"ఐశ్వర్యస్య సమగ్రస్య ధైర్యస్య యశస శ్రియ:*

*జ్ఞాన వైరాగ్యయోశ్చైత షణ్ణాం భగఇతీరత:"*[1]

సమగ్రమైన ఐశ్వర్యం, ధైర్యం, యశస్సు, నిశ్రియం, జ్ఞాన వైరాగ్యాలనే ఆరింటిని భాగంగా విష్ణు పురాణం పేర్కొంటుంది.

సృష్టి ఉత్పత్తి వినాశాలు ప్రాణుల గమనాగమనాలు, విద్యావిద్యలు తెలిసినవాడు భగవంతుడని విష్ణుపురాణంలో ఈ విధంగా చెప్పబడింది.

*"ఉత్పత్తిం నిధనంచైవ భూతానామగతింగతిమ్*

*వేత్తి విద్యామ విద్యాంచ సవాచ్యో భగవానితి"*[2]

భగవంతుని యందాసక్తులు భాగవతులు వారి చరిత్ర భాగవతమని "భగవతిరతా: భాగవతా: తేషాం చరితం భాగవతమ్". అని కూడ పండితులు భాగవత శబ్దార్థాన్ని నిర్వచించారు. ఈ విధంగా భాగవత శబ్దం వల్ల ఆత్మ తత్త్వప్రతి పాదకం, భక్తి ప్రధానమయింది భాగవతమని విశదమవుతుంది. ప్రాచీన సంప్రదాయంలో భాగవతం విద్వాంసులకు పరీక్షాగ్రంధంగా పరిగణింప బడింది.

*"ధనం జయేహాటక సంపరీక్షా*

*మహారణే శస్త్రభృతాం పరీక్షా!*

*విపత్తికాలే గృహిణీ పరీక్షా*

*విద్యావతాం భాగవతే పరీక్షా"*[3]

అని ప్రసిద్ధి. ఆ గ్రంధ సమన్వయం ఆత్మజ్ఞానులకు మాత్రమే సాధ్యపడుతుందని తాత్పర్యం.

*"భక్త్యా భాగవతం జ్ఞేయం నవ్యుత్పత్త్యా నటీకయా"*

అని కూడా ప్రాచీనోక్తి. భాగవతం భక్తిచేత తెలియదగిందని, పాండిత్యం వల్లగాని, వ్యాఖ్యానం వల్లగాని తెలియదగింది కాదని భావం.

### 1.1.2. భాగవత నిర్వచనం

*"యత్రాధికృత్య గాయత్రీం వర్ణ్యతే ధర్మవిస్తర:*

*వృత్రాసుర వధోపేతం తద్భాగవత మిష్యతే"[4]*

ఏ పురాణంలో గాయత్రి ద్వారా ధర్మవిస్తారం, వృత్రాసురవధ వర్ణన ఉన్నాయో అది భాగవతంగా చెప్పబడింది.

*"అర్థో2యం బ్రహ్మ సూత్రాణాం భారతార్థవినిర్ణయ : ।*

*గాయత్రీ భాష్యభూతో2సౌవేదార్థ పరిబృంహిత: ॥*

*గ్రంథో2ష్టాదశ సాహస్రో ద్వాదశ స్కంధ సమ్మిత: ।*

*పఠనా త్స్మరనాత్ ధ్యానాత్ స్పర్శనా దర్శనాద్దృశే : ॥[5]*

*'సర్వపాపహర: కృష్ణరూపీ చైవ నసంశయ :'*

ఇది బ్రహ్మసూత్రాలకర్థం. మహాభారత తాత్పర్యాన్ని నిర్ణయించేది, గాయత్రీ మంత్రానికి భాష్యం, సమస్త వేదార్థాన్ని వివరించేది, సర్వ పురాణాల సారరూపం, సాక్షాత్తు శుక మహర్షిచే చెప్పబడింది. నూరు విశ్రమాలు, 18000 శ్లోకాలు కలిగిందీ శ్రీమద్భాగవతం.

శ్రీమద్భాగవత పురాణం సాక్షాత్తు భగవత్స్వ రూపమని వాయుపురాణం పేర్కొంటుంది. అన్ని శాస్త్రాల్లోను మొదట బ్రహ్మదేవుడు పురాణాన్ని స్మరించాడు. తర్వాత అతని ముఖం నుండి వేదం ఉద్భవించిందట. అదే పురాణ వేదం, యజ్ఞవేదమయింది. అంటే పురాణాలు వేదం కంటే అనాది అని తెలుస్తుంది.

*"పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతమ్।*

*అనంతరంచ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతా :॥[6]*

పద్మపురాణమందు భాగవతాన్ని గూర్చి ఈ విధంగా చెప్పబడింది.

*"గ్రంథోష్టాదశ సాహస్రో ద్వాదశ స్కంధ సమ్మిత :*

*హయగ్రీవ బ్రహ్మవిద్యాయత్ర వృత్రవధస్తధా*

*గాయత్ర్యాదసమారు భస్తద్వై భాగవతం విదు:"[7]*

ఈ పురాణాలందు చెప్పబడిన భాగవత నిర్వచనాన్ని సమీక్షిస్తే శ్రీమహాభాగవతం ఆత్మతత్త్వ నిరూపకం, సర్వపురాణ సారరూపమయిందని స్పష్టమవుతుంది. భాగవత గ్రంథం కూడా ఈ విషయాన్నే తేటతెల్లం చేసింది.

### 1.1.3. భాగవతావిర్భావం

*"వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే*

*నమో వై బ్రహ్మ నిధయే వాసిష్ఠాయ నమోనమ :"* [8]

ద్వాపరయుగంలో విష్ణువు అంశచే పరాశరుని వల్ల ఉపరిచర వసువు పుత్రికయైన సత్యవతికి మహాజ్ఞాని కృష్ణద్వైపాయనుడు జన్మించాడు. అతడు బదరికాశ్రమంలో ఏకాగ్రచిత్తుడై మిక్కిలి విచారించి హోత, ఉద్గాత, అధ్వర్యువు, బ్రహ్మయను ఋత్విక్కులచే అనుష్ఠింపబడే వైదిక యజ్ఞాది కర్మలు జనులకు శుద్ధికరాలని భావించి యజ్ఞాలు విచ్ఛిన్నం కాకుండుటకై ఒకే వేదాన్ని నాలుగుగా విభజించాడు.

*"ఋగ్యజుస్సామాధర్వాఖ్యా వేదాశ్చత్వార ఉద్ధృతా :*

*ఇతిహాస: పురాణాంచ పంచమోవేద ఉచ్యతే''* [9]

ఋక్కు, యజస్సు, సామం, అధర్వం అని నాలుగు వేదాలను వేరు చేసాడు. ఇతిహాస పురాణాలు పంచమవేదంగా చెప్పబడ్డాయి.

*"తత్రర్వేద ధర: పైల: సామగో జైమిని: కవి:*

*వైశంపాయన ఏవైకో నిష్ణాతో యజుషాం ముని: ।*

*అధర్వాంగిరసామాసీ త్సుమంతుర్దారుణో ముని:*

*ఇతిహాస పురాణానాం పితామే రోమ హర్షణ:"* [10]

నాలుగు వేదాలలో పైలు డొక్కడే యజుర్వేదాన్ని తెలిసిన వాడు. కవియైన జైమిని సామవేదాన్ని తెలిసినవాడు. వైశంపాయనుడు యజుర్వేద పారంగతుడు. దారుణుడైన (అధర్వ వేదంలో చెప్పబడిన అభిచార క్రియాదులందు ప్రవృత్తుడైన) సుమంతుడు అధర్వ వేదంలో నిష్ణాతుడు, రోమ హర్షణుడు (సూతుని తండ్రి) ఇతిహాస పురాణాల్లో నిష్ణాతుడు. వేదాధ్యాయనాధి కారంలేని స్త్రీశూద్ర ద్విజ బంధువుల శ్రేయస్సు కోసం మహాభారతేతి హాసాన్ని రచించాడు.

ఇంత చేసినా వ్యాసుని మనస్సుకు సంతోషం కలుగలేదు. తన మనస్సుకి సంతోషం కలుగనందుకు కారణం తెలియక వ్యాసుడీ విధంగా భావించాడు. వేద విభాగం చేసినా, మహా భారతం రచించినా, నాదేహాత్మ అపరిపూర్ణంగా ఉంది. నేను బ్రహ్మతేజస్సంపన్నుడను, సమర్థుడై ఉన్నను నా హృదయం ఎందుకో అసంపూర్ణంగా తోస్తుంది.

*"అసంపన్న ఇవాభాతి బ్రహ్మవర్చస్య సత్తమ :*

*కింవా భాగవతా ధర్మా నప్రాయేణ నిరూపితా :"* [11]

*"ప్రియా : పరమ హంసానాం తపవహ్యచ్యుత ప్రియా:*

*తస్త్వైవం ఖిలమాత్మానాం మన్య మానస్య ఖాద్యత:"*[12]

ఇంతవరకు నేను భగవానుని పొందే ధర్మాన్ని నిరూపించలేదు. ఆ ధర్మాలు పరమహంసలకు ప్రియం అవే భగవానునికి ప్రియం. ఆ సమయానే దేవర్షియైన నారదుడు వ్యాసాశ్రమానికి వచ్చాడు.

వ్యాసుడు నారదుని త్రిలోక సంచార శీలతను, సర్వజ్ఞతను ప్రశంసించి, తన కొరత ఏంటో వివరించాలని ప్రార్థించాడు. నారదుడు వ్యాసునితో నీవు ధర్మాలన్నీ చెప్పావు కాని విష్ణుకథలు చెప్పలేదు. గుణా లెన్నక ధర్మాలు చెప్పినంతమాత్రాన విష్ణువు మెచ్చునా? హరిని నుతింపనందునే నీకీ చింత కలగటానికి కారణమని తెలియచేస్తాడు హరిసేవా మహత్త్వాన్ని, హరిగుణగాన మహత్త్వాన్ని తెలియజేసి తన పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరించి, విష్ణుగుణ వర్ణనం చేయటానికి ప్రేరేపించి శ్రీమన్నారాయణుడు మొదట సంక్షేపంగా చతు: శ్లోక రూపంలో శ్రీమద్భాగవత గ్రంధాన్ని వెల్లడించాడు. అవి

1. *అహమమేవా సమవాగ్రే నాన్యద్యత్సద సత్పరమ్*

   *పశ్చాదహం యదేతచ్చ యోఽవశిష్యేత సోఽస్మ్యహమ్॥*

సృష్టికి పూర్వం నేనొక్కడనే ఉన్నాను. నా కన్యంగా సత్తులేదు. అసత్తులేదు, సృష్టికి తర్వాత కూడా నేనొకడనే ఉన్నాను. ప్రళయమందు కూడా నేనే ఉన్నాను.

2. *"ఋతేర్థం యాత్ప్రతీయే తన ప్రతీయేచాత్మని*

   *తద్విహ్యా దాత్మనో మాయాం యధాభాసోయధాతమ: ॥*

నిజానికి లేనిదైనను ఆత్మయందు ప్రతీయమానమవుతుందో, నిజానికి ఏది ఆత్మను అంటలేదో దానిని నా మాయగా తెలుసుకో.

3. *"యధా మహాన్తి భూతాని భూతేషూచ్చావ చేష్వను*

   *ప్రవిష్టాన్య ప్రవిష్టాని తధా తేషు నతేష్వహమ్"*

మహా భూతాలు భౌతికాలైన ఘటపటాదులందు ప్రవేశించినా ప్రవేశింపనట్లే ఉంటుంది. అలాగే నేను కూడా సర్వ భూతాలందు ప్రవేశించి ఉన్నా ఆత్మరూపంలో సర్వగతుడనై ఉన్నాను.

4. *"ఏతావదేవి జిజ్ఞాస్యం తత్త్వ జిజ్ఞాసు నాత్మన:*

   *అన్వయ వ్యతిరేకాభ్యాం యత్స్యాత్సర్వత్ర సర్వదా"॥*

సర్వత్రా సర్వదా ఏది బోధితమై ఉంటుందో అట్టి దానిని అన్వయ వ్యతిరేక పద్ధతుల ద్వారా ఆత్మయని గ్రహించాలి.

వీనిలో శ్రీమన్నారాయణుడు ప్రథమంలో చతుశ్శ్లోక రూపాన శ్రీమద్భాగవతంలో కర్మజ్ఞాన కాండాశ్రిత మాత్సర్యం లేని వారికి సర్వోత్కృష్టమైన ధర్మం బోధింపబడింది.

*"నిగమ కల్పతరోర్గళితం ఫలం*
*శుకముఖాదమృత ద్రవ సమ్మితమ్!*
*పిబత భాగవతం రసమాలయం*
*ముహురహో రసికా భువి భావుకా :"*[13]

శ్రీ మద్భాగవతాన్ని సర్వశాస్త్రాల కంటే శ్రేష్టమని తలచి మాత్రమే శ్రవణం చేయాలని, ఇది సమస్త శాస్త్రాల ఫల స్వరూపమై ప్రకాశిస్తుందని. ఇది వేదాల సారభూతమై పరిపక్వమయిన ఫలమని చెప్పారు. ఇందు టెంక, తొక్క వంటి వ్యర్థ పదార్థాలు లేవు. ఇది ఆదిలో వైకుంఠమందున్నది. దీనిని నారదుడు వ్యాసునకు, వ్యాసుడు శుకునకు ఇచ్చాడు. శుక ముఖారవిందం నుండి ఈ ఫలం శిష్య ప్రశిష్యాను క్రమంగా ప్రపంచంలో అవతరించింది. "రసోవైస: రసహ్యేవాయం లబ్ధ్వా నందీ భవతి." అనే శ్రుతి వాక్యానుసారం అమృత స్వరూప పరమానందమై శుద్ధ భక్తులకు పాన యోగ్యమయింది. 'పిబత భాగవతం రసమాలయం' అయింది. ఇది సర్వ శాస్త్రాలకు శిరోమణి, సాలోక్య, సారూప్య, సామీప్య, సాద్విముక్తా వస్థలలో కూడా ఈ భాగవత రసామృతం మరల, మరల ఆస్వాదింప వలసిందే.

*" నారాయణం నమస్కృత్వ నరంచైవ నరోత్తమం*
*దేవీం సరస్వతీం వ్యాసంతతో జయముదీరయేత్"*[14]

## 1.2. సహజ పండితుని సంగతి

పోతన మహాకవి సర్వ మానవాళిలో సమతా భావం పెంపొందించి, అందరికి ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం, ధర్మాసక్తిని, ఆస్తికత్వాన్ని కలిగించిన మహాభక్తుడు. భక్తునికి, పతితునికి, దానవునికి, మానవునికి, పాముకి, ఏనుగుకి, మొసలికి సాయుజ్యం కలిగించి భక్తి మార్గమే ముక్తికి మూలమని ఋజువు చేసిన సహజ పండితుడు భక్త కవి పోతన

### 1.2.1. పోతన కులగోత్రాలు

శ్రీమదాంధ్ర మహాభాగవతంలో ప్రథమస్కంధం గ్రంధకర్తృ వంశ వర్ణన వల్ల పోతన కుల గోత్రాలు వెల్లడౌతున్నాయి.

సీ. "కౌండిన్య గోత్ర సంకలితుండాపస్తంబ సూత్రుడు పుణ్యుండు శుభగుణుండు
భూమన మంత్రికి, బ్రియపుత్రండన్నయ కలకంఠి తద్భార్య గౌరమాంబ
కమలాప్తు వరమున ( గనియె సోమన మంత్రి వల్లభ మల్లమవారి తనయు (
డెల్లన యతనికి నిల్లాలు మాచమ్మ వారి పుత్రు ( డు వంశ వర్ధనుండు

*ఆ."లలితమూర్తి బహుకళానిధికేసన,*
*దానమాన నీతిధనుడు ఘనుండు*
*తనకు లక్కమాంబ ధర్మగేహిని గా ( గ*
*మనియె శైవశాస్త్ర మతము గనియె"* [15]

*క."నడవదు నిలయము వెలువడి*
*తడవదు పరపురుష గుణము తనపతి నుడువన్*
*కడువదు వితరణ గుణముల్*
*విడవదు లక్కాంబ విబుధ విసరము వొగడన్"*[16]

*ఉ "మానిని లీడుగారు బహుమాన నివారిత దీన మానస*
*గ్లానికి దానధర్మమతి గౌరవ మంజులతా గభీరతా*
*స్థానికి ముగ్ధసానికి సదాశివ పాద యుగార్చనానుకం*
*పానయ వాగ్భవానికిని బమ్మెర కేసయ లక్కసానికిన్"*[17]

*క "ఆమానిని కుదయించితి,*
*మే మిరువుర మగ్రజాతుండీశ్వరసేవా*
*కాము ( డు తిప్పన, పోతన*
*నామవ్యక్తుండ సాధునయ యుక్తు ( డన్"* [18]

పై పద్యాలను పరిశీలిస్తే పోతన కౌండిన్య గోత్రానికి చెందిన వాడని ఆసస్తంబ సూత్రుడని, కేసన లక్కమాంబల తల్లిదండ్రులని, సోదరుడు తిప్పన అని స్పష్టమవుతుంది.

భాగవత రచన నాటికి పోతన తల్లి దండ్రులు జీవించి ఉండరు. భాగవతాన్ననుసరించి పోతనగారి వంశ వృక్షం ఈ విధంగా ఉంది.

భీమన మంత్రి

|

అన్నయ్య (భార్య గౌరమాంబ)

|

సోమన మంత్రి (భార్య ఎల్లమ్మ)

|

ఎల్లన (భార్య మాచమ)

|

కేసన (భార్య లక్కమాంబ)

|

తిప్పన　　　　పోతన (భాగవత కర్త)

పోతన మహాకవి తన తల్లిని, అన్నను అధిక భక్తితో కొనియాడారు. లక్కసాని బహుమాన నివారిత దీన మానస గ్లాని అని (దీనులైన వారిని ఆదరించి వారి కష్టాలు పోగొట్టేది) దాన ధర్మాలు చేయటంలోను, బుద్ధి చాతుర్యానికి, సౌందర్యానికి, గాంభీర్యానికి స్థానమని, నిరంతరం సదాశివ పాదాలు పూజిస్తూ, దయతో చక్కని మాటలు మాట్లాడే సాక్షాత్తు పార్వతీ దేవిలా కనిపించే ఆ కేసన మంత్రిగారి ధర్మపత్ని లక్కమాంబకు సామాన్య స్త్రీలెవ్వరు సాటిరారని వర్ణింపబడింది. తిప్పన ఈశ్వర సేవా కాముడట.

వీరభద్ర విజయంలో పోతన తన గురువును గూర్చి ఈ విధంగా పలికాడు.

*ఆట వెలది. "వెలయు శంభుమూర్తి వీర మహేశ్వరా*

*చారవిభుడు భక్తి పారగుండు*

*అనఘు, డివ్వటూరి యారాధ్య చంద్రుండు*

*సోమనాధసము ( డు సోమగురు ( డు"*[19]

ఆ గురువే "మత్ప్రసాద దివ్య మహిమచే నెంతైన ၊ గవిత ၊ జెప్పు నేర్పుగలదునీ" కని జంకుతీర్చాడు. "జనక శిక్షిత మహితాక్షరాభ్యాసుండైన పోతన వీరభద్ర ప్రసాదలబ్ధ కవితాతి శయంతో ప్రకాశించి

నట్లు చెప్పటం వల్ల పోతన వంశం వారు, పోతన వీరశైవులని వెల్లడవుతుంది.

పోతన కవిబ్రహ్మ తిక్కన వలె హరి హరులకు భేదం తెలియని అద్వైతిగా మారాడు.

పోతన వీరభద్ర విజయం రచించేనాటికి పోతన తల్లి దండ్రులు సజీవులుగానే ఉన్నారు. కనుకనే తన తండ్రిని గూర్చి వీరభద్ర విజయంలో ఈ క్రింది విధంగా చెప్పాడు.

*"భూసుర వంద్యునిన్ సుగుణ భూషణు నాశ్రిత కల్ప వృక్షము*
*దాసజన ప్రసన్న శివతత్త్వ మనోరధ కౌతుకోన్నతుం*
*గేసన మంత్రి సత్యనిధి గీర్తివిశాలు జిరాయురున్నతుం*
*జేసి యుమా మహేశ్వరులు చెన్నుగ ( గాతురుగాక సత్కృపన్'*[20]

కేసన భూసురులచే నమస్కరించదగిన వాడని, సద్గుణాలం కారుడని, దాస జనులకు ఆశ్రిత కల్ప వృక్షమని, శివతత్త్వ కుతూహలు డని, సత్యనిధి, కీర్తిమంతుడని, తన తండ్రిని పార్వతీ పరమేశ్వరులు సత్కృపతో రక్షిస్తారని వెల్లడించాడు. పోతన తన తండ్రిని గూర్చి చెప్పిన మాటల్లో పోతన ఔన్నత్యం, శబ్దార్ధ స్వరూపమైన ఆది దంపతులు. జగత్తుకే తల్లిదండ్రులైన ఆ శివపార్వతులు తన వంశ రక్షగా వెన్నంటి సంరక్షించారని సువ్యక్తమవుతుంది.

వీరభద్ర విజయాన్ననుసరించి పోతనగారి వంశ వృక్షతీరు ఈ క్రింది విధంగా ఉంది.

మల్లయ
|
భీమయ
|
అన్నయ్య (భార్య గౌరమాంబ)
|
సోమన (భార్య మల్లమ)

- రేచన
- అన్నయ
- ఎల్లన
  - భార్యమాచాంబిక
    - కేసన (భార్య లక్ష్మమ్మ)
      - తిప్పన
      - పోతన (భాగవత కర్త)
    - మాధవుడు
      - కేసన
    - ఇమ్మడి నాగయ్య
- అయ్యలుప్రెగ్గడ
- మాదయనాగడు

### 1.2.2. పోతన దేశ కాలాదులు

ఆంధ్రులకు ఆధ్యాత్మిక చింతనను, భక్తి భావాన్ని ప్రజ్వరిల్ల జేసిన పుణ్యపేటి పోతన మహాకవి దేశ కాలాదులను పరిశీలిద్దాం.

కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు, శేషాద్రిరమణ కవులు పోతన జన్మస్థలం ఓరుగల్లు మండలంలో బమ్మెర అని, అతడు భాగవతంలో పేర్కొన్న ఏకశిలానగరం ఓరుగల్లే అని సహేతుకంగా నిరూపించి, నిర్వివాదంగా పరిష్కరించారు.

*వ. "ఇట్లు రాజిల్లెడు శ్రీమహాభాగవత పురాణ పారిజాత పాదప సమాశ్రయంబున హరి కరుణా విశేషంబున గృతార్థత్వంబు సిద్ధించెనని బుద్ధినెఱింగి లేచి మరలి కొన్ని దినంబులను నేకశిలా నగరంబునకుం జనుదెంచి యందు గురు వృద్ధ బంధు జనాను జ్ఞాతుండనై"*[21]

పోతన పూర్వీకుల జన్మస్థలం బమ్మెర అని, భాగవత రచన జరిగింది ఓరుగల్లులో అని నిశ్చయంగా తేలిపోయింది.

పోతన కాలం మాత్రం వివాదాస్పదమైంది. సాహిత్య లోకంలో వ్యాపించిన కథలన నుసరించి పోతనామాత్యుడు శ్రీనాధునికి, సర్వజ్ఞ సింగభూపాలునికి సమకాలీనుడని, కొందరు 15వ శతాబ్ది ఉత్తర భాగం వాడని, మరికొందరు అభిప్రాయ పడ్డారు. వీరేశలింగం గారు పోతన 15వ శ. పూర్వార్థం వాడన్నారు.

చాగంటి శేషయ్యగారు (ఆంధ్ర కవి తరంగిణి సంపుటం 6) పోతనామాత్యుడు క్రీ.శ 1450-1510 ప్రాంతమందున్నాడని శ్రీ అనుముల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు పోతన కాలం క్రీ.శ 1410-1470 అని నిర్ధారించారు.

శ్రీనిడదవోలు వెంకటరావు గారు క్రీ.శ.1400-1470 అని నిర్ణయించారు. సుప్రసిద్ధ చారిత్రకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు పోతన మునిమనుమలైన కేసన మల్లన్న కవుల దాక్షాయణీ పరిణయాన్ని, పోతన విరచిత భోగినీదండకాన్ని ఆధారంగా పోతన 15వ శతాబ్ది ఉత్తరార్ధం వాడన్నారు.

### 1.2.3. కవి ప్రత్యేకత

*"అంతశ్శాక్తం బహిశ్శైవం సభామధ్యేతు వైష్ణవమ్"*

అని శంకర భగవత్పాదుల వారిని గూర్చి పెద్దలు చెపుతారు. అయినా ద్వైతులు మధ్వాచార్యుని, అద్వైతులు శంకర భగవత్పాదులవారిని, విశిష్టాద్వైతులు శ్రీ రామానుజాచార్యుల వారిని, గురువులుగా భావించారు. ఈ మూడు మతాల వారు ఆమోదించ దగిన భక్తకవి సహజ పండితుడైన పోతన. ఆంధ్రుల పుణ్యపేటి. పోతన భక్తి రస హృదయం నుండి జలువారిన ఆంధ్ర మహాభాగవతం ఆంధ్రులందరిని అలరింపచేసి, ఆజరామరమైన యశో లక్ష్మిని సంపాదించి పెట్టింది. కళా ప్రపూర్ణ డి.దాశరథి గారు పోతనపై చెప్పిన పద్యం ఈ సందర్భంలో స్మరణీయం

*"భక్తిరసాతిరేకమున భాగవతమ్ము రచించినాడు, తా*
*ముక్తినిగాంచినాడు, తన ముద్దుల పద్దెము విన్నవారికిన్*
*ముక్తిని కూర్చినాడమృత మూర్తి, దిగం విశాల కీర్తి, సద్*
*భక్తజనావళీ పరమ భాగవతోత్తమ చక్రవర్తియై"*[22]

### 1.2.4. పోతన రచనా పరిచయం

సహజ పండితుడైన పోతన మహాకవి పేరప్రచారంలో ఉన్న రచనలు

1. వీరభద్ర విజయము
2. భోగినీ దండకము
3. నారాయణ శతకము
4. ఆంధ్రమహా భాగవతము

### 1. వీరభద్ర విజయము

ఇది పోతన బాల్యరచనమని, ప్రథమ గ్రంధమని గ్రంధావతారిక వల్ల తెలుస్తుంది. పోతన "ఏమి కథ యొనర్చి యిలలోన సత్కీర్తి దనరవచ్చు" అని తలపోసే సమయంలో అతని గురువైన ఇవటూరి సోమనారాధ్యుడతనిని పిలిపించి "వీరభద్ర విజయము వినవేడ్కయయ్యేనది తెలుగున రచియింపు" మని కోరాడు. ఆ నాటికి పోతన "పిన్నవాడు పెక్కు సంస్కృతుల్లో పరిచితుడు కాదు. "నా ప్రసాద మహిమచే నెంతయైన గవిత చెప్పగలవు" అని "నీకు వీరభద్ర ప్రసాదంబ గలదు" అని ఇవటూరి సోమ గురుడు అభయమిచ్చాడు. గురువుగారి ఆదేశాన్ననుసరించి పోతన వీరభద్ర

విజయాన్ని రచించారు.

"... ... ... కేశయామాత్య పుత్ర పోతయ నామధేయ ప్రణీతంబైన వీరభద్ర విజయము" అని ఇందలి ఆశ్వాసాంతగద్య, గ్రంథస్థ నిదర్శనాలను బట్టి వీరభద్ర విజయం పోతన కృతమని స్పష్టమవుతుంది.

వీరభద్ర విజయము నాల్గాశ్వాసాల కావ్యం. ఈ గ్రంథంలో పోతన నన్నెచోడుని, పండితారాధ్యుని అధికంగా అనుకరించాడు.

వీరభద్ర విజయ కర్తృత్వంలో వివాదాలున్నాయి. వీరభద్ర విజయం పోతన కృతం కాదని, ప్రముఖ సాహిత్య చరిత్రకారులు పింగళి లక్ష్మీకాంతం గారు, చాగంటి శేషయ్య గారు పేర్కొన్నారు.

వీరభద్ర విజయం పోతన కృతమేనని డా.కె. గోపాల కృష్ణారావు గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు పేర్కొన్నారు.

తెలుగు సాహిత్య సమీక్ష గ్రంథంలో జి.నాగయ్య గారు వీరభద్ర విజయాన్ని పోతన ప్రాథమిక కృతిగా పేర్కొన్నారు.

## 2. భోగినీదండకము

ఒక వేశ్య యువతి సుందరాకారుడైన సర్వజ్ఞసింగమ నాయకుని వలచి వలవంతకు లోనై వృథ చెందుతుండగా, ఆమె తల్లి, అది కులాచార విరుద్ధమని కుమార్తెను మందలించి హితం పలుకుతుంది. ఆ తరుణి తల్లి మాటలను లెక్కచేయక తెగించి, ఎట్లో నాయకుని సన్నిధానానికెళ్ళి పాదాలపై పడి, తన్నేలుకొమ్మని అర్థిస్తుంది. అతడు ఆమెననుగ్రహించి ఏనుగుపై ఊరేగించి ప్రియురాలిగా స్వీకరించి అనుగ్రహిస్తాడు. ఈ కథాలేశమే ఇందలి ఇతి వృత్తం. ఇందు వేశ్య మాత పుత్రికకు చేసే హితోపదేశం చాలా సొగసుగా ఉంటుంది. ఇది పోతన కృతంగా గ్రంథాంతంలో ఈ క్రింది పద్యముంది.

*ఉ. "పండిత కీర్తనీయుడగు బమ్మెర పోతన యా సుధాంశుమా*
*ర్తాండ కులాచలాంబునిధి తారకమై విల్లసిల్లు భోగినీ*
*దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగ భూ*
*మండల భర్తకున్ విమత మానవ నాథ మదాపహర్తకున్"*[23]

ఈ సింగ భూపాలునికే సర్వజ్ఞ సింగుడనే బిరుదు ఉంది. ఇతని తండ్రి అనపోత నాయకుడని, తాత సింగభూపాలుడని ఈ దండకంలో ఉంది.

ఈ గ్రంధ కర్తృత్వ విషయంలో వివాదాలున్నా పోతన చిన్న వయస్సున విద్వత్ప్రభువైన ఆరాజు కోర్కెపై ఈ దండకాన్ని రచించి యుండవచ్చు. ఈ చనువు బలిమినే సింగమ నాయకుడు భాగవతాన్ని తన కంకితమిమ్మని అర్థించటం, ఆయన నిరాకరించటం జరిగి ఉండవచ్చు. పోతన భోగినీ దండకం లభ్యమైన తెలుగు దండకాల్లో మొదటి దండకము.

## 3. నారాయణ శతకము

"నారాయణా!" అనే మకుటంతో నూటమూడు పద్యాల శతకమిది. "హరి భజియించు హస్తములు హస్తములు" "వరదుగ్దాబ్ధి తరంగ డోలికల్లో వైకుంఠ లోకంబులో" మొదలైన పద్యాల్లోని శైలిధార, భగవద్భక్తి పోతన భాగవత పద్యాలను తలపిస్తుంది. "ధర సింహాసనమై నభంబుగొడుగై" అనే పద్యం పోతన కృతంగా ప్రచారం పొందింది. నారాయణ శతకమందు కృష్ణ కర్ణామృతం, సర్వేశ్వర శతకాల్లోని పద్యాలకు అనుకరణ ప్రాయమైన పద్యాలనేకమున్నాయి. నారాయణ శతకం నాడు దేశమందు ప్రబలంగా వ్యాప్తమై ఉన్న వైష్ణవ మతాభిమానం (ఈ కృతికి) పోతనకు ప్రేరణను కలిగించి ఉండవచ్చు, ఈ కృతియే అనంతర కాలాన మహాభాగవత రచనకి నాంది అయింది.

ఈ శతకం పోతన కృతం కాదని కొందరు సంశయించారు. కాని కొన్ని వ్రాత ప్రతుల్లో "ఇది శ్రీ పరమేశ్వర కరుణా కలిత కవితా విచిత్ర కేసన మంత్రి పుత్ర సహజ పాండిత్య పోతనా మాత్య ప్రణీతంబైన నారాయణ శతకంబు" అనే గద్యం శతకాంతంలో ఉంది.

## 4. శ్రీమదాంధ్ర మహా భాగవతము

చతుర్విధ పురుషార్థ సాధకమై వేద శాస్త్రాల్లో శబ్ద మహిమ పురాణేతి హాసాల్లో అర్థబలం, కావ్య నాటకాల్లోని రస స్ఫూర్తి ముప్పేట ముసిరిగొని, భక్తికి బాసటగా, అనురక్తికి ఆలవాలంగా, ముక్తికి మూలంగా భక్తకవి పోతన ఆంధ్రులకి అందించిన అమృత భాండమే శ్రీమదాంధ్ర మహా భాగవతం.

పోతన భాగవత రచనారంభంలో చెప్పిన పద్యంలో

*మ. "ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విం బురాణావళుల్*
*తెనుంగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో*
*తెనుగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించినా*
*జననంబున్ సఫలంబు, జేసెద బునర్జన్మంబు లేకుండగన్"* [24]

నన్నయ, తిక్కన మొదలైన పూర్వకవులు మహాభారతాంధ్రీకరణకి పూనుకొని భాగవతం తెనిగించక పోవటం తన పూర్వజన్మ సుకృతంగా భావించాడు. అంతేకాక భాగవతాంధ్రీకరణం తోనే తన జన్మసాఫల్యం పొందవచ్చని భావించాడు. పోతన భాగవతాంధ్రీకరణలో ఇతరుల చేత రచింప జేసి తరిస్తానని పలుకలేదు. అంటే భాగవతం 12 స్కంధాలు బమ్మెర పోతనయే రచించి ఉంటాడని తెలుస్తుంది.

ఏ కారణం వల్లగాని భాగవతం శిథిలపూరణం కొంత జరిగిందని, సాహిత్య చరిత్ర కారులు, లాక్షణికులు తెలియ జేస్తున్నారు.

లక్షణ సార సంగ్రహమందు కూచిమంచి తిమ్మకవి చెప్పిన క్రింది పద్యం భాగవత శిథిల పూరణం గూర్చి తెలియజేస్తుంది.

*సీ. "ఘనుడు పోతన మంత్రిమును భాగవతము ర*
*చించి చక్రికి సమర్పించు నెడల*
*సర్వజ్ఞ సింగయక్ష్మావరుండది తన*
*కిమ్మని వే( డగా నీయకున్న*
*నలిగి యాపుస్తకంబవని బాలించిన(*
*జివికి యందొక కొంత శిథిలమయ్యె*
*గ్రమ్మఱనది వెలిగందల నారప*
*రాజును మఱి బొప్పరాజు గంగ*
*రాజు మొదలగు కవి వరుల్ తేజమెసగ(*
*జెప్పిరా గ్రంథముల యందె తప్పులొదవె(*
*గాని పోత కవీంద్రుని కవితయందు*
*లక్షణం బెందు "దప్పు నా దక్ష హరణ"*[25]

పోతన భాగవతమందు శిథిలమైన భాగాలను పంచమ స్కంధం గంగన, షష్ఠస్కంధం సింగన ఏకాదశ ద్వాదశ స్కంధాలను నారయ రచించి ఉండవచ్చని ఆచార్య కోర్లపాటి శ్రీరామ మూర్తిగారు "సాహిత్య సంపద" గ్రంథంలో "ఆంధ్ర మహాభాగవతావ తరణము - చారిత్రక నైపథ్యము" అనే వ్యాసంలో సోపపత్తికంగా తెలియచేసారు.

### 1.3. భాగవతాను వాద నేపథ్యం

నిండు పున్నమి రోజున శిష్ట గృహస్థుయైన పోతన ప్రాతరాహ్నికాలు నిర్వర్తించి నిఖిల భువన ప్రధాన దేవతా వందనం చేసాడు, త్రిమూర్తులను, త్రిదేవతలను సుమంత్ర పుష్పాలతో పూజించాడు. పూర్వకవి కులపతులను వినుతించాడు. వర్తమాన కవులకి ప్రియం పలికి, ఆ తన్మయావస్థలో మఱచి పోవక భావికవులను బహూకరించాడు. విశేషమేమంటే ఈ భక్త కవికి కుకవులు కనబడలేదు. పద్య పాషాణాలు విసరికొట్టటానికి సకల కవి కులాన్ని అభిజనంగా భావించి కుకవులను స్మరించిన పోతన పూర్ణ సాత్త్వికుడు, సర్వసముడైన సత్కవి ఋషి.

చంద్రోదయ వేళలో గోదావరీ స్నాతుడై తీరాన శ్వేత సైకతం మీద పద్మాసనుడై ధ్యాన నిమగ్నుడయ్యాడు కన్నులు అర్ధనిమీలి తాలుగా ఉన్న సమయాన

*సీ. "మెఱు ( గు చెంగటనున్న మేఘంబుకైవడి*
*నువిద చెంగట నుండ నొప్పవాడు*
*చంద్రమండల సుధాసారంబు పోలిక*
*ముఖమున ( జిఱునవ్వు మొలచువాడు*
*వల్లీయుత తమాల వసుమతీజము భంగి*
*బలువిల్లు మూపున ( బరగువాడు*
*నీలనగాగ్ర సన్నిహిత భానుని భంగి*
*ఘన కిరీటము దల ( గల్గువా ( డు*

*ఆ. పుండరీక యుగము ( బోలు కన్నులవా ( డు*
*వెడ ( ద యురము వా ( డు విపుల భద్ర*
*మూర్తివా ( డు రాజముఖ్యుడొక్కరుడు నా*
*కన్ను గవకు నెదుర ( గానబడియె ( .* [26]

తారక మంత్రతారుడు, శ్రీరామచంద్రుడే పలుకుల పళ్ళెం అందించి శ్రీమహాభాగవతం తెనిగించమని భవబంధాలు తెగిపోతాయని భాషించి అదృశ్యమయ్యాడు. ఆ శ్రీరామాదేశం పోతనార్యుని మేధా మనీషా మండలాన్నావహించింది. భాగవత తన్మయుడైపోయాడు. పలికించే చోదకుడు భగవంతుడు. పలికేది భాగవతం. అచంచల విశ్వాసంతో రచన ప్రారంభమై అమృత ధారలా సాగింది.

### 1.3.1. రాజకీయ పరిస్థితులు

కాకతీయ సామ్రాజ్య పతనంతో రాజకీయ ధార్మిక సంక్షోభాలకి దక్షిణాపథమంతా గురియైంది. ఏ పూర్వ పుణ్యం వల్లో కొన్ని దశాబ్దాలకు తెలుగు నేలపై మరల స్వాతంత్ర్య వాయువులు వీచాయి. కాని తెలుగు నేల ఏకచ్ఛత్రాదిపత్యం క్రిందికి రాలేదు. త్రిలింగ సామ్రాజ్య లక్ష్మి ధార్మిక సంక్షోభం నుండి బయటపడినా రాజకీయంగా నాలుగు ముక్కలైపోయింది. విజయనగ రాధీశ్వరులు కొంత, కొండవీటి రెడ్లు కొంత, రాచకొండ వెలమలు కొంత, కటకపు గజపతులు మఱికొంత తెలుగు నేలను పంచుకొన్నారు. ఈ నాలుగు రాజ్యాలు కొంతకాలమహామహమికతో పెనగులాడాయి. అప్పుడే బహ్మనీ రాజ్యం వీలైన భాగమెల్ల చేజిక్కించుకొని బలిసింది. ఈ ఐదు రాజ్యాల్లో విజయనగర బహ్మనీ కళింగాలు బలవత్తరాలు, తెలుగునేల అధికభాగం ఆక్రమించుకొని తెలుగు సంస్కృతికి, సాహిత్యానికి దోహదం చేసిన సిసలైన తెలుగు రాజులు కొండవీటి రెడ్లును, రాచకొండ వెలమలును పరస్పర యుద్ధాలతో బలవత్తరుల నాశ్రయించటంతో సన్నగిల్లి చిట్టచివరికి నామరూపాలు లేకుండా ఆరిపోయారు. దాదాపు ఆ కాలంలో పుట్టిందే ఆంధ్ర భాగవత కల్పతరువు,

### 1.3.2. మతసారస్వత పరిస్థితులు

ఆశానిరాశలతో వ్యూహ, ప్రతివ్యూహాలతో, వాదోపవాదాలతో దేశం, సమాజం కూడా అవ్యవస్థితమైన క్లిష్టదశను ఎదుర్కొంది. ఇంతలో కొందరు వైష్ణవ భక్తులు సహ్యాద్రి ప్రాంతం నుండి వచ్చారు. వీరందరూ మహానుభావపంథాకు చెందిన క్రొత్త వైష్ణవులు, వైదిక ధర్మద్వేషులు. సంస్కృతం చదువుకొన్నవారినే వెలివేసి వేధించిన ఉన్మాదులు. జైనులు, బౌద్ధులు, జంగాలు, హరిదాసులు నేల ఈనినట్లు దేశమంతటా వ్యాపించారు.

ఇక సారస్వత క్షేత్రంలో శైవకవులు వేదాలను వైదికాచారాలను తిట్టి పోస్తున్నారు. ఓరుగల్లు క్రీడాభిరామధామంగా లోకాయత లాలసతో మునిగి తేలుతుంది. ఏ వైపుచూసినా దురావేశం, దురభిమానం, దూషణ, దౌష్ట్యం దుర్దాంతంగా చెలరేగి చిందులు త్రొక్కాయి.

ఈ దుష్కాలంలో పుట్టి పెరిగిన వారు శ్రీనాధ పోతనార్యులు. శ్రీనాధుడు శృంగార కవిగా రాజాస్థాన సందర్శన మారంభించిన ఉద్ధండకవి. డిండిమ భట్టు కంచుఢక్కను పగులకొట్టించాడు.

రెడ్డిరాజుల ఆస్థానకవిగా మహాభోగాలను భవించాడు. ఆఖండ ధారాపాతం వంటి కవితతో సారస్వత క్షేత్రాన్ని ముంచెత్తాడు. తుదకు సంకెళ్ళు పడి, నడివీధిలో దీర్ఘనిద్రపోయాడు.

పోతనామాత్యుడు పుణ్యశాలి. శైవుల ఇంటనే జన్మించాడు కాని వీరభద్ర పళ్ళెములెత్తి "హరోంహర" అని ఊరేగుతున్న నాటి మతోద్వేగానికి ఓపలేకపోయాడు. మహా భాగవతాన్ని తెనిగించి మాతృభాషని మధుమయం చేసి శివకేశవా భేదాన్ని పాటించి అద్వైతాన్ని స్థాపించాడు.

*"చేతులారంగ శివుని, బూజింపడేని*
*నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని*
*దయయు సత్యంబు లోనుగా, దలపడేని*
*గలుగ నేటికి ( దల్లుల కడుపు చేటు"* [27]

బాలకృష్ణుని వర్ణనలో శైవ లక్షణాలతో పోల్చి పోతన సర్వాంతర్యామిత్వం శివునిలో తెలియ చేసాడు.

*సీ. "తనువున నంటిన ధరణీపరాగంబు*
*పూసిన నెఱిభూతి పూ ( తగా ( గ*
*ముందట వెలు ၊ గొందు ముక్తా లలామంబు*
*తొగల సంగడి కాని తునుక గా ( గ*
*ఫాలభాగంబుపై ၊బరగు గావలి బొట్టు*
*కాముని గెల్చిన కన్నుగాగ*
*కంఠమాలికలోన ఘననీలరత్నంబు*
*కమనీయమగు మెడకప్పుగా ( గ*
*ఆ. హారవల్లు లురగ హారవల్లులుగా ( గ*
*బాలులీల ప్రౌఢ బాలకుండు*
*శివుని పగిది నొప్పె శివునికిందనకును*
*వేఱు లేమి ( దెలుప వెలయునట్లు ( .* [28]

హరిహరుల క భేదం చెప్పి కవిబ్రహ్మ తిక్కనవలె హరి హరాద్వైతాన్ని స్థాపించాడు.

*"నీయంద సంభవించును*

*నీయంద వసించియుండు నిఖిలజగములున్*

*నీయంద లయము బొందును*

*నీయుదరము సర్వభూత నిలయము రుద్రా."* [29]

రుద్రునిలోనే సృష్టి స్థితి లయాలు జరుగుతాయని, సృష్టి, స్థితి లయకారకుడు రుద్రుడేనని చెప్పటం విశేషం, అందులో భాగవతమందు (నారాయణ నామ సంకీర్తన నిలయమైన). దీనికి కారణం లేక పోలేదు.

భగవద్గీతలో జగద్గురు శ్రీకృష్ణ పరమాత్మ

*"రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్ష రక్షసామ్ ।*

*వసునాం పావకశ్చాస్మి మేరుశ్శిఖరిణామహమ్"* [30]

రుద్రులలో శంకరుడనని వెల్లడిచేసాడు. శివ కేశవులక భేదం క్షుణ్ణంగా తెలియచేసాడు. భగవదవతారాలెత్తి వారు చెప్పిన అక్షర సత్యాలను విస్మరించి శైవ, వైష్ణవ భేదంతో జీవించే వారి అజ్ఞానాన్ని ఆ పరమాత్మే త్రుంచివేయాలి. అన్యులకు సాధ్యం కాదు కదా!

*"అనంతమవ్యయం కవిగ్ం సముద్రే న్తంవిశ్వ శంభువమ్!*

*సో గ్రభుగ్వ్భజన్తిష్ఠన్నా హారమజర: కవి: ॥* [31]

అని మహానారాయణోపనిషత్తులో కవిశబ్దం పరమాత్మ వాచకంగా చెప్పబడింది. పోతనలో ఈ లక్షణం మమ్మూర్తుల మూర్తీభవించి గోచరిస్తుంది.

పోతన మహాకవి యోగివలె రాగద్వేష రహితుడై, జ్ఞానివలె విశ్వదర్శనం చేసి, భక్తుని వలె అనురాగ చిత్తుడై, విశ్వసించిన విషయాన్ని ప్రపత్తితో ఉపాసించి, మహర్షి వలె వేద మంత్రాల సాక్షాత్కారం పొంది, విశ్వ వ్యాప్తమైన పరమాత్మవలె, కవి తన కృతిలో అణువణువున లీనమై, దర్శనమై, సదా తాను పొందే నిత్య నిర్వికార మహదానందాన్ని, ముదంతో ఆంధ్రావళికి అందచేసిన మహనీయుడు.

## 1.4. భక్తి ప్రస్థానంలో భాగవతస్థానం

భారతీయుల కత్యంత పూజ్యం, ప్రియతమములైన రామాయణ భారత భాగవతాల్లో రామాయణం ఆదర్శ మానవ జీవితాన్ని ప్రదర్శింప, భారతం కర్మ వీరుల చరిత్ర చెప్పింది. ఇక భాగవతం మానవత్వం నుండి దివ్యత్వానికి పయనించే మహాభక్తుల భక్తి భావావేశ రసస్ఫురణాన్నందించి ప్రజాజీవనానికి అత్యంత సన్నిహితమైంది. మహనీయమైన వ్యాసవాణి ఆవిధంగా మానవ జీవిత తరుణోపాయాన్ని సూచించింది.

### 1.4.1. భక్తి నిర్వచనం

"పరానురక్తిరీశ్వరే" "సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా" అని పూర్వులు భక్తి కిచ్చిన నిర్వచనాలు. వీనిని బట్టి భక్తులకు భగవంతుని పట్ల నున్న ప్రేమానురాగాది భావాల అతిశయమే భక్తి అని తెలుస్తుంది.

మధుసూదన సరస్వతి భక్తి రసాయనమనే గ్రంథంలో భక్తి స్వరూప, స్వభావ, తత్త్వాలను చక్కగా వివరించాడు.

*"ద్రుతస్య భగవద్ధర్మాద్ధారా వాహికతాంగతా*
*సర్వేశే మనసో వృత్తిర్భక్తి రిత్యభిధీయతే."* [32]

అని అతడు భక్తికిచ్చిన నిర్వచనం, చిత్తద్రవ్యం స్వభావంచే లక్కవలె కఠినమైందని, నిప్పుసెగచే లక్కవలె తాపకాలకు కామక్రోధాది విషయాలతోడి యోగంచే నది ద్రవ్యమవుతుంది.

భగవంతుని గుణ రూపాది వర్ణనలను వినటం వల్ల కామక్రోధాదు లుద్దీపితాలై భక్తుల చిత్తాలకు ద్రవత్వమాపాదిత మౌతుంది. ఆ విధంగా ధారావాహికగా సర్వేశ్వరునిలో వర్తించు మనోవృత్తి భక్తి అని అభిప్రాయం, ద్రవత్వం పొందిన చిత్తంలో ప్రవేశించిన వస్త్వాకారం స్థిరంగా ఉంటుంది కాన స్థాయీభావమనే పేరబరుగుతుంది. ఇది విభవానుభావ వ్యభిచారి భావాలచే పరిపుష్టమై బ్రహ్మానందాత్మకమై, రసమై సహృదయులకు పారవశ్యం కలిగిస్తుంది.

భక్తి రసానికి భగవంతుడాలంబన విభావం తులసీచందనాదు లుద్దీపన విభావాలు, నేత్ర భ్రూ విక్షేపాదులను భావాలు. నిర్వేదాదులు వ్యభిచారీ భావాలు, ఈ విభావాను భావ సంచారీ

భావాలు ద్రుత చిత్తంలో ప్రవేశించి స్థాయిత్వం పొంది, భగవదాకారతా రూపమైన మానవ వృత్తిని పోషించి, పరమానంద సాక్షాత్కారాత్మకమైన భక్తి రసాన్ని ప్రతీయమాన మొనరిస్తుంది.

## 1.4.2. భక్తి శ్రేష్ఠత్వం

ప్రాచీనులు మానవులకు మోక్షప్రాప్తి సాధనాలుగా జ్ఞాన కర్మ భక్తి మార్గాలు నిర్దేశించారు. ఇందు జ్ఞాన మార్గం పరిణత చిత్తులైన మహాయోగులకి తప్ప సామాన్యులకి సాధ్యం కాదు. కర్మమార్గం కూడ జ్ఞానమార్గం వలె కొందరికి మాత్రమే సాధ్యమైనట్టిది. లింగ వర్ణాశ్రమ వయోభేదాలననుసరించి మానవులు నిర్వహింపవలసిన కర్మకలాపమెంతయో శ్రుతి స్మృతి పురాణాదులందు చెప్పబడి ఉంది. దాని నంతటిని యధావిధిగా ఆచరించటం దుష్కరమని చెప్పవచ్చు కాబట్టి పండితులనక, పామరులనక, స్త్రీలనక, పురుషులనక, వృద్ధులనక, బాలురనక అందరికి అందుబాటులో ఉండి అనుసరణ యోగ్యమైంది భక్తి మార్గమొక్కటే.

*"మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసి।*

*స్వస్వరూపాను సంధానం భక్తిరిత్యభిధీయతే॥"* 33

అని ఆదిశంకరులవారు భక్తి ప్రాశస్త్యాన్ని వెల్లడించారు.

## 1.4.3 భాగవతం - భక్తి

భాగవతం జ్ఞాన కర్మ మార్గాలను నిరసింపక పోయినా, భక్తి మార్గానికే ఎక్కువ ప్రాధాన్య మొసగింది. ఇందు వర్ణింపబడిన భక్తుల చరిత్రలన్నింట భక్తి ప్రాధాన్యం చక్కగా వెల్లడింపబడింది.

భాగవతారంభంలో నారదుడు వ్యాసునితో అతని మనస్సులో చింతకి కారణం చెపుతూ

*"అంచితమైన ధర్మచయమంతయు( జెప్పితివందులోననిం*

*చించుకగాని విష్ణుకథ లేర్పడ( జెప్పవు ధర్మముల్ ప్రపం*

*చించిన మెచ్చునే గుణ విశేషము లెన్నిన( గాక నీకు నీ*

*కొంచెము వచ్చుటెల్ల హరి( గోరి నుతింపమి నార్యపూజితా"* [34]

అని విష్ణుకథా గుణకథన ప్రభావం తెలియచేసాడు. ఆ విధంగానే తన పూర్వ జన్మ వృత్తాంతాన్ని తెలియ చేసిన తర్వాత

*చ. "యమనియమాది యోగముల నాత్మనియంత్రిత మయ్యు గామరో*

*షముల ( బ్రచోదితంబయగు శాంతి వహింపదు విష్ణు సేవచే*

*గ్రమమున శాంతి గైకొనిన కైవడినాదు శరీరజన్మక*

*ర్మముల రహస్యమెల్ల ముని మండన చెప్పితి నీవు గోరినన్."*[35]

విష్ణుసేవామహిమని వెల్లడిస్తాడు. పై రెండు సందర్భాలు భక్తిమహిమని చక్కగా తేటతెల్లం చేస్తున్నాయి.

ద్వితీయ స్కంధంలో శుకుడు పరీక్షిత్తునికి ముక్తి మార్గం తెలియచేస్తూ "సంసార ప్రవిష్టుండైన వానికి ' దపో యోగాదులైన మోక్షమార్గంబులు బెక్కుగలవు. అందు భక్తి మార్గంబుకంటె సులభంబు" లేదని "మున్ను బ్రహ్మ వేదములను ముమ్మాఱు ధర్మనయజ్ఞతో బరామర్శించి మోక్షము తక్కిన మార్గముల వెంటలేదని నిర్వికారుడైన జనార్దను భక్తితో జింత చేసెనని" స్పష్టం చేసాడు.

తృతీయ స్కంధంలో కపిలుడు దేవాహూతికి భక్తి యోగభేదాలు తెలిపి ఆత్యంతిక భక్తియోగ విధానాన్ని వివరించి

*చ. "అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనందనర్చునీ*

*శునను నవజ్ఞసేసి మనుజుండొగి మత్ప్రతిమార్చనా విడం*

*బనమున మూఢుడై యుచిత భక్తిని నన్ను భజింపదేని న*

*మ్మనుజుడు భస్మకుండమున మానక వేల్చిన యట్టివా ( డగున్"*[36]

బోధించాడు. ఈ విధంగా భాగవతంలో ఆయా సందర్భాలందు భక్తియోగ ప్రాధాన్యం వాచ్యంగనే బహువిధాల విస్తరింపబడింది.

*"తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా*

*ర్చనముల్ సేవయునాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం*

*బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స*

*జ్జనుండై యుండుట భద్రమంచు ( దలతున్ సత్యంబు దైత్యోత్తమా.!"*[37]

భగవంతునిపై ఉన్న భక్తి వివిధ భావాల్లో వ్యక్తం చేయబడింది. భక్తిలో శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య మాధుర్య భావాలు ముఖ్యం, వీనిలో ఏ భావంతో కూడిన భక్తి అయినా నిస్తారకమైందే. శాంతభక్తి,

తపో నిధులును, వీతరాగులునై ఉండే నారదాది మునీంద్రుల్లో గోచరిస్తుంది. కుబ్జ హనుమదాదులు దాస్య భక్తిచేత, సుగ్రీవార్జున కుచేలాదులు సఖ్యభక్తి చేత దేవకీ వసుదేవ యశోదా నందాదుల వాత్సల్య భక్తిచేత, గోపికాదులు మాధుర్య భక్తిచేత తరించి ఉన్నారు. శరణాగతి రూపమైన భక్తికి, నిలయమై ప్రహ్లాద ధ్రువ గజేంద్రాదులు ఉత్తమగతి ప్రాప్తింప చేసికొన్నారు. ఇంతే కాక శత్రుభావంతో భగవంతునితో సంబంధం కల్పించుకొని తన్నిహతులై (భగవంతునిచే సంహరించబడి) సద్గతి పొందిన వారున్నారు.

*శా. "కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా*
*సామగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్*
*ప్రేమన్ మీరలు భక్తినేమునిదె చక్రింగంటి మెట్టైన ను*
*ద్దామ ధ్యాన గరిష్ఠుడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా"*[38]

మొదలైన పద్యాలిందుకు తార్కాణాలు. భాగవతంలో వివిధ భావాలతో కూడిన భక్తిలెస్సగా వివరింపబడింది. ఇందలి భక్తుల కథలన్నీ పైన సూచింపబడ్డ భావాల్లో ఏదో ఒక దానిని. విస్పష్టం చేస్తున్నాయి.

భాగవతంలో దశమస్కంధమొక ఎత్తు. మిగిలిన స్కంధాలన్నీ ఒక ఎత్తు. దీనికిట్టి ప్రత్యేక విశిష్టతను కలిగించింది. మధురభక్తి, గోపికలిందు భగవంతుడైన కృష్ణుని ఆత్మేశ్వరునిగా భావించి అనిర్వాచ్యమైన నిర్మలభక్తిని ప్రకటించారు.

### 1.4.4 భక్తి ప్రస్థానంలో భాగవతం అజరామరం

నిగమ కల్పతరు గళితమైన ఫలం భాగవతం. వైకుంఠగతమైన దాన్ని నారదుడు తెలిసికొని వ్యాసునికి వినిపించాడు. వ్యాసుడు దాన్ని శుకముఖ నిహితమొనర్చాడు, అమృతద్రవ సమ్మితమై అది శుక ముఖం నుండి భూమిపై రాలింది. తద్రసమాను వారికి పరమానందానుభవం తథ్యం. అట్టి భాగవత మహిమ చెప్పవలవికాదు.

భాగవత మహాత్మ్యం పద్మపురాణోత్తర ఖండమందు తొలి ఆరు అధ్యాయాల్లో చక్కగా వివరింపబడింది. భాగవతం మోక్షశాస్త్రం. అది భగవద్రూపమైంది. కలియుగంలో భాగవత పఠనం

వల్ల, శ్రవణం వల్ల ముక్తి చేకూరుతుందని చెపుతారు. శుక మహర్షి పరీక్షిన్మహారాజుకు భాగవత కథని వినిపించటానికి ఆరంభించగా సురలు అమృతభాండంతో వచ్చి భాగవత కథామృతాన్ని తమకిచ్చి. తాము తెచ్చిన అమృత భాండమందలి అమృతాన్ని పరీక్షిత్తుకిమ్మని శుకుని ప్రార్థించారట. శుకుడు సురలుత్తమ భక్తులు కారని తలచి వారికి భాగవత కథాసుధ నివ్వటానికి అంగీకరించ లేదు.

ఈ సందర్భాన్ని బట్టి భాగవతం భక్తజనైక లభ్యమని, అమృతాధిక ఫలప్రదమని తెలుస్తుంది. భాగవత కథామృతాన్ని ఆస్వాదించి పరీక్షిన్మహారాజు మోక్ష సామ్రాజ్యం పొందటం తెలిసి బ్రహ్మ ఆశ్చర్యంతో భాగవత సారాన్ని అన్య సాధనలతో తూచటానికది అన్నింటికంటే గురుతరమై భాసిల్లింది. అది చూచి బ్రహ్మ సభాగతులైన ఋషులెల్లరు భాగవత మాహాత్మ్యాన్ని తెలిసికొనిరట. పూర్వం సనకాదులు భాగవత మాహాత్మ్యం నారదునికి తెలియచేసి, అతడు అడగటం వల్ల శ్రీమద్భాగవతాన్ని ఉపదేశించారు. భాగవతాన్ని ఏడు రోజులు భక్తితో విన్న మోక్షం కరతలామలక మవుతుంది. వేదాంత శ్రవణ గీతా పారాయణలచే కూడ లభింపని భక్తి జ్ఞాన వైరాగ్యాలు భాగవత శ్రవణంచే తప్పక లభించి, ముక్తి మార్గం చూపుతాయి. అందు చేతనే

*క. "నిగమములు వేయు ( జదివిన*

*సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్*

*సుగమంబు, భాగవతమను,*

*నిగమంబు ( బఠింపముక్తి నివసనము బుధా!"* [39]

అని చెప్పబడింది.

భారతీయ ధార్మిక జీవనానికి ప్రతిబింబాలుగా త్రిసంధ్యల్లో, త్రికాలాల్లో త్రినేత్రునివలె భాసించే ఆధ్యాత్మిక గ్రంధ రాజాలు రామాయణ భారత భాగవతాలు.

ఈ మూడు గ్రంధ రాజాలు యుగ యుగాలుగా రాజ్యమేలిన రాజ భాష గీర్వాణ వాణికి అనుసరణీయాలు, అనువాదాలు.

అమర భాషకి ఆదికావ్యంగా శ్రీమద్రామాయణం త్రేతాయుగంలో వెలువడి, ఆదికవిగా, కవి కోకిలగా వాల్మీకిని నాటి నుండి (త్రేతాయుగం నుండి కలియుగం) నేటి వరకు అగ్రస్థానంలో నిలిపింది.

సమస్తంగా ఉన్న వేదాన్ని వ్యస్తంచేసి చతుర్విధాలుగా విభజించి పారాశర్యుడు వేదవ్యాసుడై లక్ష శ్లోకాత్మకమైన మహాభారతాన్ని పంచమవేదంగా అమరవాణిలో విరచించి, ధర్మాలను చెప్పినా, మనశ్శాంతి లేక భాగవత పురాణాన్ని రచించి హరినామ సంకీర్తనతో ఆత్మ సంతృప్తి పొందాడు. సాక్షాత్తు నారాయణాంశ సంభూతుడైన వ్యాస మహర్షి విరచిత భాగవతం కంటే ఆంధ్ర మహా భాగవతం విశిష్ఠఖ్యాతి గాంచింది. సర్వజన సుభోధమై ఆంధ్రుల పూజామందిర నిలయమైంది. పోతన మహాకవి పుణ్య పరీపాక విశేషరచనమీ గ్రంధరాజం. భక్త కవి పోతనయే భాగవతాను వాదాన్ని తన పురాకృత సుకృతంగా భావించాడు.

ఇంతే కాక భాగవత రచనారంభంలోనే

*శా. "శ్రీ కైవల్య పదంబు ( జేరుటకునై చింతించెదన్ లోకర*
*క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో*
*ద్రేక స్తంభకు ( గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా*
*నా కంజాత భవాండ కుంభకు మహానందాంగనా డింభకున్"* [40]

అనే మంగళాది పద్యంలో ముక్తిని గూర్చి భాగవత రచన చేస్తున్నట్లు స్పష్టంగా వెల్లడించాడు. ఈ సందర్భంలో డా॥దాశరథి పోతన భాగవతాన్ని గూర్చి పలికిన పలుకులు స్మరణీయాలు.

"నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని జన్మ భూమి ప్రాశస్త్యాన్ని చాటుకున్న ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి (క్రీ.శ.1982) కళాప్రపూర్ణ డా॥ దాశరధి రంగాచార్య "పోతన భాగవత పంచశతి నీరాజనానికి 'భాగవత గీత' ఆలపించాడు. ఆ భాగవత గీత ఏడు పద్యాలు. ఆ ఏడు పద్యాలు ఊర్ధ్వ లోకాదియైన భూలోకంలో ప్రజల భక్తిభావాన్ని ఇనుమడింపచేసాయి. అంతేకాక ఆపై లోకాల వారు ఆభాగ్యం మనకు లేదు కదా! అని చింతించే విధంగా కవిరత్నం మరియు భక్త రత్నమైన పోతన జన్మసాఫల్యాన్ని, పోతన కృతి వల్ల తెలుగు వారి మహద్భాగ్యాన్ని, తెలుగు భాష అమృతత్వాన్ని అక్షర రూపంలో, అఖిలార్ధం స్ఫురించే విధంగా రచించాడు.

ఆ ఏడు పద్యాలు

1. "అమృత మహాంబురాశి, తెలుగై, మరి భాగవతమ్మునై త్రిలిం
గమునకు డిగ్గెనేమొ యనగా, హృదయమ్ముల నాడు నేడునా
ట్యము లొనరించు పోతన మహాకవి ముద్దుల పద్దెముల్ శతా
బ్దములయి పోవుగాక మఱవన్ తరమే రసిక ప్రజాళికిన్."

2. "వేయి స్తంభాల గుడిలోన వెలసిన ప్రతి
కంబమున్ కబ్బమైనదో! ఖంగుమనుచు
భాగవత పద్యములు పాడు ప్రతిదినమ్ము
బమ్మెరను తెమ్మెరలు భాగవతము పలుకు"

3. "బమ్మెర దాటి ఓరుగలు పట్టణమున్ దరిసించు వేళ జుం
జుమ్మని మ్రోగ భాగవత సుందర పల్లకి వీనులారగా
కమ్మని కావ్యనాదము జగమ్ముల నూయెల లూపు, కోటి రా
గమ్ములు నిద్రలేచును సుఖంకర మోహన భక్తిగాథలన్"

4. "పూతన చన్నుబాల విషమున్ తెగ పీలిచి క్రూర రాక్షసిన్
చేతనతా విహీననుగ చేసిన వ్రేతల చిన్నవాని మేల్
చేతలు హృద్య పద్యముల చెప్పగ జాలిన శక్తి, ఒక్క మా
పోతన గారికే కలిగె పో. తన భక్తికి రక్తితోడుగా."

5. "భక్తి రసాతిరేకమున భాగవతమ్ము రచించినాడు, తా
ముక్తిని గాంచినాడు! తన ముద్దుల పద్దెము విన్నవారికిన్
ముక్తిని కూర్చి నాడమృతమూర్తి। దిగంత విశాలకీర్తి, సద్
భక్త జనావళీ పరమ భాగవతోత్తమ చక్రవర్తియై."

6. "అందరివాడు పోతన మహాకవి ఏయొక మండలానకో
చెందనివాడు, రాజ కులశేఖరు లీయగా జూపు 'రాశి' కే
నందనివాడు, రాజనగ నా రఘు రాముడే యంచు నమ్మిమా
రందఝరీ తరంగ మధురమ్మగు కబ్బము నంకితమ్మిడెన్."

7. "భాగవతము చదువు భాగ్యమ్మె భాగ్యమ్ము
పోతన కవిగన్న ముక్తి ముక్తి

హృద్య పోతనార్య పద్యంబె పద్యంబు
తేనె లూరునట్టి తెనుగె తెనుగు".

విన్న అమరులైన ఆంధ్రమహాభాగవతం రచించిన భక్తకవి పోతన వైకుంఠధామం, బ్రహ్మలోకం, ఆది పరాశక్తి నివాసమైన మణి ద్వీపంలో ఉన్నాడా? అని అన్వేషించి, దర్శించి, వారి వారి లోకాలకు తీసుకెళ్ళి మన తెలుగుల పుణ్యపేటిని విశేషంగా సన్మానించి ఉంటారు. ఈ ఏడు పద్యాలు చదివిన అనంతరం భాగవత పఠనం సంపూర్ణం చేయని తెలుగు వారుండరు. పోతన కీర్తికాయం ధరించి ఐదు శతాబ్దాలయిన, భాగవత గ్రంథ గొప్పదనాన్ని మరల ఒక్కమారు స్మరణకు తెచ్చి భక్తి రస ఊయలలో ఊపుట దాశరథిగారి ఆధ్యాత్మిక పారవశ్యానికి గీటు రాయి. ముక్తి మార్గాల్లో మానవులకు భక్తి మార్గమే సులభతరుణోపాయమని తన భాగవత గ్రంథం ద్వారా తెలియ చేసిందొకరు. ఆ గ్రంథ ప్రాశస్త్యాన్ని గుర్తించి భాగవత గీత నాలపించి తన నామాన్ని సార్థకం చేసికొన్న కళా ప్రపూర్ణ మరొకరు. వీరిరువురు ఏకప్రాంత వాసులే.

భాగవతం తెనిగించమని భవబంధాలు నశిస్తాయని చెప్పి. అంకితం గైకొంది దాశరథి కదా! ఆ తారక మంత్ర దాశరథియే ఈ కళా ప్రపూర్ణ దాశరథిని ఆవహించి పలికిన పద్య రత్నాలు ఇవి.

భక్తులకే భాగవతాన్ని వినిపించాలని దేవతలు అసలైన అమృతం ఇస్తామన్నా కూడ శుకమహర్షి విన్పింపలేదు. బ్రహ్మ జ్ఞానియైన శుకుడు భాగవతుడైన పరీక్షిత్తుకే భాగవతగాధని విన్పించాడు.

చతుర్విధ పురుషార్ధ సాధకమై ముక్తినిచ్చే ఈ భాగవత గ్రంథంపై 'పోతనభాగవత పంచశతి నీరాజనము' అనే ప్రత్యేక పుస్తకం 41 వ్యాసాలు. పండిత కవులచే వివిధ అంశాలపై వివిధ కోణాల్లో రచింపబడి తిరుమల దేవస్థానంచే ప్రచురింపబడింది. ఐదు శతాబ్దాల అనంతరం కూడా త్రిలింగ దేశం నలుమూలల పోతన భాగవతం పై గల భక్తి అమేయం, అపారం, ఆకారణం వల్లనే డా॥ దాశరథి.

*"అమృత మహాంబురాశి తెలుగై మరి భాగవతమ్మునై"*

అని పేర్కొన్నాడు. ఈ భాగవత రసామృతం ఆస్వాదించిన భక్తునకే ముక్తి సాధ్యం. అందు వల్లనే భక్తి ప్రస్థానంలో భాగవతానికి అగ్రతాంబూలం లభించింది. అగ్రేసరమైందీ భాగవతం.

*"దుర్లభైవ కథాలోకే శ్రీమద్భాగవతోద్భవా*

*కోటి జన్మ సముత్థేన పుణ్యనైవ తులభ్యతే"*

కోట్ల కొలది జన్మల పుణ్యం చేత భాగవత కథ లభిస్తుంది.

*"నగజ్ఞానగయా కాశీ పుష్కరం నప్రయాగకమ్*

*శుకశాస్త్రకథా యాశ్చఫలేన సమయాం నయేత్"*

ఏ తీర్థ రాజాలు దర్శించకుండానే శుకమహర్షి కథనం చేసిన భాగవతం వల్ల కలిగే ఫలం ఏ తీర్థ క్షేత్రాలు దర్శించినా కలుగదని పై శ్లోకం తేట తెల్లం చేస్తుంది.

## పాద సూచికలు

1. విష్ణు. పురా. అ. 6, శ్లో.576
2. (విష్ణు పురాణం) విష్ణు. పురా.
3. ఆర్యోక్తి
4. (మత్స్య పురాణం) మత్స్య. పురా.
5. కౌశిక సంహిత, అ.1,17, శ్లో.18
6. పద్మ. పురా.
7. పద్మ. పురా.
8. విష్ణు. స. నా. శ్లో. 4
9. సం. భాగ. అ.1, స.4, శ్లో.20
10. సం. భాగ. అ.1, స.4, శ్లో.21,22
11. సం. భాగ. అ.1, స.4, శ్లో.31
12. సం. భాగ. అ.1, స.4, శ్లో.32
13. ఆం. భాగ. అ.1, స.1, శ్లో.3
14. స్తోత్రం
15. ఆం. భాగ. ప్ర. స్కం. ప.22
16. ఆం. భాగ. ప్ర. స్కం. ప.23
17. ఆం. భాగ. ప్ర. స్కం. ప.24
18. ఆం. భాగ. ప్ర. స్కం. ప.27
19. వీర. విజ. ప్ర. ఆ. ప,
20. వీర. విజ. ప్ర. ఆ. ప,
21. ఆం. భాగ. ప్ర. స్కం. ప.21
22. ఆం. భా. ఉ. కాకతీయ. సం. దాశరధి
23. భోగీ నీ. దం
24. ఆం. భాగ. ప్ర. స్కం. ప.21
25. లక్ష. సార. సం. కూచి. తిమ్మ
26. ఆం. భాగ. ప్ర. స్కం. ప.16
27. ఆం. భాగ. ప్ర. స్కం. ప.14
28. ఆం. భాగ. ప్ర. స్కం. ప.296
29. ఆం. భాగ. ప్ర. స్కం. ప.223

30. భగవద్గీత వి.యో.శ్లో.23

31. మంత్రపుష్పం

32. భక్తి. రసా. మధు. సర

33. శ్రీవివే. చూ. ఆదిశం. శ్లో.32

34. ఆం. భాగ. ప్ర. స్కం. ప.132

35. ఆం. భాగ. ప్ర. స్కం. ప.132

36. ఆం. భాగ. ప్ర. స్కం. ప.964

37. ఆం. భాగ. స. స్కం. ప.167

38. ఆం. భాగ. ప్ర. స్కం. ప.18

39. ఆం. భాగ. ప్ర. స్కం. ప.140

40. ఆం. భాగ. ప్ర. స్కం. ప.1

41. భాగ. గీత. దాశ. 1 నుండి 7ప.

# భాగవతం - స్త్రీపాత్ర పరికల్పన

ఈ అధ్యాయం రెండు ఉప విభాగాలు. ఏ స్కంధమునకాస్కంధ ఇతి వృత్తంలో ప్రధాన కథ కుపకరించే పాత్రలు ప్రధాన పాత్రలని, మిగిలిన పాత్రలను అప్రధాన పాత్రలుగా పరిగణించటం జరింగింది. ఈ రెండు విధాలైన పాత్రల్లోను స్త్రీలు 1.దేవజాతి 2.బ్రాహ్మణజాతి 3.క్షత్రియజాతి 4.అన్య స్త్రీలు ఉన్నారు. ప్రధాన పాత్రల్లో వైశ్య జాతి భేదం కూడ ఉంది.

## 1. దేవజాతి

*"స్వరవ్యయం స్వర్గనాక త్రిదివ త్రిదశాలయా: ।*

*సురలోకోద్యో దివౌ (ద్వే స్త్రియాం క్లీబే) త్రివిష్టమ్॥"*

- అమ. కో. కాం. 1, శ్లో.6

స్వ: ॥ అవ్య॥ స్వర్గ: నాక: త్రిదివ: త్రిదశాలయ: సురలోక: (దౌ: ద్యావౌ: ద్యావ:) త్రివిష్టపమ్ అని స్వర్గం పేర్లుగా అమరకోశం పేర్కొంది. స్వర్గంలో నివసించే వారికి సురలని పేరు. సురలంటే దేవతలు. ఆ జాతికి సంబంధించిన అందరిని కలిపి దేవజాతి అంటారు.

## 2. బ్రాహ్మణజాతి

బ్రహ్మముఖం నుండి జనించిన వారు బ్రాహ్మణులుగా చెప్పబడుతున్నారు. వారికి జన్మించిన, వారిని వివాహం చేసికొన్న స్త్రీలు బ్రాహ్మణ జాతిగా పేర్కొనబడుచున్నారు.

## 3. క్షత్రియజాతి

బ్రహ్మ బాహువుల నుండి జనించిన వారు తమబాహుబలంతో భూమిని పాలించారు. "క్షతాత్ త్రాయత ఇతి క్షత్రియ:" గాయపడిన వారిని రక్షించేవాడు క్షత్రియుడిగా పిలువబడ్డాడు. అస్త్ర శస్త్రాలతో అన్యులను జయించి రాజ్యాలను పాలించే వారిని రాజులుగా పరిగణించ బడ్డారు. వారు ఏ వంశం వారయితే ఆ వంశనామంతో పిలువబడ్డారు. మనువు మూల పురుషుడయితే మను వంశమని, ప్రజాపతి మూల పురుషుడయితే ప్రజాపతి వంశమని, యదువు మూల పురుషుడయితే కల్గిన రాజులను యాదవ వంశమని, జాతి భేదాలతో ఆయా జాతుల రాజులను ఆ పేరుతో వానర, భల్లూక, సర్ప నామాలతో వివిధంగా పిలువబడ్డాయి.

### 4. రాక్షస జాతి

*"అసురా దైత్య దైతేయ దనుజేన్ద్రారి దానవా: ।*

*శుక్రశిష్యాదితి సుతా: పూర్వ దేవాస్సుర ద్విష: ॥*

**- అమ. కో. కాం. శ్లో.12**

అసురా: దైత్యా:, దైతేయా:, దనుజా:, ఇన్ద్రారయ:, దానవా: శుక్రశిష్యా: దితిసుతా: పూర్వదేవా:, సురద్విష: అని అసురుల పేర్లు అని అమరకోశం పేర్కొంది.

అసురులంటే సురులు కాని వారు, అంటే దేవతలు కాని పుత్రులను దనుజులని, దానవులని, ఇంద్రునికి శత్రువులు కాబట్టి ఇన్ద్రారయ: అని శుక్రాచార్యుడు గురువుగా కలిగిన వారు కాబట్టి శుక్ర శిష్యులని, దేవతలకు పూర్వులుగా చెప్పబడే వారని, దేవతలను ద్వేషించేవారిని, అసురులన్నారు.

### 5. ఇతర స్త్రీలు

సురాసురులు, బ్రాహ్మణ, క్షత్రియ జాతులు కానివారు, రాజ్యం లేనివారు ఇతర స్త్రీలుగా పరిగణించ బడ్డారు. రాజ్యమున్న వానరజాతి వారైనా, భల్లూక జాతి వారైనా, ఆ జాతి వారిలో వారు రాజైనపుడు వానర రాజు, భల్లూకరాజు అనే పేరుతో పిలువబడ్డారు.

## 2.1 ప్రధాన పాత్రలు

### 2.1.1 దేవజాతి స్త్రీలు

# 1. సరస్వతీ దేవి

రాజుల స్తోత్రాలతో, రాజభోగాలకై అర్రులు చాచి కవులు కావ్య కన్యకలను అమ్ముకొనే రోజులవి. రాజుల గూర్చియో, పట్టపు రాణుల గూర్చియో కాక, రాజు గారి వేశ్యను వర్ణించి, కవులు కానుకలందు కొన్న కాలమది. ఆ కాలంలో 'నలుగురితో నారాయణ' అన్న సామెతగా పోతన (యౌవన దశలో) రావు సింగ మహీపాలుని వేశ్య 'భోగిని' గూర్చి భోగినీ దండకం రచించి, రావు సింగమహీపాలునికి అంకితమిచ్చాడు.

అనంతరం షోడశ గుణోపేతుడైన శ్రీరాముడు సీతా సమేతుడై భాగవతం తెనిగించమని, శివ భక్తుడైన పోతనని కోరాడు. పోతన అక్షర జపమాచరించాడు. ఆ అక్షరాలకు అధిష్ఠానదేవత సరస్వతీ దేవి. పోతన వాగ్దేవి వరప్రసాదుడు, అందు వల్లనే సహజ పండితుడు. 'పండా అస్య సంజాతా ఇతిపండిత:" 'పండానామజ్ఞానం' అని వ్యుత్పత్త్యర్థం. సామాజిక పరిస్థితుల దృష్ట్యా పోతన భోగినీదండక రచన జరిగింది.

మరల ఆ తప్పు సహజ పండితుడైన పోతన వల్ల జరగకుండా చూడటానికి, ఆవాగ్దేవి కన్నీరుతో పోతనకు సాక్షాత్కరించింది. తల్లి మనస్సు అర్థం చేసికొన్న పోతన వాగ్దేవికి ఒట్టు పెట్టాడు.

*ఉ. "కాటుక కంటినీరు చనుకట్టు ( బయింబడ నేలయేడ్చెదో*
*గాటభద్రైత్య మర్దనుని గాదిలి కోడల, యో మదంబయో*
*హాటక గర్భురాణి నిను నాకటికిం గొని పోయి యల్ల గ*
*ర్ణాట కిరాట కీచకుల కమ్మ ( దిశుద్ధిగ నమ్ము భారతీ".*[1]

భాగవత రచనారంభంలో నిఖిల ప్రధాన దేవతా వందనంలో వాగ్దేవికి సాష్టాంగ ప్రణామ మాచరించి ఆమె స్వరూపాన్ని స్తుతించాడు.

*ఉ. "క్షోణి తలంబునన్ నుదురు సోక ( గ మ్రొక్కనుతింతు సైకత*

*శ్రోణికి, జంచరీక చయ సుందర వేణికి రక్షితామర*

*శ్రేణికి ( దోయజాతభవ చిత్తవశీకరణైక వాణికిన్*

*వాణికి నక్షదామ శుక వారిజ పుస్తక రమ్య పాణికిన్"*[2]

సరస్వతీ చతుర్భుజ. చతుర్ముఖ బ్రహ్మసృష్టి. ఆ బ్రహ్మకే ఇల్లాలు, ఒక చేతిలో అక్షరమాల, మరొక చేతిలో రాచిలుక, ఇంకొక చేతిలో తామర పువ్వు, వేరొక చేతిలో పుస్తకాన్ని ముచ్చటగా ధరించి సుధలు వర్షించే తన సుందర సుకుమార సూక్తులతో అరవింద భవుని అంతరంగాన్ని ఆకర్షిస్తుందో, తన కటాక్ష వీక్షణాలతో సురనికరాన్ని కనికరిస్తుందో అని, శ్రీ విద్యాలహరి సరస్వతీ స్వరూపాన్ని భావించి, ఆమె కరుణా కటాక్షాలకై ఎదురు చూస్తున్న భక్త పోతన సాక్షాత్కరిస్తున్నాడు. పై పద్యం చిత్రపట సందర్శనమే. అంతేకాక

*శా. "పుట్టం బుట్ట శిరంబునన్ మొలువ నంభోయాన పాత్రంబునన్*

*నెట్టంగల్గను, గాళి గొల్వను, బురాణింపన్ దొరం కొంటిమీ*

*దెట్టేవెంట ( జరింతు ( దత్సరణి నాకీవమ్మ! యోయమ్మ మేల్*

*పట్టున్ నాకగుమమ్మ ! నమ్మితి ( జుమీ బ్రాహ్మీ ! దయాంభో నిధీ!"* [3]

అమ్మా ! సరస్వతీ ! నేను శిరస్సుపై పుట్ట పెరిగిన ఆదికవి వాల్మీకిగా పుట్టలేదు. పడవలో ప్రభవించిన వ్యాసుడను కాను. కాళికాదేవిని కొలిచికవిత్వ విద్యను పొందిన కవికుల తిలకుడైన కాళిదాసును కాను, అయినా తగుదునమ్మా ! అని పురాణాన్ని తెనిగించటానికి పూనుకున్నాను. ఇక ముందు ఏం చేయాలో, ఏమీ తోచటం లేదు. ఇటువంటి సమయంలో ఎటువంటి మార్గం అవసరమో, ఆ మార్గం నాకు నీవే అనుగ్రహించి, నా చెయ్యి పట్టుకొని నడిపించు. ముమ్మాటికి నిన్నే నమ్ముకున్నాను. తల్లీ ! నీవే నాకు ఆధారం. తల్లీ ! పరబ్రహ్మ స్వరూపిణివి. అయిన నీ కరుణ అపార పారావారమని, అనన్య శరణాగతి చేసాడు భక్తపోతన.

*"సరస్వతి అంటే నిరంతర ప్రవాహం కలదని అర్థం.*

*సరస్ శబ్దానికి ప్రవాహమని అర్థం. సరస్ కలది సరస్వతి."* [4]

సమాజహితకర (విశ్వజనీన) ఆలోచనలు ఎవరినోట నుండి వాక్ప్రవాహంలో వెలువడి కలం నుండి జాలువారి అక్షర రూపంలో సంతరించుకోవాలంటే వాగ్దేవి పుత్రులై సంపూర్ణ అనుగ్రహ పాత్రులు

కావాలి. ఆ సరస్వతీదేవి అనుగ్రహరూపమే అక్షరం. ఆ అక్షరమే ఈ జగత్తులో క్షరం కానిది. శాశ్వతమైంది. ఆ శాశ్వతత్వమే సత్యం. ఆ సత్యమందే సర్వం నిలిచిఉందని అభిజ్ఞులు పలుకుతున్నారు.

*"సత్యే సర్వం ప్రతిష్ఠితమ్"* [5]

"సత్యమేవ జయతే." ఉపనిషద్వాక్యం. అష్టమాతృకలను చెప్పేటపుడు కూడా 'బ్రాహ్మీ' అని సరస్వతీ మాతను, బ్రహ్మదేవుని ఇల్లాలిని ముందు చెప్పటం చూస్తున్నాం.

శ్రీ చక్ర వర్ణనలో రెండవ రేఖలో

*"బ్రాహ్మీ మాహేశ్వరీ కౌమారీ వైష్ణవీ వారాహీ !*
*మాహేంద్రీ చాముండా శ్రీమహాలక్ష్మీ : పాండు ద్వితీయ భూగ్రహ."* [6]

ఈ విధంగా భక్తకవి పోతన ముగ్గురమ్మల్లో ముందుగా వాగ్దేవికి సాష్టాంగ దండ ప్రణామమాచరించాడు. వ్రాత పతుల్లో లేని అచ్చు ప్రతుల్లో ఉన్న రెండు పద్యాలు పోతన చేసిన సరస్వతీ స్తుతిగా కవ్పిస్తున్నాయి.

*ఉ. "శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా*
*హార తుషార ఫేన రజతా చలకాశ ఫణీశ కుంద మం*
*దార సుధాప యోధి సిత తామర సామర వాహినీ శుభా*
*కారత నొప్పు నిన్ను మది। గాన। గ నెన్నడు గల్గు భారతీ."* [7]

తల్లీ! భారతీ! తెల్లనికాంతులు వెల్లివిరిసే శరన్మేఘ కదంబం, శరత్కాల చంద్రబింబం, పచ్చ కర్పూరం. చందనం, రాజహంసలు, జాజిచెండ్లు, తెల్లని పొడిమంచు, నీటిపై తేలిన నురుగు, వెండికొండ, తెల్లపూలూ, ఆదిశేషుడూ, మల్లెలు, మందారాలు, పాలసముద్రం, పూచిన తెల్ల తామర పుష్పాలు, ఆకాశగంగ ఇవన్నీ నీశుభాకారానికి ఉజ్జ్వలమైన ఉపమానాలు, అలాంటి స్వేచ్ఛ ధవళ సుందర మూర్తివైన నిన్ను కన్నులారా, మనస్సు తీరా ఎప్పుడు దర్శించగల్గుతానో కదా! అని ఆర్తితో సంభావించాడు.

*ఉ. "అంబనవాంబుజోజ్జ్వల కరాంబుజ, శారదచంద్రచంద్రికా*
*డంబర చారుమూర్తి, ప్రకటస్ఫుట భూషణ రత్నదీపికా*
*చుంచిత దిగ్విభాగ శ్రుతిసూక్తి వివిక్త నిజ ప్రభావ, భా*
*వాంబర వీధి విశ్రుత విహారిణి, నన్గృప ( జూడు భారతీ!"* [8]

అమ్మా ! భారతీదేవి ! వికాసానికి, ప్రకాశానికి ప్రతీకగా, విచ్చుతూ, విచ్చుతూ ఉన్న కమలాన్ని కమలం వంటి చేతిలో ధరించిన దానవై, శరత్కాలంలో చంద్రుని వెన్నెలకి అనురూపంతో అలకరించుకొన్న ఆభరణాల మణి దీప్తులు స్పష్టంగా దిగ్దిగంతాలను ప్రకాశింప చేస్తుండగా వేద సూక్తులు నీ ప్రభావాన్ని వెల్లడిస్తుండగా, భక్త కవులు భావాంబర వీధుల్లో స్వేచ్ఛగా విహరించే దానవైన నీవు నీ దయాదృష్టిని నాపై వ్యాపింపచేసి నన్ను కృతార్థుణ్ణి కావించు.

భక్తకవుల భావాంబర వీధుల్లో స్వేచ్ఛగా విహరింపచేసే సరస్వతీదేవి దయాదృష్టి సంపూర్ణంగా తనపై వ్యాపింపచేసి కృతార్థుని చేయమని అర్థించాడు.

భక్తకవి పోతన ప్రార్థన మన్నించిన ఆ పరబ్రహ్మ స్వరూపిణి సంపూర్ణానుగ్రహమే అమృత మహాంబునిధియై, త్రిలింగానికి దిగి, తెలుగు ప్రజల భక్తికి బాసటగా, ముక్తికి మూలంగా పోతనని జన్మ చరితార్థుణ్ణి కావించింది.

పోతన ప్రార్థనా పద్యాల్లో సరస్వతీ దేవికి

1. భారతీ *"అతతసేవ ' జేసెద ... ... ...*

*... ... ... భారతీ హృదయ సౌఖ్య విధాతకు ..."* [9]

అని

2. వాణి *"క్షోణి తలంబు ... ... ...*

*... ... ... ... ... ... ... ... ...*

*... ... ... వాణికిన్"* [10]

అని

3. కాళి *"పుట్టంబుట్టి ... ... ... గాళి గొల్వను ... ..."* [11]

4. బ్రాహ్మీ

5. శారద *"శారద నీరదేందు ... ... ..."* [12]

పంచనామాలతో ప్రస్తుతించి ప్రత్యక్షం చేసికొన్న పరిపూర్ణ వ్యక్తిత్వం పోతన మహాకవిది. శంకర భగవత్పాదులవారి స్తోత్రంగా చెప్పబడే కాశ్మీర సరస్వతీ దేవి (అష్టాదశ శక్తి పీఠం) స్తుతి

*"ఓం నమస్తే శారదే కాశ్మీర పురవాసిని*

*త్వామహం ప్రార్థయే నిత్యం విద్యాదానం చదేహిమే"*

*యాశ్రద్ధా ధారణా మేధా వాగ్దేవీ విధి వల్లభా*

*భక్త జిహ్వాగ్ర సదనా శమాది గుణదాయినీ*

*నమామి యామినీం నాథ లేఖాలంకృత కున్తలామ్*

*భవానీం భవసన్తాప నిర్వాపణ సుధానదీమ్*

*భద్రకాళ్యై నమోనిత్యం సరస్వత్యై నమోనమ:*

*వేదవేదాఙ్గ వేదాన్త విద్యాస్థానేభ్య ఏవచ*

*బ్రహ్మ స్వరూపా పరమా జ్యోతిరూపా సనాతనీ*

*సర్వ విద్యాధి దేవీ యాతస్యై వాణ్యై నమోనమ:*

*యయావినాజగత్సర్వం శశ్వజ్జీవన్మృతం భవేత్*

*జ్ఞానాధి దేవీ యాతస్యై సరస్వత్యై నమోనమ:*

*యయా వినా జగత్సర్వం మూకనున్మత్త వత్సదా*

*యాదేవీ వాగధిష్ఠాత్రీ తస్యై వాణ్యై నమో నమ: ॥*

ఆరు నామాలు చెప్పబడ్డాయి.

సరస్వతీ ద్వాదశ నామాలుగా లోకాన ప్రచారం పొందిన స్తుతి ఒకటి కన్పిస్తుంది.

*"సరస్వతీ త్వియం దృష్టా వీణా పుస్తక ధారిణీ*

*హంసవాహ సమాయుక్తా విద్యాదాన కరీమమ"*

ప్రథమం భారతీనామ ద్వితీయంచ సరస్వతీ

తృతీయం శారదాదేవి చతుర్థం హంసవాహినీ

పంచమం జగతీఖ్యాత షష్టం వాగీశ్వరీ తథా

కౌమారీ సప్తమం ప్రోక్తా అష్టమం బ్రహ్మచారిణీ

నవమం బుద్ధి దాత్రీచ దశమం వరదాయినీ

ఏకాదశే క్షుద్రఘంటా ద్వాదశం భువనేశ్వరీ

య: పఠేన్నర: సర్వసిద్ధికరీ తస్య ప్రసన్నా పరమేశ్వరీ

సామే వసతు జిహ్వాగ్రే బ్రహ్మరూపా సరస్వతీ

ఇతి శ్రీ సరస్వతీ ద్వాదశ నామాని సంపూర్ణాని.

"సృష్టికర్త్రీ బ్రహ్మరూపా" యై కావ్య సృష్టిలో బుద్ధి దాత్రియై, బ్రాహ్మీరూపమై పోతన మహాకవిపై దయా దృష్టి ప్రసరింప చేసింది. ఆ భారతీదేవి దయాదృక్ప్రసారమే ఆంధ్ర మహా భాగవత అఖండ జ్యోతి.

*శా. "తల్లీ ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నా*
*యుల్లం బందున నిల్చి జృంభణముగా సూక్తుల్ సుశబ్దంబుశో*
*భిల్లం బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ*
*ఫుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా."*[13]

అనే పద్యం పోతన పద్యంగా ప్రసిద్ధమైంది. ఈ పద్యం సౌందర్య లహరిలో ఈ క్రింది శ్లోకాన్ని తలపిస్తుంది.

*"శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత జటాజూట మకుటాం*
*వరత్రాస త్రాణ స్ఫటిక ఘటికా పుస్తక కరామ్!*
*సకృన్నత్వా సత్వా కధమివ సతాం సన్నిదధతే*
*మధుక్షీర ద్రాక్షా మధురిమ ధురీణా : ఫణితయ :"*[14]

ఆంధ్ర మహా భాగవతంలో పోతన చేసిన సరస్వతీ స్తుతియే కాక షష్ఠమస్కంధంలో సింగన చేసిన సరస్వతీ స్తుతి ఉంది. సింగన కూడా పోతన వలె నిఖిలదేవతా వందనంలో ముగురమ్మల్లో మొదటగా భారతీదేవిని స్తుతించారు.

*ఉ. "కల్లతనంబు గాక పొడగట్టిన పూర్వపురీతి నే( డునా*
*యుల్లము నందు నుండుము సమున్నత తేజము తోడభక్తిరం*
*జిల్లిన చూపు గూడవిధి 'జెందిన ప్రోడ బుధాళినీడ మా*
*తల్లి దయామ తల్లి ప్రణత ద్రుమ కల్పక వల్లి భారతీ"*[15]

అమ్మా! భారతీ! ఇంతకు ముందు నిజం నీవు నాకు సాక్షాత్కరించిన విధంగా నేడు కూడా వెలుగులు వెదజల్లే రూపుతో, రమ్యత్వం రంజిల్లే చూపుతో నా హృదయంలో కదలకుండా ఉండు. విధాతని చెట్టబట్టిన ప్రోడవు. కవి, పండిత సమూహానికి నీవు తోడు నీడవు. నీవు మా తల్లివి. దయామ తల్లివి, నమస్కరించే ఆశ్రిత జనులకి కల్పవల్లివి,

ఈ సింగన మహాకవి ఏ పుణ్యం చేసుకొన్నాడో, ఆ తల్లికై ఎంత సుదీర్ఘ జపతపాలా చరించాడో బ్రహ్మ రసనాగ్ర సంచారిణి సరస్వతీ దేవినే నా హృదయంలో నిశ్చలంగా ఉండమని చెప్పే శక్తి శాలియయ్యాడు. అంతేకాక సరస్వతీ దేవిని ప్రత్యక్షం చేసుకొని సంభాషించిన సరస్వతీ పుత్రుడు.

సరస్వతీ దేవి తనకు ప్రత్యక్షమై సంపూర్ణ దృష్టితో వీక్షించి మృదు భాషణలు చేసిందని ఈ క్రింది పద్యంలో వివరించాడు.

*ఉ. "ఆటలు పాటలుంజదువు లద్భుతముల్ వినసొప్పు వాద్యముల్*
*సాటి దలంపరాని బలుసాములు మున్నగు విద్యలెల్ల నీ*
*కాటలు పాటలయ్యె వినుమన్నిటికిన్ మెఱుగిడ్డ భంగి నా*
*చాటున ( జాటు కార పద సాధు కవిత్వము ( జెప్పుమింపుగన్"*

నీ ఆట పాటలు, చదువు సంధ్యలూ అద్భుతంగా సాగాయి. వీనుల విందైన వాద్యాలు సాముగరిడీలు మొదలైన విద్యలన్నీ నీకు అలవోకగా అలవడ్డాయి. ఇదిగో విను వీటి కన్నింటికీ మెరుగు పెట్టే రీతిగా మృదు పదాలతో కమ్మని సాధువైన కవిత్వాన్ని నా అండ దండలతో చెప్పమని ఆదేశించింది.

వాగ్దేవి పలికిన పలుకుల్లో చతుర్దశ విద్యల్లో కవిత్వానికే అగ్రతాంబూలం. కవిత్వం చెప్పగల్గినపుడే మిగిలిన విద్యలకు వెలుగు, మెఱుగు, అన్న సత్యం సింగనకు చెప్పిన మాటలుగా పరితలకి ఆ పలుకులమ్మ ఇంపు సొంపైన సాహిత్యపు విలువ తెలియచేసింది.

దివ్యవాణి ఆ వాగ్దేవి సాక్షాత్కారాన్ని సింగన ఈ క్రింది సీసంలో వర్ణించిన తీరు అద్భుతావహం.

*సీ. "ఉరవడి ప్రాగ్వీధినుదయించు మార్తాండ కోటి బింబచ్ఛాయగూడినట్లు*
*హరిహర బ్రహ్మల యాత్మలలో నుచ్చి కరుణయొక్కట మూర్తి బెరసినట్లు*
*ఖరకర కర తీవ్రగతిని 'గరంగుచు హేమాద్రి సొగపెల్లగేసినట్లు*
*ఫణిరాజ ఫణిరాజి మణిగణ విస్ఫూర్తి సుషిరంపు వెలిదల చూపినట్లు*
*ఉట్టి పడ్డట్లు కట్టెఱ్ఱనూ ( దినట్లు,*

*తేజమెసగ ( గ నామ్రోల దివ్యవాణి*

*పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టి (*

*జూచి యిట్లని పలికె మంజులముగాను"* [17]

ఒక్కసారి కోటి సూర్యబింబాలు తూర్పుదిక్కున ఉదయించినట్లు, బ్రహ్మవిష్ణు శివాత్మల అనురాగ తరంగాలు పొంగి పొరలినట్లు, సూర్యకిరణాల తీవ్రవేడికి కరిగిన మేరు పర్వతం నీరై పైకి ఎగిరి వచ్చిన రీతిగా, ఆదిశేషుని రత్న సమూహాల రమణీయ దీప్తులు పుట్టరంధ్రాలనుండి వెలువడినట్లుగా కట్టెర్రకాంతులు ఉట్టిపడే దివ్యవాణి నాయెదుట ప్రత్యక్షమై సంపూర్ణ దృష్టితో నన్ను వీక్షించి మృదు సంభాషణ కావించిందని పలికాడు.

సరస్వతీ దేవి శ్రీవత్సగోత్రుడు శివభక్తి యుక్తుని సంపూర్ణ భద్ర దృష్టితో (వృత్రాసురవధ, నారాయణ కవచం ఉన్న) షష్ఠమస్కంధం వ్రాయించింది. ఆ వాగ్దేవి ఆదేశం శిరసావహించిన సింగన భాగవత మనోహర మంత్రం పలికి, ఆ భాగవత రసామృతం గ్రోలి అమరకీర్తినార్జించి జన్మ సార్థకం చేసుకొన్నాడు.

"శారదా శారదాంభోజ వదనావదనాంబుజే

సర్వదా సర్వదా2స్మాకం సన్నిధిః సన్నిధిం క్రియాత్" ॥

## 2. దుర్గాదేవి

భక్తకవి పోతన దేవతా స్తుతిలో మొట్ట మొదట వర్ణించిన స్త్రీమూర్తి వాణి. రెండవ స్త్రీమూర్తి దుర్గ. సాధారణంగా భక్త లోకంలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులనటం నానుడి. ఆ వరుసలో త్రిదేవతలుగా రాణి, లక్ష్మి దుర్గమ్మలు రావలె. కాని వాణి తర్వాత పోతన దుర్గను మాయమ్మ అని ఈ క్రింది పద్యంలో స్తుతించాడు.

*ఉ. "అమ్మల గన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె*
*ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి పుచ్చిన యమ్మ తన్నులో*
*నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ దుర్గమా*
*యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్"* [18]

(అమ్మలకు అమ్మ) అమ్మలను కన్న అమ్మ. ముగురమ్మల (సరస్వతీ, లక్ష్మీ, పార్వతిలను) మూలమైన అమ్మ. చాల పెద్దమ్మ. దేవతలకు అమ్మ. కడుపు పండిన అమ్మ. తనని హృదయంలో నమ్మిన దేవతల మనస్సుల్లో ఉండే అమ్మ దుర్గమ్మ. మా అమ్మ దయతో గొప్ప కవిత్వ పటుత్వ సంపదలు ఇస్తుందని నమ్మిన శక్తి ఉపాసకుడు పోతన.

దశ పర్యాయాలు (పది సార్లు) అమ్మ పదాన్ని ప్రయోగించి తొమ్మిది మారులు ఎవరెవరికి అమ్మో చెప్పుతూ పదవసారి మా అమ్మ అని అమ్మ గొప్పదనాన్ని వెల్లడించాడు. ఈ పద్యం పరిశీలించిన, ఆదిశంకరుల వారి సౌందర్య లహరిని పోతన అధ్యయనం చేసి శైవుడైన పోతన, శక్తిని మవసార ఉపాసించి, కలితాశక్తిని పొంది, మా అమ్మ అని చెప్పుకునే అంతగా ఆజగన్మాతను ఉపాసించినట్లుగా వెల్లడౌతుంది.

*"సుధాసిన్ధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే*
*మణి ద్వీపే నీపో పవన వతి చిన్తామణి గృహే ।*
*శివాకారే మఞ్చే పరమశివ పర్యఙ్క నిలయామ్*
*భజన్తి త్వాం ధన్యాః కతిచన చిదానన్దలహరీమ్"* [19]

ఈ శ్లోకంలో పరమేశ్వరి స్థూల, సూక్ష్మ, పరారూపాలను వివరించారు భగవత్పాదులవారు.

పాల సముద్ర మధ్యన రతనాల దీవి. కల్ప వృక్ష వనం, ఆ వన మధ్యంలో కదంబ వృక్షాలు. వాటి మధ్యలో చింతామణుల గృహం, ఆ చింతామణి గృహంలో త్రికోణాకార మంచమందు పరమశివుడు అంపశయ్య మీద ప్రకాశించే జ్ఞాన స్వరూపిణి. నిరతిశయ సుఖ ప్రదాయిని అయిన ఆ పరాశక్తిని అర్చించి పరమ పవిత్రమైన భాగవత పురాణాన్ని తెనిగించి ఆంధ్రసాహితీ లోకంలో అజరామరుడైన ప్రశంసలందుకొని ఆంధ్రులను భక్తి ప్రస్థానంలో అమరులను చేసిన పరమ పావన మూర్తి. తెలుగుల పుణ్యపేటి పోతన మహాకవి,

శ్రీదేవి భాగవత మణి ద్వీప వర్ణనలో

*వ. "చింతామణి సౌధంలో నాలుగు మంటపాలున్నా దేవి నివశించేది ఇక్కడే అనడానికి కారణం. ఇక్కడ పరాత్పర పురుషునితో దేవి సంలీనమవుతూ ఉండటమే. ఇక్కడ ఒక శయ్యఉంది దానికి మెట్లు పది. మూల ప్రకృతులనదగ్గ శక్తి తత్వాలే ఈ శయ్యకు సోపానాలు. ఈ మూడు కోళ్ళ మంచానికి బ్రహ్మ, విష్ణువు, శివుడు ఆధారము. శయ్యపైన ఫలకం సదాశివ పరమాత్మ. భువనేశ్వరీ దేవి స్థితమైనది ఫలకం పైననే"* [20]

గుణత్రయాతీత అయిన పరమేశ్వరి సృష్టికి పూర్వమే తన కుడిభాగం నుండి విలాసార్థం సృష్టించుకున్నది పరమాత్మనే. తాను వామ భాగాన "సదాశివ"గా వెలుగొందుతూ చింతామణి గృహాన్ని సుశోభితం చేస్తుంది". అని సంస్కృత శ్రీదేవి భాగవతానువాదం కావించారు భాగవతుల వారు. ఆ పరాశక్తినే మన పోతన మహాకవి ఉపాసించి పది మెట్లు గల చింతామణి గృహంలో ఉన్న ఆ తల్లిని పై మెట్టు మీద (పదవ మెట్టు క్రింది నుండి పైకి) ఉండి దర్శించి పది పర్యాయములు అమ్మ పదాన్ని ప్రయోగించి ఉండి ఉండవచ్చు.

సౌందర్య లహరిలో

*"గిరిమాహుర్దేవీం ద్రుహిణ గృహిణీ మాగమ విదో*
*హరే పత్నీం పద్మాం హర సహచరీ ముద్రిత నయామ్ ।*
*తురీయా కాపి త్వం దురధిగమ నిస్సీమ మహిమా*
*మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మ మహిషి"* [21]

ఓ పరబ్రహ్మ మహిషీ! బ్రహ్మవాదులు నిన్నే బ్రహ్మదేవుని భార్య, వాక్కుకి అధిష్ఠాన ధాత్రివైన సరస్వతి అంటున్నారు. విష్ణుమూర్తి భార్య అయిన లక్ష్మీదేవి అంటున్నారు. శివుని భార్య అయిన పార్వతి అంటున్నారు. కాని నీవు మాత్రం ఈ ముగ్గురూ కాకుండా వీరి కన్న వేరైంది, అనిర్వచనీయమైంది, అతి కష్టంచేత మాత్రమే పొందదగింది. అపారమహిమ గలదైన శుద్ధ విద్యా తత్త్వమై, మాయామయమైన ఈ ప్రపంచాన్ని భ్రమింప చేస్తున్నావు అని చెప్పటం వల్ల పోతన ముగురమ్మల మూలపుటమ్మ అని ఆది పరాశక్తిని వర్ణించాడు.

చింతామణి గృహ నిలయవాసిని ఉపాసన గల పోతన భావనాలోకమున జపతపాలచే హృదయ పీఠంలో అధిష్ఠింప చేసుకో గలిగాడు. కాబట్టే ఆ అమ్మను (జగన్మాతను) 'మా యమ్మ' అని అనగల్గాడు.

ఆ జగదంబ పోతన అనన్య భక్తికి పరవశించి భక్తి రసామృత రూపంలో జాలువారి ఆంధ్ర మహాభాగవతమనే ఆకాశగంగా ప్రవాహమై తెలుగు పుడమిని పవిత్రం గావించింది. కానిచో ఈ అక్షర జపం సామాన్యులకు సిద్ధించునా? ఒక వేళ సిద్ధించినా ఆంధ్ర సాహితీ లోకమున శాశ్వతమై నిలుచునా?ఒక వేళ నిలిచినా ఆంధ్రుల పూజా మందిర పీఠము నధిష్ఠించునా? ఈ ఔన్నత్యానికి ఆజగదంబ దయాదృక్కులే కారణం.

ఈ లోక మాత తన దయాదృష్టిని ద్వారకానగర ప్రజలపై చూపించి, లోక రక్షకుడైన శ్రీ కృష్ణ పరమాత్మ క్షేమాన్ని తెలియచేసి, తాను ఆది పరాశక్తి నన్న విషయాన్ని మరొకసారి ఋజువు చేసింది.

దశమస్కంధం ఉత్తర భాగంలో శ్రీకృష్ణుడే శమంతక మణిని అపహరించాడన్న నింద మోపాడు సత్రాజిత్తు. ఆ నిందను పోగొట్టుకోవాలని శ్రీకృష్ణుడు బయలుదేరి, మరణించిన సత్రాజిత్తు సోదరుడైన ప్రసేనుని చూసి, జాంబవంతునితో యుద్ధంచేసి, జాంబవతిని కానుకగా స్వీకరించి, శమంతక మణిని తీసుకుని ద్వారకకు రావటం ఆలస్యమవుతుంది.

ద్వారకా నగర పౌరులందరు

*క. "దుర్గమమగు బిలమున హరి*
*నిర్గతుడై చేర వల.యు నే 'డని పౌరుల్*
*వర్గము లై సేవించిరి,*
*దుర్గం గృత కుశల మార్గ దోషితభర్గన్"*[22]

శ్రీ కృష్ణుడు క్షేమంగా తిరిగిరావాలని, సర్వశుభాలు కలుగచేసే భక్త క్షేమంకరి యైన దుర్గా దేవిని పూజిస్తారు. పూజించిన వెంటనే జగన్మాత

*క. "డోలాయిత మానసులై,*
*జాలింబడి జనులుగొలువ జండిక పలికెన్*
*బాలామణితో మణితో,*
*హేలాగతి వచ్చు నంబు జేక్షణుండనుచున్"*[23]

పౌరుల దీన స్థితిని గుర్తించి, పద్మాక్షుడైన శ్రీకృష్ణుడు మణితోను, ఒక బాలామణితోను అనాయాసంగా నెమ్మదిగా తిరిగి వస్తాడని తెలియజేసింది.

శ్రీమన్నారాయణుని శిరస్సు, అవతార పురుషుడైన శ్రీకృష్ణకథ ప్రధానమైంది దశమస్కంధం. ఈ స్కంధంలో ఈ విధమైన సంఘటనలో శక్తి (దుర్గమ్మ) ప్రభావాన్ని పోతన తెలియచేయటం విశేషం. అమ్మలగన్నయమ్మ దుర్గమ్మ మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదలనిచ్చి శ్రీమదాంధ్ర మహా భాగవత రచనని పోతన వెన్నంటి నడిపించిందనటంలో సందేహము లేదు.

*"కాత్యాయని మహామాయే భవానీ భువనేశ్వరి*
*సంసార సాగరే మగ్నం మాముద్ధర కృపామయే"॥*
*బ్రహ్మ విష్ణు శివారాధ్యే ప్రసాదం జగదంబికే*
*మనోభిలషితం దేవి వరం దేహి నమోస్తుతే"*[24]

# 3. లక్ష్మీదేవి

పోతన మహాకవి భాగవతంలో నిఖిల దేవతావందనంలో నిత్య కల్యాణం పచ్చతోరణానికి నెలవైన శ్రీ మహావిష్ణువు పట్టపుదేవి శ్రీ మహాలక్ష్మిని ప్రస్తుతించాడు.

*మ. "హరికిం బట్టపుదేవి పున్నెముల ప్రోవర్థంపు బెన్నిక్కచం*
*దురు తోఁ బుట్టువు. భారతీ గిరిసుతల్ తోనాడు పూ ( బో ( డితా*
*మరలందుండెడి ముద్దరాలు, జగముల్ మన్నించు నిల్లాలు, భా*
*సురతన్ లేములు వాపుతల్లి, సిరియిచ్చున్ నిత్య కల్యాణముల్"* [25]

శ్రీదేవి ఆదినారాయణుడైన హరికి పట్టపురాణి. పుణ్యాలనిధి సిరి సంపదల పెన్నిది. రేరాజు చంద్రునికి తోబుట్టువు, సరస్వతీ పార్వతులతో వికసించిన పద్మాలు తన నెలవుగా కూడి క్రీడించే పూబోణి. అఖిల లోకారాధ్యయైన ఇల్లాలు. కాంతులీనే ఒక్క కటాక్ష వీక్షణంతో, భక్తుల దారిద్ర్యాన్ని పటా పంచలు కావించే బంగారు తల్లి, శ్రీ మహాలక్ష్మిని మాకు నిత్య కళ్యాణాలు అనుగ్రహించమని ప్రార్థించాడు.

ఈ పద్యం శంకర భగవత్పాదుల వారి కనక ధారాస్తవ మందలి ఈ క్రింది శ్లోకాలని తలపిస్తుంది.

*"అఙ్గం హరే : పులక భూషణమాశ్రయన్తీ*
*భృఙ్గాఙ్గనేవ ముకుళాభరణం తమాలమ్!*
*అఙ్గీకృతాఖిల విభూతిరపాఙ్గలీలా*
*మాఙ్గల్యదా2స్తు మమమఙ్గళదేవతాయా: ॥"* [26]

*"ముగ్ధా ముహుర్విదధతీ వదనే మురారే*
*ప్రేమత్రపా ప్రణి హితాని గతాగతాని ।*
*మాలాదృశోర్మధుకరీవ మహోత్పలేయా*
*సామేశ్రియం దిశతు సాగర సమ్భవాయా"॥* [27]

పోతన శ్రీ మహాలక్ష్మి స్తుతి విద్యా సంపద కోసం . పోతన అనన్య భక్తికి సంతసించిన విద్యాలక్ష్మి సంపూర్ణ భద్ర దృష్టిని ప్రసరింపచేసింది. ఆ విద్యాలక్ష్మి దృక్ప్రసార కాంతులు భాగవత భక్తి కాంతులై చంద్రకాంత మణుల వలె శాశ్వతమై వెలుగొందింది భాగవత భక్తి దీపం. చంద్ర సహెూదరి కాబట్టే చంద్ర కాంత మణుల కాంతిని ప్రజ్వరిల్ల చేసింది. తైల దీపాలు గాలికి కొండెక్కటం, తైలం నిండుకొని కొండెక్కటం జరుగుతుంది. కానీ ఇది శాశ్వత సహజ సిద్ధ కాంతి. ఈ కాంతి నిత్య వెలుగు. నిత్య కల్యాణం పచ్చ తోరణంగా ఆంధ్ర సాహితీ లోకంలో అఖండ భక్తి దీపం, ఆంధ్రావనిలో దశదిశల ప్రసరించి, దీపపు కాంతులతో నిత్యమై, ఆంధ్రుల హృదయాల్లో స్థిరమై ప్రకాశిస్తుంది.

షష్ఠస్కంధ రచయిత సింగన పోతనవలె నిఖిల దేవతా వందనంలో సముద్ర తనయను సంస్తుతించాడు.

*క. "విలసత్కంకణ రవరవ*

*కలితంబగు నభయ వరద కరములు బెరయం*

*జెలరేఁగి భక్తులకు నల*

*కలుములు దయసేయు జలధికన్యకందలతున్"* [28]

ప్రకాశిస్తున్న కంకణాల గలగలలతో, అభయహస్తంతో, కోరిన వరాలిచ్చి, భాగ్యప్రదాయిని, సముద్ర తనయని భావించి సేవిస్తానని పలికాడు.

పాల సముద్రం నుండి పుట్టిన శ్రీమహాలక్ష్మి పై విధంగా ఉండి శ్రీహరిని చేరింది. (సింగన వర్ణించినట్లుగా) ఆ శ్రీహరిని చేరిన శ్రీమహాలక్ష్మిని గూర్చి క్షీర సాగర మధనంలో అష్టమ స్కంధంలో విశదంగా పోతన వర్ణించి కవి శబ్దానికి అర్థం చెప్పాడు "(వర్ణనా నిపుణ: కవి:)"

### క్షీర సాగర సంజాత శ్రీమహాలక్ష్మి

అంద చందాలకు పెన్నిధి. కొంగ్రొత్త మెరుపు తీగవలె తళతళమనే దేహంతో ప్రకాశిస్తూ ధగధగమనే ఆమె చూపుల సంపద వెదజల్లుతూ పాలసముద్రం నుండి ఉదయించింది.

### లక్ష్మీదేవి అందచందాలు

మిసిమి మీగడ ఈమె దేహపురంగు. వర్షాకాలపు మెరుపుతీగవలె కోమలదేహం. ఆ దేహం నుండి వికసించే కెందామరల సువాసన. బంగారు సంపెంగల దండ అందాన్ని కూర్చి బాలచంద్రుని సొగసుతో అందానికి పదునుపెట్టి, ఈ అందాల రాశి లక్ష్మీదేవిని సృష్టించాడు బ్రహ్మదేవుడు.

*క. "కెంపారెడు నధరంబును*

*జంపారెడి నడుమ సతికి శంపారుచులన్*

*సొంపారు మోము 'గన్నులు'*

*బెంపారుచు నొప్పు గొప్ప 'బిఱుదును గుచముల్'"* [29]

లక్ష్మీదేవికి ఎఱ్ఱని పెదవులు సన్నని నడుము, మెరుపు కాంతులతో మేలైన ముఖం, తళుకు కన్నులు, కొప్పు, కటి ప్రదేశం వక్ష స్థలమున ఉన్నతంగా ఉన్న క్షీరసాగర తనయ దేహసౌందర్యాన్ని వర్ణించి కవి శబ్దానికి అర్థం చెప్పాడు పోతన.

## మంగళమాతకి మంగళ స్నానం

పాలేటి రాచ కన్నెకు మంగళ స్నానం చేయించటానికి దేవేంద్రుడు వెలలేని రత్నాల పీఠం అమర్చాడు. దేవతా ముత్తైదువలు నిర్మలమైన నీళ్ళు నిండిన పుణ్యాహం చేసే కడవలు తెచ్చారు. భూదేవి కలశాల్లోకి చిగుళ్ళనిచ్చింది. గోవులు పంచగవ్యాలనిచ్చాయి. వసంతుడు అధిక తేనె అందించాడు, మునులు సంకల్పం చెప్పారు. మేఘాలు మంగళ వాద్యాలవలె ధ్వనించాయి, గంధర్వులు పాడగా, గంధర్వ కాంతలు ఆడగా, మహాపండితులు మంగళాశీస్సులు పలికారు. దిగ్గజాలు తమ తొండాలు చాచి పుణ్య తీర్థాల్లోని జలాల్లో నుండి తీసి నీటితో అన్నుల మిన్న అయిన లక్ష్మీదేవికి స్నానం చేయించాయి.

## ఎల్లలోకాలకు ఏలికసాని

లక్ష్మీదేవికి సముద్రుడు పట్టుబట్టల జతను తెచ్చి ఇచ్చాడు. వైజయింతీమాలికను వరుణుడు సమర్పించాడు. దేవశిల్పి విశ్వకర్మ బంగారు బాహుపురులు, కంకణాలు, గజ్జెలు, కడియాలు మొదలైన అలంకారాలను ఇచ్చాడు. మంచి ముత్యాల హారాన్ని సరస్వతీదేవి ఇచ్చింది. చేతిలో ధరించే లీలా కమలాన్ని బ్రహ్మదేవుడు ఇచ్చారు. మంగళకరమైన స్తోత్రాలను వేదాలు సమకూర్చాయి. "ఎల్ల లోకాలకు ఏలికసానివై జీవించు"[29] అంటూ దిక్కులు దీవించాయి.

## లోక వెలుగు లక్ష్మీదేవి

లక్ష్మీదేవి అమృతం చిలుక ఎవనితో పలుకుతుందో అతడే బ్రహ్మ. ఆమె మెచ్చుకొని అందమైన తన చేతితో ఎవరిని వరిస్తుందో అతడే సర్వ లోకాధిపతి. ఆమె ఎవనితో నిరంతరం నివసిస్తుందో

అతడే సర్వజ్ఞుడు. ఆమె ఏ ఇంటిలో కాపురం చేస్తుందో అది కలకాలం కళకళలాడే వైకుంఠం. ఆమె ఎచ్చట తనచూపు ప్రసరిస్తుందో అది ఇంద్రునికి, కుబేరునికి, యమునికి ఆయువుపట్టు. ఆమె చిరునవ్వు దుఃఖాన్ని తొలగించి సృష్టిని వెలిగిస్తుంది. లోకంలో అంధకారాన్ని పారద్రోలి ఐశ్వర్య జ్యోతిని వెలిగించే లోక వెలుగు లక్ష్మీదేవి.

## లక్ష్మీదేవి బొమ్మరిల్లు బ్రహ్మాండం

లక్ష్మీదేవి బ్రహ్మాండాన్ని తన బొమ్మరిల్లుగా భావిస్తుంది. లోకాలన్నింటిని తన ఇంటి కుండల దొంతరలుగా ఊహిస్తుంది. బ్రహ్మాది దేవతలను తన ఇంటిలోని ఆటబొమ్మలుగా తలుస్తుంది. భూమండలాన్ని ఒక్కోసారి తన బొమ్మల కొలువుగా భావిస్తుంది. సూర్య చంద్రుల కాంతులను చిరు దీపాలుగా చిత్తగిస్తుంది. సరస్వతిని, పార్వతిని తన అనుంగు చెలికత్తెలుగా ఆదరిస్తుంది. మంగళ కార్యంచే యథావిధిగా పూజింపబడిన సౌందర్యవతి ఇందిరాదేవి ఝుంకారం చేస్తున్న తుమ్మెదల సమూహంతో కూడిన కలువ పూమాలని చేతితో పట్టుకొని, మేఘాల  మధ్య మెరుపుతీగ వలె సిగ్గుతో మందహాసం చేస్తూ అత్యంత సౌందర్యరాశిగా తేజరిల్లుతూ దేవతల నడుమ నిలిచింది.

లక్ష్మీదేవి అపురూపమైన ఆకారాన్ని చూచి విష్ణువు తప్ప తక్కిన దేవతలందరూ ధైర్యాన్ని కోల్పోయి చికాకు పడ్డారు.

## నిత్య సౌభాగ్యవతి

పాలేటి రాచ కన్నియ యక్ష, రాక్షస, సిద్ధ, సాధ్య, దేవ, గరుడ, గంధర్వ చారణులు మొదలైన వారినందరిని నిరాకరించింది. నిత్య సౌభాగ్యవతి అయిన లక్ష్మీదేవి సంపదలకావాసమైన అందగాడైన చందనంవలె చల్లని మనస్సు ఉన్న కలతలేని దయామయుడు, నిర్మలమైన, స్థిరమైన, సత్యసంధుడు, సజ్జన రక్షకుడైన శ్రీమహావిష్ణువే తనకు తగిన భర్తయని, దివ్యగుణ పరిపూర్ణుడు, యోగశక్తి సమన్వితుడు కనుక పరమవాంఛ కలవాడని భావించి పూమాలతో ఆయన కంఠాన్ని అలంకరించి శ్రీవిష్ణువు హృదయరాణి అయింది.

వైకుంఠం మెట్టినింటిగా గల శ్రీమహాలక్ష్మి శ్రీవిష్ణువు ఇల్లాలుగా ఎలా మసలుకొందో ఆస్కంధంలోనే గజేంద్ర మోక్షఘట్టంలో పోతన విశదీకరించాడు.

## వైకుంఠవాసిని శ్రీమహాలక్ష్మి

*మ. "అల వైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబు దా*

*పల మందార వనాంతరామృత సర: ప్రాంతేందు కాంతోపలో*

*త్పల పర్యంక రమా వినోదియగు నాపన్న ప్రసన్నుండు వి*

*హ్వల నాగేంద్రము 'పాహి పాహి' యన గుయ్యాలించి సంరంభియై"*[30]

వైకుంఠంలోని అంత పురానికి ఒక ప్రక్క మేడకు సమీపంలోని అమృతసరస్సుకు దగ్గర చంద్రకాంత శిలల అరుగుపై కలువపూల పాన్పుపై లక్ష్మీదేవితో వినోదిస్తున్నాడు. భయంతో స్వాధీనం తప్పి కాపాడు కాపాడుమని ఆర్తుడై వేడుకొంటున్న గజేంద్రుని మొర విని, అతనిని కాపాడటానికి వేగిర పడినవాడై

*మ. "సిరికింజెప్ప ( డు శంఖచక్రయుగముం జేదోయి సంధింప ( డే*

*పరివారంబును జీరండభ్రగపతిం బన్నింప డాకర్ణికాం*

*తరధమ్మిల్లము ( జక్కనొత్తడు వివాద ప్రోత్థిత శ్రీకుచో*

*పరిచేలాంచలమైన వీడ'డు గజప్రాణావనోత్సాహియై"*[31]

శ్రీకుచో పరిచేలాంచలం కూడా వీడక, ఎవరికి చెప్పక ఆర్తత్రాణ పరాయణుడైన హరిగజేంద్ర రక్షణకి బయలు దేరాడు. శ్రీవిష్ణువు వెంటే వైకుంఠం కదిలింది. విష్ణువు ఉన్న ప్రదేశమే వైకుంఠంగదా!.

## సహధర్మచారిణి శ్రీమహాలక్ష్మి

వెన్నుని వెన్నంటి వెళుతున్న సిరికి పలుసందేహాలు కలిగాయి. పతిని పలకరించి కర్తవ్య పాలనకి ఆటంకం కలిగించలేదు. అంతేకాక పతిననుసరించిన పత్నిగా పరమాత్మ స్వాధీన ప్రకృతివలె శ్రీమహావిష్ణువు వెంట వెళ్ళింది.

*వ. "తదనంతరంబ ముఖారవింద మకరంద బిందు సందోహ పరిష్యంద మానానందదిందిందర యగు నయ్యిందిరాదేవి*

*గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవ్యాన చేలాంచలయై పోవుచు"*[32]

పద్మముఖియైన లక్ష్మీదేవి ముఖంలో చిందుతున్న మకరందానికై తుమ్మెదలు ఆనందంతో ముసురు కొన్నట్లు పోతన వచనంలో వర్ణించాడు.

దేవతాస్త్రీయైన లక్ష్మీదేవికి స్వేదం కలిగినట్లు వర్ణించటం ఔచిత్యమా! అనే ఆశంక పఠితలకి సహజంగా కలుగుతుంది. దేవతలకి స్వేద లక్షణం లేదు. లేని దానిని లక్ష్మీదేవికి ఆపాదించి వర్ణించటం పోతన వంటి సహజ పండితునికి అవసరమా? గజేంద్రమొర విన్న విష్ణువు వైకుంఠం నుండే మొసలిపై చక్రం ప్రయోగించి ఉండవచ్చు కాని అలా చేయలేదు. పరమాత్మ మనోవేగంతో పరుగులు తీశాడు. పరమాత్మ పరుగు చూస్తున్న ప్రకృతికి స్వేదం కలగటంలో ఆశ్చర్యపడవలసిన పని లేదనిపిస్తుంది.

మహావిష్ణువు వెంట వస్తున్న మహాలక్ష్మికి

*శా. "తాటంకా చలనంబుతో, భుజనటద్ధమ్మిల్ల బంధముతో*
*శాటీముక్త కుచంబుతో నదృఢ చంచత్కాంచితో శీర్ణలా*
*లాటా లేపముతో, మనోహర కరాలగ్నోత్తరీయంబుతోఁ*
*గోటీంద్ర ప్రభతో నురోజభర సంకోచ ద్విలగ్నంబుతోన్."*[33]

పతి వెంట పరుగిడుతున్న లక్ష్మీదేవి ముఖం కోటి చంద్రుల కాంతితో నిండి ఉన్నట్లు వర్ణించాడు. మేఘం వెంట మెరుపుతీగవలె మహావిష్ణువు వెంట మహాలక్ష్మి వెళుతుంది.

గజేంద్ర రక్షణానంతరం గమనించి మహావిష్ణువు లక్ష్మీదేవితో

*క. "బాలా! నా వెనువెంటను,*
*హేలన్ విను వీధి నుండి యేతెంచుచు నీ*
*చేలాంచలంబు ( బట్టుట*
*కాలోనేమంటి నన్ను నంభోజముఖీ!"*[34]

అని ప్రశ్నించాడు.

ఇంకను నన్ను మరువని వారిని నేనెన్నడూ మరువను. నన్ను విడిచిపెట్టిన వారిని నేను విడిచి పెడతాను. ఇతరులకు మొరపెట్టుకోకుండా నన్ను విడువకుండా ప్రార్థించిన వారిని ఎప్పుడైనా నేను రక్షిస్తాను. ఇది నీకు తెలుసుకదా!

*క. "ఎఱు ( గదు తెఱవా యెప్పుడు,*
*మఱవను సకలంబు నన్ను మఱచిన యెడలన్*
*మఱతునని యెఱిఁ గి మెఱ ( గక,*
*మఱవక మొఱయిడిరయేని మఱి యన్యములన్"*[35]

అని తన తత్త్వాన్ని తానే తెలియ చేసాడు స్వామి శ్రీహరి. స్వామి మాటలకి శ్రీమహాలక్ష్మి చిరునవ్వు నవ్వి గోవిందుని

*క. "దేవా! దేవర యడుగులు,*

*భావంబున నిలిపి కొలుచు పని నాపనిగా*

*కోవల్లభ! యేమని యెద,*

*నీ వెంటను వచ్చుచుంటి నిఖిలాధిపతీ!"* [36]

అని సమస్త ప్రపంచానికి అధిపతియైన స్వామి పాదాలను మనస్సులో ఉంచుకొని పూజించడమే నా పని. కాబట్టి నా స్వామియైన నిన్ననుసరించి నేను వచ్చాను. శ్రీహరి పాదపద్మారాధనే శ్రీ మహాలక్ష్మి తత్త్వం. ఆ తల్లి తత్త్వాన్ని ఆ తల్లి చేతనే చెప్పించి దాస్య భక్తిని భాగవతులకి చాటిన, భక్తాగ్రేసరుడు బమ్మెర పోతన, అందువల్లనే పోతన వందన సమర్పణలో ముద్దరాలు, లేములు బాపు తల్లి అని కొనియాడారు.

శ్రీ మహావిష్ణువు పాదపద్మాలను ఆశ్రయించి, పూజించిన లక్ష్మీదేవి పుణ్యనిధియై, పురుషోత్తమ పత్నియై, అమరవందితయైంది. భక్తుల దారిద్ర్యాన్ని పారద్రోలి ధనమిచ్చి, దనుజ మర్దనుని మనస్సు గెలిచి వలచి, వలపించుకొని, వలపులతేడుకి తల్లియైంది. ఆనాది దేవుని అంతరంగ మెరిగి వర్తించి శ్రీవిష్ణు హృదయ వాసినియై జగముల్ మన్నించు ఇల్లాలయింది.

*"సిద్ధి బుద్ధి ప్రదేదేవి, భుక్తి ముక్తి ప్రదాయినీ।*

*మంత్రమూర్తి సదాదేవి, మహాలక్ష్మీ నమోస్తుతే॥* [37]

# 4. భూదేవి

భూదేవి కన్నీళ్ళతో గోరూపధారిణిగా శ్రీమదాంధ్ర మహా భాగవతంలో దర్శనమిస్తుంది. వృషభాకారంలో ఒంటి కాలితో సంచరిస్తున్న ధర్మదేవుడు భూదేవితో

మ. *"నయనాంభః కణజాలమేల విడువన్ నా తల్లి! నీ మేనుసా*
*మయమై యున్నది, మోమువాడినది, నీ మన్నించు చుట్టాలకున్*
*భయదు ఖంబులనెందు నొందవు గదా? బంధించి శూద్రుల్ పద*
*త్రయహీనన్ నను బట్టవత్తురనియో, తాపంబు నీకేటికిన్?"*[38]

తల్లీ! నీ దుఃఖానికి కారణమేంటని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నల పరంపరలో భూదేవి అశ్రుధారా ప్రవాహం, భూదేవి ప్రియ బంధువులకి (ధర్మాత్ములకి) భయ దు ఖాలు ప్రాప్తించటం, శూద్రులు ఒంటి కాలితో కుంటుతున్న ధర్మదేవుని పట్టి బంధిస్తారని బాధపడుతున్నట్లుగా ధర్మదేవుడు భావించాడు.

ఈ ప్రశ్నలు (మూడింటిలో) అంతర్లీనంగా ప్రాపంచిక వర్ణ వ్యవస్థని సువ్యక్తం చేస్తున్నై (

భూదేవికి దుఃఖం లేకుండా ఉండాలంటే సకాలంలో ప్రకృతి అనుకూలంగా ఉండాలి. ప్రకృతి అనుకూలంగా ఉండాలంటే వైదిక ధర్మానుగుణంగా భూప్రజలందరు ఎవరెవరి విధులు ఏ విధంగా శాస్త్రోక్తమైనవో ఆ విధంగా ఆచరించాలి. సుక్షత్రియులు రాజ్య పాలన చేసి వారు భూమిపై ధర్మ స్థాపన చేయాలి. వేదాధ్యయనం, రాజనీతి మొదలైనవన్నీ అధ్యయనానుభవం లేని శూద్రులు భూమిని పాలించిన, ధర్మభంగం వాటిల్లి ఈ ప్రపంచ వ్యవస్థ అస్తవ్యస్తమౌతుందేమోనని భూదేవి చింతిస్తున్నట్లుగా ధర్మదేవుడు భావించి ప్రశ్నిస్తాడు.

భూదేవి తన దుఃఖ కారణాన్ని ధర్మదేవునికి తెలియచేసింది.

*క. "గణనాతీతము లగు స*
*ద్గుణములు గల చక్రి ఘోర కలి ప్రే*
*రణమున ( బాప సమూహ*
*ప్రణయుతులగు జనుల ( జూచి వగచెద ( దండ్రీ!"*[39]

ఓ తండ్రీ! గణనాతీతుడైన సుగుణాలరాశి చక్రధరుని (శ్రీకృష్ణుని) అవతార పరిసమాప్తి అయింది. కలుషాత్ముడైన కలిపురుషుని ప్రేరణ మూలంగా భయంకర పాప కృత్యాలకు పాల్పడిన ప్రజా

సమూహాన్ని చూడగనే నాకు దు:ఖం పొంగుతున్నదని భూదేవి ధర్మదేవునితో పలుకుతుంది. అంతేకాక

*క. "ఈ లోకంబున ( బూర్వము,*

*నాలుగు పాదము లనీవు నడతువు నే ( డా*

*శ్రీలలనేశు ( డు లేమిని,*

*గాలముచే నీకు నొంటి కాలయ్యె ( గదే!"* [40]

ధర్మదేవతా స్వరూపుడైన నీవు పూర్వం ఈ లోకంలో నాలుగు పాదాలతో నడుస్తూ ఉండేవాడివి. ఈ నాడు ఇందిరా వల్లభుడు గోవిందుడు లేనందున వల్లే కదా? కాల ప్రభావానికి లోనైన నీవు ఒంటి కాలితో నడుస్తున్నావు. ఓ పుణ్యమూర్తీ!

*క. "దేవతలకు ఋషులకు ( బితృ*

*దేవతలకు నాకు నీకు ధీరులకును నా*

*నా వర్ణాశ్రమము లకును,*

*గోవులకును బాధయనుచు ( గుందెద ననఘా!"* [41]

దేవతలకి, పితృదేవతలకి, ఋషులకి, నీకు, నాకు, నానా విధాలైన వర్ణాశ్రమాలకి, గోవులకు, మహానుభావులకి బాధలు ప్రాప్తిస్తున్నందుకు బాధపడుతున్నాను.

మహాత్మా!

*క. "హరి పాదంబులు సో ( కెడి,*

*సిరికతమున నఖిల భువన సేవ్యత్వముతో*

*స్థిరనైతి నిన్నిదినములు*

*హరి నా గర్వంబు మాన్చి యరిగె మహాత్మా!"* [42]

భగవంతుని పాద పద్మాలు నాపై సోకే మహాభాగ్యం నాకు లభించిన మూలంగా అఖిలలోకాలకి ఆరాధ్యురాలనై ఇన్నాళ్ళు పొంగి పులకించాను. ప్రభువు నాగర్వాన్ని అంతం చేసి ఇప్పుడు ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడని దు:ఖించి, తన దు:ఖానికి కారణాలు తెలియచేస్తుంది.

## భూదేవి చేసిన గోవిందుని గుణగానం

వ. "మఱియు సత్యశౌచదయాక్షాంతులును, త్యాగ సంతోషార్జనంబులును, శమదమ తపంబులును, సమత్వంబును, పరాపరాధ సహనంబును, లాభంబుగలయెడ నుదాసీనుండై

యుండుటయును, శాస్త్ర విచారంబును, జ్ఞాన విరక్తులును, నైశ్వర్య శౌర్య ప్రభా దక్షత్వంబులును, స్మృతియును, స్వాతంత్రమును, గౌశలకాంతి ధైర్య మార్దవ ప్రతిభాతిశయ ప్రశ్రయ శీలంబును, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనోబలంబును సౌభాగ్య గాంభీర్య స్థైర్యంబులును, శ్రద్ధా కీర్తిమాన గర్వాభావంబులును ననియెడి ముప్పది తొమ్మిది గుణంబులు, నవియుంగాక బ్రహ్మణ్యతా శరణ్యతాది మహాగుణ సమూహంబును శ్రీకృష్ణ దేవుని యందు వర్తిల్లుం గావున.[43]

సత్యం, శౌచం, దయ, సహనం, త్యాగం, సంతోషం, ఋజు స్వభావం, మనో నిగ్రహం, ఇంద్రియనిగ్రహం, కష్టసహిష్ణుత, తితిక్ష క్రియల నుండి విరమించటం, శాస్త్ర జ్ఞానం, విజ్ఞానం, వైరాగ్యం, ఈశ్వరభావం, పరాక్రమం, తేజస్సు, సామర్థ్యం, స్మృతి, స్వాతంత్ర్యం, నైపుణ్యం, ప్రకాశం, సాధు స్వభావం, జ్ఞానేంద్రియ పటుత్వం, కర్మేంద్రియ పటుత్వం, మనోబలం, సౌభాగ్యం, గాంభీర్యం, స్థైర్యం, శ్రద్ధ, కీర్తి, గౌరవం, నిరహంకారం అనే సుగుణాలు.[39] వేద విజ్ఞానం, శరణాగత పరిత్రాణం మొదలైన అనంత గుణగణాలు ఆ శ్రీకృష్ణ పరమాత్మలో అలరారుచుండేవి.

అనంతగుణ సంపన్నుడైన ఆ గోవిందుని పాదస్పర్శలేని నేను దు:ఖంలో ఉన్నానని పలుకుతుంది. భూదేవి పలికిన మాటలను బట్టి పృథివి, పరమాత్మ తను స్పర్శతో పులకించి పరవశించినట్లే, పాపాత్ముల స్పర్శకు మిక్కిలి దు:ఖిస్తుందని స్పష్టమవుతుంది.

*సీ "బ్రహ్మదులెవ్వని భద్ర కటాక్ష వీక్షణము వాంఛింతురు సత్తపముల,*
*గమలాలయము మాని కమలమెవ్వని పాదకమలంబు సేవించు గౌతుకమున*
*బరమ యోగీంద్రులు భవ్య చిత్తములందు నిలుపుదురెవ్వని నియతితోడ*
*వేదంబు లెవ్వని విమల చారిత్రముల్ వినుతింపగా లేక వెగడుపడియె.*

*ఆ. నట్టి వాసుదేవు నబ్జ వజ్రాంకుశ*
*చక్రమీన శంఖ చాప కేతు*
*చిహ్నితంబులైన శ్రీచరణములింక*
*సోకవనుచు వగపు సోకెనయ్య"*[44]

బ్రహ్మాది దేవతలందరు ఎంతోకాలం తపస్సు చేసి ఏ దేవుని కల్యాణ కరుణా కటాక్ష వీక్షణాలను కాంక్షిస్తారో, లక్ష్మీదేవి తన నివాసమైన పద్మాలయాన్ని సైతం వదిలి అత్యంత కుతూహలంతో ఏ

దేవుని పాదపద్మాలని ఆరాధిస్తుందో, పరమనిష్టా గరిష్టులైన మునిశ్రేష్ఠులు తన పవిత్ర హృదయ ఫలకంపై ఏ దేవుని పావన స్వరూపాన్ని నియమ పూర్వకంగా నిలుపుకుంటున్నారో, సమస్త వేదాలు ఏ దేవుని దివ్య చరిత్రలు సరిగా వర్ణించలేక తడబాటు పడుతున్నవో, అటువంటి దేవాదిదేవుడైన వాసుదేవుని పద్మ, వజ్ర, అంకుశ, శంఖ, చక్ర, చాప, మీన ధ్వజరేఖలతో అలంకృతాలైన శ్రీ చరణాలు ఇకపై నా మీద ప్రసరింపవు కదా! అని నాకు శోకం కలుగుతుందని పలుకుతూ తన దు:ఖంలో కూడ పరమాత్మ గొప్పతనాన్ని స్పష్టంగా వెల్లడించింది. భూదేవి శ్రీకృష్ణావతార కారణాన్ని ధర్మదేవునికి తెలియ చేసింది.

*క. "లీలాకారము దాల్చెను*

*శ్రీలలనేశుండు ఖలుల శిక్షించి భవో*

*న్మూలనముసేయు కొఱకును*

*నాలుగు పాదముల నిన్ను నడిపించుటకున్"* [45]

శ్రీమన్నారాయణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి, సంసార సంతాపాన్ని శాంతింప చేసి ధర్మ స్వరూపుడైన నిన్ను నాలుగు పాదాలతో నడిపించటం కోసం లీలా మానుషదేహాన్ని ధరించాడు. భూదేవి శ్రీకృష్ణుని సమ్మోహనత్వాన్ని ధర్మదేవునికి వెల్లడిచేసింది

*ఉ. "ఆ మధురోక్తులానయములా దరహాసములా దయారసం*

*బామురి పంబులా తగవులాగమన క్రియలా మనోహర*

*ప్రేమ కరావలోకనము ప్రీతి ( గనుంగొనలేమి మాధవుం*

*గామినులేల? నిర్దళిత కర్ములు యోగులు 'బాయనేర్తురే!"* [46]

శ్రీకృష్ణ పరమాత్మ మోహన రూపాన్ని, ఆ మాధవుని లీలలు, తీయ తీయని మాటలు, ఆనయ గారాలు, ఆ చిరునవ్వులు, దయా చేష్టలు, ముద్దుమురిపాలు, ప్రణయ కలహాలు, సుందర మంద యానాలు, మనస్సులను హరించే ఆ మధుర కటాక్ష వీక్షణాలు దూరమవుతాయన్న విచారం అంగనలే కాదు, సర్వసంగ పరిత్యాగులైన యోగులు కూడా స్వామి వియోగాన్ని సహించలేరని భూదేవి స్పష్టంగా వెల్లడించింది.

జీవుడు దేవుడిని చేరుకోవటానికి పడే తాపత్రయమిది అందుకే పరమాత్మ

*"యే యధామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।*

*మమ వర్త్మాను వర్తంతే మనుష్యా పార్థ సర్వశ : ॥* [47]

అని పేర్కొన్నాడు.

అంతేకాక భూదేవి ధర్మదేవునితో

*క. "మెల్లన నాపై యాదవ*

*వల్లభు'డడు గిడంగ మోహనవశనై నేరం*

*జిల్లగ రోమాంచము క్రియ*

*మొల్లములై మొలచు సస్యములు మార్గములన్"* [48]

ఆగోపికా వల్లభుడు నాపై మెల్లగా అడుగులు పెడుతూ నడుస్తుంటే మోహం చేత కల్గిన ఆనంద పారవశ్యంలో నా ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ పరమాత్మ నడిచిన దారుల్లో నా దేహం నిండ మొలచిన ఆపులకాంకురాలే దట్టమైన సస్యాంకురాలై అడుగడుగునా పొడచూపాయి.

అందుకే మన పెద్దలు "పడి మొలచిన చెట్టు ప్రబలమవుతుంది" అనే సామెతని చెపుతుంటారు. అది ప్రత్యక్ష భగవంతుని సృష్టి. కాబట్టి ఇక భూదేవి శ్రీకృష్ణ పరమాత్మ అవతార సమాప్తి గూర్చి అంతులేని దు ఖంతో ధర్మదేవునికి తన బాధని సవిస్తరంగా వినిపించి విలపించింది.

భూదేవి దు:ఖాన్ని శ్రీకృష్ణపరమాత్మ ఆలకించి, కలియుగంలో శ్రీవెంకటేశునిగా భువిపై అవతరించి, భూదేవిని చెంతనుంచుకొని, ఆమె ఆర్తినిబాపి, ఆర్తత్రాణ పరాయణ బిరుదాంకితుడై తిరుమల గిరిపై "శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామియేనమ:" అంటూ భక్తులచే కీర్తింపబడుతున్నాడు.

భూదేవి తన దు:ఖాన్ని తూర్పు దిక్కుగా ప్రవహించే సరస్వతీ నది ఒడ్డున వృషభరూప ధారియైన ధర్మదేవునికి, గోరూపధారియై వినిపించింది. కర్మిష్టులైన మానవులు తూర్పు దిక్కుగా నిలబడి పరమాత్మని ప్రార్థిస్తే లౌకిక కోరికలు నెరవేరతాయని ఆర్యులు చెపుతున్నారు. ఆ నాటి ద్వాపరయుగాంతమున లేదా కలియుగారంభం నుండి ఈ ఆచారం అమల్లో ఉన్నట్లు సుస్పష్టమవుతున్నది, గోరూపధారియైన భూదేవి భూప్రదక్షిణ చేసిన పృధు చక్రవర్తికి ధేనువుగా ప్రత్యక్షమై ప్రజల సహజీవనానికి సహకరించింది (పాలరూపంలో)

*క. "ఈ నృపతి ధరాచక్రము*

*ధేనువుగా ( జేసి పిదుకుధృతి నఖిల పదా*

*ర్థానీకము విబుధులు స*

*న్మానింప గ ( బ్రజను జీవనప్రదుడగుచున్"* [49]

## అనంతతత్త్వం తెలిసిన అవని తల్లి

నరకాసుర సంహారానంతరం భూదేవి స్త్రీరూపంలో వాసుదేవుని వద్దకు వచ్చి రత్నాలు పొదిగిన బంగారు కుండలాలు, వైజయంతి అనే వనమాలను, వరుణుడిచ్చిన వెల్లగొడుగుని, ఒక గొప్ప రత్నాన్ని సమర్పించి, నమస్కరించి అనంతుని అనంత తత్త్వాన్ని స్తుతించింది.

*సీ "అంభోజనాభున కంభోజ నేత్రున కంభోజనిలయ సమన్వితునకు*

*నంభోజ పదునకనంత శక్తికి వాసుదేవునకును దేవ దేవునకును*

*భక్తులుగోరిన భంగి నేరూపైన ( బొందువానికి నాది పురుషునకును*

*నఖిల నిదానమై యాపూర్ణ విజ్ఞాను ( డైన వానికి బరమాత్మునకును*

*ఆ. ధాత ( గన్న మేటి తండ్రినజునికి*

*నీకువందనంబు నేనొనర్తు*

*నిఖిల భూతరూప! నిరుపమ! యీశ! ప*

*రా పరాత్మ మహిమ! యమిత చరిత!* [50]

పద్మనాభుడు, పద్మాక్షుడు, పద్మనిలయముతో కూడి (లక్ష్మీదేవితో) నవాడు, అనంత శక్తివంతుడు, దేవాదిదేవుడు వాసుదేవుడు. భక్తాభీష్టం నెరవేర్చటానికి కోరిన రూపం ధరించగలవాడు, ఆది పురుషుడు, సమస్త జగత్తుకి మూలపురుషుడు. పరిపూర్ణ విజ్ఞానవంతుడు, పరమాత్మ బ్రహ్మకి తండ్రి పుట్టుక లేనివాడు, సమస్త ప్రాటికోటి స్వరూపుడు, గొప్ప చరిత్రవంతుడు, పరమాత్మశోభితుడు. శ్రీకృష్ణుని అద్వితీయ తత్త్వాన్ని (నమస్కారం) వందన సమర్పణతో తెలియచేసింది భూదేవి.

అంతేకాక (భగవంతుని) శ్రీకృష్ణుడు సృష్టి స్థితి లయకారకుడని, ఈ చరాచరమైన సమస్త జగత్తులో విశ్వాత్మ స్వరూపుడుగా ఎలా ఉంటాడో సుస్పష్టం చేసింది.

*వ. "దేవా! నీవు లోకంబుల సృజియించుటకు రజోగుణంబును, రక్షించుటకు సత్త్వగుణంబును, సంహరించుటకు (దమోగుణంబును ధరియించు కాలమూర్తివి, ప్రధాన పురుషుండవు. పరుండన్న నీవ! నేనును వారియు ననిలుండు, వహ్నియు నాకాశంబు ( భూత తన్మాత్రలున్. నింద్రియం బులును. దేవతలును, మనంబును, గర్తయును, మహత్తత్త్వంబును, జరాచరంబైన విశ్వంబును, నద్వితీయుండవైన నీయంద సంభవింతుము"* [51]

నరకాసుర కుమారుని పట్ల దయచూపమని ప్రార్థించి, భూదేవి తన మాతృవాత్సల్యాన్ని అభివ్యక్తం చేసింది.

*చ. "దయనిటు చూడుమా! నరకదైత్యుని బిడ్డడు వీ ( డునీదెసన్*

*భయమున నున్న వాడు, గడుబాలుండనన్యశరణ్యు ( డార్తుండా*

*శ్రయరహితుండు, దండ్రికియ శౌర్యము నేరండు, నీ పదాంబుజ*

*ద్వయి ( బొడగాంచె భక్త పరతంత్ర సువీక్షణ! దీనరక్షణా!* [52]

అనన్య శరణాగతి చేసిన అనాథ, (నరకుని పుత్రుడు) భయ భక్తులు కలవానికి, భక్త పరతంత్రుని కృపాదృష్టి అవసరమని భగవంతునికి పరోక్షంగా నివేదించింది. (శ్రీకృష్ణునికి) భక్తులెలా ఉండాలో పరిశేష న్యాయంతో అభివ్యక్తం చేసింది భూదేవి. జనకుడు (కన్నతండ్రి) దుష్టుడైనప్పుడు, నిత్య జనకుడైన ఆపరమాత్మని భక్తితో తెలిసికొని, శరణువేడటాన్ని తెలియచేసింది.

భాగవతం ప్రథమస్కంధంలో భూదేవి చరిత్ర, చతుర్థస్కంధంలో భూదేవి అనుగ్రహం, దశమస్కంధం ఉత్తరభాగంలో భూదేవి వాత్సల్యాన్ని, వర్ణించి భక్తకవి పోతన భక్తులకి పృథివీతత్త్వాన్ని అద్భుతంగా వెల్లడిచేసాడు.

# 5. దివిజ భామినులు (ద్వి స్కంధం)

వీరు దేవలోకంలో నివసించే అప్సరస స్త్రీలు. దేవలోకాధిపతి అయిన దేవేంద్రుడి అధీనంలో ఉంటారు. నరనారాయణుల తపోభంగానికి దేవేంద్రుని ఆనతిపై భువికి వచ్చి విహరించారు. ఈ దివిజ భామినుల కష్టాన్ని గుర్తించిన నారాయణ మూర్తి, వీరి సౌందర్యాన్ని తలదన్నే ఊర్వశిని మరికొందరు అప్సరస స్త్రీలని సృష్టించాడు (దేవరాజుకి కానుకగా ఇవ్వమని) ఈ దివిజ భామినులు నారాయణ మూర్తి సృష్టి చేసిన అప్సరస స్త్రీల సౌందర్యానికి సిగ్గుపడి, ఊర్వశిని నాయకురాలిగా ఎన్నుకొని అమరలోకానికి వెళ్ళారు.

జరిగిన దానికి సిగ్గుపడటం దివిజభామినుల మానసిక పరివర్తనని తెలియచేస్తుంది.

*వ. "అంతందాము నరనారాయణుల తపోవిఘ్నంబు గావింపంబూని చేయు విలాసంబులు, మానసిక సంకల్పమాత్రంబున సృష్టి స్థితి సంహారంబు లొ నర్పంజాలు నమ్మహాత్ముల దెసంబనికి రాక కృతఘ్నునకుం జేయునుపకృతులుంబోలె నిష్ఫలంబులైన సిగ్గునం గుందుచు, నూర్వశిం దమకు ముఖ్యురాలింగా 'గైకొని తమ వచ్చిన జాడన మరలిచనిరంత"*[53]

దివిజ భామినులు ప్రభువు ఆజ్ఞ పాటించాలి కాబట్టి తమ ప్రభువు నియోగించిన కార్యంలో విఫలులైనప్పటికి శక్తి వంచన లేకుండా శ్రమించారు.

వీరు దేవేంద్రుని అధీనులు. దేవేంద్రుడు తన సింహాసన రక్షణ కోసం, తన ఆనందం కోసం ఉపయోగించుకునే విలాసినీ స్త్రీలు. వీరు దేవేంద్రునికి విలాసమే కాని, వీరికంటూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం లేని పరాధీనులు, అస్వతంత్రులు.

"నస్త్రీస్వాతంత్ర్యమర్హతి" అన్న మనుస్మృతికి మరొక ఉదాహరణగా ఈ దివిజ భామినులు కన్పిస్తారు.

# 6. ఊర్వశి (ద్వి స్కంధం)

సత్త్వసంపన్నులు, బుద్ధిమంతులైన నరనారాయణుల తపోభంగానికి మహేంద్రుడు ప్రయత్నించి విఫలుడయ్యాడు. మహేంద్రుడు పంపిన అప్సరసల సౌందర్యాన్ని తిరస్కరించే విధంగా నారాయణుడు తన ఊరుభాగం నుండి ఊర్వశి మొదలైన అప్సర స్త్రీ సమూహాన్ని ఉద్భవింప చేసాడు. నారాయణుని ఊరువు నుండి జనించిన ఊర్వశి దేవతా అప్సర స్త్రీలకు నాయకురాలైంది.

*క. "ఊరువులందు జనించిన*

*కారణమున "నూర్వశి" యన ఘనతకునెక్కెన్*

*వారలరూప విలాస వి*

*హారములకు నోడిరంత నమరీజనముల్"* [54]

జగన్మోహనుడైన ఆనారాయణాంశ సంభూత కావుననే ఊర్వశి అందచందాలతో జగద్విఖ్యాత అయింది. జగత్తునే మోహింప చేసే ఆ నారాయణుడు అన్య స్త్రీల అందచందాలకు లోబడతాడా? లోనుకాలేదు.

అప్సరస స్త్రీ అయిన ఊర్వశి మిత్రావరుణుల శాపం వల్ల మానవ స్త్రీరూపాన్ని పొంది భూలోకానికి వస్తుంది. పురూరవుని (చంద్రవంశపురాజు) అందచందాలకు వివశురాలవుతుంది. పురూరవుడు కూడా ఊర్వశి పట్ల సమ్మోహితుడవుతాడు.

ఊర్వశి పురూరవునితో కలిసి జీవించటానికి కొన్ని నియమాలు పెడుతుంది. ఆ నియమాలు ఇవి.

*మ. "ఇవి నా కూర్చుతగళ్ళు రెండుదగ నీ వెల్లప్పుడున్ గాచెదే*

*ని వివస్త్రుండవు గాక నాకడ సదానీవుండు దేనిన్ విశే*

*ష విలాసాధిక! నీకు నా ఘృతము భక్ష్యంబయ్యెనేనిన్ మనో*

*జ వినోదంబుల నిన్నుదేల్తునగునే చంద్రాన్వయ గ్రామణీ!"* [55]

1. తనతోపాటు పతనం చెందిన రెండుపొట్టేళ్ళని కంటికి రెప్పవలె కాపాడటం.

2. రతి సమయంలో తప్ప, ఇతర కాలంలో దిగంబరుడు కాకుండా మసలుకోవాలి.

3. నేయితో వండిన ఆహార పదార్థాలే నాకిష్టమైనట్లే నీకు ఇష్టమైతే మన్మధ సుఖాల్లో ఓలలాడిస్తానని ఊర్వశి నియమాలకు పురూరవుడు అంగీకరించి.

*ఆ. "రాజు రాజముఖిని రతిందేల్చెబంగారు*

*మేడలందు ( దరుల నీడలందు*

*దో'టలందు రత్నకూటంబులందును*

*గొల ( కులందు గిరులకెల ( కులందు"*[56]

ఊర్వశిని సురత సౌఖ్యాల్లో ముంచి తేల్చాడు. ఇద్దరికి చక్కగా పొత్తు కుదిరింది.

**ఊర్వశి పురూరవుల సఖ్యత**

*క. "ఒక దిక్క యేగుదురు వా (*

*రొక చోటన కాని నిలిచి యుండరు దమలో*

*నొకటియె మనమున నెంచుచు,*

*నొక నిమిషము పాయకుందురు విదయు ( దానున్"*[57]

ఇద్దరు ఒక చోటకే వెళ్ళి, ఒక చోటే నిలిచి, ఒకటిగానే తలచి క్షణకాలమైనా ఒకరిని విడిచి ఒకరు ఉండేవారుకారు. వీరిద్దరి స్నేహం, ప్రేమ, నెయ్యం, వియ్యం, ఇష్టాలు ఆదేవుడికే తెలుసు. ఇద్దరి మధ్య పైటకొంగు అడ్డమైనా ప్రాణాలు పోయినంతగా విలవిలలాడే వారు.

ఊర్వశీ పురూరవులు పరస్పరానురాగంతో రాత్రనక, పగలనక అన్ని చోట్ల తామై విహరించేవారు.

**ఉర్వశీ పురూరవుల ఎడబాటు**

ఒకరోజు దేవలోకంలో దేవేద్రుడు కొలువుదీరి ఉన్న సమయంలో ఊర్వశి లేకుండటం గమనించాడు. దేవేంద్రుడు ఊర్వశి లేక పోవటం వల్ల అతని సభాప్రదేశం వన్నె తగ్గిన బంగారం వలె కళా విహీనంగా ఉన్నదనుకున్నాడు.

ఇంద్రుడు ఊర్వశి జాడ తెలుసుకోవడం కోసం గంధర్వులను పంపుతాడు. ఆ గంధర్వులు ఊర్వశి తన బిడ్డల వలె పెంచుకుంటున్న పొట్టేళ్ళను పట్టుకుంటారు. వాటి రక్షణార్థం వెళ్ళని పురూరవుని ఊర్వశి తీవ్రంగా విమర్శిస్తుంది. ఆ విమర్శలలో మగవాడి లక్షణాన్ని గుర్తు చేస్తుంది.

పౌరుషం లేని నీచ పురుషుని భార్యగా ఉండటం కన్న మగువ గొప్ప వానింట దాసిగా ఉండటం మంచిదని చెపుతుంది.

*ఆ. "అధము ( డైన వానికాలగు కంటెన,*

*త్యధికునింట దాసి యగుట మేలు,*

*హీను ( బొంది యోనిహింసింప ( గానేల?*

*యువతి జనుల కూరకుంట లెస్స"*[58]

మందమతిని చక్రవర్తిగా చేసిన బ్రహ్మ వెర్రివాడని భావిస్తుంది. పురుషుడు పరాక్రమంతో జీవించాలన్న విషయం గుర్తు చేస్తుంది. పురూరవుడు పొట్టేళ్ళ సంరక్షణార్థం అర్ధరాత్రి వెళ్ళి దొంగలను తెగనరికి పొట్టేళ్ళను విడిపించుకొస్తాడు. కాని గంధర్వ మాయ వల్ల పురూరవుడు ఊర్వశి పెట్టిన నియమాన్ని ఉల్లంఘించి దిగంబరంగా కన్పిస్తాడు. ఊర్వశి దేవలోకానికి వెళ్ళిపోతుంది.

## ఊర్వశీ పురూరవుల పునస్సమాగమం

పురూరవుడు మదనవేదనతో ప్రియురాలైన ఊర్వశిని వెదుకుతూ ఉంటాడు. సరస్వతీ నదీతీరంలో కురుక్షేత్రంలో ఐదుగురు చెలికత్తెలతో కలిసి కన్పిస్తుంది ఊర్వశి.

పురూరవుడు చెప్పకుండా నన్ను వదలి ఈ విధంగా ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తాడు ఊర్వశిని. ఊర్వశి ఆడవాళ్ళకి ఇంత దాసోహమనే నీవు ఒక మగవాడివా? పశువులాగా దు:ఖించటం ధర్మం కాదని పలికి చపలచిత్తలైన స్త్రీల స్వభావాన్ని తెలియచేస్తుంది.

పురూరవుని వేదనని చూసి ఊర్వశి జాలిపడి ఒక సంవత్సరం తర్వాత కేవలం ఒక్క రాత్రి నీవు భర్తగా నాతో గడపగలవని, ఆ ప్రకారం నీకు ఒక్కొరొక్కరుగా ఇతర సంతానం కలుగ గలదు. అవతల రాత్రి నన్ను కలిసి లక్షణవంతులైన కొడుకులను పొందుతావని చెపుతుంది.

## జాత వేదాగ్ని ఆవిర్భావం

ఒక సంవత్సరకాలం తర్వాత పురూరవుడు ఒకరాత్రి ఆమెతో గడిపాడు. ఊర్వశి పురూరవుని గంధర్వులను ప్రార్థించమంటుంది. వారు నన్ను నీకు అనుగ్రహిస్తారంటుంది. పురూరవుడు గంధర్వులను ప్రార్థించగా, పురూరవుని పొగడ్తలకు మెచ్చిన గంధర్వులు ఒక కుంపటి

నిస్తారు. ఆ కుంపటిని ఊర్వశిగా భావిస్తూ అడవిలోనే తిరుగుతూ, కొన్నాళ్ళకు ఆ కుంపటి ఊర్వశి కాదని భావించి వదలి వెళతాడు, ప్రతి రాత్రి ఊర్వశినే స్మరిస్తూ కాలం గడుపుతాడు.

త్రేతాయుగం ప్రవేశించగానే ఆ రాజు చిత్తంలో కర్మబోధ అయి మూడు వేదాలు సాక్షాత్క రించాయి. అందువల్ల కామ్య కర్మ పూర్వకమైన యజ్ఞ విధానంతో పాటు, వేదత్రయం పురూరవుడి హృదయంలో ఆవిర్భవించాయి. వెంటనే పురూరవుడు తాను కుంపటిని పారవేసిన చోటికి వెళ్ళి శమీవృక్షంలోంచి పుట్టిన రావిచెట్టును చూచాడు. ఒక కాష్ఠాన్ని తీసుకొని రెండు అరణులను చేసి ఊర్వశి లోకాన్ని చేరగోరి మంత్రజపం చేస్తూ పైనున్న అరణి తాననీ, క్రింద ఉన్న అరణి ఊర్వశి అని రెంటినడుమ ఉన్నకాష్ఠం కొడుకనీ ధ్యానించి మంత్రం చెబుతూ అగ్నిని మథిస్తాడు. అపుడు జాత వేదుడనే అగ్ని ఆవిర్భవిస్తాడు.

## త్రేతాగ్నులకు కారణమైన ఊర్వశి

పురూరవుడు త్రయీవిద్యతో జాతవేదాగ్నిని మూడగ్నులుగా సంస్కరిస్తాడు. ఆ హవనీయాది రూపమై వర్ధిల్లి పురూరవుని కొడుకుగా కల్పింపబడింది. ఆ అగ్ని పురూరవుని పుణ్యలోకాన్ని పొందించటానికి సమర్థమైంది. పురూరవుడు అరణులను మథించగా అగ్ని పుట్టింది. ఆ అగ్ని చేత మనుష్యుడు భౌతిక భోగమందు పూర్ణసాఫల్యం పొందగలడు. అంతేగాక శౌక్రజన్మం, మంత్ర దీక్ష, యజ్ఞ నిర్వహణం అనే మూడిటితో పవిత్రుడవుతాడు. ఆ మూడు అ, ఉ, మ అనే అక్షరాల కలయికలతో ఆవాహన చేయబడుతుంది. ఈ విధంగా అగ్ని పురూరవుని పుత్రునిగా భావింప బడుతుంది.

*క. ఆయగ్నిచే ( బురూరవు (*

*డాయజ్ఞేశ్వరుననంతు హరివేదమయున్*

*శ్రీయుతు ( గూర్చి యజించెను*

*ణాయుతు ( డూర్వశి ( గనంగ నరిగెడు కొఱకై"* [59]

పురూరవుడు ఊర్వశి ఉన్నలోకానికి వెళ్ళడం కోసం ఆ అగ్నితో యజ్ఞేశుడు, అనంతుడు, వేదమయు డైన శ్రీహరిని గూర్చి యజ్ఞంచేసి యజ్ఞభోక్త అయిన శ్రీహరిని సంతృప్తి పరచాడు.

గంధర్వలోకానికి వెళ్ళిన పురూరవునికి ఊర్వశి వల్ల ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుడు, జయుడు, విజయుడనే ఆరుగురు కొడుకులు కలిగారు.

భూలోకంలో నారాయణుని ఊరువుల నుండి ఉద్భవించిన ఊర్వశి, భూలోక వాసులను తరించటానికి వీలుగా త్రేతాగ్నులావిర్భావానికి, మానవ స్త్రీరూపం దాల్చి, పురూరవునితో జీవితాన్ని గడిపి కారణమవటం విశేషం. కృతయుగంలో ప్రణవమేధ్యానరూపందాల్చటానికి, యజ్ఞం ద్వారా శ్రీహరిని సంతృప్తి పరచటానికి కారణమైంది ఊర్వశి. కోరిన కోరికలు తీరాలంటే యజ్ఞభోక్త అయిన శ్రీహరిని సంతృప్తిపరచాలని పురూరవుని ద్వారా ఈ లోకవాసులకు తెలియచేసిన స్త్రీ ఊర్వశి.

# 7. దక్షిణ (చ.స్కంధం)

దక్షిణ రుచిప్రజాపతి ఆకూతి దంపతుల తనయ ఈమె ఆదిలక్ష్మి అంశతో జన్మించింది. ఈ దంపతులకే శ్రీమహావిష్ణువు అంశతో యజ్ఞుడు జన్మించాడు. స్వాయంభువ మనువు సంతోషంతో తన దౌహిత్రుని (ఆకూతి తండ్రి స్వాయం భువమనువు) తన ఇంటికి తెచ్చుకున్నాడు. రుచిప్రజాపతి కామగమన అయిన దక్షిణని తనవద్దనే నిలుపుకున్నాడు. అనంతరం యజ్ఞుడు తనని భర్తగా కోరిన జనన మరణ రహిత దక్షిణను చేపట్టాడు. ఇద్దరు ఆది దంపతులు కావటం వల్ల వారి వివాహం లోక విరుద్ధం కాలేదు.

*వ. "అట్లు వివాహంబైన రుచి ప్రజాపతి బ్రహ్మవర్చస్వియు బరిపూర్ణ గుణుండును గావున( జిత్తైకాగ్రతం జేసి యాకూతి యందు శ్రీవిష్ణుండు యజ్ఞరూపధరుండగు పురుషుండగను జగదీశ్వరి యగు నాదిలక్ష్మి యమ్మహాత్మునకు నిత్యానపాయిని గావున ( దదంశంబున దక్షిణయను కన్యకారత్నంబుగను మిధు నంబు సంభవించె ... ... ... ... ... ... ... ... సకలమంత్రాధి దేవత యగు శ్రీయజ్ఞుండు దను 'బతిగం గోరెడు దక్షిణ యను కన్యకం బరిణయంబయ్యె, వారలాది మిధునంబు గావున నది నిషిద్ధంబు గాకుండెనని చెప్పి మైత్రేయుండు వెండియు నిట్లనియె"* [60]

## దక్షిణ దాంపత్య జీవనం

దంపతులైన దక్షిణకు యజ్ఞునికి 'యామ' నామకులైన దేవతలు పుత్రులుగా జన్మించారు. వారు మహాబలవంతులు. ఈ పన్నెండు మందిని 'తుషితులు' అని కూడా అంటారు. స్వాయంభువ మన్వంతరంలో తుషితులు దేవతలయిరి. మరీచాది మునీశ్వరులు సప్తర్షులయ్యారుయజ్ఞుడు దేవేంద్రుడయ్యాడు.

ఏడేడు లోకాలకి సంపద నిచ్చేతల్లి, తాను దక్షిణగా అవతరించి, ప్రజాపతి కుమార్తెగా ఉదయించి దేవమాత అయింది. హరి వెంటే సిరి అన్నట్లుగా నిత్యానపాయినిగా ఆమె సతీ ధర్మాన్ని లోకానికి చాటిన ఇల్లాలు.

## 8. స్వాహాదేవి

ఈమె దక్ష ప్రజాపతి కుమార్తె. అగ్ని దేవుని భార్య స్వాహాదేవికి అగ్ని దేవుని వల్ల హవిస్సులే భోజనంగా గల పావకుడు, పవమానుడు, శుచి అనే ముగ్గురు కొడుకులు గల్గారు. ఆ ముగ్గురి వల్ల 45 విధాలైన అగ్నులు ద్భవించాయి. తాత తండ్రులతో కూడి మొత్తం 49 అగ్నులయ్యాయి. అగ్నిష్వాత్తులు, బర్హిషదులు, సౌమ్యులు, పితలు, ఆజ్యపులు, సాగ్నులు, నిరగ్నులు అని సప్తవిధాలైన అగ్నుల నామాలతో బ్రహ్మవాదులైన వారు యజ్ఞ కర్మల్లో ఇష్టులు నిర్వహిస్తుంటారు.

వ. "మఱియు నగ్నిదేవునకు దక్ష పుత్రియైన "స్వాహాదేవి" యను భార్యయందు హుతభోజనులగు పావకుండును ... ... ... ... ... ... ... ... బ్రహ్మనిష్ఠలయిపర'గిరి' వెండియు" [61]

పెద్దలు పవిత్రత కోసం అగ్నిని సాక్ష్యం పెడతారు. కాని అగ్నులకే తల్లి కాగల్గిన స్వాహాదేవి పవిత్రతకి పరాకాష్ఠ. ప్రజాపతి కుమార్తెగా ఉదయించి, అగ్నిదేవుని భార్యయై, పావక, పవమాన, శుచిలకు జన్మనిచ్చి, అనేక విధాలైన అగ్నులావిర్భావానికి కారకురాలైన లోకాన్ని అయి నిరంతర యజ్ఞ కార్యాల్లో శబ్ద రూపంలో (స్వాహా) చిరకీర్తినార్జిస్తున్న అద్వితీయ మహిళ.

# 9. సతీదేవి

సతీదేవి దక్ష ప్రజాపతి కుమార్తె, పరమ శివుని పత్ని. ఆ సతి అతి భక్తితో ప్రతి నిత్యం తన పతిని సేవించింది. ఆమెకి సంతానం లేదు. పరమేశ్వరుని పట్ల పగబూనిన తన తండ్రి పై కోపించి, ఆ ఉత్తమ ఇల్లాలు యోగ మార్గంలో తన శరీరాన్ని త్యజించిందని మైత్రేయుడు విదురునితో చెపుతాడు.

*సీ. "దక్ష ప్రజాపతి తనయ యా భవుని భార్యయుననందగు"*

*... ... ... ... ... ... ... ... ... "సతి" యనులతాంగి"* [62]

## దక్షుని తనయగా సతీదేవి

దక్షుడు తన కుమార్తె సతీదేవిని గూర్చి

*సీ. "పరికింపనితండు దిక్పాల యశోహాని కరుండీ క్రియాశూన్య పరుని చేత*

*గరమొప్ప సజ్జనా చరితమార్గము దూషితంబయ్యె, నెన్నగతత్రపుండు*

*మహిత సావిత్రీ సమానను సాధ్వి నస్మత్తనూజను మృగశాబనేత్ర*

*సకల భూమీసుర జన సమక్షమున మర్కటలోచనుండు కరగ్రహణమర్థి'*

*తే "జేసి తా శిష్య భావంబు ( జెందుటాత్మ,*

*దల ( చి ప్రయ్యుద్గమాభి వందనము లెలమి*

*నడపకుండిన మాననీ, నన్ను ( గన్న,*

*గోరిమాటకు ( దనకేమి గోరువోయె"* [63]

సావిత్రదేవి వంటి సాధ్వీ శిరోమణి అయిన నా కుమార్తెను అని లేడి కన్నుల వంటి ఆకర్ణాంత విశాల నేత్రగా అని, అభివర్ణించటం వల్ల గుణ సౌందర్యాల్లో సతీదేవి ఆధిక్యత సుస్పష్టమవుతుంది.

## స్త్రీ సహజ లక్షణాలు

దక్షుడు "బృహస్పతి సవనం" అనే యజ్ఞం చేయటానికి పూనుకొని దేవదేవుడైన సదా శివుని, సతీదేవిని ఆహ్వానించలేదు. అయినా సతీదేవి పుట్టింటిపై, తండ్రిపై మమకారంతో వెళ్ళవలెననే సంకల్పంతో సదాశివుని అనుమతి నడిగింది.

*క. "జనకుని ముఖమున కర్థిం*

*జనినీతో బారిబర్వసంజ్ఞికత ( గదుం*

*దనరిన భూషణముల ( గై,*

*కొన వేడ్క జనించెనీశ! కుజన వినాశా?* [64]

శంకరా! దుష్టజన నాశంకరా! నా తండ్రి చేసే యజ్ఞానికి మీతో కలిసి వెళ్ళి, అక్కడ నగలు, నాణాలు మొదలైన కానుకలను స్వీకరించాలన్న కోరికను వ్యక్తపరచింది.

స్మశానవాసి శివుని అర్ధాంగియైనప్పటికీ స్త్రీ సహజ కోరికలు కలిగి ఉండటం విశేషం. ఈ కోరికని వ్యక్తపరచటంలో జగజ్జననికి ఆభరణాలపై మక్కువతో కాక లోక సహజమైన స్త్రీ స్వభావాన్ని వ్యక్తీకరించటంగా తోస్తుంది. ఆకాశమే కేశాలైన పరమేశ్వరునికి మరొక మనవి చేసింది.

*క. "నాతోడను స్నేహముగల,*

*మాతను తత్సోదరీ సమాజము ఋషిసం*

*ఘాతకృతమఖ సమంచిత*

*కేతువు గనవేడ్క గగనకేశ! జనించెన్"* [65]

సతీదేవిపై తల్లికి, తోబుట్టువులకి అనురాగమధికమని, ఆమెకి, ఆమెపై అనురాగం కలవారి నందరిని పుట్టినింటిలో జరిగే వైభవం చూడాలనే ఉత్కంఠని వ్యక్తం చేసింది.

లోక సహజమైన స్త్రీల స్వభావాన్ని

*క. "అనఘా! విను లోకంబుల*

*జనకుని గేహమున ( గలుగు సకల సుఖంబుల్*

*తనయలు సని సంప్రీతి*

*గనుంగొనకేరీతి నిలుచు ( గాయము లభవా!"* [66]

పిలవక వెళ్ళటం తగిన పద్ధతికాదని తన పతి పలుకనేమోనని తర్కించి, శాస్త్రధర్మాన్ని శబ్ద భగవాను నికే గుర్తుచేసిన విజ్ఞాని.

తండ్రి, గురువు, మిత్రుడు, రాజు మొదలైన వారి ఇళ్ళకి పిలువక పోయిన సజ్జనులైన వారు వెళ్ళటం సనాతన ఆచారం.

సతీదేవి శంకరునితో స్వామీ! నేను మీ అర్ధాంగిని విజ్ఞానఖనియైన నీ శరీరం సగభాగంలో ప్రేమతో నన్ను ధరించావు కాబట్టి నన్ను అనుగ్రహించి  నా కోరిక సఫలం చేయమని, దయతో కోరిక తీర్చ దగిన వాడవని ప్రార్థించింది.

శివ స్వామి సతీదేవి మాటలకి చిరునవ్వు నవ్వి సృష్టికర్త అయిన ప్రజాపతుల సన్నిధిలో పూర్వం దక్షుడు తనని గూర్చి పలికిన పలుకులను జ్ఞప్తికి తెచ్చుకొని, మనస్సులో నాటుకొనిన దూషణ వాక్కులు మరువలేక సతీదేవితో దక్షుని గూర్చి ఈ విధంగా పలికాడు.

దేహాభిమానం గల కొందరు మందబుద్ధులు, మదోన్మత్తులు, గర్వపూరితులై మహాత్ముల గొప్పతనాన్ని గుర్తించలేరు. అటువంటి వారి ఇళ్ళకి చుట్టరికం పాటించి పోవటం వివేక వంతులైన వారికి తగని పని.

ఓ సతీ!  కుటిల స్వభావమున్న దుష్టులైన వారి గృహాలకి సుజనులు వెళ్ళరు, ఆ కలుషాత్ముల తీరు దురహంకారంతో దుర్భాషలు హృదయ లోతుల్లో గ్రుచ్చుకొని వ్యక్తిని నిద్ర పోనివ్వక అహర్నిశలు బాధిస్తాయి.

గొప్పవాడైన నీ తండ్రి ప్రజాపతి కుమార్తెలందరి కంటె నిన్నే అధికంగా ప్రేమిస్తాడు. అతనికి ప్రియ తనయవు. ప్రస్తుతం నా సంబంధం వల్ల నీవు నీ తండ్రి ఇంటిలో ఏ మాత్రం గౌరవం పొందలేవని  చెప్పి, దక్షునికి తనపై కలిగిన విరోధానికి కారణాన్ని వివరించి నివారించక, అనుమతించక త్రికాలజ్ఞుడైన త్రినేత్రుడు సతీదేవి మనస్సుని కష్ట పెట్టటానికి ఇష్టం లేక మౌనంగా ఉంటాడు.

తన బంధు మిత్రులని దర్శించాలనే కుతూహలంతో సతీదేవి కోపంలో వివేకం కోల్పోయి తన స్వామి పరమేశ్వరుని విడిచి పుట్టింటికి బయలు దేరి వెళ్ళింది.

ఒంటరిగా వెళుతున్న సతీదేవి వెంట మణిమంతుడు ప్రమథులు, యక్షులు కొందరు బయలుదేరి, నందీశ్వరుడు వారి ముందు నడిచి అమ్మవారిని వృషభవాహనంపై అధిష్ఠింప చేసికొని మంగళ వాద్యాలతో యజ్ఞ ప్రదేశానికి వెళ్ళారు.

వైభవోపేతమైన యజ్ఞశాలలో సతీదేవి ప్రవేశించగా తల్లి, తోబుట్టువులు అనురాగంతో ఆదరించారు, సభలో ఉన్న వారు దక్షునికి భయపడి గౌరవించలేదు.

తండ్రి అనాదరాన్ని, రుద్రుడు లేని (శివునికి భాగం కల్పించమని) యజ్ఞాన్ని చూచి సతీదేవి లోకాన్ని భస్మం చేయాలన్న కోపాగ్నికి గురియైంది. ప్రమధ గణాలు దక్షుని హతమార్చటానికి సిద్ధపడగా వారిని వారించి, తండ్రికి శివతత్త్వాన్ని బోధించి, తండ్రికి ధర్మాధర్మాలను గూర్చి వివరించి "నీలగళాపరాధి" యైన నీకు తనయగా జన్మించినందుకు సిగ్గుగా ఉందని

*చ. "వర వృషకేతనుండు భగవంతుడైన హరుండు నన్ను నా*
*దర పరిహాస వాక్యముల ( దక్షతనూభవ! యంచు ( బిల్వనే (*
*బురహర ( బొక్కుచున్ ముదము ( బొందక నర్మవచ స్మితంబులం*
*దొఱుంగుదు? నీతనూజ నను దుఃఖము కంటెను జచ్చుటొప్పగున్."* [67]

నీకు కుమార్తెనై జన్మించినందుకు దుఃఖించటం కంటె చచ్చిపోవటం మంచిదని యజ్ఞసభా మండప మధ్యంలో నిలబడి తనకు విరోధివాడైన దక్షుణ్ణి వీక్షించి కోపంతో పలికి అరిషడ్వర్గాన్ని జయించి ఉత్తర దిక్కుకి తిరిగి ఆచమించి శుచియై మౌనం దాల్చి నేలపై కూర్చుండి యోగమార్గం ద్వారా శరీరం విడిచిపెట్టాలని నిశ్చయించుకొని యోగాగ్నికి తనదేహాన్ని ఆహుతి చేసింది.

అపరాధి తండ్రియైనా నీతిబోధ చేయడానికి వెనుకంజ వేయని ఉత్తమ తనయ.

శివుడు లేని యజ్ఞానికి అనుమతించి ఆసీనులై కార్యం నిర్వహిస్తున్న వారిని శపించక, ఆమె కోపాన్ని నిగ్రహించుకొని ధర్మాధర్మ బోధతో శివతత్త్వాన్ని తెలియజేయటమే ఆమె నిగ్రహానుగ్రహాలు గల్గిన జగజ్జననిగా స్పష్టమవుతుంది.

జన్మకారకుడైన దక్షుని శపించలేక తనకుతానే ఆహుతియై, ధర్మభంగం జరగనివ్వకూడదనే వివేకం సతీదేవి లోకానికి తెలియచేసింది.

సతీదేవి యోగాగ్నిలో దగ్ధమై పోవటం చూచి దేవతలు హాహాకారాలు చేస్తూ దక్షుణ్ణి నిందించారు. సతీదేవుని గూర్చి అభిమానవతి, అత్యంత పూజ్యురాలని అభినందించారు,

పరమేశ్వరుడు తన శిరస్సులో జటను పీకి వీరభద్రుడిని సృష్టించి, వీరభద్రుని సృజించి దక్ష సంహారం గావించి, దక్షయజ్ఞం ధ్వంసం చేసి తన సర్వ స్వతంత్రతని చాటుకొని లోకానికి శివతత్త్వాన్ని వెల్లడి చేశాడు.

బ్రహ్మ తత్త్వం కంటె శివతత్త్వం మిన్నయని సతీదేవి యోగాగ్నికి ఆహుతియై లోకానికి స్పష్టం చేసింది.

ఆంధ్రభాగవతమందు సతీదేవి పాత్ర సహజ పండితుడైన పోతన అత్యంత సహజంగా చిత్రీకరించాడు. సతీదేవి అభిమానవతి. పాతివ్రత్యంతో పరమశివుని అర్ధనారీశ్వరుని చేసి మహిళా లోకానికే సత్కీర్తినిచ్చి  సమాన హక్కుని (స్త్రీ పురుష) ఏర్పరిచిన దేవతామూర్తి. శబ్ద స్వరూపుడైన శివునికి అర్ధాంగియై, అర్ధ స్వరూపమై జగజ్జననిగా ఖ్యాతి గాంచింది. పతిని అవమానించిన తండ్రి తనయగా జీవించకూడదని నిర్ణయించి యోగాగ్నికి ఆహుతియై దక్షుని కళ్ళు తెరిపించిన అభిమాన వతి. పతిలో అర్ధ భాగమైన సతి స్త్రీ స్వతంత్ర ప్రతిపత్తిని తొలిగా లోకానికి చాటిన ఆదర్శ వనిత.

## 10. పార్వతి

దక్ష పుత్రికయైన సతీదేవి తన శరీరాన్ని అగ్నికి ఆహుతి గావించి హిమవంతునికి 'పార్వతి' గా జన్మించింది. ప్రళయకాలంలో ప్రసుప్తమైన శక్తి, సృష్టికాలంలో ఈశ్వరుని చేరే విధంగా పూర్వం తన హృదయేశ్వరుడైన పరమేశ్వరుని అనన్య భజన పరాయణుడైన వానిని ఏకైక శరణ్యుడు. ప్రియతముడైన శంభునే వరించింది.

*వ. "అంత దాక్షాయని యయిన సతీదేవి పూర్వ కళేబరంబు విడిచి హిమవంతునకు*
*మేనకయందు జనియించి విలయకాలంబున బ్రసుప్తంబయిన శక్తి సృష్టి కాలంబున నీశ్వరుని*
*'బొందు చందంబున బూర్వదయితుండగు రుద్రుని వరియించెనని ... ... ... ... ... ... ... ... ...*
*... ... ... ... ... ... మైత్రేయుండు వెండియు విదురనకిట్లనియె"*[68]

ఈ పరమశివుని (పార్వతీదేవి) కథను బృహస్పతి తన శిష్యుడైన ఉద్ధవునికి చెప్పాడు. ఉద్ధవుడు మైత్రేయునకు విన్పించాడు. మైత్రేయుడు విదురునికి విన్పించాడు.

## 11. పూర్వచిత్తి (పంచమ స్కంధం)

ఈమె సత్యలోకంలో బ్రహ్మదేవుని సమక్షంలో సంగీతం వినిపించే అప్సరస అంటే అమరకాంత. బ్రహ్మదేవుడు ప్రియవ్రత పుత్రుడు, జంబూద్వీపాధిపతి అయిన అగ్నీధ్రుని భక్తిప్రపత్తులకి పరమానంద భరితుడై పూర్వచిత్తిని కానుకగా పంపాడు.

*వ. "ఇట్లాగ్నీధ్రుండు రాజ్యంబుసేయుచు కొక్కనా'డు పుత్రకాముండై మందరాత్రి సమీపించిన నఖిలో పచారంబుల నేకాగ్ర చిత్తుండై యర్చించినం గమలసంభవుండు సంతసిల్లి తన సమ్ముఖంబున సంగీతంబు సేయు పూర్వచిత్తియను నప్సరోంగనం బంపుటయు".* [69]

పూర్వచిత్తి అందచందాల్లో దేవతలకి కూడ కనువిందు చేయగల సౌందర్యవతి. అగ్నీధ్రుడు పూర్వచిత్తి అందచందాలకు అచ్చెరువంది, ఆమె సౌందర్యాన్ని ప్రస్తుతించి ఆమెకి జీవితం పంచాడు. పూర్వచిత్తి కూడ ఆ రాజేంద్రుని బుద్ధి, రూప, శీల, ఔదార్య విద్యా వయో సంపదలకి వశమయింది. లక్ష సంవత్సరాలు అగ్నీధ్రునితో భూలోకంలో స్వర్గసౌఖ్యాలనుభవించింది.

పూర్వచిత్తి ఆగ్నీధ్రుని వల్ల వరుసగా 1) నాభి 2) కింపురుషుడు 3) హరివర్షుడు 4) ఇలావృత్తుడు 5) రమ్యకుడు 6) హిరణ్మయుడు 7) కురువు 8) భద్రాశ్వుడు 9) కేతుమాలుడు అనే పుత్రులు సంవత్సరానికొకరిగా తొమ్మిది మంది కలిగారు. ఆ పిల్లలని పూర్వచిత్తి రాజ భవనం లోనే వదిలి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయింది.

భర్తప్రేమ సంపూర్ణంగా పొందిన అప్సరస స్త్రీ పూర్వచిత్తి. ఈమె బ్రహ్మలోకానికి వెళ్ళిన అనంతరం కూడా రాజు ఈమెనే స్మరిస్తూ, వేదోక్త కర్మలాచరించి చివరకి భార్య ఉన్న బ్రహ్మ లోకానికి చేరాడు.

పూర్వచిత్తి పుత్రులు మేరు ప్రజాపతి పుత్రికలైన 1) మేరుదేవిని నాభి 2) ప్రతిరూపని కింపురుషుడు 3) ఉగ్రదంష్ట్రని హరివర్షుడు 4) లతని ఇలావృత్తుడు 5) రమ్యని రమ్యకుడు 6) శ్యామని హిరణ్మయుడు 7) నారిని కురువు 8) భద్రని భద్రాశ్వుడు 9) దేవిని కేతుమాలుడు వివాహమాడారు.

## 12. జయంతి

ఋషభుని భార్య. ఈమెకు నూర్గురు పుత్రులు. జ్యేష్టుడు భరతుడు. అతని పేరు మీదనే ఈ దేశానికి భారతదేశమనే పేరు వచ్చింది. దేవేంద్రుని కుమార్తె. ఈమె సంతానం గొప్ప వేదవేత్తలై పుణ్య కర్మలచే పవిత్రులై, వేద పరాయణులై బ్రాహ్మణోత్తములుగా పేరెన్నికగన్నారు.

జయంతి పుత్రుడైన భరతుని పేరుమీదనే మన దేశం భారతదేశంగా ఖ్యాతిగాంచింది.

*సీ. "భూవరుండగు ఋషభుడు తనరాజ్యంబు 'గర్మభూమిగా నాత్మ గాంచి జనుల*
*కందఱకును బ్రియంబగునట్లు కర్మతంత్రంబెల్ల 'దెలుపంగ'దలచి కర్మ*
*ములు సేయుటకు గురువుల యొద్ద వేదంబుసదివి వారల యనుజ్ఞను వహించి*
*శతమన్యు 'డిచ్చిన సతి జయంతీ కన్య'బరి ణయంబైయట్టి పడతివలన*

*తే. భరతు 'డాదిగ సుతుల నూర్వరనుగాంచె*
*నట్టి భరతుని పేరను నవని తలము*
*పురవరాశ్రమ గిరి తరు పూర్ణమగుచు,*
*నమరి భారత వర్ష నామమున మించె"* [70]

## 13. కాళీమాత (షష్ఠస్కంధం)

భాగవతమందు పోతన నిఖిలదేవతా వందనంలో త్రిమూర్తులను, త్రిదేవతలను, గణపతిని ప్రార్థించాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గణపతి సరస్వతి. లక్ష్మి, దుర్గమ్మలను స్తుతించాడు. షష్ఠ స్కంధంలో సింగన సరస్వతి, లక్ష్మి, దుర్గామాతని కాక కాళీమాతను ప్రార్థించాడు. దీనికి దేవి దశనామ శ్లోకం కారణం కావచ్చు.

*"గంగా భవానీ గాయత్రీ కాళీ లక్ష్మీ సరస్వతీ*
*రాజ రాజేశ్వరీ బాలశ్యామలా లలితాదశ॥"*

కాళీమాతని సింగన కందపద్యంలో ఈ క్రింది విధంగా కీర్తించాడు.

*"కాళికి బహుసన్నుతలో*

*కాళికి కమనీయ వలయకర కీలిత కం*

*కాళికి 'దాపస మానస*

*కేళికి వందనము సేసి కీర్తింతుమదిన్"* [71]

మహామునిజన మనో విహారిణి, కరకమల కపాలధారిణి, నిఖిలలోక నమస్కారిణి అయిన కాళీమాతకు కైమోడ్పు కావించాడు.

పూర్వకవి స్తుతి చేస్తూ కవులపాలిటి కల్పవృక్షంగా కాళిదాసుని సింగన వర్ణించాడు. ఆ కాళిదాసు కవితావేశానికి పట్టుకొమ్మ ఆ కాళీమాత. అందుకే సింగన ముగురమ్మల్లో మూడవ అమ్మను కాళీ రూపంలో ప్రార్థించి ఉండి ఉండవచ్చు.

కాళికాదేవికి దాసుడై భార్యచేత తిరస్కరింపబడిన ప్రాకృతుడు సంస్కారియై సంస్కృత లౌకిక వాఙ్మయ కవికులానికి తిలకమై కాళిదాస మహాకవిగా ప్రసిద్ధి చెందాడు. శిథిలపూరణమైన భాగవత గ్రంథంలో షష్ఠస్కంధాన్ని పూరిస్తూ శ్రీవత్సగోత్రోద్భవుడైన సింగన సరస్వతీ దేవి, కాళికాదేవిని స్తుతించి, నారాయణ కవచ ప్రాధాన్యం కల్గిన ఘట్టాలను రచించి ఎనలేని యశో లక్ష్మిని సంపాదించాడు.

సింగన కాళికాదేవి గూర్చి చెప్పిన చిన్న కంద పద్యం కాళీ హృదయాన్ని గుర్తు చేస్తుంది.

1. కాళీ, దక్షిణకాళీచ కృష్ణరూపా పరాత్మికా
   ముండమాలీ విశాలాక్షీ సృష్టి సంహారకారిణీ ॥
2. స్థితిరూపా, మహామాయా యోగనిద్రా భగాత్మికా
   భగసర్పి: పానరతా భగద్వేయా భగాంగజా ॥
3. ఆద్యా సదానవా ఘోరా మహాతేజా కరాళికా
   ప్రేతవాహా సిద్ధిలక్ష్మీరనిరుద్ధా సరస్వతీ ॥
4. నామాన్యేతాని సుభగే యే పఠంతి దినేదినే
   తేషాం దాసస్య దాసోఽహం సత్యం సత్యం మహేశ్వరి ॥

సంస్కృత కవిలోకం కాళిదాసుకి దాసోహమంటే, సింగన షష్ఠస్కంధ పూరణం భాగవత గుర్తింపుకి కారణమై, సింగనకి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది (శ్రీమన్నారాయణ నామ దివ్య వైభవం)

# 14. మారిష

*క. "ఇదె వృక్ష సముద్భవయగు*

*మదిరేక్షణ నాప్సర సి ( గుమారికనిత్తున్*

*వదలక బత్ని 'గ ' జేకొని,*

*ముదమందు'డు పాదపముల మోసము వాయన్"*[72]

ఈమె అప్సరస పుత్రిక. ఈమె పేరు మారిష. వృక్షాల మధ్య జన్మించింది. చంద్రుడు ఈలతాంగిని గూర్చి ప్రాచేతసులకి చెప్పి అర్థాంగిగా స్వీకరించి సంతోషాన్ని పొంది వృక్షాలను కాపాడండి అని చెపుతాడు.

*క. "వారలు పర్యాయంబు*

*నీరేజముఖిన్ వరించి నెరిరమియింపన్*

*ధీరు ( డు ప్రాచేతసు ( డై*

*వారక దక్షుండు పుట్టె వనజజ సము ( డై"*[73]

ప్రాచేతసులు వరుసగా ఆమెని వివాహమాడారు. మారిష వారి వల్ల బ్రహ్మదేవునితో సమానమైన దక్షుని పుత్రునిగా పొందింది.

మారిష జన్మ వృత్తాంతం, పూర్వ జన్మ వృత్తాంతం శ్రీవిష్ణుమహాపురాణం తెనుగు అనువాదంలో ఆవంచ సత్య నారాయణగారు ఈ విధంగా తెలిపారు .

## మారిష జన్మ వృత్తాంతం

కండు మహామునికి ప్రమ్లోచకి జన్మించిన కన్య. ఈమె అయోనిజ ప్రమ్లోచ కండు మహామునిచే బెదిరింపబడి ఆ ఋషిచే ఆమెలో ఏర్పడిన గర్భం మేనుగగుర్పోడువ చెమట రూపంలో ఆమె శరీరం నుండి జనించింది. ఆ గర్భాన్ని వృక్షాలు చేపట్టాయి. సోముడు (చంద్రుడు) ఈమె భవిష్యత్తు తెలిసికొని నేను పెంచనని ప్రాచేతసులతో చెప్పుతాడు.

## మారిష పూర్వజన్మ వృత్తాంతం

ఈమె గత జన్మలో ఒక రాజ పత్ని. పుత్ర సంతానం లేక భర్త గతింప భక్తితో విష్ణువు నారాధిస్తుంది. విష్ణువు ఆమెకి ప్రత్యక్షమై వరం కోరమంటాడు. ఆ రాజపత్ని స్వామీ బాల వైధవ్య

వ్యథకి లోనైన ఆభాగ్యను. నా జన్మ విఫలమైంది నీ అనుగ్రహముతో నాకు కొనయాడ దగిన వారు ప్రతి జన్మయందు భర్తలవ్వాలి. నీ అనుగ్రహంతో కొడుకు కల్గాలి. అతడు ప్రజాపతి వంటి వాడు కావాలి. రూపసంపద గల్గి సర్వజగానికి ప్రియదర్శినినై, అయోనిజనై నీ అనుగ్రహంతో నేను జన్మించాలని పాదాలపై వ్రాలి ప్రణామం చేసింది. ఆమెను లేపి వరదుడైన శ్రీహరి "మహావీర్యులు మహొదర కార్య నిర్వాహకులు పదిమంది మరొక జన్మలో నీకు భర్తలౌతారు. అతి వీర్య పరాక్రమ శాలి, ప్రజాపతి, గుణసంపన్నుడైన, మహాత్ముడైన పుత్రునికూడ నీవు పొందుతావు. ఈ జగంలో అతడు అనేక వంశాలవారికి కర్త అవుతాడు. అతని సంతతి ముల్లోకాలను నింపుతుంది. నీవు అయోనిజవు సాధ్వివి. రూపొదార్య గుణశాలినివై నా ప్రసాదంచే మానవులకి మన:ప్రీతి కలిగించే దానివవుతావని" అంతర్ధాన మవుతాడు.

మారిష శ్రీహరి వర ప్రసాదంచే ప్రమ్లోచ అనే అప్సరస స్త్రీకి కుమార్తెగా జన్మించింది. ప్రాచేతసులు బ్రహ్మదేవునితో సమానమైన దక్షుని పుత్రునిగా పొందింది. ఈమె తపోబలంతో గత జన్మలోనే శ్రీహరిని మెప్పించింది. శ్రీహరిని మెప్పించి బహుభర్తృత్వం గలిగిన మహిళ మారిష.

## 15. సంజ్ఞాదేవి (అదితి వంశం, ష.స్కందం)

అదితి సంతానం ద్వాదశాదిత్యులు. ద్వాదశాదిత్యుల్లో ప్రథముడైన వివస్వంతుని పత్ని సంజ్ఞాదేవి. వివస్వంతుడు, సంజ్ఞాదేవి దంపతులకి శ్రాద్ధ దేవుడైన వైవస్వత మనువు జనించాడు. సంజ్ఞాదేవికి యముడు, యమ అనే కవలలు కూడా పుట్టారు. సంజ్ఞాదేవి ఆడగుఱ్ఱం రూపం ధరించి అశ్వినీ దేవతలకు జన్మనిచ్చింది.

సంజ్ఞాదేవి ఆడు గుఱ్ఱం రూపం ధరించటం వల్ల కామరూప విద్యలు స్త్రీలలో కూడ ఉన్నట్లు తెలుస్తుంది. అశ్వనీదేవతలు దేవ వైద్యులుగా ప్రసిద్ధి.

వ. "ద్విమూర్ధుండను ... ... ... ... ... ... ... ... ... " ఆ యదిత వంశం బును విదితంబుగా వినిపించెద, సావధానుండవై వినుము. వివ స్వంతుండును, అర్యముండును, పూషుడును, త్వష్టయు, సవితయు, భగుండును, ధాతయు, విధాతయు, వరుణుండును, మిత్రుండును, శక్రుండును, ఉరుక్రముండును నరు ద్వాదశాదిత్యులై జన్మించి. అందు వివస్వంతునకు శ్రాద్ధదేవుండను మనువు సంజ్ఞాదేవి యందు

నుదయించె మఱియు యముండు, యమి అను నిరువురు మిధునంబుగా నొందిరి. మఱియు నా సంజ్ఞాదేవి బడబాస్వరూపంబు నొంది యశ్వినీ దేవతలంగనె" ... ... ... ... ... ... " [74] శుకయోగీంద్రునకు బరీక్షన్నరేంద్రుండిట్లనియె.

ఈమె సత్సంతానం పొందిన పుణ్యస్త్రీ. జ్యేష్ఠపుత్రుడైన వైవస్వతమనువు భూలోకాన్ని పాలించి మనువంశంలో ఖ్యాతిగాంచాడు. యముడు సమవర్తియై నరకలోకానికి రాజై దుష్ట శిక్షణని "ధర్మ బద్ధంగా నెరవేర్చే మహోన్నత వ్యక్తి (ద్వితీయ పుత్రుడు). కనిష్ఠ పుత్రులైన అశ్వనీ దేవతలు దైవ వైద్యులై దేవలోకంలో విశేష మన్ననలందుకున్నారు. "పుణ్యం కొలది పురుషుడు, దానం కొలది బిడ్డలు" అన్న లోకోక్తికి ఉన్నతంగా నిలిచిన ఆదర్శ మహిళ.

## 16. ఛాయాదేవి

ఈమె కూడ వివస్వంతుని భార్య. ఈమెకి శనైశ్చరుడు, సావర్ణి అనే మనువు, తపతి అనే కన్య ఉదయించారు. ఈమె జ్యేష్ఠ పుత్రుడు శనైశ్చరుడు నవగ్రహాల్లో శనిగ్రహంగా రాశి చక్రంలో తనదైన శక్తి సామర్థ్యాన్ని లోకానికి చాటుతున్నాడు. సావర్ణి మనువు భూమండలాన్ని ధర్మబద్ధంగా పాలించి తన ఉనికిని చాటాడు.

వ. "ద్విమూర్ధుండును ... ... ... ... ... ... " చాయాదేవి యందుశనై శ్చరుండును, సావర్ణియను మనువును, దపతియను కవ్యక యుం బుట్టిరి. ... ... ... ... ... ... ... ... శుకయోగీంద్రునకుం బరీక్ష న్నరేంద్రుండిట్లనియె." [75]

## 17. తపతి

ఈమె ఛాయా వివస్వంతుల ప్రియతనయ. ఈమె సంవరుణుడనే రాజు భార్య. తపతీ సంవరణో పాఖ్యానమనే గ్రంథం కూడ తెలుగు సాహిత్యంలో ఉంది. దీన్ని బట్టి ఈ దంపతుల ప్రాముఖ్యం వెల్లడౌతుంది. భాగవతంలో మాత్రం అదితి వంశవర్ణనలో నామ మాత్రంగా ఈమె విషయం ప్రస్తావనకి వచ్చింది.

## 18. మాతృక

ద్వాదశాదిత్యుల్లో ఒకడైన అర్యముడి పత్ని. అర్యముడికి మాతృకతో చర్షణులు ఉదయించారు. వివేక జ్ఞానం కలవారైనందున వానిని ఆధారంగా చేసికొని బ్రహ్మ మానవ జాతిని సృజించారు. ఆచర్షణుల మూలాన మనుష్య జాతి భూలోకంలో స్థిరంగా ఉండేందుకు బ్రహ్మదేవుడు ఏర్పాటు చేశాడు. మానవ జాతికి మూలమైన మాతృమూర్తి మాతృక.

## 19. శచీదేవి

ఈమె దేవేంద్రుని ఇల్లాలు. ద్వాదశాదిత్యుల్లో ఇంద్రుడు 11వ వాడు శచీ దేవేంద్రులకు జయంతుడు, ఋషభుడు, విదుషుడు అనే కుమారులున్నారు. వృత్రాసురుని సంహరించిన దేవేంద్రుని బ్రహ్మ హత్యాపాతకం వెంటాడింది. దేవేంద్రుడు మానస సరస్సులో తామరతూడులోని సన్నని తంతువుల్లో కలిసి అదృశ్యరూపుడిగా ఉండిపోతాడు.

ఆ సమయంలో స్వర్గానికి నహుషుడు అధిపతియై దేవేంద్రుని భార్యను కాంక్షించాడు. "నీ భర్త ఇంద్రుడు వచ్చే పర్యంతం నీవు నాకు భార్యగా ఉండుమ"ని శచీదేవిని కోరతాడు. శచీ దేవి దేవ గురువైన బృహస్పతి సూచనానుసారం "నీవు బ్రహ్మర్షులు మోస్తున్న పల్లకీని ఎక్కి నాదగ్గరికి వస్తే నీ కోరిక నెరవేరుతుంద"ని పలుకుతుంది.

నహుషుడు శచీదేవి చెప్పిన ప్రకారం బ్రహ్మర్షుల చేత తన పల్లకీ మోయించుకొని అగస్త్య మహర్షి శాపానికి పాత్రుడై కొండచిలువ రూపం ధరించి స్వర్గ భ్రష్టుడయ్యాడు.

*వ. "ఇట్లతి వికృత రూపంబుతో... ... ... ... ... ... ... ... ... బ్రహ్మ హత్యా విమోచనంబు 'జింతించికొనుచు సహస్రవర్షంబు లుండె. ఆ చండాలియు నది పరమేశ్వర దిగ్భాగంబగుటం చేసి యందుం జొరరాక కాచియుండె. అంతకాలంబు ద్రిదివంబున నహుషుండు విద్యా బల తపోబల యోగ బలంబులం చాలిం చుచుండి. సంపదైశ్వర్య మదాంధుండై, యింద్రపత్నిం గోరి, యింద్రుండు వచ్చునందాక నాకుం బత్నిని గమ్మనిన, నా శచీ దేవియును బృహస్పతి ప్రేరితయై. బ్రహ్మర్షి వాహ్య శిబికంబు నెక్కివచ్చి, నన్ను భోగింపుమనిన, నతండట్లు చేసి, కుంభ సంభవ శాపహతుండై, యజగర యోనియందు బుట్టె" ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... అప్పుడు.* [76]

పతివ్రతయైన స్త్రీని కాంక్షించి అధికారగర్వంతో అనుభవించాలని చూసే వ్యక్తి విద్యాబలం, యోగ బలం కలవాడైనప్పటికి వినాశనం పొందక తప్పదని శచీదేవి పాత్ర మనకు తెలియజేస్తుంది. దేవతా స్త్రీలల్లో త్రిదేవతల తర్వాత శచీదేవికే పతివ్రతగా గౌరవస్థానముంది.

## 20. పృశ్ని (సూర్య వంశం)

ద్వాదశాదిత్యుల్లో ఐదవ వాడైన సవిత పత్ని ఈమె. ఈమెకి సావిత్రి, వ్యాహృతి, త్రయి అనే పుత్రికలు అగ్నిహోత్రుడు, పశుయాగము, సోముడు, పంచ మహాయజ్ఞాలనే పుత్రులనీ కన్నది. పృశ్ని సంతానవతియై, దేవతారాధనకి, సత్క్రతులకి స్థానమై లోకాన్ని సంతసింప చేసి. దేవతలను సంప్రీతులని గావించి లోక మాతగా శాశ్వత చిరకీర్తి నార్జించి సూర్య వంశానికే వన్నె తెచ్చిన వనిత. త్రేతాయుగంలో యజ్ఞం చేయటం ధర్మం. ఆ ధర్మకార్యానికి అవసరమైన సంతానాన్ని లోకానికి అందించి, ధర్మప్రతిష్ఠకి నాంది పలికిన నారీమణి.

## 21. సిద్ధిక

అదితి పుత్రుల్లో (ద్వాదశాదిత్యుల్లో) ఆరవ వాడైన భగుని భార్య సిద్ధిక. ఈమెకి మహిముడు, విభుడు, ప్రభుడనే పుత్రులు, ఆశిష అనే కుమార్తె ఉన్నారు.

## 22. క్రియ

ద్వాదశాదిత్యుల్లో ఎనిమిదవ వాడైన విధాత పత్ని. ఆమె పురీష్యాదులైన అగ్నులను ప్రసవించింది. ఈమె అగ్నులని ప్రసవించినందువల్లనే యజ్ఞకార్యాలు జరిగాయి. లోక ధర్మాన్ని నిలబెట్టడానికి కారణమైన ఈమె సుప్రజ సచ్చరిత్ర.

## 23. చర్షిణి

ద్వాదశాదిత్యుల్లో తొమ్మిదవ వాడైన వరుణుని పత్ని ఈ చర్షిణి. ఈ దంపతులకి పూర్వం బ్రహ్మ పుత్రుడైన భృగువు, వల్మీక సంభవుడైన వాల్మీకి పుత్రులయ్యారు.

## 24. కీర్తి

అదితి పుత్రుల్లో పన్నెండవ వాడు వామనుడనే త్రివిక్రమ దేవుని భార్య కీర్తి. త్రివిక్రమ దేవునికి కీర్తి దంపతులకి బృహత్ శ్లోకుడుదయించాడు. కీర్తి సాక్షాత్తు శ్రీమహా విష్ణువు భార్యయై పుత్ర పౌత్రులతో భువిలో విరాజిల్లిన సౌభాగ్యవతి.

## 25. గౌరీదేవి

వెండి కొండపైన, కొండంత దేవుడు. దేవేంద్ర బ్రహ్మాది దేవతలు సేవలందుకుంటూ గిరిజా సమేతంగా కొలువు తీరిన పరమేశ్వరుని చిత్రకేతువు తిలకించాడు (గంధర్వరాజు)

*శా. "ఆ విద్యాధర భర్తగాంచె హర నీహారామృతాహాసమున్*
*శ్రీ విభ్రాజితమున్ నిరస్త గిరిజా సేవాగతా యాసమున్*
*దేవానీక వికాసమున్ శుభ మహాదేవాంఘ్రి సంవాసమున్*
*భూవిఖ్యాత విలాసముం ద్రిభువనీ పూతంబు గైలాసమున్"* [77]

*క. ఆరజత భూధరంబున,*
*నీరేజ భవామరాది నికరముగొల్వం*
*బేరొలగమున నుండిన*
*గౌరీయుతు ( డయిన హరునింగనియె నరేంద్రా!* [78]

బ్రహ్మాది సుర నికర సేవితుడై అంక పీఠంపై ఉన్న భవానిని కౌగిట చేర్చి నిండుకొలువున పరమేశ్వరుని పరికించి చిత్రకేతుడు జగన్మాత భవాని వినే విధంగా పకపక నవ్వాడు.

*సీ. "కొమరొప్ప ( గా లోకగురుండును గడలేని ధర్మ స్వరూపంబు ( దానయగుచు*
*జడలు ధరించియు సరిలేని తపమున ( బొడవైన యీ యోగిపుంగవులును*
*బ్రహ్మవాదులు ( గొల్వ భాసిల్లు కొల్వులో మిధున రూపంబున మెలంతతోడ*
*బ్రాకృతుండును బోలె బద్ధానురాగు ( డై లాలితుండయ్యె నిర్లజ్జతనిట*
*ఆ. నకట! ప్రకృతి పురుషు ( డైన ( దానేకాంత, మందు సతులతోడ నలరుంగాని*
*యిట్లు ధర్మ సభలనింతులతో ( గూడి, పరిఢవింపలే ( డు భ్రాంతినొంది."* [79]

సకల లోకజనకుడు, సర్వధర్మ స్వరూపుడైన పరమేశ్వరుడు జటాధారియై, బ్రహ్మవేత్తలు పరివేష్టించి సేవిస్తున్న ఈ మహాసభలో మాములు మానవునివలె ప్రేమ వివశుడై, నిర్లజ్జగా భార్యను కౌగిలించు కొని కూర్చున్నాడు. ఇదెక్కడి చోద్యము?

చిత్రకేతు పరిహాస వచనాలు విని పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వాడు.

పరమేశ్వరుని పరిహసిస్తున్న చిత్రకేతుని, జగన్మాత భవాని శివతత్త్వాన్ని, విష్ణుతత్త్వాన్ని గుర్తు చేసుకొని, పరమేశ్వరుని పరిహసించిన పాపానికి ఫలంగా పాప కార్యాలకి నెలవైన రాక్షస జాతిలో జన్మించమని శపించింది.

ఈ సంఘటన పరమేశ్వరునిపై ఎవరికి పరిహాసం కూడదని పరిహసిస్తే, పతిదేహంలో సగభాగం స్వీకరించిన గౌరీదేవి ఆగ్రహానికి గురౌతారని వెల్లడవుతుంది.

## గౌరీదేవి పలికిన పరమేశ్వర తత్త్వం

సీ. "ఎవ్వని పద పద్మమింద్రాది విబుధుల, చూడాగ్ర పంక్తుల నీడ 'జూచు,
నెవ్వని తత్త్వంబ దెనయంగ బ్రహ్మాది, యోగిమానపంక్తి నొలలాడు,
నెవ్వని రూపంబు నేర్పాటుగానక వేదంబులందంద వాదమడుచు
నెవ్వని కారుణ్య మీలోకముల నెల్ల ( దనిపి యెంతయు ధన్యతముల 'జేయు

*తే. నట్టి సర్వేశు ( బాప సంహారుధీరు*
*శాశ్వతైశ్వర్యు నాత్మసంసారునీశు*
*నెగ్గు పల్కిన పాపాత్ము ( డెల్ల భంగి,*
*దండనార్హుడు గాకెట్లు దల ( గంగల ( డు?"* [80]

పరమేశ్వరుని పాదపద్మాలు, ఇంద్రాది దేవతల కిరీట కాంతులతో విరాజిల్లుతాయి. బ్రహ్మాది మహాయోగులు కూడ దేవదేవుడైన పరమేశ్వరుని సత్య స్వరూపాన్ని తెలుసుకోవటానికి వాదులాడుతుంటారు. దయాహృదయుడైన పరమేశ్వరుని కరుణా కటాక్ష వీక్షణం ఈ లోకాలన్నింటికి రక్షణ కల్పించి, లోకులను ధన్యులను కావిస్తుంది. సర్వేశ్వరుడు, పాపసంహారుడు, ధీరోదాత్తుడు, నిత్యకళ్యాణుడు, జగత్కుటుంబుడు, జగదీశ్వరుడు అని గౌరీదేవి పరమేశ్వర తత్త్వాన్ని తెలియచేసింది.

## గౌరీదేవి పలికిన విష్ణుతత్త్వం

చిత్రకేతువు పరమేశ్వరుని చేసిన పరిహాసాన్ని విని వీడు విష్ణుపాద సేవకి అర్హుడు కాదని చిత్రకేతువుని నిందించే నిందావాక్యాలతో పాటు విష్ణుతత్త్వాన్ని విష్ణు పాదసేవార్హతని వెల్లడిచేసింది.

*తే. "నిఖిల లోకాశ్రయంబు సన్నిహిత సుఖము*
*సకల భద్రైక మూలంబు సాధుసేవ్య*
*మైన కంజాక్షు పాద పద్మార్చనంబు*
*ననుసరింపంగ ఖలుడు వీడర్హు(డగునె?"* [81]

శ్రీవిష్ణుపాద పద్మారాధనం సకల శుభాలకి మూలం. అర్థించిన వెనువెంటనే సుఖాన్నిచ్చేది. సకల శుభాలకి మూలకారణం. సజ్జనులు సేవింపదగిందని విష్ణుపాద సేవారతిని, విష్ణుపాద సేవ వల్ల కలిగే ఫలాన్ని, శివకేశవ భేద భావరహితంగా గౌరీదేవి వెల్లడించింది. పరమేశ్వరుని పరిహసించిన వాడు విష్ణుపాద పద్మారాధనకి కూడ అనర్హుడని తేల్చింది.

## బోళాశాంకరి

చిత్రకేతు స్వభావాన్ని పరమేశ్వరుడు తెలియచేశాడు. గౌరీదేవి ప్రసన్నురాలైంది.

అష్టమస్కంధంలో హాలాహల భక్షణంలో బ్రహ్మాది దేవతలు శివుని హాలాహలం నుండి రక్షించమని శరణువేడారు. శివుడు హాలాహల భక్షణకి సిద్ధమయ్యాడు. అయినా సర్వమంగళ నివారించలేదు సరికదా లోకరక్షణ కోసం (దేవ దానవులు) హరుని హాలాహలాన్ని మ్రింగమంది,

*క. "మ్రింగెడువా(డు విభుండని*
*మ్రింగెడిదియు గరళమనియు మేలనిప్రజకున్*
*మ్రింగుమనె సర్వమంగళ*
*మంగళ సూత్రంబునెంతమది నమ్మినదో!"* [82]

## అవినాశిని - ఆర్యామహాదేవి

రుక్మిణీదేవి ద్వారకకి శ్రీకృష్ణుని వద్దకు అగ్నిద్యోతనుని పంపించి దైవ నిర్ణయం ఎలా ఉంటుందోనని ఆలోచిస్తుంది.

*మ. "ఘనుడా భూసురు(డేగెనో? నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో*
*విని కృష్ణుండిది తప్పుగా దలచెనో? విచ్చేసెనో? యీశ్వరుం*
*డను కూలింప(దలంచునో తల(పడో? యార్యామహాదేవియున్*
*నను రక్షింపనెఱుంగునో యెఱు(గదో? నా భాగ్యమెట్లున్నదో?"* [83]

పూజ్యురాలైన ఆర్యా మహాదేవి నన్ను రక్షిస్తుందో? లేదో? తనభాగ్యం (అదృష్టం) ఎలా ఉందోనని సందేహంతో రుక్మిణి గౌరీదేవి ఆలయానికి వెళ్ళి ఆది దంపతులను అర్థిస్తుంది.

*ఉ. "నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్*

*మిమ్ము( బురాణ దంపతుల మేలుభజింతు గదమ్మ! మేటిపె*

*ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరింబతి సేయు మమ్మనిన్*

*నమ్మిన వారికెన్నండును నాశము లేదు గదమ్మయీశ్వరీ!"*[84]

గౌరీదేవిని నమ్మినవారికి నాశనమనేది లేదని అవినాశిని అయిన ఆర్యామహాదేవిని స్తుతించి (శివకామినికి) వందనం చేసి గుడి నుండి బయటకి రాగానే శ్రీకృష్ణుని దర్శించింది. రాక్షస వివాహ పద్ధతిలో శ్రీకృష్ణుడు రుక్మిణిని రథమెక్కించుకొని పాంచజన్యం పూరిస్తాడు.

రుక్మిణి చేసిన గౌరీదేవి ప్రార్థనలో సనాతనులు, పురాణదంపతులు, పార్వతీ పరమేశ్వరులు లేదా ఉమామహేశులు లేదా గౌరీ శంకరులు, తల్లుల్లో పెద్దతల్లి (మేటి పెద్దమ్మ) దయాసముద్ర, గౌరమ్మను నమ్మిన వారికి నాశనం లేదన్న విషయం వెల్లడించింది.

**నిత్యసుఖప్రదాయిని**

ద్వాదశ స్కంధంలో మార్కండేయోపాఖ్యానంలో

*చ. "నిలిచిన శంకరుంగనియు నిత్యసుఖంబులనిచ్చు గౌరియి*

*మ్ముల 'హర' భూతి భూషణ సముజ్జ్వల గాత్రుని గంటె యెంతయున్*

*వలనుగ వానితోడనొక వాటపు మాటను బల్క( గా దగున్*

*సలలితమైన యీతపసి జాడ వినంగడువేడ్క యయ్యెడిన్"*[85]

ఈ పద్యంలో "నిత్య సుఖంబులనిచ్చుగౌరి" అనే పద ప్రయోగం అష్టాదశ శక్తి పీఠాల్లో, గయలో నిలయమై ఉన్న మాంగల్యగౌరి స్తోత్రాన్ని గుర్తు చేస్తుంది.

"సర్వ మంగళ మాంగల్యా గయామాంగల్య గౌరికా।

అర్థదామోక్షదాదేవి అక్షయ్య ఫలదాయినీ ॥

తపస్సు చేస్తున్న మార్కండేయుని చూసి శాశ్వత సుఖప్రదాత్రి గౌరీదేవి శంకరునితో విభూతియే విశేషాలం కారంగా విలసిల్లుతున్నశరీరం గల ఈ తపస్విని చూశావా? వానితో ఒక మంచి మాట పలకడం బాగుంటుందని భక్తవత్సల బోళాశాంకరి, బోళాశంకర భక్తుని పలకరించాలని పతీ సమేతంగా భువికి దిగింది.

ఈశ్వరుడు దివ్య యోగమాయనుపయోగించి మార్కండేయుని హృదయంలో ప్రవేశిస్తాడు.

*వ. "అనిన శంకరుండును శాంకరీ సమేతుండయి ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...*

*"తన దివ్య యోగ మాయా ప్రభావంబు చేత నతని హృదయంబునం బ్రవేశించి చతుర్బాహుండును, విభూతి రుద్రాక్ష మాలికా ధరుండను త్రిశూలడమరుకాది దివ్యసాధన సమేతుండును, వృషభవాహనా రూఢుండును నుమాసమేతుండునై" ... ... ... ... ... ... ... శౌనకుండిట్లనియె"* [86]

*దర్శనమిస్తాడు*

పరమేశ్వరుడు మార్కండేయుని తపోమహిమని ప్రశంసిస్తాడు. మార్కండేయుడు నారాయణుని పాద పద్మాలను ధ్యానించే బుద్ధిని, మరణాన్ని జయించే శక్తిని అనుగ్రహించమని ప్రార్ధిస్తాడు.

దయా సముద్రుడైన ఈశ్వరుడు మార్కండేయుని కోరికను అనుమతించి, జరా రోగ రహితంగా కోటికల్పాల వరకు ఆయుర్దానం చేసాడు.

గౌరీదేవి నారాయణ తత్త్వాన్ని చెప్పటమే కాక, శివ స్వరూపం దాల్చిన జీవుడు నారాయణా నుగ్రహానికి ఆర్తితో ఉంటాడని ఆ ఆర్తికి శివానుగ్రహం ఉంటుందని, శివకేశవులొకటే నన్న సత్యాన్ని లోకానికి వెల్లడిచేసింది. శివకేశవ భేద రహిత స్థితిని పొందిన జీవుడే శాశ్వత తత్త్వాన్ని తెలుసుకుంటాడని నిత్య సుఖ ప్రదాయిని (శాశ్వత సుఖ ప్రదాయిని) గౌరీదేవి లోకానికి స్పష్టం చేసింది.

*"ఉమా కాత్యాయనీ గౌరీకాళీ హైమవతీశ్వరీ!"* [87]

*"శివా భవానీ రుద్రాణీ శర్వాణీ సర్వమంగళా!*
*అపర్ణా పార్వతీ దుర్గామృడానీ చణ్ణికామ్బికా ॥"* [88]

పలునామాలున్న పరాశక్తి (ప్రధమ స్కంధంలో) భాగవతమారంభంలో దుర్గమ్మగా పోతనకి మహత్త్వ కవిత్వ పటుత్వ శక్తి నిచ్చి, చతుర్ధస్కంధంలో దాక్షాయణిగా 'దక్షయజ్ఞం'లో శివశక్తిని నిరూపించి, పార్వతిగా పరమేశ్వరుని వరించి షష్ఠస్కంధంలో (సింగన) గౌరీదేవిగా పరమేశ్వర తత్త్వాన్ని విష్ణుపాద పద్మారాధన సేవ ఫలితాన్ని గుర్తు చేయించి, అష్టమ స్కంధంలో సర్వమంగళగా హాలాహల

బారి నుండి లోకాన్ని రక్షింపచేసి, అమృతాన్ని రప్పించి, దశమస్కంధంలో శ్రీకృష్ణకథా ప్రధానమైన భాగవతంలో ఆర్యామహాదేవిగా రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం జరిపించి (ద. స్కంధం ఉ.భాలో శ్రీకృష్ణ ఉనికిని పుర ప్రజలకు తెలిపి) మృత్యుంజయుడైన మార్కండేయుని పలకరించటానికి, నిత్య సుఖాన్నివ్వటానికి భువికి దిగి భాగవతులకు కొండంత అండయై, భాగవతాన్ని లోకానికి అందించి లోకమాత అయింది. అణిమాది అష్ట సిద్ధులనిచ్చే ఆదిపరాశక్తి 8 సందర్భాల్లో భాగవతంలో ప్రస్తుతింపబడింది.

## 26. సూనృత (అష్టమ స్కంధం)

ధర్మదేవత భార్య, మూడవ మనువు (ఉత్తముడు) కాలం. విష్ణువు ఈ దంపతులకి సత్యసేనుడనే పేరుతో పుత్రుడిగా ఉదయించాడు. స్వర్గరాజైన సత్యజిత్‌తో కూడి దుష్టులైన యక్ష రాక్షస భూతగణాలను వధించాడు. ఈమె దేవజాతి. దుష్ట శిక్షకుడు, శిష్టరక్షకుడైన జగదీశ్వరునికే జన్మనిచ్చిన ఈమె జన్మధన్యం. ఈమె సార్థక నామధేయురాలు. సత్యస్వరూపుడైన శ్రీమహా విష్ణువుకి జన్మనిచ్చి శాశ్వతకీర్తి సముపార్జించిన ఆదర్శవనిత.

సీ. "మనువు మూ (డవ వాడు మనుజేంద్ర! యుత్తముండన ( బ్రియవ్రతునకు నాత్మజుండు
పాలించె నిల యెల్ల (బవన సృంజయ యజ్ఞ హెూత్రాదులాతని పుత్రులధిక
గుణులువసిష్ఠుని కొడుకులు ప్రమదాదులైరి సప్తర్షులు సమర విభు'డు
సత్యజిత్తనువా (డు సత్యభద్రాద్యులు సురలు ధర్మునికి సూనృతకును

*తే. బుట్టి సత్యనియతి ( బురుషోత్తముడు సత్య*
*సేనుండనగ దుష్టశీల యుతుల*
*దనుజ యక్షపతుల దండించె సత్య జి*
*న్మిత్రుండన ( గ జగము మేలనంగ"* [89]

## 27. హారిణి

హరిమేధుని భార్య. నాల్గవ మనువు కాలం (తామసుడు). హరి నామంతో ఈ దంపతులకి విష్ణువు జన్మించాడు. గజేంద్ర రక్షణ కావించింది ఈ అవతారంలోనే. సర్వభూతదయాశాలియైన 'హరి'ని కన్న హరిణి జన్మ చరితార్థం.

*సీ. "మానవాధీశ్వర! మనువు నాల్గవ వా'డు తామసుండన'గ నుత్తముని భ్రాత*
*పృథ్వీపతుల కేతు వృష నర ఖ్యాత్యాదులతని పుత్రులు పద్గురధిక బలలు*
*సత్యక హరి వీరసంజ్ఞులు వేల్పులు త్రిశిఖ నామమువా'డు దేవవిభు ( డు*
*మునులు జ్యోతిర్వ్యోమ ముఖ్యులు, హరిపుట్టె హరిమేధునకు 'బ్రీతి హరిణియందు.*

*ఆ. గ్రాహబద్ధు ( డయిన గజరాజు విడిపించి,*
*ప్రాణ భయము వలన ( బాపికాచె*
*హరి దయాసముద్రు ( డఖిల లోకేశ్వరు*
*డనిన శకుని ( జూచి యవని విభు ( డు"* [90]

## 28. సరస్వతి

ఈమె వేదగుహి భార్య. ఈ దంపతులకి సార్వభౌముడనే పేరుతో విష్ణువు జన్మిస్తాడు. ఈ అవతారంలో దేవేంద్రుని పదవి నుండి తొలగించి బలిచక్రవర్తిని ఇంద్రపదవిలో నిలుపుతాడు.

*సీ. "బలిమున్న నాకంబు బలిమిమై ( జేకొన్న వామనుండై హరి వచ్చి వేడ'.*
*బాదత్రయంబిచ్చి భగవన్ని బద్ధుడై సురమందిరము కంటె సుభగమైన*
*సుతల లోకంబున సుస్థితి నున్నా ( డు వెతలేక యటమీ ( ద వేదగుహికి*
*నా సరస్వతికి ( దానట సార్వభౌముండు నా ( బ్రభువయి హరి నాక విభుని (*

*ఆ. "బదవిహీను ( జేసి బలి ( దెచ్చినిలుపును,*
*బలియు నిర్జ కరేంద్రు పదము నొందు,*
*నింద్ర పదము హరికి నిచ్చిన కతమున,*
*దాన ఫలము సెడదు ధరణినాధ!"* [91]

## 29. విభూచి

*ఆ. "విశ్వ సృజుని యింట విభు ( డు విభూచికి*

*సంభవించు నంశ సహితు ( డగుచు (*

*జెలిమి శంభు తోడ ( జేయు విష్వక్సేను'*

*డనంగ జగము ( గాచు నవనినాధ!"* [92]

ఈమె విశ్వసృజుని భార్య. ఈ దంపతులకు విష్ణువు, విష్వక్సేనుడనే నామంతో అంశావతారుడై జన్మించి, శంభునికి చెలికాడై మూడు లోకాలను సంతోషంగా పాలిస్తాడు.

## 30. సూనృత

*ఆ. "జలజ లోచనుండు సత్య తపసూనృ,*

*తలకు సంభవించు ( దనయుండగుచు*

*ధరణి ( గాచు నంచిత స్వధామాఖ్యుండై,*

*మనువు సంతసింప మానవేంద్ర"* [93]

పన్నెండవ మనువు కాలంలో ఈమె సత్యతపుని భార్య. ఈ దంపతులకు స్వధాముడనే పేరుతో విష్ణువు జన్మిస్తాడు. మనువుకి సంతోషం కలిగేటట్లు లోకాన్ని సంరక్షిస్తాడు.

## 31. బృహతి

*ఆ. "ధరణి దేవహోత్రదయితకు బృహతికి*

*యోగ విభు ( డు నా ( గనుద్భవించి*

*వనజ నేత్రు ( డా దివస్పతికెంతయు,*

*సౌఖ్యమాచరించు జగతి నాధ!"* [94]

దేవహోత భార్య. ఈ దంపతులకు యోగవిభుడనే పేరుతో విష్ణువు జన్మించి. దివస్పతికి మిక్కిలి సహాయం చేస్తాడు.

## 32. వితాన

*తే. "తనర సత్రాయణునకు వితానయందు*

*భవము నొందెడి హరి బృహద్భాను ( డన ( గ*

*విస్తరించు గ్రియాతంతు విసరములను,*

*నాక వాసులు ముదమంద నరవరేణ్య!"*[95]

పదునాల్గవ మనువుకాలం. ఈమె సత్రాయణుని భార్య. ఈ దంపతులకు బృహద్భానుడనే పేరుతో హరి పుట్టి దేవతలు సంతోషించే విధంగా క్రియా కలాపాలను పెంపొందిస్తాడు.

## 33.మోహిని

క్షీరసాగర మధనంలో ధన్వంతరి అనే దివ్య పురుషుడు అమృత కలశంతో ఆవిర్భవించాడు. దేవతలను త్రోసివేసి అమృతకలశాన్ని రాక్షసులు అందుకున్నారు. దేవతలు శ్రీమహావిష్ణువును ఆశ్రయించి మొరపెట్టుకున్నారు. ఆశ్రిత వత్సలుడైన శ్రీమహావిష్ణువు దేవతలకి అమృతం పంచడానికి జగన్మోహనుడు, జగన్మోహినిగా మారి రాక్షసులను మాయ చేయవలసి వచ్చింది.

ఏడేడు లోకాలవేల్పే జగన్మోహినిగా అవతరించినపుడు ఆమోహంలో (మాయలో) పడని వారుంటారా? అలాంటిది తమోగుణ ప్రవృతి గల రాక్షసుల గురించి చెప్పవలసినదేముటుంది? జగన్మోహనుని మోహినీత్వాన్ని దర్శించిన రాక్షసులు అమృతకలశం ఆమె చేతిలో పెట్టి భేదబుద్ధి లేకుండా మా ఉభయులకు పంచిపెట్టమని హెచ్చరించారు.

### జగన్మోహనుని మాయ

మోహినీ రూపంలో ఉన్న మహావిష్ణువు తన సౌందర్యంతో రాక్షసులను పరవశులను చేసాడు. నేను అందమైన మగవారిని ప్రేమిస్తాను. అందగత్తెలను నమ్మి పెద్దలు దరిచేరరు కదా? మీకు నాపై నమ్మకం కుదిరిందా? అందగత్తెల మాటలు నమ్మటం వేద సమ్మతం కాదని వేదోద్ధారకుడే మోహినీ రూపంలో రాక్షసులకు ఈ క్రింది పద్యంలో తెలియజేస్తాడు.

*క. "పలుకులు మధురస ధారలు*

*దలంపులు నానా ప్రకార దావానలముల్*

*సెలములు సాలావృకములు*

*చెలువల నమ్మటలు వేద సిద్ధాంతములే!"*[96]

నాశక్తి కొద్ది మీకు అమృతాన్ని చక్కగా పంచుతాను. అనుమానం విడవండని పరిహాసంగా పలికాడు. రాక్షసులు మోహినీ సౌందర్య సందర్శనంలో పరవశులై మైమరచి అమృత కలశాన్ని ఆ

చక్కని చుక్క చేతిలో పెట్టారు. మోహంతో మైమఱచిన రాక్షసులకు తగిన శాస్తి జరిగింది.

తమోగుణ ప్రవృత్తిగల రాక్షసులు మోహిని తనువుని దర్శించటంలో నిమగ్నమై ఆమె అంతరంగాన్ని తెలుసుకోకుండా అరచేతిలోని అమృతాన్ని ఆమోహనాంగి చేతిలో పెట్టి దేవజాతిని శాశ్వతంగా అమరజాతిని చేసారు.

మోహిని మోహంలో సంపూర్ణంగా మునిగిన దైత్యులను ఆమె చూపులు, చల్లని వాక్కుతో బుజ్జగింపులు రాక్షసులను దిగ్బంధనం చేసాయి.

మోహినీ అవతారంలో సంపూర్ణంగా దైత్యస దానవ, రాక్షస జాతిని వశపరచుకున్న మహావిష్ణువు నేను పంచి పెట్టిన విధంగా మీరు అంగీకరించాలి. ఔను, కాదని అనకూడదని బలిబంధనం వలె ముందే ముందరి కాళ్ళకు బంధం వేశాడు.

**అమృత పంపకం**

లక్ష్మీదేవి సౌందర్యానికి సాటియైన సౌందర్యంతో మోహినీ దేవదానవుల మనస్సు చెదరి పోయేటట్లు చేసి, దేవ దానవులను రెండు వరుసలుగా కూర్చోబెట్టింది.

రాక్షసులకు తన సౌందర్యాన్ని ఎరవేసి లొంగదీసుకొని దేవతలకి సంతృప్తిగా అమృతాన్ని తాగింపచేసి అభినందనలందుకొంది మోహిని. ఆ సమయంలో మోహినీ చూపులకి రాక్షసులు వివశులై అమృతాన్ని తొందరగా తీసుకొని రమ్మని కూడ అడగలేక పోయారు.

**అమృత పంపకంలో అపశృతి**

మోహినీ అమృతాన్ని దేవతలకు పోయటం చూసిన రాహువనే రాక్షసుడు రహస్యంగా దేవతల వరుస మధ్యలో చేరి, దేవతా వేషంతో అమృతాన్ని సేవించాడు. దేవ దేవుడు రాహువును గమనించలేదు రాహువుతో నిత్యవైరం వల్ల సూర్యచంద్రులు మోహినికి సైగ చేసారు. విష్ణువు చక్రాయుధంతో రాహువు శిరస్సు ఖండించాడు. అమృతంతో కూడి నిర్జీవం కాలేదు మొండెం నేలపై కూలిపోయింది.

రాహువు శిరస్సును బ్రహ్మదేవుడు ఒక గ్రహంగా నిలిపి గౌరవించాడు. ఈ గౌరవం శ్రీవిష్ణు చక్ర స్పర్శచే కలిగింది. విష్ణువు ఒక చుక్క కూడ మిగల్చక అమృతమంతా అమరసమూహానికి బాహాటంగా పోశాడు. మోహినీ రూపాన్ని పరిత్యజించి మహా విష్ణు రూపాన్ని ధరించాడు స్వామి.

### దుష్టశిక్షణ శిష్ట రక్షణ

ఆశ్రితజన వత్సలుడు, ఆర్తత్రాణ పరాయణుడై తనని శరణు వేడిన దేవతలను, అమరులను గావించటానికి దేహబలం తప్ప బుద్ధిబలంలేని, దుర్మార్గులైన రాక్షసులు అమృతపానం చేసి అమరులైతే లోకాలకి కీడు వాటిల్లుతుందని, లోకాలను సుభిక్షంగా ఉండనివ్వరని త్రికాలజ్ఞుడైన దేవ దేవుడు లోక కళ్యాణం కోసం మోహినీ అవతారమెత్తాడు.

ఈ విషయాన్ని భగవంతుడు శ్రీకృష్ణావతారంలో కురుక్షేత్ర సమరారంభమున తన భక్తుడు, ప్రియసఖుడైన అర్జునునికి బోధించాడు.

*"పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం*
*ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే"* [97]

### మోహిని జగన్మోహనత్వం

జగన్మోహునుడు మోహినిగా అవతరించాడు. దురహంకారులైన రాక్షసుల్లో అహంకారం, స్వార్ధం నశించాయి. అప్పటి వరకు దేవతలకు అమృతం ఇవ్వక తాను స్వీకరించాలనుకున్నదైత్య, దానవ రాక్షసులు ఐక్యమై దేవతలకి తమకి సమంగా పంచమని అడగటం విశేషం. పరమాత్మ లోకకళ్యాణ కారకుడై (స్త్రీగా) మోహినిగా అవతరించి సౌందర్యంచే మైమరిపించిన ఆమె పట్ల రాక్షసులు దురుసుగా ప్రవర్తించక, ఆమెనే ధర్మ నిర్ణయ కారిణిగా ఎన్నుకొనటం విశేషం. ఆమెను అమృతం త్వరగా తీసుకురమ్మంటే వారిపట్ల సదభిప్రాయం ఉండదనే సందేహంతో మౌనంగా ఉండటం మరీ విశేషం. జగత్తులో స్త్రీశక్తికి మించిన మాయ మరొకటి లేదనే అంశం లోకానికి తెలియ చేయటానికి ఆ ఆదినారాయణుడే ఆడరూపం ధరించవలసి వచ్చింది. శక్తిని నేనే, చైతన్యాన్ని నేనే, స్త్రీని నేనే, పురుషుడను నేనే అనే అంశం తెలియచేయడానికి జగన్మోహనుడు దేవతాకార్య నిమిత్తం జగన్మోహినిగా మారి లోకాలకు వెల్లడి చేశాడు.

అష్టమ స్కంధంలో (భాగవతంలో) వర్ణించబడిన లక్ష్మీదేవి ఆదిలక్ష్మి. ఆదిలక్ష్మి సౌందర్యానికి అబ్బురపడిన దేవదానవులందరిని మోహంలో మునిగి పోవునట్లుగా శ్రీ మహావిష్ణువు మోహిని అవతారంతో తాను స్త్రీయై ఏ రూపం ధరించినా సౌందర్య శబ్దానికి తానే అర్థమని నిరూపించి చూపించాడు, లోక రక్షకునికి మించిన శక్తి, సౌందర్యం మరి ఎవ్వరికుంటుంది? అందుకే క్షీర సముద్ర రాజ తనయ ఆ వైకుంఠుని వరించి జగన్మోహనుని హృదయమే ఆవాసంగా చేసికొని నిత్యానపాయిని అయింది.

భక్తులు అష్టలక్ష్మీ స్తోత్రం చేస్తూ ముందుగా

*"సుమనస వందిత సుందరి మాధవి చంద్ర సహోదరి హేమమయే*
*మునిగణ మండిత మోక్ష ప్రదాయిని మంజుల భాషిణి వేదనుతే*
*పంకజవాసిని దేవసుపూజిత సద్గుణవర్షిణి శాంతియుతే*
*జయజయహే మధుసూదన కామిని ఆదిలక్ష్మి సద పాలయమాం"*॥

అని ఆదిలక్ష్మిని స్తోత్రం చేస్తారు.

మోహినీ అవతారం మొదట దేవతల అమృతపానం కొరకే ఆవిర్భవించటం జరిగింది. త్రినేత్రుడు మహా విష్ణువుని మోహినీ అవతారంలో చూడ కుతూహలంగా ఉన్నదని అడిగాడు. విష్ణువు మరలా మోహినీ రూపమెత్తి పశుపతినే మోహ పరవశుని చేసాడు. సర్వజ్ఞుడైన శివుడు విష్ణుమాయని గుర్తించి వెను దిరిగి కైలాసానికి వెళ్ళి పోయాడు.

బ్రహ్మజ్ఞానియైన శుకమహర్షి మోహినీ రూపాన్ని పాపపు చీకట్లను రూపుమాపే సూర్యుని స్వరూపంగా భావించాడు.

## 34. గంగాదేవి (నవమస్కంధం)

శ్రీకృష్ణమూలం, శుకాలాపాభిరామమైన భాగవతం ప్రథమస్కంధం 'కృతిపతి నిర్ణయం'లో సహజ పండితుడైన పోతన "అని మఱియు పూర్వజన్మ సహస్ర సంచిత తపః ఫలంబున శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలుండనై యొక్క రాకా నిశా కాలంబున సోమోపరాగంబు రాక'గని సజ్జనానుమతంబున నభ్రంకష శుభ్ర సముత్తుంగ భంగయగు గంగకుం

జని క్రుంకులిడి వెడలి మహనీయ మంజుల పులినతల మంటప మధ్యంబున ఉమామహేశ్వర ధ్యానంబు సేయుచు గించిదున్మీలతలో చనుండనై యున్నయెడ" [98]

గౌతమీ గంగలో స్నానం చేసి పరమశివుని ధ్యానిస్తూ అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చొని ఉండగా శ్రీరాముడు ప్రత్యక్షమై భాగవత రచనచేసి తన కంకిత మిమ్మని కోరినట్లు చెప్పాడు.

గౌతమీ గంగానది మహాత్మ్యాన్ని ముందే పోతన గుర్తించాడు. కాబట్టి అఖండ గంగ మహిమని మూలంకంటె అధికంగా తన దివ్య దృష్టితో తనివి తీర సందర్శించి పులకితుడై గంగావతరణని తవ రచనా కాలందాక జరిగిన ముఖ్య ఘట్టాలతో పోల్చి వర్ణించి తన భావనా పటిమని, వర్ణనా శక్తిని, తన పాండితీప్రకర్షనుపయోగిస్తూ అత్యద్భుతంగా, అద్వితీయంగా వర్ణించాడు.

*"గంగా భవానీ గాయత్రీ కాళీలక్ష్మీ సరస్వతీ ।*

*రాజ రాజేశ్వరీ బాలా శ్యామలా లలితాదశ "॥*

దేవి దశనామాల్లో తొలి నామం పరమ పావని గంగా నామం.

*"గంగా విష్ణుపదీ జహ్నుతనయా సురనిమ్నగా*

*భాగీరథీ త్రిపథగా త్రిస్రోతా: భీష్మసూరపి"* [99]

1. గంగ, 2.విష్ణుపదీ 3.జహ్నుతనయా 4.సురనిమ్నగా 5.భాగీరథీ 6.త్రిపథగా 7.త్రిస్రోతా: 8.భీష్మసూ: గంగానదీ నామాలుగా అమరసింహుడు పేర్కొన్నాడు. శివ శిరస్థయైన అఖండ గంగ భువికి దిగి గంగానదిగా, భగీరథ ప్రయత్నంలో పాతాళానికి ప్రవేశించి భాగీరథిగా ప్రసిద్ధి పొందింది.

పోతన నవమ స్కంధంలో ఇనవంశ రాజులను వర్ణిస్తూ "శ్రీ పరమేశ్వర జటానిర్గత గంగా ప్రవాహ మహిమాభి వర్ణనం" అనే వచనంలో ఈ క్రింది విధంగా వర్ణించాడు.

"ఇట్లమ్మహానది, పురారాతి జటాజూట రంధ్రంబు వలన దిగంబడి, నిరర్గళ ప్రవాహంబై, నేలకు జల్లించి నెరసి, నిండి, పెల్లు వెల్లిగొని, పెచ్చుపెరిగి విచ్చల విడింగ్రేపు వెంబడి నుఱక క్రేళ్ళుఱుక మఱక ప్రాయంపు 'గామధేనువు చందంబున ముందఱికి నిగుడుచు, ముద్దు జందురుతోడి

నెయ్యంబున' గ్రయ్యనడరి చొప్పుదప్పకసా'గి చనుదెంచు సుధార్ణవంబు కైవడి 'బెంపుగలిగి, మహేశ్వరు వదన గహ్వరంబు వలన నోంకారంబు పిఱుంద వెలువడు శబ్ద బ్రహ్మంబు భంగి నదభ్ర విభ్రమంబై యమ్మహీపాల తిలకంబు తెరువు వెంట నంటి వచ్చు తెలి యేనుగు తొండంబుల ననుకరించి పఱచు వఱద మొగంబులును, వరద మొగంబుల పిఱుంద నందంద క్రందుకొని, పాడచూపి, తొలంగు బాల శారదా కుచ కుంభంబులకు నగ్గలంబైన బుగ్గలును, బుగ్గల సంగడంబునం బారిజాత కుసుమ స్తబకంబుల చెఱవంబులం దెగడు వెలినురువులును, వెలినురువుల చెంగట నర్ధోన్మీలిత కర్పూర తరుకిసలయంబుల్ గేలిగొను సుళ్ళును, సుళ్ళ కెలంకుల ధవల జలధర రేఖాకారంబులు బాగుమెచ్చని నిడుద యేఱులును, నేఱులం గలసి వాయు వంశంబున నొండొంటిందా'కి బిట్టు మిట్టించి, మీ'ది కెగయు దురిత భగంబులైన భంగంబులును, భంగంబుల కొనల భిన్న భిన్నంబులై కుప్పించి, యుప్పరంబెగసి, ముత్తియంపు సరుల వడుపున, మల్లికాదామంబుల తెఱంగున 'గర్పూర ఖండకదంబంబుల చెలువంబున, నిండు శకలంబున తేజంబున 'దారకా నికరంబుల పొలుపున మెఱయుచు, ముక్తి కన్యా వశీకరంబులైన శీకరంబులునుం గలిగి మధ్యమ లోక శ్రీకరంబై, శ్రీకరంబు తెఱంగున విష్ణుపదంబు ముట్టి, విష్ణు పదంబు భాతినుల్లసిత హంస రుచిరంబై, రుచిర పక్షంబు రీతి నతి శోభిత కువలయంబై, కువలయంబు చెన్నున బహుజీవనంబై, జీవనంబులాగున సమనో వికాస ప్రధానంబై, ప్రధాన పర్వంబు పొలుపున నేకచక్ర బక భీమ మహాభంగ సుభద్రార్జున చరిత్రాభిరామంబై, రామచిత్తంబు వెల'పునందన వారిలో 'జొచ్చిన దోషాచరుల కభయ ప్రదానచణంబై. ప్రదాన చణవర్తనంబు భాతి సముపాసిత మృత్యుంజయంబై, మృత్యుంజయ రూపంబు పోలిక విభూతి సుకుమారంబై, కుమార చరిత్రంబు దేవను గ్రౌంచప్రముఖ విజయంబై, విజయ రధంబు భాతి హరిహరయా మంధరంబై, మంధర విచారంబు గ్రద్దన మహారామ గిరివన ప్రవేశ కాయంబై కామకేతనంబు పెల్లున నుద్దీపత మకరంబై, మకరకేతను బాణంబు కైవడి విలీన పరవాహినీ కలిత శంబరంబై, శంబరారాతి చిగురు' గుంతంబు సూడి నధ్వగ వేదనా శమనంబై, శమన దండంబు జాడ న్నిమ్నోన్నత సమవృత్తంబై, వృత్త శాస్త్రంబు విధంబున వడింగలిగి సదా గురు లఘువాక్య చ్ఛటా పరిగణితంబై గణిత శాస్త్రంబు కొలందిని ఘన ఘన మూల వర్గమూల సంకలిత భిన్న మిశ్ర ప్రకీర్ణ ఖాత భీష్మంబై, భీష్మకర్మంబు పెంపున ననేక భగవద్గీతంబై, గీతా శాస్త్రంబు నిలుకడను మహాసుషిరతను ఘన నానాశబ్దంబై, శబ్దశాస్త్రంబు మర్యాదనచ్చువడి హల్లుగలిగి, మహాభాష్య రూపావతారవృత్తి వృద్ధిగుణ సమర్ధంబై,

యర్ధశాస్త్రంబు మహిమను బహు ప్రయోజన ప్రమాణ దృష్టాంతంబై, దృష్టాంతంబు తెఱంగున సర్వసామాన్య గుణ విశేషంబై, శేష వ్యాపారంబు కరణిని సుస్థిరోద్ధరణ తత్పరంబై, పరబ్రహ్మంబు గరిమనతి క్రాంతానేక నిగమంబై, నిగమంబు నడవడిని బ్రహ్మవర్ష పదక్రమ సంగ్రహంబై, గ్రహ శాస్త్రంబు పరిపాటిని కర్కటమీన మిధునమకర రాశి సుందరంబై, సుందరి ముఖంబు పో‘డిమిని నిర్మల చంద్రకాంతంబై, కాంతా ధరంబు రుచిని శోణచ్ఛాయా విలాసంబై, విలాసవతి కొప్పునొప్పున‘ గృష్ణనాగాధికంబై, యధికమతి శాస్త్ర సంవాదంబు సొంపున నపార సరస్వతీ విజయ విభ్రమంబై, విభ్రమవతి చనుదోయి పగిది నిరంతర పయో వ్యాప్తాఖిల లోక జీవన ప్రదతుంగ భద్రాతి రేఖా సలలితంబై, లలితవతి నగవుమించు నపహసిత చంద్రభాగధేయంబై, భాగ ధేయవంతుని వివాహంబు లీల మహామేఖల కన్యకా విస్తారంబై, తారకంగేలి యొడికంబున నాక్రాంత సూర్యతనయంబై, సూర్యతనయు శర వర్షంబు పోలిక భీమ రధ్యాటోప వారణంబై వారణంబు పరుసునం బుష్కరోన్నత సంరంభంబై, రంభనెమ్మము డాలున సురపాతిశయ దశంబై, దశరధ తనయు బోమముడి బాడ్పున సింధుగర్వ ప్రభంజనంబై, ప్రభంజన తనయు గదపెట్టు మాడ్కిని సమీపగత దుశ్శాసన దుర్మద నివారకంబై వార కన్యక ముంజేతి గతిని మహుర్మహురుచ్చలిత కంకణాలం కృతంబై, కృతయుగంబు నోజనపంకంబై, పంకజాసన ముఖంబు నఱపున, బ్రభూత ముఖవర్ణంబై, వర్ణగుణితంబు తెఱకువను బహుదీర్ఘబిందు విసర్గంబై, సర్గ బంధ కావ్యంబు విన్ననువున గంభీర భావ మధురంబై మధురాపురంబు సొబగున మహానంద నందనంబై, నందవనంబు పొందున విహరమాణ కౌశికంబై, కౌశికహయంబు రీతి సుదశ ధ్రువంబై, ధ్రువ తలంపు క్రియం గ్రియాపరిశీలత విశ్వంభరంబై, విశ్వంభరుని శంఖంబు రూపున దక్షిణా వర్ణోత్తరంబై యుత్తరా వివాహంబు చందంబున, ‘బ్రముదితనరంబై, నరసింహ నఖరంబుల భాతి నాశ్రితప్రహ్లాద గురువిభవ ప్రదానంబై, దానకాండంబు సిరింగామధేను కల్పలతాద్యభినవంబై, నవసూతికా కుచంబు పేర్మిని నిరంతర పయో వర్ధనంబై, ధనదు నిలయంబు తూనికను సంభృత మకర పద్మ మహాపద్మ కచ్ఛపంబై, కచ్ఛప కర్పరంబు బలిమిని పతితశైల సముద్ధరంబై, ధరణీధరంబు సాటి నుత్తుంగతట ముఖ్యంబై, ముఖ్యవరాహంబు గరిమసున్నత క్షమంబై, క్షమాసుర హస్తంబు గరగరికను సత్పవిత్ర మనోభిరామంబై, రామచంద్రు బాణంబు కడింది నభ్యాగత  ఖరదూషణ మదాపహరణ ముఖరంబై, ముఖర రామ కుఠారంబు రీతిని భూ భృన్మాల భేదన ప్రబలంబై, బలరామహలంబు భాతిని బ్రతికూల సన్నికర్షణ ప్రబుద్ధంబై, బుద్ధదేవుని మేని యొఱపున నభియాతి రక్షోదార మనోహరంబై, హర తాండవంబు మేర నుల్లసితా నిమిషంబై యనిమిషావతారంబు

కీర్తిని శ్రుతి మంగళ ప్రదంబై, ప్రదాత యో'గి సూటి నర్థపరంపరా వామనంబై, వామన చరణ రేఖను బలివంశ వ్యసనంబై, నయశాస్త్రంబు మార్గంబున సామభేద మాయోపాయ చతురంబై, చతురాననానాండంబు భావంబున నపరిమిత భువన జంతుజాల సేవ్య మానంబై, మానిని యనలోతు సూపక, గరితయన సడి చప్పుడు సేయక, ముగుద యన బయలు పడక, ప్రమదయన 'గ్రయ్య బాఱుచు బతివ్రతయన నిట్టట్ట సనక, తల్లియన నెవ్వియైన లో ( గొనుచు దైవంబన భక్త మనోరథంబు లిచ్చుచు, నంతకంతకు విస్తరించి గుఱి గడచి, యవాఙ్మానస గోచరంబై ప్రవహించి" [100]

మందాకిని శివుని జటాజూట రంధ్రాల నుండి దూకి, అడ్డులేక భవిపైకురికి మహా ప్రవాహంతో పొంగి పొరలి అతిశయించిన విధానాన్ని పోతన మహాకవి దూడ వెంబడి గంతులు వేస్తూ పరుగులు తీసే ప్రాయంలో ఉన్న కామధేనువు వలె ముందుకు సాగినట్లుగా వర్ణించాడు.

మానవుల పాపాలను హరించి, కోరిన కోర్కెలు తీర్చటానికే మందాకిని గంగయై భువికి అవతరించింది. కాబట్టి కామధేనువను పద ప్రయోగం ఔచితీవంతం.

... ... ... "ముద్దు జందురుతోడి నెయ్యంబున ... ... ..."

పాలసముద్రుని పుత్రుడు చంద్రుడు, ఆ మహానది ముద్దులొలికే చంద్రునిపై ప్రేమతో ఉప్పొంగే పాలసముద్రంతో పోల్చిక్షీర సాగర శయనుని పాదోద్భవ గంగయని గంగ పుట్టుకను, చంద్రుని పుట్టుకను గుర్తు చేశాడు, గంగ దారి తప్పక ప్రణవ నాదాన్ని అనుసరించిన శబ్ద బ్రహ్మంవలె విస్తారమైన విలాసంతో ఐరావత తొండాలతో సమానంగా భువిని పావనం చేస్తూ భగీరథ మార్గాన్ని అనుసరించింది. ఆ ప్రవాహాల నీటి బుడగలను "బాలశారదా కుచకుంభంబుల పగిది ... ..." బాల సరస్వతీ స్తన ద్వయంతో పోల్చి పోతన సరస్వతీ పుత్రుడనని పరోక్షంగా తెలియ చేసాడు.

*"సంగీతమపి సాహిత్యం సరస్వత్యా: స్తనద్వయం*
*ఏకమాపాత మధుర మన్యదాలోచ నామృతం"*

నది నురగలు పారిజాతపు పూలగుత్తులను మించిన తెలుపుతో, గంగానది సుడులు కర్పూరపు చెట్ల చిగళ్ళ సోయగాలను గేలిచేసి, ప్రవాహాలు మేఘాలను మించిన విధంగా అలలు ఎగసి పడే విధానాన్ని పాపనాశనకరంగా అలల అంచులను ముత్యాల సరాలరీతిగా, మల్లెపూల మాలల

విధంగా, కర్పూర ఖండాల చందంగా చంద్రశకలాల వలె, చుక్కల గుంపుల విధంగా ప్రకాశిస్తూ మోక్షలక్ష్మిని వశీకరింప చేసుకొనగల్గిన నీటి తుంపురులను కలిగి దివినుండి భువికి దిగి మధ్యమలోక మంగళ దేవతగా గంగానది విరాజిల్లింది.

"... ... ..." శ్రీకరంబు తెఱంగున విష్ణుపదంబు ముట్టి ,,, ,,, లక్ష్మీహస్తం విష్ణుపాదాన్ని స్పృశించిన విధంగా ఆకాశాన్ని తాకి, ఆకాశం వలె ప్రకాశించి హంసల కాంతితో వెలుగుతూ, శుక్ల పక్షంలో (చంద్రుని దిన దినాభివృద్ధి) భూమండలం రీతి ప్రకాశించే కలువలు కలిగి, భవబంధాలతో కూడిన లోక రీతిగా అధిక జీవనం కలిగి (నీటిని) మంచి మనస్సుతో ప్రకాశించే జీవితం వలే వికసించిన పూలతో మనోహరమైన భారత పర్వం వలె పెక్కు చక్రవాక పక్షులతో, కొంగలతో భయంకరమైన అలలతో సుందరమై, ఆశ్రిత రక్షణలో శ్రీరామ హృదయం వలె (అహల్య, గుహుడు, శబరి, సుగ్రీవ, విభీషణులు) తనలో మునిగిన పాపాత్ములకు అభయమివ్వడంలో సమర్థమై మృత్యువుని జయించి గొప్పదాత ప్రవర్తన వలె (బలి చక్రవర్తి వామనుని సేవించి దానమిచ్చిన విధంగా) మహెూన్నత నడవడితో శివుణ్ణి సేవిస్తూ విభూతితో కూడిన అందమైన శివరూపం వలె సంపదతో సుకుమారమైంది.

"... ... ... కుమార చరిత్రంబు దేవను ... ... ..."

క్రౌంచ పర్వతాదులని గెల్చిన కుమార స్వామి తారకాసుర సంహారం చేసిన విధంగా భక్తులను పునీతం చేస్తూ పాండవ మధ్యముని రథంవలె సప్తాశ్వరథారూఢుని వేగం కలిగి (పార్థసారథి శ్రీకృష్ణుడే సూర్య నారాయణుడు కాబట్టి పోతన ఈ ఉపమానాలు ప్రయెగించాడు)

"మందర విచారంబు గ్రద్దన మహారామగిరి వన ప్రదేశకామంబై: శ్రీరామునికి వనవాసం కలిగించిన మందర ఆలోచన వలె శీఘ్రంగా వన పర్వతాల్లో ప్రవేశించే కోరికతో గంగ ప్రవహించిందనటం రామావతార కార్యాన్ని పోతన మనకి గుర్తు చేసాడు. మందర కోరిక బాహ్య దృష్టికి స్వార్థపూరితంగా కనిపించినా, ఆ కోరిక లోక కళ్యాణ కారకమైంది. సగర పుత్రుల తారణకై భగీరథుని వెంట బయలుదేరిన భాగీరథి భూలోకంలో పలు ప్రదేశాల్లో పావనమొనరిస్తూ, మన్మథుని జెండా వలె మొసళ్ళతోను, సైన్యంతో కూడి శంబరాసురునిలో ప్రవేశించే మన్మథ బాణం వలె, తనలో లీనమైన. ఇతర ప్రవాహ జలాలు కలిగి మన్మథుని చిగురు కత్తి విధంగా బాటసారుల తాపాన్ని తొలగించి అల్పులపట్ల, అధికుల పట్ల సమానంగా ప్రవర్తించే యమదండరీతిగా ఎత్తు పల్లాల్లో సమానంగా మెలిగి, యతి, గురు, లఘువుల్లోను, వాక్య, సమూహాలతో కూడిన

భందశ్శాస్త్రం వలె వేగంతోను, పెద్ద చిన్నా శబ్దాలతో కూడిన విధంగా వర్ణించటం కవి చాతుర్యం.

"... ... ... భీష్మ పర్వంబు పెంపున ననేక భగవద్గీతంబై ... ... ..."

గంగాతనయుడు భీష్ముడు కదా! సంతోనంతోనే స్త్రీ పరిపూర్ణ: దేవతామూర్తి అయినా మహిళ (పరిపూర్ణత్వాన్ని) సంపూర్ణతని తెలియచేయటానికి ఈ విధమైన పోలిక పోతన లోకాను భవానికి నిదర్శనం.

గంగానది ప్రవాహ శబ్దాలను సంగీత శాస్త్రంతో ప్రవాహ వేగాన్ని, వ్యాకరణ శాస్త్రంతో సామర్థ్యాన్ని మహాభాష్య వృత్తితోను, ప్రయత్నాన్ని భూభారాన్ని మోసే ఆదిశేషునితోను వేద సమూహాల కతీతమైన పరబ్రహ్మ వలె గంగానది అనేక మార్గాలను అతిక్రమించి, ఖగోళ నియతి రీతిగా ప్రకాశించి నిర్మలమైన సుందరాంగి ముఖంవలె చంద్రకాంతితో వెలుగొందింది.

"... ... ... పరబ్రహ్మంబు గరిమనతి క్రాంతనేక నిగమంబై ... ... ..."

వేద సమూహాల కతీతమైన పరబ్రహ్మతో గంగానదిని పోల్చటం, పరబ్రహ్మనే శాక్తేయులు పరాశక్తి అంటారు. ఆ పరాశక్తినే అన్నింటిని తనలో లీనం చేసుకోగలిగిన శక్తి ఉంది "సర్వకల్మష హారిణి" ఆ గంగామాతే ఆది పరాశక్తి, ఈ ప్రకృతి కంతటికి తల్లి, ఆ పరాశక్తియే సంపూర్ణ సౌభాగ్యవతి. ఆ సౌభాగ్య ప్రతిబింబమే ఈ ప్రకృతి స్వరూపం ఆ పరాశక్తి సాకారరూపంలో పురుషుని వరించినపుడు నారాయణి అయింది అందువల్లనే

"సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే"

అని ఆర్యులు (వేద విదులు) దేవీ స్తుతిలో మొట్టమొదటగా దేవిని స్తుతిస్తారు.

"... ... ... యధికమతి శాస్త్ర సంవాదంబు సొంపున నపార సరస్వతీ విజయ విభ్రమంబై ... ... ..."

అందమైన స్త్రీ పెదవి కెంపురంగుతో కూడిందై, గొప్పదైన, సరస్వతీ విజయంతో విలసిల్లుతున్నదై అఖిల సంతానానికి బ్రతుకు తెరువై శుభాకృతితో కూడిన సుందరాంగి స్తనాలవలె పయోధారలతో నిండి తుంగభద్రానది సొగసు మించి, సుందర మందహాసం వలె చంద్రభాగ సౌభాగ్యాన్ని అతిశయించిందై గొప్ప ఒడ్డాణాలు ధరించిన కన్యలతో కూడిన అదృష్టవంతుని వివాహం వలె భాగీరథి భువిపై విస్తరించింది.

గంగానది సుగ్రీవ విజయం వలె ముత్యంవంటి తన హస్తంతో ఉపాయంగా యమునా నదిని ఆక్రమించింది. (సామీప్యంలో ఒకే విధంగా ఉన్న వాలి సుగ్రీవుల్లో సుగ్రీవుడు విజయం

సాధించటానికి రాముడు ఉపాయం చెప్పాడు) విష్ణుపాదోద్భవగంగ. శ్రీకృష్ణుని జలకేళి నిలయం యమున. ఈ రెండూ పునీతమైనవే. ఈ రెండింటి పావన చరిత్రలు తెలియచేయటానికి పోతన సుగ్రీవ విజయం పోలిక చెప్పి రామకృష్ణావతారాలు రెండు పఠితల ముందుంచాడు. భక్తులు ప్రకృతిలో కూడా పరమాత్మనే దర్శిస్తారు పోతన ద్రష్ట.

భీమరథీనది విజృంభణని గంగాదేవి అరికట్టిందన్న విషయాన్ని కర్ణుని పరాక్రమాన్ని సూచించి తన భారతపఠన కౌశలాన్ని ప్రదర్శించాడు పోతన.

గంగాజలాన్ని రసవంతమైన రంభముఖంలో పోల్చి దప్పిక గొన్నవాడు గంగాజల పానం వల్ల కలిగే సంప్రీతిని తెలియచేసాడు.

సింధునది గర్వాన్ని భంగం చేసిన గంగానదిని వర్ణిస్తూ సముద్రుని గర్వాన్ని భంగపరచిన శ్రీరాముని బొమముడితో పోలిక చెప్పి (ఆగ్రహాన్ని సూచించి) సేతువుపై వారధిని శ్రీమద్రామాయణాన్ని పఠితలకు జ్ఞప్తి చేసాడు.

దుర్మార్గుడైన దుశ్శాసనుని కురుక్షేత్ర సంగ్రామంలో వీరోచితంగా భీముడు వధించిన విధంగా పాపాత్ముడైన వారిని కూడ గంగ పావనమొనరించిందని వర్ణించాడు. (యుద్ధంలో చనిపోయినవానికి స్వర్గం లభిస్తుంది. అట్లే దుశ్శాసనునికి స్వర్గాన్ని భీముడు లభింప చేసాడు) మరల మరల పొరలే నీటి బిందువులని వేశ్యముంజేతి కంకణాలతో పోల్చటం పోతన లోకానుభవానికి నిదర్శనం (భోగినీదండక రచనానుభవం కావచ్చు)

పాపంలేని కృతయుగం (కృతయుగం ధర్మం నాలుగు పాదాలు నడచి సత్యకాలంగా పేరు పొందింది) విధంగా నిర్మలమై, గొప్పదైన తెల్లరంగుతో కూడిన బ్రహ్మ ముఖం వలె భూసుర జాతిచే ఆశ్రయింపబడిందని వర్ణించటం విశేషం.

"బ్రాహ్మణో2స్యముఖమాసీత్" కదా!

అనేక దీర్ఘాలతో, బిందువులతో, విసర్గలతో కూడి అక్షర గణితం మాదిరి అధికనీటి బిందువులతో వెదజల్లు చున్నదై గంభీర భావాలతో మధురమైన సర్గ బిందువులను వెదజల్లుతూ, గొప్పవాడైన నంద నందనునితో కూడిన మధురాపురం వలె మహదానందానికి గంగానది నందన వనమైంది.

శ్రీకృష్ణ పరమాత్మ మధురలో పుట్టి సంరక్షణకై రేపల్లె చేరి పూతన, శకటాసురుడు, తృణావర్తుడు, కాళీయుడు మొదలైన రాక్షస సంహారం చేసి, దేవేంద్రుని గర్వమడచి మధురకు వచ్చి దుష్టుడైన కంసుని సంహరించిన అనంతరమే మధురానగరం ఆనంద మధురమైంది.

బాలకృష్ణుని (వర్ణన అంతా) గుర్తు చేసి పోతన కృష్ణభక్తిని గంగా ప్రవాహంలో కూడ ప్రవహింప చేసినాడనటం అతిశయోక్తి కాదు.

ఇంద్రుడు విహరించే నందన వనం పోలిక కౌశికీ నదిలో విహరించినదై ఇంద్రుని గుఱ్ఱం వంటి ధ్రువమైన మంచిదశ కలిగిందని గంగానదిని వర్ణించటం ఔచితీవంతం.

"ఉచ్చైశ్రవం" గుఱ్ఱాల్లో శ్రేష్టమైంది, విభూతి యోగంలో గీతాకారుడు.

*"ఉచ్చై:శ్రవసమశ్వానాం, విద్ధిమామమృతోద్భవం ।*
*ఐరావతం గజేంద్రాణాం నరాణాంచ నరాధిపమ్ ॥* [101]

అని అశ్వాల్లో ఉచ్చై:శ్రవాన్ని నేనే అని తెలియచేసాడు.

విష్ణుచింత కలిగిన ధ్రువుని తలంపువలె విశ్వాన్ని పరిశీలించినదై, ప్రశస్తంగా 'వలమురి' అయిన విష్ణువు శంఖం మాదిరి కుడి నుండి ఎడమ వైపుకి మరలిందని వర్ణించటం. ద్వాదశాక్షరీ "ఓం నమో భగవతే వాసుదేవాయ" మంత్రంతో విష్ణు భగవానుని ప్రత్యక్షం చేసికొన్న ధ్రువుని ధృఢ దీక్షని గుర్తు చేయటం, విష్ణుశంఖాన్ని పోల్చటం భాగవతుల లక్ష్యాన్ని పోతన చెప్పకనే చెప్పాడు. మానవుడు ఐహిక బంధాలు విడనాడి పారలౌకికం వైపుకి మరలాలని శంఖం ఊదాడు,

" ... ... ... యుత్తరా వివాహంబు చందంబున బ్రముదిత నరంబై ... ... ..."

ఉత్తరా వివాహం వలె నరానంద సంధాయకమై పాలతో పొంగే పచ్చి బాలెంతురాలి స్తనం వలె ఎప్పుడూ పెరుగుతున్న నీళ్ళతో నిండి ఉన్నదని గంగానదిని వర్ణించాడు.

ఉత్తర వివాహం నరుడైన అర్జునుని కుమారుడు అభిమన్యుని వివాహం కాబట్టి అర్జునుడు ఆనంద సంధాయకమని సామాన్యార్ధం కాగా దీనిలో విశేషార్ధం కూడా తొంగి చూస్తుంది.

ఉత్తర తనయుడైన పరీక్షిత్తు వలనే భాగవతం నరులకి లభించి ఆనంద సంధాయకమైంది. పోతన ద్వ్యర్ధిగా గంగ పరిపూర్ణతని అభివర్ణించాడు. నరులకు గంగా స్నానం ఏ విధంగా పాప

పరిహారమో అట్లే భాగవత పఠనం మోక్షదాయకం కదా!

"... ... ... ధనదు నిలయంబు తూనిక ... ... ..."

మకరం, పద్మం, మహా పద్మం, కచ్ఛపం అనే నిధులతో నిండిన కుబేరుని నిలయం వలె మొసళ్ళతో, మెట్ట తామరలతో, తాబేళ్ళతో నిండినదై, కూలిన కొండను పైకెత్తే ఆదికూర్మపు బలమైన వెన్నెముక వలె కొండలను కదిలించింది. అమృత మథనానికై ఉంచిన మంధర పర్వతం సముద్రం లోపలికి పోకుండా శ్రీమహా విష్ణువు ఆదికూర్మమై సహకరించాడు. మానవ లోకం పాప పంకిలం కాకుండా గంగాదేవి భువికి పావనం చేసింది.

"... ... ... ధరణీ ధరంబు సాటి నుత్తుంగతట ముఖ్యంబై, ముఖ్య వరాహంబు ... ... ..."

భూమిని పైకెత్తే ఆది వరాహం విధంగా గొప్ప ఓర్పుకలిగి, దర్భలతో కూడిన బ్రాహ్మణుని హస్తం మాదిరిగా పవిత్రమై, ఇంపు కలిగించిందై ఎదిరించి వచ్చే ఖర దూషణుల గర్వాన్ని అపహరిస్తూ మ్రోగే రామచంద్రుని బాణంలాగా తన్ను చేరవచ్చే కఠినుల, పాపుల అహంకారాన్ని అపహరించి రాజులను సమూలంగా నాశనం చేసిన పరశురాముని గండ్రగొడ్డలివలె పర్వతాలను సమూలంగా పెల్లగించే బలంతో కూడి, విరోధులను ఉన్మూలించే బలరాముని నాగేలు విధంగా గట్లను రాచుకొని ఉప్పొంగుచున్నదై, రాక్షస కాంతలకు మనోహరమైన బుద్ధదేవుని నెమ్మేను భాతి ఆశ్రయించిన వారిని రక్షించడంలో సమర్ధమైంది.

గంగాదేవి ప్రవాహ సమర్ధతని, పవిత్రతతో దర్భ సహిత బ్రాహ్మణ హస్తంతో ఆటంకాలను తొలగించడంలో రాక్షసులను దునుమాడిన రామబాణంతోను, క్షత్రియాహంకారాన్ని అణచిన పరశురాముని గండ్ర గొడ్డలిగా పాతుకుపోయిన పర్వతాలను దాటి శేషాంశ సంభూతుడైన బలరాముని నాగలితో పోల్చి రామకృష్ణావతారాల్లో దుష్టశిక్షణ, శిష్టరక్షణ మానవలోకంబు లో ఏ విధంగా జరిగిందో ఆ విధంగా గంగానది తనకెదురైన అవరోధాన్ని తొలగించుకొని భువికి అవతరించిందని సూచించాడు పోతన మహాకవి.

"... ... ... బుద్ధదేవుని మేని యొఱపున నభియాతి రక్షోదార ... ... ..."

అంతేకాక "సంఘం శరణం గచ్ఛామి" అనే బుద్ధుని వాక్యాన్ని పరోక్షంగా గుర్తుచేసి అశ్రితులను

రక్షించటంలో దుష్ట శిష్ట భేదం లేకుండా జలపానం వల్ల, స్నానం వల్ల సర్వులకి పాప విముక్తి కల్గిస్తుందని గంగను గూర్చి గరిష్ఠంగా పల్కాడు.

దేవతలను సంతోషింపజేసే శివుని నాట్యం వలె త్రుళ్ళిపడే చేపలతో నిండింద్రై, వేదాలకు శుభాన్ని సమకూర్చిన మత్స్యావతారం రీతిగా చెవులకు ఇంపు కలిగించింద్రై, ధన దాహంతో సుముఖుడైన దాత దానం రీతి వస్తు సమూహంతో విస్తారమైంది.

నదిలో చేపలు ఎగరటం సహజం వాటిని మత్స్య.కారులు పట్టి అమ్ముకొని ధన సంపాదన చేయటం సాధారణం. ఆ సామాన్య విషయాన్ని పోతన వేదాలను కాపాడిన మత్స్యమూర్తి మహా విష్ణువుని స్తుతించి తన సహజ భక్తిని అతిసహజంగా వెల్లడించాడు.

బలిచక్రవర్తి వంశాన్ని నిర్మూలించిన వామనుని పాదం వలె వెదురు పొదలను కదిల్చి వేసింది. సామభేద మాయోపాయాలతో కూడిన నీతి శాస్త్రంవలె చాతుర్యంతో ఒప్పి అపరిమితమైన లోకాలతో, జంతు సమూహంతో సేవింపబడే బ్రహ్మండం విధంగా లెక్కలేనన్ని నీటి జంతువులతో సేవింపబడి మానవతి రీతి గుట్టు తెలియనీక, ఇల్లాలి వలె చడీ చప్పుడు చేయక, ముద్దరాలి వలె బయలు పడక జవరాలి విధం శీఘ్రగమనం కలిగి పతివ్రత మాదిరి అటూ ఇటూ పోక, తల్లి వలె అన్నింటినీ కడుపులో దాచుకుంటూ, దేవతవలె భక్తుల కోరికలను తీర్చుతూ క్రమక్రమంగా పరిమితిని దాటి మాటకు, మనసుకి అందకుండ ఆ గంగానది భగీరథుని వెంట అవాజ్మానస గోచరమై ప్రవహించింది.

మానవతి అయిన స్త్రీ కష్టాలెన్ని ఎదురైనా సహిస్తుంది కాని బయటకు తెలియనివ్వదు. ఇల్లాలు తన ఇంటి విషయం గోప్యంగా ఉంచుతుంది. ముద్దరాలు తన ఆలోచనని బయటకు వ్యక్తం చేయదు. జవరాలు (నేర్పరితనం కలిగిన స్త్రీ) శీఘ్రగమనంలో పతివ్రతగా దారి తప్పక తల్లివలె కడుపులో పెట్టుకొని తనగృహాన్ని కాపాడుకొంటుంది. అట్లే గంగాదేవి సంసార సాగరాలతో నిండిన ఈ మానవ లోకంలో (భూలోక గృహం) మానవుల పాప పుణ్యాలు తన కడుపులో దాచుకొని సంరక్షించు చున్నదనే విషయాన్ని అభివ్యక్తీకరించాడు.

అంతే కాక దేవత భక్తుల కోరికలు తీర్చటానికై శంభుని శిరం నుండి భువికి దిగి పాతాళంలో ప్రవేశించి సగర పుత్రులను తరింపచేసి భగీరధుని ప్రయత్నాన్ని సఫలం చేసి తన మాతృత్వాన్ని సార్ధకం కావించింది.

ఈ విధంగా పోతన గంగ మహిమాభివర్ణన మహావచనంలో నిక్షిప్తం చేసి భగవత్తత్త్వాన్ని, భాగవత లక్ష్యాన్ని సుస్పష్టమొనరించాడు.

భాగవతుడు భక్తి పథంలో తన లక్ష్యాన్ని చేరుకొనవలెనన్న ఎన్ని ఆటంకాలెదురైన ధీరత్వంతో వాటిని అధిగమించి లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో భగీరధ ప్రయత్నం వల్ల, శరణువేడిన భక్తుని కోరిక తీర్చి వారిని కాపాడుటనే భగవంతుని లక్షణాన్ని (భగవత్తత్త్వం) నిరూపించిన గంగామాత వల్ల పోతన భాగవత లక్ష్యాన్ని నిరూపించాడు.

ఈ భగీరధ ప్రయత్నం త్రేతాయుగంలో జరిగింది. గంగావతరణ ఘట్టాన్ని పోతన భావనాలోకంలో దర్శించి భక్తుడు సహజ పండితుడు కాబట్టి విష్ణు పాదోద్భవ, శివుని శిరస్సు నధిరోహించిన గంగామాత భూలోకానికి అవతరించటంలో ఎన్ని ఇక్కట్లకు లోనైందో, ఎన్ని మలుపులో, అన్ని అవతారకార్యాలు, ఆ గంగా ప్రవాహంలో దర్శించి పఠితలను పరవశింపజేసిన మహనీయుడు, మాననీయుడు, మహాభక్తుడు పోతన మహాకవి.

ఆదికవియైన వాల్మీకి ఆదికావ్యమైన శ్రీమద్రామాయణం బాలకాండలో విశ్వామిత్ర మహర్షిచే శ్రీరామచంద్రునికి గంగోద్భవాన్ని వివరించి, గంగావతరణ వృత్తాంతం ఆయురారోగ్య ఐశ్వర్యాలను, సత్సంతానాన్ని ప్రసాదిస్తుందని, ఈ గంగావతరణ కథవిన్నా ఇతరులకి వినిపించినా వారి పితృదేవతలు మిక్కిలి సంతసించటమేకాక స్వర్గలోకాన్ని కూడా పొందుతారని ఫలశృతి చెప్పాడు.

గంగావతరణ వృత్తాంతాన్ని నవమస్కంధంలో విన్పించిన పోతన, దశమస్కంధ ఉత్తర భాగంలో గంగాదేవి విశిష్ఠతని తెలియచేసాడు.

*మ. "భవదీయోజ్జ్వల కీర్తి దిగ్వితతులన్ భాసిల్లుయుష్మత్పదో*

*ద్భవ నైర్మల్య జలంబు లుత్కలిక బాతళంబునం బాఋభో*

*గవతీ నామమునం దనర్చి ధరణిం గంగానదీ పూరమై*

*దివి మందాకిని యై జగత్త్రయమునం దీపించుగాదే? హరీ"* [102]

దేవర్షినారదుడు శ్రీకృష్ణతత్త్వాన్ని తెలియచేస్తూ విష్ణుపాదోద్భవ యైన గంగ పాతాళంలో భోగవతి అనే పేరుతో భూలోకంలో గంగానది రూపంతోనూ, స్వర్గంలో మందాకినీ నామంతో చెప్పబడి ప్రవహిస్తూ ముల్లోకాలను పావనం చేస్తుందని గంగానది గొప్పతనాన్ని తెలియచేస్తాడు.

భగవంతుని పాదాలనుండి బయలుదేరిన గంగాదేవి శక్తిరూపాన్ని దాల్చి, భూలోకంలో ప్రజలందరిని పునీతులచేసి భగవద్భక్తికి కారకురాలై, భగవంతుని లీలా వినోదానికి సృష్టి స్థితిలయాలకు తోడ్పడింది.

## 35. యోగమాయ

యోగమాయ శుభకరురాలు దేవకీదేవి గర్భంలో ఉన్న శేషాంశని రోహిణి గర్భంలో శ్రీహరి ఆజ్ఞపై ప్రవేశ పెడుతుంది. నంద యశోదలకి బిడ్డగా జన్మిస్తుంది. యోగమాయ 14 నామాలతో పిలవబడుతుంది (1) దుర్గ (2) భద్రకాళి (3) విజయ (4) వైష్ణవి (5) కుముద (6) చండిక (7) కృష్ణ (8) మాధవి (9) కన్యక (10) మాయ (11) నారాయణి (12) ఈశాన (13) శారద (14) అంబిక

వసుదేవునిచే యశోద నుండి దేవకి బిడ్డగా మార్చబడిన యోగమాయని, కంసుడు దేవకీ దేవి బిడ్డగా భావించి సంహరించటానికి కత్తి ఎత్తుతాడు. పసి పిల్లలని చంపిన కంసుని వీరత్వాన్ని ఛీకొట్టి, కంసునితో నిను చంపే వీరుడు నాతో పుట్టి మరో దిక్కున మహా గౌరవములు అందుకుంటున్నాడని తెలియజేసి అదృశ్యురాలైంది.

యోగమాయ ఈ భూమి మీద ఎన్నో చోట్ల ఆరాధ్య దేవతగా అవతరించింది.

*క. "మహనీయ గుణాస్పదయై*

*మహిలో నాదేవి జనము మన్నింపగా*

*బహునామ నివాసంబుల*

*బహు నామములంజరించె భద్రాత్మికయై"* [103]

## 36. కాళింది

కాళింది సూర్య తనయ. ఈమె సౌందర్యవతి. తుమ్మెదల సమూహాన్ని ధిక్కరించే శిరోజశోభ. బాలచంద్రుని పోలిన నెన్నుదురు. అందమైన చెక్కిళ్ళు. లేడి కన్నుల వంటి కన్నులు గలది.

ఈమె తండ్రి ఈమె కోసం యమునా నదిలో ఒక గృహాన్ని ఏర్పాటు చేసి సర్వేశ్వరుడు పద్మాక్షుడైన శ్రీకృష్ణుని భర్తగా కోరి తపస్సు చెయ్యమని చెపితే తపస్సు చేస్తుంటుంది.

నరనారాయణులు అంటే కృష్ణార్జునులు వేటకు వెళతారు. అర్జునునికి దాహమవుతుంది. కృష్ణార్జునులు యమునా నదికి వెళ్ళి దప్పిక తీర్చుకొని ఒక సైకత ప్రదేశంలో కూర్చుని ఉంటారు. కృష్ణార్జునులు యమునా తరంగాల్లో కాళింది ని చూస్తారు. శ్రీకృష్ణుని అనుమతి మేరకు అర్జునుడు కాళింది వద్దకు వెళ్ళి

*మ. "సుదతీ ! యెవ్వరిదాన ! వేమి కొఱకిచ్చోటన్ బ్రవర్తించె? దె*
*య్యేది నీ నామము? కోర్కె యెట్టిది? వివాహ కాంక్షతో 'గూడి యీ*
*నదికిన్ వచ్చిన జాడగాన'బడె ధన్యంబయ్యె నీరాక, నీ*
*యుదయాది స్థితి నెల్ల జెప్పుమబలా? యుద్యత్కురంగేక్షణా!"* [104]

వివాహ కాంక్షతో ఈ నదీ ప్రాంతానికి వచ్చినట్టుగా తోస్తుంది. అట్లైనచో నీరాక ధన్యమైంది. నీ ప్రయత్నం నెరవేరుతుందని, జన్మ విశేషాలను తెలియజేయమని అడుగుతాడు.

నరుని మాటలకు సంప్రీతయై కాళింది

*మ. "నరవీరోత్తమ! యేను సూర్యుని సుతన్, నా పేరు కాళింది, భా*
*స్కర సంకల్పితగేహమందు నదిలోఁ గంజాక్షు విష్ణుం బ్రభున్*
*వరుగా గోరి తపంబుసేయుదు నోరున్ వాంఛింపఁ గృష్ణుండువ*
*న్యరతిన్ వచ్చి వరించు నంచుఁ బలికెన్ నాతండ్రి నాతోడుతన్"* [105]

తన జన్మ విశేషాలు తెలిపి, శ్రీకృష్ణుడు వేటకు వచ్చి, నిన్ను వివాహమాడగలడని తన తండ్రి తనకు తెలియ చేసాడని పలుకుతుంది.

కాళింది చెప్పిన మాటలను అర్జునుడు శ్రీకృష్ణునికి విన్నవించాడు. సర్వజ్ఞుడైన హరి సింహ మధ్యను రథమెక్కించుకొని తీసుకు వెళతాడు. అనంతరం ద్వారకా నగరానికి వెళ్ళి ఒక శుభ ముహూర్తంలో వివాహమాడాడు.

ఈమె తండ్రి చాటు తనయ. పితృభక్తి పరాయణురాలు. తండ్రి చెప్పిన మాటలు తు.చ. తప్పక ఆచరించి దేవాది దేవుడైన శ్రీకృష్ణుని పతిగా పొంది, పదిమంది తనయులతో తన జీవితాన్ని పునీతం కావించుకున్న శక్తి యుక్తురాలైన మహిళ.

### 2.1.2. బ్రాహ్మణజాతి స్త్రీలు

## 1. తుషిత

వేదశిరుడనే బ్రాహ్మణుని భార్య. ఈ దంపతులకు విభుడనే పేరుతో మహా విష్ణువు ఉదయించాడు. కుమార బ్రహ్మచారియై 88000 మంది మహామునుల అనుగ్రహంతో వ్రత దీక్ష నవలంబించాడు. లోకేశ్వరునకే జన్మనిచ్చిన ఈ మహిళ జన్మ పావనమైంది.

*సీ. "స్వారోచిషుండన సప్తార్చి బిడ్డండు మనువు వానికి నాద్యుమత్సుషేణ*
*రోచిష్మదాదు లారూఢ పుత్త్రులు ధాత్రినేలిరి, రోచను, డింద్రుడయ్యె,*
*నధికులు తుషితాదులమరులూర్జ స్తంబముఖ్యులాఢ్యులు సప్తమునులు నా (డు*
*వేదశిరుండను విప్రుని దయితకు (దుషితకు (బుత్త్రుడై తోయజాక్షు (.*

*ఆ. దవతరించెను విభు ( డన నశీత్యష్టస,*
*హస్ర మునులు నధికులయిన వారు,*
*ఘనులనుగ్రహింప ( గౌమారక బ్రహ్మ*
*చారియగుచు నతండు సలిపె వ్రతము"* [106]

## 2. దేవయాని

ఈమె రాక్షస గురువైన శుక్రాచార్యుడి కుమార్తె. ఈమె రాక్షస రాజైన వృషపర్వుడి కుమార్తె శర్మిష్ఠ వెంట ఒక రోజు ఉద్యాన వన విహారానికి వెళుతుంది. జలక్రీడా సమయాన తత్తర పాటుతో దేవయాని చీరను శర్మిష్ఠ ధరిస్తుంది. దేవయాని మహానియమ వంతులైన భృగువంశీయుడైన గురు పుత్రికను నేను. నా వస్త్రం నీవెలా కట్టుకున్నావని శర్మిష్ఠని నిందిస్తుంది.

శర్మిష్ఠ దేవయాని అహంకార పూరిత మాటలకి ఆగ్రహించి, చెలికత్తెలచే దేవయానిని బావిలో పడత్రోయించింది.

### యయాతిచే రక్షింపబడిన దేవయాని

దేవయాని పై బట్టలేక దు:ఖిస్తూ పేరు పేరునా బంధువులను పిలుస్తూ బావిలో విలపిస్తూ ఉంటుంది. యయాతి మహారాజు కట్టుకోవడానికి పై బట్టనిచ్చి తన దక్షిణ హస్తాన్నందించి దేవయానిని పైకి లాగి రక్షిస్తాడు.

### దేవయాని యయాతిని వరించటం

యయాతిచే రక్షింపబడిన దేవయాని యయాతితో

*మ. " నను ( బాణి గ్రహణంబు చేసితిగదా నా భర్త వున్నీవదై*
*వనియోగంబిది పౌరుషంబునకు నావాక్యంబు సిద్ధంబుసౌ*
*ఖ్య నివాసున్నిను మాని యొండు వరునింగాంక్షింపనే నేర్తునే?*
*వనజం బానెడి తే ( టి యన్య కుసుమావాసంబపేక్షించునే?"*[107]

నీవు నా చేతిని పట్టుకున్నావు కనుక నీవే నా భర్తవు. ఇది దైవ ఘటన. కచుని శాప వృత్తాంతం తెలియచేసి యయాతిని ఒప్పించి వరిస్తుంది.

### దేవయాని ప్రతీకారం

యయాతి వెళ్ళిన తర్వాత దేవయాని శుక్రుని వద్దకు వెళ్ళి శర్మిష్ఠతో తనకు జరిగిన అవమానాన్ని వివరించి కన్నీరు మున్నీరుగా దు:ఖిస్తుంది.

దేవయాని అవమాన భారానికి శుక్రుడు ప్రతీకారం చేయాలనుకుంటాడు. రాక్షస రాజ కుమార్తె వల్ల తన తనయ పొందిన అవమానాన్ని తెలిసి కొన్న శుక్రుడు కఠినాత్ముల వద్ద పౌరోహిత్యం చేయటం మహా పాపమని రాజ్యం విడిచి వెళతాడు.

దేవతలను జయింపకోరిన, రాక్షస రాజు విషయం తెలిసికొని, గురువైన శుక్రుని పాదాలపై పడి ప్రార్థించి ప్రసన్నుని చేసుకొంటాడు. వేయిమంది చెలికత్తెలతో నీ కూతురు దాసి వలె నా పుత్రికను సేవిస్తుంటే నా కోపం తీరుతుందని అంటాడు శుక్రుడు. ఆ విధంగా ఊడిగం చేసే విధంగా నీవు చేస్తే నా కూతురిని వెంటబెట్టుకొని తిరిగి నీ రాజ్యానికి వస్తానంటాడు. వృషపర్వుడట్లే చేస్తాడు. తండ్రి ఆజ్ఞమేరకు శర్మిష్ఠ దేవయానికి దాసి అయింది.

### దేవయాని వైవాహిక జీవితం

*ఉ. "ఆతతమైన వేడ్క దనుజాధిప మంత్రి సురారినందనో*
*పేత 'దనూభవం బిలిచి పెండ్లి యొనర్చె మహా విభూతికిన్*
*బ్రీతి మహోగ్రజాతికి నభీతికి సాధువినీతికిన్ సిత*
*ఖ్యాతికి భిన్న దుష్కలహ కార్యభియాతికి నయ్యయాతికిన్"* [108]

శుక్రాచార్యుడు రాక్షస రాజపుత్రిక సేవలందు కొనే కుమార్తెను అభినందించి పరాక్రమోపేతుడు, సద్గుణ శోభితుడైన యయాతి కిచ్చి పెళ్ళి చేసాడు. వివాహం చేసిన శుక్రుడు యయాతికి శర్మిష్ఠతో శరీర సంపర్కం పెట్టుకోవద్దని హెచ్చరించి పంపాడు. అయినా విధివశాన యయాతి శర్మిష్ఠతో శరీర సంపర్కం పెట్టుకొని ముగ్గురు తనయులనిచ్చాడు. ఈ విషయం తెలిసిన దేవయాని తండ్రికి తెలియ చేసింది.

### శుక్రుడు యయాతిని శపించటం

యయాతితో శుక్రాచార్యుడు ఓ రాజా! నా మాట కాదని రాక్షస స్త్రీని పొందావు కాముకులైన వారికి, ప్రలోభచిత్తులకు సత్యనిష్ఠ ఎక్కడిది? అని పలికి స్త్రీలు అసహ్యించుకొనే వృద్ధాప్యం నిన్ను పొందుగాక అని శపించాడు. మామగారికో నీ కూతురి పట్ల నాకు విషయ వాంఛలు ఉడిగి పోలేదు. మరి కొంత కాలం తర్వాత ముసలి తనాన్ని పొందుతానని దేవయానిని తీసుకొని నగరానికి వెళ్ళి తన పుత్రులొక్కొక్కరిని పిలిచి జరిగిన విషయం చెప్పి తన వృద్ధాప్యం స్వీకరించి యౌవనం ఇవ్వమని కోరతాడు. చివరికి పూరుడనే కనిష్ఠతనయుండంగీకరించి తండ్రి కోరికను నెరవేరుస్తాడు.

### పతి ధర్మానుసారిణి దేవయాని

భర్తకోరికలనుగుణంగా నడుస్తూ, అఖండ సామ్రాజ్య వైభవాన్ని అనుభవిస్తూ, భర్త ఆత్మోపదేశం చేయగా అందలి సత్యాన్ని గుర్తించి, అతనికి (యయాతి మహారాజు) సహకరించిన మహాసాధ్వి దేవయాని.

### దేవయాని పాత్ర వైశిష్ట్యం

దేవయాని యయాతితో తన జీవిత విషయాలను ఏది దాచకుండా తన అభిప్రాయాన్ని తెలియచేసి, తండ్రికి తెలియ చెప్పి యయాతి మహారాజును వివాహం చేసికొని గృహిణిగా తన

కర్తవ్యాన్ని అన్ని విధాల పాటించిన ధర్మశీలి. తన వలె తన పతి కూడా తనతో ఉండాలని కోరుకుంది. ఎప్పుడైతే యయాతి తనకు తెలియకుండా,తన తండ్రి మాటను కూడా లెక్క చేయక, శర్మిష్ఠతో శరీర బంధాన్ని కలిగి పుత్రులను పొందాడో, అప్పుడు స్వసుఖం గూర్చి కూడా ఆలోచింపక, తన భర్త తప్పుకి తగిన శిక్షని తన తండ్రిచే విధింపచేసింది. తను ధరించటానికి పై వస్త్రం కూడా లేని స్థితిలో క్షత్రియాహంకారంతో కళ్ళు మూసుకు పోయి చెలికత్తెలచే దారుణంగా నూతిలో పడ ద్రోయించిన శర్మిష్ఠ చేత జీవితాంతం దాస్యం చేయించుకొని, తన ఆధిక్యతను లోకానికి ప్రకటించింది.

శుక్రాచార్యుడు వంటి తపస్సంపన్నుడైన తండ్రి కలిగిన ఏ స్త్రీ అయినా, ధర్మాచరణకి భయ పడాల్సిన అవసరముండదు. ధర్మోల్లంఘన గావించిన వారిని, మాట తప్పి నీతిమాలిన వారిని సులభంగా శిక్షింపవచ్చు. సత్యనిష్ఠ, ధర్మాచరణ ఈ రెండు లక్షణాలు ఈ పాత్రలో సుస్పష్టమవుతాయి.

"సత్యంవద, ధర్మంచర" అన్న ఉపనిషద్వాణికి అద్దం పట్టిందీ పాత్ర.

## 3. ముని పత్నులు

ఈ సృష్టికి తానే (అధిపతినని) సృష్టికర్తనని అహంకరించి శ్రీకృష్ణుడే ఆదినారాయణుడు అని బ్రహ్మ గుర్తించే

*"మబ్బుగొలిపి యోగ మాయ నిద్రించిన,*

*యోపరాత్మ భూమ! యోగిరాజ!*

*యే తెఱంగులెన్ని యెప్పుడెచ్చోట నీ*

*హేల లెవ్వ ( డెఱు ( గు నీశ్వరేశ!"* [109]

పలికిన పలుకులివి. బ్రహ్మదేవుడు చెప్పిన విధంగా ఆ ఈశ్వరేశుడైన శ్రీకృష్ణుని హేలలు ఎప్పుడే విధంగా ఉంటాయో ఎవ్వరికి తెలియదు.

శ్రీకృష్ణుడు బలరామ సహితుడై గోపకులతో గోవులను మేపుతూ బృందావనం దాటి చాల దూరం వెళతాడు. వేసవి కాలపు ఎండలో చిక్కుపడి భానుతాపం భరించలేక గోపకులు బడలి పోతారు.

గోపాలకులు యమునా నదికి వెళ్ళి, పశువులకు నీళ్ళు త్రాగించి, తమకు ఆకలివేస్తుందని బలరామ శ్రీ కృష్ణులకు విన్నవించుకుంటారు.

శ్రీకృష్ణుడు గోపాల బాలకులతో "ఈ వనంలో వేదవేత్తలైన భూసురులున్నారు. వారి వద్దకు వెళ్ళి మాపేరు, మా అన్నగారి పేరు చెప్పి అనురాగ పూర్వకంగా మంచి మాటలతో అర్థించండి. వారు అన్నం పెడతారని" చెపుతాడు శ్రీకృష్ణుని మాటల మేరకు గోప బాలకులు భూసురులను అన్నమడిగి భంగపడి నిరాశతో తిరిగి వచ్చి శ్రీకృష్ణునకు విన్నవిస్తారు.

శ్రీకృష్ణుడు లోక వ్యవహారాన్ని అనుసరిస్తూ మీరు మరల ఆ పెద్దలను అడగొద్దు. బలరామ కృష్ణులు ఈ వనానికి వచ్చారని వారి భార్యలకు చెప్పండి. అన్నం పెడతారు వెళ్ళండి. అని గోప బాలురను పంపిస్తాడు.

గోపాలురు యజ్ఞవాటికకు వచ్చి భూసుర పత్నులను దర్శించి నమస్కరించారు. ఎంతో సంతోషంతో ఆదరింపబడిన ఆగోప బాలురు ముని పత్నులతో

*క. గోవుల మేపుచు నా'కొని*

*గోవిందుండన్న మడిగి కొనిరండని మ*

*మ్మీవేళం బుత్తెంచెను,*

*ధీ విలసితలార! రండు! తెండన్నంబుల్"* [110]

గోవులు మేపుతూ గోవిందుడు అన్నం అడిగి తీసుకు రమ్మన్నాడని చెపుతారు.

గోప బాలకుల మాటలు వింటూనే ఆ బ్రాహ్మణ స్త్రీలు కుతూహలంతో చతుర్విధ ఆహారాలను తీసుకుని (భక్ష్యం, భోజ్యం,చోష్యం, లేహ్యం) సముద్రుని చేరే నదుల వలె వేగంగా బయలు దేరారు.

*క. "బిడ్డలు మగలునుభ్రాతలు,*

*నడ్డముచని వలదనంగ నటుదల ( దని మా*

*టొడ్డుచు జగధీశ్వరునకు,*

*జడ్డన నన్నంబు గొనుచు ( జని రాసుదతుల్"* [111]

బ్రాహ్మణ స్త్రీలు భవబంధాలను లెక్కించక జగన్నాధునకు ఆహారం తీసుకు వెళ్ళారు.

## శ్రీకృష్ణ దర్శనం

శ్రీకృష్ణుడు కాళింది నదీ తీరంలో క్రొంజిగురు జొంపాలతో సొంపారుతూ వనచరుల క్లేశాలు హరించే ఒక అశోకవృక్షం క్రింద నిర్మల ప్రదేశంలో

*సీ. ఒక చెలికానిపై నొక చేయు సా ( చి వేఱొక చేత లీలాబ్జమూ ( చువాని (*

*గొప్పున కందని కొన్ని కుంతలములు సెక్కుల నృత్యంబు సేయువాని'*

*గుఱుచ చుంగులు పుచ్చి కొమరార ( గట్టిన పసి ( డివన్నియ గల పటము వాని*

*నౌ ( దల ( దిరిగి రానలవడ ( జుట్టిన దట్టంపు ( బించెపు దండవాని*

*తే. రాజితోత్పల కర్ణపూరములవాని*

*మహిత పల్లవ పుష్పదామముల వాని*

*భువన మోహన నటవేష భూతి వాని (*

*గనిరి కాంతలు కన్నుల కఱవు దీఱ"* [112]

లీలామానుష విగ్రహుడై ఈ బ్రాహ్మణ పత్నులకు దర్శనమిచ్చాడు.

## శ్రీకృష్ణునిపై ముని పత్నుల భావన

గోకుల విహారిని భూసురాంగనలు శ్రీకృష్ణ స్వరూపాన్ని మనస్సులందే ఆలింగనం చేసుకున్నారు. భూసురాంగనలకు ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికమైన త్రివిధ తాపాలు ఉపశమించి హృదయాల్లో శ్రీకృష్ణుని ఆలింగనం చేసుకున్నారు.

## శ్రీకృష్ణుని అనుగ్రహ భాషణం

ఈ రీతిగా తనని దర్శించటానికి భవబంధాలను వదలి తహతహతో ద్విజాంగనలు రావటం సర్వదర్శనుడైన పద్మపత్ర నేత్రుడు గ్రహించాడు. చల్లని చూపులతో నిదానించి ఒక చిరునవ్వు నవ్వి వారితో

*శా. "కాంతారత్నములారా! మీగృహములంగల్యాణమే! యేమిగా*

*వింతున్ మీ? కిటురండు, మమ్ము నిచటన్ వీక్షింప నేతెంచినా*

*రెంతో వేడుకతో, నెఱుంగుదురు నిర్హేతుస్థితిన్ నన్నుధీ*

*మంతుల్ మీక్రియ ( జేరి కందురు గదా మత్సేవలన్ సర్వమున్"* [113]

అన్నం తెచ్చిన ద్విజాంగలను కుశలమడిగి ఫలాపేక్ష రహితలైన మీకు నేనేమి చేయగలనని, విజ్ఞానులు మీవలనే నాకడకు వచ్చి సేవలొనర్చి, నా కొలువు చేసి తమ కోరికలను నెరవేర్చు కొంటారని తెలియచేస్తాడు.

మీ గృహాల్లో మీరు మీ భర్తలతో కలసి యజ్ఞాన్ని నిర్విఘ్నంగా పూర్తిచేయ గల్గుతారు వెళ్ళండని అనుమతిస్తాడు.

**ముని పత్నుల శరణాగతి**

*మ. "తగునే మాధవ! యిట్టివా'డి పలుకుల్? ధర్మంబులే మా యెడన్?*
*మగలున్ బిడ్డలు సోదరుల్ జనకులున్ మమ్మున్ నివారింపమ*
*చ్ఛిగ నీయంఘ్రులు సేరినారమట ( బో ( జే కొందురే వార? లా*
*పగిదే మొల్లము, కింకరీ జనుల'గా భావించి రక్షింపవే"?* [114]

భవబంధాలు త్రెంచుకొని నీచరణాల చెంతకు చేరిన మమ్ము వారు స్వీకరిస్తారా? మేము మా గృహాలకు వెళ్ళలేము. మమ్ము నీ దాసీ జనంగా భావించి కాపాడుమని శరణాగతి చేసారు.

**శ్రీకృష్ణుడు మోక్షమార్గం తెలియచేయటం**

శరణాగతి చేసిన భూసురాంగనలతో దేవాది దేవుడైన శ్రీకృష్ణుడు

*సీ "నా సమీపమున నున్నారంచు నలుగురు బంధులు భ్రాతలు పతులు సుతులు*
*మిమ్ము దేవతలైన మెత్తురంగనలార! నాదేహ సంగంబు నరుల కెల్ల*
*సౌఖ్యానురాగ సంజనకంబుగాదు, ముక్తి ప్రదాయకము, నా కీర్తనమున*
*దర్శనా కర్ణన ధ్యానంబులను గర్మబంధ దేహంబుల ( బాసిమీరు"*

*తే. "మానసంబులు నాయందు మరగ ( జేసి,*
*నన్ను జేరెదరట మీ ( ద నమ్ము ( డనుచు*
*బలికి వారలు దెచ్చిన భక్షణాదు,*
*లాప్తవర్గంబుతో హరి యారగించె"* [115]

ఓ ద్విజపత్నులారా! మీరు నావద్ద ఉన్నారని మీవారెవ్వరు మిమ్ము కోపగించుకోరు. వారే కాదు దేవతలు కూడ మిమ్ము ప్రస్తుతిస్తారు. నరుల శరీర సంగమంవలె నా సాంగత్యం సౌఖ్యానురాగాలు ఇచ్చేది కాదు. ఇది కేవలం ముక్తి దాయకం. నన్ను స్తుతించడం వల్ల, నన్ను ధ్యానించటం వల్ల మీరు కర్మానుబంధమైన కాయం విడిచి మనస్సు నాయందే లగ్నం చేసి ఉచిత కాలంలో నన్ను పొంద గల్గుతారు. నా మాటలు నమ్మండి. అంటూ వాసుదేవుడు వారి తెచ్చి పెట్టిన ఆహారాలు ఆప్త మిత్రులతో కలిసి ఆరగిస్తాడు.

తమ పతుల యజ్ఞం చేస్తున్నప్పటికి, ముని పత్నులు యజ్ఞం పరిసమాప్తి కాకపోయినా గోప బాలుర మాటలనాదరించి ఆహారాన్ని తీసుకొని బలరామకృష్ణులను దర్శించాలనే నిమిత్తంతో భవ బంధాలను ప్రక్కకు త్రోసి మరీ వచ్చారు. వారి ఆధ్యాత్మిక జ్ఞానానికిది గీటురాయి.

చతుర్విధ పురుషార్థ సాధకుడైన శ్రీకృష్ణునకు చతుర్విధ ఆహారాలు సమర్పించాలని తీసుకురావటం వారి విజ్ఞతకు నిదర్శనం. భగవంతుని ఎలా చేరుకోవాలో భగవంతుని చేతనే చెప్పించుకున్న ధన్యజీవులు.

లోకంలో ఎవరికైనా దానం చేసేటపుడు "శ్రీకృష్ణార్పణమస్తు" అని సమర్పిస్తే అనంత పుణ్యం లభిస్తుందని ఆర్యులంటారు. అలాంటిది ఆ ముని పత్నులు స్వయంగా, ప్రత్యక్షంగా శ్రీకృష్ణునకు ఆహారం సమర్పించి తమ మానవ జన్మను సార్ధకం చేసికొని భాగవతంలో భక్తికి నిధానంగా స్థానం సంపాదించుకున్నారు. అంతేకాక తమపతులకు వారి చేష్టల ద్వారా జ్ఞాన నేత్రాలు తెరిపింప చేశారు.

## 4. కుచేలుని భార్య

పోతన భాగవతంలో ఈమె నామాన్ని చెప్పలేదు. కాని "శ్రీభాగవతము - ఉపాఖ్యాన ములు" అనే గ్రంథంలో శ్రీమతి ప్రభల (పోతుకూచి) వెంకట నాగలక్ష్మి గారు 'కుచేలోపాఖ్యానం' చెపుతూ కుచేలుని భార్య నామాన్ని కల్యాణిగా పేర్కొన్నారు. ధర్మ పరిచయ ములో హిందూ ధర్మ ప్రచార పరిషత్తువారు 'వామాక్షి' అని పేర్కొన్నారు. కుచేలుని భార్య మహా ఇల్లాలు. మహా ఇల్లాలుంటే ఇంటిని ఏపరిస్థితులలో నైన చక్కదిద్దుకో గలిగిందన్న అర్థాన్ని మనం భావన చేస్తే ఈ మహా సాధ్వి సామర్థ్యం మనకు అవగతమవుతుంది.

శ్రీకృష్ణుని బాల్య సఖుడు కుచేలుడు.

### కుచేలుని భార్య

*సీ. "లలిత పతి వ్రతాతిలకంబు వంశాభిజాత్య తద్భార్య దుస్సహదరిద్ర*
*పీడచే ( గడు నొచ్చి పెదవులు దడుపుచు శిశువులా ( కటి చిచ్చుచే గృశించి*
*మలమల మా ( డుచు మానసం బెరియంగ ( బట్టె ( డోరెము మాకు బెట్టుమనుచు*
*బత్తభాజన ధృత ప్రాణులై తను'జెరి వే'డిన వీనులు సూడినట్ల"*

*ఆ. యైన నొకనా ( డు వగచి నిజాదినాధు (*

*జేరి యిట్లని పలికెనో జీవితేశ !*

*తట్టు ముట్టాడు నిట్టి పేదఱికమిట్లు*

*నొంపదీని కుపాయ మూహింపవైతి."*[116]

ఉత్తమ వంశ సంజాతయైన కుచేలుని భార్య పతివ్రతా లక్షణాల చేత ప్రకాశిస్తూ, సహింపరాని పేదరికంతో పీడింప బడుతుంది. కటిక దారిద్ర్యంతో బిడ్డలకు పట్టెడన్నం పెట్టలేని దీన స్థితిలో ఉంది. ఆమె భర్తతో దారిద్ర్య నివారణకొక ఉపాయం చెప్పింది.

*తే. "బాలసఖుండైన యప్పద్మ పత్రనేత్రు (*

*గాననే ( గి దారిద్ర్యాంధ కార మగ్ను*

*లైన మనము నుద్ధరింపుము, హరికృపా క*

*టాక్ష రవిదీప్తి వడసి మహాత్మ! నీవు"*[117]

బాల్య మిత్రుడైన శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి దారిద్ర్యాంధకారం నుండి మమ్మును దరిచేర్చి కాపాడమని భర్తను అడుగుతుంది.

ఇంకా శ్రీకృష్ణుని గుణగణాలను తెలియ చేస్తుంది.

*చ. "వరదు ( డు సాధు భక్తజన వత్సల ( డార్త శరణ్యు ( డిందిరా*

*వరు ( డు దయాపయోధి భగవంతు ( డు కృష్ణుడు దా ( గుశస్థలీ*

*పురమున యాదవ ప్రకరముల్ భజయింప ( గ నున్నవా ( డు, నీ*

*వరిగిన నిన్ను ( జూచి విభు ( డప్పుడ యిచ్చు ననూన సంపదల్"*[118]

సాదు భక్తజన వత్సలుడు, ఆర్తశరణ్యుడైన లక్ష్మీ వల్లభుడు కొరతలేని సంపదను అనుగ్రహిస్తాడని తెలియ చేస్తుంది. ఇంకను

*మ. "కలలోనందను మున్నెఱుంగని మహాకష్టాత్ముడైనట్టిదు*

*ర్బలు ( డాపత్సమయంబునన్ నిజపదా జ్ఞాతంబు లుల్లంబులో (*

*దల ( పన్నంతన మెచ్చి యార్తి హరుడై తన్నైననిచ్చున్, సుని*

*శ్చలభక్తిన్ భజియించువారి కిద'దే సంపద్విశేషోన్నతుల్?"*[119]

తనను కల్లో కూడ స్మరించని కష్టాత్ముడు ఆపద సమయంలో స్మరించిన వారిని ఉద్ధరిస్తాడు. అంతటి దయాపరుడు నిశ్చల భక్తితో నిరంతరం సేవించే తనవారికి సమస్త సంపదల గొప్ప గౌరవాన్ని ఇవ్వకుండ ఉంటాడా? అని ప్రశ్నించి, ప్రశ్నలోనే భర్తకు శ్రీకృష్ణతత్వాన్ని వెల్లడించిన మహాభక్తురాలు.

కుచేలుడు భార్య చెప్పిన నీతియుక్తమైన, సరియైన మాటలకు సంతోషించాడంటే కుచేలుని ధర్మపత్ని (కల్యాణి) గృహస్థ జీవితంలో ఇల్లాలుగా మహోన్నత స్థానం సంపాదించిందన్న పరమ సత్యం వెల్లడవుతుంది.

కటిక దారిద్ర్యంలో ఉండికూడా శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళే భర్తకి అటుకులు చినిగిన వస్త్రపు కొంగులో కట్టి ముడివేసి ప్రేమతో ప్రయాణానికి సిద్ధం చేసింది. శ్రీకృష్ణుడు కుచేలునికి రుక్మిణీ సమేతుడై అతిథి మర్యాదలు చేసి, కుచేలుని భార్య కట్టిన అటుకుల మూటను విప్పి, పిడికెడు అటుకులు భక్షించటంతోనే ఈమె దారిద్ర్యం తొలగి సంపన్నురాలైంది. ఈమె శ్రీకృష్ణ భక్తితో దారిద్ర్యాంధకారాన్ని తొలగించుకొని. శ్రీకృష్ణుని వద్దకు తన భర్తయైన కుచేలుని పంపటం వల్ల లోకానికొక క్రొత్త సందేశాన్ని అందించింది. స్నేహ బంధం ఎలా ఉంటుందో తెలియటమే కాక స్నేహానికి రాజు పేద తారతమ్యముండదు, ఉండకూడదు. సాక్షాత్తు దేవాది దేవుడైన శ్రీకృష్ణుడే బాల్య మిత్రుడిని ఆదరించి సంపదలిచ్చాడంటే, భౌతిక ప్రపంచపు అసమానతలు స్నేహానికి అడ్డు రాకూడదనే సందేశాన్ని, లోకానికి అందటానికి కుచేలుని భార్య పరోక్ష కారణమైంది.

ఉత్తమ వంశ సంజాతగా ఈమె ఆలోచనలు కూడ ఉన్నతంగా ఉన్నాయి. "శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు". అని జ్ఞాన హీనులు తాత్కాలిక నివారణకి వక్రమార్గంలో పయనిస్తారు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన భర్తకు బ్రహ్మ జ్ఞానులు చెప్పే ఉపాయం చెప్పి "దీనుల పాలిటి కామధేనువు" దేవాది దేవుడైన శ్రీకృష్ణుడేనని, దారిద్ర్య నివారణకి తరుణోపాయము తెలియచేసి 'కరణేషుమంత్రి' అన్న ఆర్యోక్తిని ఋజువు చేసిన ఉత్తమ గృహిణి.

## 5. వర్ష

ఈమె కృతయుగంలో మరీచి భార్య. ఈమెకు ఆరుగురు పుత్రులు కలిగారు. ఈ ఆరుగురు ఒకనాడు బ్రహ్మను దర్శించబోయి పుత్రిక అయిన సరస్వతిని బ్రహ్మకామించి శృంగార క్రీడకి ఉపక్రమించగా వారు పరహసించారు. అందులకు బ్రహ్మ ఆగ్రహించి రాక్షసులుగా జన్మించమని

శపిస్తాడు. ఆ శాప ఫలితంగా హిరణ్య కశిపుని కొడుకులుగా జన్మించారు. తర్వాత దేవహితం కోసం యోగమాయ ఆ ఆర్గురిని తీసికెళ్ళి దేవకీ గర్భంలో ప్రవేశింపచేస్తుంది.

ఈమె గురించి శ్రీకృష్ణుడు బలిచక్రవర్తికి తెలియచేస్తాడు. బలరామ కృష్ణులు మృతులైన గురు పుత్రులను పునర్జీవితులను చేసి తీసుకు వచ్చారనే విషయం తెలిసి దేవకీదేవి తన బలరామ కృష్ణులకు తనకు ముందు జన్మించిన ఆర్గురు పుత్రులను చూడాలని కుతూహలంతో కోరుతుంది. తల్లి కోరిక నెరవేర్చటానికి బలరామ కృష్ణులు సుతల లోకానికి వెళతారు. సుతలానికి రాజు బలి చక్రవర్తి. బలి చక్రవర్తి బలరామ కృష్ణులకు ఆతిధ్యమిచ్చి పాదసేవ చేసి "దేవా! యేనుభవద్దాసుండ! నేది పంచినం జేయుదు నిచ్చటికి మీరలు విజయంబు చేసిన కార్యంబానతీయ"[120] వలెనని చేతులు మోడ్చి విన్నవించ, పుండరీ కాక్షుడు అతని మాటలకి సంతసించి బలి చక్రవర్తితో ఈ వృత్తాంతం వివరిస్తాడు.

## 6. పురాతన పుణ్య కథ

శ్రీకృష్ణుడు ఉద్ధవునితో 'పింగళ' వృత్తాంతం విన్పించిన అనంతరం

*వ. "మఱియు నొక్క విశేషంబున పురాతన పుణ్య కథ వినుము. కనకావతీ పురంబున నొక్కధరామరుని కన్యకా రత్నంబు గల దవ్వధూటి తిలకంబు ... ... ... ... భక్తి యోగంబున ( జింతించి ముక్తలై, లిది భక్తియోగ ప్రకారంబని యుద్ధవునికిం జెప్పిన."*[121]

కనకావతీపురంలో ఒక బ్రాహ్మణ కన్యకారత్నముంది. ఆ వధూమణి తన చేతులకి రత్నాలు పొదిగిన కంకణాలు ధరించి ఉంది. ఒకసారి వాళ్ళ ఇంటికి బంధువులు వచ్చారు. ఇంట్లో బియ్యం లేవు, వడ్లు దంచి బియ్యం చేసి అన్నం వండి పెట్టాలి. బంధువులకి తెలియకుండా ఇంటిలోపల ఆమె రోకలితో వడ్లు దంచుతుంటే ఆరోకలి బరువు చేత ఆ కంకణాలు గల్లుగల్లుమని పెద్ద శబ్దం వస్తున్నదని ఆ పరమ పతివ్రత ఆ శబ్దానికి ఇష్టపడనిదై నిశ్శబ్దంగా చేతికి ఒక్కగాజు మాత్రమే ఉంచి మిగిలిన గాజులు తీసి అవతలపెట్టి తనపని నెరవేర్చుకొంది.

గృహస్థాశ్రమం స్వీకరించిన ఆ గృహిణి ఇంటికి వచ్చిన వారికి ఆతిధ్యమివ్వటానికి, ధర్మానికి కట్టుబడి కష్టపడింది. ఆ కష్టాన్ని ఇతరులు గుర్తించకుండటానికి అవసర చర్యలతో ఎంతో శ్రద్ధతో,

నిష్ఠతో తన కార్యక్రమాన్ని పూర్తిచేసింది.

ఒక సామాన్య గృహిణికుండవలసిన ఓర్పు, నేర్పు ఈ పాత్రలో సుస్పష్టమవుతుంది. అందు వల్లనే శ్రీకృష్ణ పరమాత్మ హృదయంలో ఈమె చరిత్ర చోటు సంపాదించుకో గల్గింది. పరమాత్మ నాకర్షించగల్గిన నడవడి కంటె పరమ ధర్మమేముంటుంది. పరమాత్మ హృదయాకర్షకమైన జీవునికి ఆపరమాత్మే పరతత్త్వాన్ని తెలియచేసి ముక్తి ప్రసాదిస్తాడు.

భాగవత కథలో ఈమె ప్రధాన పాత్ర కాకపోయినా, భగవంతుని దృష్టిలో, కర్తవ్య నిర్వహణలో, కర్మమార్గాన్ని అనుసరించిన ఈ బ్రాహ్మణ కన్యకారత్నం నిలిచిపోయింది. పరమాత్మ దృష్టిని నిలుపు కోగల్గిన జీవుని జన్మే ధన్యం చరితార్థం.

ఈమె వివాహిత అవునా? కాదా? అనే విషయం సుస్పష్టంగా లేదు. కన్యకారత్నం అని ముందు  చెప్పి 'వధూమణి' అనటం వల్ల వధూ శబ్దవాచకం వివాహిత స్త్రీకి సర్వ సాధారణంగా ప్రయోగించే వాడుక ఉంది. అందువల్ల ఈమెను గృహస్థ స్త్రీగానే పరిగణించవచ్చు.

### 2.1.3. క్షత్రియజాతి స్త్రీలు

### 2.1.3.1. మనువంశ స్త్రీలు

## 1. శతరూప

చతుర్ముఖబ్రహ్మ ప్రజాభివృద్ధి కోసం దైవాన్ని ధ్యానించారు.

*వ. "అని యిట్లు విదురండడిగిన మైత్రేయుండతనితో నిట్లనియె ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... యధోచిత కృత్య కరణ దక్షుండగుచుండ చతుర్ముఖుని దేహంబు ద్వివిధంబయిన నట్టిరూప ద్వయ విభాగంబు స్వరాట్టగు "స్వాయం భువ" మనువును, దన్మహిషియగు "శతరూప" యను కన్యకయుం గామిధునంబయి జనియించె ... ... ... ... ... ... ... ... వీరల వలన గలుగు ప్రజా సంతతులచేత జగంబులు పరిపూర్ణంబులయ్యె".* [122]

బ్రహ్మదేవుని దేహం రెండు భాగాలైంది. అందొకటి స్వరాట్టు అయిన "స్వాయంభువ మనువు", మరొక్కటి స్వాయంభువ మనువు భార్య 'శతరూప' అనే అంగనగా రూపొందాయి. మానవ జాతిలో స్వాయంభువ మనువు - శతరూపలు ఆది మిధునం, ఈ దంపతులకి ప్రియపుత్రుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు పుత్రులు. ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే ముగ్గురు పుత్రులు.

**వైశిష్ట్యం** - శతరూప పవిత్ర పావన మహిళ. ఈమె జ్యేష్ట పుత్రుడైన ప్రియవ్రతుడు సప్తద్వీప సమేతమైన ఈ భూమండల మేర్పడటానికి కారణమై భరతఖండ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాడు.

కనిష్ఠ పుత్రుడైన ఉత్తానపాదుడు ధ్రువుని వంటి మహావిష్ణు భక్తుని పుట్టుటకు కారణమై ధన్య చరితుడయ్యాడు.

ఈమె జ్యేష్ఠకుమార్తె ఆకూతి శ్రీహరి అవతారమైన సుయజ్ఞునికి జన్మనిచ్చింది. ద్వితీయ తనయ దేవహూతి కపిలునికి జన్మనిచ్చి అద్వితీయంగా భాగవత సేవలో తరించి, భగవత్పథాన్ని చేరుకొంది. ఇక కనిష్ఠ పుత్రిక ప్రసూతి దక్ష ప్రజాపతి భార్యయై సతీదేవికి జన్మనిచ్చి తరించింది. శతరూప స్వాయంభువ మను పత్నియై చరిత్ర ఖ్యాతిగాంచి, పాంచ భౌతికమైన దేహంతో ఐదుగురికి జన్మనిచ్చింది. ఈ పృథివీ మండలంపై జ్ఞాన శక్తిని, భక్తిని శ్రీహరి ఆరాధనని చాటి చెప్పడానికి కారకురాలైన ఆదర్శ మహిళ. ఆదిమహిళ. పతిననుసరించిన పత్ని.

## 2. ఆకూతి

ఈమె స్వాయంభువ మనువు - శతరూపల ప్రథమ పుత్రిక. శ్రీమన్నారాయణుని లీలావతారంబుల వర్ణనలో బ్రహ్మదేవుడు నారదునికి సుయజ్ఞవతారం గూర్చి వివరిస్తాడు. "ఈ సుయజ్ఞుడు రుచి ప్రజాపతి - ఆకూతి అను సుగుణవతికి జన్మించెను" అనే మాటలను బట్టి ఆకూతి రుచి ప్రజాపతి పట్టమహిషి అని, గుణవంతురాలని వ్యక్తమవుతుంది.

ఈమె పుత్రుడు ఉత్తమ జ్ఞాననిధియై శ్రీహరి అవతారంగా ఖ్యాతిగాంచాడు. సాక్షాత్తు హరి అవతార రూపమైన సుయజ్ఞునికి జన్మనిచ్చిన పరమ పావన స్త్రీమూర్తి ఆకూతి (ద్వితీయ స్కంధంలో చెప్పబడిన విషయం)

## 3. దేవహూతి

*చ. "ధృతమతి దేవహూతికిని దివ్య విభుండగు కర్దమ ప్రజా*
*పతికి ( బ్రమోదమొప్ప నవభామలతో ( గపిలాఖ్యు ( బుట్టియే*
*గతి హరి పొందునట్టి సుభగంబగు సాంఖ్యము దల్లి కిచ్చిదు*
*ష్కృతములు వాసి చూపె ముని సేవితమై తనరారు మోక్షమున్"* [123]

పోతన మహాకవి దేవహూతి పాత్ర సారాంశమంతా చక్కగా చంపకమాలలో (ఒక పద్యంలోనే) పొందు పరిచాడు. దేవహూతి గూర్చి, ఈమె తండ్రి స్వాయంభువ మనువు కర్దమ మునీంద్రుని వద్దకు వెళ్ళి

*"వర యోగీశ్వర! దేవహూతి యను నీవామాక్షి మ త్పుత్రి ( దా*
*వర లావణ్య గుణాఢ్యులన్ వినియు నెవ్వారిన్ మదింగోర, కా*
*తుర యై నారదు పంపునన్ మిము వరింతున్నంచు నేతెంచె, నీ*
*తరుణీ భిక్ష ( బరిగ్రహింపుము శోభాదాత్త క్రియాలోలతన్"* [124]

ఓ మహాయోగీశ్వరా! ఈ కన్యక నా కన్న కూతురు. ఈమె పేరు దేవహూతి. ఈ నా కూతురు శీల దయాగుణాదుల్లో తగిన వరుని పొందాలనుకుంటుంది. లోకంలో సౌందర్య వంతులైన పురుషలను ఎవ్వరిని వరించటానికి ఇష్టపడక చింతాక్రాంతయై ఉంది. నారద మహర్షి వల్ల శీలం, విద్య, వయస్సు, నీ రూప గుణాలు ఆలకించి నిన్నే వివాహమాడటానికి నిశ్చయించింది. నేను

ఈమెను నీకు శ్రద్ధతో సమర్పిస్తున్నాను. ఈమెను నీవు భిక్షగా స్వీకరించి ఈ శుభకార్యాన్ని అంగీకరించి నా కుమార్తెను స్వీకరించమని ప్రార్థిస్తాడు.

స్వాయంభువ మనువు ప్రార్థన ఆలకించిన కర్దముడు మిక్కిలి ప్రీతుడై, దేవహూతి అంద చందాల్లో గంధర్వరాజునే మైమరపిస్తుందని, మహాలక్ష్మీ సమానురాలని, లోకోత్తర సౌందర్యవతి అని, ఉత్తానపాదుని సోదరి అని ప్రశంసించి, తనంత తాను వలచి వరించి వచ్చినపుడు ఇష్టపడని వాడుంటాడా? అని ఇది పుణ్య కార్యంగా భావించి నేను ఈమె భార్యగా స్వీకరిస్తానని పలికి తనకున్న నియమాలు వినమని చెపుతాడు.

*క. "విమలాత్మ! దీని కొక సమ*

*యముగలదెఱి ( గింతు విను గుణాకరయగు నీ*

*రమణికి నపత్య పర్యం*

*తము వర్తింపుదు గృహస్థధర్మ క్రియలన్".* [125]

ఉత్తమ గుణ సంపన్నురాలైన ఈమెకి సంతానం కలిగే పర్యంతం మాత్రమే నేను గృహస్థ ధర్మాన్ని నిర్వర్తిస్తాను. అటు తర్వాత జితేంద్రియుడనై యోగమార్గం అవలంబించి సన్యాసం స్వీకరిస్తాను. ఇది భగవంతుడైన శ్రీహరి ఆజ్ఞ.

### దేవహూతి వివాహం

కర్దముని అభిప్రాయాన్ని తెలిసికొన్న స్వాయంభువ మనువు తన భార్య శతరూపకి, కుమార్తె దేవహూతికి తెలియచేస్తాడు. వారి అభిప్రాయానుసారం కర్దమ మునీంద్రునికి దేవహూతి నిచ్చి వివాహం చేస్తాడు.

అనంతరం దేవహూతి తల్లి 'శతరూప' పారిబర్హములనే పేర్లున్న వివాహోచితాలైన దివ్య వస్త్రాలను, దివ్యాలంకారాలను, కుమార్తెకి, అల్లుడైన కర్దమ మునీంద్రునికి బహూకరించింది.

### దేవహూతి పతిసేవ

పార్వతీదేవి పరమేశ్వరునికి పరిచర్య చేసినట్లు దేవహూతి తన పతి కర్దమ మునీశ్వరునికి సేవ చేసింది. కామ, క్రోధ, కపట, లోభాది దుర్గుణాలకి దూరంగా అత్యంత భక్తి శ్రద్ధలతో, మృదు మధుర సంభాషణలతో పతిసేవ చేసి పతివ్రతయై ప్రకాశించింది.

### పతి అనుగ్రహం

పతి శుశ్రూషలో మిక్కిలి శ్రమించి, శుష్కించిన దేవహూతిని చూచి కర్దముడు జాలిపడి ప్రేమతో

*ఉ. "మానిత ధర్మమార్గ మహిమ స్ఫుటభూరి తపస్సమాధి వి*

*ద్యా నిభృతాత్మయోగ సముపార్జిత విష్ణు కటాక్షలబ్ధశో*

*భానఘ దివ్యభోగ బహుభద్ర వితానము లస్మదీయ సే*

*వా నిరతిన్ లభించు ననివారణ నిత్తును దివ్య దృష్టియున్"*[126]

దేవీ! నీవు గౌరవనీయురాలైన స్వాయంభువ మనువు కుమార్తెవు నీవు ఇతరులకిచ్చే మర్యాద గొప్పది. ధర్మమార్గాను సరణం వల్ల మహిమే కలుగుతుంది. ఆ మహిమాతి శయం వల్ల గొప్ప తపస్సు, ఏకాగ్రత సిద్ధించి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మ జ్ఞానం వల్ల ఆత్మయోగం లభిస్తుంది. ఆత్మయోగం భగవత్కటాక్షాన్ని ప్రసాదిస్తుంది. ఆ విష్ణుకటాక్షం కారణంగా భవ్యంలైన అవ్యయ దివ్య భోగాలు (నశించనవి) అనంతమైన శుభాలు సమకూరతాయి. నిరంతరం నన్ను సేవించిన నీకు నా సమస్త సంపదల సంప్రాప్తిస్తాయి. నీకు తిరుగులేని దివ్య దృష్టిని కూడ అనుగ్రహిస్తున్నానని పలుకుతాడు.

### గృహిణిగా దేవహూతి

పతి శుశ్రూషతో దేవహూతి తన భర్త సిద్ధ పురుషుడని తెలుసుకొని, తనగార్హస్థ్యానికి సఫలత సంతానం కాబట్టి భర్తతో శరీర సాంగత్యాన్ని కోరి కర్దముని యోగ మాయాబలంతో యధేచ్ఛగా సంచరించే ఒక దివ్య విమానంలో 100 సంవత్సరాలు గడిపి, తొమ్మిది మంది పుత్రికలను కన్నాడు.

### దేవహూతి పుత్రికలు

| | | |
|---|---|---|
| 1. కళ | 2. అనసూయ | 3. శ్రద్ధ |
| 4. హవిర్భువు | 5. గతి | 6. క్రియ |
| 7. ఖ్యాతి | 8. అరుంధతి | 9. శాంతి |

అనంతరం సన్న్యసింపదలచిన భర్త కర్దముని చూచి దేవహూతి

*సీ. "అనఘ సంతాన పర్యంతంబు నను ( గూడి, వర్తింతుననుచు ( బూర్వమున బలికి*

*కూతులనిచ్చికొమరారా నిప్పుడీ తరుణులు పతులను దమకు ( దార*

*యరసి వర్తింతురో యని భీతి నొందెద ( గావున ఈ పుత్రికలకు ( దగిన*

*వరుల సంపాదించి, పరిణయంబులు సేసి, తత్త్వ సంహిత నాకు ( దవిలి తెలుపు*

*తే. సుతుని ( గృపసేసి నను ( గావు సుజన వినుత*

*యర్థి సంసార దు: ఖంబు నపనయింప*

*నరుహ ( డవు నీవ కామమోహమున నింత*

*కాలమూరక పోయె నేగతియు లేక"*[127]

ఓ పుణ్యాత్ముడా! కుమార్తెలకు తగిన వరులను అన్వేషించి, వారికి వివాహం చేసి, నాకు వేదాంత విషయాన్ని తెలియ చెప్పగల తనయుని ప్రసాదించి నన్ను కటాక్షించమని కోరింది.

దేవహూతి ప్రార్థన విన్న కర్దమ మునీశ్వరుడు

*క. మనుసుత! నీమది దు: ఖంబును బొందకు*

*మచిరకాలమున భగవంతుం*

*డనఘుం డక్షరు ( డు జనా*

*ర్దను'డు భవద్గర్భమందు ( దగ వసియించున్"*[128]

మనుపుత్రీ! నీవు దు:ఖించవద్దు. అనఘుడు, అక్షరుడైన విష్ణువు కొద్ది కాలంలోనే నీ గర్భంలో ప్రవేశిస్తాడు. నియమ నిష్ఠలతో శ్రీమన్నారాయణుని భక్తితో పూజించమని చెపుతాడు.

*మ. "మరి నారాయణు పాదపద్మములు సమ్యగ్భక్తి'బూజించు, త*

*త్పురుషశ్రేష్ఠుండు మానసంబున భవత్పూజా సుసంప్రీతు ( డై*

*కరమర్థిం దరుణీ శిరోమణి! భవద్గర్భస్థు'డై యుండితా (*

*గరుణం జేయు భవన్మనోజనిత శంకాగ్రంథి విచ్ఛేధమున్."*[129]

పురుషోత్తముడైన ఆ విష్ణుదేవుడు నీ పూజలకి సంతృప్తి చెంది నీ గర్భంలో నివసించి నీకు పుత్రుడై పుట్టి నా కీర్తిని విస్తరింపజేసి, నీ మనస్సులో పుట్టిన అజ్ఞానమనే సందేహాలముడులు విడదీస్తాడని చెపుతాడు.

## దేవహూతికి కపిల జననం

కర్దమ మునీశ్వరుని తేజస్సు ధరించి జమ్మిచెట్టు తొఱ్ఱలో నుండి అగ్ని పుట్టిన విధంగా దేవహూతి గర్భం నుండి కపిలుడావిర్భవించాడు.

ఆ శుభ సమయంలో

*సీ. "అయ్యవసరమున నాకాశమున దేవ తూర్యఘోషంబులు తుముల మయ్యె*

*నందిత దేవతా బృందంబులందంద, కురిసిరి మందార కుసుమ వృష్టి*

*గంధర్వకిన్నర గానంబు వీతెంచె నప్సరో గణముల యాటలొప్పె*

*వావిరి దిక్కుల 'గావిరి విరిసెను దవిలి వార్ధుల కలంకువలు మానె."*

*తే. సాధు జనముల మనములు సంతసిల్లె*

*హెూమవహ్నులు ప్రభల ( జెన్నొందివెలి ( గె (*

*గుసుమ ఫలభారముల నొప్పె ( గుజములెల్ల*

*సర్వసస్యాళి చెన్నొందె జగతిలోన".* [130]

పరమాత్మ స్పర్శతో భువి పులకించింది.

## బ్రహ్మదేవుని ప్రశంసలు

మరీచాది మునిగణ సమేతుడై బ్రహ్మదేవుడు కర్ధమ దేవహూతుల వద్దకి వచ్చి కపిల దర్శనం చేసికొని, ఆ దంపతులతో మీ జన్మ సార్ధకమయింది. పరాత్పరుడు మీ కోర్కెను చక్కగా నెరవేర్చాడని అగణ్యమైన మీ పుణ్యాన్ని మాటలతో గణింపలేమని పలికి, మీ పుత్రికలకు ఉత్తమ స్వభావులు, సదాచార సంపన్నులైన ముని శ్రేష్ఠులకిచ్చి వివాహం చెయ్యమని పలికాడు.

దేవహూతితో బ్రహ్మదేవుడు అమ్మా! మాననీయాలైన జ్ఞాన విజ్ఞాన యోగాలనే ఉపాయాలతో కర్మజీవుల్ని ఉద్ధరించటానికి కమలాక్షుడు నీకడుపున ఉదయించాడు. నీకు తత్త్వబోధ చేసాడు. ఈ మీ కన్నవాడు పేరెన్నిక గన్నవాడై సిద్ధగణాలకి అధీశ్వరుడై సిద్ధ పురుషులచే సేవింపబడుతూ మహనీయమైన సాంఖ్యయోగంతో ప్రకాశించే పరతత్త్వమందు సుస్థిరుడై కపిలుడు అనే పేరుతో త్రికాలాల్లో సంచరించి, నీ కీర్తిని ఇనుమడింప చేస్తాడని చెపుతాడు,

## కపిల మహర్షి సందర్శనం

కపిలునికి జన్మనిచ్చిన తల్లి అయినా దేవహూతి తన భర్త సన్యసించ, బ్రహ్మవాక్కును జ్ఞప్తికి తెచ్చుకొని తన పుత్రుడైన కపిలాచార్యునితో ఆజ్ఞానాంధకారం నుండి బయటపడే అవకాశం ఏ

ఉపాయం వల్ల కలుగుతుందని ప్రశ్నిస్తుంది.

*ఉ. "భూరిమదీయ మోహతమముంబెడ ( బాప సమర్థులన్యు లె*
*వ్వారలు నీవకాక! నిరవద్య! నిరంజన! నిర్వికార! సం*
*సారలతా లవిత్ర! బుధసత్తమ! సర్వశరణ్య! ధర్మవి*
*స్తారక! సర్వలోక శుభదాయక! నిత్య విభూతి నాయకా!"* [131]

*చ. "నిను శరణంబు సొచ్చెద ననింద్య తపోనిధి! నన్ను ( గావవే*
*యని తను దేవహూతి వినయంబున సన్నుతిసేసివే'డ'గా*
*ననుపమ సత్కృప కలితు ( డై కపిలుండనురాగ మొప్పస*
*జ్జన నిచయాప వర్గ ఫల సాధనమై తగు తల్లి వాక్యముల్"* [132]

అని అనన్య శరణాగతి చేసింది.

### కపిలుడు బోధించిన భక్తి యోగం

పరమాత్మని చేరటానికి భక్తి మార్గమే ఉత్తమోత్తమమైంది. సహజం, నిర్హేతుకమైన భగవంతుని సేవారూపమైన భక్తి ముక్తి కంటె గొప్పది, జీర్ణాశయమందలి జఠరాగ్ని తిన్న అన్నాన్ని జీర్ణం చేసినట్లుగా, భగవద్భక్తి జీవులు కావించిన కర్మలని, కర్మ ఫలాలని లోగొంటుంది. అందువల్ల జీవుని లింగమయ శరీరం నశిస్తుంది.

1. ముక్తిని కూడ వాంఛింపక పరమాత్మ పాద పద్మాలను తమ హృదయ పద్మాల్లో పదిలపరచుకొని కుతూహలంతో పరమాత్మ దివ్య స్వరూపాన్ని, లీలా విశేషాలను కొనియాడుతుంటారు.

2. మరికొందరు భాగవతోత్తములు ప్రసిద్ధి కెక్కిన పురాణ స్వరూపాలను పరమాత్మ దివ్యావతారాల వైభవ విశేషాలను మనస్సులో నిలుపుకొని భక్తి యోగ మహత్త్వం వల్ల అలనాటి నా సంలాపాలను స్మరించుకొని దివ్య స్వరూపాన్ని మధుర వాక్కులను నిరంతరం మననం చేసుకుంటూ ప్రాణం పరవశింపగా మోక్షం మీద ఆపేక్ష లేకుండా ఉంటారు.

3. మోక్షాసక్తి లేని వాళ్ళై కూడ వారు మాయాధీశుడనైన నా సత్యాది లోకాల భోగ సంపత్తిని గాని తనంత తానుగా సిద్ధించే అణిమాది అష్టసిద్ధి సంసేవితమైన ఐశ్వర్యాలను గాని, వైకుంఠంలోని

భగవానుని (సంపదను కోరక) పరమాత్ముడైన నన్ను సేవిస్తారో అట్టివారు నా వైకుంఠ లోకంలో వారు దు:ఖ సంపర్కం లేశమైనా లేనిది, శాశ్వతానంద సంధాయకం వర్ణనాతీతం, మహనీయ, మహెూన్నత, సంపూర్ణ వైభవోపేత సకల లక్షణ సముల్లసితమైన వైకుంఠ ధామాన్ని అందుకుంటారు.

4. ఎవరైతే ఆత్మరూపుని సర్వసమునిగా నన్ను (పరమాత్మను) అధికంగా ప్రేమించి, ఇష్టదైవం వలె ఆరాధిస్తారో అట్టి నన్ను శరణు పొందిన భక్తులు ఏ కాలంలో వినాశనం పొందరు కాల చక్రం వల్ల భయం కలుగకుండా వారిని కాపాడుతూ ఉంటాను.

5. జీవుని ఆత్మదివికి, భువికి నడుమ పలుసార్లు తిరుగుతుంటుంది. మానవుడు సంసార వ్యామోహం విడిచి పాప పరిహారుడును, సర్వ వ్యాపినైన నన్ను ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తే వారిని దాటరాని మృత్యుమయమైన సంసార సముద్రం నుండి దరిచేరతారు.

6. నన్నుగాక ఇతరులను ఎన్నుకొన్నవారు సంసార భయంలో పడిపోతారు. సృష్టిశాసకుడను నేను. ఈ సృష్టి విజ్ఞానంతో పాటు వైరాగ్యంతో కూడిన భక్తియోగంతో యోగివరులైన వారు వైకుంఠాన్ని ఆశించి నాచరణ కమలాలను సంస్మరిస్తూ నిర్భయంగా ఉంటారు.

7. సత్పురుషులై అత్యంత భక్తితో చిత్తాన్ని ఎంత పర్యంతం నాయందు లగ్నం చేస్తారో, అంత పర్యంతం వారికి ఈ లోకంలోనే మోక్షం సంప్రాప్తిస్తుంది.

**కపిలుని తత్త్వజ్ఞానబోధ**

కపిలుడు దేవహూతితో తల్లీ! ఏ జ్ఞానాన్ని పొందటం వల్ల ఆత్మ దర్శన మవుతుందో అట్టి మోక్షప్రదాయమైన తత్త్వ లక్షణాలను చెపుతానని ఈ క్రింది విధంగా వివరించారు.

ప్రకృతికి అన్యమై, అతీతమై ప్రకాశించే పరమాత్మ పురుషుడనబడుతున్నాడు. అవిద్యా మోహితుడైన జీవుడు త్రిగుణాత్మకమైన ప్రకృతితో సంబంధాన్ని పెట్టుకొని సమస్త కర్మలకి తానే కర్తయని భ్రమిస్తున్నాడు. ఆ భ్రమని తొలగించుకొని శ్రద్ధా భక్తులను కలిగి చిత్తాన్ని పరమాత్మలో స్థిరంగా ఉంచి ప్రయత్నించేవారు ముక్తులౌతారు.

తల్లీ! ఈ జగత్తు స్వప్నం వంటిది. దీనిలో సత్యం లేదు. నిద్రబోయే వానికే స్వప్నం తెలుస్తుంది. ఆ విద్యలో ఉన్న వానికే జగత్తు తెలుస్తుంది.

తల్లీ! మనుజుడు స్వధర్మాచరణ ఆచరిస్తూ కథా శ్రవణం ద్వారా భక్తిని పెంపొందిస్తూ, జ్ఞాన వైరాగ్యాలను పొంది, తపోధ్యానాలనుష్ఠిస్తూ. చిత్తైకాగ్రతని పొందితే కట్టె నుండి పుట్టిన అగ్ని కట్టెనే దహించే విధంగా పురుషునిలో ప్రకృతి నశిస్తుంది. మేలుకొన్న వానికి స్వప్న గత విషయాలు భయపెట్ట లేని విధంగా వివేకియైన పురుషుని ప్రకృతి సంసారాలు బాధింపలేవు. ఈ విధంగా బహు జన్మల్లో అనేక యాతనలనుభవించిన జీవుడు నన్నాశ్రయించివాడై అవిద్యనంతమొందించుకొని సందేహాలను నివృత్తి చేసికొని తిరిగిరాని స్థానాన్ని పొందుతున్నాడు. ఇదే మోక్షం తల్లీ! ధ్యాన యోగం పరమోత్కృష్టమైంది. ధ్యానం చిత్తాన్ని ప్రసన్నం గావిస్తుంది. నిర్వికల్ప స్థితిని ప్రసాదిస్తుందని ధ్యానాన్ని గూర్చి కపిలుడు అద్భుతంగా వివరించాడు.

*క. "నీ నామస్తుతి శ్వపచుం*
*డైనను జిహ్వాగ్రమందు నను సంధింపన్*
*వానికి సరి భూసురు ( డుం*
*గానేర ( డు చిత్రమది జగంబుల నరయన్"* [133]

కపిలుడు తల్లితో నీవు నేను చెప్పిన ఈ విషయాలను చక్కగా అనుష్ఠించిన, త్వరలో నన్ను పొంద గల్గుతావు. అని పలికి అనుమతి తీసుకొని వెళ్ళిపోయాడు.

పుత్రుడైన కపిల దేవుడు ఉపదేశించిన భక్తియోగాన్ని దేవహూతి ఆచరింప సాగింది. సదా ధ్యానమగ్నురాలై ఉంది. నార చీరలను ధరించి, నిరంతర తపో ధ్యానాదులచే దేహాన్ని శిధిల మొనర్చు కొంది. కపిలునికి దూరమై దేవహూతి తీవ్రవేదనకి గురి అయింది. దూడను పోగొట్టు కున్న గోవుని వలె దిగులు పడింది.

ఆహారాన్ని పరిమితంగా గ్రహించి సదా పరమాత్మనే చింతిస్తుంది. ఆశ్రమ ప్రదేశాన్ని కూడ విడిచిపెట్టింది. బంధాలన్నీ మెల్ల మెల్లగా తొలగి పొయ్యాయి. భ్రాంతి తొలగిపోయింది. జరిగినదంతా స్వప్నం వలె అనుభవానికి అందింది. దేహంపై విస్మృతి కలిగింది. ఆమె భగవానుని పొందింది. దేవహూతికి సిద్ధి లభించింది.

కపిలదేవుని అనుగ్రహాన్ని పొంది ఏ ప్రదేశాన ఆమె సిద్ధి పొందిందో దానిని సిద్ధపదమని పిలుస్తారు. తల్లిని ఉద్ధరించిన ప్రదేశమైనందున దాన్ని మాతృగయ అని కూడా పిలుస్తారు. ఆమె దేహం కూడ తీర్థరూపాన్ని ధరించింది.

## 4. సునీతి

ఈమె ఉత్తానపాదుని భార్య. ధ్రువుని తల్లి. ఈమె భర్తకి రెండవ భార్యపై మక్కువ. అంతే కాక ఈమెను నిరాదరణకి గురి చేసాడు. ఈమెను నిరాదరణకు గురి చేయటమే కాక, పుత్రుడైన ధ్రువుని కూడ ఆదరించలేదు.

తండ్రి నిరాదరణకి, సవతి తల్లి మాత్సర్యంతో మాట్లాడిన మాటలకి ధ్రువుడు దు:ఖించి తల్లికి వివరించాడు అపుడు సునీతి సవతిని గాని, భర్తను గాని నిందించక తన పూర్వ జన్మ దుష్కృతంగా ఆభివర్ణించి పుత్రుని ఓదార్చింది.

మీ నాన్నగారి అండదండలు దురదృష్టవంతురాలినైన నాకు లేవు. అటువంటి నిర్భాగ్యురాలి నైన నా కడుపున పుట్టిన కారణంగా నీకు అవమానం తప్పలేదు.

సవతి పలికిన పలుకులు వాస్తవమేనని నీకు నీ తండ్రి అంకంపై ఆసీనుడవు కావాలంటే హరిని ఆరాధించమని, నీ పిన తల్లి ఆజ్ఞని పాటించమని, హరి తత్త్వాన్ని ధ్రువునికి ఈ విధంగా తెలియచేసింది.

*సీ. "పరికింప నీ విశ్వ పరిపాలనమునకై యర్థి గుణవ్యక్తు ( డైనయట్టి*
*నారాయణుని పాదనలినముల్ సేవించి తగ బ్రహ్మ బ్రహ్మ పదంబునొందె*
*ఘను ( డు మీ తాత యా మనువు సర్వాంతర యామిత్వమగు నేకమైన దృష్టి*
*జేసి యాగముల యజించి తాభౌమ సుఖములను దివ్య సుఖముల మోక్ష."*

*తే. "సుఖములను బొందెనట్టి యచ్యుతుని బరుని*
*వితత యోగీంద్ర నికర గవేష్యమాణ*
*చరణ సరసిజ యుగళు శశ్వత్ప్రకాశు*
*భక్తవత్సల విశ్వసంపాద్యు హరిని"* [134]

లోక రక్షణకై శ్రీమన్నారాయణుడు సత్త్వగుణ స్వరూపం గ్రహించాడు. నారాయణ పాద పద్మారాధనచే బ్రహ్మదేవుడు బ్రహ్మ పదాన్ని పొందగలిగాడు. మీ తాత స్వాయంభువ మనువు భగవంతుని సర్వాంతర్యామిత్వాన్ని గుర్తించి ఏకాగ్రతతో యజ్ఞాలను చేసి ఆ దేవ దేవుని సేవించాడు. అతడు ఇహ పర సుఖాలనుభవించి పరమ పద ప్రాప్తి పొందాడు. అటువంటి శ్రీహరి నాశంలేని అనంత కాంతి స్వరూపుడు. భక్త వత్సలుడు, విశ్వ సంసేవ్యుడు, ఆ శ్రీమన్నారాయణుని ఆశ్రయించు.

"సాక్షాత్తు లక్ష్మీదేవి అరచేతిలో అరవిందం (పద్మం) ధరించి ఆ అనంతుని అన్వేషిస్తుంది. కాబట్టి ధర్మాయత్తమై ఏకాగ్రమైన చిత్తంలో శ్రీమన్నారాయణుని నిలిపి ఆరాధించమని, ఆ మహాత్ముడే నీ దు:ఖాన్ని తీరుస్తాడు" సునీతి మాటల వల్లనే ధ్రువుడు శ్రీమన్నారాయ భక్తుడై లోకోత్తర చరితుడయ్యాడు.

భర్త ప్రేమ కరువయినా, సపత్నీమాత్సర్యానికి గురియైన సునీతి శ్రీమన్నారాయణుని పాద పద్మారాధనతో తానుతరించి, తన తనయుడికి దారి చూపించి పుట్టింటిని, మెట్టింటిని తరింప చేసిన ధన్య చరిత. సునీతి కర్మ సిద్ధాంతాన్ని నమ్మిన శ్రీహరి పాద పద్మారాధనాసక్త.

## 6. సురుచి

ఈమె ఉత్తానపాదుని రెండవ భార్య. ఈమె పుత్రుడు ఉత్తముడు. భర్తృ ప్రేమను చూఱగొన్న నెఱజాణ. ఉత్తాన పాదుడు సురుచి కన్న ఉత్తముని అధికంగా ముద్దు చేసాడు. సురుచిపై రాజుకున్న అధిక ప్రేమయే ఇందుకు కారణం. ఈమె సపత్నీ మాత్సర్యం, దురహంకారమున్న మహిళగా గోచరిస్తుంది. సవతి కొడుకుపై చిన్న చూపు ఉన్నట్లు ధ్రువునితో పలికిన పలుకుల వల్ల తెలుస్తుంది.

*తే. "తండ్రి తొడనెక్కు వేడుక దగిలెనేని'*
*బూని నా గర్భమున నా ( డు పుట్ట కన్య*
*గర్భమున ( బుట్టి గోరిన ( గలదె నే ( డు*
*జనకు తొడ యెక్కు భాగ్యంబు సవతి కొడుక!"*[135]

ఈమె అహంకార పూరితమైన మాటలే ధ్రువ మండలాన్ని సృష్టించటానికి పరోక్ష కారణమయ్యాయి.

ధ్రువుడు శ్రీమహావిష్ణువు అనుగ్రహం పొంది తిరిగి వచ్చి తండ్రికి, తల్లులకి నమస్కరిస్తాడు. తన తప్పు తెలుసుకొని సురుచి నవ్వుతూ అక్కున చేర్చుకొని 'చిరంజీవ' అని ఆశీర్వదించిన పరివర్తన శీల స్వభావ. ఈమె కుమారుడు ఉత్తముడు అడవికి వెళ్ళి ఒక యక్షుని చేతిలో చంపబడ్డాడు. సురుచి పుత్రశోకంతో అరణ్యానికి వెళ్ళి కార్చిచ్చు మంటల్లో మరణించింది.

సపత్నీ మాత్సర్యంతో రగిలి సవతి పుత్రుని బాధించి, సవతిని భర్తకు చేరువ కానివ్వని పాపం ఈమెను వెన్నాడి, పుత్రశోకయై, దారుణ మరణాన్ని పొందింది.

"బుద్ధి:కర్మానుసారిణి" అని ఎవరెవరి కర్మలకు వారు ఆయా ఫలితాలను పొందవలసిందే. ఈ కర్మ భూమిపై జన్మించిన ప్రతి ఒక్కరు ఎవరి పాప కర్మకి వారు ఫలితమనుభవింపవల్సిందే.

## 6. సునీథ

అంగరాజు భార్య. ఈమెకి వేనుడు పుత్రుడు. ఈమె మృత్యువు కుమార్తె. యజ్ఞం చేసి పుత్రుని పొందినప్పటికి ఈ దంపతులకి జన్మించిన వేనునిలో తాతగారి లక్షణాలు వచ్చి బాల్యం నుండియే రాక్షస కృత్యాలు చేస్తుంటాడు. నీతిపరుడైన అంగరాజు ఇటువంటి పుత్రుని పొందటం కంటే పుత్రులు లేకుండుటమే మేలని తలచి. పుత్రుని వికృత చేష్టలకు విసిగిపోయి, ఎవరికి చెప్పక, కుమారుని ఏమీ చేయలేక అరణ్యానికి వెళ్ళిపోతాడు. రాజులేని రాజ్యం అరాచకమవుతుందని మంత్రులు సునీథ అనుమతితో వేనుని (దుర్మార్గుడైనప్పటికి) పట్టాభిషిక్తుని చేస్తారు.

సహజంగానే స్వభావరీత్యా రాక్షసత్వం కలిగి ఉన్న వేనుడు ఋషులను, మునులను అవమానించి, యజ్ఞాలను నివారించి తానే దైవంగా ప్రకటించుకొని అవినీతికి పాల్పడి రాజ్యంలో అల్లకల్లోలం చేస్తాడు. మహర్షులు క్రోధంతో వేనుని శపించి ప్రాణాలు పోగొట్టారు.

సునీథ తన యోగశక్తి చేత తన పుత్రుని శరీరం చెడకుండ కాపాడింది. రాజులేని రాజ్యం అరాచకమైంది. అంగవంశంలో పుట్టిన రాజులు హరిభక్తులు. మహావీరులవటం వల్ల వీరి వంశం అంతరించకూడదని ఈ వంశాన్ని నిలబెట్టాలని మరణించి ఉన్న వేనుని శరీరాన్ని మునులు తొడలు మథించారు. నిషాదుడు (బోయవాడు) జన్మించాడు.

మునులు వేనుని హస్తాలను మథించగా స్త్రీ పురుషుల జంట జన్మించింది. వేనరాజు బాహువుల నుండి లోక సంరక్షణార్థం శ్రీమన్నారాయణాంశతో పృధు చక్రవర్తి, లక్ష్మీదేవి అంశతో అర్చి అనే కన్యక జన్మించారు.

సునీధ తన యోగ శక్తిచే పుత్రుని శవాన్ని కాపాడి తపోధనులైన బ్రాహ్మణులచే తన పుత్రుని దేహం నుండియే లక్ష్మీనారాయణాంశలతో జన్మించిన అర్చి, పృధు చక్రవర్తిలను పొంది, తన వంశాన్ని నిలబెట్టింది. క్షత్రియ స్త్రీలలో ఈమె యోగశక్తి మహిమ అనితర సాధ్యం.

## 7. అర్చి

అంగ వంశం అంతరించ కుండటానికి తపోధనుడైన మునీంద్రులు చనిపోయిన వేనరాజు బాహువులను మథించ, లోక సంరక్షణార్దం శ్రీమన్నారాయణాంశతో ఒక పురుషుడు, అతనిని ఎప్పుడూ విడిచి ఉండని లక్ష్మీదేవి అంశతో ఒక కన్య ఉదయించింది.

### వివాహం

ఆ కన్యక సుగుణాలే ఆమెకి సహజ భూషణాలు. ఆమె అలంకారాలకి అలంకారం. ఆ స్త్రీపేరు అర్చి. ఆమె పృధు చక్రవర్తిని వరించింది.. వేనుని కుడి చేతి నుండి పృధువు, ఎడమ చేతి నుండి అర్చి పుట్టి దంపతులైన సమయంలో మునులు సంతోషించే విధంగా దేవతలు పూలవాన కురిపించారు.

### మహారాజ్ఞి అర్చి

రాజ్యాభిషేకంతో అర్చితో కూడిన పృధువు

*"పావకుడు ( బోలె సత్త్రభాభాసి"*[136]

వలె ప్రకాశించాడు. ఈ దంపతులకు దేవతలు బహుమానాలు ఇచ్చి పుష్పవర్షం కురిపించారు. అర్చికి పృధువు అర్ధ శరీరాన్నిచ్చి గౌరవించాడు. విష్ణుభక్తుడైన పృధువు భార్యకి అర్ధ శరీరాన్నిచ్చి గౌరవించటంలో అర్ధ నారీశ్వరుడైన పరమేశ్వరుని తత్త్వంతో అద్వైత సిద్ధి పొందినట్లుగా గోచరిస్తుంది.

## మాతృమూర్తి

పృధుచక్రవర్తి ఆధ్యాత్మయోగ పరాయణుడై భగవంతునికి సర్వకర్మలను అర్పించి, ఆయా కర్మలను ఆచరిస్తూ తన భార్యయైన అర్చి మహాదేవి వల్ల తనతో సమానులయిన 1. విజితాశ్వుడు 2. ధూమ్రకేశుడు 3. హర్యశ్వుడు 4. ద్రవిణుడు 5.వృకుడు అనే ఐదుగురు పుత్రులను పొందాడు.

## పతివ్రత - అర్చి

పృధువాన ప్రస్థాశ్రమం స్వీకరిస్తే, అతని వెంట అనుసరించి వెళ్ళింది. పృధువు బ్రహ్మనిష్ఠుడై లింగ శరీరాన్ని త్యజించి ముక్తుడవటం చూచి అర్చి దు:ఖించింది.

*సీ. "మానిత మందార సానుప్రదేశంబు నందు ( జితారోపమర్థి'జేసి*
*లలిత మహానదీ సలిల సుస్నాతయై కలిత మహోదార కర్ము ( డయిన*
*నాధున కుదక దాన క్రియల్ గావించి యతిభక్తి సురలకు నతు లొనర్చి*
*వహ్నికి ముమ్మాటు వలగొని పతి పాద కమల యుగంబు జిత్తమున నిలిపి"*

*తే. "వీరవరు ( డైన పృధు పృధివీ తలేశు*
*నందు నను ( గమనము సే యునట్టి సాధ్వి*
*నర్చి'గను ( గొని దేవాంగనా సహస్ర*
*మాత్మనాధుల ( గూడి నెయ్యంబుతోడ"* [137]

ఆ మహాసాధ్వి అర్చి మహాదేవి మందర పర్వతం చరియల్లో ఒక చితిని పేర్చి సిద్ధపరచి మహానదీ జలాల్లో పుణ్య స్నానం చేసి వచ్చి తగిన నిత్య కర్మలను చేసి ఉదార కీర్తి గల భర్తకి ఉదక తర్పణం కావించింది. మిక్కిలి భక్తితో అంతరిక్ష వాసులైన దేవతలకు నమస్కరించి, భర్తపాదాలను స్మరిస్తూ, చితికి అగ్నిముట్టింది, మండుచున్న అగ్నికి మూడుమార్లు ప్రదక్షిణం చేసి, మహా వీరుడైన పతి పాద పద్మాలను మనస్సులో ధ్యానించి చితాగ్ని ప్రవేశం చేసి సహగమనం చేసింది.

వీరవరుడైన తన పతితో చితిమీద సహగమనం చేసి అతనిని అనుసరిస్తూ ఆ పరమ సాధ్విని వేలకొలది దేవతా కాంతలు తమ భర్తలతో కూడి తిలకించి, పరమానందం పొంది అతిశయించిన కుతూహలంతో మందర పర్వత సాను ప్రదేశాల నిండ మందార పుష్పవర్షం కురిపించారు.

**దేవతా ప్రశంసలు**

*సీ. "చర్చింపనిట్టి యాశ్చర్యమెందేనియు ( గను ( గొంటిరే యర్చియను లతాంగి*
*ధన్యాత్మురాలు గదా తన విభు ( గూడి, యిందిరారమణి యజ్ఞేశు ( గూడి*
*వెను చనుకైవడి ననుగమనము సేసి నియ్యను నిజ హృదయేశు ( డయిన*
*ఘనువైన్యునూర్ధ్వ లోకమ్మును బొందును, నే ( డింతవట్టును నిశ్చితంబు*

*తే. పరమ యోగీంద్రులకు దుర్విభావ్యమైన*
*దృఢ సుకర్మము వలన నతిక్రమించి*
*వైన్య భూమీశు వెనుచని వరుస నూర్ధ్వ*
*గామినియునయ్యె నీయింతి ఘనత నొంది* [138]

దేవతా స్త్రీలు తమలో తాము ఇంతటి వింత మనమెప్పుడూ, ఎక్కడా చూడలేదు. ఈ అర్చి అనే పుణ్యాత్మురాలు లక్ష్మీదేవి విష్ణుదేవుని అనుసరిస్తున్నట్లు తన పతిని ఈ మహా సాధ్వి అనుసరించింది. అర్చి ధన్యాత్మురాలు. భర్తతో పాటు ఊర్ధ్వ లోకాలకు తప్పక వెళుతుంది. ఇది ముమ్మాటికి నిజం. పరమ యోగీంద్రులకు కూడా సాధ్యం కాని ప్రవర్తన వల్ల ఈ వధూమణి పృధు చక్రవర్తి ననుసరించి అనన్య సామాన్యమైన ఘనతను పొంది ఊర్ధ్వలోకానికి వెళ్ళి పోతుంది. అందువల్ల పతివ్రతలకు అసాధ్యమైంది ఏ లోకంలోను ఉండదు.

విశేష వైభవోపేతమైన విష్ణులోకాన్ని తన పతితో పాటు పొందింది.

## 8. మేరుదేవి

అగ్నీధ్రుని కోడలు, నాభి భార్య, మేరు ప్రజాపతి కుమార్తె. ఈమె వల్ల సంతానం పొందటానికి నాభి మహారాజు ప్రవర్గ్యమనే పేరుగల ధర్మక్రతువుని శ్రద్ధతో నిర్వర్తించి మహావిష్ణువుని సంప్రీతుని చేసాడు. సత్త్వగుణ ప్రధానమైన శ్రీహరిని పుత్రునిగా పొందింది. ఆకుమారుడే ఋషభుడు. ఈమె పతితో పాటు కుమారుని పెంచి పెద్దచేసి రాజ్యభారం అప్పగించిన అనంతరం పురుషోత్తముడైన వాసుదేవుని తదేక ధ్యానంతో ఆరాధించి దంపతులరువురు శ్రీహరిలో తాదాత్మ్యం చేందారు.

శ్రీహరినే పుత్రునిగా పొంది భర్త అడుగు జాడల్లో నడిచి ముక్తి పొంది మహిళా శబ్దానికి వన్నె తెచ్చిన వనిత.

## 9. శ్రద్ధ

జితేంద్రియుడైన శ్రాద్ధదేవుడనే మనువు భార్య. ఈమెకు పది మంది పుత్రులు. వారిలో జ్యేష్ఠుడు 1. ఇక్ష్వాకుడతి ప్రసిద్ధుడు 2.నృగుడు 3. శర్యాతి 4. దిష్టుడు 5.ధృష్టుడు 6.కరూశకుడు 7.నరిష్యంతుడు 8.వృషధ్రుడు 9.అభంగుడు 10. కవి

## 10. ఇల

శ్రద్ధకు, శ్రాద్ధదేవుడనే మనువుకి జన్మించిన కుమార్తె. శ్రాద్ధ దేవ మనువుకి పదిమంది పుత్రులుదయించక ముందే శ్రద్ధ పయోవ్రతమనే వ్రతనిర్వహణలో ఉండి హెూతనాశ్రయించి కుమార్తె కావాలని అడిగింది, కుమార్తె కలిగింది. కాని మనువు పుత్రుడు కావాలనే తన సంకల్పం నెరవేరలేదని వసిష్ఠుని అడుగగా మనువు కోసం మహాశక్తి వంతుడైన వసిష్ఠుడు శ్రీహరిని ప్రార్ధించి ఇలా కన్యను సుద్యుమ్నుడిగా మార్చాడు.

ఇలా కన్య సుద్యుమ్నుడుగా మారిన అనంతరం రాజ పుత్రునిగా వేటకి వెళ్ళి కుమార వనంలో ప్రవేశించి స్త్రీగామారి బుధునిచే ప్రేమింపబడి పురూరవుని పుత్రునిగా పొందింది. తర్వాత ఇలా కన్య రూపంలో ఉన్న సుద్యుమ్నుడు వసిష్ఠుని ప్రార్ధించగనే వసిష్ఠుడు సుద్యుమ్నునికి ఒక నెలస్త్రీగా, ఒక నెల పురుషునిగా ఉండే విధంగా అనుగ్రహించాడు. ఆ విధంగా ఒక నెల స్త్రీగా, ఒక నెల రాజుగా ఉండి భుజబలంతో భూమిని పరిపాలిస్తూ ఉత్కలుడు, గయుడు, విమలుడనే పుత్రులను పొంది, ఉత్తర దిక్కులోని భూములకు వారిని రాజులను చేసి, పురూరవుని రాజ్యాన్ని అప్పగించి వృద్ధుడై తపోవనానికి వెళ్ళాడు.

తల్లిదండ్రుల భిన్నమైన కోరికల ఫలితంగా ఇల స్త్రీ, పురుష రూపాలు రెండు ఒకే జన్మలో అనుభవించ వలసి వచ్చింది. పురాణేతి హాసాల్లో ఎక్కడా ఈ రకమైన పాత్ర కన్పించదు. ఇది ఒక విశేషమైన పాత్ర. ఈమె తారా చంద్రుల తనయుడైన బుధుని మోహింప చేసి 'ఇల'గా స్త్రీరూపంలో ఈమె పొందిన పుత్రుడు పురూరవుడు షట్చక్రవర్తుల్లో ఒకడై ప్రసిద్ధిగాంచాడు.

# 11. సుకన్యక

శర్యాతి మహారాజు కుమార్తె. ఈమె ఒక రోజు తండ్రితో పాటు చ్యవనుని ఆశ్రమానికి వెళ్ళింది. పూలు, పండ్లు కోస్తూ వనమంతా తిరిగి ఒక పుట్టలో వెలుగుతున్న రెండు జ్యోతులను చూచి మిణుగురు పురుగులను కొని వాడి ముల్లుతో పొడిచింది. వాటి నుండి రక్తం వచ్చింది. ఆ అపరాధానికి రాజ భటులకు మలమూత్రాలు స్తంభించిపోయాయి. రాజ భటుల అవస్థ చూచిన శర్యాతి ఆశ్చర్యంతో ఈ ఆశ్రమంలో మీ వల్ల అపరాధమేమైనా జరిగిందేమో  అని అడుగ సుకన్యక శర్యాతికి జరిగిన విషయం తెలిపింది. శర్యాతి వెంటనే ఆ పుట్ట వద్దకు వెళ్ళి చ్యవనమునిని చూచి, అనేక విధాలుగా మునిని ప్రసన్నం చేసికొని ఆయన మనస్సు నెఱిగి తన కుమార్తెనిచ్చి వివాహం చేసి సెలవు తీసికొని పట్టణానికి వెళ్ళాడు.

## అశ్వినీ దేవతల అనుగ్రహం

ఒకనాడు ఆశ్రమానికి అశ్వినీ దేవతలిద్దరు వచ్చారు. చ్యవనముని మీకు యాగభాగాల్లో ఇంతకు ముందులేని సోమ పానాన్ని నేను కలుగ జేస్తాను. మీరు నాకు యౌవనాన్ని ప్రసాదించండి అని అడిగాడు వారందుకు అంగీకరించి "సిద్ధజాతి దేవతల చేత నిర్మింపబడిన ఈ మడుగులో మునగమని" ఆ ముసలి మునిని ఎత్తుకు పోయి ఉత్సాహంతో ఆ మడుగులో మునిగి, పైకి లేచి స్త్రీలందరిని ఆకర్షించే సుందరాకారులై, అదృష్టవంతులై, తామరపూల మాలలతో, బంగారు చెవి పోగులతో మంచి వస్త్రాలతో సూర్య కాంతి కలిగి సుకన్యక వద్దకు వెళ్ళారు. అమాయకురాలైన సుకన్యక వారిలో తన భర్తను కనిపెట్టలేక అశ్వినీ దేవతలకు నా భర్తను చూపమని ప్రార్థించింది, సుకన్య పాతివ్రత్యానికి మెచ్చిన దేవవైద్యులు చ్యవన మహర్షిని చూపి ఆ దంపతులు వద్ద సెలవు తీసికొని వెళ్ళిపోయారు.

## సౌభాగ్యవతి

శర్యాతి మహారాజు యాగం చేయాలనుకొని కూతురిని, అల్లుణ్ణి ఆహ్వానించటానికి ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ సుకన్య చెంత అందమైన యువకుని చూచి ఆశ్చర్యపడి సుకన్యను సందేహించి పరుషవాక్కులు పలికాడు. సుకన్య చిరునవ్వు నవ్వి తండ్రితో నీ అల్లుడైన భార్గవుడే కాని పర పురుషుడు కాదని జరిగిన వృత్తాంతాన్ని వివరించగా శర్యాతి మహారాజు సంతసించి

"సౌభాగ్యవతివి" కమ్మని ఆశీర్వదించాడు. చ్యవనుడు సతీ సమేతంగా మామకు యాగం చేయించి అశ్వినీ దేవతలకు సోమరసాన్ని ఇచ్చాడు. అంతేకాక ఇంద్రుడు వజ్రాయుధాన్ని కూడ నిలువరించాడు.

సుకన్య, ఒక మహారాజు కుమార్తెగా, అల్లారుముద్దుగా పెరిగి వన విహారంలో భాగంగా ఆశ్రమంలో తెలియక చేసిన పొరపాటుకు ప్రాయశ్చిత్తంగా వృద్ధుడైన చ్యవనముని భార్యయై అత్యంత శ్రద్ధతో సపర్యలు చేసింది. ఆమె సపర్యలకు అంటే పాతివ్రత్యానికి ఆనందించిన అశ్వినీ దేవతలు చ్యవనమునికి యౌవనం సంప్రాప్తింప చేసారు. సుకన్య సచ్ఛీలంతో సౌభాగ్యవతి అయి భాగవతం వంటి పవిత్ర గ్రంధంలో స్థానం సంపాదించుకొని సచ్చరిత అయింది.

## 12. రేవతి

ఈమె రైవతుని కుమార్తె. రైవతుడు బ్రహ్మలోకానికి వెళ్ళి బ్రహ్మను నా కుమార్తెకు మగడెవరని ప్రశ్నించి, సమాధానం పొంది భూలోకానికి వచ్చి బలరామునికిచ్చి వివాహం చేసాడు. దేవ దేవుడైన శ్రీహరి బలరాముని అవతారమెత్తి ధరణిని పవిత్రమొనర్చి భూభారాన్ని తగ్గిస్తాడని బ్రహ్మ రైవతునితో పలికాడు. బలరాముని గూర్చి విన్నవాడు, కీర్తించు వాడు కూడ పవిత్రుడవుతాడని పలుకుతాడు.

బలవంతుడు, కీర్తివంతుడు, పవిత్రుడైన పతిని పొందిన రేవతి నిత్య సౌభాగ్యవతియై భువిలో విరాజిల్లింది.

## 13. బిందుమతి

శతబిందుని కుమార్తె, మాంధాత పట్టమహిషి, ఈమెకి పురుకుత్సుడు, అంబరీషుడు, ముచుకుందుడనే పుత్రులు 50 మంది కుమార్తెలు.

సప్తద్వీప సమేతమైన భూమండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన మాంధాత చక్రవర్తి పత్ని బిందుమతి. ఈమె 50 మంది కుమార్తెలను సౌభరి అనే ముని వివాహం చేసుకొని, ఒక్కొక్కరికి 100 మంది చొప్పున 5000 మంది పుత్రులను కని, వాన ప్రస్థం స్వీకరించి పరబ్రహ్మన్ని పొందాడు.

50 మంది ముని పత్నులు ఆగతినే అనుసరించారు. క్షత్రియ కన్యలైన 50 మంది "బిందుమతి మాంధాత" దంపతుల పుత్రికలు స్వయంవర పద్ధతిలో మునిని వివాహమాడి ఆయన మార్గాన్నే అనుసరించారు.

## 14. కేశిని

సగర చక్రవర్తి పత్ని. అసమంజుని తల్లి.

## 15. సీత

శ్రీరామచంద్రుని ఇల్లాలు. రాజర్షియైన జనక మహారాజు పుత్రిక. భూజాత మాయలేడిని చూచి మాయలో పడిన సీత దశకంఠునిచే అపహరింపబడి అశోకవనంలో శోకిస్తూ వత్సరకాలం (ఏడాది) శ్రీరామునికై నిరీక్షిస్తూ జీవనం గడిపిన పతివ్రతాలలామ. రావణ సంహారానంతరం శ్రీరాముని కోరికపై అగ్ని ప్రవేశం చేసి తన పవిత్రతను లోకానికి వెల్లడి చేసిన పరమ పావని సీతాదేవి. భాగవతంలో నవమ స్కంధంలో సూర్యవంశ రాజుల వర్ణనలో, శ్రీరాముని చరితంలో సంక్షిప్తంగా ఈ ప్రస్తావన వచ్చింది.

### సీత జననం

జనకుడు యజ్ఞకార్యార్థం భూమిని దున్నింపగా నాగేటి చాలులో (సీరాగ్రభాగం) శుభలక్షణ వతి సీత దొరికింది. అందుకే పుణ్యాత్ముడైన జనకుడు సీరధ్వజునిగా ప్రసిద్ధిచెందాడు.

### సీత నడవడి

*ఆ. "సిగ్గుపడుట గల్గి సింగారమును, గల్గి*
*భక్తి గల్గి చాల భయము గల్గి*
*నయము ( బ్రియము ( గల్గి నరనాథు చిత్తంబు,*
*సీత దనకు వశము చేసికొనియె"* [139]

సీతాదేవి స్త్రీ సహజమైన నడవడిక, స్వభావాల చేత శ్రీరాముని వశం చేసి కొన్నదని, బ్రహ్మజ్ఞాని, ఆ జన్మ బ్రహ్మచారి శుకమహర్షి పరీక్షిత్తుకి వివరించాడు.

వాల్మీకి మహర్షి శ్రీరామ చంద్రునితో

*ఆ. "సీతశుద్ధురాలు, చిత్తవాక్కర్మంబు*
*లందు సత్యమూర్తి యమలచరిత*
*పుణ్యసాధ్వి విడువ'బోలదు చేకొను*
*రవి కులాబ్ధి చంద్ర! రామచంద్ర"* [140]

సీత సత్యనిష్ఠని, పవిత్రతని కొనియాడి స్వీకరించమని పలికాడు, వాల్మీకి చేత భాగవతంలో పోతన చెప్పించిన పద్యం "సీతాయా: చరితం మహత్" అన్న వాల్మీకి రామాయణ గొప్పదనాన్ని, పరమపావని యైన సీతామాత ఔన్నత్యాన్ని విశదీకరించినట్లైంది.

## సీతారాముల అన్యోన్య దాంపత్యం

సీత నిరాశతో కుశలవులను అప్పగించి శ్రీరామచంద్రుని పాదాలను ధ్యానిస్తూ భూగర్భం లో ప్రవేశిస్తుంది. ఆ సందర్భంలో

*మ. "ముదితా! యేటికి ( గ్రుంకి తీవు మనలో మోహంబు చింతింపవే*
*వదనాంభోజము సూపవే మృదువు నీ వాక్యంబు విన్పింపవే*
*తుదిసేయం దగదంచు నీశ్వరు ( డనై దు: ఖించె భూపాలు'డా*
*పదగాదె ప్రియురాలి ( బాసిన యెడన్ భావింప నెవ్వారికిన్"* [141]

శ్రీరాముడు దు:ఖంతో పలికిన మాటలు సీతారాముల అన్యోన్యతను వెల్లడిస్తాయి. భూలోకంలో ఆనాది దంపతులైన సీతారాములే ఆదర్శంగా. సీతారామ కళ్యాణం, మానవ లోక కల్యాణంగా భక్త జనాళిచే భావింపబడుతూ, త్రేతాయుగం నుండి నేటికిని కీర్తింపబడుతుంది. చిర యశస్సు నార్జించిన లోకపావని సీతాదేవి ఆదర్శ నారీ శిరోమణి.

## 16. శకుంతల

పురువంశ రాజైన దుష్యంతుడొకనాడు వేటపై కోరికతో అరణ్యానికి వెళతాడు. దుష్యంతుడు వేటాడుతూ కణ్వాశ్రమ ప్రాంతానికి వెళ్ళి సహజ వైరం ఉన్న జంతువులు స్నేహంతో మెలగటం చూసి పరివారానికి, కణ్వ మహామునికి నమస్కరించి వస్తానని పలికి, వారిని నిలిపి, ఆశ్రమంలో అడుగు పెడతాడు. ఆ కణ్వాశ్రమంలో శకుంతలను చూసి మన్మధతాపానికి గురి అవుతాడు.

దుష్యంత మహారాజు మనస్సులో జితేంద్రియుడైన కణ్వ మహామునికి కుమార్తె ఉండటం అసాధ్యమని భావించి పురువంశంలో వారి మనస్సు అధర్మకార్యాలపై ప్రవర్తిల్లదని భావించి శకుంతల పుట్టు పూర్వోత్తరాలను ప్రశ్నిస్తాడు.

శకుంతల కూడా ఆ దుష్యంతమహారాజును చూడగనే మన్మధ తాపానికి గురియై తన జన్మ వృత్తాంతాన్ని వివరిస్తుంది.

**శకుంతల జన్మ వృత్తాంతం**

అమోఘ తేజోవంతులైన మేనకా విశ్వామిత్రుల తనయ. తపోభంగమైందని తెలిసికొన్న విశ్వామిత్రుడు తపస్సుకి, మేనక దేవలోకానికి అడవిలో శకుంతలను విడిచి వెళతారు. కణ్వ మహాముని పెంచి పెద్ద చేస్తాడు.

**దుష్యంతునిపై అనురక్తి**

శకుంతల తన జన్మ వృత్తాంతాన్ని దుష్యంతునికి తెలియ జేసి తన అదృష్టం ఫలించటం వల్లనే దుష్యంతుడు కనిపించాడని భావించి దుష్యంతునితో ఓ రాజా! ప్రజలు మేము నీ వారమే. ఈ రోజు ఇక్కడ ఉండి మా ఆతిధ్యాన్ని స్వీకరించమని పలుకుతుంది.

**శకుంతలా దుష్యంతుల వివాహం**

దుష్యంతుడు శకుంతలతో ఓ చంద్రముఖీ! నీవు రాజ కుమార్తెవే అయి ఉంటావు. ఇది సత్యం దాపరికమేల? తనకు అన్ని విధాలా తగిన వరుణ్ణి వరించడం రాజపుత్రికకు ధర్మమే. అని మృదుమధుర సంభాషణతో జగన్నుతుడు, కీర్తిమంతుడైన దుష్యంతుడు శకుంతలను గాంధర్వ విధిలో వివాహమాడాడు.

**సంతానవతి**

అమోఘ తేజోవంతుడైన దుష్యంతుడు శకుంతలను గర్భవతిని చేసి మరునాడు తన పట్టణానికి వెళతాడు. శకుంతల కొంతకాలానికి భరతునికి జన్మనిస్తుంది. నవజాత శిశువైన రాజ కుమారునికి కణ్వమహాముని జాతక కర్మలు జరిపిస్తాడు.

కణ్వ మహర్షి బాలుని చూచి ఒక రోజు శకుంతలతో

*ఉ. "పట్టపురాజు నీ మగ ( డు పాప ( డు నన్నిట నెక్కుడంతకున్*

*బట్టపుదేవివై గరిమ బాగుగ నుండక పాఱు వారితో*

*గట్టు వనంబులో నవయ ( గా ( బనిలేదిట ( దల్లి పో ( గదే*

*పుట్టినయిండ్లమాని పతి ( బొందక యిట్లనిశంబు నుందురే!"*[142]

నీ భర్త మహారాజు. ఈ పసివాడు అన్నిట్లో అందెవేసిన చేయి. నీవు పట్టపు రాణివై మర్యాద మన్ననలు పొందవలసింది పోయి ఈ తాపసులతో ఈ కొండ కోనల్లో కష్టపడవలసిన పనిలేదని దుష్యంతుని అంత:పురానికి బయలుదేరి వెళ్ళమని మానవతులు పుట్టింటిలో కలకాలం కాలక్షేపం చేయకూడదని హితవు పలుక శకుంతల దుష్యంతుని వద్దకు వెళుతుంది.

## దుష్యంతుని మౌనం

మన్మధాకారుడైన కుమారుని తీసికొని దుష్యంతుని సభామండపానికేతెంచిన శకుంతలను చూసి దుష్యంతుడు విషయమంతా తెలిసికూడా మౌనంగా ఉంటాడు! శకుంతల తడబాటు చెందిన మనస్సుతో విచారిస్తుంది,

## ఆకాశవాణి వాణి

పుత్రుని, భార్యని చూసి మౌనంగా ఉన్న పురువంశ రాజైన దుష్యంతునితో ఆకాశవాణి.

*"అదె నీ వల్లభ, వా ( డు నీసుతుడు భార్యాపుత్రులన్ బాత్రులన్*

*వదలంగా ( దలనాటి కణ్వవనికా వైవాహికారం భముల్*

*మదినూహింపు శకుంతలా వచనముల్ మాన్యంబులె భూవరేం*

*ద్ర! దయం జేకొనుమంచు మ్రోసెను వియద్వాణీవధూ వాక్యముల్"*[143]

అశరీరవాణి సర్వ ప్రాణులకు స్పష్టమయ్యే విధంగా భరింపుమని (భార్యను, బిడ్డను) పలికి నందు వల్ల భరతుడుగా ప్రసిద్ధికెక్కాడు.

## శకుంతల వైశిష్ట్యం

శకుంతల తల్లి అప్సర: స్త్రీ అయినందు వల్ల ఆమె సౌందర్యం తండ్రి సుక్షత్రియుడై నందు వల్ల, పెంచిన తండ్రి ప్రమేయం లేకుండా దుష్యంత మహారాజుని గాంధర్వ విధిలో వివాహ మాడటంలో స్వయం ప్రతిపత్తిని ప్రకటించినట్లుగా తోస్తుంది.

ఎంత సౌందర్యవతియైన, ఏ జాతిలో జన్మించిన, ధైర్యమున్నా స్త్రీ సంపూర్ణ స్వయం ప్రతిపత్తి ప్రకటిస్తే జీవితంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న విషయం తోస్తుంది.

దుష్యంతుడు కణ్వమహామునికి తెలియచేయకుండా గాంధర్వ వివాహం చేసికొని గర్భవతిని గావించి తన రాజధానికి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత రాజు వర్తమానమే లేదు. చివరికి పెంచిన తండ్రియే ఆమెకొక మార్గం చూపించాలనే దృష్టితో మెట్టింటికి పుత్రసమేతంగా పంపించాడు. అప్పుడు కూడా ఆకాశవాణి సత్యం పలికింది కావున శకుంతల పరువు నిలబడింది. లేని యెడ కణ్వ మహర్షి ఏ తెంచి చెప్పాల్సిన అగత్యమేర్పడేది. కావున ఏ కాలమందైనా స్త్రీ స్వయం ప్రతిపత్తి అభిలషించ దగిందేకాని ముందు వెనుకలాలోచించి పెద్దల ప్రమేయంతో జీవిత నిర్ణయం గావించు కోవటం మంచిదన్న విషయం ఈ శకుంతల పాత్ర ద్వారా సువ్యక్తమైంది.

## 17. శర్మిష్ఠ

రాక్షస రాజైన వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ. ఒక రోజు శర్మిష్ఠ గురుపుత్రియైన దేవయానితో కలిసి జలక్రీడా విహారానికి వెళ్ళింది. ఆ జలక్రీడలాడే సమయాన పార్వతీ సమేతుడై పరమ శివుడు నంది వాహనారూఢుడై ఆ ప్రదేశానికి ఏతెంచాడు. శివుని చూచి సిగ్గుపడిన ఆ మానవతులు తత్తర పాటుతో చీరలు ధరించారు.

ఆ సమయంలో శర్మిష్ఠ దేవయాని చీర ధరించింది.

### దేవయానిచే అవమానింపబడటం

దేవయాని చూచి శర్మిష్ఠతో మహిమాన్వితమైన భూసుర స్త్రీల సొత్తులు అన్య స్త్రీలకు చెందుతాయా? బంగారు గొలుసులు కట్టినంత మాత్రాన కుక్కలు పవిత్రమైన హవిస్సుకి అర్హమౌతాయా? అని నిందించింది. ఇంకను ఓ దుష్టులారా!

*క. "మీ తండ్రి మాకు శిష్యుడు*

*మా తండ్రి గురుండు గొంత మాత్రంబైనం*

*బ్రీతిం గావింపక పరి*

*భూతం జేయుదువె తులవ పో ( డిమి ( జెన ( టీ!"*[144]

చెడునడతతో నన్ను అవమానించావని మండి పడింది. అపుడు దేవయానిని చూచి శర్మిష్ఠ బుసలు కొడుతున్న త్రాచువలె ఈ క్రింది విధంగా పలికింది.

### దేవయానిపై ప్రతీకారం

*శా. "భిక్షుండై తమ తండ్రి మా జనకునిన్ భిక్షించి యుండంగ సం*
*రక్షింపందుది నింతయై మఱపుతో రాజ ప్రసూతా కృతిన్*
*రక్షోరాజతనూజతో సుగుణతో నాతో సమంబాడెడిన్*
*గుక్షిస్ఫోటము గా ( గ దీని ( జెలు లీకూపంబునం ద్రోవరే"*[145]

ఈమె తండ్రి మా తండ్రి దయాభిక్షతో బ్రతుకుతున్నాడన్న విషయం మరచి రాచపుట్టుక కలిగిందానిలా అహంకరించి గుణవతిని రాక్షస రాజ పుత్రిక నయిన నాతో సమంగా ప్రేలుతుంది. దీని కడుపు బ్రద్దలయ్యేటట్లు బావిలోకి పడద్రోయండని గర్వంతో చీర ఇవ్వక చెలికత్తెలతో దేవయానిని పడద్రోయించింది.

### శర్మిష్ఠ దాస్యం

యయాతి మహారాజుచే రక్షింపబడింది దేవయాని. తండ్రికి రాజ కుమార్తె శర్మిష్ఠ చేసిన అపకారం ఏ కరువు పెట్టింది. కుమార్తె బాధ ఉన్న శుక్రాచార్యుడు కఠినాత్ముల ఇళ్ళలో పౌరోహిత్యం చేయటం మహాపాపమని ఊరు వదలి వెళతాడు.

దేవతలను జయించాలనుకున్న రాక్షసరాజు శుక్రుని బ్రతిమలాడి పాదాలపై పడి ప్రార్థించి ప్రసన్నుని చేసికొంటాడు. శుక్రుడు రాక్షస రాజుతో వేయిమంది చెలికత్తెలతో నీ కుమార్తె దాసి వలె నా పుత్రికను సేవిస్తుంటే నా కోపం తీరుతుందని. అప్పుడే నేను నా కుమార్తెని వెంటబెట్టుకొని నీ రాజ్యానికి వస్తానని పలుకుతాడు. శర్మిష్ఠ తండ్రి ఆజ్ఞపై కోపాన్ని దిగమ్రింగి దేవయానికి దాసి అయింది.

శుక్రుడు దేవయానిని యయాతికిచ్చి వివాహం చేసి శర్మిష్ఠతో శరీర సంపర్కం పెట్టుకోవద్దని హెచ్చరించి అల్లుణ్ణి పంపాడు.

**సంతానవతి**

ఒక రాత్రి ఋతుమతియై దేవయాని బయట ఉండగా శర్మిష్ఠ ఒంటరిగా యయాతి వద్దకి వెళ్ళి తన కోరికను వెల్లడించి, మన్మథ సౌఖ్యాన్ని పొంది ద్రుహ్యుడు, అనువు, పూరువు అనే ముగ్గురు తనయులను (కన్నది) పొందింది.

శర్మిష్ఠ ఒక రాజ కుమార్తె అయి ఉండి రాజ మన్ననలు పొంద వలసిన ఆమె దేవయానికి దాసీగా ఉండి, రాజు పొందుకై దొంగగా వ్యవహరించ వలసి వచ్చింది. యయాతి క్షత్రియుడై నందున క్షత్రియ కాంతగా శర్మిష్టే మహారాణిగా అర్హురాలు, కాని దేవయానిని రాక్షసంగా బావిలో పడద్రోయించటమే అనుచిత కార్యం వల్ల జీవితమంతా ఆమె అహంకారానికి తగిన శిక్ష అనుభవించవలసి వచ్చింది. జాత్యహంకారం జీవిత పతనానికి నాంది. అన్న విషయం ఈ పాత్ర వల్ల పరితలకు వెల్లడయింది. బాల్య చాపల్యంతో రాజ కుమార్తెననే అహంకారంతో ప్రవర్తించిన తీరు జీవితమంతా దాస్యానికి గురి చేసింది.

### 2.1.3.2. ప్రజాపతి వంశ స్త్రీలు

## 1. మూర్తి

ఈమె దక్షుని 13వ కుమార్తె. నర నారాయణులకు జన్మనిచ్చిన తల్లి, ధర్ముని భార్య.

*క. "గణుతింప ( గ నర నారా*

*యణులన ధర్మునకు నుదయమందిరి దాక్షా*

*యణియైన "మూర్తి" వలనం*

*బ్రణుత గుణోత్తరులు పరమ పావన మూర్తుల్"* [146]

దక్షుని కుమార్తె కాబట్టి ఈమెను గూర్చి 'దాక్షాయణి' అని సంభావించటం జరిగింది కాని భక్త లోకంలో 'దాక్షాయణి' అంటే దక్షుణి కుమార్తె శివుని అర్ధాంగియైన సతీదేవికి ఈ నామం సుప్రసిద్ధం.

నరనారాయణులకు జన్మనిచ్చిన పరమపావని. శివశక్తి త్రినేత్రుని అర్ధాంగియైన సతీదేవికి తోబుట్టువైన పుణ్యచరిత.

ధర్ముని భార్యగా నరనారాయణు లావిర్భావానికి కారకురాలైన మూర్తి (భగవంతుని తల్లిగా) భాగవత మందు స్థానం సంపాదించుకొని ఖ్యాతి నొందిన మహిళ.

## 2. అదితి

ఈమె దేవమాత, కశ్యప ప్రజాపతి భార్య, ఈమె ద్వితీయ స్కంధం 150వ పద్యం మరియు అష్టమ స్కంధం వామన చరిత్రలో దర్శనమిస్తుంది.

కశ్యప ప్రజాపతి ధ్యాన సమాధి నుండి ఇంటికి అతిధి చేత పూజలందుకుంటాడు. ఆమె ముఖ వివర్ణతని చూచి ఆమె దిగులుకి కారణమేమిటని ప్రశ్నిస్తూ ధార్మిక జీవనం కొన సాగుతుంది కదా? నీ కుమారులు, కోడళ్ళు ఏమి ఇబ్బంది పెట్టటం లేదు కదా? అని ప్రశ్నిస్తాడు. ఆ సమయంలో ఆమె తన ఆవేదనని పతియైన కశ్యపునకు తెలియజేస్తుంది. దితి, అదితి ఇద్దరం అక్కా చెల్లెళ్ళం అయినప్పటికి నాతో దితి ఎప్పుడూ కలహిస్తూనే ఉంటుంది. దేవతలైన నా బిడ్డలను దితి పుత్రులు రాక్షసులు బాధ పెడుతున్నా ఆహా అని మెచ్చుకొంటుంది కాని వారి ద్వేషాన్ని నివారింపదని తాను

సవతి కారణంగా పడుతున్న బాధను వెల్లడి చేస్తుంది. ఈ సందర్భాన్ని బట్టి తల్లుల లక్షణాలు, పెంపకాన్ని బట్టి తనయులుంటారనే విషయం, జన్మ కారకుడైన తండ్రికంటె తల్లి ప్రభావమే అధికమనే విషయం సుస్పష్టం చేస్తుంది.

**కర్తవ్య పరాయణత**

దేవేంద్రుడు రాక్షస రాజైన బలిచక్రవర్తి పరాక్రమానికి తాళలేక అరణ్యాల పాలవుతాడు, ఆ సమయాన అదితి భర్తతో

*సీ. ఎండకన్నెఱు ( గని యింద్రుని యిల్లాలు పలుపంచలను జాలి ( బడియె నే ( డు*
*త్రిభువన సామ్రాజ్య విభవంబు ( గోల్పోయి దేవేంద్రు ( డవుల ( దిరిగె నే ( డు*
*గలిమి గారాబు బిడ్డలు జయంతాదులు శబరార్భకుల వెంట జనిరినే ( డు*
*సమరుల కాధారమగు సమరావతి యసురుల కాట పట్టయ్యెనే ( డు*

*ఆ. "బలిజగములనెల్ల బలియుచు నున్నా ( డు,*
*వాని గెలువరాదు వాసవునకు*
*యాగభాగమెల్ల నత'డాహరించుచు (*
*గడ ( గి సురల కొక్క కడియు నీ ( డు"* [147]

ఎండ కన్నెరుగని ఇంద్రుని ఇల్లాలు శచి ఈనాడు పలు కష్టాలకి గురై బాధ పడుతుంది. ఇంద్రుడు ముల్లోక రాజ్య సంపదను పోగొట్టుకొని ఈనాడు అడవుల్లో ఇడుములు పడుతున్నాడు. కలవారి బిడ్డలై అల్లారు ముద్దుగా పెరిగిన జయంతాదులు ఈనాడు బోయ పిల్లల వెంట తిరుగుతున్నారు. దేవతల నెలవైన అమరావతి రాక్షసుల నెలవైంది. బలియజ్ఞాల్లో హవిర్భాగా లన్నింటిని దోచుకొని ఇంద్రునికి నిలువనీడ లేకుండ చేసి కబళం దేవతలకి చిక్కనివ్వటం లేదు.

మహాత్మా! నీవు ప్రేమతో బిడ్డలను కన్న ప్రజాపతివి. దుర్మార్గులైన బిడ్డలను దండించాలి కదా! ఉత్తములైన దేవతలు కష్టాలపాలై భాగ్యం కోల్పోయారు వారి దు:ఖాన్ని తొలగించి దేవతలని అమరావతిలో నెలకొల్పి రాక్షసులను శిక్షించటం నీవు చేయదగిన మంచిపని. ఈ కార్యం నెరవేర్చే ఉపాయమాలోచించి మమ్మల్ని కరుణారస ప్రవాహంలో ముంచెత్తి శుభాలు చేకూర్చమని, విన్నవించి కర్తవ్యోన్ముఖుని చేసి భర్తృ ధర్మాన్ని, పితృధర్మాన్ని తెలియ చేయటంలో అదితి మాతృప్రేమ, కోడలి సుఖాన్ని కోరే అత్తగా, తపన, ధర్మాచరణ వ్యక్తమవుతుంది.

### పయోభక్షణ వ్రతం

కశ్యప ప్రజాపతి అదితి కోరికలు నెరవేరటానికి జగధీశ్వరుడైన విష్ణువుని ఆరాధించమని పయోభక్షణ వ్రతముపదేశించాడు. ఆ వ్రత నియమాలు ఉపాసనా విధినిచెప్పి జపమంత్రము పదేశించాడు. అదితి పయోభక్షణ వ్రతాన్ని ఫాల్గుణ మాసం శుక్ల పక్షం మొదటి రోజు ఆరంభించి 12రోజులు హరిని పూజించి మహా విష్ణువుని ప్రత్యక్షం గావించుకొని తనివితీర స్వామి రూపాన్ని దర్శించింది. యజ్ఞేశుడు, విశ్వంభరుడైన అచ్యుతుని అనంత తత్త్వాన్ని కొనియాడి శ్రీ మహా విష్ణువుని సుప్రసన్నం చేసికొంది.

### వామనునికి జన్మనిచ్చిన అదితి

అదితి అమిత భక్తికి ప్రసన్నుడైన అచ్యుతుడు అదితితో

*శా. "నీ కోదండ్రును, నీ కుమార వరులున్, నీ నాధు (డున్, నీవు సం*

*శ్లోకింపన్ సతులుం బతుల్ మిగుల సమ్మోదింప రాత్రించరుల్*

*శోకింపన్ భవదీయ గర్భమున (దేజోమూర్తి జన్మించెదన్*

*నాకున్ వేడుక పుట్ట నీ సుతు (డనై నర్తించి వర్తింప (గాన్"* [148]

నేను నీ గర్భమందు తనయుడిగా జన్మించి దేవతలను అమరావతిలో నెలకొల్పి రాక్షసులను పదవీచ్యుతులను చేస్తానని చెపుతాడు. ఆ అదితి గర్భంలో విశ్వగర్భుడు భగవంతుడు పూట పూటకి పెరిగి, పూర్ణ రూపం గ్రహించి శ్రావణ మాసం ద్వాదశి, శ్రవణా నక్షత్రం, అభిజిత్ లగ్నంలో పట్ట పగలు గ్రహ నక్షత్రాలు, చంద్రుడు ఉచ్ఛ దశలో ఉండగా దేవదేవుడు జన్మించి ప్రకృతిని పరవశింప చేస్తాడు.

### అదితి మాతృహృదయం

ప్రకృతినే పరవశింపచేసిన పుత్రుని పొందిన అదితి అమర చరిత. విశ్వ గర్భుడే తన గర్భంలో పెరిగిన విషయాన్ని పుట్టిన సంగతి మరువక అదితి ఆనందంతో వామనుని గూర్చి

*ఆ. "నన్ను (గన్న తండ్రి! నాపాలిదైవమ!*

*నా తప:ఫలంబ? నా కుమార!*

*నాదు చిన్నివడుగ! నాకులదీపక!*

*రా (గదయ్య! భాగ్యరాశివగుచు"* [149]

అని ముద్దు చేసింది. ఆమె వామనుని గూర్చి పలికిన ప్రతి పలుకు యధార్థం చేసి దేవతల పాలిటి భాగ్యరాశియై తనకై తపించి తనను కన్న తల్లి కోరికను నెరవేర్చాడు ఆ దేవ దేవుడు.

పెద్ద ముత్తైదువులు బాలింతరాలైన అదితికి పది రోజులు పురుడు నడిపించి ఈ ఇల్లాలికి లక్ష్మీ పార్వతులే సమానమైన వారని ప్రశంసించారు. లక్ష్మీ పార్వతులతో సమానంగా కొనియాడ బడిన ఈ దేవమాత అదితి మహిమ అనన్య సామాన్యం.

## 3. దితి

దక్ష ప్రజాపతి కుమార్తె. కశ్యపుని ధర్మపత్ని. గృహస్థ జీవితంలో ఇంద్రియ సుఖాలకై (451 నుండి 493వ పద్యం వరకు తృతీయ స్కందం) కాల ధర్మాన్ని పాటించక పోవటం వల్ల కలిగే అనర్థాలు, సంధ్యాకాలంలో, ప్రమధ గణాలతో వృషభారూడుడై ముక్కంటి సంచరిస్తాడని, ఉగ్రవేళ రమింప నిషిద్ధ కర్మ అని భర్త చెప్పినా వినక దితి తొందర పాటు చర్యతో లోక కంటకులైన హిరణ్యాక్ష, హిరణ్య కశిపులకు జన్మనిచ్చింది.

అనంతరం పశ్చాత్తాప పడిన దితికి ఆమె ప్రవర్తన ఎటువంటిదో, దాని దుష్పరిణామమేమో ఈ క్రింది పద్యమందు వివరించాడు.

*మ. "సతి! నీవీగతి నింద కోడక మనోజాతేక్షు కోదండని*
*ర్గత నారాచ పరంపరాహత వికీర్ణ స్వాంతవై పాప సం*
*గతి లజ్జాభయ ధర్మముల్ విడిచి దుష్కాలంబు నందే రమిం*
*చితి బల్మిన్ వెలయాలి కైవడిని దుశ్శీల క్రియాలోలతన్"*[150]

సమయా సమయాలు విచారింపక చేయకూడని పని చేయటం, సిగ్గు, భయం వీడి ప్రవర్తించటం వెలయాలి లక్షణంగా కశ్యపుడు దితికి వివరించి రాక్షసులకు జన్మనిచ్చెదవని వచించాడు.

దితి పశ్చాత్తాపంతో దు:ఖించగా కశ్యపుడు హరి పాద సేవ వల్ల, సంతోషంతో నాకు సేవ చేయటం వల్ల అతి ధార్మికుడు ముకుంద భక్తుడు, నీకు మనుమడుగా జన్మిస్తాడని పలికి ఓదార్చాడు.

ఈ కథని పరిశీలింప దితి తొందరపాటు స్వభావిగా, ధర్మా ధర్మాలు తెలిసిన మహాజ్ఞాని, ధర్మాచరణ నియమ బద్ధునిగా కశ్యపుడు గోచరిస్తున్నాడు. దితి తొందరపాటుకి సపత్నులుండటం కూడా కారణంగా తోస్తుంది. అంత ధర్మాచరణ బద్ధునిగా ఉన్నా, బహుభార్యాత్వం అంగీకరించక ఏక పత్నీ వ్రతునిగా ఉన్నచో దితి ఈ విధమైన దుష్కర్మకి పాల్పడి ఉండక పోవచ్చు.

దితి కూడ స్త్రీధర్మాలు, గృహస్థ ధర్మాలు, భర్త వల్ల సంతానం పొంది ఆ వంశాన్ని ప్రకాశింప చేయాలనే దృఢ కాంక్షతో త్వరపడింది కాని అవివేకి, అజ్ఞానియైకాదు.

దితి హరిసేవా పరాయణత, భర్తృ ధర్మ నిర్వహణమే భర్త చేత పాప పరిహారం చెప్పించుకో గల్గింది. ఆమె ప్రవృతి రాక్షసం కాదు. కేవలం సంధ్యా సమయ నియమోల్లంఘున వల్లనే హిరణ్యాక్ష హిరణ్య కశిపులకు జన్మనిచ్చింది. వారి జన్మకూడ కారణ జన్మే. ఆ కారణ జన్ములకు (జయ విజయులు వైకుంఠ ద్వార పాలకులు) ఈమె ప్రవర్తనం కారణంగా చూపటం దైవలీల, విధివిలాసమేకాని, దితి సుస్వభావ కాకపోవటం కాదు. శత సంవత్సరాలు గర్భధారణ భారం వహించిన సహనశీలి.

## 4. ప్రసూతి (చతుర్ధ స్కంధం)

దక్ష ప్రజాపతి పత్ని. స్వాయంభువ మనువు మూడవ కుమార్తె. దక్ష ప్రజాపతికి ప్రసూతి వల్ల 16 మంది కుమార్తెలు జన్మించారు, వారిలో ధర్మునికి 13 మందిని ఇచ్చి వివాహం చేసారు. అగ్ని దేవునికి స్వాహాదేవి, పితృదేవతలకి ఒక కన్యను, సతీదేవిని శివునికిచ్చి వివాహం చేసారు. ప్రసూతి సతీదేవికి, శివుని అర్ధాంగికి జన్మనిచ్చిన పరమ పావని. 13 మంది కుమార్తెల నామాలు. 1.శ్రద్ధ 2. మైత్రి 3. దయ 4.శాంతి 5.తుష్టి 6.పుష్టి 7.క్రియ 8.ఉన్నతి 9.బుద్ధి 10.మేధ 11.తితిక్ష 12.హ్రీ 13.మూర్తి.

దక్ష ప్రజాపతి బ్రహ్మ మానస పుత్రుడు బ్రహ్మ దేవుని కోడలైన ప్రసూతి సృష్టి కార్యానికి తోడై మెట్టింటిని, మామగారి సంకల్పానికి తోడై ఒక గృహిణిగా ఆదర్శంగా నిలిచింది.

## 5. బర్హిష్మతి

ఈమె విశ్వకర్మ ప్రజాపతి తనయ. స్వాయంభువ మను పుత్రుడైన ప్రియవ్రతుని భార్య. ఈమెకు గుణశీల రూప ఔదార్య పరాక్రమవంతులైన 10మంది కొడుకులు. 1.అగ్నీధ్రుడు 2.ఇధ్మజిహ్వుడు 3.యజ్ఞబాహువు 4.మహావీరుడు 5.హిరణ్యరేతసుడు 6.ఘృత పృష్టుడు 7.సవనుడు 8.మేధాతిథి 9.వీతి హోత్రుడు 10.కవి అనే వారు. ఒక కుమార్తె ఊర్జస్వతి. ఈమె కొడుకుల్లో ముగ్గురు కవి, మహావీరుడు, సవనుడు బాల్యం నుండి నైష్ఠిక బ్రహ్మచర్యంతో బ్రహ్మ విద్యా నిష్ణాతులయ్యారు. వారు శాంత స్వభావులై పరమ హంస యోగాన్నవలంబించి, సన్యాసాశ్రమం స్వీకరించారు. భక్తి యోగంతో ఈశ్వర తాదాత్మ్యం పొందారు. ఇటువంటి మహానుభావులకు బర్హిష్మతి జన్మనిచ్చి ధన్యురాలయింది. ఈమె భర్త అనురాగాన్ని పరిపూర్ణంగా పొందిన మహిళ.

ఈ భూమండలాన్ని సప్త ద్వీపాలుగా విభజించిన సమర్థుడు, భూవిభుడైన ప్రియవ్రత మహారాజు అర్ధాంగిగా అఖండ భోగాలు అనుభవించిన భోగవతి. ఈమె పుత్రుల్లో ఏడుగురు పుత్రులు ఈ భూ మండలంలో ఏడు ద్వీపాలకు అధిపతులయ్యారు. సూర్యునికి ప్రతి సూర్యునిగా ప్రకాశించిన ప్రియవ్రత మహారాజును భర్తగా, ఆధ్యాత్మిక సంపద కల్గిన ముగ్గురు కుమారులను, అఖండ వైభోపేతమైన ఈ భూమండలాన్ని పాలించగల్గిన ఏడుగురు కొడుకులను కని, ఒక కన్యా రత్నాన్ని పొంది, రాక్షస గురువైన శుక్రాచార్యునికి కన్యా దానం చేసి శతుక్రతు ఫలాన్ని పొందిన సంపూర్ణ ప్రజాపతి వంశ మహిళ.

## 6. అసిక్ని (షష్ఠమ స్కంధం)

పంచజన ప్రజాపతి పుత్రిక శ్రీమన్నారాయణుడు దక్షప్రజాపతికి ఈమెతో దాంపత్య ధర్మంతో ప్రజాభివృద్ధిని చేసి నన్ను సేవిస్తారని సెలవిచ్చారు.

అసిక్ని దక్షప్రజాపతితో "హర్యశ్వులు" అనే పేరు ఉన్న పదివేల మంది పుత్రులను పొందింది. హర్యశ్వులు నారదుని హితోపదేశం ద్వారా నివృత్తి మార్గాన్ని స్వీకరించి మోక్ష ప్రవృత్తులయ్యారు. అసిక్ని దక్ష ప్రజాపతితో శబలాశ్వులనే వేలకొద్ది పుత్రులను పొందారు. వీరికి నారదుడు నివృత్తి మార్గాన్ని ఉపదేశించగా వారు అనుసరించారు.

అసిక్నికి అనంతరం 60 మంది పుత్రికలున్నారు వీరిలో 10మంది ధర్ముని భార్యలుగా, 13 మంది తార్క్ష్యుడనే ప్రజాపతి భార్యలుగా, 27 మంది చంద్రుని భార్యలుగా, భూతునికి ఇద్దరు, అంగిరసునికి ఇద్దరు, కృశాశ్వునికి ఇద్దరు, తార్క్ష కశ్యపునికిద్దరిని ఇచ్చి పెండ్లి చేసాడు.

అసిక్ని 60 మంది పుత్రికలకు జన్మనిచ్చి తన జన్మను ధన్యం గావించుకొంది.

*ఆ. "ఎట్టి పుణ్యవతులో? యీ చేడియలు సెప్ప*
*సవతులేని యట్టి సవతులయ్యు*
*గడుపు వడసి రెట్టి కడుపున ( బుట్టిరో*
*కడి ( ది త్రిజగమెల్ల ( గడుపు గా ( గ"* [151]

అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయులు పుణ్యసతులై సాటిలేని సతీమతల్లులై సంసారం చక్క దిద్ది వారి తల్లి కడుపు చల్లగా ముల్లోకాలను కడుపున మోసి కన్నారు.

## 7. జామిదేవి

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల కుమార్తె. ఈమె ధర్ముని పత్ని. ఈమె దుర్గాభిమానిను లైన అధిష్టాన దేవతలు పుట్టారు. వీరికి స్వర్గుడు, నంది జనించారు. అధిష్టాన దేవతల పుట్టుటకే కారణమై తన జన్మను తరింప చేసికొన్న పుణ్య స్త్రీ జామిదేవి.

## 8. విశ్వ

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల కుమార్తె. ఈమె ధర్ముని పత్ని. ఈమెకు విశ్వే దేవతలు కలిగారు.

## 9. సాధ్య

ఈమె కూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల కుమార్తె. ధర్ముని పత్ని. ఈమెకు సాధ్య గణాలు జన్మించారు. వీరికి అర్ధసిద్ధి కలిగింది.

## 10. మరుత్వతి

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ధర్ముని పత్ని. ఈమెకి మరుత్వంతుడు, జయంతుడనే వారు జనించారు వీరిలో జయంతుడు వాసుదేవాంశతో ఉపేంద్రుడని పిలువబడి ప్రసిద్ధికెక్కాడు.

## 11. ముహూర్త

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ధర్ముని పత్ని ఈమెకి మరుత్వంతుడు, జయంతుడనే వారు జనించారు. వీరిలో జయంతుడు వాసుదేవాంశతో ఉపేంద్రుడని పిలువబడి ప్రసిద్ధికెక్కాడు.

## 12. వసువు

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ధర్ముని పత్ని. ఈమెకి అష్ట వసువులు జన్మించారు. వారి పేర్లు ద్రోణుడు బ్రాహ్మణుడు, ధ్రువుడు, అర్కుడు, అగ్ని, దోషుడు, వస్తువు, విభావసువు. ప్రజాభివృద్ధికి ఇతోధికంగా ఉపయోగపడిన ఈ వసువు జన్మ చరితార్థం.

## 13. సంకల్ప

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ధర్ముని పత్ని. ఈమెకి సంకల్పుడు జన్మించాడు.

## 14. శర్వరి

ఈమె అష్ట వసువుల్లో ఆరవవాడైన దోషుని పత్ని. ఈమెకి శ్రీహరి అంశతో శింశుమారుడు ఉదయించాడు.

## 15.సురూప

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. భూతుని ధర్మపత్ని. ఈమెకు కోట్లకొద్ది రుద్రగణాలు పుట్టారు మరియు రైవతుడు, అజుడు, భవుడు, భీముడు, వాముడు, ఉగ్రుడు, వృషాకపి, అజైకపాదుడు, అహిర్బుధ్న్యుడు, బహురూపుడు, మహాంతుడనే వారు రుద్ర పారిషదులు. ఇంకను అతి భయంకరులైన ప్రేతలు, వినాయకుడును పుట్టారు.

దక్షప్రజాపతి తనయగా జన్మించిన సురూప ప్రజాభివృద్ధికి ప్రధానంగా రుద్రగణాల పుట్టుకకు కారణమై, రుద్ర పారిషాదులను, ప్రేతలు, వినాయకుని సృష్టిలో ఉండటానికి కారణమై, వినూత్న సృష్టికి కారణమైన ఈమె జన్మ ధన్యం.

## 16. స్వధ

అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. అంగిరసుని భార్య. ఈమెకి పితృగణాలు జన్మించారు.

## 17. సతి

ఈమె కూడ  అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. అంగిరసుని భార్య. ఈమెకి అధర్వ వేదాభిమానులైన దేవతలుద్భవించారు.

## 18. వినత

అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. తార్ష్య కశ్యపుని భార్య వినతకి అసూరుడు గరుత్మంతుడనే ఇరువురు కుమారులుదయించారు. అనూరుడు సూర్య రధ సారధి. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువు వాహనం.

## 19. కద్రువ

ఈమె కూడ అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. తార్ష్ణ కశ్యపుని భార్య. ఈమె నానా విధాలైన నాగులను కన్నది.

## 20. రోహిణి

ఈమె అసిక్ని దక్షప్రజాపతి దంపతుల తనయ. చంద్రునికి 27మంది భార్యలు. చంద్రునికి రోహిణి మీద మక్కువ ఎక్కువ భర్త ప్రేమను సంపూర్ణంగా పొందిన సౌభాగ్యవతి ఈమె,

## 21. దనువు

ఈమె అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ కశ్యప ప్రజాపతి భార్య. ఈమె దానవుల పదునెనిమిది మందికి తల్లి.

*వ. "ద్విమూర్ధుండును, శంబరుండును, అరిష్టుండును, హయ గ్రీవుండును, విభావసుండును, అయోముఖుండును, శంకు శిరుండును, స్వర్భానుండును, కపిలుండును, అరుణియును, పులోముండును, వృష పర్వుండును, ఏక చక్రుండును, అనుతాప కుండును, ధూమ్రకేశుండును, విరూపాక్షుండును, విప్రచిత్తియు, దుర్జయుండు ననువారలు"* [152]

వీరందరు దనువు పుత్రులగుటచే దానవులని పేరు పొందారు.

## 22. ఉపదానవి

దనువు (దానవుల తల్లి) కుమారుడైన వైశ్వానరుని పెద్ద కుమార్తె. ఈమె మంచి రూపం గలది. ఈమెను హిరణ్యాక్షుడు వివాహమాడాడు.

### 2.1.3.3. కురువంశ స్త్రీలు

## 1. ద్రౌపది (ప్ర. స్కం)

పుడమిపై పుట్టిన ప్రతి స్త్రీ బాల్యంలో ఆట పాటలతో, మాతా పితరుల వాత్సల్యంతో అల్లారు ముద్దుగా పెరిగి యౌవనవంతురాలవతుంది. అసలైన జీవితం స్త్రీకి అప్పుడే ఆరంభమవుతుంది. సామాన్య, సాధారణ సగటు స్త్రీ స్థితి ఇది.

కానీ మనకు సాహిత్యేతిహాసల్లో అసాధారణ స్త్రీలు కన్పిస్తున్నారు. వారిలో ఒకరు శ్రీమద్రామాయణ కథానాయిక సీత. మరొకరు మహాభారత కథానాయిక ద్రౌపది.

భారత భాగవతాలు ఏకకాలంలో ఏక వ్యక్తిచే రచింపబడిన గ్రంధాలు. ఒకటి కౌరవ పాండవుల కథ. రెండు శ్రీకృష్ణుని చరితం. (కృష్ణ లేదా విష్ణుభక్తుల గాధలు) పాండవుల తల్లి కుంతి శ్రీకృష్ణుని మేనత్త. భారతకధనంతా నడిపించిన సూత్రధారి శ్రీకృష్ణుడే భాగవత కధకి నాయకుడు.

**పూర్వకథ**

ఆంధ్ర మహా భాగవతంలో సూత మహర్షి శౌనకునితో పాండవుల మహాప్రస్థానాన్ని వివరిస్తాడు. కురుక్షేత్ర సంగ్రామంలో వీరులైన వారు చాలామంది చనిపోయి స్వర్గానికి వెళతారు. అనంతరం భీమసేనుని గదాదండం దెబ్బకి రారాజు దుర్యోధనుడు తొడలు విరిగి నేలరాలాడు. గురు పుత్రుడైన అశ్వత్థామ రారాజుకి సంతోషం కలిగించటం కోసం నిద్రిస్తున్న ద్రౌపదీ కుమారుల శిరస్సులను ఖండించి తెచ్చి సమర్పించాడు. ఈ క్రూర కృత్యాలు లోకులందరూ గర్హించారు.

**భాగవత కథలో ద్రౌపది**

కన్న కొడుకుల మరణ వార్తను విని ద్రుపదరాజ పుత్రి ద్రౌపది దు:ఖాన్ని తట్టుకోలేక నేలపై పడింది. పుత్ర శోకయైన ద్రౌపదిని.

*ఉ. "బాలుర చావు కర్ణముల ( బడ్డ ( గలంగి యలంగి యోరువం*

*జాలక బాష్పతోయకణ జలము చెక్కుల రాలనేడ్చి, పాం*

*చాల తనూజ నేల ( బడి జాలి ( బడంగని, యెత్తి మంజువా*

*చాలత'జూపుచుం జికురజాలము దవ్వుచు గ్రీడియిట్లనున్"*[153]

అర్జునుడు ఓదార్చి, లేవదీసి మధుర సంభాషణతో ధైర్యం చెప్పి ఆమె శిరోజాలు దువ్వుతూ ఇలా అన్నాడు.

*మ. "ధరణీశాత్మజ వీవు నీకు వగవన్ ధర్మంబె? యాద్రౌణిని*
*ష్ఠురుణుండై విదళించె బాలకుల! మద్గాండీవ నిర్ముక్తభీ*
*కర బాణంబుల నేఁడు వాని శిరమున్ ఖండించి నేఁదెత్తుఁ ద*
*చ్ఛిరముం ద్రొక్కి జలంబులాడు మిచటన్ శీతాంశు బింబాననా!"*[154]

క్షత్రియకాంతవైన నీకు దుఃఖించటం తగదని హితవు పలికాడు. ఈ సన్నివేశాన్నిబట్టి ద్రౌపదిపై అర్జునునికి ఉన్న మక్కువ అభివ్యక్తమవుతుంది.

అయినా ద్రౌపది పుత్రశోకంతో కుమిలిపోయింది. ద్రౌపది అగ్నిజాత. సద్యోయౌవనవతి అయినా స్త్రీ సహజమైన మాతృత్వం, పుత్రులను కోల్పోయి పుత్రశోకగా మనకు సాక్షాత్కరిస్తుంది. కడుపు తీపి స్త్రీ సహజ లక్షణం కదా! ఎంత వారికైన కడుపుకోత సామాన్య విషయం కాదు కదా!

అర్జునుడు ద్రౌపదితో శపథం చేసాడు. అశ్వత్థామ శిరాన్ని ఖండించి తెచ్చి నీకు కానుకగా ఇస్తానని, ఆ శిరస్సును నీవు కాలితో తన్నిన తర్వాతనే మైల స్నానం చేద్దువుగాని అని పలికిన పలుకుల్లో క్షత్రియోచితమైన ప్రతీకార వాంఛ తన భార్య దుఃఖానికి వెన్వెంటనే ప్రతీకారం చేయాలన్న కాంక్ష ద్రౌపదిపై ఉన్న గౌరవాతిశయాన్ని వెల్లడి చేస్తుంది. ప్రతిజ్ఞ నెరవేర్చటానికి నరుడు (అర్జునుడు) నారాయణుని (శ్రీకృష్ణుని) సారథ్యంలో విజయం చేసి విజయుడై అశ్వత్థామని బంధించి ద్రౌపది ముందు నిలబెడతాడు.

బాలవధ జనిత లజ్జా పరాఙ్ముఖుండైన గురు పుత్రుని చూచి ద్రౌపది పలికిన పలుకుల్లో స్థిత ప్రజ్ఞ లక్షణాలు గోచరిస్తాయి. ద్రౌపది తన పుత్రులను సంహరించిన అశ్వత్థామను పుత్రాకృతి నున్న ద్రోణుడని సంబోధించటంలో

*మ. "పరఁగన్ మా మగ వారలందఱును మున్ బాణ ప్రయోగోపసం*
*హరణాద్యాయుధ విద్యలన్నియు ద్రోణాచార్యుచే నభ్యసిం*
*చిరి, పుత్రాకృతి నున్న ద్రోణుడవు, నీ చిత్తంబులో లేశముం*
*గరుణా సంగము లేక శిష్య సుతులన్ ఖండింపగాఁ బాడియే?"*[155]

వైదిక ధర్మజ్ఞగా వెల్లడవుతుంది.

అశ్వత్థామకు ఉండవలసిన లక్షణాలు గుర్తుచేసి

*క. "భూసురు ( డవు బుద్ధిదయా*
*భాసురు ( డవు శుద్ధ వీర భట సందోహా*
*గ్రేసరు ( డవు, శిశుమారణ*
*మాసుర కృత్యంబు ధర్మమగునే తండ్రీ!"* [156]

మాటలతోనే ద్రౌపది ఆగ్నేయాస్త్రం ప్రయోగించిన నేర్పరి. తన బిడ్డలు ఎలాంటి వారో, ఏ హాని చేయని వారిని, శిశువులను, నిద్రాసక్తులను సంహరించి, భూసురుడవైన నీవు అసురుడ వయ్యావని వాక్శూలాలను సంధించింది.

*శా. "ఉద్రేకంబున రారు శస్త్రధరులై, యుద్ధావనిన్ లేరు కిం*
*చిద్ద్రోహంబున నీకు ( జేయరు బలోత్సేకంబుతో ( జీకటిన్*
*భద్రాకారుల ( బిన్న పాపల రణప్రౌఢ క్రియాహీనులన్*
*నిద్రాసక్తుల సంహరింపనకటా! నీ చేతులెట్లాడెనో?"* [157]

ద్రోణపత్ని పతీ వియోగాన్నే కాక, నా వలె పుత్ర వియోగం పొంద కూడదని జాలిపడి అశ్వత్థామని సంహరించవద్దని కర్మ అసురత్వమున్నా, జన్మ భూసురత్వాన్ని గుర్తు చేసి, కర్తవ్య నిర్వహణను పార్థునకు, పాండవులకుపదేశించి "కరణేషుమంత్రీ" అన్న తన గృహిణీ ధర్మాన్ని నెరవేర్చింది.

అదుపు తప్పిన భీముని ఆవేశాన్ని అడ్డగించి వారించటంలో ధర్మచ్యుతి జరుగకుండా బల పరాక్రమోపేతులైన పతులను వారింపగల్గిన పత్ని, ధీశాలి ద్రౌపది.

కురుక్షేత్రంలో మరణించిన బంధువులకెల్ల అంత్యక్రియలు నిర్వర్తించటంలో, తన పతులతో సమానంగా కర్తవ్య నిర్వహణ గావించింది.

## ద్రౌపది ప్రత్యేకత

ద్రౌపది అగ్ని తత్త్వమున్న మహిళ. యజ్ఞజన్య అందువల్లనే సమవర్తి అంశ సంభూతుడైన ధర్మరాజు, అనిలాంశ సంభూతుడైన భీముని, దేవేంద్రాంశ సంభూతుడైన ధనంజయుని , దేవ వైద్యులైన అశ్వినీ దేవతాంశ సంభూతులైన నకుల సహదేవులను భర్తలుగా భరించగల్గింది. అది

కూడా పెద్దలే ధర్మ నిర్ణయం చేసి నిశ్చయించటం విశేషం, క్షత్రియ కాంతల్లో ద్రౌపది ఒక ప్రత్యేక పాత్ర, ద్రౌపది పాత్రను పరిశీలిస్తే ఏ యుగాల్లో ఇటువంటి స్త్రీమూర్తి కన్పించదు.

*"కృతేతు రేణుకా మృత్యు:*
*త్రేతాయం జనకాత్మజా*
*ద్వాపరేద్రుపదాత్మజా*
*కలియుగే గృహే గృహే"*

అనే శ్లోకం కృతయుగం జమదగ్ని మహాముని భార్య రేణుక వల్ల అంతమైందని, త్రేతాయుగం జనక మహారాజు కుమార్తె సీతవల్ల, ద్వాపర యుగం ద్రౌపది వల్ల (నేటి) కలియుగం ప్రతి గృహంలో గృహిణి కారణంగా అంతరిస్తుందని తెలియ చేస్తున్నది.

ద్వాపర యుగాంతానికి కారణమైన ఈ ద్రుపదాత్మజ కలియుగారంభానికి కారణమై తన పాత్ర నిర్వహణ ద్వారా గృహిణీ ధర్మ నిర్వహణ ఏ విధంగా ఉండాలో మనకు తేటతెల్లంచేసింది.

*"కార్యేషు దాసీ కరణేషు మంత్రీ*
*భోజ్యేషు మాతా శయనేచ రంభా*
*రూపేచ లక్ష్మీ క్షమయా ధరిత్రీ*
*షట్కర్మ యుక్తా ఖలు ధర్మ పత్నీ"*[158]

పాండు భూవరుని కోడలుగా, పాండవ పట్ట మహిషిగా గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణ చేసిన ధర్మజ్ఞ ద్రుపద రాజపుత్రి, పాంచాల రాజ పుత్రికగా పేరుగాంచిన పాంచాలి పంచ భూతాత్మకమైన ఈ ప్రకృతి ధర్మ నిర్వహణలో సాటిలేని మేటి స్త్రీగా ద్వాపర యుగంలో అద్వితీయ ఖ్యాతి గడించి చిరకీర్తి నార్జించి చరిత్ర సృష్టించిన ధీశాలి.

'లక్షణ' శ్రీకృష్ణుని అష్టమ భార్య తన వివాహ వృత్తాంత కథలో శ్రీకృష్ణ పరాక్రమాన్ని వివరించగా, శ్రీకృష్ణుని పాదపద్మాలు మనస్సులోనే ధ్యానించి పులకించిన పాంచాలి తనకు ఆకాశవాణి పెట్టిన 'కృష్ణ' నామాన్ని సార్థకం చేసుకొంది.

**పాంచాలి అంతిమ ప్రస్థానం**

పంచ పుత్రులకు తల్లి అయి (ద్రౌపదికి ధర్మరాజు వల్ల ప్రతివింధ్యుడు, భీముని వల్ల శ్రుతసేనుడు, అర్జునుని వల్ల శ్రుతకీర్తి, నకుని వల్ల శతానీకుడు. సహదేవుని వల్ల శ్రుత కర్ముడు జన్మించారు) ముందే విగతజీవులైన పుత్రులను చూసింది. పాండవ పట్ట మహిషి అయినప్పటికి పడరాని పాట్లు పడింది. అందరూ ఉండి, ఎవరూ లేని నిస్సహాయ స్త్రీవలె కృష్ణ పరమాత్మ భక్తితో సహా యమర్ధించి, తన జీవితంలో జరిగిన పరాభవానికి (వస్త్రాపహరణం) పగ తీర్చుకుని స్త్రీ శక్తిని లోకానికి చాటిన సబల. చరమదశలో వాసు దేవునిపై మనస్సు లగ్నం చేసి తత్పథం చేరిన గొప్ప కృష్ణ భక్తురాలు.

## 2. ఉత్తర

ఈమె విరాట మహారాజు తనయ. బాల్యం ఆటపాటలతోను బృహన్నల వేషధారియైన అర్జునుని వద్ద నాట్యం నేర్చింది. తొలి చూపుతోనే శ్రీకృష్ణుని మేనల్లుడు సుభద్రార్జునుల తనయుడైన అభిమన్యుని హృదయంలో స్థానం సంపాదించిన అందాల అలివేణి.

కీచక వధానంతరం, పాండవుల అజ్ఞాత వాసానంతరం ఉత్తరాభిమన్యుల వివాహం పెద్దల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం కొద్ది కాలంలోనే కురుక్షేత్ర సంగ్రామం. ఆ సంగ్రామంలో అభిమన్యుడు పద్మవ్యూహంలో వీర స్వర్గమలంకరిస్తాడు. ఆ సమయానికి ఉత్తర గర్భవతి.

**భాగవత కథలో ఉత్తర**

జగన్నాటక సూత్రధారి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి, పాండవుల వద్ద సెలవు తీసుకుని ద్వారక వెళ్ళటానికి రథారోహణం చేసే సమయంలో ఉత్తర తత్తరపడుతూ వచ్చి ఈ క్రింది విధంగా పలుకుతుంది.

*మ. "ఇదె కాలానల తుల్యమైన విశిఖంబేతెంచె దేవేశ! నేఁ*

*డుదరాంతర్గత గర్భదాహమునకై యుగ్రప్రభన్ వచ్చుచు*

*న్నది దుర్లోక్యము మానుపన్ శరణమన్యంబేమియున్ లేదునీ*

*పద పద్మంబులె కాని యొండెఱుఁగ నీ బాణాగ్ని వారింపవే"*[159]

*క. "దుర్భర బాణానలమున,*
*గర్భములో నున్న శిశువు ఘన సంతాపా*
*విర్భావంబును బొందెడి*
*నిర్భర కృప ( గావుమయ్య నిఖిల స్తుత్యా!"* [160]

*క. "చెల్లెలి కోడల, నీమే*
*నల్లుడు శత్రువులచేత హతు ( డయ్యెను, సం*
*ఫుల్లార విందలోచన!*
*భల్లాగ్నినడంచి శిశువు బ్రతికింపగదే!"* [161]

*ఆ, "గర్భమందు ( గమల గర్భాండ శతములు*
*నిముడుకొన వహించు నీశ్వరేశ!*
*నీకు నొక్క మానినీ గర్భ రక్షణ*
*మెంత బరువు నిర్వహింతుగాక"* [162]

శ్రీకృష్ణావతార తత్వాన్ని గుర్తించి, ఆకళింపు చేసికుని పిన్న వయస్కురాలైనప్పటికి ఉత్తర పరమాత్మకి అనన్య శరణాగతి చేసింది. అంతేకాక నీ చెల్లెలి కోడలనని, నీ మేనల్లుడు శత్రువులచే సంహరింప బడ్డాడని, గర్భస్థ శిశువుని కృపతో కావుమని నిఖిల స్తుత్యుడైన అరవిందలోచనుని ఆర్తితో అర్థించింది.

ఆశ్రిత వత్సలుడైన శ్రీకృష్ణ పరమాత్మ సుభద్ర కోడలి దీనాలాపాలు విని తన చింతయేకాని పరచింతన లేని పాండవ వంశాన్ని నిలబెట్టటానికి

*మ. "సకల ప్రాణి హృదంతరాళముల భాస్వజ్జ్యోతియై యుండు సూ*
*క్ష్మకకుండచ్యుతు ( డయ్యెడన్ విరటజా గర్భంబు ( దా ( జక్ర హ*
*స్తకు ( డై వైష్ణవమాయ ( గప్పి కురు సంతానార్థియై యడ్డమై*
*ప్రకటస్ఫూర్తి నడంచె ద్రోణతనయ బ్రహ్మాస్త్రమున్ లీలతోన్"* [163]

సూక్ష్మాతి సూక్ష్మమైన రూపంతో సకల ప్రాణుల హృదయాంతర్వర్తి, జ్యోతిర్మూర్తియై ప్రకాశించే వాసుదేవుడు చక్రపాణియై ఉత్తరా గర్భాన్ని వైష్ణవ మాయతో కప్పివేసి, అమోఘమైన ఆ వైష్ణవ తేజస్సుతో అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని అవలీలగా అణచి వేశాడు.

శ్రీకృష్ణ పరమాత్మచే రక్షింపబడిన పాండవ వంశాంకురం, పాండవ వంశాన్ని నిలబెట్టటమే కాక తన రక్షకుడైన శ్రీకృష్ణుని అవతార తత్త్వాన్ని, భాగవత కథలను ఈ లోకానికి అందించి తన దేవ ఋణం తీర్చుకున్నాడు. శుకాలాపమైన భాగవతాన్ని ద్వాపరయుగా న్నుండి కలియుగానికి అందించి కల్మిబారిన జనులు పడకుండ శ్రీకృష్ణ గాథలు విని తరించి ముక్తి పొందటానికి కారణమైన పరీక్షిత్తు జన్మ ధన్యం. ఇంతటి ధన్యాత్ముని కన్న ఉత్తర చరిత లోకోత్తరం లోకజన స్తుత్యం.

## 3. కుంతి

వసుదేవుని తండ్రి శూరుడు. ఈ శూరుని కుమార్తె సౌందర్యవతి. పృథాదేవి. శూరుడు తన మేనత్త కొడుకయిన కుంతి భోజునికి తన మొదటి సంతానాన్ని దత్తత ఇస్తానని వాగ్దానం చేసి ఉండటం వల్ల, ఆ విధంగానే దత్తత ఇచ్చాడు. కుంతి భోజుని ఇంట పెరిగినందు వల్ల పృథాదేవికి కుంతిగా ప్రసిద్ధి వచ్చింది.

ఈమె కన్యగా ఉన్నప్పుడు దుర్వాస మహర్షికి సేవ చేసి వరం పొందింది (తను కోరుకున్న పురుషుని వల్ల పుత్రుని పొందే మంత్రోపదేశం). కుంతి బాల్య చాపల్యంచే మంత్ర ప్రభావం తెలుసుకోవాలనే అమాయకత్వంతో మంత్రం జపించి కర్మసాక్షి సూర్య భగవానుని సాక్షాత్కరింప చేసుకొంది. సాక్షాత్కరించిన సూర్యుడు, కుంతి భయపడి వారించినా వినలేదు. మంత్ర ముగ్ధతచే కుంతికి పుత్రుని ప్రసాదించాడు. ఆ కర్మ సాక్షి ప్రసాదించిన పుత్రుడు సహజ కవచ కుండలో పేత సంపన్నుడు కర్ణుడు. కుంతి లోకానికి వెఱచి, కన్య కాబట్టి, భయపడి, కర్ణుని నదిలో (పెట్టెలో ఉంచి) విడిచింది.

అనంతర కాలంలో ఈమె గాంధర్వ వివాహంతో పాండుపత్ని అయింది, పాండురాజు పత్నిగా ఈమె పత్యనురక్తి, సంతాన రక్షా తత్పరత, వివేకం, సహనం, త్యాగం, వృద్ధోపసేవ మొదలైన మహాగుణాల కాకరంగా భారతమందు కన్పిస్తుంది.

**భాగవత కథలో కుంతి**

ఆంధ్ర మహా భాగవతం ప్రథమ స్కంధంలో శ్రీకృష్ణుడు ఉత్తర గర్భస్థ శిశువును బ్రహ్మాస్త్రం బారి నుండి సంరక్షణ చేసి కురువంశాన్ని నిలబెడతాడు. అనంతరం కుంతీదేవి శ్రీకృష్ణుని ఈ క్రింది విధంగా ప్రార్థిస్తుంది.

*క. "పురుషుండాద్యు (డు ప్రకృతికి*
*బరు (డవ్యయు (డఖిల భూత బహిరంతర్భా*
*సురు (డును లోక నియంతయు (*
*బరమేశ్వరు (డైన నీకు (బ్రణతులగు హరీ"* [164]

ఈ కంద పద్యంలో "సర్వం విష్ణుమయం జగత్" అన్న సత్యం కుంతి పలుకుల్లో స్పష్టంగా వ్యక్తమయింది.

అనంతర వచనంలో, మఱియు జవనిక మఱపున ... ... శ్రీకృష్ణ! వాసుదేవ! దేవకీ నందన! నంద గోప కుమార గోవింద! పంకజనాభ! పద్మమాలికాలంకృత! పద్మలోచన! పద్మ సంకాశ చరణ! హృషీకేశ! భక్తి యోగంబునం జేసి నమస్కరించెద నవధరింపు మనినది" ఇందు దశావతారుడైన పరమాత్మని దశనామాలతో సంబోధించి దర్శనీయతను ప్రదర్శించిన కుంతి ఆధ్యాత్మిక ద్రష్ట అనంతర సీస పద్యంలో

*సీ. "తనయులతో డనే దహ్యమానంబగు జతుగృహం బందును (జావకుండ (*
*గురురాజు వెట్టించు ఘోర విషంబుల మారుత పుత్త్రుండు మడియకుండ*
*ధార్తరాష్ట్రుడు సముద్ధతి (జీరలొలువంగ ద్రౌపది మానంబు దల (గకుండ*
*గాంగేయ కుంభజ కర్ణాది ఘనులచే నాబిడ్డలని లోన నల (గకుండ"*

*తే. విరటు పుత్రిక కడుపులో వెలయుచూలు (*
*ద్రోణనందను శరవహ్ని ద్రుంగకుండ*
*మఱియు రక్షించితివి పెక్కుమార్గములను,*
*నిన్ను నేమని వర్ణింతు నీరజాక్ష?"* [165]

తన పుత్ర రక్షణ ఘట్టాలన్నింటిని వర్ణించి "నిన్ను నేమని వర్ణింతు" నని నీతల్లిని కంసబారి నుండి రక్షించినట్లే, నన్ను రక్షించితివని స్తుతి చేసి జగత్పతి కృష్ణ పరమాత్మయని వెల్లడించింది.

అంతేకాక భగవంతుని గుణాను సంధానం చేసింది. 1.భక్తధనుడు 2.నివృత్త ధర్మార్థ కామ విషయుడు 3.ఆత్మా రాముడు 4.రాగాది రహితుడు 5.కైవల్య దాన సమర్థుడు 6.కాలరూపకుడు 7.నియామకుడు 8.ఆద్యంత శూన్యుడు 9.విభుడు 10.సర్వసముడు 11.సకల భూత నిగ్రహానుగ్రహ కరుడు 12.జన్మ కర్మ శూన్యుడని కూడా చెప్పింది. (నిరాకర నిర్గుణ పరమాత్మ)

జన్మకర్మ శూన్యుడైన నీవు తిర్యగాది జీవుల్లో వరాహాది రూపంబులను, మనుష్యుల్లో రామాది రూపాలను ఋషుల్లో వామనాది రూపాలను, జలచరాల్లో మత్స్యాది రూపాల విడంబనార్థం కాని జన్మకర్మ సహితుడైనందు వల్ల కాదని శ్రీకృష్ణ పరమాత్మ గూర్చి నిర్ధారించింది.

ఈ జగత్తు మిధ్య. పరమాత్మ సత్యం. అన్న సత్యాన్ని కుంతీదేవి క్షుణ్ణంగా తెలిసికొన్న పారమార్థిక శక్తి సంపన్నతాను శ్రీకృష్ణునికి మేనత్త. ఆ వాత్సల్యం ఈ క్రింది పద్యంలో ప్రకటించింది

*ఉ. "కోపము తోడ నీవు దధి కుంభము భిన్నము సేయుచున్నచో*
*గోపిక ద్రాట ( గట్టిన వికుంచిత సాంజన బాష్పతోయధా*
*రా పరిపూర్ణ వక్త్రము గరంబుల ( బ్రాముచు వెచ్చనూర్చుచుం*
*బాప ( డవై నటించుట కృపాపర! నామది ( జోద్య మయ్యెడిన్"* [166]

శ్రీ కృష్ణుని బాల్య చేష్టలు కుంతికి వింతగా తోచింది.

*క. " మలయమున జందనము క్రియ*
*వెలయ ( గ ధర్మజుని కీర్తి వెలయించుటకై*
*యిలపై నభవుడు హరియదు*
*కులమున నుదయించె నండ్రు గొందఱనంతా"* [167]

ఈ కంద పద్యంలో అనంతుడైన శ్రీకృష్ణుడు భువిపై ధర్మజుని కీర్తి నిలబెట్టటానికే హరి యదు కులంలో జన్మిస్తాడని కొందరంటున్నారని కుంతి స్వామిని స్తుతించింది.

ఈ విధంగా కుంతి చేసిన స్తోత్రాల్లో శ్రీకృష్ణావతార తత్వాన్ని (భక్తికి ముక్తి నివ్వటం, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ) ప్రకటించింది. ఇంకా శ్రీకృష్ణ పరమాత్మ సందర్శనం లేకపోతే యాదవ సహితులైన పాండవులు జీవన్మృతులవుతారని చెప్పింది. శ్రీకృష్ణ పాద స్పర్శచే ప్రకృతి పులకరించి తరించిందని స్తుతించింది. అంతే కాక

*ఉ. "యాదవులందు బాండు సుతులందు నధీశ్వర! నాకు మోహవి*

*చ్ఛేదము సేయుమయ్య ఘన సింధువు ( జేరెడి గంగ భంగి నీ*

*పాద సరోజ చింతనము పైన ననిశంబు మదీయ బుద్ధి న*

*త్యాదర వృత్తితో ( గదియునట్లుగ జేయ ( గదయ్య యీశ్వరా"* [168]

శ్రీ కృష్ణుని పాద పద్మారాధన పట్ల ఆసక్తి కలిగే విధంగా చేయమని ప్రార్థించింది. తన భవ బంధాలను త్రుంచివేయమని

*శా. "శ్రీ కృష్ణా! యదు భూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!*

*లోకద్రోహి నరేంద్ర వంశ దహనా! లోకేశ్వరా! దేవతా*

*నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!*

*నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యాను కంపానిధీ!"* [169]

మ్రొక్కింది, భవలతలు త్రుంచ గలిగిన లోకేశ్వరుడు శ్రీకృష్ణ పరమాత్ముడే అని తెలిసికొని కుంతి భవ సాగరాన్ని దాటి కృష్ణ సాయుజ్యం పొందింది.

కురు పితామహుడైన భీష్మాచార్యుడు (అంపశయ్యపై పరుండి ఉన్నప్పుడు పాండవులు శ్రీకృష్ణ సహితలై వచ్చినపుడు)

*ఉ. "సంతసమింతలేదు మృగశాపవశంబున ( బాండు భూవిభుం*

*డంతము నొంది యుండ మిము నర్భకులం గొనివచ్చి కాంక్షతో*

*నింతలవారి'గా ( బెనిచె నెన్నడు సౌఖ్యము పట్టుగానదీ*

*గొంతి యనేక దు: ఖముల ( గుందుచు నుండును, భాగ్యమెట్టిదో!"* [170]

కుంతి పడిన కష్టాలను గూర్చి వాపోయాడు భీష్మాచార్యుడంతటి వ్యక్తే కుంతి కష్టాలను గూర్చి ప్రత్యేకించి చెప్పాడంటే, కుంతి దు:ఖాలను భరిస్తూ కూడ ధైర్యంగా కృష్ణ చింతనతో కాలం గడిపి ధర్మం తప్పని నడవడి కలదైనందు వల్లనే రాజ్యశ్రీ పాండవులను వరించింది.

కుంతి జీవితమంతా పరిశీలిస్తే కారణజన్మురాలుగా కన్పిస్తుంది. కోపిష్ఠి అయిన దుర్వాస మహామునికి సేవ చేయటమంటే మిక్కిలి సాహస కార్యం. ఆ సాహస కార్యం బాల్యమందే నిర్వర్తించి ఆ మహాముని నుండి మంత్రోపదేశం పొందటం విచిత్రం, విశేషం, ఆ మహాముని ఇచ్చిన మంత్రం కూడా సామాన్యస్త్రీకి (అటువంటి మంత్రోపదేశం) అవసరం ఉండదు. కుంతిలో విశిష్ఠతను గుర్తించి

భావిని ఊహించి ఆ మహాముని మంత్రోపదేశం చేసి ఉంటాడు. ఉపదేశ మంత్రం ఉపాసనార్హత కలిగి ఉంటుంది కదా! అందువల్లనే కుంతి యాదృచ్ఛికంగా మంత్రోపాసన చేసి కర్మ సాక్షి సూర్య భగవానుని వల్ల పుత్రుని పొందటం.

వివాహానంతరం పాండురాజు సంతతికి అనర్హుడగుట, ఆ ఆపద గట్టెక్కటానికి పాండురాజే "నియోగ పద్ధతి" ద్వారా తనకు పుత్రులనివ్వమని కుంతిని అర్థించాడు. భర్త కోరిక మేరకు ఆపద్ధర్మంగా మంత్రాన్ని ఉపయోగించింది. తత్ప్రభావ ఫలితమే ధర్మజ భీమార్జునులు (మాద్రి వల్ల నకుల సహదేవులు) ధర్మాను వర్తియైన ధర్మరాజు , అతిలోక పరాక్రమ వంతులైన భీమార్జునులు ఈ పుడమిపై సంచరించారంటే అది పృధాదేవి (కుంతీదేవి) పృధ్వీ తత్త్వమే. అందువల్ల కుంతికి కుంతియే సాటి, ఏ స్త్రీతో కుంతీదేవిని పోల్చలేము.

## 4. గాంధారి

భాగవత కథలో గాంధారి తన వందమంది పుత్రులను కోల్పోయి అంధుడైన పతితో పాండవుల పంచన కాలం గడుపుతూ ఉంటుంది. మహాజ్ఞాని విదురుని ఉపదేశంతో ధృతరాష్ట్రుడు విరక్తుడై ప్రజ్ఞాచక్షువులతో సంసారం విడిచి, మొహంవీడి, విజ్ఞాన మార్గంతో హిమవ త్పర్వతానికి వెళతాడు.

భర్తతో పాటు గాంధారి అరణ్యానికి వెళ్ళి భర్త యోగాగ్నిలో దేహం విడవగా, తానూ సహగమనం చేస్తుంది.

*శా. "అంధుండైన పతిన్ వరించి, పతి భావాసక్తి నేత్రద్వయీ*
*బంధాచ్ఛాదనమున్ ధరించి, నియమ ప్రఖ్యాతయై యున్నత*
*ద్గాంధార క్షితినాధు కూతురును యోగ ప్రీతి చిత్తంబులో*
*సంధిల్లం బతివెంట నే( గె నుదయ త్సాధ్వీ గుణారూఢయై"*[171]

అని పోతన గాంధారి జీవితాన్నంతటిని శార్దూల వృత్త పద్యంలో స్పష్టంగా తెలియచేసాడు.

మహాభారత కథను పరిశీలించినా గాంధారి ఎక్కడ ధర్మ విరుద్ధంగా ప్రవర్తించినట్లు కన్పించదు. ఒక్క సంతాన విషయంలోనే స్త్రీ సహజమైన స్పర్ధకి లోనైనట్లుగా గోచరిస్తుంది. అంతకు

మించి ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో స్త్రీజాతి ఔన్నత్యానికి (సాటి స్త్రీ పరాభవం, అందున కురు వంశపు కోడలని పరితపించి) ప్రతీకగా కన్పిస్తుంది,

ఒక క్షత్రియ కాంతగా గాంధారి ఆనాటి క్షత్రియ స్త్రీధర్మాలను ఆచరించిన మహాసాధ్వి, ఉత్తమురాలు.

జాత్యంధుడైనప్పటికి, వ్యాసుడంతటి మహాజ్ఞానికి పుత్రుడిగా జన్మించినా, ధృతరాష్ట్రుడు దుర్యోధనుని పట్ల అమిత వాత్సల్యంతో తన సోదరుని కుమారులకు న్యాయం చెయ్యలేక పోయాడు. కాని గాంధారి ఎక్కడా తన పుత్రుల పట్ల గ్రుడ్డి ప్రేమ ప్రదర్శించలేదు. న్యాయ మార్గం విడనాడలేదు. తన తనయులు జరిపే అరాచక కృత్యాన్ని అడ్డుకోక మౌనం వహించిన భర్తకు ధర్మాన్ని బోధించింది. ధృతరాష్ట్రుని కంటె, కౌరవులు నూర్వురకంటె గాంధారి బహు ఉత్తమురాలు , నీతి మంతురాలు, ధర్మపరురాలు.

### 2.1.3.3 కురువంశ స్త్రీలు (నవమ స్కంధం)

#### 5. సత్యవతి

సూత మహర్షి శౌనకాది మునీంద్రులతో మూడో యుగమైన ద్వాపరం పూర్తి అవుతుండగా "ఉపరిచరవసువు వీర్యం వల్ల ఉద్భవించి 'వాసవి' అనబడే సత్యవతికి పరాశరుని వల్ల నారాయణాంశతో సర్వజ్ఞాన సంపూర్ణుడైన వేద వ్యాసుడు జన్మించాడని" [172] చెప్పటం వల్ల సత్యవతి జనన వృత్తాంతంతో పాటు ఆమె వాసవి అనే పేరుతో పిలువబడి నట్లు వెల్లడవుతుంది.

ఈమె దాశరాజు పెంచిన పుత్రిక. శంతన మహారాజు భార్య. ఈమెకు శంతన మహారాజు వల్ల చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడనే పుత్రులు కలిగారు. చిత్రాంగదుడు గంధర్వుల చేతిలో యుద్ధంలో హతుడయ్యాడు.

సత్యవతి శంతనుని భార్య కాక పూర్వం మత్స్యగంధిగా ఉన్నప్పుడు పరాశర ముని ఈమెతో కలిసి శ్రీహరి అంశ సంభూతుడైన వ్యాసునికి జన్మనిచ్చాడు.

ఈమె కారణ జన్మురాలు. తండ్రిచాటు తనయగా కురువంశం నిలబెట్టటానికి తాను కన్యగా పొందిన పుత్రుడు వ్యాసుని స్మరించి ధర్మాచరణకు తోడ్పడింది. చంద్రవంశం అంతరించకుండా కాపాడటానికి కారకురాలైన మహిళ. ఈమె కారణంగానే చంద్రవంశంలో కూడ సూర్య వంశం వలె బ్రాహ్మణ బీజం ఏర్పడింది.

#### 6. అంబిక

ఈమె కాశీరాజు ద్వితీయ పుత్రిక. విచిత్రవీర్యుని ప్రథమ పత్ని. భర్త మరణించగా ఈమె అత్తగారి ఆజ్ఞపై వంశం నిలబెట్టటానికి బాదరాయణుని వల్ల (వ్యాసుడు) ధృతరాష్ట్రునికి జన్మనిచ్చింది. ధృతరాష్ట్రుడు పుట్టంధుడు ఈమెకు వ్యాసునితో కలయిక ఇష్టంలేక కళ్ళు మూసుకున్నందుకే ధృతరాష్ట్రుడు గ్రుడ్డివానిగా జన్మించటానికి కారణంగా మహాభారత కథ చెపుతుంది.

## 7. అంబాలిక

ఈమె కాశీరాజు తృతీయ తనయ. ఈమె విచిత్రవీర్యుని ద్వితీయ పత్ని. ఈమె కూడ భర్త మరణించగా అత్తగారి ఆజ్ఞపై కురువంశం నిలబెట్టడానికి వ్యాసుని వల్ల పాండురాజుకి జన్మనిచ్చింది. ఈమె వ్యాసుని చూచి భయపడి ముఖం వివర్ణమైనందువల్లనే పాండు వర్ణంతో పాండురాజు జన్మించాడు.

అంబిక, అంబాలిక లిరువురు కాశిలాంటి పవిత్ర క్షేత్రాన్ని పరిపాలించిన రాజుకు కుమార్తెలై సుక్షత్రియ వంశంలో జన్మించారు. రాక్షస పద్ధతిలో స్వయం వరంలో రాజులందరిని జయించి భీష్ముడు (బలవంతంగా) వీరిని తీసుకువచ్చి తన తమ్ముడైన విచిత్ర వీర్యునికిచ్చి వివాహం చేస్తాడు. వీరు కురువంశ రాజుకి పట్టపురాణులై ఉండికూడ విధిలేని పరిస్థితుల్లో ఆనాటి యుగ ధర్మాచారాలను పాటించి జీవనం సాగించారు. పుట్టుకలో, మనుగడలో కూడా కలిసి జీవించిన సోదరీమణులు వీరు.

## 8. దుస్సల

ఈమె గాంధారి దృతరాష్ట్రుల తనయ, సింధు దేశపు రాజైన జయద్రధుని పత్ని. ఇతనికే సైంధవుడని నామాంతరం (సింధు దేశపు రాజు). ఇతడు పద్మ వ్యూహంలో అభిమన్యుని మరణానికి పరోక్షంగా కారణమయి (భీముని పద్మవ్యూహంలోకి వెళ్ళకుండా అడ్డుకొని) నట్లుగా మహాభారతం తెలియ చేస్తుంది.

## 9. మాద్రి

ఈమె పాండురాజు ద్వితీయ పత్ని. ఈమె భర్త ప్రేమ చూరగొన్న భార్య. ఈమె కుంతీ దేవిచే మంత్రోపదేశం పొంది అశ్వినీ దేవతల వల్ల పాండురాజు అంగీకారంతో నకుల సహదేవులకు జన్మనిచ్చింది. పాండురాజు మరణానికి కారణమైన ఈమె పాండురాజుతో సతీసహగమనం చేసినట్లుగా మహాభారతం చెపుతుంది. ఈమె తన బిడ్డల భారాన్ని, భాధ్యతను కుంతీదేవికి అప్పచెప్పింది.

## 2.1.3.4. యాదవజాతి స్త్రీలు

### 1. దేవకీదేవి

యదు, భోజ, అంధక రాజ్యాలకు ప్రభువైన ఉగ్రసేన మహారాజు తమ్ముడు దేవకుడు. ఈ దేవకుని కుమార్తె దేవకీదేవి. యదువంశంలో శూరసేనమనే రాజ్యాన్ని పరిపాలిస్తున్న శూరసేనుని పుత్రుడు వసుదేవుడు. వసుదేవుడు దేవకిని వివాహమాడి తన గృహానికి పయనమవుతాడు.

దేవకి బాల్యంలో ఆల్లారు ముద్దుగా పెరిగింది. స్వయంగా కంసుడు తన చెల్లెలు దేవకీ దేవిని దాసదాసీ జనంతో సహా అత్తవారింట దింపటానికి రథసారథి అయ్యాడు. దేవకీదేవి పుట్టింట అందరి ప్రేమను చూరగొన్నట్లుగా అర్థమవుతుంది.

కంసుడు దేవకీ వసుదేవులతో కొంతదూరం వెళ్ళాడు. అంతలో అ శరీరవాణి దేవకీ అష్టమ గర్భ సంజాతుడు కంసుని సంహరిస్తాడని హెచ్చరించింది. అప్పటినుండి మొదలైంది అసలు కథ. దేవకీదేవికి కష్టాలు.

వసుదేవుని ధర్మజ్ఞానానికి తలవంచి, నమ్మకముంచి కంసుడు దేవకిని చంపకుండా దేవకీ వసుదేవులను చెరసాలలో బంధిస్తాడు. దేవకీదేవి ఉత్తమురాలని ఆకాశవాణి పలుకుతుంది.

*క. "తుష్టయగు భగిని మెచ్చ ( గ*
*నిష్టు'డవై రథము గడిపి, దెఱు ( గవు మీ'దన్*
*శిష్టయగు నీ తలోదరి*
*యష్టమ గర్భంబు నిన్నుహరియించు ( జుమీ!"* [173]

వసుదేవుని పలుకుల్లో

*మ. "చెలియల్, గన్నియ, ముద్దరాలబల, నీ సేమంబు చింతించుని*
*ర్మల, దీనిన్ బయలాడు మాటలకు నై మర్యాద।బో।దట్టి, స*
*త్కుల జాతుండవు పుణ్యమూర్తి వకటా! గోపంబు పాపంబునె*
*చ్చెలి నోహెూ! తెగవ్రేయ । బాడి యగునే? చింతింపు భోజేశ్వరా!"* [174]

దేవకీదేవి అమాయకురాలు, అబల పుట్టింటి క్షేమంకోరే ఉత్తమురాలని తెలుస్తుంది.

కంసుడు నారదుని మాటలు విని, యాదవులు దేవతలని ఆరాటంతో దేవకీ వసుదేవులను పట్టి బంధించి, వారి పుత్రులను విష్ణు స్వరూపులుగా భావించి వెంటనే సంహరించాడు. అయినా దేవకీదేవి మౌనంగా ఉండి పోయింది. ఆదిశేషుడనే పేరున్న మహనీయ, మనోహరమైన విష్ణుదేవుని తేజస్సు దేవకీదేవి గర్భాన ఏడవదిగా ప్రవేశించింది.

విశ్వరూపుడైన వారి కంసునివల్ల యాదవులకు హాని కలుగుతుందనే భయంతో యోగమాయాదేవి ద్వారా నందగోకులంలో ఉన్న వసుదేవుని భార్య రోహిణి గర్భంలో ప్రవేశ పెట్టమని ఆదేశిస్తారు.

దేవకీదేవికి గర్భస్రావమయిందని అందరు అనుకుంటారు. దేవకీదేవి అష్ఠమ గర్భంలో శ్రీకృష్ణుడు ప్రవేశిస్తాడు.

శ్రీకృష్ణుడు దేవకీదేవి గర్భస్థశిశువుగా ఉన్నప్పుడు ప్రకృతి అనుకూలమై ఆమెను సేవించింది. బ్రహ్మాది దేవతలు దేవకీ గర్భస్థుడైన స్వామిని సేవించి ఎల్ల వేళలా దేవకీదేవి కడుపు చల్లగా వర్ధిల్లాలని దీవించి వెళ్ళారు.

సకల శుభ శకునాలు ప్రకృతిలో గోచరించగా తారలు గ్రహాలు అత్యంత శుభస్థానాల్లో ఉండగా దేవకీదేవి అర్థరాత్రి వేళ శ్రీకృష్ణుని ప్రసవించింది. పరమాత్మ ప్రసవించిన దేవకీదేవి దేహం మెరుపు తీగలాగ దేదీప్యమానంగా ప్రకాశించింది.

పరమాత్మ గర్భస్థ శిశువుగా భరించిన దేవకీదేవికి పరమాత్మ తత్త్వం సంపూర్ణంగా అర్థమైంది. పరమాత్మ తనకు పుట్టటం మాయ అని పరమాత్మకే చెప్పి తను నోచిన నోములన్నీ ఏ లోటు లేకుండా శ్రీకృష్ణ రూపంలో పండినట్లుగా భావించింది.

## దేవకీదేవి పూర్వ జన్మ వృత్తాంతం

దేవకీ వసుదేవులకు తాను జన్మించటానికి పరమాత్మ కారణాన్ని తెలియచేస్తూ దేవకీదేవి పూర్వ జన్మలను గుర్తు చేస్తాడు.

1. దేవకీ వసుదేవులకు తాను జన్మించటానికి పరమాత్మ కారణాన్ని తెలియచేస్తూ, దేవకీదేవి పూర్వ జన్మలను తెలియచేస్తాడు.

స్వాయంభువ మన్వంతరంలో పృశ్ని, వసుదేవుడు సుతపుడు. పరమాత్మ అవతారం పృశ్ని గర్భుడు. రెండవ జన్మలో అదితి, వసుదేవుడు కశ్యపుడు పరమాత్మ అవతారం వామనమూర్తి.

మూడవ జన్మ దేవకీదేవి, వసుదేవుడు

పరమాత్మ శ్రీకృష్ణుడు.

## దేవకీదేవి ప్రత్యేకత

దేవకీదేవి స్వాయంభువ మన్వంతరంలో సుతపుడనే ప్రజాపతి పత్ని పృశ్ని. బ్రహ్మ సంకల్పంతో జితేంద్రియురాలై భర్తతో కలిసి 12వేల దివ్య సంవత్సరాలు తపస్సు చేయటం ప్రత్యేకత. ఏ యుగాల్లోను ఇటువంటి స్త్రీ కన్పించదు. కంసుడు అ శరీరవాణి వాక్కు విని ప్రాణ భయం వల్ల దేవకిని సంహరించబోయాడు. వసుదేవుడు ధార్మిక మాటలకు లొంగి విడిచి పెట్టి, మరల నారదుని మాటలకు ఆరుగురు పుత్రులను సంహరించి చెరసాలలో సతీ సమేతంగా బంధించాడు. ఇంత జరిగినా వసుదేవుడు దేవకిని విడిచి పెట్టలేదు. వసుదేవుడు ఏక పత్నీవ్రతుడేమీకాదు. వసుదేవుని భార్యలను కూడా ఇంకొందరిని కంసుడు బంధించినట్లు

*సీ. "గోపికా జనములు గోపాలకులు నున్న పసులమందకు ( బొమ్ము భద్ర! నీవు*
*వసుదేవు భార్యలు వరుస ( గంసుని చేత నా ( కల ( బడియుండ నందు జొరవే*
*తల ( గి రోహిణియను తరళాక్షి నంద గోకులమందు నున్నది గుణాఢ్య*
*దేవకి కడుపున దీపించు శేషాఖ్యమైన నాతేజ మీవమర ( బుచ్చి"*

*ఆ. "నేర్పు మెఱసి రోహిణీదేవి కడుపున (*
*జొనుపు దేవకిని సుతు ( డనగుదు*
*నంశ భాగయుతు ( డనై, యశోదకు నందు*
*పాల ( తి కంత మీ ( ద ( బుట్టెదీవు"* [175]

ఈ పద్యం వల్ల తెలుస్తుంది (వసుదేవుని పత్నులు ఏడుగురని నవమస్కంధంలో చెప్పబడింది)

*"పౌరవీరోహిణీ భద్రామదిరా రోచనా ఇళా*
*దేవకీ ప్రముఖా ఆసన్ పత్న్య అనకదుందుభేః"* [176]

తెలుగు భాగవతంలో వసుదేవుని వంశక్రమాను వర్ణనలో నవమ స్కంధంలో అతని భార్యలు, వారి వల్ల పుట్టిన సంతతి చెప్పబడింది.

తన భార్యలు మిగిలిన వారు కూడ బంధీలై ఉన్నా ఇష్టపడ్డాడు కాని దేవకీదేవిని మాత్రం వదిలి పెట్టలేదు. దేవకీదేవి వసుదేవుల దాంపత్య బంధాన్ని గమనిస్తే రాజులకు బహుభార్యాత్వ మున్న ఎవరో ఒకరిపైనే హృదయ సంబంధం కలిగి ఉంటారని అర్ధమవుతుంది. వసుదేవుని హృదయంలో స్థానాన్ని సంపాదించిన భార్య దేవకీదేవి.

### వైష్ణవ మాయ తెలిసిన విదుషీమణి

శ్రీకృష్ణుడు మరణించిన గురు పుత్రులను తెచ్చి గురుదక్షిణగా సమర్పించాడు. తాను జన్మ నిచ్చినప్పటికి శ్రీకృష్ణుడు పరమాత్మ అని గుర్తించి, దేవకి కంసునిచే సంహరింపబడిన తన ఆరుగురు పుత్రులను చూడాలనే తపనతో బలరామ కృష్ణులను ప్రస్తుతించి అర్ధించింది. తల్లి కోరిక తీర్చాలని తనయులైన బలరామ కృష్ణులు సుతలానికి వెళ్ళి బలిచక్రవర్తిచే పూజింపబడి దేవకీ పుత్రులను తీసుకు వస్తారు. వైష్ణవ మాయా ప్రభావంచే దేవకీదేవి తన బిడ్డలకు స్తన్యమిచ్చి సంతృప్తిచెంది సత్య స్వరూపాన్ని గుర్తిస్తుంది.

### ఉపసంహారం

దేవకీదేవి క్రూరుడైన కంసుని పినతండ్రి కుమార్తెగా, వసుదేవుని పత్నిగా, శ్రీకృష్ణుని తల్లిగా తాను వరించటమే కాక వైష్ణవ మాయ ఏ విధంగా ఉంటుందో, భక్త లోకానికి చాటిన పరమ భాగవతోత్తమురాలు.

## 2. రోహిణీ

ఈమె వసుదేవుని పత్ని. దేవకీదేవి అష్టమ గర్భ సంజాతుడు తనని సంహరిస్తాడని తెలిసి కంసుడు వసుదేవుని భార్యలను కూడ బంధిస్తాడు. ఈ రోహిణి ఎట్లో తలదాచుకుని నంద గోకులంలో ఉంటుంది. విశ్వరూపుడైన విష్ణువు దేవకీ సప్తమ గర్భాన ప్రవేశించిన శేషాంశను యోగమాయ ద్వారా రోహిణీ గర్భంలో ప్రవేశింపచేస్తాడు.

*ఆ. "బలము మిగుల ( గలుగ బలభద్రు ( డన లోక*

*రమను ( డగుట ( జేసి రాము ( డన ( గ*

*సతికి ( బుట్టె గర్భ సంకర్షణమున సం*

*కర్షణుండనంగ ఘను ( డు సుతు ( డు"*[177]

ఆ కారణంగా రోహిణికి బలరాముడు జన్మిస్తాడు. ఆది శేషునకు జన్మనిచ్చిన పవిత్రమూర్తి ఈమె. ఈమె గూర్చి విశ్వరూపుడైన విష్ణువే యోగమాయకు చక్కని గుణగణాలు కలదని చెపుతాడు.

శ్రీకృష్ణ జన్మ దినోత్సవ వేడుకలో నందుడు రోహిణీ దేవిని పిలిపించి రంగు రంగుల చీరలు, ఆభరణాలను బహూకరించి గౌరవిస్తాడు. ఆమె కూడ చాల సంతోషించింది.

శ్రీకృష్ణుడు పాలిస్తున్న పూతనను యశోదతో పాటు ఈమె కూడ ఇవ్వద్దని నివారించింది. వీరిరువురు ఒకరికొకరు తోడుగా ఉండే వారన్న విషయం వ్యక్తమవుతుంది.

ఈమెకు బలరామునితో పాటు గదుడు, సారణుడు, దుర్మదుడు, విపులుడు, ధ్రువుడు, కృతుడు మొదలైన పుత్రులున్నట్లు నవమస్కంధం రాజవంశావళిలో చెప్పబడింది.

## 3. మిత్రవింద

ఈమె శ్రీకృష్ణుని మేనత్త (రాజాధిదేవి) తనయ. ఈమె సోదరులు విందాను విందులు. వీరు దుర్యోధనుని ప్రేరణచే చెల్లెలి వివాహానికి స్వయంవరం ప్రకటిస్తారు.

*క. "భూరమణులు సూడ ( గ హరి*

*వీరత ( జే కొనియె మిత్రవిందను నిత్యా*

*పూరిత సుజనానందన్,*

*జారు చికురకాంతి విజిత షట్పదబృందన్"*[178]

స్వయంవర సభలో రాజులందరు చూస్తుండగా శ్రీకృష్ణుని ఎదురులేని తన పరాక్రమం ప్రదర్శించి మిత్రవిందను పరిగ్రహించాడు.

"చారు చికురకాంతి, విజిత షట్పద బృందన్" మిత్రవింద సౌందర్యం, సుజనులకు ఆనందం కలిగించే స్వభావం కలిగి 'మిత్రవింద' తన నామాన్ని సార్థకం చేసుకొంది.

దేవాదిదేవుడైన శ్రీకృష్ణ పరమాత్మకు మేనత్త కుమార్తెగా జన్మించటం వల్ల, అదీ కాక ఆమె సోదరులు స్వయంవరం ప్రకటించటం వల్ల రాజలోకానికి క్షాత్ర పరీక్షగా మారింది. క్షాత్ర పరీక్షలో యదువంశ శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు తన పరాక్రమంతో గెలుచుకున్న కారణంగా అలి నీలవేణి అందాల రాణి మిత్రవింద యాదవ వీరుడైన శ్రీకృష్ణుని అష్టమహిషుల్లో 5వ పట్టమహిషి అయి పదిమంది పుత్రులను పొంది యాదవ వంశ విస్తరణకి దోహదమయింది.

## 4. భద్ర

ఈ భద్రను సహజ పండితుడైన పోతన ఒక మత్తేభ వృత్తంలో వర్ణించాడు.

*మ. "జనవంద్యన్ శ్రుతకీర్తినంద్య (దరుణిన్ సందర్శన క్షోణి పా*
*ద్యనుజన్ మేన మఱందలిన్ విమల లోలాపాంగ 'గైకేయిని*
*ద్ధన యోన్నిద్ర ( బపూర్ణ సద్గుణ సముద్రన్ భద్రన క్షుద్రనా*
*వనజాతాక్షుడు పెండ్లియాడె నహిత వ్రాతంబు భీతిల్లగన్"*[179]

భద్ర శ్రీకృష్ణుని మేనత్త (శ్రుతకీర్తి) తనయ. కేకయ దేశపు రాజ కుమార్తె. ఈమె తల్లి దండ్రులను సంతోషింప చేసే తనయ. సద్గుణ నిధి ఈమె. నీతిమంతురాలు. సద్గుణాలకు సముద్రం వంటిది. సకలజనులచే ప్రశంసింపబడేది. ఈ భద్రను శ్రీకృష్ణుడు శత్రువులందరు తల్లడిల్లగా వివాహం చేసుకున్నాడు.

నామౌచిత్యం కల భద్ర, గుణ భద్రయై సమస్త లోక వంద్యుడైన శ్రీకృష్ణుని పతిగా పొంది, తన జన్మను సార్థకం చేసికొన్న ధన్యాత్మురాలు. శ్రీకృష్ణునితో భవబంధాన్ని జీవిత బంధంగా ఏర్పరుచుకొని శ్రుతకీర్తి తనయగా, శ్రీకృష్ణుని అష్టమహిషుల్లో ఏడవ భార్యగా స్థానం పొంది భద్ర చిరకీర్తి నార్జించింది. శ్రీకృష్ణుని వల్ల పదిమంది పుత్రులను పొంది భోగ భాగ్యాలతో యాదవ వంశాన్ని విస్తరింప చేసింది.

## 5. సుభద్ర

సుభద్ర దేవకీ వసుదేవుల కుమార్తె. శ్రీకృష్ణుని తర్వాత జన్మించింది. ఈ విషయం పరీక్షిత్తుకి శుకమహర్షిచే

*ఆ. "విష్ణు ( డు దితు ( డైన వెనుక నాదేవకి,*
*భద్ర మూర్తియగు సుభద్ర ( గనియె*
*నా గుణాఢ్య ముత్త వగు నీకు నర్జున*
*దయిత యగుట ( జేసి ధరణినాధ!"* [180]

వసుదేవుని వంశ క్రమాను వర్ణనలో చెప్పబడింది. ఇక ఈమె వృత్తాంతం దశమస్కంధం ఉత్తర భాగంలో 'సుభద్రా పరిణయం' అనే పేరున ఉంది.

నియమ నిర్ణయానుసారం (ద్రౌపది విషయంలో) అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ, ప్రభాస తీర్థానికి వెళతాడు. అర్జునుడు సుభద్రపై మక్కువ కలిగి ఉన్నాడు. బలరాముడు రాజ్యభ్రష్టుడైన పాండవుల కివ్వటం ఇష్టం లేక దుర్యోధనునికిచ్చి సుభద్రని వివాహం చెయ్యాలని సంకల్పిస్తాడు.

సుభద్రను చూడాలనే ఉబలాటంతో అర్జునుడు త్రిదండి సన్యాసివేషం ధరించి ద్వారకానగరం ప్రవేశిస్తాడు. అర్జునుడు కపట వేషంలో ఉన్నాడని తెలియక అర్జునుని సత్యమైన సన్యాసిగా భావించి, ఒకనాడు తగిన మర్యాదతో ప్రీతితో అతని మందిరానికి తోడ్కొని వస్తాడు.

### సుభద్రార్జునుల ప్రణయం

బలరాముని అతిధిగా త్రిదండి సన్యాసి వేషంలో ఉన్న అర్జునునుకు సుభద్ర మన్మధుని మోహ బాణమో అనే విధంగా విహార వినోదం చేత విహరిస్తుంటుంది. సుభద్ర సుందర సుకుమార వయోరూప విలాసాలు తన చిత్తానికి హత్తుకొని అర్జునుడు తన హృదయాన్ని ఆమెపై లగ్నం చేస్తాడు.

*ఉ. "ఆ తరుణీ శిరోమణియు నర్జును నర్జున చారు కీర్తివి*
*ఖ్యాతుని నింద్రనందను నకల్మష మానసు ( గా మినీ మనో*
*జాతుని ( జూచి పుష్పశరసాయిక జర్జరి తాంతరంగయై*
*భీతిలియుండె సిగ్గు మురిపెంబును మోహము'దేఱ చూపులన్"* [181]

కీర్తి మంతుడు, దేవేంద్రుని తనయుడు, నిర్మల మనస్సు కలవాడు, మన్మథాకారుడైన అర్జునుని చూచి సుభద్ర మన్మథ శర పరంపరకు లోనై కలవర పడింది.

### సుభద్రార్జునుల పరస్పరానురాగం

సుభద్రార్జునులు పరస్పర అనురాగమధికమయింది. దేవతా మహోత్సవానికి ఒకనాడు సుభద్ర నగరం వెలుపలికి వచ్చింది. అర్జునుడు శ్రీకృష్ణుని అంగీకారంతో దేవకీ వసుదేవల అనుమతితో తాను సుభద్రననుసరిస్తాడు.

### సుభద్ర సౌందర్యాతిశయం

*సీ. "సాంద్రశరచ్చంద్ర చంద్రికా స్ఫూర్తిచే రాజిల్లు పూర్ణిమా రజని వోలె'*
*బూర్ణేందు బింబావ తీర్ణమై యిలమీ ( ద, భాసిల్లు హరిణ డింభంబు ( బోలె*
*సులలిత మేఘ మండలమును నెడ ( బాసి వసుధ ( గ్రుమ్మరు తటి ద్వల్లివోలె*
*మాణిక్య రచిత సన్మహిత చైతన్యంబు వొందిన పుత్తడి బొమ్మవోలె"*

*తే. "లలిత విభ్రమ రుచికళాలక్షణముల (*
*బొస ( గరూపైన శృంగార రసము ( బోలె*
*నర్థి'జయించుచున్న పద్మాయతాక్షి (*
*బ్రకటసద్గుణ భద్ర సుభద్ర ( జూచి"* [182]

శరత్కాలపు నిండు పున్నమినాటి పండు వెన్నెలతో నిండిన రాత్రివలె, చంద్రమండలం నుండి జాఱి నేలకు దిగిన లేడి పిల్ల చందాన, మేఘమండలాన్ని వదలి భూమి మీద విహరించే మెఱుపుతీగ విధంగా నవరత్నాల చేత పొదిగి చేయబడిన నదీ ప్రవాహంతో నూతన చైతన్యం సంతరించుకొన్న బంగారు బొమ్మవలె ప్రకాశం చేత, తేజో విశేషం చేత సరిరూపు దాల్చిన శృంగార రసమో అన్నట్లుగా ప్రీతితో హావభావ విలాసాలతో సద్గుణ రాశియై విహరిస్తున్న పద్మనేత్ర సుభద్రను చూస్తాడు అర్జునుడు.

### సుభద్రార్జునుల పరిణయం

చూసిన వెంటనే అర్జునుడు సుభద్రని సమీపించి ఆమెను రథంపై ఎక్కించుకొని తీసుకు వెళతాడు. అది చూసి యదుసేనలు అహంకారంతో అర్జునుని వెంబడించి ఎదిరించారు. అర్జునుడు

గాండీవం నుండి వాడి బాణాలతో వారిని నిగ్రహించి తరిమికొట్టి జయం పొంది ఇంద్ర ప్రస్థానికి చేరుకున్నాడు.

సుభద్రార్జునుల వృత్తాంతం విన్న బలరాముడు మిక్కిలి కోపించాడు. శ్రీకృష్ణాది ఆత్మబంధువులు మృదు మధుర వచనాలతో అనునయించి బలరాముని సుభద్రార్జునుల పరిణయానికి అంగీకరింప చేశాడు.

### పుట్టింటి అరణం

సుభద్రకు బలరాముడు ఏనుగులను, రధాలను, మేలుజాతి గుఱ్ఱాలను, రత్నఖచితాలైన బంగారు ఆభరణాలను, అంతులేని ధనాన్ని, దాసదాసీ జనాలు మొదలైన వారితో అరణం పంపాడు.

సుభద్ర జ్యేష్ట సోదరుడైన బలరాముడు రాజ్యాధికారమున్న దుర్యోధనుని కిచ్చి సుభద్ర వివాహం చెయ్యాలనుకుంటాడు. కాని సుభద్ర దుష్టుడైన దుర్యోధనుని ఇష్టపడలేదు సరికదా. తన చిన్నన్న సహాయంతో పరాక్రమమున్న పాండవ మధ్యమునే పతిగా వరించింది. దేవకీ వసుదేవుల అశీస్సులను స్వీకరించి, పెద్దల అనుమతితో అర్జునుని వెంట వెళ్ళి, సంప్రదాయం పట్ల మన్నన చూపిన మహిళగా నారీ లోకానికి ఆదర్శంగా నిలిచింది.

లోకోత్తర వీరులైన బలరామకృష్ణుల సోదరియై జన్మించి, సౌభాగ్యమైన పుట్టింటిలో పెరిగింది. ధర్మ పరాక్రమాలున్న కురువంశం మెట్టి, కురువంశం నిలపటానికి కారణ భూతురాలైంది. సుభద్ర పౌత్రుడే పరీక్షిత్తు ముక్తికోసం శుక మహర్షి భాగవతాన్ని ఏడు రోజుల్లో బోధించటం వల్ల సప్తద్వీప సమేతమైన ఈ భూమండలంలో భక్తి ముక్తి ప్రదాయకమైన భాగవత కల్పవృక్షం నాటబడింది. పుట్టింటి గౌరవం. అత్తింటి సౌభాగ్యం సంపూర్ణంగా ఉన్న మహిళ సుభద్ర.

## 6. శ్రుత కీర్తి

ఈమె శ్రీకృష్ణుని మేనత్త. కేకయ దేశాధిపతి భార్య. ఈమె కుమార్తె భద్ర. భద్రను స్వయంవరంలో రాజులందరిని జయించి శ్రీకృష్ణుడు వివాహం చేసుకుంటాడు.

## 7. గాందిని

ఈమె కాశీరాజు కుమార్తె. కాశీరాజు తన రాజ్యంలో వర్షాలు కురవనప్పుడు వృష్ణి పుత్రుడైన శ్వఫల్కుని పిలుచుకుపోయి సన్మానించి తన కుమార్తె గాందినిని ఇచ్చి వివాహం చేసి సత్కరిస్తాడు. కాశీ రాజ్య భూమిలో వర్షాలు కురిశాయి. ఆ దేశం కరువు పోయింది. ఒక మహా తపస్వికి అర్ధాంగియై రాజ్య క్షేమానికి కారకురాలైన మహిళ.

ద్వారకా నగరంలో వృద్ధులు శ్రీకృష్ణునితో చెప్పిన కథ ఇది. అక్రూరుడు శ్వఫల్కుని కుమారుడు. అక్రూరుడు ద్వారక వదలి వెళతాడు. అక్రూరుని పిలిపించమని శ్రీకృష్ణుడు ద్వారకా నగర పెద్దలు విన్నవించే సందర్భంలో ఈ పాత్ర (అక్రూరుని తల్లి) విషయం వెలుగులోకి వచ్చింది.

*సీ. కమలాక్ష వినవయ్య ! కాశీశు ( దేలెడి కుంభిని వానలు గురియకున్న (*
*గొరి శ్వఫల్కుని ( గొనిపోయి యతనికి ( గాందిని యనియెడు కన్యనిచ్చి*
*కాశీవిభుండు సత్కారంబు సేసిన వానలు గురిసె నా వసుధమీ ( ద*
*నాతని పుత్త్రకు ( డైన యక్రూరుండు నంతటి వా ( డె, మహా తపస్వి*

*ఆ. మరలి వచ్చెనేని మానునుత్పాతంబు*
*లెల్ల, వాన గురియు నీ స్థలమున,*
*దేవ! యతని ( దోడి తెప్పింపు, మన్నింపు*
*మాన వలయు ( బీడ మానవులకు"*[183]

ఈమె అన్నపూర్ణా విశ్వేశ్వర నిలయమైన పవిత్రక్షేత్రంలో రాజకుమార్తె యై జన్మించిన పవిత్రురాలు. పుణ్యం కొలది పురుషుడన్న సామెతగా రాజ్యాన్ని సుభిక్షంగా ఉంచగల్గిన. ఒక మహా తపస్విని పతిగా పొందిన పడతి. అంతేకాక ఆ మహా తపస్విని ముమ్మూర్తుల పోలిన పుణ్యాత్ముడైన తనయుని పొందిన పవిత్ర తన్విగాందిని. అవతార కార్యానికి బయలుదేరి వస్తున్న బలరామ కృష్ణులకు రథ సారథియై దారి మధ్యలోనే శ్రీకృష్ణుని పరమాత్మగా దర్శనం చేసికొన్న పుణ్యాత్ముని అక్రూరుని కన్న పరమ పావని గాందిని.

## 8. సత్యభామ

ఈమె సత్రాజిత్తు కుమార్తె. సత్రాజిత్తు అనుమానంతో, అవివేకంతో శ్రీకృష్ణునిపై శ్యమంతక మణి అపహరించాడనే నింద మోపాడు. శ్రీహరి ఆ నిందను పోగొట్టుకోవటానికై శమంతకమణిని అన్వేషించి సత్రాజిత్తును రాజసభకు పిలిపించి ఆ మణిని అప్పగిస్తాడు.

సత్రాజిత్తు పశ్చాత్తాపంతో శ్రీకృష్ణుని మహిమను గుర్తించి, తాను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా తన కుమార్తెను మణితో పాటు సత్యభామను శ్రీకృష్ణునికి సమర్పిస్తాడు. శ్రీకృష్ణుడు సత్యభామను మాత్రమే స్వీకరించి శ్యమంతక మణిని తిరిగి సత్రాజిత్తుకు ఇస్తాడు.

*క. "మణి యిచ్చినాఁడు వాసర, మణి*
*నీకును మాకుఁ గలవు మణులు, కుమారీ*
*మణి చాలునంచుఁ గృష్ణుడు,*
*మణి సత్రాజిత్తునకు మరలగ నిచ్చెన్"*[184]

### సత్యభామ పితృభక్తి

శతధన్వుడు నిద్రిస్తున్న సత్రాజిత్తును కసాయివాడు పశువును చంపిన విధంగా గొంతు కోసి బలవంతంగా చంపి, సత్రాజిత్తుని భార్యలందరు రోదించగా లాభంతో మణిని తీసుకు వెళ్ళాడు.

తండ్రి మరణానికి దు:ఖించి సత్యభామ తండ్రి శరీరాన్ని నూనె తొట్టిలో పెట్టించి, వెంటనే హస్తినాపురానికి వెళ్ళి సర్వవిదుడైన శ్రీకృష్ణునితో తన తండ్రి మరణ వార్తను తెల్పింది. శ్రీకృష్ణుడు శతధన్వుని చక్రాయుధంతో సంహరిస్తాడు.

*వ. "అటఁ గృష్ణుండును ద్వారకా నగరంబునకుంజని శతధన్వుని*
*మరణంబును మణిలేకుండుటయును, సత్యభామకుం*
*జెప్పి, సత్యభామా ప్రియకరుండు గావున సత్రాజిత్తునకు*
*బరలోక క్రియలు సేయించె"*[185]

సత్రాజిత్తుకు కొడుకులు లేనందున శ్రీకృష్ణుడే పరలోక క్రియలు జరిపిస్తాడు. ఈ సంఘటన వల్ల శ్రీకృష్ణుడు సత్యభామా ప్రియకరుడని స్పష్టమవుతుంది.

**సత్యభామ పతిభక్తి**

దేవేంద్రుడు నరకుని అత్యాచారాలు శ్రీకృష్ణునికి విన్నవిస్తాడు. శ్రీకృష్ణుడు నరకాసుర సంహారానికై గరుడ వాహన మధిరోహించి ప్రయాణమవుతాడు. ఆ సమయంలో సత్యభామ శ్రీకృష్ణుని యుద్ధ ప్రావీణ్యం దర్శించాలనే తన కోరికను విన్నవించి, శ్రీకృష్ణుని వెంట యుద్ధ క్షేత్రానికి వస్తానంటుంది. శ్రీకృష్ణుడు నివారించగా సత్యభామ శ్రీకృష్ణునితో పలికిన పలుకులు దాంపత్య జీవితంలో సత్యభామ శ్రీకృష్ణులిరువురి పరస్పర ప్రేమాభిమానాలు వ్యక్తమవుతున్నాయి.

*ఉ. "దానవులైన నేమి? మఱి దైత్య సమూహములైన నేమి? నీ*
*మానిత బాహుదుర్గముల మాటున నుండగ ( నేమి శంక? నీ*
*తో నరుదెంతు నంచు ( గర తోయజముల్ ముకుళించి మ్రొక్కెన*
*మ్మానిని దన్ను భర్త బహుమాన పురస్సరదృష్టి ( జూడగన్".* [186]

సత్యభామ అభిమానవతి. శ్రీకృష్ణుని బాహువులే తన జీవితానికి రక్షగా భావించింది. శ్రీకృష్ణునికి సత్యభామ చేతులు జోడించి నమస్కరించి అడగటంలో పతిభక్తి వెల్లడౌతుంది.

**వీరాంగన**

శ్రీకృష్ణుడు సత్యభామ వినయపూర్వక విన్నపాన్ని అంగీకరించి, సత్యాసహితుడై శ్రీకృష్ణుడు నరకాసుర సంహారానికి గరుడ వాహనారూఢుడై ఆకాశ మార్గాన ప్రాగ్జోతిష్యపురం చేరుకుంటాడు ఐదు తలలున్న మురాసురుని శ్రీకృష్ణుడు చక్రాయుధంతో ఖండించి మురారి అయ్యాడు.

**యుద్ధ నైపుణ్యం**

నరకాసురుడు యుద్ధానికి సిద్ధంకావటం సత్యభామ యుద్ధానికి సిద్ధమై శ్రీకృష్ణుని ఎదుట నిబ్బరంగా నిలిచింది.

రణరంగంలో దుర్మార్గులైన రాక్షసుల ఔద్ధత్యాన్ని అణచివేయటానికి సౌజన్యవతియై సత్యభామ శ్రీకృష్ణుని ధనస్సును అందుకొని, యుద్ధోత్సాహంతో రాక్షస స్త్రీల కంఠాల్లో మంగళ సూత్రాలు తెగేటట్లు వింటినారిని బిగించి ధనుష్టంకారం చేసింది. యుద్ధరంగంలో సత్యభామ శృంగార, భయ, రౌద్ర, ఆశ్చర్య భావాలన్నీ కలిసి ఆమెగా రూపొందాయా అన్నట్లు బాణం వింటిని తొడగటం, లాగటం ప్రయోగించటం కూడా గుర్తించలేనంత వేగంగా సత్యభామ యుద్ధం చేసింది.

*సీ. "సౌవర్ణ కంకణ ఝుణఝుణ నినదంబు శింజినీరవము తో'జెలిమిసేయ (*
*దాటంక మణిగణ ధగధగ దీప్తులు గండమండల రుచి'గప్పి కొన ( గ*
*ధవళతరాపాంగ ధళధళరోచులు బాణజాల ప్రభాపటలినడ ( ప*
*శరపాతఘుమ ఘుమ శబ్దంబు పరిపంథి సైనిక కలకల స్వనములుడుప"*

*తే. "వీరశృంగార భయరౌద్ర విస్మయములు*
*గలసిభామిని యయ్యెనో కాక యన ( గ*
*నిఘవు ( దొడుగుట దివుచుట యేయుటెల్ల*
*నెఱు ( గ రాకుండనని సేసె నిందువదన"* [187]

శ్రీకృష్ణ సమక్షంలో నరకాసురునితో యుద్ధం చేస్తున్న సత్యభామ

*మీ "పరు ( జూచున్ వరు ( జూచు నొంప నలరింపన్, రోష రాగోదయా*
*విరత భ్రూకుటి మంద హాసములతో వీరంబు శృంగారమున్*
*బరగన్, గన్నుల ( గెంపు సొంపు ( బర ( గన్ జండాస్త్ర సందోహమున్*
*సరసాలోక సమూహమున్ నెఱవుచున్ జంద్రాస్య హేలాగతిన్"* [188]

వాడియైన అస్త్ర ప్రయోగంతో నరకాసురుని బాధిస్తూ ప్రియుడైన శ్రీకృష్ణుని అనురాగ మందహాసం తో మెప్పించింది.

యుద్ధ భూమిలో వీరనారియై శ్రీకృష్ణావతార కార్యానికి తోడుగా వచ్చి, శత్రు సంహారం చేసి, యుద్ధ రంగంలో శ్రీకృష్ణునికి అర్ధభాగమై ముల్లోకాలు మెచ్చే సద్గుణాలతో సత్యభామ సమర రంగంలో ప్రకాశించింది.

సత్యభామ యుద్ధ భూమిలో రాక్షసులనే దావాగ్నిని ఆర్పటానికి బాణసమూహమనే వర్షాకాలాన్ని సృష్టించింది.

*శా. "జ్యావల్లీ ధ్వని గర్జనంబుగ, సురల్ సారంగ యూథంబుగా,*
*నావిల్లింద్ర శరాసనంబుగ, సరోజాక్షుండు మేఘంబుగా'*
*దా విద్యుల్లత భంగి నిరతి సురజిద్దావాగ్ని మగ్నంబుగా'*
*బ్రావృట్కాలము సేసె బాణచయ మంభశ్శీకర శ్రేణిగాన్"*[189]

నరకాసురునితో యుద్ధం చేస్తున్న సత్యభామ స్వరూపాన్ని శ్రీకృష్ణునితో శృంగార రసం, నరకాసురునిలో వీర రసం విస్తరించినట్లుంది.

సత్యభామ ముఖం శ్రీకృష్ణునికి చంద్రబింబంగా నరకాసురునికి సూర్య బింబంగా, సత్యభామ చీరచెరగు మురారికి మన్మధుని జెండావలె, సురారికి తోక చుక్కవలె కన్పించింది. సత్యభామ మండలాకారమైన ధనస్సు శ్రీకృష్ణుని మన్మధ పరివేషంగా, అసురునకు ప్రళయకాలపు సూర్యుని పరివేషంగా విరాజిల్లింది. సత్యభామ సందర్శనం హరికి అమృత ప్రవాహంగా, నరకునికి అగ్నిజ్వాలగా తోచింది.

సత్యభామ ప్రయోగించే వాడి బాణాలవల్ల భయంకరమైన రాక్షస సైన్యం శక్తి కోల్పోయి వెనుకంజ వేసి, భయపడి యుద్ధం మాని నరకాసురుని చాటుకు వెళ్ళింది. ఈ స్థితి సత్యభామ శౌర్య పరాక్రమానికి గీటురాయి.

యుద్ధరంగంలో సత్యభామ పరాక్రమాన్ని శ్రీకృష్ణుడు ప్రశంసించి పలికిన ఈ క్రింది పలుకులు సత్యభామ యుద్ధ కౌశలానికి నికషోపలం.

*క. "కొమ్మా! దానవనాథుని*
*కొమ్మాహవమునకు ( దొల ( గె గురు విజయము ( గై*
*కొమ్మా! మెచ్చితి నిచ్చెద (*
*గొమ్మా భరణములు నీవుగోరిన వెల్లన్"*[190]

## పారిజాతాన్ని దివినుండి భువికి దింపిన సత్యభామ

నరకాసుర సంహారానంతరం శ్రీకృష్ణుడు దేవేంద్రుని పట్టణమైన అమరావతికి వెళ్ళి, దేవమాత అదితి గృహానికి వెళ్ళి, ఆమెకు తన వినోద చర్యల నన్నింటిని చూపి, ఆమె ప్రేమను చూరగొని మణి కుండలాలను ఆమెకు సమర్పించాడు. శ్రీకృష్ణుడు సత్యభామా సహితుడై శచీ సమేతుడైన దేవేంద్రుని పూజలందుకున్నాడు.

సత్యభామ కోరికతో నందన వనంలో ప్రవేశించి పారిజాత వృక్షాన్ని శ్రీకృష్ణుడు చేతితో పెకలించి గరుత్మంతుని పై పెట్టాడు.

శ్రీకృష్ణుడు పారిజాత వృక్షాన్ని పెకలించి ఎత్తుకుని బయలుదేరగా, దేవేంద్రుడు శ్రీకృష్ణుడు నరకుని బారి నుండి రక్షించిన సంగతి మరచి త్రిలోకాధిపతిననే గర్వంతో శ్రీకృష్ణుని ఎదిరించాడు. శ్రీకృష్ణుడు దేవేంద్రాదులతో యుద్ధం చేసి ఓడించి ఆశ్రితపారిజాతమైన శ్రీకృష్ణుడు పారిజాత వృక్షాన్ని సత్యభామ విహార శృంగార ఉద్యానవనంలో నాటించాడు. ఈనాడు కూడా భూలోకంలో పారిజాత పుష్పాల సౌగంధ్యం ఆఘ్రాణిస్తున్నామంటే అందుకు కారణం సత్యభామ సౌందర్య, సంభాషణ, పరాక్రమాలే. సౌందర్య సంభాషణలచే శ్రీకృష్ణుని ప్రేమకు పాత్రమై, పరాక్రమంచే దేవాధి దేవుడైన వాసుదేవుని మన్నన పొందటం వల్లే శ్రీకృష్ణుడు ఆమె కోరికను మన్నించి దేవలోక పారిజాతాన్ని భూలోకానికి తీసుకురావటం జరిగింది.

నరకాసుర సంహారం కోసం బయలు దేరుతున్న శ్రీకృష్ణునికి వినయంతో నమస్కరించి, తన పతి యుద్ధ కౌశలాన్ని తిలకించాలనే కోరికను వ్యక్తం చేసి, పతితో యుద్ధానికి వెళ్ళి సమయాన్ని అదనుగా చేసికొని అలుపే ఎరుగని దేవాధిదేవునికి అలసట నుండి విశ్రాంతి ఇస్తున్నట్లుగా తాను బాణ ప్రయోగం చేసి తన యుద్ధ కౌశలాన్ని ప్రదర్శించి, అర్ధాంగిగా భర్త మెప్పు పొంది, మూడవ భార్యగా వచ్చిన సత్యభామ ముద్దుల పత్నియై, పదిమంది పుత్రులకు తల్లియై, తనకు తన పతి ఇస్తున్న కానుకగా పారిజాత వృక్షాన్ని కోరి భువికందించింది. ఆ నాటి భూలోక రాజన్యు లందరికి తన భర్త పరాక్రమాన్ని తెలియచేసింది. కేవలం అభిమాన ధనంతో, క్షత్రియోచితమైన విద్యలతో, భర్తప్రేమను చూఱగొని శ్రీకృష్ణ భగవానుని సత్యాప్రియుడిని చేసిన శక్తియుక్తులున్న మహిళగా సత్యభామ లోకంలో ప్రఖ్యాతిగాంచింది.

## 2.1.3.5. యాదవ వంశ కోడళ్ళు (శ్రీకృష్ణ పత్నుల్లో ఇతర రాజ వంశ స్త్రీలు)

### 1. రుక్మిణీదేవి

రుక్మిణి విదర్భ దేశంలో, కుండిన నగర ప్రభువైన భీష్మకుని తనయ. ఈమెకు ఐదుగురు అన్నలు. పెద్దవాడు రుక్మి

*చ. "వినుము విదర్భదేశమున వీరు ( డు కుండిన భర్త భీష్మకుం*
*డనునొక దొడ్డరాజు గలడాతని కేవురు పుత్త్రులగ్రజుం*
*దనయుండు రుక్మినా ( బర ( గు, నందఱున్ గడగొట్టు చెల్లెలై*
*మనుజవరేణ్య! పుట్టెనొకమానిని రుక్మిణి నా ( బ్రసిద్ధయై"*[191]

**బాల్యం**

*సీ. "పేర్వేర బొమ్మల పెండ్లిండ్లుసేయుచు నబలల తోడ వియ్యంబులందు*
*గుజ్జెన గూళ్ళను గొమరొప్ప వండించి చెలులకు ( బెట్టించు ( జెలువు మెఱసి*
*రమణీయ మందిరారామ దేశంబుల ( బువ్బు ( దీ ( గెలకును బ్రోదివెట్టు*
*సదమల మణిమయ సౌధభాగంబుల లీలతో భర్మడోలికలనూ'గు"*

*తే. "బాలికలతోడ ( జెలరేగి బంతులాడు*
*శారికా కీరపంక్తికి ( జదువుసెప్పు*
*బర్హిసంఘంబులకు మురిపములుగఱపు*
*మద మరాళంబులకు ( జూపు మందగతులు"*[192]

బాలామణి రుక్మిణి తన తోడి చెలులతో కూడి బొమ్మలకు పేర్లు పెట్టి పెళ్ళిల్లు చేసి వియ్యాలు నెఱపేది. పప్పు, బియ్యం గిన్నెల్లో పోసి గుజ్జెవగూళ్ళు అనే బొమ్మ బారుగా వండించి, తన స్నేహితు రాండ్రకు నేర్పుగా వడ్డించేది. ఉద్యాన వనాల్లో పుష్పలతలకు ఎరువు వేసి, నీళ్ళు పోసి, పందిళ్ళమర్చి పరిపోషణ చేసేది. స్వచ్ఛమైన రత్న నిర్మిత మణిమయ భవనాల్లో, స్వర్ణ డోలికల్లో విలాసంగా ఉయ్యాలూగేది. తన సమ వయస్కులతో చెండాటలాడేది. గోరువంకలకు, చిలుకలకు చదువులు, పలుకులు నేర్పింది, నెమళ్ళకు ఒయ్యారంగా నాట్యాలు నేర్పుతూ మదించిన రాజ హంసలకు

మెల్లగా నడకలు నేర్పింది. రుక్మిణీ దేవి చేష్టలను పరిశీలిస్తే వైకుంఠంలో ఉన్న శ్రీమహాలక్ష్మి కళ్ళకు కట్టినట్లు కన్పిస్తుంది.

*శా. "శ్రీకాంతా తిలకంబు రత్నరుచి రాజి ప్రేంఖిత స్వర్ణదో*

*లాకేళిన్ విలసింప తత్కచ భరాలంకార స్రగ్గంధలో*

*భాకీర్ణ ప్రచరన్మధువ్రత మనోజ్ఞాలోల నాదంబుల*

*స్తోకాను స్వర లీల నొప్ప ( గ నిజేశున్ వేడ్కతో ( బాడగన్"* [193]

ప్రకృతిస్త్రీ పరమాత్మ పురుషుడు రుక్మిణీదేవి ఆదిలక్ష్మీ అవతారంగా విష్ణుపురాణం వెల్లడి చేస్తుంది.

*"రాఘవత్వే భవత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మనీ*

*అన్యేషు చావతారేషు విష్ణోరేషా2న పాయినీ"*

## వివాహ నిర్ణయం

దేవకీ పుత్రుడైన శ్రీకృష్ణుని వివాహం చేసుకోవాలన్న కోరిక కొనలు సాగినట్లుగా రుక్మిణి నిండుజవ్వని అయింది. తన తండ్రి వద్దకు వస్తున్న అతిధులు చెప్పిన శ్రీకృష్ణుని సౌందర్యాది సద్గుణాలు విని శ్రీకృష్ణుడే తనకు తగిన వాడని మనో నిశ్చయం చేసికొంది.

*ఉ. "బంధువులెల్ల ( గృష్ణునకు బాలిక నిచ్చెదమంచు శేముషీ*

*సింధువులై విచారములు సేయ ( గ వారల నడ్డుపెట్టి దు*

*స్సంధుడు రుక్మి కృష్ణునెడ ( జాల విరోధము ( జేసి మత్తపు*

*ష్పంధయ వేణినిత్తు శిశుపాలున కంచు ( దలంచె నంధుడై"* [194]

మదాంధుడైన రుక్మిణి జ్యేష్ట సోదరుడు రుక్మి శిశుపాలునకిచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించాడు.

నిండుజవ్వని రుక్మిణి తన జ్యేష్ఠ సోదరుని వల్ల కలిగే ప్రమాదం గూర్చి ముందే మేల్కొని ధీశాలియై అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుని ద్వారకాపురికి వెళ్ళమని కోరింది. పెద్దన్నను తన తండ్రి కూడ వారించలేకున్నాడని తెలియచేసి శ్రీకృష్ణునకు తన ప్రణయాన్ని తెలియచేసి తీసుకు రమ్మని చెప్పింది.

కుండిన నగరం ద్వారకాపురికి వెళ్ళిన అగ్నిద్యోతనుడు శ్రీకృష్ణునిచే యధావిధిగా గౌరవింపబడి వచ్చిన పని ఏమిటని ప్రశ్నింపబడి రుక్మిణీదేవి సందేశాన్ని వివరిస్తాడు.

## రుక్మిణీ సందేశం

*సీ. "ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సో ( క దేహ తాపంబులు దీఱిపోవు*

*నేనీ శుభాకార మీక్షింప ( గన్నులకఖిలార్థలాభంబు గలుగుచుండు*

*నేనీ చరణసేవ లేప్రొద్దు ( జేసిన భువనోన్నతత్వంబు బొంద ( గలుగు*

*నేనీ లసన్నామమే ప్రొద్దు భక్తితో ( దడవిన బంధ సంతతులు వాయు"*

*తే. "నట్టి నీయందు నా చిత్తమనవరతము*

*నచ్చియున్నది నీయాన నాన లేదు*

*కరుణ ( జూడుము కంసారి! ఖలవిదారి!*

*శ్రీయుతా కార! మానినీ చిత్తచోర!"* [195]

కంసాంతకా! ప్రశస్తాలైన నీగుణాలు వింటే చాలు శరీర తాపాలన్నీ శమిస్తాయి. ఓ కళ్యాణ స్వరూపా! మంగళకరమైన నీ స్వరూపం తిలకిస్తే చాలు నేత్రాలకు సమస్త ప్రయోజనాలు సిద్ధిస్తాయి. దుష్ట సంహారకా! నిరంతరం నీ పాద సేవ చేస్తే చాలు లోకంలో మహోన్నతి పొందవచ్చు.

మానినీ చిత్తచోరా! నిరంతరం నీ దివ్యనామం సంస్మరిస్తే చాలు బంధాలన్నీ పటాపంచలవుతాయి. నీ మహిమ ఎక్కడ? నేనెక్కడ? అని సిగ్గుచెందక నా హృదయం నీపై లగ్నమయింది. ఇది నిజం. నన్ను కరుణతో కటాక్షించమని కోరింది. భక్త రక్షణయే దృఢ నిశ్చయంగా కల శ్రీకృష్ణుని గుణాను సంధానం చేసింది.

## శ్రీకృష్ణుని గుణ వైభవం

*శా. "ధన్యున్ లోక మనోభిరాము ( గుల విద్యారూప తారుణ్య సౌ*

*జన్య శ్రీ బలదాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ననే*

*కన్యల్ గోరరు? కోరదే ముని రమాకాంతా లలామంబురా*

*జన్యానేక సింహ! నా వలననే జన్మించెనేమోహముల్?"* [196]

వంశం, విద్య, చక్కదనం, జవ్వనం, మంచితనం, సంపద, బలం, దానం, పరాక్రమం కారుణ్యమనే గుణాలతో మిక్కిలి ప్రకాశిస్తున్న నిన్ను కోరని కన్నెలెవరూ ఉండరని చెప్పింది. శ్రీకృష్ణుని సమర్థతను గుర్తుచేసింది. సమస్త స్త్రీ సమూహంచే ఆకర్షింపబడేవాడని శ్రీకృష్ణ శబ్దనామౌచిత్యాన్ని తెలియ చేసింది.

స్త్రీలల్లో ఉత్తమురాలైన శ్రీ మహాలక్ష్మి అలనాడు నిన్ను చేపట్టిందని క్షీర సాగర మధనాన్ని గుర్తుచేసింది. ఈ మోహం నాకే కాదు అలనాడు దేవతా సమూహాన్ని అంతటిని పరీక్షించి శ్రీ మహా విష్ణువు వరించటానికి శ్రేష్టుడని నిన్ను వరించిందని గుర్తుచేసి శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడని తెలియచేసింది.

శ్రీకృష్ణుని పురుషోత్తమత్వాన్ని గుర్తు చేసింది. (పురుషోత్తమ లక్షణం శరణు కోరిన వారిని రక్షించటం కాబట్టి) సింహానికి అర్హమైన సొత్తును నక్క కోరుకున్నట్లు నన్ను శిశుపాలుడు కోరుకుంటున్నాడని తెలియజేసింది.

*ఉ. "శ్రీయుతమూర్తి! యో పురుష సింహమ! సింహము పాలి సొమ్ముగో*
*మాయువు గోరు చందమున మత్తుడు చైద్యుడు నీ పదాంబుజ*
*ధ్యాయిని యైన నన్ను వడి ( దా ( గొని పోయెద నంచునున్నవా (*
*డా యధమాధముండెఱు ( గ ( డద్భుతమైన భవత్ప్రతాపమున్".* [197]

ఇక ఈ మోహ బంధం ఈ జన్మదే కాదు, పూర్వ జన్మల్లో కూడ అనే విషయాన్ని ఈ క్రింది పద్యంలో గుర్తు చేసింది.

*మ. "వ్రతముల్, దేవ గురు ద్విజన్మ బుధసేవల్ దాన ధర్మాదులున్*
*గత జన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణు ( గాంక్షించి చే*
*సితినేనిన్ వసుదేవ నందను ( డు నాచిత్తేశు ( డౌ ( గాక ని*
*ర్జితులై పోదురుగాక సంగరములో ( జేదీశ ముఖ్యాధముల్".* [198]

జన్మ జన్మల్లో నేను గోవిందుని పతిగా కోరి నోములు నోచి ఉంటే దేవతలకు, గురువులకు, బ్రాహ్మణులకు, విద్వాంసులకు సేవలొనర్చి ఉంటే దాన ధర్మాది పుణ్యకార్యాలు సల్పి ఉంటే వసుదేవ సుతుడైన శ్రీకృష్ణుడు నాకు ప్రాణేశ్వరుడౌతాడని, శిశుపాలాది నీచులు స్వయంవర యుద్ధంలో పరాజితులవుతారని తనకు తానే శీలపరీక్ష పెట్టుకొంది. సకల గుణ సంపన్నుడైన పురుషోత్తముని చేపట్టాలంటే తన గుణ సంపదను పరోక్షంగా తెలియచేసింది.

*ఉ. "అంకిలిసెప్పలేదు, చతురంగ బలంబులతోడ నెల్లి యో*
*పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా*
*వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయశౌర్యమే*
*యుంకువసేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్"* [199]

ఓ పద్మనాభా! పురుష శ్రేష్ఠుడైన ఓ శ్రీకృష్ణా! నీకు ఇక్కడ అడ్డు చెప్పటానికి హేతువేమి లేదు. రేపేరథ గజ తురగ పదాతులనే చతురంగ బలాలతో వచ్చి శిశుపాల జరా సంధుల జయించి రాక్షస వివాహ పద్ధతిలో నన్ను పరిగ్రహించి తీసుకొని పొమ్ము. నేను నీ వెంట రావటానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టంగా తెలియచేసింది.

*సీ. లోపలి సౌధంబులోన వర్తింపంగ'దేవచ్చునే నిన్ను ( దెత్తునేని (*
*గావలివారల ( గల బంధువు ల ( జంపి కాని తేరాదని కమలనయన!*
*భావించితేని నుపాయంబు సెప్పెద నాలింపు కులదేవయాత్ర జేసి*
*నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్క ( బెండ్లికి మునుపద ( బెండ్లి కూతు*

*తే. "నెలమి మా వారు పంపుదురేను నట్లు,*
*పురము వెలువడి యేతెంచి భూతనాధు*
*సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు*
*వచ్చి కొని పొమ్ము నన్ను నవార్యచరిత!"* [200]

ఒక వేళ రాజ కుమార్తె రుక్మిణిని అంత:పురం నుండి తీసుకు రావటానికి కాపలావారిని సంహరించ వలసి వస్తుందని యోచించే పక్షంలో ఒక ఉపాయం ఉంది.

వివాహానికి ముందు పెళ్ళి కుమార్తెను మా ఇలవేల్పు మంగళ గౌరికి మ్రొక్కించటానికి మా వారు పట్టణం వెలుపల నుండే పార్వతీదేవి ఆలయానికి తీసుకు వెళతారు. నేను నగరి నుండి బయలుదేరి వచ్చే సమయం చూచి ఆ తరుణంలో నన్ను నిరాటంకంగా నీ వెంట తోడ్కొని పో! నీవు అడ్డగింపరాని నడవడి గల వాడవని శ్రీకృష్ణుని సామర్ధ్యాన్ని గుర్తు చేసింది. ఈ పద్యంలో "అవార్యచరిత" అనే రుక్మిణీ దేవి సంబోధన శ్రీకృష్ణుని సర్వ సమర్ధతను తెలియచేసింది.

పై చెప్పిన సందేశంలో శ్రీకృష్ణుని గుణగణాలను గుర్తుచేసిన వీర క్షత్రియాంగన తనను వీరోచితమైన రాక్షస వివాహ పద్ధతిలో తీసుకు వెళ్ళమని వివరించింది.

చిట్టచివరగా శ్రీకృష్ణుని దయకు అర్హురాలని కాకపోతే బ్రహ్మచర్య వ్రతనిష్ఠ వహించి నూరు జన్మలకైనా శ్రీకృష్ణుడే భర్త కావాలని, శ్రీకృష్ణునినే ధ్యానిస్తూ ప్రాణాలు అర్పిస్తానని తన మనో

నిశ్చయాన్ని రుక్మిణి బ్రాహ్మణుని ద్వారా శ్రీకృష్ణునికి సందేశాన్ని పంపింది.

*మ. "ఘనులాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశు మర్యాదనె*
*వ్వని పాదాంబుజ తోయమందు మును ( గన్ వాంఛింతురేనట్టినీ*
*యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱు జన్మంబులన్*
*నిను ( జింతించుచు, బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా"*[201]

ఇంకా రుక్మిణి తన దేహధారణ సాఫల్యం శ్రీకృష్ణునకు దాస్యం చేయటమేననే నిశ్చయాన్ని తెలియచేసి, శ్రీకృష్ణునికి దాస్యం చేయని జన్మ వ్యర్థమనే తన నిర్ణయాన్ని తెలియచేసింది.

*సీ. "ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబు ల కలిమి యేల?*
*పురుషరత్నమ! నీవు భోగింపగా లేని తనులతవలని సౌందర్యమేల?*
*భువనమోహన! నిన్ను ( బొడ గాన ( గా లేని చక్షురింద్రియముల సత్త్వమేల?*
*దయిత! నీయధరామృతం బాన ( గా లేని జిహ్వాకు ఫల రస సిద్ధియేల?*

*ఆ. నీరజాతనయన! నీవనమాలికా*
*గంధమబ్బలేని ఘ్రాణమేల?*
*ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని*
*జన్మమేల? యెన్ని జన్మములకు"*[202]

ఈ విధంగా రుక్మిణీ సందేశాన్ని శిష్టరక్షకుడైన శ్రీకృష్ణునికి అగ్నిద్యోతనుడు వివరించి, రుక్మిణీ సౌందర్యాన్ని దేవాది దేవునకే కాకుండా పఠితలకు కట్టెదుట సాక్షాత్కరింప చేశాడు.

## రుక్మిణీ సౌందర్యం

*సీ. "పల్లవ వైభవాస్పదములు పదములు గనక రంభా తిరస్కారులూరు*
*లరుణప్రభా మనోహరములు గరములు గంబు సౌందర్య మంగళము గళము*
*మహితాభావాభావ మధ్యంబు మధ్యంబు చక్షురుత్సవ దాయి చన్నుదోయి*
*పరిహసి తార్ధేందు పటలంబు నిటలంబు జితమత్త మధుకర శ్రేణివేణి"*

*ఆ. భావజాశుగముల ప్రాపులు చూపులా*

*కుసుమశరుని వింటి కొమలు బొమలు*

*చిత్త తోషణములు చెలువ భాషణములు*

*జలజన యన ముఖము చంద్రసఖము"* [203]

రుక్మిణీదేవి పాదాలు చిగురుటాకులు. తొడలు అరటి బోదెలను తిరస్కరిస్తాయి. అరచేతులు బాలారుణ ప్రభవలె ఇంచుక ఎఱ్ఱనైన కాంతిచేత మనోహరాలు. కంఠం శంఖంవలె కడు రమణీయం. నడుము ఉన్నదా లేదా అనే ఉనికి కలది. వక్షోజాలు కన్నుల పండువు చేస్తాయి. నెన్నుదురు నెలవంకెను ఎగతాళి చేస్తుంది. జడగండు తుమ్మెదల బారును జయిస్తుంది. చూపులు మన్మధ తూపులకి ఆశ్రయాలు. కనుబొమలు మదనుని వింటికొనలు మాటలు మనస్సంతోష సంధాయకాలు. ఆమె వదనం చంద్రబింబాన్ని పోలి ఉంటుంది.

**సమరూప సంపద**

అగ్ని ద్యోతనుడు సాక్షాత్తు సార్ధక నామధేయుడు శ్రీకృష్ణునితో ఈ భూలోకంలో నీకు రుక్మిణి, రుక్మిణికి నీవు ఈడు జోడుగా ఉంటారు.

*ఉ. "ఆయెలనా ( గ నీకు ( దగు, నంగనకుందగునీవు, మా యుపా*

*ధ్యాయుల యాన పెండ్లియగు ( దప్పదు, జాప్యము లేల? నీవు నీ*

*తో యము వారి ( గూడుకొని తోయరు హానన ( దెత్తు గానివి*

*చ్చేయుము, శత్రులన్ నుఱుము సేయుము, సేయుము శోభనంబిలన్"* [204]

అగ్నిద్యోతనుని మాటలు "వివాహోశ్చ వివాదశ్చ సమయోరేవ శోభతే" అనే ఆర్యోక్తిని గుర్తుచేసి ఆర్యులైన ఒజ్జలమీద ఓట్టువేసి మరీచెప్పాడు. మీకు వివాహం తప్పక జరుగుంతుందని భవిష్యద్దర్శనం చేసాడు. వృధాగా ఆలస్యమింకెందుకని త్వరపడమని సూచించాడు. నీవు, నీ వారికి కావలసిన వారినందరిని వెంటబెట్టుకొని అవనజముఖిని తీసికొని రావటానికి వెంటనే బయలుదేరు. వైరి వర్గాన్ని నుగ్గు నుగ్గు కావించి, లోకానికి మేలు చేకూర్చి కీర్తి సంపదని పొందుమని ఆశీర్వదించాడు. గృహలక్ష్మీ యశోలక్ష్మి నీ సొంతమౌతాయని రుక్మిణీదేవిని వివాహం చేసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించాడు.

ఈ అగ్నిద్యోతనుడు రుక్మిణీ రూప సౌందర్యాన్ని వర్ణిస్తూ పాదాల నుండి ప్రారంభించి ముఖ సౌందర్యంతో ముగించాడు.

రుక్మిణి సాక్షాత్తు ఆదిలక్ష్మీ అవతారం. అందువల్లనే అగ్నిద్యోతనుని మాటలు శ్రీకృష్ణుని హృదయ ద్యోతకాలై రుక్మిణీ కల్యాణం జరిపించాయి.

## శ్రీకృష్ణ ప్రేమ

అగ్నిద్యోతనుని మాటలకు సమాధానంగా శ్రీకృష్ణుడు

*ఉ. "కన్నియమీ ( ద నా తల ( పు గాఢము కూరుకురాదు రేయి నా*
*కెన్న ( డు, నా వివాహము సహింపక రుక్మితలంచు కీడునే*
*మున్నె యెఱుంగుదున్, బరులమూ ( క లడంచి కుమారి ( దెత్తువి*
*ద్వన్నుత! మానుద్రచ్చి నవవహ్ని శిఖన్ వడి ( దెచ్చు కైవడిన్"* [205]

రుక్మిణి మీద నాకు అగ్గలమైన ప్రేమ ఉంది. నాకు రాత్రి వేళలందు కూరుకు రాదని పలకటం వల్ల శ్రీకృష్ణునిచే ప్రేమించబడిన కన్యారత్నం రుక్మిణియే. ఇక అన్యులు శ్రీకృష్ణునిపై మోహంచే కృష్ణుని ఎడబాటును సహింపలేక ప్రణయాన్ని అనుభవించారు. శ్రీకృష్ణుడు ప్రణయాన్ని అనుభవించింది రుక్మిణీదేవి విషయంలోనే అని స్పష్టమవుతుంది.

## శ్రీకృష్ణుని మన్నన

రుక్మిణీ అభిప్రాయాన్ని తెలుసుకొని కాని శ్రీకృష్ణుడు తన అభిప్రాయాన్ని వెల్లడించలేదు. ఒక స్త్రీమూర్తి గౌరవానికి ఇంతకంటే మించినదేముంటుంది. ఇక అగ్నిద్యోతనునితో శ్రీకృష్ణుడు

*క. "వచ్చెద విదర్భ భూమికి (*
*జొచ్చెద భీష్మకుని పురము, సురుచిర లీలన్*
*దెచ్చెద బాలన్, వ్రేల్మిడి*
*వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చిన ( బోరన్"* [206]

అని పలకటంలో రుక్మిణిపై అపరిమిత అనురాగం అభివ్యక్తమవుతుంది.

## సదాచారిణి

అగ్నిద్యోతనుని శ్రీకృష్ణునితో తిరిగి వచ్చి రుక్మిణీ దేవితో పలికే మాటల్లో రుక్మిణీ శీల స్వభావాలు వెల్లడవుతున్నాయి.

*ఉ. "మెచ్చె భవద్గుణోన్నతి కమేయ ధనావళులిచ్చె నాకు (దా*

*వచ్చె సుదర్శనా యుధుడు వా (డె, సురాసురు లెల్ల నడ్డమై*

*వచ్చిన నైన రాక్షస వివాహమునం గొనిపోవు నిన్ను, నీ*

*సచ్చరితంబు భాగ్యమును సర్వము నే (డు ఫలించె (గన్యకా"*[207]

అగ్ని ద్యోతనుని పలుకులు ఆలకించిన విదర్భరాజపుత్రి ప్రత్యుపకారంగా ఆ భూసురోత్తమునితో పలికిన మాటల్లో ఆమెకున్న బ్రాహ్మణ భక్తి, సంస్కారం అభివ్యక్తమవుతున్నాయి.

*మ. "జలజాతేక్షణు (దోడి తెచ్చితివి నా సందేశమున్ జెప్పినన్*

*నిలువంబెట్టితి, నీకృపన్ బ్రదికితిన్, నీయంత పుణ్యాత్మకుల్*

*గలరే? దీనికి నీకు బ్రత్యుపకృతిం గావింపనే నేర నం*

*జలి'గావించెద, భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ!"*[208]

## ప్రజామోదం రుక్మిణీ కళ్యాణం

విదర్భ  పట్టణ ప్రజలు శ్రీకృష్ణుని వదనార వింద సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తమలో తామనుకున్న మాటలను బట్టి రుక్మిణీదేవి వివాహం ప్రజామోదమని స్పష్టమవుతుంది.

*మ. "తగునీ చక్రి విదర్భరాజ సుతకుందధ్యంబు వైదర్భియుం*

*దగు నీచక్రికి నింతమంచి దగునే, దాంపత్య మీయిద్దఱిం*

*దగులం గట్టిన బ్రహ్మనేర్పరిగదా! దర్పాహతారాతియై*

*మగ'డౌగావుత (జక్రి యీరమణికిన్ మా పుణ్య మూలంబునన్"*[209]

రుక్మిణీ దేవిని శ్రీకృష్ణుడు చేపట్టకముందే ప్రజలు ఆహా! ఎంత చక్కని దాంపత్యం! వీరిద్దరిని ఆలు మగలుగా జత గూర్చిన బ్రహ్మ నేర్పును ప్రశంసించి, ఏ విధంగా నైన మా పుణ్యఫలంగా ఈ చక్రాయుధుడు తన పరాక్రమంతో శత్రువులను పారద్రోలి మా రాకుమారిని పెండ్లాడుగాక! అని వారి పుణ్యఫలాన్ని కూడ ధారపోసారు. రుక్మిణీ కళ్యాణం కోసం రాకుమారి పట్ల వారికున్న అపార ప్రేమ అభివ్యక్త మవుతుంది.

కేవలం రుక్మిణీ దేవి జ్యేష్టసోదరుని దుర్బుద్ధి వల్ల, అతడు తల్లిదండ్రులను కూడ లెక్కించని వాడగుట వల్ల రుక్మిణీదేవికి శ్రీకృష్ణునికి సందేశం పంపాల్సిన అవసరమేర్పడింది. శాస్త్రోక్తంగా జరగాల్సిన వివాహం (ఆర్షవివాహం) రాక్షస వివాహంగా మారిపోయింది.

## గౌరీ పూజ

విదర్భరాజ కుమార్తె అంత:పురం నుండి సపరివారంగా అమ్మవారి గుడికి బయలుదేరింది. సూతులు, వంధిమాగధులు, గాయకులు, స్తుతిపాఠకులు, పాటలు పాడువారు, వంశావళిని పఠించువారు కైవారాలు చేస్తూ వెంటరాగా, రుక్మిణి గోవిందుని పాదారవిందాలు హృదయంలో స్మరిస్తూ, హంసగమనంలో గౌరీదేవి ఆలయానికి వచ్చింది. బ్రాహ్మణసతులు శాస్త్రోక్తమైన పూజలు నిర్వహించగా పరిశుద్ధమై దుర్గాదేవికి మ్రొక్కింది.

*ఉ. "నమ్మితి నామనంబున సనాతనులైన యుమా మహేశులన్*
*మిమ్ము (బురాణ దంపతుల మేలు భజింతుగదమ్మ! మేటిపె*
*ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరింబతి సేయు మమ్మనిన్*
*నమ్మిన వారికెన్న (డును నాశములేదు గదమ్మ యీశ్వరీ!"* [210]

## ముత్తైదువుల ఆశీస్సులు

బ్రాహ్మణ పత్నులకు ఉప్పు వేసిన అప్పాలు, తాంబూలాలు, మంగళ సూత్రాలు, చెఱకుగడలు ఇచ్చి పూజించింది. ముత్తైదువులు ఉత్సాహంతో దీవనలిచ్చి రుక్మిణీ రమణి తలపై అక్షంతలుంచారు. ఆ మంగళాక్షతలు ధరించి ఆమె శివకామినికి వందన మొనర్చి మౌనవ్రతం మాని గుడినుండి వెడలింది.

## రుక్మిణీ అందచందాలు

రుక్మిణి మబ్బుల నడుమ నుండి వెలువడి ప్రకాశించే తొలకరి మెఱుపువలె, చంద్ర మండలం నుండి వెలికి వచ్చి సంచరించే మృగం వలె, బ్రహ్మదేవుడనే నటుడు ఎత్తిన తెరమరుగున నుండి వెలుపలికి వచ్చి రంగమున ప్రత్యక్షమైన మోహినీ దేవత వలె, క్షీర సముద్ర మధ్యం నుండి వచ్చుచున్న లక్ష్మీదేవి వలె గౌరీ ఆలయం నుండి బయటకు వచ్చింది.

*మ. "అలినీలాలక (బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాళా ధరం*
*గలకంఠిన్ నవ పల్లవాంఘ్రి యుగళన్ గందేభకుంభస్తనిం*
*బులిన శ్రోణి నిభేంద్రయాన నరుణాంభోజాత హస్తన్ మహో*
*త్పలగంధిన్ మృగరాజమధ్య'గని విభ్రాంతాత్ములై రందఱున్"* [211]

రుక్మిణీదేవి సౌందర్యాన్ని చూచి రాజులందరు ఆశ్చర్యచకితులయ్యారు.

ఆ రుక్మిణీదేవి చిరునవ్వుల వల్ల, సిగ్గుతో కూడిన చూపుల వల్ల అక్కడి రాజకుమారులందరి మనసులు కలవరం కలిగి చలించాయి. వారు ధైర్యం వీడారు. గాంభీర్యం వదిలారు. గౌరవం మరచారు, చేష్టలుడిగారు. తెలివి మాలినవారై ఆయుధాలు జారవిడిచారు, ఏనుగులు, గుర్రాలు అందాలు మొదలైన వాహనాలను ఎక్కలేక పరవశులై భూమిపై వాలారు.

## శ్రీకృష్ణ దర్శనం

రుక్మిణీ గౌరీ ఆలయం నుండి బయటికి వచ్చి రాజ సమూహాన్ని చూస్తూ

*మ. "కనియెన్ రుక్మిణి చంద్రమండలము ఖుం గంటీర వేంద్రావల*
*గ్ను నవాంభోజ దళాక్షు ( జారుతరు వక్షున్ మేఘసంకాశదే*
*హునగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రి.బీతాంబరున్*
*ఘన భూషాన్వితు ( గంబు కంఠు విజయోత్కంఠరున్ జగన్మోహనున్"* [212]

చంద్రబింబం వంటి ముఖం, సింహం నడుము వంటి నడుము, క్రొందామేరల వంటి విశాలనేత్రాలు, పరమ రమణీయమైన వక్షం, నీలమేఘం వంటి నెమ్మేను, ఐరావత గజతుండం వంటి బాహువులు, పచ్చని పట్టు పుట్టాలు, మంచి ఆభరణాలు శంఖం వంటి సుడి తిరిగి ఉన్న మెడ, వేడుక చేత లోకాన్ని మోహింప చేయుచున్న శ్రీకృష్ణుని దర్శించింది.

## శ్రీకృష్ణరథారోహణం

శ్రీకృష్ణుని రూప లావణ్య గాంభీర్యాది గుణాలకు రుక్మిణి సంతసించి మదన బాణాలకు గురియై శ్రీకృష్ణుని రథాన్ని అధిరోహించటానికి కుతూహల పడింది.

పుండరీకాక్షుడు (శ్రీకృష్ణుడు) రుక్మిణీదేవిని అవలోకించి, శత్రురాజు సమూహం చూస్తుండగా మత్త మదంగం మాదిరి మెల్లని నడకతో విలాసంగా వెళ్ళి, రాజలోకాన్ని తృణప్రాయంగా నెంచి సింహం వలె రాకుమారిని రథమెక్కించుకొని భూమ్యాకాశాలు ప్రతి ధ్వనించేటట్లు పాంచ జన్యం పూరించాడు. బలరాముడు వెంటరాగా శ్రీకృష్ణుడు యాదవ సైన్యంలో ద్వారకానగర మార్గం పట్టాడు.

జరాసంధాది రాజులు ఒక గొల్లవాడు వారి కళ్ళముందే రాజుకుమార్తె నెత్తుకు పోవటం అవమానంగా భావించి యుద్ధానికి దిగారు. యాదవులు రాజులందరిని ఓడించారు.

ఇక రుక్మి అంటే రుక్మిణీదేవి సోదరుడు శ్రీకృష్ణుని చులకన చేస్తూ మాట్లాడాడు. రుక్మి మాట్లాడిన మాటలకు ఒర నుండి ఖడ్గం దూసి శ్రీకృష్ణుడు రుక్మిని తెగనరక పోయాడు. అంతలో రుక్మిణి శ్రీకృష్ణుని తమ తల్లిదండ్రులకు ఈ శుభ సమయంలో పుత్రశోకం కలిగించవద్దని వేడుకొంది. శరణన్న వారిని కాపాడటం భక్త రక్షకుడైన శ్రీకృష్ణుని ధర్మం కాబట్టి తనను అవమానించిన రుక్మిని తలగొరిగి అవమానించి వదిలేశాడు.

రుక్మిణీదేవి తన అన్నకు కళ్ళముందే జరిగిన అవమానంతో బాధపడుతుందేమోనని బలభద్రుడు శ్రీకృష్ణుని మందలించి, మరదలిని కర్మసిద్ధాంతంలో ఊరడించాడు. శ్రీకృష్ణుడు రుక్మిణి సహితంగా ద్వారకలో ప్రవేశించాడు.

## రుక్మిణీదేవి కళ్యాణం

ప్రకృతిరూపిణి రుక్మిణి, పరమాత్మరూపుడు శ్రీకృష్ణుడు. వీరిరువురి కల్యాణం జగత్కల్యాణం. ఈ జగత్కల్యాణం చేసే భాగ్యం ద్వారకాపురికి దక్కింది. (ద్వారకాపుర లక్ష్మీ కల్యాణ శోభతో విరాజిల్లింది) ద్వారకాపురిలో ప్రతిగృహం కల్యాణ శోభతో ప్రకాశించింది. ఆ శుభ సమయంలో జగద్రక్షకుడైన శ్రీకృష్ణుడు

*శా. "ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజ చేతో హారిణిన్ మానవై*
*భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం*
*ధవ సత్కారిణి ( బుణ్యచారిణి ( మహా దారిద్ర్య సంహారిణిన్*
*సువిభూషాంబర ధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్"* [213]

## సుగుణాల రాశి

జగన్మోహనుడైన శ్రీకృష్ణుని మనస్సునే హరించ గలిగిన మగువ రుక్మిణి. ఈమె ఔన్నత్యాన్నంతటిని, ఒక శార్దూల వృత్తంతో సహజ పండితుడు అతి సహజంగా వెల్లడించాడు.

రుక్మిణీ దేవి

1. ఆత్మాభిమానం కలది. (మానవైభవ) ఈ పదం లేదా గుణం క్షీరసాగర తనయ ఆదిలక్ష్మిని జ్ఞప్తి చేస్తుంది.

2. గాంభీర్యం కలది. (గాంభీర్యవిహారిణిన్) ఈ లక్షణం ధైర్యలక్ష్మిని గుర్తు చేస్తుంది.

3. సకల సంపదలు కలది (నిఖిల సంపత్కారిణిన్) ఈ లక్షణం ధాన్య లక్ష్మిని గుర్తుచేస్తుంది.

4. సుజనులను, చుట్టాలను ఆదరించేది (సాదు బాంధవ సత్కారిణి) ఈ లక్షణం గజలక్ష్మిని గుర్తుచేస్తుంది.

5. పుణ్య సంచారిణి. ఈ లక్షణం సంతాన లక్ష్మిని గుర్తుచేస్తుంది.

6. దారిద్ర్యాన్ని నశింప చేసేది. (దారిద్ర్య సంహారిణిన్) ఈ లక్షణం విజయలక్ష్మిని గుర్తుచేస్తుంది.

7. శుభప్రద వేషభూష ధారిణి (సువిభూషాంబర ధారిణిన్) ఈ లక్షణం విద్యాలక్ష్మిని గుర్తు చేస్తుంది.

8. గుణవతీచూడామణి. ఈ లక్షణం ధనలక్ష్మిని గుర్తు చేస్తుంది. అష్టలక్ష్ముల అంశలన్నింటిని కలబోసుకొని విదర్భరాజ తనయగా జన్మించి, క్షీరసాగర తనయ ఆదిలక్ష్మి దేవాసురులందరిని కాదని శ్రీవిష్ణువుని వరించినట్లుగా రుక్మిణి శిశుపాలాది రాజులను కాదని త్రోసిపుచ్చి శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణునినే వరించింది.

దశమస్కంధాన్ని పరమాత్మ శిరస్సుగా పండితులు భావిస్తారు. శ్రీకృష్ణ కథ దశమస్కంధం. ఈ దశమస్కంధం పుర్వోత్తర భాగాలుగా విభజింపబడింది. భాగవత దశమ స్కంధ పూర్వభాగం శ్రీకృష్ణ జననంతో ప్రారంభమై రుక్మిణీ కల్యాణంతో అంతమౌతుంది. శ్రీకృష్ణుడు గుణవతీ చూడామణి రుక్మిణిని తన హృదయ చూడామణిగా స్వీకరిస్తాడు. అంతటితో ఈ తల్లిని ప్రేమతో హృదయ రాగిణిగా చేసికొని ఆనందించి ఊరకుండలేదు.

దశమస్కంధ ఉత్తర భాగంలో మిగిలిఉన్న అవతార కార్యాలను చక్కబెట్టి, సానబెట్టినపుడే వజ్రం శోభించేది అన్నట్లు శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని పరీక్షించాడు. సర్వాత్మనా శ్రీకృష్ణుని నమ్మి ఆరాధించిన ఆ ఆదిలక్ష్మీ అవతారమైన ఆ తల్లి ఆ పరీక్షలో నెగ్గి పరమాత్మ తత్త్వాన్ని, ఆత్మనే ఆవిష్కరించింది.

## ప్రకృతీ పురుషులు రుక్మిణీ కృష్ణులు

ప్రియసతియైన రుక్మిణీదేవిని చూచి శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ చమత్కారంగా

*మ. "బల శౌర్యంబుల భోగమూర్తి కులరూప త్యాగ సంపద్గుణం*
*బుల దిక్పాలురకంటె ( జైద్యముఖరుల్ పూర్ణుల్ ఘనుల్ వారికిన్*
*నెల ( తా! తల్లియు ( దండ్రియున్ సహజు ( డున్ నిన్నిచ్చినం బోకయీ*
*బలవద్భీరుల వార్ధిలీనుల మముంబాటింప నీకేటికిన్?"* [214]

నీ తల్లి, తండ్రి, సోదరుడు బల, కుల, సంపద సమేతుడైన శిశుపాలునికిచ్చి వివాహం చేద్దామను కుంటే అంగీకరించక సముద్రగర్భంలో తలదాచుకున్న (ద్వారక సముద్రంలో నిర్మించబడింది) పిరికి వాడవైన నన్నెందుకు వివాహం చేసుకున్నావని అంటాడు. ఇంకా

*క. "తగదని యెఱు ( గవు మమ్మున్,*
*దగిలితివి మృగాక్షి! దీన ( దప్పదు నీకుం*
*దగిన మనుజేంద్రు నొక్కని ( దగులుము*
*గుణహీన జనుల ( దగునే తగులన్?"* [215]

నేను నీకు తగినవాడను కాను. నీకు తగిన రాజేంద్రుని వెదకి వివాహమాడమని పలుకుతాడు.

## శ్రీకృష్ణుని స్వరూపం

*సీ. "సాళ్వజరాసంధ చైద్యాది రాజులు చెల ( గినన్ వీక్షించి మలయు చుండు*
*రదిగాక రుక్మిణీ యన్నయు ( గర్వించి వీర్య మదాంధుడై వెలయుచున్న*
*వారి గర్వంబులు వారింప ( గా గోరి చెలువ! నిన్నొడిచి తెచ్చితిమి గాని*
*కాంతా తనూజర్థ కాము కులముగాము, కామ మోహాదుల' గ్ందుకొనుము"*

*తే. విను ముదాసీనులము, క్రియా విరహితులము*
*పూర్ణులము మేము, నిత్యాత్మ బుద్ధి తోడ*
*వెలు ( గుచుందుము గృహదీప విధము మెఱసి*
*నవలతా తన్వి! మాతోడ నవయ వలదు"* [216]

రాజుల అహంకారాన్ని అణచటం, లౌకిక భోగాల పట్ల ఆసక్తి లేకుండటం, అరిషడ్వర్గాలకు లోను కాకుండటం, భవబంధాలు లేనివారం, క్రియారహితంగా ఉండటం, సచ్చిదానంద బ్రహ్మస్వరూప బుద్ధితో ప్రకాశించటం. ఇలాంటి మమ్ము కట్టుకొని కష్టాల పాలౌతావు. ఈ పై చెప్పిన శ్రీకృష్ణుని మాటల్లో అతని స్వభావం తెటతెల్లమయింది.

## రుక్మిణీ స్వస్వరూపం

శ్రీకృష్ణుడు తన స్వస్వరూపాన్ని వివరించగా రుక్మిణీ కన్నీటి పర్యంతమైంది. పరమాత్మ హూంకారానికి ప్రకృతి స్తంభించి పోయిన విధంగా శ్రీకృష్ణుని మాటలకు రుక్మిణి చేష్టలుడిగి నేలపై పడింది.

సద్వంశ సంజాత. ధార్మికురాలైన రుక్మిణీ దు:ఖాన్ని దైన్య స్థితిని గుర్తించి, సహధర్మచారిణి ఉత్తమ స్త్రీ అయిన రుక్మిణిని పైకి లేవనెత్తి సపర్యలతో స్వస్థ స్థితికి తీసుకు వస్తాడు.

పరమాత్మ విడిచిపెడితే ప్రకృతి ఉండదన్న సత్యం. పరమాత్మ స్వరూపుడైన శ్రీకృష్ణుని మాటల వల్ల, రుక్మిణీదేవి చేష్టల వల్ల వ్యక్తమవుతుంది.

శ్రీకృష్ణలాలితయైన రుక్మిణీదేవి ప్రకృతి పురుష లక్షణాలను శ్రీకృష్ణునికి తెలియచేస్తుంది.

## ప్రకృతి లక్షణాలు

సకల కళ్యాణ గుణాలు కలిగి, సచ్చిదానంద పరబ్రహ్మవై ప్రకాశించే పరమాత్మ (శ్రీకృష్ణుని) ముందు ప్రకృతి (రుక్మిణి) సరిపోలేదు.

*సీ. "రూఢిమై (బ్రకృతి పురుషకాలములకు నీశ్వరు (డవై భవదీయ చారు దివ్య*
*లలిత కళా కౌశలమున నభిరతు (డై కడ (గు నీరూపమెక్కడ మహాత్మ!*
*సత్త్వాది గుణ సముచ్చయ యుక్త మూఢాత్మనయిన యేనెక్కడ? ననఘ చరిత!*
*కోరి నీ మంగళ గుణభూతి దానంబు సేయంగ'బడునని చెందుభీతి."*

*తే. "నంబునిధి మధ్యభాగ మందమృత ఫేన*

*పటల పాండుర విభుమూర్తి! పన్నగేంద్ర*

*భోగశయ్యను బవ్వళింపుచును దనరు*

*నట్టి యున్నతలీల దివ్యంబు దల (ప"*[217]

(శాంత, ఘోర, మూఢ వృత్తులతో ప్రకృతి రూపిణివైన నేను తగననటం యధార్థమే) ప్రకృతి శాంత, ఘోర, మూఢ వృత్తులు కలిగి ఉంటుందని వ్యక్తమవుతుంది.

1. శాంత, ఘోర, మూఢ వృత్తులు మూడు త్రిగుణాత్మకం.

   (1) శాంత ప్రవృత్తి సత్త్వ గుణానికి ప్రతీక

   ప్రకృతి ఒక్కొక్కసారి ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంటుంది. (శాంతం)

2. ఘోరతమో గుణాత్మకమైంది

   ఒక్కొక్కసారి ప్రకృతి భూకంప, జల ప్రమాదాలచే దావాగ్ని, బడబాగ్ని మొదలైన వాటివల్ల ఘోర రూపం దాలుస్తుంది.

3. మూఢ ఏమీ తెలియని రీతి. ఈ ప్రకృతి అంతామిధ్య, నిమిత్త మాత్రం ఎవరికో అధీనమై నడుస్తున్నట్లుగా తనదేమి లేని విధంగా మూఢ రీతిలో ఉంటుంది.

## పురుష లక్షణాలు

1. జ్ఞాన, బల, ఐశ్వర్య శక్తులు కలిగి ఉండటం

*తే. "సంచిత జ్ఞాన సుఖబలైశ్వర్య శక్తు*

*లాదిగా (గల సుగుణంబులమర నీకు,*

*నేను దగుదునే? సర్వలోకేశ్వరేశ!*

*లీలమై సచ్చిదానంద శాలి వనఘ!"*[218]

2. కాలానికి కర్త. మనోజ్ఞం, అప్రాకృతం, కోమలం, సచ్చిదానంద నిర్మల పరిపూర్ణమయ ప్రకాశ స్వరూపం.

3. గాంభీర్యరీతి

4. పరమ దివ్య లీలలు (భాగ. ద.స్కం. ఉ.భా.ప. 248)

5. పంచ భూత గణాలు

6. స్వతంత్రుడు

7. ధర్మార్థకామ మోక్ష స్వరూపుడు (భాగ. ద.స్కం. ఉ.భా.వ.249)

8. అఖిల విజ్ఞాన దాయకుడు (భాగ. ద.స్కం. ఉ.భా.ప.250)

*ఆ. "వరమునీంద్ర యోగివర సురకోటిచే*

*వర్జిత ప్రభావ వైభవంబు*

*గలిగి యఖిల చేతనులకు విజ్ఞానప్ర*

*దుండవగుదు వభవ! దురితదూర!"* [219]

9. సేవకులకు కల్పవృక్షం

*మ. "విమల జ్ఞాన నిరూఢులైన జనముల్ వీక్షింప మీ పాదకం*

*జమరంద స్ఫుట దివ్య సౌరభము నాస్వాదించి నిర్వాణరూ*

*పము సత్పూరుష వాగుదీ;తము శోభాశ్రీనివాసంబునౌ*

*మిము సేవింపక మాన వాధముని దుర్మేధాత్మ సేవింతునే?"* [220]

10. దుర్జన్మభయ విదూరుడు లేదా మోక్ష స్వరూపుడు

11. స్వయం ప్రకాశుడు

12. నిరతిశయ ఆనంద స్వరూపుడు

13. సర్వశేషి

14. ఆకాశాదుల కంటె పెద్దది

15. అణువు కంటె చిన్నది

16. సృష్టి స్థితి లయకర్త

సాక్షాత్తు నారాయణావతారమైన శ్రీకృష్ణ పరమాత్మ పురుషుడు ప్రకృతి రుక్మిణి. ప్రకృతీపురుష లక్షణాలు రుక్మిణీ శ్రీకృష్ణులలో సంపూర్ణంగా గోచరిస్తున్నాయి.

## ప్రకృతి లక్షణాలు - రుక్మిణి

1. సర్వాత్మనా హరిని నమ్మింది. మూఢ స్థితి

మ. "ఘనులాత్మీయ ... ... ..." [221]

సీ. "ప్రాణేశ! నీమంజు భాషలు ... ... ..." [222]

శ్రీకృష్ణుని మనోభిప్రాయం తెలుసుకోక ముందే రుక్మిణి శ్రీకృష్ణ సాహచర్యం లేని జీవితం వ్యర్థమని ఈ దేహం త్యజించాలని నిర్ణయం తీసుకుంటుంది భగవంతుని నమ్మిన మధురభక్తి పరమోత్కృష్ట స్థితి ఇది. (మూఢ స్థితి). ఆ స్థితిలో భగవద్ధ్యానం, ఆరాధన తప్ప ఇతరమేమి తెలియని స్థితిలోనే భక్తులుంటారు. రుక్మిణికి శ్రీకృష్ణునిపై ఉన్న భక్తి అపారం అమేయం.

2. తన ముందే తన సోదరుని మరణం కంటే భయంకరంగా అవమానించిన శ్రీకృష్ణుని ఏమి అనక భక్తురాలి వలె శరణు వేడి ప్రార్థించటం శాంత స్వభావానికి నిదర్శనం.

*మత్త. "నిన్ను నీశ్వరు దేవదేవుని నిర్ణయింప ( గ లేక యో*
*సన్నుతామర! కీర్తి శోభిత! సర్వలోక శరణ్య! మా*
*యన్న యీత'డు నేడు చేసె మహాపరాధము నీయెడన్*
*నన్ను మన్నన చేసి కావుమనాథ నాథ! దయానిధీ!"* [223]

3. తల్లిదండ్రుల, సోదరుల ఆధీనంలో సంప్రదాయ బద్ధంగా పెరిగిన కన్య ఎంతో తెగింపు చేసి దైర్యంగా బ్రాహ్మణునితో (అగ్నిద్యోతనునితో) పరపురుషునికి సందేశమంపటం (అది ఆ పురుషుని అభిప్రాయం తెలియక పూర్వమే) బాహ్య దృష్టికి ఘోరంగా కన్పిస్తుంది. ప్రకృతి (రుక్మిణి) మొర నాలకించి స్పందించి (ఉ. "కన్నియ మీ'ద నా తలపుగాఢము ... ... ...") శాంతింప చేయటం (పురుష) పరమాత్మ లక్షణం. ప్రకృతిని పరీక్షించటంలో పరమాత్మ ఆలోచన నిమగ్నమై ఉండాలని అంతరార్థంగా గోచరిస్తుంది. ప్రకృతిని పరిరక్షించటం పురుష లక్షణం. (రుక్మిణి శ్రీకృష్ణుని చేరటానికి అడ్డుగా ఉన్న శిశుపాలాది రాజులు, రుక్మి మొదలైన వారిని జయించటం).

తన ఆత్మ స్వరూపమైన ప్రకృతిని అపురూపంగా ఆలించి, లాలించి, పాలించటం పరమాత్మ లక్షణం (పరమాత్మకి ప్రకృతిపై మమకారమున్నా ఆ ప్రకృతి తనను గుర్తించి కోరుకున్నాకే రక్షించటం ఉత్తమ పురుష లక్షణం (పరమాత్మ లక్షణం). శ్రీకృష్ణునికి రుక్మిణిపై మమకారమున్నా, ఆమె సందేశం విన్న తర్వాతనే తన అభిప్రాయాన్ని బయట పెట్టాడు కాని ముందే స్పందించలేదు. ఇది ఉత్తమ పురుషుడైన ధీరోదాత్త లక్షణం. ఈ పురుష శబ్దాన్ని వేదం కొనియాడింది.

ప్రకృతి పురుషాధీనమనే విషయం రుక్మిణి మాటల్లో చేష్టల్లో

*మ. "పతియేరూపము దాల్చినన్ దదను రూపంబైన రూపంబుతో*

*సతితానుండెను నా సురూపవతి నా చంద్రాస్య నాలక్ష్మినా*

*సుతనున్ రుక్మిణి నాయనన్య మతి నాశుద్ధాంత రంగం గళా*

*చతురత్వంబున శౌరి యిట్లనియె'జంచన్మందహాసంబుతోన్"* [224]

భాగవతోత్తముడైన పోతన మహాకవి తేటతెల్లం చేసాడు. ఆది శంకరులవారు సౌందర్యలహరిలో

*"శివశక్త్యా యుక్తోయది భవతి శక్త; ప్రభవితుం*

*నచేదేవం దేవోనఖలు కుశలస్పన్దితుమపి"* [225]

మొట్ట మొదటి శ్లోకంలో శక్తితో కూడినపుడే సర్వమంగళ కారకుడైన శివుడు చైతన్యవంతుడౌ తాడని తెలియచేసాడు. శక్తి లేకపోతే శివునికి కదలిక లేదని భావం. శివుడు అంటే పురుషుడు లేక పరమాత్మ, శక్తి అంటే ప్రకృతి లేక జీవాత్మ అని అర్థం. ప్రపంచంలోని జడదేహాలన్నీ ప్రకృతి. ఆ దేహాల్లోనే ఉంటూ వాటి జడత్వాన్ని వదల్చి కదిలించి మెదిలించే చైతన్యం పరమాత్మ.

ప్రకృతి లేని పరమాత్మ స్థితి ఉంటుంది. రుక్మిణి లేని శ్రీకృష్ణుని స్థితి సమున్నతంగానే కన్పిస్తుంది. శ్రీకృష్ణుడు లేని రుక్మిణి స్థితి శూన్యం. అది ఆమె మాటల్లోనే

*"ఘనులాత్మీయ ... ... ... ... బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!"* [226]

బ్రహ్మదేవుని ఆయుర్దాయంలోని రెండవ సగం పూర్తి అయిన తర్వాత మహా పురుష స్థితి ఏ విధంగా ఉంటుందో 12వేల దివ్య సంవత్సరాలు తపస్సు చేసిన దేవకీదేవి. పరమాత్మ పరంజ్యోతి స్వరూపాన్ని తెలియచేసింది. ప్రకృతి లేని పరమాత్మ ఉంటాడు. పరమాత్మ లేని ప్రకృతి ఉండదు. శ్రీకృష్ణుడు లేని రుక్మిణి లేదు.

నిరంతరం శ్రీకృష్ణుని సేవలో, భక్తితో తన జన్మ పునీతం గావించుకున్న నారీ శిరోమణి. శ్రీకృష్ణునిపై భక్తితో రుక్మిణి శ్రీకృష్ణుని అనురక్తిని పొంది, భక్తులకు ముక్తి ఏమిటో తెలియచేసింది. భక్తితో కూడిన ప్రేమతో భగవంతుని కూడ జయించవచ్చునన్న సత్యాన్ని తెలియచేసింది.

భక్తితో కూడిన అనురాగం ఎంత శక్తి నివ్వగల్గుతుందన్న విషయం లోకానికి విదితం చేసిన ద్వాపరయుగ మహిళ. అవతార పురుషుడైన శ్రీకృష్ణునికే తనను ఎలా తీసుకువెళ్ళాలో తెలియచేసిన ధీరురాలు, ప్రజ్ఞాశాలి.

రుక్మిణీదేవికి పదిమంది పుత్రులు "దశాస్యాం పుత్రానాధీహి పతి మేకాదశంకురు". ఇతని వల్ల పదిమంది బిడ్డలను గని ఈతనిని పదకొండవ బిడ్డవలె చూడవలసిందని వివాహంలో చెప్పే మంత్రానికి అర్థం చెప్పిన మహిళ. 1. ప్రద్యుమ్నుడు, 2.చారుధేష్టుడు 3.చారుదేవుడు 4.సుధేష్ణుడు 5. సుచారువు 6. చారుగుప్తుడు 7.భద్రచారువు 8.చారుభద్రుడు 9.విచారువు 10.చారువు (ద. స్కం. ఉ.భా.వ. 275) పరమ భక్తితో పతి హృదయంలో నిలిచిన పత్ని.

## 2. నాగ్నజితి

కోసల దేశపు రాజు నగ్నజిత్తు. ఇతడు మిక్కిలి బుద్ధిమంతుడు, ధర్మాత్ముడు. ఈ ధర్మాత్ముని కుమార్తెనాగ్నజితి. సద్గుణ సంపన్న. తండ్రికి తగిన తనయ ఈమె.

### స్వయంవర షరతు

నాగ్నజితి స్వయంవరానికి కోసల రాజు ఒక షరతు విధిస్తాడు. కోసలరాజు వద్ద వాడి కొమ్ములతో మదించిన వృషభాలు ఏడున్నాయి. వాటి మదాన్ని అణచి ఆ ఏడు వృషభాలను తన బాహు బలంతో కట్టివేసిన వాడే నాగ్నజితికి భర్త.

ఈ ప్రకటన విని ఎందరో రాజులు వచ్చి పందెంలో విఫలమయ్యారు. ఈ షరతు విని శ్రీకృష్ణుడు కోసల దేశానికి వెళ్ళి కోసలరాజు చేత అర్ఘ్యపాద్యాదులు స్వీకరిస్తాడు.

### నాగ్నజితి భావన

నాగ్నజితి త్రిలోకపూజ్యుడైన శ్రీకృష్ణుని భర్తగా కోరుకుంది. ఆ కన్యారత్నమైన నాగ్నజితి తన పూర్వజన్మ పుణ్యఫలాన్ని పరీక్షగా పెట్టుకుంది. శ్రీకృష్ణుడు మహా పురుషుడని, భూభారాన్ని తగ్గించటానికి వచ్చిన సర్వేశ్వరుడని, తన విషయంలో ఏమి చేస్తాడోనని ఆలోచిస్తుంది.

*మ. "సిరియుం బద్మభవేశ దిక్పతులు మున్ సేవించి యెవ్వానిశ్రీ*
*చరణాంభోజ పరాగముల్ శిరములన్ సమ్యగ్గతిం దాల్తురీ*
*ధరణీ చక్రభరంబు వాపుటకు నుద్యత్కేళి మూర్తుల్ దయా*
*పరుఁడై యెవ్వఁడు దాల్చునట్టి హరి యెబ్భంగిం బ్రవర్తించునో!"*[227]

## శ్రీకృష్ణుని ఆగమనం

నాగ్నజితి శ్రీకృష్ణుడే తనకు పతి అని ఆలోచిస్తుండగా. శ్రీకృష్ణుడు కోసలరాజుతో

*"అన్యుల యాచింపరురా*

*జన్యులు సౌజన్య కాంక్ష ( జనుదెంచితినీ*

*కన్యన్ వే ( డెద నిమ్మా!*

*కన్యాశుల్కాదుల మేముగాము నరేంద్రా!"* [228]

రాజన్యులు ఇతరులను యాచింపరు. సౌజన్యంతో నీ కుమార్తెను కోరుకుంటున్నాను. ఓలి అడిగెడి మేము కన్యాశుల్కం ఇచ్చేవారం కాము. ఇందుకు ఏమి చెపుతావని శ్రీకృష్ణుడు అంటాడు కోసలరాజు.

*శా. "ఉష్ణాంశుండు తమంబు ( దోలుక్రియ నీవుగ్రాహవక్షోణిలో*

*గృష్ణా! వైరుల ( దోలినా ( డవు, రణ క్రీడా విశేషంబులన్*

*నిష్ణాతుండవు, సప్తగోవృషములన్ నే ( డాజి భంజించిరో*

*చిష్ణుత్వంబున వచ్చి చేకొనుము మాశీతాంశు బింబాననన్"* [229]

ఓ శ్రీకృష్ణా! సూర్యుడు చీకట్లను పారద్రోలిన విధంగా శత్రువులను పారద్రోలావు. సర్వం తెలిసిన వాడవు. నీ ప్రతాపంచే వృషభాలతో పోరాడి జయించి, చంద్రవదన యైన మా నాగ్నజితిని చేపట్టమంటాడు.

## శూర శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు

*ఉ. "చేలము చక్కగట్టుకొని చిత్రగతిన్ వడి నేడు మూర్తులై*

*బాలు ( డు దారు రూపముల ( బట్టెడు కైవడి ( బట్టి వీర శా*

*ర్దూలుడు గ్రుద్దినేల ( బడ ( ద్రోచి మహోద్ధతి ( గట్టియీడ్చెభూ*

*పాలకులెల్ల మెచ్చ వృషభంబుల ( బర్వత సన్నిభంబులన్"* [230]

పసిబాలుడు కొయ్య బొమ్మలను త్రాటితో కట్టి ఈడ్చినట్లుగా ఆ ఏడు వృషభాలను పట్టుకొని, వాటిని గ్రుద్ది, క్రుమ్మి రాజులందరు ప్రశంసించే విధంగా నేలపై కూలద్రోసి ఈడ్చి వాటిని లాగాడు.

## నాగ్నజితి వివాహం

నగ్నజిత్తు శ్రీకృష్ణుని పరాక్రమానికి మెచ్చి, తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తాడు. శాస్త్రోక్తంగా శ్రీకృష్ణుడు నాగ్నజితిని వివాహమాడతాడు. నగ్నజిత్తు పదివేల పాడి ఆవులను వింత వింత

వస్త్రాభరణాలంకృతలైన మూడు వేల మంది పరిచారికలను, తొమ్మిదివేల ఏనుగులను, అంతకు వందరెట్లు రథాలను, అంతకు వందరెట్లు గుఱ్ఱాలను, అంతకు వందరెట్లు అధికమైన సేవకుల గుంపును శ్రీకృష్ణునకు కానుకగా ఇచ్చి నూతన దంపతులను రథమెక్కించి సాగనంపుతాడు.

శ్రీకృష్ణుడు నాగ్నజితిని తీసుకొని ద్వారకా నగరానికి వెళ్ళుచుండగా, మార్గ మధ్యంలో నగ్నజిత్తు విధించిన పందెంలో ఓడిన రాజులందరు ఒకటై శ్రీకృష్ణుని అడ్డగించారు. అర్జునుడు గాండీవం ధరించి సింహం కుందేళ్ళను సంహరించినట్లుగా రాజులందరిని అనాయాసంగా హత మార్చి బంధువుల ప్రశంసలందుకుంటాడు.

**ఉపసంహారం**

సద్గుణ సంపన్నుడైన కోసలరాజు కుమార్తె నాగ్నజితి ధర్మావతారుడైన శ్రీరాముడు పరిపాలించిన రాజ్యం జన్మస్థలం. అందువల్లే తండ్రి తనయలిరువురు గుణ తుల్యులు. శ్రీకృష్ణుడు స్వయంగా వెళ్ళి స్వయంవర షరతును తెలుసుకొని, స్వయం వరంలో నాగ్నజితిని వివాహమాడతాడు. నాగ్నజితి తాను కోరుకున్న శ్రీకృష్ణుని పురాకృత పుణ్య విశేషం వల్ల భర్తగా పొంది, పదిమంది పుత్రులను కని, యదు వంశాభివృద్ధికి కారకురాలైంది. అష్టమహిషుల్లో ఆరవ స్థానం ఈమెది.

నరనారాయణలిరువురి పరాక్రమ ఓలి నాగ్నజితి వివాహం.

## 3. లక్షణ

*చ. "అమరుల ( బాఱ ( దోలి భుజగాంతకు ( డైన ఖగేశ్వరుండు ము*
*న్నమృతము ( దెచ్చుకైవడి మదాంధుల రాజుల నుక్కడించి యా*
*కమలదళాయతేక్షణు ( డు గైకొని తెచ్చెను మద్రకన్యకన్*
*సమద మృగేక్షణన్ నయవిచక్షణ లక్షణ ( బుణ్యలక్షణన్"* [231]

లక్షణ మద్రరాజ కుమార్తె. లేడి కన్నుల వంటి కన్నులు కలది. నేర్పుతో నీతిని నడపగలిగింది, నాగవిరోధి గరుత్మంతుడు దేవతలను పారద్రోలి అమృతం తెచ్చిన విధంగా మదాంధులైన శత్రురాజులను జయించి శ్రీకృష్ణుడు శుభలక్షణ అయిన లక్షణను పరిగ్రహించాడు. లక్షణ శ్రీకృష్ణుని వేణుగానాన్ని గూర్చి నారదుని ద్వారా విని ఆకర్షితురాలైంది.

ఈ లక్షణ శుభ లక్షణ కావటం వల్ల సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుని పతిగా పొందగల్గింది. శ్రీకృష్ణుని అష్టమహిషుల్లో చివరి భార్య ఈమె. నీతి పరురాలై యదుకుల సార్వభౌముడైన శ్రీకృష్ణునికి పదిమంది పుత్రులకు జన్మనిచ్చి ఆమె జన్మను చరితార్థం చేసికొన్న ధన్యాత్మురాలు.

ఈ లక్షణ తన వివాహ వృత్తాంతాన్ని ద్రౌపదితో వివరిస్తుంది. ఆ వివరణలో లక్షణ పుట్టింటి సౌభాగ్యం, శ్రీకృష్ణుని పరాక్రమాతిశయం, తనతండ్రి నిర్వహించిన స్వయంవర పరీక్షలో (మత్స్య యంత్రభేదనం) అర్జునుడు కూడ విఫలుడయ్యాడని మానవ రాజన్యులందరు విఫలులు కాగా దేవాది దేవుడైన శ్రీకృష్ణుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి తనను గెలుచుకున్నాడని వెల్లడిస్తుంది. ఈ విధంగా తెలియచేసి ఈమహీ మండలానికి తన మెట్టినింటి వైభవాన్ని చాటిచెప్పిన మహిళ.

## 4. 16000 మంది రాజ కన్యలు

*మ. "కనిరా రాజకుమారికల్ పరిమళత్కౌతూహలా క్రాంతలై*
*దనుజాధీశ చమూవిదారు నతమందారున్ శుభాకారునూ*
*తన శృంగారు వికారదూరు సుగుణాధారున్ మృగలోచనా*
*జన చేతోధన చోరు రత్నమకుట స్ఫారున్ మనోహారునిన్"*[232]

షడ్భావ వికారదూరుడు, రత్నమకుట విరాజిత సుందరాకారుడు, సుగుణాధారుడు, ఆశ్రిత మందార మనోహరుడు, స్త్రీజన చేతోధనచోరుడు, మనోజ్ఞమైన శ్రీకృష్ణుని 16వేల మంది రాజకన్యలు కుతూహలంతో చూశారు.

### రాజ కన్యల భావన

ఆ రాజకన్యలు సుగుణాధారుడైన శ్రీకృష్ణునిపై ఆకర్షితులై వలపు పొంగి, ధైర్యం కోల్పోయి ప్రణయ హృదయాలతో అతడే తమ ప్రాణవల్లభుడని వరించి, తమలో తాము ఒకరినొకరు. నరకాసురుడు చెఱపట్టి తీసుకురావటం వల్లనే ఈ పురుషోత్తముని దగ్గరకు చేరగలిగాం. నరకాసురుడు పాపాత్ముడు కాదని భావించారు. దుష్టుడైన నరకాసురుడు చేసిన దౌష్ట్యం వీరి పాలిట వరమయింది. శ్రీకృష్ణునితో మనలను జతకూర్చిన సృష్టికర్త బ్రహ్మదేవుడు పుణ్యాత్ముడని ప్రశంసించారు.

*ఉ. "పాపపు రక్కసుండు చెఱపట్టెనటంచు ( దలంతు ( మెప్పుడున్*

*బాపు'డె? వానిధర్మమున ( బద్మదళాక్షుని ( గంటి మమ్మ! ము*

*న్నీ పురుషోత్తముంగదియ నేమి వ్రతంబుల చేసినారేమో?*

*యా పరమేష్ఠి పుణ్యు ( డుగదమ్మ! హరిన్ మము ( గూర్చెనిచ్చటన్"* [233]

గత జన్మలో చేసిన పుణ్యాలే కమలాక్షుడు కౌగిటజేర్చి గౌరవించగా జీవించే సౌభాగ్యానికి కారణంగా భావించారు.

*క. "ఉన్నతి నీత ( డుగౌ ( గిట*

*మన్నింపంగనిన బ్రతుకు మానిని మనలో*

*మున్నేమి నోము నో ( చెనో*

*సన్నుత మార్గముల విపిన జలదుర్గములన్"* [234]

రాజకన్యలు ఒకరికొకరు శ్రీకృష్ణుని సౌందర్యాన్ని, శౌర్యాన్ని, గాంభీర్యాన్ని గూర్చి మనమెప్పుడైన ఇటువంటి వానిని చూచామా? ఇంత కాలం జీవించాం గాని ఇంతటి కూరిమి ఉన్న స్నేహాన్ని సంపాదించి అనురాగం అందుకోలేక పోయామని గుర్తు చేసుకున్నారు. ఆనాటి రాజలోక శ్రేష్ఠుడు శ్రీకృష్ణుడని వీరి మాటల వల్ల అర్థమవుతుంది.

## ప్రణయ విరహం

*సీ. "వనజాక్షి! నే ( గన్న వైజయంతిక నైన'గదిసి వ్రేలుదు గదా కంఠమందు*

*బింబోష్ఠి! నే ( గన్నబీతాంబరమనైన మెఱసి యుండుదుగదా మేనునిండ (*

*గన్నియనే ( గన్న కౌస్తుభమణినైన నొప్పుచూపుదు ( గదాయురము నందు*

*బాలిక! నే ( గన్న ( బాంచ జన్యమునైన మొనసి చొక్కుదు ( గదా మోవి ( గ్రోలి"*

*ఆ. "పద్మగంధి! నేను బర్హదామమునైన (*

*జిత్రరుచులనుందు శిరమునందు*

*ననుచు ( బెక్కు గతులనాడిరి కన్యలు*

*గములుగట్టి గరుడ గమను'జూచి"* [235]

ఆ రాజ కన్యకలందరు గుంపులుకూడి శ్రీకృష్ణుని చూచి మోహావేశం చేత ఓ పద్మాక్షీ! నేను కనుక వైజయంతీమాలనైతే శ్రీకృష్ణుని మెడలో వ్రేలాడేదాన్ని గదా! అని ఒకరు.

ఓ బింబోష్ఠీ! నేను కనుక పట్టు వస్త్రాన్నైతే ఆశరీరంపై ప్రకాశిస్తుండేదాన్ని కదా! అని మరొకరు. ఓ బాలా! నేను కౌస్తుభమణినైనచో ఆయన వక్ష: స్థలంపై మెరుస్తూ ఉండేదాన్ని గదా! అని ఇంకొకరు. ఓ కన్యామణీ! నేను పాంచ జన్యాన్నైతే అతని పెదవిని తాకి పరవశించిపోయేదాన్నని మరొకరు. ఓ పద్మగంధీ! నేను నెమలిపించాన్నైయితే ఆయన శిరస్సుపై చిత్రమైన కాంతులతో విలసిల్లేదాన్ని గదా! ఈ విధంగా రాజ కన్యలందరు గుంపులు కూడి శ్రీకృష్ణుని సాహచర్యం కోసం తపించారు.

ఆ పదహారు వేల రాజ కన్యలు క్రమంగా తమలో తాము ఎవరికి వారే శ్రీకృష్ణుడు తనని చూచి నవ్వినట్లుగా, తన వైపు చూసినట్లుగా, తన చెంతకే వచ్చినట్లుగా, తననే గౌరవించి కరుణించి నట్లుగా, వివాహమాడినట్లుగా శ్రీకృష్ణుని పత్ని అయినట్లుగా భావించారు.

### శ్రీకృష్ణుని ఆదరణ

ఈ విధంగా శ్రీకృష్ణుని ఆదరణ కోసం ఉవ్విళ్ళూరుతున్న ఆ పదహారు వేల రాజకన్యలందరకు శ్రీకృష్ణుడు వస్త్రాభరణ చందనాదులు పంపించి, పదారువేల మందిని పల్లకీల్లో ఎక్కించి ద్వారకకు సాగనంపాడు.

### రాజకన్యలకు శ్రీకృష్ణునితో వివాహం

*చ. "అమిత విహారు ( డీశ్వరు ( డనంతు ( డు దానొకనా ( డు మంచి ల*

*గ్నమున ( బదాఱువేల భవనంబులలోన ( బదాఱువేల రూ*

*పముల ( బదాఱువేల నృపబాలల ( బ్రీతి  ( బదాఱువేల చం*

*దముల విభూతి నొందుచు యధావిధితో వరియించె భూవరా!"*[236]

అమిత విహారుడు, సర్వ నియామకుడు, అనంతుడైన శ్రీకృష్ణమూర్తి ఒక శుభముహూర్తాన ఈ 16000 భవనాల్లో ఉన్న పదహారు వేల మంది రాజకన్యలను పదహారు వేల రూపాలతో, పదహారు వేల రీతులతో ప్రకాశిస్తూ భోగాలు వెలయ శాస్త్రోక్తంగా వివాహమాడారు.

16000 మంది రాజ కన్యలు సర్వేశ్వరుడైన శ్రీకృష్ణ గృహిణులై, గృహస్థ ధర్మంలో ఏ లోటు లేకుండా ఉత్తమ గృహిణులై ప్రశాంతంగా జీవించారు.

పరంధాముడే పతిగా పొందిన ఈ రాజకన్యలు పతి సేవతో పునీతులయ్యారు. పాతి వ్రత్యంతో రేయింబవళ్ళు శ్రీకృష్ణుడు తన గృహంలోనే ఉండి, తన సేవలే అందుకున్నట్లుగా ఎవరికి వారే ప్రతి ఒక్కరు భావించి, సంతోషంతో, ఆదరాభిమానాలతో లోకపతినే తమపతిగా ఆరాధించి ధన్యులయ్యారు. రాజకన్యల సౌభాగ్యం- శుకమహర్షి పరీక్షన్మహారాజుకి శ్రీకృష్ణుని సంతానంతో భూలోకమంతా నిండి సంతోషమతిశయించిందని ఈ 16000 మంది రాజ కన్యలకు ఒక్కొక్కరికి 10 మంది పుత్రులు జన్మించారు. ఈ రాజ కన్యలు గృహస్థ జీవితంలో పుత్రపౌత్రులతో శోభిల్లినట్లుగా వ్యక్తమవుతుంది.

*చ. "అనఘ! పదాఱువేల సుతులందు జనించిరి వేఱువేఱవం*
*దన దశకంబు తత్సుత వితానము గాంచిరనేక సూనుల*
*న్నెనయంగనిట్లు పిల్లచెఱకీనిన కైవడి ( బుత్రపౌత్రవ*
*ర్ధనమున నొప్పె ( గృష్ణుడు ముదంబున ( దామర తంపరైభువిన్"* [237]

## 5. రుక్మవతి

రుక్మి కుమార్తె ఈమె. రుక్మిణీ దేవి మేనకోడలు. మేనమామ ఆహ్వానించిన స్వయంవరానికి వెళ్ళి ప్రద్యుమ్నుడు (రుక్మిణీ శ్రీకృష్ణుల తనయుడు) స్వయంవరానికి వచ్చిన రాజకుమారులను తన పరాక్రమంతో జయించి రుక్మవతిని తన నగరానికి తీసికొని వచ్చి వివాహమాడాడు. వీరి పుత్రుడే (రుక్మవతీ ప్రద్యుమ్నుల) అనిరుద్ధుడు.

## 6. చారుమతి

ఈమె కూడ రుక్మి కుమార్తెయే. ఈమెను కృతవర్మ కుమారుడు వివాహం చేసుకుంటాడు.

## 7. రుక్మలోచన

ఈమె రుక్మి మనుమరాలు. రుక్మి కొడుకు కూతురీమె. రుక్మలోచనకు అనిరుద్ధునకిచ్చి రుక్మి వివాహం జరిపిస్తాడు.

## 2.1.3.6. సముద్రరాజ పుత్రికలు

### 1. శతధృతి

సముద్రుని కుమార్తె. ప్రాచీనబర్హి భార్య ఈమె సౌందర్యంలో దేవతలనే మంత్రముగ్ధులను కావించింది. అంతటి సౌందర్యవతి, సముద్రపుత్రి అయిన ఈ శతధృతిని బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం ప్రాచీనబర్హి వివాహం చేసికొని 10 మంది పుత్రులను పొందాడు. వీరే ప్రచేతసులు. వీరు రుద్రుని ప్రత్యక్షం చేసికొని యోగాదేశ స్తోత్రాన్ని ఉపదేశం పొందారు. అంతటి పుణ్యాత్ములు, మహిమాన్వితులైన బిడ్డలను కన్నతల్లి ఈ శతధృతి.

### 2. వారుణి

ఈమె క్షీర సముద్రరాజ తనయ. పాలసముద్రాన్ని దైత్య దానవులు చిలుకగా జన్మించిన కన్య ఈమె విష్ణువు అనుమతితో ఈమెను రాక్షసులు స్వీకరించారు.

## 2.1.3.7. జాంబవతి (భల్లూకరాజ తనయ)

జన్మించినప్పటి నుండి తనను తాను సంరక్షించుకుంటూ తనను నమ్మినవారిని సంరక్షించే అవతార పురుషుడైన శ్రీకృష్ణునికి అపనిందరావడం, దానిని మాపుకోవడానికి శ్రీకృష్ణుడు ప్రయత్నించటంలో భాగంగా జాంబవతితో కల్యాణం జరిగింది.

### శమంతకమణి వృత్తాంతం

సూర్య భక్తుడై చెలిమిసేయుట వల్ల సంతసించి, సూర్యుడు శమంతకమణిని సత్రాజిత్తు కిస్తాడు. శమంతకమణి ఉన్నచోట దుర్భిక్షాది దేశారిష్టాలు ఉండవని, ఆది వ్యాదులు కాని, మిగిలిన అశుభాలు ఉండవని, మాయావులుండజాలరని, ఆ మణి పూజింపబడుతూ ఉన్నట్లయితే సకలారిష్టాలు తొలగుతాయని సూర్యుడు తెలియచేస్తాడు.

ఆ మణిని ధరించి అపరసూర్యుని వలె వెలుగొందుతూ సత్రాజిత్తు ద్వారకానగరం ప్రవేశిస్తాడు. ద్వారకా నగరవాసులు శ్రీకృష్ణ దర్శనానికి సూర్యుడో, బ్రహ్మదేవుడో వస్తున్నాడని శ్రీకృష్ణునికి నివేదిస్తారు. దేవాది దేవుడైన శ్రీకృష్ణుడు నవ్వి, ఆ వచ్చేవాడు శమంతకమణిని ధరించిన సత్రాజిత్తుగాని సూర్యుడు కాడని చెపుతాడు. అనంతరం సత్రాజిత్తు బ్రాహ్మణుల చేత శమంతక మణిని తన ఇంట దేవతా మందిరంలో ప్రవేశ పెట్టిస్తాడు. ఆ మణి దిన దినం ఎనిమిది బారువుల బంగారాన్ని ప్రసాదిస్తుంది.

మహారాజైన ఉగ్రసేనునికి శమంతకమణిని ఇమ్మని సత్రాజిత్తును శ్రీకృష్ణుడు అడుగగా స్వార్ధపరుడైన సత్రాజిత్తు తనకు ధనంపై ఉన్న ఆశచేత ఇవ్వడానికి నిరాకరిస్తాడు.

### శమంతకమణి అపహరణం

ఒకనాడు సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుడు కుతూహలంతో శమంతక మణిని కంఠాన ధరించి, భయంకర క్రూర మృగాలను వేటాడే నిమిత్తం అరణ్యానికి వెళతాడు. ఆ అరణ్యంలో ఒక సింహం ప్రసేనుని చంపి, ఆ మణిని నోట కరుచుకొని వెళుతుండగా, జాంబవంతుడు ఆ సింహానికి దగ్గరగా వెళ్ళి దానిని సంహరించి, దిక్కులను వెలిగించే తేజస్సుతో కూడిన మణిని చూస్తాడు.

జాంబవంతుడు ఆ మణిని తీసుకొని పోయి దగ్గరలో ఉన్న కొండ గుహలోకి వెళ్ళి, అక్కడ ఉన్న తన ప్రియ కుమార్తెకి ఆ మణిని సంతోషంతో ఆట బంతిగా ఉపయోగించుకొవడానికి ఇచ్చాడు.

### శ్రీకృష్ణునిపై నీలాపనింద

సత్రాజిత్తు తన తమ్ముడైన ప్రసేనుడు వేటకు వెళ్ళి తిరిగి రానందుకు ఎంతగానో దు:ఖిస్తాడు. శ్రీకృష్ణుడు మణి కోసం నా తమ్ముడిని సంహరించి, దానిని అపహరించాడు. హరి ఏ మాత్రం మర్యాద లేని అక్రమస్థుడని దూషింపసాగాడు. ఆ దూషణ వాక్యాలను శ్రీకృష్ణుడు విని నాలో ఏ దోషం లేదు, ఈ నింద నాపై వచ్చింది అని తర్కించి అరణ్యానికి కొంత పరివారముతో వెళతాడు.

### శమంతకమణిని దర్శించిన శ్రీకృష్ణుడు

*మ. "తనవారెల్ల 'బ్రసేనుజాడ'దెలుపం దర్కించుచున్ వచ్చిత*
*ద్వన వీథింగనె నేల'గూలిన మహాశ్వంబుం బ్రసేనుం బ్రసే*
*నుని హింసించిన సింహమున్ మృగపతిన్ నొప్పించి ఖండించి యే*
*గిన భల్లూకము సొచ్చియున్న గుహయుంగృష్ణుడు రోచిష్ణు'డై"*[238]

తనవెంటనున్న ప్రజలందరిని గుహద్వారం వద్ద ఉంచి. శ్రీకృష్ణుడు సాహసంతో లోపలకు ప్రవేశించి ఆటబంతిగా వేలాడదీసిన శమంతక మణిని దర్శించాడు.

### శ్రీకృష్ణునితో జాంబవంతుని పోరు

యదుకుల శ్రేష్ఠుడైన ఆ శ్రీకృష్ణుడు మెల్ల మెల్లగా అడుగులు వేసి. ఆ శిశువు దగ్గరకు వెళతాడు. ఆ శిశువును సంరక్షిస్తున్న దాది శ్రీకృష్ణుని చూచి గుండెలు గుభిల్లు మన భయపడి పెద్ద కేక వేసింది. ఆ కేక విని జాంబవంతుడక్కడకు వచ్చి శ్రీకృష్ణుడే శ్రీరాముడని గ్రహింపలేక సామాన్య మానవునిగా భావించి గుహలో

*క. "పలలమునకు 'బోరెదు దే*
*గల క్రియ శస్త్రముల 'దరుల 'గరముల విజయే*
*చ్ఛల నిరువది యెనిమిది దిన*
*ములు పోరిరి నగచరేంద్ర ముఖ్యు'డు హరియున్"*[239]

మాంసం కోసం పోరాడే డేగలవలె. ఆ శమంతక మణి కోసం 28రోజులు యుద్ధం చేశారు. చివరికి జాంబవంతుడు పిండి పిండిగా నలగగొట్టబడిన శరీరంతో భయకంపితుడై శ్రీకృష్ణుడే శ్రీరాముడని గుర్తించి శరణు వేడతాడు.

## శ్రీకృష్ణుని అనుగ్రహ సంభాషణ

భక్తవత్సలుడైన గోపాలదేవుడు జాంబవంతుని స్తుతికి మెచ్చి, యుద్ధం వల్ల కలిగిన శ్రమను తొలగిస్తున్న విధంగా జాంబవంతుని శరీరం నిమిరి గంభీరమైన కంఠ స్వరంతో

*క. "ఈ మణి మాచే ( బడెనని*

*తామసు లొనరించు నిందదప్పెడు కొఱకై*

*నీమందిరమగు బిలమున*

*కేమరు దెంచితిమి భల్లుకేశ్వర! వింటే!"* [240]

కొందరు అజ్ఞానులు ఆ మణిని నేను అపహరించానని నిందించటం వల్ల, నా పై వేసిన ఈ రత్నాన్ని కొనిపోయి ఇచ్చి అపనిందను తొలగించుకొనటానికి నీ నివాసమైన ఈ గుహకు నేను వచ్చానని తెలియ చేస్తాడు.

## శ్రీకృష్ణుని కానుక జాంబవతి

శ్రీకృష్ణుని పలుకులు విన్న జాంబవంతుడు సంతోషించి ఆ మణితో పాటు తన కుమార్తె జాంబవతిని తెచ్చి హరికి కానుకగా సమర్పించాడు.

శ్రీకృష్ణుడు తన పరాక్రమంతో జాంబవతీ దేవిని పొంది, రాజ సభకు సత్రాజిత్తును పిలిపించి రత్నం పోయిన విధం, తాను జాడను బట్టి వెళ్ళి శమంతకమణిని తెచ్చిన విధం తెలియచేసి శమంతక మణిని సత్రాజిత్తుకి అప్పగించి తనపై మోపిన నిందను మాపుకున్నాడు.

తన తండ్రి గత యుగంలో (త్రేతాయుగం) శ్రీరామావతారంలో చేసిన సేవ వల్ల దేవాది దేవుడైన శ్రీకృష్ణునికి జాంబవతి భార్య కాగలిగింది. అమిత పరాక్రమ వంతుడైన జాంబవంతుడు శ్రీరాముని కోరిన కోరిక శ్రీకృష్ణరూపంలో పరమాత్మ నెరవేర్చి జాంబవంతుని గౌరవార్థం జాంబవతిని వివాహం చేసుకుంటాడు.

### 2.1.3.8. వానరజాతి

**1. తార**

ఈమె వాలి భార్య. సింహ పరాక్రముడైన శ్రీరాముడు సుగ్రీవుని అనుచరునిగా స్వీకరించి, వాలిని సంహరించి, కిష్కంధా రాజ్యాన్ని సింహం వంటి నడుం గల తారను అప్పగించినట్లుగా భాగవతం ద్వితీయ స్కంధంలో తార గూర్చి చెప్పబడింది.

*క. "హరి సుతు ( బరిచరు ( గా ( గొని*
*హరిసుతు ( దును మాడి పనిచె హరిపురమునకున్,*
*హరి విభునకు హరిమధ్యమ*
*హరి రాజ్య పదంబునిచ్చె హరి విక్రము ( డై"* [248]

దశకంఠుడైన రావణాసురునే కిష్కింధ నుండి లంకకు విసిరివేయ గలిగిన బలపరాక్రమోపేత సంపన్నుడైన వానర రాజైన వాలి భార్య. ఈమె కుమారుడు అంగదుడు. సుగ్రీవునికి రాజ్యముతో పాటు అన్న భార్య తారను శ్రీరాముడు అప్పగించటం చూస్తే అన్న మరణానంతరం, అతని భార్యను తమ్ముడు స్వీకరించటం ఆనాటి వానరజాతి ఆచారంగా తోస్తుంది.

ధర్మాత్ముడైన శ్రీరామ చంద్రమూర్తి మాట ప్రకారం సుగ్రీవుని రాజుగా అంగీకరించి, అమె సుగ్రీవుని చెంతకు చేరటం చూస్తే 'తార' ధర్మ నిబద్ధత గల్గిన మహిళగా కన్పిస్తుంది.

## 2.1.3.9. రాక్షస జాతి స్త్రీలు

### 1. రచన

దైత్యుల సోదరి ఈమె. ఈమెను త్వష్ట వివాహం చేసికొన్నాడు. ఈ దంపతులకు మహా బలాఢ్యులైన విశ్వరూపుడు జన్మించాడు. ఈ విశ్వరూపుడు దేవతలకు గురువుగా ఉండి దేవేంద్రునికి నారాయణ కవచం ఉపదేశించాడు. ఈమె రాక్షస జాతియై ఉండి కూడా సాత్త్వికుడు, తపస్సంపన్నుడైన పుత్రుని పొందటం వల్ల ఈమె కర్మత: రాక్షస స్త్రీ కాదు.

### 2. లీలావతి

దితి పుత్రుడు, త్రిలోకనాధుడైన హిరణ్య కశిపుని భార్య ఈ లీలావతి.

*శా. "లీలోద్యాన లతా నివాసములలో లీలావతి యుక్తుడై*
*హాలపాన వివర్ధమాన మదలో లావృత్త తామ్రాక్షు'డై*
*కేళిందేల (గ నేను (దుంబురు (డు సంగీత ప్రసంగంబులన్*
*వాలయంబు (గరంగ జేయుదుము దేవద్వేషి నుర్వీశ్వరా!"* [249]

స్వర్గలోకంలోని శృంగారవనంలో పూలపొదరిళ్ళలో హిరణ్య కశిపుడు తన భార్య లీలావతితో విహరిస్తున్నాడు. ఈ సంఘటన వల్ల హిరణ్యకశిపుని ప్రేమను చూరగొన్న భార్యగా లీలావతి అవగత మవుతుంది. ఆ దంపతుల కేళీ వినోగాల్లో లీనమై ఉన్నప్పుడుస తుంబుర, నారదులు, విద్యాధరులు, అప్సరసలు, ఋషులు కూడా వీణలపై సంగీతంలో సరసమైన సంగతులు పలికిస్తుండే వారు. త్రైలోకాధిపత్యం వహిస్తున్న హిరణ్యకశిపుని భార్యగా లీలావతి అందరి మన్ననలందుకున్న మహిళ.

లీలావతి హిరణ్య కశిపులకు నలుగురు పుత్రులు. వారు పరమ యోగ్యులు. అతి ప్రభావ శీలురు. (ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, హ్లాదుడు, సింహిక అనే పుత్రిక) వీరిలో ప్రహ్లాదుడు సకల సద్గుణరాశి. ఇతడు విద్యాభ్యాసం చేస్తూ హరిభక్తిని గూర్చి సహాధ్యాయులందరికి వెల్లడిస్తూ, తనకి నారదమహర్షి దివ్యజ్ఞాన తత్త్వాన్ని బోధించాడని తెలియచేస్తాడు. ఆ సంఘటన ఎలా వాటిల్లిందో తెలియచేసే విషయాల్లో లీలావతి చరిత్ర కొంత వెల్లడవుతుంది.

## దేవేంద్రుడు చెఱపట్టిన లీలావతి

హిరణ్యకశిపుడు ఉగ్రమైన తపోనిమిత్తమై మందరపర్వతం మీదకి వెళ్ళాడు. ఆ అదను కనిపెట్టి దేవతలు జైత్రయాత్ర చేసి రాక్షసులను పారద్రోలి రాక్షసరాజు నివాస మందిరాన్ని ఆక్రమించారు. స్వర్గరాజైన దేవేంద్రుడు సంకోచింపక, అంతఃపురంలో జొరబడి లీలావతిని చెరపట్టాడు. ఆమె సిగ్గుతో విలవిల లాడింది. ఎంత ఏడ్చినా దేవేంద్రుడు వినిపించుకోలేదు.

సురేంద్రుడు లీలావతిని చెఱపట్టి తీసుకుని పోతుంటే ఆమె గ్రద్దకు చిక్కిన ఆడులకుముకి పిట్టవలె రోదించింది.

## అదృష్టవంతురాలు

దైవయోగం వల్ల నారదమహర్షి కన్పించి ఇంద్రుని చూచి

*ఉ. "స్వర్భువ నాథినాథ! సురసత్తమ! వేల్పులలోన మిక్కిలిన్*
*నిర్భర పుణ్యమూర్తివి, సునీతివి, మానిని (బట్టనేల? యీ*
*గర్భిణి నాతురన్ విడువు కల్మష మానసురాలు గాదు నీ*
*దుర్భర రోషముల్ నిలుపు దుర్జయు (డైన నిలింపవైరిపై"*[250]

స్వర్గాధిపతి ఉత్తమత్వాన్ని గుర్తుచేసి, చేసింది తప్పని గుర్తు చేసి, లీలావతిని విడిచి పెట్టమని, ప్రబోధించాడు. ఈమె హిరణ్యకశిపుని భార్య కాబట్టి ఆమె ప్రసవించిన వెంటనే ఆ శిశువుని వజ్రాయుధంతో వధించాలన్న ఇంద్రుని ఆలోచన నుండి లీలావతి గర్భస్థ శిశువు హరిభక్తి మహిమాన్వితను వివరించి లీలావతిని విడిపిస్తాడు. భక్తి బంధుత్వంచేత దేవేంద్రుడు లీలావతికి నమస్కరించి వెళ్ళిపోతాడు.

## పరమ పతివ్రత

వ. "అని దేవముని నిర్దేశించిన నతని వచనంబులు మన్నించి తానును హరిభక్తుండు గావున దేవేంద్రుండు భక్తి బాంధవంబును మా యవ్వను విడిచి వలగొని సురలోకంబునకు ంజనియె మునీంద్రుడు మజ్జనని యందు'బుత్రికాభావంబుసేసి ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... నుండుమనిన సమ్మతించి"[251]

నారదుడు లీలావతిని దేవేంద్రుని చెఱనుండి విడిపించి తన ఆశ్రమానికి తీసుకువెళతాడు. అమ్మా! నీవు పరమ పతివ్రతవు. నీ కడుపులో మహాభక్తుడైన ఒక బాలుడు పెరుగుతున్నాడు. నీ భర్త తపస్సు చేసి వరాలు పొంది తప్పక తిరిగి వస్తాడు. అందాక నీవు ఇక్కడే ఉండమని నారదుడు ధైర్యం చెపుతాడు. అందుకు లీలావతి అంగీకరిస్తుంది.

**గుణగణాలు**

*శా. "యోషారత్నము నాథ దేవత విశాలోద్యోగ మా తల్లి, ని*

*ర్ద్వేషమ్యంబున నాధురాక మదిలో వాంఛింఛి నిర్దోషమై*

*యీషద్భీతియు లేక గర్భ పరిరక్షేచ్ఛన్ విచారించు శు*

*శ్రూషల్ సేయుచు నుండె నారదునకున్ సువ్యక్త శీలంబునన్"* [252]

రమణీ శిరోమణి, మహాపతివ్రత ఐనటువంటి లీలావతి ఎవరి మీద ద్వేషం పెట్టుకోలేదు. భర్తనే దైవంగా భావిస్తూ, భర్త రాక కోసం ఎదురు చూస్తూ ఉండిపోయింది. ఆశ్రమంలో మంచిగా ఉంటూ, ఏ మాత్రం జంకు లేక సత్ప్రవర్తనతో భర్త వచ్చిన తర్వాతే ప్రసవాన్ని కోరుకున్నదై, తన గర్భస్థ శిశువు క్షేమాన్ని కోరుకుంటూ దేవర్షి నారదునికి సేవ చేసింది.

**ధర్మజ్ఞానార్జన**

లీలావతి నారద మహర్షికి పరిచర్యలు చేయగా, గర్భస్థ శిశువైన ప్రహ్లాదుని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛమైన జ్ఞానాన్ని ధర్మరీతిని ఉపదేశించాడు. పతిసేవయే పరమావధిగా భావించిన ఈ దానవపత్ని అనతి కాలంలో నారదుని బోధను మరచింది. గర్భస్థుడైన ప్రహ్లాదుడు హరిభక్తితో, ధర్మజ్ఞానాన్ని మరువక దానవ కుల శిరో రత్నంగా వెలుగొందాడు.

చెఱపట్టిన దేవేంద్రుని చేతనే నమస్కారం చేయించుకున్న పరమసాధ్వి. ఆ జన్మ బ్రహ్మచారి, నారాయణ నామ సంకీర్తనతో లోక కళ్యాణ కారకుడైన నారదమహర్షిచే పరమ పతివ్రతగా కీర్తింప బడిన నారీ శిరోరత్నం. దేవర్షి నారదునకు సేవచేసి హరిభక్తి, ధర్మజ్ఞాన బోధను పొందిన మహా సాధ్వి. హరి భక్తుడైన ప్రహ్లాదుని పుత్రునిగా పొంది మాతృత్వంతో తన జన్మ చరితార్థం గావించు కున్న మాననీయ మహిళ.

## 3. దేవి

ఈమె ప్రహ్లాదుని భార్య. ఈ దంపతులకు విరోచనుడనే పుత్రుడుదయించాడు. ఆ విరోచనుని కుమారుడే బలిచక్రవర్తి.

## 4. అశన

బలిచక్రవర్తి భార్య. ఈ దంపతులకు బాణాసురుడు మొదలైన 100 మంది తనయులు జన్మించారు. పూర్వాగాధాలహరిలో ఈ ఆశన కుమార్తె రత్నమాల అని చెపుతుంది. దశమస్కందం ఉత్తర భాగంలో బాణాసురుని తల్లి కోటర అని ఉంది.

## 5. కైకసి

ఈమె రాక్షసి. ఈమెకు రావణ కుంభకర్ణులు పుత్రులు. పులస్త్యబ్రహ్మ పత్ని. శ్రీమహా విష్ణువు రఘురాముడుగా జన్మించి. ఈమె పుత్రులను సంహరించాడు. ఈ రావణ కుంభ కర్ణులు వైరభక్తితో శ్రీమహావిష్ణువును చేరుకున్నారు. వీరువిష్ణువు ద్వార పాలకులైన జయ విజయులు సనకస నందనాది మునుల శాపంచే భూలోకంలో రాక్షసులుగా జన్మించ వలసి వచ్చింది. అటువంటి పరమ పావనులైన జయ విజయులకు జన్మనివ్వటంచే ఈ కైకసి రాక్షస స్త్రీ అయినను ఈమె జన్మ చరితార్థమయింది. ఈమె గొప్ప శివభక్తి పరాయణగా రామాయణ మందు కన్పిస్తుంది.

## 6. వింధ్యావళి

రాక్షసరాజైన బలిచక్రవర్తి భార్య. ఈమె గూర్చి పోతన అష్టమ స్కంధంలో వామనునికి బలి మూడడగుల నేలదాన మిచ్చేటపుడు వామనుని పాదాలు కడగటానికి కలశంలో నీళ్ళివ్వటానికి ప్రవేశింప చేస్తూ ఈ క్రింది విధంగా చెప్పాడు.

*"దనుజలోకనాధుదయిత వింధ్యావళి*

*రాజవదన మదమరాళ గమన*

*వటుని కాళ్ళు గడుగ వరహేమఘటమున*

*జలము'దెచ్చె భర్త సన్న యెఱి'గి"* [253]

పై పద్యాన్ని బట్టి ఆమె స్వరూప స్వభావాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె సౌందర్యవతి. పతి ధర్మానుసారిణి.

గరుడుడు బలిని వరుణ పాశ బద్ధుని చేయగా వింధ్యావళి కన్నీరు కారుస్తూ దయా మయుడు, లక్ష్మీపతియైన మహావిష్ణువుకి 'పతిభిక్ష' అర్థించింది. ఈ సందర్భమున ఈమె పలికిన పలుకుల్లో లోకేశుని తత్త్వాన్ని ఆకళింపు చేసికొన్న జ్ఞానిగా అభివ్యక్తమవుతుంది. నా భర్త కాదనకుండ, లేదనకుండ, పొమ్మనక నీకు మూడు లోకాలు దానం చేసాడు. అటువంటి నా ప్రాణేశ్వరుని ఎందుకు బంధించావని పరమాత్మనే ప్రశ్నించటం ఆమె పతి ప్రేమకి, ధీరత్వానికి నిదర్శనం.

## 7. తాటకి

ఈమె రాక్షసి. విశ్వామిత్రుని యజ్ఞ సంరక్షణార్థం శ్రీరామచంద్రుని చేత చంపబడింది. యజ్ఞవిఘాతకి. యజ్ఞ విధ్వంసం కావించే ఈ రాక్షసిని స్త్రీ అని జాలిపడి ఆలోచించ వద్దని గురువైన విశ్వామిత్రుడు శ్రీరామునికి ఆనతివ్వగా శ్రీరాముడు సంహరించాడు. లోక కల్యాణార్థం దుష్ట శిక్షణలో భాగంగా చంపబడిన రాక్షసి.

*మ. "నవరక్షార్థము దండ్రిపంప ( జని విశ్వామిత్రు ( డుం దోడ రా*
*నవలీలందునుమాడె రాము ( డదయుండై బాలు ( డై కుంతల*
*చ్ఛవి సంపజ్జిత హాటకంగపట భాషావిస్ఫురన్నాటకన్*
*జవభిన్నార్య మఘోటకంగరవిరాజత్ఖేటకం దాటకన్"* [254]

## 8. శూర్పణఖ

దశకంఠుడైన రావణాసురుని చెల్లెలు. రాముని కామించి వచ్చిన రాక్షస స్త్రీ. లక్ష్మణుని చేత ముక్కు కోయించుకున్నది. ఈమె మాటల వల్లనే రావణాసురుడు సీతాపహరణం గావించాడు. రాక్షస స్త్రీ అయినప్పటికి దుష్టశిక్షణకి ఉపయోగ పడిన పాత్ర.

## 9. మండోదరి

ఈమె దశకంఠుడైన రాక్షస చక్రవర్తి రావణాసురుని పట్ట మహిషి. రావణుడు శివభక్తుడు ఈమె పాతాళ లోకరాజైన మయాసురుని కుమార్తె. శ్రీహరి భక్తురాలు. జాతులు వేరైనా భక్తి పథంలో భేదమున్న ఒక మహిళగా, భార్యగా, భర్తృ ధర్మాన్ని పాటించి రావణ వంశాభివృద్ధికి దోహదపడి రావణునికి మంత్రి వలె సీతా విషయంలో నీతిని, ధర్మాన్ని బోధించిన ఇల్లాలు.

## 10. పూతన

*సీ. "కంసు పంపున బాల ఘాతిని పూతన పల్లెల మందల ( బట్టణముల*

*నిలనెల్లచో బాలహింస ( గావించుచు ( జనుచు నెవ్వని పేరు శ్రవణ వీధి (*

*బడిన యంతన సర్వభయ నివారణ మగునట్టి దైత్యాంత కుండవతరించి*

*యున్న నందుని పల్లె కొకనా ( డు ఖేచరియై వచ్చి యందు మాయా ప్రయుక్తి' "*

*తే. గామరూపిణియై చొచ్చి కానకుండ*

*నరిగి యిల్లిల్లు ( దప్పక యరసికొనుచు*

*నందగృహమున బాలుని నాదమొకటి*

*విని ప్రమోదించి సుందరీవేష యగుచు"*[255]

కంసుడు పంపున వచ్చిన రాక్షస స్త్రీ పూతన. ఈమె పల్లెలు, గొల్ల పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ పాపలు కన్పించినా చంపుతూ వ్రేపల్లెకు చేరింది. రాక్షసులు కామరూపులు కనుక, రాక్షస స్త్రీ అయిన ఈమె కామరూపియై మాయతో ఎవరి కంటా పడకుండ ఇల్లిల్లు తిరిగి నందుని ఇంట్లో బాలుని ఏడుపు విని అందమైన యువతి వేషంతో నందుని ఇంటికి చేరింది.

శ్రీకృష్ణునికై నందుని ఇంటికి వెళ్ళే కామరూపియైన పూతన సౌందర్యాన్ని చూచి గోపికలందరు వారందరిని బ్రతికించటానికి వచ్చిన లక్ష్మీదేవి శృంగార వేషంతో వచ్చిందేమో అనుకుంటూ నిశ్చేష్టులై నిలబడి చూస్తూ ఉండి పోయారు.

పూతన సరాసరి మంచం మధ్యలో ఉన్న పరాత్పరుడైన కృష్ణుని చూచింది. నివురు గప్పిన నిప్పువలె ఉండటం చేత అది నిప్పు అని, తాకితే కాలుతుందని, అమాయా శిశువు అవతార కార్యం ప్రారంభిస్తున్నాడని తెలియదు.

ఆ శిశువును చూచి పూతన దగ్గరికి వెళ్ళే సమయానికి పూతన స్వస్వరూపాన్ని గుర్తించి లోలోపల నవ్వుకుని జగదధినాధుడు గోపాల రూపంలో గుర్రుపెట్టి నిద్రపోతున్నట్లు నటించసాగాడు.

ఆ పాపజాతి సుందరి, ఆ పాపని లేవదీసి తల్లివలె ముద్దిడి పాలిండ్లకు హత్తుకుంది. శ్రీకృష్ణుడు ఒక గుక్కెడు పాలుతాగితే తన అందానికి సఫలత్వం దక్కినట్లు అనుకుంది. ఈ విధంగా

శ్రీకృష్ణునితో ముద్దుగా ముచ్చటలాడుతున్న పూతనను యశోదారోహిణులు పాలివ్వద్దని వారించి చూసారు. కాని పూతన వారి మాటలు లెక్క చేయలేదు,

సృష్టి స్థితి లయ కారకుడైన పరమాత్మ శ్రీకృష్ణ రూపంలో పూతన కోరుకున్న విధంగానే ఆప్యాయంగా చేతులు చాచి ఒదిగిపడుకుని ఆమె శరీరంలో సత్తువ లాగేసి ఆమె కోరుకున్న విధంగా జన్మ సాఫల్యాన్ని కలిగించాడు.

*సీ. "మేల్కొన్న తెఱ ( గున మెల్లన కనువిచ్చికె ( గంట ( జూచుచు గిదికి నీల్గి*
*యావులించుచు ( జేతులాదరంబున ( జూచియొది ( గిలి యా ( కొన్న యోజమా ( ది*
*బిగిచన్ను ( గవ ( గేల ( బీడించి కబళించి గ్రుక్క గ్రుక్కకు గుటుగుటుకు మనుచు*
*నొక రెండు గ్రుక్కల నువిద ప్రాణంబులు సైతము మేనిలో సత్త్వమెల్ల'"*

*తే. "ద్రావెనదియును గుండెలు దల్లడిల్ల (*
*జిమ్మ ( దిరుగుచు నిలువక శిరము వ్రాల*
*నితర బాలుర క్రియవాడ వీవుగావు,*
*చన్ను విడువుము చాలు ననుచు"*[256]

గిలగిలలాడి (స్వస్వరూపంతో) రాక్షస స్వరూపం బయటపడి ఆర్తనాదంతో నేల కూలిపోయింది.

ఈమె పూర్వ జన్మలో బలిచక్రవర్తి కుమార్తె రత్నమాల. వామన మూర్తిని చూచి ఇతడు తనకు పుత్రుడయితే తన జన్మ సాఫల్యం చెందినట్లుగా భావించిందని. అందువల్లనే (అనంతర జన్మలో) ద్వాపరయుగంలో పూతన రూపంలో అవతరించి పరమాత్మతో క్షణకాలం మాతృత్వ సంబంధమేర్పడి నట్లుగా గర్గ భాగవతం తెలియజేస్తుంది.[257]

## పూతన స్వస్వరూపం

విశ్వాత్మకే విషమిచ్చిన రాక్షసి భయంకరమైన మంటల లోపల రేగి నిలువలేక కళ్ళు, కాళ్ళు, చేతులు వంకరలు తిరిగి గ్రుడ్లు వెళ్ళుకు వచ్చి అంతకంత కధికమై ఆర్తనాదంతో నేలకూలి పోయింది. కొండవంటి శరీరం కల రాక్షసి పూతన ఆర్తనాదాలు దిక్కులన్నిటా ప్రతిధ్వనించింది. గోపకులు స్పృహ తప్పిపడిపోయారు. క్రూరురాలు, నీచురాలైన ఆపూతన శరీరం నేలమీద పడి కొట్టుకోవటం వల్ల ఒకటిన్నర యోజనాలమేర చెట్లన్నీ నుగ్గు నుగ్గు అయ్యాయి.

ఆ రాక్షసి కోరలు నాగేటి కొయ్యంత ఉన్నాయి. పర్వత గుహల వంటి ముక్కు రంధ్రాలు. రాతి బండలవంటి వక్షోజాలు. గాలికి రేగుతున్న ఎర్రటి వెంట్రుకులు. చీకటి నూతుల కన్న లోతైన కన్నులు. పెద్ద దిబ్బ అంతటి విశాలమైన పిరుదులు, పొడవైన కాలువ కట్టల వంటి పాదాలు, తొడలు, చేతులు, నీరు ఇంకిపోయిన చెరువు వంటి కడుపు. ఆరుక్రోశముల పొడవుగా, భీకరంగా ఉంది. పూతన కళేబరం భయంకరంగా కన్పించింది.

## పూతనముక్తి

శుకమహర్షి పరీక్షిత్తుతో శ్రీకృష్ణుడు పూతన ప్రాణాలతో పాటు శరీరంలో మాలిన్యాన్నంత టిని త్రాగివేశాడు. పూతన కళేబరం తగలబడుతుంటే అగరు సువాసనలు వెదజల్లాయి. శ్రీహరి, చనుబాలు త్రాగటంతో ఆ రాక్షస స్త్రీ పరమగతికి చేరుకుంది. శ్రీకృష్ణ పరమాత్మ స్పర్శే ఆమెను పునీతం కావించి భాగవతోత్తముల చరిత్రలో నిలబెట్టింది.

*ఆ. "పొగిలి పొగిలికాలు మగువదేహంబున*
*నగురు పరిమళముల పొగలు వెడలె*
*దేహక ల్మషములు శ్రీహరి ముఖమున'*
*ద్రావ'బడుట జేసి భూవరేణ్య!"* [258]

*క. "హరిదన మీ ( దం బదములు (*
*గరములు నిడి చన్ను ( గుడిచి కదిసిన మాత్రన్*
*హరిజనని పగిది ( బరగతి*
*కరిగెను దురితముల ( బాసి యసురాంగన యున్"* [259]

## 11. ఉష

*సీ. "ఆదానవేశ్వరునను ( గు ( గూతురు నుషాకన్య విమల సౌజన్య ధన్య*
*రూపవిభ్రమ కళారుచిరకోమల దేహ యతను నాఱవ బాణమన'గ నొప్పు*
*సుందరీరత్నంబు నిందునిభానన యలినీలవేణి పద్మాయతాక్షి*
*యొకనా'డు రుచిర సౌధోపరివేదికా స్థలమున మృదుశయ్య నెలమి ( గూర్కి"*

*తే. మున్నదన చౌలనెన్న ( డు వినని యత ( డు (*

*గన్నులారంగ ( దా ( బొడగన్న యత ( డు (*

*గాని యసమాన రూపరేఖావిలాస*

*కలితుననిరుద్ధు నర్మిల ( గవసి నటులు"*[260]

నిత్య శివపూజాదురంధరుడైన బాణాసురుని ముద్దుల కుమార్తె ఉష. ఈమె గొప్ప సౌందర్యవతి. సద్గుణవతి. చంద్రముఖి, నీలవేణి, పద్మనేత్ర. ఈమె స్వప్నంలో అసమాన సౌందర్యవంతుడైన అనిరుద్ధునితో సుఖించినట్లు కలకన్నది.

## స్వతంత్రురాలు

కలలో చూసిన రాజకుమారుని కోసం తన చెలికత్తె చిత్రరేఖ సహాయంతో అతనిని తన అంత:పురానికి రప్పించుకొంది.

చిత్రరేఖ యోగవిద్యా నైపుణ్యంతో నిద్రలోనున్న అనిరుద్ధుని ఎత్తుకొని మనోవేగంతో శోణపురం చేరి బాణాసురుని కూతురైన ఉషాసుందరి పాన్పుపై అనిరుద్ధుని పడుకోబెట్టి ఉషాబాలతో నీ హృదయచోరుడు చూడుమని చూపించింది. రుక్మిణీ శ్రీకృష్ణుల పౌత్రుని ఈ విధంగా ఒక యువరాణి చెలికత్తె తీసుకురావటం వింత. ఈ వింత కంటె మించింది మరొక విశేషం. అర్ధ నారీశ్వరునే కుటుంబ సమేతంగా తన వాకిట నిలబెట్టగలిగిన బాణాసురుడు తన తండ్రి అని తెలిసి కూడ తండ్రికి తెలియకుండా అనిరుద్ధునికి జీవితాన్ని పంచి, అంత:పురంలో మూడవ కంటికి తెలియకుండా వివాహానికి పూర్వమే గర్భం దాల్చింది.

అంత:పుర కావలి వారు ఉషాబాల సంగతి బాణాసురునికి తెలియజేశారు. బాణాసురుడు అనిరుద్ధుని నాగపాశ బద్ధుని కావించాడు.

ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు నారదుని ద్వారా విని బాణాసురునిపై యుద్ధానికి రాగా, భక్త వత్సలుడైన బోళా శంకరుడు శ్రీకృష్ణునితో యుద్ధం చేస్తాడు. సమ్మోహనాస్త్రంతో చక్రధారి శూలపాణిని నిద్రపుచ్చి రాక్షస సైన్యాన్ని హతమార్చాడు.

బాణాసురుడు రెండవసారి యుద్ధానికి రాగా శ్రీకృష్ణుడు చక్రాయుధం ప్రయోగించాడు. శంకరుడు పురుష సూక్తంతో శ్రీకృష్ణుని స్తుతించాడు. శంకర ప్రార్ధనను మన్నించి శ్రీకృష్ణుడు బాణునికి నాలుగు చేతులను మిగిల్చి మిగిలిన బాహువులను ఖండించాడు.

సుదర్శన చక్రంతో బాహుఖండన జరిగి అహంకార మణగిన బాణుడు గోవిందుని పాదారవిందాలను అభివందనం చేసి ఉషానిరుద్ధులకు సంతోషంతో వస్త్రాభరణాదులనిచ్చి, దాసీ జనులను తోడిచ్చి మేలైన పదార్థాలను అరణంగా ఇచ్చి అత్యంత భక్తితో సమర్పించాడు.

మురాంతకుడైన శ్రీకృష్ణుడు సంతోషంతో త్రిపురాంతకుడైన శివునిచెంత సెలవు తీసుకొని బాణాసురుని అచటనే నిలిపి అత్యంత వైభవోపేతంగా పరివార సమేతుడై అనిరుద్ధుని ముందిడుకొని పటహకాహళ తూర్యాదులు ధ్వనులు దిక్కులు పిక్కటిల్ల చేస్తుండగా ద్వారకా నగరానికి బయలుదేరాడు.

శ్రీకృష్ణుని విజయగాధల్లో ఉషానిరుద్ధుల కథ ఒకటి. ఉష సకల సద్గుణ సంపన్నురాలు. తన స్వప్న వృత్తాంతాన్ని స్వంతం చేసికొన ప్రయత్నించి సఫలీకృత అయిన స్త్రీ. ప్రవృత్తిలో తండ్రికి మించిన తనయ. ప్రవృత్తిలో తండ్రికి మించిన తనయ. తనకు తోచినట్లు, తనకు నచ్చిన దాన్ని తాను పొందాలనే ప్రగాఢ వాంఛ కలిగిన స్త్రీ. దానికై రాబోవు ఆటంకాలను కూడ లెక్కచేయని ధీర వ్యక్తిత్వం ఈమెది. ఈమె అనిరుద్ధుని కోరుకొని రప్పించుకోవటం వల్ల స్థితిలయకారులైన శ్రీకృష్ణుడు శంకరులకే యుద్ధం తప్పలేదు. శ్రీకృష్ణ తనయుడైన ప్రద్యుమ్ననకు, శంకర తనయుడైన కుమారస్వామికి యుద్ధం జరిగింది. ఈమె సంకల్పబలం కల్గిన స్త్రీ. ఘోరయుద్ధం తటస్థించినా, ప్రముఖులకు ప్రాణనష్టం లేకుండా రాజీపడి కథ సుఖాంతమయింది. ఈమె రాక్షస జాతి స్త్రీ అయినప్పటికి దేవాది దేవుడైన శ్రీకృష్ణదేవుని పాత్రుని పతిగా పొందిన ధన్యురాలు. స్వప్నసాకారం చేసికొన్న అదృష్టవంతురాలీ మహిళ.

## 12. చిత్రరేఖ

బాణాసురుని మంత్రియైన కుంభాండకుని కుమార్తె బాలచంద్రరేఖను మించిన సౌందర్యవతి. ముఖ కాంతిచేత జయించగలది. బాణాసురుని తనయ ఉషాకన్యకి బహిఃప్రాణం చిత్రరేఖ.

*తే. "బలి తనూభవు మంత్రి కుంభాండు తనయ,*

*తన బహిః ప్రాణమిది యన ( దనరునట్టి*

*కామినీమణి ముఖ పద్మకాంతి విజిత*

*శిశిర కర చారు రుచిరేఖ చిత్రరేఖ"* [261]

ఈమె సున్నిత మనస్కురాలు. ఉషాబాల ముఖ కవళికలను బట్టి ప్రణయ విరహంతో తన మిత్రురాలు తపించి పోతున్నదన్న విషయాన్ని గుర్తించి, ఉషాకన్యకుండే అసలు విషయం తెలుసు కొంటుంది.

చిత్రరేఖ ఉషాకన్యకు రాజులందరిని చూపించి, వారి చరిత్రలు తెలియచేయటం వల్ల ఆనాటి రాజుల చరిత్ర చిత్రరేఖకు సర్వవిదితమన్న విషయం అభివ్యక్త మవుతుంది.

ఈ చిత్రరేఖ యోగవిద్యా నైపుణ్యంతో దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని పౌత్రుడు అనిరుద్ధుని నిద్ర మేల్కొనకుండా ఎత్తుకొని మనోవేగంతో శోణపురం చేరి బాణాసురుని కూతురైన ఉషాసుందరి పాన్పుపై అనిరుద్ధుణ్ణి పరుండబెట్టి తన స్నేహధర్మాన్ని చూపింది.

ఈ చిత్రరేఖ (మంత్రి కుమార్తె)కు ఉషాకన్య నీటిలో జాడలు తీయగల నేర్పుగలదానివని అభినందించింది.

*సీ. "అతివ! నీ సాంగత్యమను భానురుచి నాకు ( గలుగుట ( గామాంధకారమడగె (*

*దరళాక్షి! నీ సఖిత్వంబను నావచే ( గడి ( ది వియోగాబ్ధి ( గడవ ( గంటి*

*నబల! నీయను బంధమను సుధావృష్టిచే సంగజ సంతాప మార్ప ( గంటి*

*వనిత! నీ చెలి తనంబను రసాంజనముచే నా మనోహర నిధానంబు ( గంటి"*

*తే. గలల ( దో ( చిన రూపు గ్రక్కన లిఖించు,*

*వారునౌనన్న ( దొడ్డెచ్చు వారు గలరె!*

*నటిలో జాడ ( బుట్టించు నేర్పునీక*

*కాకగల్గునె మూ ( డు లోకములయందు"* [262]

చిత్రరేఖ సాంగత్యం సూర్యకాంతి వంటిదని, వియోగసముద్రాన్ని దాటడానికి చిత్రరేఖ స్నేహం ఓడవలె తనకు ఉపకరించిందని, చిత్రరేఖ మైత్రి అమృత వర్షం వంటిదని. మైత్రి అనే అంజనంతో

తన ప్రియుడనే నిధిని కనుగొందని, ఏ లోకంలో అయినా కలలో కన్పించిన ఆకారాన్ని చిత్రపటంలో చిత్రించేవారు ఉండవచ్చేమోగాని అవునని అనగానే అతనిని తీసుకు రాగలిగేవారు ఉండరని ప్రశంసల జల్లులతో ముంచింది.

మైత్రీ విషయంలో చిత్రరేఖ సమున్నతమైన పాత్ర పోషించి భాగవత స్త్రీలలో ఉషాచిత్ర రేఖల మైత్రి అపూర్వం, అద్భుతమన్పించింది.

## 2.1.3.10. సర్పజాతి స్త్రీలు

### 1. నాగాంగనలు

సర్పరాజైన కాళీయుని భార్యలు వీరు. తాండవ కృష్ణుని ధాటికి కాళీయుని పడగలన్నీ చితికి పోయాయి. చచ్చినవాని వలె పడి ఉన్నాడు కాళీయుడు. దిక్కు తెలియక వికల మనస్కులై కాళీయుని భార్యలు బిడ్డలను ముందిడుకొని అనన్య శరణాగతి చేసారు. కాళీయుని శిక్షించటం శ్రీకృష్ణుని వీరత్వంగా కొనియాడారు. శ్రీకృష్ణుడు జగద్రక్షకుడని శత్రుమిత్రులలో సమభావన కలవాడని ప్రస్తుతించారు. ఈ ప్రస్తుతి వల్ల ఈ నాగాంగనల పరతత్త్వజ్ఞానం వెల్లడయింది.

సర్పజాతికున్న చెడు లక్షణాలను (విషం, తీవ్రకోపం) అంగీకరించి, తగిన శిక్ష విధించినట్లుగా భావించటం వల్ల కాళీయుని భార్యలైన ఈ నాగాంగనలు ఆత్మపరిశీలన కలవారని వ్యక్తమవుతుంది.

ఈ నాగాంగనల్లో వివేకం, విచక్షణ, ఆత్మజ్ఞానం సంపూర్ణంగా ఉన్నట్లు తోస్తుంది. శ్రీకృష్ణుడు తమ భర్తపై తాండవం చేయటం, తమ భర్త కాళీయుడు చేసిన పుణ్యంగా భావించారు.

*ఉ. "ఎట్టి తపంబు సేసె నొకొ? యెట్టి సుకర్మము లాచరించెనో?*
*యెట్టి నిజంబు పల్కెనొకొ? యీఫణి పూర్వ భవంబునందు ము*
*న్నెట్టి మహానుభావులకు నెన్న (డు జేరువగాని నీవు నే(*
*డిట్టి వినోదలీల (దలకెక్కి నటించెద వీ ఫణీంద్రుపై"*[263]

కాళీయుడు ఎంతో పుణ్యం చేసాడు. అందువల్లనే నీ పాదపద్మాలు శిరస్సు తాకే భాగ్యం పొందాడన్నారు. కాళీయుడు ఏ తపస్సు చేయకుండానే నీ పాదస్పర్శ పొందాడు. నీ పాద స్పర్శ పొందినవారు ఇక ఏ పదవిని కోరుకొనరు. ఎవ్వరూ పొందలేని నీపాదస్పర్శ ఈ సర్పరాజు పొందాడు. సర్వసాక్షి నిర్మలాత్ముడైన శ్రీకృష్ణుని అనంత స్వరూప తత్త్వాన్ని స్తుతించి నమస్కరించారు నాగాంగనలు. ఈ సృష్టి రహస్యాన్ని తెలియజేసి, సృష్టి సంకల్పం సృష్టి రెండూ నీవేనని నమస్కరించారు. (672 పద్యం నుండి 689 పద్యం వరకు 18 పద్యాల్లో) విశ్వాత్మ శ్రీకృష్ణుడని గ్రహించి, స్తుతించి పతిభిక్ష పెట్టమని

*శా. "బాలుండీత ( డు మంచివా ( డనుచు, జెప్పన్ రాము క్రూరుండుదు*

*శ్శీలుండౌనవునైన నేము సుభగ శ్రీ ( బాసి వైధవ్యదు*

*ష్టాలంకారము ( బొంది నోడెద మనాథాలాపమాలింపవే?*

*చాలున్ నీపద తాండవంబు, పతి భిక్షం బెట్టి రక్షింపవే"?* [264]

ప్రార్ధించిన విధానాన్ని పరిశీలిస్తే నాగాంగనలు అంటే కాళీయుని భార్యలు సర్వరూపాల్లో ఉన్న బ్రహ్మ జ్ఞానులు అందువల్లనే పరబ్రహ్మ శ్రీకృష్ణుడని గుర్తించి, ప్రార్ధించి ఈ చరాచర సృష్టి రహస్యాన్ని తెలియచేసి వారికి ప్రాణప్రదుడైన కాళీయుని ప్రాణాన్ని ప్రసాదించి మాకు మళ్ళీ కల్యాణం కల్పించి మమ్ములను చల్లగా రక్షించమని ప్రార్ధించారు.

*ఆ. "మమ్ము ( బెండ్లిసేయు మా ప్రాణవల్లభు (*

*ప్రాణమిచ్చికావు భక్త వరద!*

*నీవుసేయు పెండ్లి నిత్యంబు భద్రంబు (*

*చిన్ననా ( టి పెండ్లి పెండ్లి గాదు"* [265]

చిన్నవాడు మాకు జరిగిన పెండ్లి పెండ్లికాదు. కాళీయుని ప్రాణాలతో వదిలపెట్టి మాకు నీవుచేసే పెండ్లి శాశ్వతం శుభకరమైందని పలికారు.

తమ భర్త తరపున నాగాంగనలు భగవంతునికి ఒట్టు పెట్టి కాళీయుడు నీవు చెప్పినట్లు నడచుకుంటాడని విన్నపం చేసారు. కొన్నివేల దివ్య సంవత్సరాలు తపస్సుచేసిన ఋషులకు కూడ కలుగని బ్రహ్మజ్ఞానం ఆ కాళీయుని భార్యలైన నాగాంగనల్లో కన్పిస్తుంది. ఈ నాగాంగనలు సర్పజాతి వారైనా వీరిలో జ్ఞానసంపదకు జ్ఞానులైన, పురుషులైనా, వీరి బ్రహ్మజ్ఞానానికి ధార్మిక ప్రవర్తనకి తలవంచి నమస్కరించాల్సిందే. "గుణా: పూజాస్థానం గుణిషు నచలింగం నచ వయ:" అన్న భవభూతి ఊరకే అనలేదు,

గోపాలకృష్ణుడు తాండవ కృష్ణుడై కాళీయుని, కాళీయుని పత్నులైన నాగాంగనల ప్రార్ధనను స్వీకరించి వారి భక్తికి శాశ్వతత్వాన్ని చేకూర్చాడు.

## 2.1.4. యశోదాదేవి (వైశ్య జాతి మూడవ జాతి)

ఈమె నందుని పత్ని. ఈమె మైమరచి హాయిగా నిద్రిస్తున్న సమయంలో విశ్వాత్మ శిశు రూపంలో ఈమె ప్రక్కకు చేరాడు. ఇంతకంటే అదృష్టం ఏ స్త్రీకైనా త్రిభువనాల్లో ఉంటుందా? ఉండదు కాక ఉండదు. మరి యశోదా దేవి అంత పుణ్యాత్మురాలు.

యశోదాదేవి కన్నులు కమల దళాల వంటి కన్నులు. అలాంటి కన్నులున్న బిడ్డడే పుట్టాడని వ్రేపల్లెలో అందరు అనుకుంటారు. యశోదానందులకు పుట్టిన బిడ్డ యోగమాయ కదా! వ్రేపల్లె అంతా మాయ ఆవరించింది.

నంద కుమారుడు జన్మదినోత్సవాన్ని వ్రేపల్లెలో గోపకులు ఉత్సాహంగా జరుపుకున్నారు. జగన్నాటక సూత్రధారియైన పరమాత్మను పసిరూపంలో పెంచుతున్న యశోద నిరంతరం కంటికి రెప్పలా కాపాడుకుంటున్న భ్రమలోనే జీవిస్తూ, ఆ పరమాత్మ లీలలను దేనిని ఆపలేకపోయింది. కంసుని పనుపున వచ్చిన రాక్షసి కామరూపంలో వచ్చి తన బిడ్డకు పాలివ్వబోతుంటే నివారించింది.

*మ. "వనితా! ముట్టకు మమ్మ! చనుగుడువన్ వల్దమ్మ నీచన్నుమా*
*తనయుండొల్ల ( డు వాసి పొమ్మని యశోదా రోహిణుల్ సీర ( గై*
*కొన కీక్షించుచు మాయ ( బన్ని పెలుచం గోశంబులో వాలు మె*
*ల్పున రాజిల్లుచు మాట మెత్త ( దనమున్ లోవా ( డి యున్నేర్పడన్"*[241]

విశ్వాత్మ (సృష్టికార్యం) అవతార కార్యానికి శ్రీకారం చుట్టాడు. విశ్వగర్భుడు విశ్వమంతా నోరుతెరచి చూపించినా మరల మాయలోనే ఉండేది, తన బిడ్డను తానేదో దండించి దారిలో పెట్టాలనే భ్రమలో ఉండేది. అదీ మాయే తను తల్లిగా దిష్టితీసి రక్ష కట్టటం ఇలాంటి జాగ్రత్తలు చేస్తుండేది.

పరమాత్మే పసివాడై తన ఒడిలో పెరిగిన పుణ్యాత్మురాలి పుణ్యం గురించి వేరే చెప్పాలా' పరీక్షిన్మహారాజు శుక మహర్షితో

*ఆ. "జగదధీశ్వరునకు ( జన్నిచ్చుతల్లిగా,*
*నేమినోము నో ( చె నీయశోద!*

*పుత్త్రు ( డనుచు నవని ( బోషించు తండ్రిగా,*

*నందు ( డేమి సేసె నందితాత్మ"* [242]

జగత్ప్రభువుకే పాలిచ్చి పెంచే తల్లిగా జన్మించడానికి ఈ యశోదాదేవి వెనుకటి జన్మలో ఏ నోములు నోచిందో ? శ్రీహరిని పోషించే తండ్రిగా పుట్టడానికి నందగోపుడు ఏ తపస్సులు చేశాడు! అంటాడు.

## పూర్వజన్మ వృత్తాంతం

యశోదానందుల పూర్వజన్మ వృత్తాంతాన్ని శుకమహర్షి పరీక్షిత్తుకి తెలియజేస్తారు.

పూర్వజన్మలో నందగోపుడు వసువులనే దేవతల్లో ద్రోణుడు. యశోద ధరాదేవి. వీరిరువురు బ్రహ్మదేవుని ఆదేశానుసారం భూమిపై జన్మిస్తామంటారు. బ్రహ్మదేవుడు అలాగేనని అంగీకరిస్తాడు.

శ్రీహరి కూడ బ్రహ్మదేవుని మాట మన్నించి ఆ దంపతులను తల్లిదండ్రులుగా మన్నించి గౌరవిస్తాడు. శ్రీకృష్ణుని బాల్య చేష్టలతో యశోద పరమాత్మ తత్త్వాన్ని గ్రహించిందన్న సత్యాన్ని వెల్లడిస్తుంది.

*క. "పట్టిన ( బట్టువడని నిను (*

*బట్టెదనని చలము గొనిన ( బట్టుటబెట్టే!*

*పట్టువడ వండ్రు పట్టీ!*

*పట్టు కొనన్ నాకు ( గాక పరులకు వశమే?"* [243]

బాలకృష్ణునికి యశోదే తల్లి కాగలిగింది. మరి ఆ శ్రీకృష్ణుని పట్టుకొనే అదృష్టం ఆమెకే లభించింది. యశోద శ్రీకృష్ణుని పట్టుకోవటానికి నీవు ఎక్కడెక్కడ తిరుగుతావని ప్రశ్నిస్తూ దశావతారాలను తెలియచేసింది.

*సీ. "తోయంబులివియని తొల ( గక చొచ్చెదు, తల ( చెదు గట్టైన దరల నెత్త*

*మంటితో నాటలు మానవు కోరాడె దున్నత స్తంభంబులూప ( బోయె,*

*దన్నుల కల్పంబులడుగంగ ( బాటెడు, రాచవే ( టల, జాలఅవ్వదెచ్చె,*

*దలయవు నీళ్ళకు నడ్డంబు గట్టెదు, ముసలిపై హరివృత్తి మొనయ ( జూచె"*

*ఆ. "దంబరంబు మొలకు నడుగవు తిరుగెద,*

*వింక (గల్కి చేతలేల పుత్త్ర!*

*నిన్ను వంప వ్రాల్ప నేనేరననియొ,*

*నీవిట్టుక్రిందు మీ (దు నెఱు (గ కునికి"[244]*

ఎన్ని అవతారాలెత్తినా, భగవంతుడు సర్వాంతర్యామి అయినా ప్రేమకు దాసుడు, పుత్రవాత్సల్యంతో యశోద ప్రేమకు మురిసి హాయిగా పాలు త్రాగి పరుండి ఈ లోకంలోని స్త్రీలకు యశోద ద్వారా మాతృత్వ శక్తి మహిమని తెలియచేసాడు.

పరమాత్మతో వ్యంగ్యంగా హాస్యమాడే అదృష్టం ఏతల్లికి వస్తుంది. ఎన్ని తపస్సులు చేయాలి. ఎన్ని నోములు నోచాలి. ఆ అదృష్టం ఒక్క యశోదకే లభించింది. శ్రీకృష్ణునితో యశోద

*క. "వీరెవ్వరు, శ్రీకృష్ణులు గారా?*

*యెన్న (డును వెన్న (గానరంట కదా*

*చోరత్వం బించుకయును,*

*నేరర (ట! ధరిత్రి నిట్టి నియతులు గలరే?"[245]*

పలికిన మాటలను యథార్ధం గావించాడు ఇంచుక కూడ చోరత్వం లేని అపరంధాముడు. గోపికా చిత్త చోరుడయ్యాడు. శ్రీకృష్ణుడు యోగీశ్వరేశ్వరుడు. గోపికలను మధుర భక్తి పేరున మధుర ప్రేమలో ముంచాడు. యశోద వ్యంగ్యంగా పలికిన చోరత్వమనే పదం భావిసూచక ద్యోతక మయింది (16000 రాజ కన్యల మనస్సులను దొంగిలించాడు). యశోద పుణ్యం పడి శ్రీకృష్ణుడు చేతికి చిక్కాడు.

*క. "చిక్క (డు సిరికౌ (గిటిలో*

*జిక్క (డు సనకాది యోగి చిత్తాబ్జములం*

*జిక్కండు శ్రుతిలతికావలి (*

*జిక్కెనత (డు లీల (దల్లిచేతన్ ఱోలన్"[246]*

యశోద తల్లిగా తనను మన్నన చేసే స్థితికి వచ్చే విధంగా శ్రీకృష్ణుని పెంచింది. యశోద బాల రూపుడైన శ్రీకృష్ణుని ఆగడాలను, మంకుతనాన్ని, పేచీలను, ఏడుపును, భయాన్ని, అనంత లీలలను చూసి తల్లిగా తరించింది.

శ్రీకృష్ణ బలరాములు దేవకీ వసుదేవుల పుత్రులని తెలిసి యశోదానందులు దు:ఖించి గొల్ల పెద్దలతో కలిసి వ్రేపల్లెకు వెళతారు. కన్నప్రేమ కంటె పెంచిన ప్రేమ అధికమని యశోదానందుల పుత్ర వాత్సల్యం వల్ల వ్యక్తమవుతుంది.

శ్రీకృష్ణుడు సర్పకాటుకు గురియైనాడని యశోద కూడ కృష్ణునితో పాటే ఆ మడుగులో పడి చనిపోవటానికి సిద్ధమవుతుంది.

భర్తతో పాటు సహగమనం చేసిన స్త్రీలు ఉన్నారు. యుగ యుగాలుగా బిడ్డ చనిపోతే బిడ్డతో పోదామనుకున్న తల్లి యశోద. యశోద శ్రీకృష్ణునిపై ఎంత మమకారం పెంచుకొన్నదో ఈ సన్నివేశాన్ని బట్టి అవగతమౌతుంది. దశమ స్కంధంలో 654వ పద్యం నుండి 659వ పద్యం వరకు యశోదానందుల పుత్రవాత్సల్యాన్ని పోతన సుస్పష్టం చేసాడు. శ్రీకృష్ణుడు లేని లోకం, జీవితం తనకు అవసరం లేదని నిర్ధారించుకున్న మాతృమూర్తి. నవ విధ భక్తుల్లో వాత్సల్య భక్తికి పరాకాష్ఠగా నిలిచింది యశోద. యోగమాయకు జన్మనిచ్చి భూలోకంలో శక్తి అవాహన కావటానికి ఉపకరించిన తల్లి.

యశోద గూర్చి దేవాధి దేవుడు శ్రీకృష్ణుడు అనే గ్రంధంలో శ్రీకృష్ణ చైతన్య సమాజం వారు యశోద వైశ్యజాతికి చెందిన స్త్రీగా చెప్పారు కాని పుర్వాగాధాలహరి మాత్రం యశోదను గోప కాంతగా చెప్పింది. [247]

## 2.1.5. అన్యజాతి స్త్రీలు

### గోపికలు

ఒక పున్నమి శరద్రాత్రిలో శ్రీకృష్ణుడు యమునా నదీ తీరంలో బృందావనంలో లోక సమ్మోహితమైన ఒక మోహనగీతం మురళిపై ఆలపించారు. ఆ గాన మాధుర్యానికి బృందావనం లో గోపికలు శ్రీకృష్ణుని వద్దకు వచ్చారు. బలరామ కృష్ణులను చూడటమే తమ కన్నుల ఫలంగా భావించారు.

*క. "ఓ చెలువలారా! విను ( డీ,*

*వాచాపథకంబు లేల? వర్ణింపంగా*

*లోచనముల కలిమికి ఫల*

*మీచెలువుర ( జూడ గలుగుటింతయసుండీ"*[266]

**మధురభావన**

గోపికలు గోపాలకృష్ణుని అరుణాధర సుధను ఆస్వాదిస్తూ వింతమ్రోత లీనుతూ మదించి ఉన్న వేణువు పూర్వమేమి తపమాచరించిందో అని, తాను వేణువుగా పుట్టిన శ్రీకృష్ణుని అధరామృతాన్ని ఆస్వాదించే అదృష్టముండేదని భావించిందొక గోపిక. గోపికలు మురళీగాన లోలుడైన శ్రీకృష్ణునికి మనస్సు అర్పించి ఒకరికొకరు శ్రీకృష్ణుని సన్నిధి ఏ విధంగా చేరాలా? అని తపించి పోయారు. గోపికలే కాదు, ప్రకృతి కూడా పరవశించి పులకించింది లోకోత్తరుడే లోకంలో రూపం దాల్చి రాగాలాపనలో అనురాగ సుధలు చిందిస్తుంటే, ఆ సుధా మాధుర్యం కోసం ముందుగా స్పందించి తపించిన వారు గోపికలు. అందుకనే ఆ గోపికలది మధుర భక్తిగా మన ఆలంకారికులు పరిగణించారు.

ఆ బృందావన గిరుల్లో సంచరించే శ్రీకృష్ణుని పాదాల్లో వజ్రరేఖల జంటలు శ్రీకృష్ణుని అడుదు జాడలతో దేవేంద్ర పట్టణం అమరావతి వైభవంతో బృందావనం ప్రకాశించింది.

*క. "గిరిచర మిధునము లోలిం*

*బరికింప ( గ ( గృష్ణపాదపద్మాంకితమై*

*సురరాజు నగరి కంటెను,*

*దరుణీ! బృందావనంబు దద్దయునొప్పెన్"*[267]

ఈ కందపద్యం శ్రీమన్నారాయణ పరతత్త్వాన్ని చాటి చెపుతుంది. నేటి కాలంలో కూడా శ్రీవెంకటేశ ప్రపత్తిలో స్వామి సేవలో ఈ శ్లోకాన్ని పఠిస్తారు.

*"రేఖామయ ధ్వజసుధా కలశాత పత్ర*
*వజ్రాంకుశాంబురుహ కల్పక శంఖచక్రై: !*
*భవ్యైరలంకృత తలౌ పరతత్త్వ చిహ్నై:*
*శ్రీ వెంకటేశ చరణౌ శరణం ప్రపద్యే "*[268]

గోపికల ఈ క్రింది సంభాషణలను పరికిస్తే, పిల్లన గ్రోవి మధుర గానానికి, ఆకాశ మార్గంలో పోయే దేవతా స్త్రీల మదివశం తప్పుతుందని కన్పిస్తున్నట్లుగా చెప్పుకొనటం గోపికల దృష్టి పథం ఆకాశ దర్శనం చేసే శక్తి ఉన్నట్లుగా తోస్తుంది.

*మ. "అమరేంద్రాంగన లాకసంబున విమానారూఢలై పోవుచుం*
*గమలాక్షున్ శుభమూర్తి ( గాంచి మురళీగానంబు*
*లందంద కర్ణములన్ నిల్చుచు మేకలల్ వదల ( గానాధాంక మధ్యంబులం*
*బ్రమదా! వ్రాలిరి చూచితే వివశలై పంచాశుగ భ్రాంతలై"*[269]

అందువల్లనే ఏడేడు లోకాల వేల్పు వారి సమీపంలో బృందావనంలో మురళీగానం చేస్తున్నాడన్న సత్యాన్ని దర్శించి త్రికరణ శుద్ధిగా హృదయాన్ని అర్పించి తపించారు.

*"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణి:"*

అని ఆర్యోక్తిని ఒక గోపిక మరొక గోపికతో మేకలు మేతలు విడిచి పరవశత్వం పొందిన దేహాలతో ఒడలు మరచి సుతిమెత్తని చూపులను శ్రీకృష్ణునికి బహుమానంగా సమర్పిస్తున్నాయని పలికింది.

*ఉ. "కానల నుండుచున్ సరసగాన వివేక హీన జాతులై*
*వీనులనే ( డు కృష్ణముఖ వేణురవామృత ధార సో ( కినన్*
*మేనులు మే ( తలున్ మఱచి మెత్తని చూడ్కి మృగమ్ముగా వళుల్*
*మానిని! చూడవమ్మ! బహుమానము సేసె ( గృతార్థచిత్తలై"*[270]

ప్రకృతిలో ఉన్న జంతుజాలాన్ని కూడ ఇంత సున్నితంగా పరిశీలించి ఆలోచించగల శక్తిశాలురు గోపికలు.

లేగదూడలు పాల త్రాగటం మాని మాధవుని వేణుగాన సుధాధార వినటంతోనే గంతులు వేస్తూ, తుళ్ళుతూ, పాలు పీల్చక ఊరక స్తనాలు నోట కరచుకొని ఉండటం ఈ క్రింది పద్యంలో ఒక గోపిక ఇతర గోప వనితలకు వర్ణించి చెపుతుంది.

*ఉ. "తల్లుల చన్ను ( బాలు మునుద్రావుతటిన్ దమకర్ణ వీధులన్*

*వల్లభమైన మాధవుని వంశరవామృత ధార సొచ్చినం*

*ద్రుళ్ళక పాలురా ( దివకదూంటక మానక కృష్ణుమీ ( ద దృ*

*గ్వల్లులు సేర్చి నిల్చెనదె! వత్సములంగనలార! కంటిరే!"*[271]

గోవులు మేత మేయడం మాని మాధవుని వేణుగానామృత శ్రవణంతో ఆనంద బాష్పాలు విడుస్తూ చిత్తరువందు (చిత్రపటమందు) చిత్రించిన రూపాలవలె నిశ్చేష్టులై ఉన్నాయని ఒక గోపవనిత మరొక గోప వనితతో ఈ క్రింది పద్యంలో పలికింది.

*మ. "మమతన్ మోములు మీ ( దికెత్తుకొని రోమంథంబు పాలించి హృ*

*త్కమలాగ్రంబుల ( గృష్ణునిల్పి మురళీగానామృత శ్రేణిక*

*ర్ణములం గ్రోలుచు మే ( తమాని గళి తానందాశ్రులై చిత్రితో*

*పములై గోవులు సూచుచున్న వదిగో ( బద్మాక్షి! వీక్షించితే?"*[272]

పిట్టలు చెట్ల కొమ్మలపై చేరి చిత్త చలనం మాని బ్రహ్మ నిష్ఠులైన ముని జనం వలె సొక్కుతున్నాయని

*మ. "జగతీ జంబులశాఖ లెక్కి మురళీ శబ్దామృత స్యందమున్*

*మిగులున్ వీనుల ( ద్రావి ప్రేగు పడి నెమ్మిం గృష్ణురూపంబుచి*

*త్తగమై యుండ ( గ నడ్డపెట్టు క్రియనేత్రంబుల్ దగన్ మూసి యీ*

*ఖగముల్ సొక్కెడి ( జూచితే! మునిజనా కారంబులం గామినీ!"*[273]

బ్రహ్మనిష్ఠులైన మునిజనం ఆపరంధాముని వేణుగానామృతంలో మునిగి పోతారన్న విషయాన్ని గోపికలు చర్చించుకున్నారంటే దేవలోక వాసుల నుండి భూలోక వాసులదాక, ప్రకృతిలోని జీవజాలం నుండి బ్రహ్మ నిష్ఠులదాకా అర్థం చేసుకోగల్గిన దార్శనికత కలవారని స్పష్టమవుతుంది. గోపికలు,

ప్రకృతి పరమాత్మ గానామృతాన్ని ఎలా స్వాగతించిందో పరవశించి ఆనందించిందో వర్ణించటంలో వారికిగల ప్రకృతి పరిశీలనా శక్తి అమేయం.

మాధవుని వేణు నాదానికి నదులు స్త్రీమూర్తులై ఆహ్వానించి పాదసేవ చేసినట్లుగా ఈ క్రింది పద్యంలో గోపిక మరొక గోపికకు చెపుతుంది.

*మ. "క్రమమొప్పన్ నదులెల్ల వంశీరవమాకర్ణించి సంజాతమో*
*హములన్ మన్మథ సాయక క్షత విశాలావర్తలై హంసవా*
*క్యములంజీరి తరంగ హస్తముల నాకర్షించి పద్మోపహా*
*రములంగృష్ణ పదార్చనంబు సలిపెన్ రామా! విలోకించితే?"*[274]

పరమాత్మ పురుషుడు కాబట్టి ప్రకృతిలో నదులు స్త్రీలై మధుర భక్తితో సేవించినట్లుగా వర్ణించటం విశేషం.

శ్రీకృష్ణుని వేణుగానానికి పరవశించిన నీలమేఘం ధవళాత పత్రంగా (తెల్లగొడుగుగా) మారిందని ఒక గోపిక మరొక గోపికతో ఆటవెలదిలో చెప్పింది.

*ఆ. "వనిత! నే ( డు కృష్ణువంశనినదంబు*
*విని పయోధరంబు విరులు గురిసి*
*తన శరీరమెల్ల ధవళాత పత్రంబు (*
*జేసి మింట నీడ ( జేసి ( గంటె"*[275]

ఒక బోయ వనిత నెమలి ఈకల వన్నెగల చీరగట్టి తియ్యని పండ్లు తెచ్చి మాధవునకిచ్చి ఆయన చేయూతనిచ్చి చేర పిలువగా అతని చేతులతో తమ చేతులు కలిపి ఆనందంతో ఆడుతున్నారని ఒక గోపిక మరొక అలరుబోడితో (గోపికతో) చెప్పింది.

*క. "మంచి ఫలంబులు హరిచే*
*నించి కరాలంబనముల నెగడుచునిదె క్రీ*
*డించెద, రంగన! చూడుము*
*చెంచితలం బింఛపత్ర చేలాంచితలన్"*[276]

మరొక బోయవనిత పూలమాలను తెచ్చినట్లు ఒక గోపిక వర్ణించటం వల్ల మాధవుని వేణు గానామృతానికి ఒక గోపికలే కాదు, ఆటవిక స్త్రీలు పరవశించి ఫల పుష్పాలతో సేవించినట్లుగా వెల్లడవుతుంది.

కృష్ణుని మురళీ గానామృతానికి, భూమ్యాకాశాల్లో ఉన్న జీవ జాలమంతా పరవశించిందని ఒక గోపిక మరొక గోపికకు చెపుతుంది.

*క. "గిరులెల్ల జలము లయ్యెం*

*దరులెల్లను బల్లవించె ధరణి గగన భూ*

*చరులెల్లను జొక్కిరి హరి*

*మురళీరవామృతము సో ( క ముద్దియ! కంటె!"[277]*

నభోంతరాళాలను తన వేణుగానంతో చేష్టలుడిగించి, మోహంలో ముంచెత్తిన శ్రీకృష్ణుడే తన పతి కావాలని గోపికలు మార్గ శీర్షంలోని తొలిరోజున శుక్ల పాద్యమినాడు కాత్యాయనీ వ్రతమారంభించారు.

## కాత్యాయనీ వ్రతం

నందుని మందలో ఉన్న గోపకన్యలు వేకువనే నిద్రలేచి కాళిందీనదికి వెళ్ళి స్నానం చేసి నదీ తీరంలో ఇసుకలో గౌరీదేవి ప్రతిమను రూపొందించి, పుష్పాలంకరణ చేసి, గంధం పూసి ధూప దీపాలతో పలు నైవేద్యాలు సమర్పించి కాత్యాయనీ మాతను ప్రార్థించారు.

*క, "ఓ కాత్యాయని! భగవతి*

*నీకున్ మ్రొక్కెదము నేము నే ( దను కంపన్*

*మీ కింద ఱకును వైళమ*

*శ్రీకృష్ణుడు మగ'డు గా ( గ ( జేయుము తల్లీ! "[278]*

శ్రీకృష్ణుని మా అందరికి పతిగా చేస్తే మా వివాహోత్సవం రోజు నేతి వసంతాలాడుతూ పరమ భక్తితో నీకు జాతర చేస్తామని కూడా మ్రొక్కుకున్నారు.

*క. "ఓ తల్లి! మాకు ( గృష్ణుడు*

*చేతో విభుడైన నా ( డు చెలువల మొల్లన్*

*నేతి వసంతము లాడుచు*

*జాతర సేసెదము భక్తిచాతురి తోడన్"[279]*

దైవ నివేదితమైన అన్నం ఆరగిస్తూ ఒక్క నెల కాత్యాయనీ వ్రతం సాగించారు.

## గోపికా వస్త్రాపహరణం

కాత్యాయనీ వ్రతం ఒక నెల సాగించిన తర్వాత గోపికలందరు ప్రాత: కాలంలో మేల్కొని కమలాక్షునిపై పాటలు పాడుతూ యమునా నదీ తీరానికి చేరారు.

కళంకరహితలైన గోపికా స్త్రీలు జంకులేక వివస్త్రలై జలకాలాడటానికి నదిలో ప్రవేశించారు. ఆ గోపికలు ఆనంద పారవశ్యంతో పద్మాక్షునిపై పాటలు పాడుతూ జల క్రీడలాడారు. గోపకన్యల వస్త్రాలను అపహరించి విశ్వవిభుడు, తొలివేలుపు శ్రీకృష్ణుడు కడిమి చెట్టు ఎక్కాడు.

## గోపికల సంభాషణ

వస్త్రాపహారియైన శ్రీకృష్ణునితో గోపికలు

*క. "మా వలువ లాగడంబున,*
*నీవేటికి ( బుచ్చుకొంటి? నీవల్పు ( డవే?*
*నీ వేఱు ( గని దేమున్నది*
*నీవంద ఱిలోన ధర్మనిరతు ( డవు గదే?"* [280]

ధర్మపరుడవైన నీవు అల్లరిమానుమని సూచించారు. వస్త్రాపహరణం వంటి వంచకత్వం తగదని ధీరుడు ధీమంతుడైన పురుషుడెలా ఉండాలో సూచించారు.

*సీ. "బహు జీవనము తోడభాసిల్లి యుండుటో గోత్రంబు నిల్పుటోకూర్మితోడ?*
*మహినుద్ధరించుటో? మనుజసింహంబవై ప్రజల ( గాచుటో కాక బలి ( దెరల్చి*
*పిన్నవై యుండియు ( బెంపు వహించుటో, రాజుల గెల్చుటో రణములందు?*
*గురునాజ్ఞ సేయుటో? గుణనిధివై బలప్రఖ్యాతి ( జూపుటో భద్రలీల?"*

*ఆ. బుధులు మెచ్చ భువి ( బ్రబుద్ధత మెఱయుటో*
*కలికితనము సేయ ఘనత గలదె?*
*వావిలేదు వారి వారు నావారని*
*నెఱు ( గవలదె వలువలిమ్ము కృష్ణ!* [281]

గోపికలు తెలియకుండానే పరమాత్మ దశావతారాలను వర్ణించారు.

కృష్ణా! మా మనస్సులు హరించావు. మా వస్త్రాలు దొంగిలించావు. ఏ విధంగా మమ్ములను బయటకు వచ్చునట్లు చేస్తావో తెలియదు. కొంటె గోపాల! నీ రహస్యం మాకు తెలిసిందని.

*క. "కొంటివి మాహృదయంబులు,*

*గొంటివి మానంబు, లజ్జ ( గొంటివి, వలువల్*

*గొంటి, వి ( కనెట్లు సేసెదో,*

*కొంటెవుగద! నిన్ను నెఱింగి కొంటిమి కృష్ణా!* [282]

గోపికల మాటల్లో శ్రీకృష్ణుని మనస్సు దోచుకోగలిగామన్న అంతరార్థం అవగతమవుతుంది. శ్రీకృష్ణునకు గోపికలపై దయాదృష్టి లేకపోతే వస్త్రాపహరణం చేయాల్సిన పనిలేదు.

గోప కన్యలు శ్రీకృష్ణుని సామదాన భేదాలతో అడిగి చూచి ఇక చేసేది లేక అనన్య శరణాగతి చేసి నీవు ఏమి చెప్పినా చేస్తామని ఎక్కడికి రమ్మన్నా వస్తామని పలికారు. అపుడు శ్రీకృష్ణుడు మీరు ఎవరు పతి కావాలని ఈ కాత్యాయనీ వ్రతం చేస్తున్నారు. సత్యం చెప్పమని, వారిపైనే ఒట్టు పెట్టాడు. నా యింట దాస్యం చేస్తూ నా మాటను జవదాటక మీరు నడచుకుంటామంటే మీ చీరలు మీకిస్తామని అంటాడు.

సాక్షాత్తు అవతార పురుషుడైన శ్రీకృష్ణ భగవానుడే గోపికలు భర్తగా తనను కోరుకున్నారని గ్రహించి నా యింట దాస్యం చేస్తూ నా మాట జవదాటక ఉండమని అడిగాడంటే (కార్యేషుదాసీ)

*క. "నా యింటికి దాసులరై,*

*నా యాజ్ఞ వహించి మీరు నడిచె దరేనిన్*

*మీ యంబరమ్ము లిచ్చెద (*

*దోయంబులు వెడలిరండు తొయ్యలు లారా!"* [283]

ఇక సామాన్య గృహాల్లో స్త్రీల స్థితి (ఏ విధంగా ఉండేదో అర్ధమవుతుంది) దాస్య వృత్తిగా ఉండి ఉంటుంది, ఆ నాటి ఆ స్త్రీలు ఆ పద్ధతినే సంప్రదాయంగా భావించినట్లుగా కన్పిస్తుంది (వైవాహిక జీవితంలో పురుషులు అధికమన్న విషయాన్ని అంగీకరించి ఆమోదించినట్లుగా తోస్తుంది)

శ్రీకృష్ణుని మాటలకు పాపం గోపికలు చేసేది ఏమిలేక అంగీకరించి, నగ్నంగా బయటకి వచ్చి శ్రీకృష్ణునికి నమస్కరించి వలువలు తీసుకున్నారు.

## వ్రతలోపం

గోపికలు కాత్యాయనీ వ్రత నిమిత్తంగా కాళిందీ నదిలో సవస్త్రలుగా స్నానం చేయాల్సింది పోయి వివస్త్రలుగా చేసారు. ఆ వ్రత లోపాన్ని గోపికలకు శ్రీకృష్ణుడు తెలియచేసి, ఆ దోష పరిహారార్థం తనకు నమస్కరించమన్నాడు.

## గోపికల అభిమతం

దయా స్వభావుడైన శ్రీకృష్ణునకు భక్త రక్షణయే లక్ష్యం. మధుర భక్తితో శ్రీకృష్ణుని పతిగా కోరుకున్న గోపకన్యలు శ్రీకృష్ణుని గూర్చి

*ఆ. "చీరలపహరించి సిగ్గులు విడిపించి*

*పరిహసించియైన ( బర ( గ మనకు*

*ఘనుడు నోము కొఱ ( తగాకుండ మ్రొక్కించె,*

*ననుచు హరి నుతించి రబలలెల్ల"* [284]

గొప్పవాడైన శ్రీకృష్ణుడు చీరలు దొంగిలించినా, మన సిగ్గులు, దీసినా, మనసు ఎగతాళిచేసినా, చివరకు వ్రతలోపం జరగకుండా మన వందనాలు అందుకున్నాడంటూ ఆ సుందరులందరూ నంద నందనుణ్ణి అభినందించారు.

గోపికలకు శ్రీకృష్ణుడంటే ప్రాణం. వారి మాటలు, చేష్టలు, మనస్సంతా మాధవుని పైనే. అందుకే కవి లోక సామాన్యమైన విషయాన్ని పఠితలకు గుర్తు చేసాడు. ప్రియురాండ్రకు బాధాకరం కాదు. అదికూడా ఎంతో ఇష్టంగానే ఉంటుందని. ఇలా చెప్పటంలో ఆంతర్యం తోస్తుంది. గోపికలు శ్రీకృష్ణుని నందనందనుడనుకొని, గోకులంలోనే తమతో ఉంటాడని ప్రేమించారు. శ్రీకృష్ణుని భర్తగా పొందవల్సిన వారు 16008 మంది ఉన్నారని వారికి తెలియదు మధురకు వెళ్ళిన తర్వాత ప్రణయ విరహంతో తపించి శుష్కించారు. అది బాధించటం, చీరలెత్తు కెళ్ళి చెట్టు పైకెక్కి వారిని బయటకు నగ్నంగా రమ్మనటం, అపహసించటం, ఇవన్నీ అమాయకులైన గోపికలు వైష్ణవ మాయ తెలియక శ్రీకృష్ణుడు తమ గోకులానికి, తమకే స్వంతమని భావించారు. నవనీత చోరుణ్ణి నిశ్చలంగా అవలోకించారు.

## అనుగ్రహ భాషణం

*సీ. "లక్ష్మణవతులారా! లజ్జించి చెప్పరుగాని మీమర్మముల్ గాన ( బడియె*

*నను ( గొల్వ ( జింతించినారు నా చేతను సత్యంబు మీనోము సఫలమగును*

*గామి తార్థంబుల కలిమి ( జెప్ప ( గనేల? నను ( గొల్వముక్తికి నడవ వచ్చు (*

*గడమకూడ ( గనంబికాదేవి నోమంగనటమీ ( ద రాత్రులయందు మీకు"*

*ఆ, "నన్ను ( బొంద ( గల్గునమ్మి పొందని హరి,*

*పల్కనింతు లెల్ల భ్రాంతి ( జనిరి*

*తపముపండె ననుచు ( దత్పదాంభోజముల్,*

*మానసించు కొనుచు మందకడకు"* [285]

గోపికలకు శ్రీకృష్ణుడు లక్షణవంతులారా! సిగ్గుతో మీరు చెప్పటం లేదు. నన్ను భర్తగా కోరి మీరు కాత్యాయనీ వ్రతమాచరించారు. మీ వ్రతం కూడా నా వల్లనే నెరవేరింది. నన్ను సేవిస్తే కైవల్యమే కరతలా మలకమవుతుంది. ఇక మీరు కోరిన కోరికలు నెరవేరతాయని వేరుగా చెప్పాల్సిన పని లేదు. మీరు గౌరీ వ్రతం సమాప్తి చేయండి. అనంతరం రాత్రులందు మీరు నన్ను పొందగల్గుతారని అంటాడు. గోపికలు తమనోము ఫలించిందని ముకుందుని చరణార విందాలు ధ్యానించుకుంటూ ఆనందంగా వ్రేపల్లెవాడకు వెళ్ళిపోయారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవటానికి ఒక శరద్రాత్రిలో శ్రీకృష్ణుడు జగన్మోహనంగా ఒక గీతం పాడాడు.

## సమ్మోహితులు

శ్రీకృష్ణుని వేణుగానం చెవిని సోకగానే గోకులంలో స్త్రీలు ఉన్నవారు ఉన్నట్లు ఎవరు అడ్డగించినా ఆగక నందనందనుని సందర్శనానికి వెళ్ళారు.

కొందరు సుందరాంగులు ధైర్యం చాలక నందనందనుని వద్దకు వెళ్ళలేక విరహాగ్నితో తపించి, మనస్సులోనే రమాపతిని పతిగా నెంచి

*మ. “తరుణుల్ గొందఱు మూలగేహముల నుద్దండించి రారాకత*
*ద్విరహాగ్నిం బరితాపమొందుచు మనోవీధిన్ విభున్ మాధవుం*
*బరిరంభంబులు సేసి జారు ( డనుచున్ భావించియుం జొక్కిపొం*
*దిరిముక్తిన్ గుణదేహముల్ విడిచి ప్రీతిన్ బంధ నిర్ముక్తలై’*[286]

త్రిగుణాత్మకమైన శరీరాన్ని వదలి ముక్తి పొందారు.

## శ్రీకృష్ణుని హితవు

నందనందనుని సందర్శనానికి వచ్చిన గోపికలను శ్రీకృష్ణుడు కుశలమడిగి ఈ రాత్రి సమయంలో ఎందుకు వచ్చారు? ఈ ప్రదేశంలో తిరుగకూడదని నీతులు చెప్పటంలో

*శా. “మీరేతెంచిన జాడ ( గానక వగన్ మీ తల్లులుందండ్రులున్*
*మీరాముల్ మఱ ( దుల్ తనూజులుగురుల్ మీ సోదరుల్ బంధువుల్*
*మేరల్ మీఱిరి లేరు పోయిరనుచున్ మీ ఘోష భూభాగమం*
*దేరీతిం బరికించిరో తగవులే యీ సాహసోద్యోగముల్”*[287]

వివాహం కాని గోపికలే కాక, వివాహిత గోపికలు కూడ ఏతించినట్లు తెలుస్తుంది.

ఇంటి మర్యాద బుగ్గిలో కలిపి, మగలను సిగ్గులపాలు చేసి, అత్తమామలకు పరితాపం కల్గించి తోబుట్టువుల పరువు దీసి, తల్లిదండ్రుల ఆశలు అడియాశలొనరించి, బంధువులకు రోత పుట్టిస్తూ, మారు మగలమీది కోరికతో

*“సత్కులాంగనలు వత్తురె? లోకులుసూచి మెత్తురే?”*

అని శ్రీకృష్ణుడు అడగటం వల్ల శ్రీకృష్ణుని వేణు గాన మాధుర్యానికి గోకుల స్త్రీలు వివశలైనట్లు అభివ్యక్తమవుతుంది. ధర్మ రక్షణార్థం అవతరించిన శ్రీకృష్ణుడు ధర్మగీత దాటలేదు. ధర్మావతారుడైన శ్రీరామచంద్రునే తలపిస్తున్నాడు.

గోపికలు శ్రీకృష్ణుని కోరి వెళ్ళారు. సకల ప్రాణులు పరమాత్మ చెంతచేరాలనే ప్రయత్నిస్తారు. సకల ప్రాణులు నాకు ప్రియమైనవే మీరు కూడ ప్రియమైన వారే కాని మీరిచట నిలువకూడదని గోపికలకు హితవుపలికాడు.

## శ్రీకృష్ణుని దివ్యత్వం

తన వేణుగానానికి పరవశించి ఇల్లు వదలి ఏతెంచిన గోపస్త్రీలను మందకు (ఇళ్ళకు) వెళ్ళమని శ్రీకృష్ణుడు పలికాడు గోపస్త్రీలకు హితకరమైన ప్రియంగాని శ్రీకృష్ణుని పలుకులు విని గోప స్త్రీలు

*మ. "అకటా! నమ్మితి మేము, క్రూరు ( డన నిన్నర్హంబె? మాయిండ్లలో*
*సకల వ్యాప్తుల డించి నీ పద సరోజాతంబు లర్చింప'జి*
*క్కక యేతెంచెతి మీశు ( డాఢ్యు ( డవు, మోక్షాసక్తులంగాచుపో*
*లిక ( గావందగు, గావవే? విడువ మేలే కాంతలన్ భ్రాంతలన్"* [289]

భవబంధాలను త్రెంచుకొని ఎవరికి చిక్కక సర్వానికి ప్రభుడవు నీవని, ఆది పురుషుడవు అయిన నీ వల్ల భ్రాంతిపడి వచ్చిన ఈ ఆడపడుచులను ముముక్షువులను సంరక్షించే విధంగా సంరక్షించ దగిన వాడవు. స్వామీ! మమ్ము కాపాడమని వేడుకున్నారు.

దేహధారియైన నీయందే పతిపుత్ర! బంధువుగా కనిపించే నీయందే కోరిక తీర్చు కోవటం నిన్ను గౌరవించటమే. ధర్మవేత్తవు యోచించి చెప్పవలెనని గోపస్త్రీలు ప్రశ్నించారు.

*మ. "పతులన్ బద్దల బంధులన్ సతులకుం బాటించుటేధర్మప*
*ద్ధతి యౌనంటివి, దేహధారిణులకున్ ధర్మజ్ఞ! చింతింపుమా,*
*పతి పుత్త్రాదిక నామ మూర్తి వగుచున్ భాసిల్లు నీయందు ( ద*
*త్పతి పుత్త్రాదిక వాంఛలన్ సలిపి సంభావించు టన్యాయమే?"* [290]

గృహధన పుత్రులకంటె నీవు సకల ప్రాణులకును ప్రియమైన వాడవు. శాస్త్ర నిపుణులైన వారు ఆత్మ భూతుడవైన నీయందే ఆసక్తి చూపుతారు. నీవు కరుణకు పెన్నిధివి, మా సంతాపాన్ని పోగొట్టుమని ఈ క్రింది పద్యంలో పలికారు.

*"నీపయిన్ రతి సేయు చుందురు నేర్పరుల్, సతతప్రియో*
*ద్దీప కుండవు, గాన నెవ్వగ ( దెచ్చునాథ సుతాదులం*
*జూప నేటికి? మన్మహాశలు సుట్టి నీకడ నుండ'గా'*
*బాపనేల? మదీయతాపము ( బాప ( బోలు కృపానిధీ"* [291]

**గోపీ జనచిత్త చోరుడు**

*సీ. "నీ పాద కమలంబు నెమ్మిడగ్గఱ ( గాని తరలి పోవంగ ( బాదములురావు*

*నీకరాబ్జంబులు నెఱినంటితివ ( గాని తక్కిన పనికి హస్తములు సొరవు,*

*నీవాగమృత ధారనిండ ( గ్రోల ( గ ( గాని చెవులన్యభాషలు చేరివినవు*

*నీ సుందరాకృతి నియతి ( జూడ ( గ ( గాని చూడ వన్యంబుల ( జూడ్కికవలు"*

*ఆ. "నిన్నెకాని పలుకనేరవు మాజిహ్వ*

*లొల్లననుచు ( బలుకనోడ వీవు*

*మా మనంబు లెల్ల మరపించి దొంగిలి,*

*తేమి సేయువారమింత ( ? గృష్ణ!"* [292]

కృష్ణా! నీచరణ పద్మాలను సంప్రీతితో చేరటానికే మా కాళ్ళు ఉన్నాయి, నీ హస్త కమలాలను పట్టుకోవటానికే మా చేతులు, నీవచన సుధారసం ఆస్వాదించటానికే మా చెవులు. నీ మనోహరాకారం చూడటానికే మా నేత్రములు. నీ నామ గుణాలను ఉచ్చరించటానికే మా నాలుకలు. మా మనస్సులను మురిపించి అపహరించావు. ఇప్పుడు మమ్ము విడనాడితే మేమేమి చేయగలమని ప్రశ్నించారు. తమ మానసములు హరించిన శ్రీకృష్ణుడినే దోషిగా నిర్ధారించారు.

**దాస్యభక్తి**

*చ. "సిరికి సుదార చిహ్నములు సేయు భవచ్చరణారవిందముల్*

*సరసిజనేత్ర! మా తపము సంపద ( జేరితిమెట్టకేలకున్*

*మరల ( గ లేము మామ గల మాట లనొల్లము, పద్మ గంధముల్*

*మరగిన తే ( టు అన్య కుసుమంబుల చెంతను జేర నేర్చునే"* [293]

కమలాక్షా! శ్రీమహాలక్ష్మికి మేలైన నీ పాద పద్మాల చెంతకు మానోముల ఫలంగా చేరగలిగాము. ఇటువంటి పాదసేవ మాకు అక్కరలేదు. తామరపూల సుగంధం మరగిన తుమ్మెదలు అన్యపుష్పాల చెంతకు చేరలేవు కదా!

ఇంకా శ్రీకృష్ణునితో గోప వనితలు

*ఆ. "సవతు లేక నీ విశాల వక్షస్థలి (*

*దులసి తోడ ( గూడ ( దోయజాక్ష!*

*మనువు మనుచు నెపుడు మాకాంత నీపాద*

*కమలరజము ( గోరు ( గాదె కృష్ణ!"* [294]

నీరజాక్షా! ఎల్లప్పుడు తులసిమాలతో గూడ విశాలమైన వక్షస్థలమందు సరిలేని గౌరవముతో శ్రీ మహాలక్ష్మి నీ పాద పద్మాలందలి రేణువులను కోరి ప్రార్థిస్తుంది కదా! లక్ష్మీదేవి దాస్య భక్తిని శ్రీకృష్ణునికి గుర్తుచేసి ఇంకను కులమర్యాద లతిక్రమించి నీ మృదు వచనాలకు ముచ్చటపడి ఏ తెంచాం. నీ పాదదాస్య మిచ్చి రక్షించమని ప్రార్థించారు.

శ్రీకృష్ణుని అందానికి దాసులమని గోప వనితలు మమ్ము ఆదరించి ఏలుకొమ్మని నీ పలుకులు వినలేని మా జీవితం వ్యర్థమని, ఆడువారమైన మా మొరనాలకించమని

*మ. "భవదాలోకన హాసగీతజములై భాసిల్లు కామాగ్నులన్*

*భవదీయాధర పల్లవా మృతముచే ( బాపందగుంబాపవే*

*ని యోగానలహేతి సంహతులచే నీఱై, భవచ్చింతలన్*

*భవదం ఘ్రిద్వయవీధి ( బొందెదము నీ పాదంబులాన ప్రియా!"* [295]

శ్రీకృష్ణుని ఎడబాసి జీవించలేని తన మనో నిశ్చయాన్ని గోపికల దీనాలాపాలు విని యోగీశ్వరేశ్వ రుడూ ఆత్మారాముడైన శ్రీకృష్ణుడు నవ్వి వారి మనసులను తృప్తి కలిగే విధంగా వారితో రమించాడు.

## శ్రీకృష్ణుని రాసకేళి

*మ. "కరుణాలోకములం బటాంచల కచాకర్షంబులన్ మేఖలా*

*కర బాహు స్తన స్పర్శనంబుల నఖాంక వ్యాప్తులన్, నర్మవా*

*క్పరి రంభంబుల మంజులాధర సుధాపానంబులం గాంతలం*

*గరంగించెన్ రతికేళి ( గృష్ణు ( డు గృపంగందర్పు ( బాలార్చుచున్"* [296]

ఆ గోపికా స్త్రీలను కరుణతో కామకేళిలో కరగేటట్లు చేశాడు. ఆకాశంలో జాబిల్లి మధ్యనున్న నక్షత్రాల వలె గోపాంగనలు శ్రీకృష్ణుని రాసకేళిలో ప్రకాశించారు. లోకంలో ఎవరికి చిక్కక, తన మాయలో

అందరిని ముంచగలిగిన మాయలానికి గోపికలు దక్కి ధన్యులై మదకేళిలో సొక్కి సొలి పోయారు, ఆ సమయంలో గోపాలుడు గోపికా స్త్రీల కామోత్కంఠతకు శాంతి కలిగించటానికి, అనంతరం అనుగ్రహించటానికి కల్యాణ గుణ పరిపూర్ణుడు (కృష్ణుడు) అదృశ్యమయ్యాడు.

శ్రీకృష్ణుడు కవిపించక గోపాంగనలు శ్రీకృష్ణుని బాల్యచేష్టల నన్నింటిని ఒకరికొకరు చెప్పుకొని అనుకరింపసాగారు. గోపికల మనోవాక్కాయ కర్మలన్నీ శ్రీకృష్ణ లీలలే.

గోపికలు బృందావనంలో సంచరిస్తూ శ్రీకృష్ణుని కోసం అన్వేషిస్తూ ప్రకృతిలోని లతలను, వృక్షాలను కూడ శ్రీకృష్ణుని చూసారా? అని ప్రశ్నించారు.

*ఉ. "నల్లనివాడు పద్మనయనంబుల వా ( డు కృపారసంబుపై (*
*జల్లెడివా ( డు మౌళి పరిసర్పిత పింఛము వా ( డు నవ్వురా*
*జిల్లెడు మోము వా ( డొక ( డు చెల్వల మానధనంబు ( దెచ్చెనో*
*మల్లియలారా! మీ పొదల మాటున లేఁడు గదమ్మ చెప్పరే"* [297]

గోపికలు శ్రీకృష్ణుని వెదకుచూ భూదేవితో

*క. "కిటియై కౌ ( గిట ( జేర్చెను,*
*వటుడై వర్ధిల్లి కొలిచె వడి ( గృష్ణుండై*
*యిట ( బద చిహ్నము లిడె ,గ్రిం*
*దటి బాముున నేమి నోచితమ్మ ధరిత్రీ."* [298]

పూర్వ జన్మలో నీవెట్టి నోములు నోచావో వరాహ మూర్తియై కౌగిట చేర్చుకున్నాడు. వామనావతారమెత్తి మిన్నంట పెరిగి త్రివిక్రమ స్వరూప ధరుడై ఆకృతిని కొలిచి చూచాడు. ఇప్పుడు కృష్ణుడు తన అడుగుల గుర్తులను నీపై ఉంచాడు. ఇంతటి మక్కువ నీపై ఆదేవునికని ప్రశ్నించారు.

ఈ విధంగా గోపికలు యౌవనోద్రేకంచే ఉన్మాదచిత్తలై కృష్ణ తాదాత్మ్యాన్ని పొంది (భగవంతుని లీలలు) శ్రీకృష్ణుని లీలలను అనుకరింపసాగారు.

## గోపికల ఉన్మాద చేష్టలు

గోపికల్లో ఒకరు పూతనవలె అనుకరించగా, మరొక గోపిక శ్రీకృష్ణుని మాదిరి అభినయిస్తూ ఆమె చన్ను కుడిచింది. ఒక గోపిక తనను శిశువుగా భావించి పాలకేడ్చింది. మరొక గోపిక శకటాసురుని వలె వర్తించి మరొక గోపికను తన్నింది. ఒక గోపిక తృణావర్తుని వలె నటించగా నేను కృష్ణుడినని భావించే మరొక గోపికను ఎగురవేసుక పోయింది. ఒక గోపిక నేను వాసుదేవుణ్ణి అని పరాభవించింది, ఇద్దరు గోపాంగనలు రామకృష్ణులు కాగా, మరి కొందరు, గోపకులు, గోవులు అయ్యారు. మేము పశువులమని పలుకుతున్న గోపికలను, నేను నందకుమారుణ్ణి అని ఒక గోపిక దగ్గరకు పిలిచింది. ఇంకా

*ఆ. "లోకమెల్ల ( గుక్షిలోపల నున్నది*
*మాధవుండ నేను మాత వీవు*
*చూడుమనుచు నొక్క సుందరియొకతెకు*
*ముఖము ( దెఱచి చూపు ముఖ్య చరిత!"* [299]

కాళీయ మర్దనాన్ని, గోవర్ధనగిరి నెత్తటాన్ని, కార్చిచ్చు మ్రింగటాన్ని, శ్రీకృష్ణుని చేష్టలన్నింటిని గోపికలు అనుకరించి శ్రీకృష్ణుని కోసం అన్వేషించారు.

కొందరు గోపికలు శ్రీకృష్ణుడరిగిన దారిని గమనించి, శ్రీకృష్ణుని వర్ణించిన విధానం శ్రీకృష్ణుని పై వారికున్న పరమేశ్వర భావాన్ని వెల్లడిస్తుంది.

*సీ. "ఈ చరణంబులే యిందు నిభానన! సనకాది మునియోగ సరణినొప్పు*
*నీ పాద తలములే యెలనా ( గ! శ్రుతి వధూ సీమంత వీధుల ( జెన్నుమిగులు*
*నీ పాదాబ్జంబులే యిభకులోత్తమయాన! పాలేటి రాచూలి పట్టుగొమ్మ,*
*లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ, ముక్తికాంతా మనోమోహనంబు"*

*ఆ, లీయడుగు లరజమె యింతి! బ్రహ్మేశాది*
*దివిజవరులు మౌళి దిశల ( దాల్తు*
*రనుచు ( గొందఱబలలబ్జాక్షు ( డేగిన*
*క్రమము ( గనియు నతని ( గానరైరి"* [300]

శ్రీకృష్ణుని పాద పద్మాల ప్రాముఖ్యతను వర్ణించారు. అనంతరం కొందరు గోప కాంతలు శ్రీకృష్ణుడు తమతో చేసిన విలాస చేష్టలను గుర్తు చేసుకున్నారు.

ఈ విధంగా గోపికా స్త్రీలందరు కృష్ణునిపై ప్రేమతో బృందావనమంతా కానలేక యమునా నదిలో ఇసుక తిన్నెల మీదకి శీఘ్రంగా వెళ్ళారు.

## గోపికా గీతలు

ఇవి మధురభక్తికి నిధానములు. గోపికలు కృష్ణుని సామాన్య మానవ బాలునిగా భావింపలేదు.

*"నీవు యశోద బిడ్డ ( డవె నీరజపత్ర సమస్తజంతుచే*

*తో విదితాత్మవీశు ( డవు, తొల్లివిరించి తలంచి లోకర*

*క్షావిధ మాచరింపుమని సన్నుతిసేయ ( గ సత్కులంబునన్*

*భూవలయంబు ( గావనిటు పుట్టితి గాదె మనోహరాకృతిన్"* [301]

అని శ్రీకృష్ణుని నరలోక రక్షణార్థం అవతరించిన పరమేశ్వరునిగా భావించారు. ఈ తలంపు ఉన్న గోపికలకు శృంగారానుభూతి శ్రీకృష్ణునిపై లేదనటానికి నిదర్శనం.

గోపికలు శ్రీకృష్ణ మానస లగ్నలై శ్రీకృష్ణుడు కానరాక విరహ వేదనతో విలపించారు. ఒక గోపిక

*"నీవడవింబవల్దిరుగ నీ కుటిలాలక లాలితాస్యమి*

*చ్ఛావిధి ( జూడకున్న నిమిషంబులు మాకు యుగంబు లై చనుం*

*గావున రాత్రులైన నిను ( గన్నుల నెప్పుడు ( జూడకుండల*

*క్ష్మీవర! ఱెప్ప లడ్డముగ ( జేసి నిదేల? విధాత క్రూరు ( డై"* [302]

అని అతని రాత్రులందైన విశాలతర నేత్రాలతో చూచుటకాటంకంగా ఱెప్పలడ్డంగా చేసెనని బ్రహ్మను నిందిస్తుంది.

*ఉ. "ఒక్కలతాంగి మాధవుని యుజ్జ్వల రూపము సూడ్కితీ ( గెలం*

*జిక్క ( గ ( బట్టి హృద్గతము ( జేసి వెలింజనకుండ నేత్రముల్*

*గ్రక్కున మూసి మేన ( బులకంబులు గ్రమ్మ ( గ ( గౌగిలించుచుం*

*జొక్కములైన లోచవుల ( జొక్కుచునుండెను యోగి కైవడిన్"* [303]

గోపికలు యోగుల వలె పరమేశ్వర రూపాన్ని హృదయాల్లో అంతర్ముఖులై దర్శించారు. పూర్వ జన్మ సంస్కారం వల్లనే గోపికలు ఈ విధంగా చేయగలిగారు. అందుకే ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవ రాయలు తన ఆముక్త మాల్యదలో గోదాదేవి శ్రీరంగేశ్వరులుపాలంభన సందర్భంలో

*మ. "తను నంటన్ సతులౌట ( గోరు ముని బృందంబుందదా పాదిన*

*ద్వనజక్షోదము ( గల్గియు న్వెఅజనిం దా వల్లవ స్త్రీల ( గా*

*జననం బంద ( గ ( జేసి కూడియును నాసక్తాత్మలంగాంధినీ*

*తనయ ప్రేరణ ( బాసె భోజపుర యాత్రారంభ సంరంభియై"* [304]

అనే పద్యాన్ని వ్రాసి రామావతారమందలి మునులే గోపికలుగా జన్మించారని సూచించాడు. అక్రూరునితో కృష్ణ బలరాములు మధురానగరానికి వెళ్ళేటపుడు గోపికలు భవిష్యద్విరహాన్ని తలచి

*శా. "అక్రూరుండని పేరు పెట్టుకొని నే ( డస్మన్మనో వల్లభుం*

*జక్రిన్ మా కడ ( బాపి కొంచు నరుగం జర్చించి యేతెంచినా (*

*డక్రూరుండ ( ట క్రూరు ( డీత ( డు నిజంబ క్రూరు ( డౌనేని ని*

*ర్వ క్రత్వంబున ( గృష్ణు ( బెట్టి తన త్రోవం బో విచారింపడే?"* [305]

అక్రూరుడు వ్యతిరేకార్థకమైన నామంతో తన్ను వంచించాడని భావించారు.

దుష్టశిక్షణ శిష్టరక్షణార్థం అవతరించిన శ్రీకృష్ణుడు బలరామ సహితుడైన మధురా నగరానికి వెళ్ళాడు. మధురానగరంలో కంస సంహారమయింది. ఉగ్రసేన పట్టాభిషేకం జరిపి, తమ తల్లిదండ్రుల దీవెనలందుకొని వారి ప్రేమను చవిగొన్నారు బలరామకృష్ణులు. వసుదేవుడు శాస్త్రోక్తంగా విద్యలు నేర్పించటానికి సాందీపుని వద్దకు పంపాడు. బలరామ కృష్ణులు విద్యాభ్యాసం పూర్తిచేసి రాగా, మధురాపుర వాసులందరు పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్లుగా మహదానంద మనుభవించారు.

మధురాపుర వాసులకు శ్రీకృష్ణుడు ప్రాణం కాగా కృష్ణునకు ప్రాణములైన గోపికలు ఎట్లున్నారోనని కృష్ణుని తాపత్రయం. శ్రీకృష్ణుడు ఉద్ధవుని పిలిచి నంద వ్రజానికి పంపాడు. గోపికలకు రహస్యంగా సందేశం పంపాడు. ఆ సందేశంలోని ఈ క్రింది పద్యం గోపికల అనన్య శరణాగతిని వెల్లడి చేస్తుంది.

*శా. "రమ్మా యుద్ధవ! గోపకామినులు నారాకల్ నిరీక్షించుచున్*
*సమ్మోహంబున నన్నియున్ మఱచి యేచందంబునం గుందిరో*
*తమ్మున్ నమ్మిన వారి దిగ్గవిడువన్ ధర్మంబు గాదండ్రు,*
*పొమ్మా! ప్రాణములేక్రియన్ నిలిపిరో ప్రోద్యద్వి యోగాగ్నులన్"* [306]

జగన్మోహనునిపై గోపికల సమ్మోహ స్థితి సర్వాన్ని మరపించి శ్రీకృష్ణునిపై తప్ప వేరొక ధ్యాసలేదు, శ్రీకృష్ణుడు తిరిగి వస్తాడు, తమని ఆదరిస్తాడన్న ఆశతోనే గోపికలు జీవించారు. వారి భావనకు తగ్గట్టు శ్రీకృష్ణుడు నమ్మిన వారిని విడవటం ధర్మంకాదని ఉద్ధవుని ద్వారా సందేశం పంపాడు. ఈ విధంగా శ్రీకృష్ణావతార కార్యంలో దీనజన శరణ్యతా భాగంగా గోపికలు శ్రీకృష్ణునికి పనిపెట్టారు. ఈ విధమైన మధుర భక్తితో దైహికమైన, ఆత్మగతమైన రతిని అనుభవించారు గోపికలు.

### గోపికలు ఉద్ధవుని సంభాషణ

వ్రేపల్లెకు వచ్చిన ఉద్ధవుని చూచి ముందుగా రాజీవాక్షుడే అనుకున్నారు గోపికలు. పుణ్యాత్ముడా! నీవు భవన్మిత్రుడవు గదా! నంద నందనుడు  అతని తల్లి దండ్రుల మనోవ్యధ తీర్ప తమక్షేమ వార్త పంపాడు. వారినైన గుర్తు పెట్టుకున్నాడు. అంత వరకే సంతోషం. మునీశ్వరులు సహితం సత్సంగం విడువలేరు. సవ్యాజస్నేహం చేసినవారు తుమ్మెద వంటి వారే కదా! అవి పలుకు నంతలో ఒక తుమ్మెద వారికి ప్రత్యక్షమైంది. ఇది భక్తియోగ పరమావధికమైన స్థితి. హరి పంపిన దూత అని వారు భావించారు. ఈ భావ సాక్షాత్కారం దేశకాలాదులను ఛేదించే ఒక మహా లోకానికి చేర్చింది. సంబోధన భ్రమరాన్ని ఉద్దేశించి ఉపాలంభం వాసుదేవుని చేయటం.

### గోపికల ఉపాలంభం

గోపికలకు ఈ ఉపాలంభన క్రోధంచే ఏర్పడింది కాదు. తనకు శ్రీకృష్ణుడు లభించి అనుభూతమై తమకు శాశ్వతంగా దక్కీకుండా పోయాడనే వేదనతో ఆ ప్రయత్నంగా కలిగిన ఆత్మార్పణ ఉపాలంభం. తాము ఏ కారణం వల్ల ఇక్కడకు వచ్చారో, తమకు దక్కవలసిందేదో వెదకుతున్న గోపికలకు తమ వస్తువు దక్కిదక్కనట్లు దాగిపోగా, విడిచిపెట్టగా, విడిచిపెట్టినట్లు కాగా వారి ఆత్మదు:ఖం పొంగి పొరలింది. ఇది దు:ఖం కాదు. ఉపాలంభం కాదు. ఆత్మనిర్వేదం. ఈ పుండరీకాక్షుడు నాసొత్తు. నాకు విధేయుడు. నన్ను విడిచి వెళ్ళడు. అవి ఎవరి మటుకు వారు

భావించి అనుభవించి నమ్ముకున్నారు. కాబట్టి అట్టివానిని విడచి వెళ్ళటం నిజంగా తప్పు.

*ఉ. "బంధుల బిడ్డలన్ మగల భ్రాతల ( దల్లుల ( దండ్రులన్ మనో*
*జాంధత జేసి డించి శరణందిన మమ్ము వియోగ దుర్దశా*
*సింధువు నందు ( ద్రోసి యిటు జేరక పోవుట పాడి గాదు పు*
*ష్పంధయ! మీ యధీశునకు ( బాదము లంబడి యొత్తి చెప్పరే"* [307]

శరణాగతి చేసిన మమ్ము వియోగ దుర్దశా సముద్రమున ముంచటం తప్పుగదా! ఓ పుష్పం దయమా! మీ ప్రభువునకు పాదములంబడి ఒత్తి చెప్పమన్నారు. అతడు సామాన్యుడు కాడని, కంస విధ్వంసి, యదుకులాలంకారుడని, వారెరిగిన వారే. ఆకాశంలో విహరించే విహంగమైనా తన నామ ధేయాన్ని ఒక్కసారి వింటే సంసార కూపం నుండి రక్షిస్తాడు కదా! అదే పనిగా నిత్యమైన తన సాన్నిధ్యాన్ని కోరే మమ్మేల రక్షింపడని గోపికల ఆర్తేకాని మరొకటి కాదు.

గోపికల ఆర్తిని గుర్తించిన ఉద్ధవుడు వారికి పంపిన శ్రీకృష్ణుని సందేశాన్ని వినిపించాడు. శ్రీకృష్ణుడు తాను సృష్ట్యాది కారణభూతుడని, సృష్టికార్యం ఏ విధంగా జరుగుతున్నదో వివరించి.

*మ. "చెలువల్ దవ్వులనున్న వల్లభులపై ( జిత్తంబులం గూర్తురు*
*త్కలికం జేరువ వారి కంటె నదియుంగాకెప్పుడున్ నన్ను మీ*
*రలు చింతించుచు నుండ ( గోరి యిటు దూరస్థత్వముం బొందితిన్*
*దల కం బోలదు నన్ను ( గూడెదరు నిత్యధ్యాన పారీణలై"* [308]

మిరెల్లప్పుడు నన్నే స్మరిస్తూ ఉండాలి అనే కోరిక చేత నేను ఈ విధంగా మీకు దూరంలో ఉన్నాను. భయపడకండి. మీరు నిరంతర ధ్యాన పారంగతలై నన్నే పొందుతారని చెప్పాడు. ఉద్ధవుడు పలికిన శ్రీకృష్ణసందేశానికి గోపికలు సంతోషించారు.

శ్రీకృష్ణుడు ఎడబాసి ఉండలేని వారి మనోవేదనని ఉద్ధవునికి విన్నవించి, వారి ప్రియతముడైన శ్రీకృష్ణుని వ్రేపల్లె వీధుల్లో దర్శించగలమా? అని శోకించారు.

శ్రీకృష్ణుని సకుటుంబంగా గ్రహణ స్నానానికి వెళ్ళిన ఘట్టంలో గోపికలకు శ్రీకృష్ణుని పునర్దర్శన ప్రాప్తి కలుగుతుంది.

*క. "నంద యశోదలు గోపక,*

*బృందంబులు గోపికలును బిరిగొని పరమా*

*నందంబున 'జనుదెంచిరి,*

*మందర ధరు 'జూచువేడ్క మనముల'బొదమన్"* [309]

రోహిణీదేవి, దేవకీదేవి యశోదతో ప్రియసల్లాపాలు చేస్తుండగా, గోపకాంతలు మిక్కిలి సంతోష మానసలై రాక రాక వచ్చిన తమ ప్రాణేశ్వరుడైన శ్రీకృష్ణుని చూడటానికి తహతహలాడుతూ, ఆనంద ముప్పొంగిన

*చ. "నళినదళాక్షు 'జూచి నయనంబులు మోడ్ప'గ ' జాలకాత్మలన్*

*వలచి తదీయమూర్తి విభవంబు దలంచుచు'గౌ 'గిలించుచుం*

*బులకలు మేన జాదుకొన'బొల్తులు సొక్కిరి బ్రహ్మమున్ మనం*

*బున'గని చొక్కుయోగి జనముం బురుడింప'గమానవేశ్వరా"* [310]

గోపికలు గోపాలుని చూస్తున్నంత సేపు తెరచిన తన కనురెప్పల్ని మూయలేక పోయారు. గోపికా స్త్రీలు తమ మనస్సులో శ్రీకృష్ణుని జగన్మోహన సౌందర్య వైభవాన్ని తలచుకుంటూ ఆత్మార్పణం కావించి, తనువులు పులకించగా పరబ్రహ్మ సాక్షాత్కారం వల్ల పరవశించే యోగుల్లాగా గోపస్త్రీలు పరవశులయ్యారు.

*చ. "పొల'తుల భావమాత్మ'గని పుల్ల సరోరుహ లోచనుండువా*

*రలనపుడేకతంబునకు రమ్మనితో కొని పోయి యందున*

*ర్మిలి 'బరిరంభణంబు లొనరించి లసద్దరహాస చంద్రికా*

*కలిత కపోలుడై పలికె'గాంతల భక్తిని తాంత చిత్తలన్"* [311]

గోపికల భావాన్ని తెలుసుకున్న శ్రీకృష్ణ పరమాత్మ వారిని ఒక ఏకాంత ప్రదేశానికి రమ్మని చెప్పి తొడ్కొని వెళ్ళి, ప్రేమతో ఆలింగన సుఖాన్ని కలిగించి, భక్తి పరవశలైన వారితో చిరునవ్వు నవ్వుతూ ఇలా ఆన్నాడు.

## జీవాత్మ తత్త్వం

*చ. "వనజదళాక్షులారా! బలవద్రిపు వర్గములన్ జయింప ( గా*

*జని తడవయ్యె, దీనికి భృశంబుగ మీమది నల్గకుండు ( డీ!*

*యనయము దైవమిట్లు సచరాచరజాలము నొక్కవేళ ( గూ*

*ర్చును నొకవేళ ( బాపును మరుద్ధత తూలతృణంబులం బలెన్"*[312]

ఓ గోపికాస్త్రీలారా! బలవంతుడైన శత్రువులను జయించటానికి వెళ్ళినందున, వారిని జయించి తిరిగి రావటానికి ఆలస్యమయింది. ఈ విధంగా ఆలస్యమైనందుకు మీరు ఇంతగా అలుక పూనటం తగదు. ఈ చరాచర ప్రాణికోటిని ఈశ్వరుడు ఒకప్పుడు జతకూరుస్తూ ఒకప్పుడు ఎడబాటును కలిగిస్తుంటాడు. గాలికెగుర గొట్టబడే ఈ చరాచర ప్రపంచం దైవ సంకల్పాన్ని బట్టి ఒక్కోసారి కలుస్తూ, ఒక్కోసారి విడిపోతూ ఉంటాయి. ఇందుకై మీకు విచారం వద్దు.

## శ్రీకృష్ణ ప్రశంసలు

*సీ. "తరళాక్షులార! మద్భక్తి చేత సు.లకు ( దనరు మోక్షానందదాయకంబు*

*జపతపో వ్రతదాన సత్కర్మముల ముక్తి కలుగంగ నేరదు కాన ( దల ( ప*

*విధి శివ సనకాది విమల చిత్తంబుల ( బొడమిన భక్తి మీ బుద్ధులందు*

*జనియించె మీపూర్వ సంచిత సౌభాగ్య మెట్టిదోయది తుదముట్టెనింక"*

*తే. "నటమటముగాదు మీకు నెన్న ( టికినైన (*

*గలుగనేరవు నిరయసంగతములైన (*

*జన్మ కర్మము లిటమీ ( ద మన్మనీష*

*సుమహిత ధ్యానలార! యోరమణులార!"*[313]

శ్రీకృష్ణుడు గోపికలతో నాపై గల భక్తి ప్రాణులనెల్లకు మోక్షం పొందటం సులభసాధ్యమై ఆనంద దాయకమవుతుంది. కేవలం జపతపో వ్రత దానాది. సత్కార్యాల వల్ల ఆభక్తి కలుగదు. శివబ్రహ్మ సనక నిర్మల సనందాదుల హృదయాల్లో కూడ అంకురించని నిర్మల భక్తి మీలో మొలకెత్తింది. ఇక మీ పురాకృత సుకృత విశేషం ఇప్పుడే పరిపూర్ణంగా ఫలించింది. ఇది వ్యర్థం కాదు. మీకు ఏ కష్టాలుండవు. ఇక మీద నాపై బుద్ధి కలిమిచేత, మీకు నరకహేతువులైన జన్మకర్మలు, లేవని స్పష్టం చేసాడు.

మోక్ష ప్రదాతయైన శ్రీకృష్ణుడు గోపికల మధురభక్తికి సంతసించి జన్మకర్మల విముక్తిని ప్రసాదించాడు. భగవంతుడు ఉద్ధవునితో పంపిన సందేశాన్ని నిలబెట్టుకోవటానికి (పునర్దర్శన ప్రాప్తి) గ్రహణ స్నాన నిమిత్తం గావించాడు.

గోపికలు కామక్రోధాది దుర్గుణాలు లేని సద్బుద్ధి కలవారని శ్రీకృష్ణుడు తనకంటె ఇతరం ఈ చరాచర సృష్టిలో ఏదీలేదని తెలియచేసాడు.

శ్రీకృష్ణుడు తన మహిమను గోపికలకు తెలియచేయగా గోపికలు దివ్యజ్ఞానం పొంది, వివేకవతులై దేహాభిమానం విసర్జించారు.

## శ్రీకృష్ణస్తుతి

గోపికలు శ్రీకృష్ణదేవుని పలు విధాల ప్రస్తుతించి

*తే. "ఘోర సంసార సాగరోత్తారణంబు*
*ధీయుత జ్ఞానయోగి హృద్ధ్యేయవస్తు*
*వగుచు ( జెలువొందు నీచకణాంబుజాత*
*యుగళమును మా మనంబుల ( దగులనీవె"* [314]

ఘోర సంసార సముద్రాన్ని దాటడానికి యోగిజన హృదయాల్లో సుప్రతిష్ఠమై ప్రకాశించే నీ పాద పద్మయుగళం మా మనస్సులో నిరంతరం వెలుగొందాలని ప్రార్థించారు.

దయా సముద్రుడైన నంద నందనుడు గోపికలు కోరిన వరాలు ప్రసాదించాడు.

లౌకిక శృంగార సూచకాలైన వర్ణనలు, పద ప్రయోగాలు, రాస క్రీడాది సన్నివేశాలను చూస్తే గోపికా కృష్ణ ప్రణయం కూడ లౌకిక ప్రణయ నిర్విశేషమనే భావం కలుగుతుంది. కాని ఆ భ్రాంతిని కూడదని శుక మహర్షి,

*మ. "ఘనులై యెవ్వని పాదపంకజ పరాగధ్యాన సంప్రాప్తయో*
*గ నిరూఢత్వముచే మునీంద్రులు మహా కర్మంబు లంబాసిబం*
*ధ నిరోధంబులు లేక విచ్చల విడిం దర్పింతురా నిత్యశో*
*భను'డెట్లుండిన నుండె ( గాక కలవే బంధంబు లుర్వీశ్వరా!"* [315]

*ఆ. "గోప జనములందు గోపికలందును,*

*సకల జంతులందు సంచరించు*

*నామహాత్మునకు ( బరాంగనలెవ్వరు?*

*సర్వమయు ( డు లీలసలిపె ( గాక"*[316]

అని తెలియచేసాడు.

మహాభారత మందలి అశ్వమేధ పర్వమున కాముడు తన్నుగూర్చి చెప్పుకుంటూ.

*"యోమాం ప్రయతతే హంతుం మోక్షమాస్థాయ పండితః !*

*తస్య మోక్షరతి స్థస్య నృత్యామిచ హసామిచ"*

మోక్షాన్ని కోరే పండితుడు నన్ను సంహరించటానికి ప్రయత్నిస్తాడు. కాని అతనికి మోక్షమునందైన రతి ఉంది. కాబట్టి అలాంటి వానిని చూచి నేను నవ్వుతూ నాట్యమాడుచుంటానని అంటాడు.

అందువల్ల పరమేశ్వరుడైన శ్రీకృష్ణునితో గోపికలు జరిపిన రాసకేళి లౌకిక శృంగారంగా కొందరు భావించినా, వారికి శ్రీకృష్ణుడు ముక్తి నివ్వటం వల్ల అది మోక్షరతియే అన్యం కాదు. శ్రీకృష్ణుడు మునిపత్నులతో

*సీ. "నా సమీపమున నున్నారంచు నలుగురు బంధులు, భ్రాతలు, పతులు, సుతులు*

*దేవతలైన మెత్తురంగనలార! నాదేహసంగంబు నరులకెల్ల*

*సౌఖ్యానురాగ సంజనకంబు గాదు, ముక్తి ప్రదాయకము, నాకీర్తనమున*

*దర్శనాకర్ణన ధ్యానంబులను గర్మబంధ దేహంబుల ( బాసిమీరు"*

*తే. "మానసంబులు నాయందు మరగజేసి*

*నన్ను ( జేరెదరటమీ ( ద, నమ్ము ( డనుచు (*

*బలికివారలు దెచ్చిన భక్షణాదు*

*లాప్త వర్గంబుతో హరియారగించె"*[317]

నా దేహ సంగము నరులకు ముక్తి ప్రదాయక మని స్పష్టంగా తెలియ చేసినందున గోపికల విషయంలో కూడ ఇది వర్తిస్తుంది.

గోపవధూటుల మాటలు విన్న ఉద్ధవుడికి గోపికల చరిత్రలు చిత్రమన్పించాయి

*మ. " జపదాన వ్రతహోమ సంయమ తపస్స్వాధ్యాయ ముఖ్యంబులన్*

*నిపుణుల్ గోరియునే విభున్ మనములన్నిల్పంగ లేరట్టి స*

*ద్విపులాకారునిపై మహామహిముపై విశ్వేశుపై మీకజ*

*స్రపట ధ్యానము లిట్లు నిల్చునె? భవచ్చారిత్రమున్ చిత్రముల్ "* [318]

జప హోమ తత్పరాదులచే కూడ మహా మహిములు ధృఢంగా మనసులు నిల్పలేని మహీయశు డు, మహామహిమునిపై 'విశ్వేశుడైన శ్రీకృష్ణునిపై మీకు నిరంతర దృఢ ధ్యానం కుదిరింది. ఈ విధంగా అని ఆశ్చర్యపోతాడు. 9 సంవత్సరముల వయస్సులో ఉన్న శ్రీకృష్ణుని వేణుగానానికి సమ్మోహితులై తమ వారందరిని విడిచిపెట్టి గోపికలు రావటం ఒక వింత? జగత్పతి అని తెలిసిన తర్వాత కూడ కోరటం మరింత వింత? ఆ మహా మహిముని మాయల్లో మహామాయ గోపికాచిత్తహరణం.

## 2.2. అప్రధాన పాత్రలు

### 2.2.1. దేవజాతి స్త్రీలు

#### 1. దేవ కన్యలు

శౌనకునకు సూత మహర్షి శ్రీశుకుని గూర్చి ఎటువంటి భేద భావాలు లేని మహాయోగి అని తెలియచేసే కథా ప్రసంగంలో దేవకన్యలు ప్రస్తావన వస్తుంది.

*అ. "శుకుడు గో ( చియు లేక పై ( జన ( జూచి తోయము లందుల*
*జ్జకు ( జలింపక చీరలొల్లక చల్లులాడెడి దేవక*
*న్యకలు హాశుక యంచు వెన్క ( జనంగ వ్యాసుని ( జూచి యం*
*శుకములన్ ధరియించి సిగ్గున స్రుక్కిరందఱు ధీనిధీ!"* [319]

ఒకనాడు దేవకన్యలు స్నానాలు చేస్తూ ఉంటారు. ఆ సమయంలో అటువైపు శ్రీశుకుడు దిగంబరంగా వెళతాడు. ఆదేవ కన్యలేమో చలించలేదు. చీరలు ధరించలేదు అలాగే ఉల్లాసంగా జల్లులాడుతూ ఉంటారు. అంతలో శ్రీశుకుని పిలుస్తూ వ్యాసులవారు అటువైపు వచ్చేసరికి దేవ కాంతలు సిగ్గుతో వస్త్రధారణ చేసారు.

దేవకాంతలు దిగంబరుడు, నవ యువకుడైన తన పుత్రుణ్ణి చూచి సిగ్గుతో వస్త్రధారణ చేయకుండా, వృద్ధుడైన తనను చూసి, వస్త్రధారణ చేసారెంటని ఆలోచించి ఆశ్చర్యపడి వారిని ప్రశ్నిస్తాడు.

దేవకన్యలు వ్యాసునితో నీ పుత్రుడికి స్త్రీ పురుష భేదభావం లేదు. అంతేకాక అతడు నిర్వికల్పుడు. నీలో స్త్రీ పురుష భేద భావం పోలేదని, నీకు అతనికి (శ్రీశుకునికి) ఎంతో అంతర ముందని తెలియచేస్తారు.

ఈ దేవకన్యలు భూలోకానికి విలాసంగా స్నానార్థం వచ్చి బ్రహ్మజ్ఞానికి నిర్వచనమిచ్చారు. ఆ నిర్వచనమిచ్చింది మాములు మనిషికి కాదు. వ్యాస మహర్షి జ్ఞానాన్ని కొలిచి మరీ చెప్పారు. శు క మహర్షికి వ్యాస మహర్షికి ఇరువురి మధ్యనున్న భేదాన్ని గుర్తించి లోకానికి తెలియచేసిన ఈ దేవకన్యల అసామాన్య శక్తి ప్రశంసనీయం. భాగవత కథ రచించిన వ్యాస మహర్షిని వినిపించిన శుకమహర్షిని తులాభారం పెట్టగల్గిన దేవ కన్యలు, శ్రీశుకునిలో బ్రహ్మజ్ఞానాన్ని తెలియచేసి భాగవత కథా ప్రబోధార్హుడన్న సత్యాన్ని ముందుగా లోకానికి చాటారు.

## 2. అలంబుస

ఈమె అప్సర స్త్రీ, మహా గుణవతి, ఈమె తనకి సమాన యోగ్యుడైన తృణబిందుణ్ణి చూచి కామించింది. ఈ దంపతులకి ఇలబిల అనే కుమార్తె కలిగింది.

*క. "అచ్చర కన్య యలంబుస,*
*గ్రచ్చఱ ( దృణబిందు ( జూచి కామించి తుదిం*
*బచ్చ విలుకాని యమ్ముల*
*ముచ్చిచ్చున వచ్చి పొందె మోహాతురయై"*[320]

## 3. ఇలబల

ఈమె అలంబుస అనే అప్సర స్త్రీకి తృణబిందుడనే రాజుకి జన్మించింది. ఈమె భర్త విశ్రవసుడు. ఈమె కుమారుడు కుబేరుడు, అంతే కాక విశాలుడు, శూన్య బంధుడు, ధూమకేతుడనే ముగ్గురు పుత్రులున్నారు. ధనాధిపతియైన యక్షరాజు కుబేరుని కన్నతల్లిగా ఈమె ఖ్యాతి గాంచింది. ఇలబిల విశ్రవసుడు లాంటి మహనీయుని భార్యగా, కుబేరుని వంటి పుత్రుని కని సౌభాగ్యవంతురాలైన మహిళగా, భాగవతంలో స్థానం సంపాదించుకున్న పుణ్యాత్మురాలు.

*వ. "ఆ దంపతులకు నిలబిలయను కూతురు ... ..."*[321]

## 4. ఘృతాచి

ఈమె అప్సరస్త్రీ. రౌద్రాశ్వుని వల్ల ఈమె పదిమంది పుత్రులకు జన్మనిచ్చింది.

*"పూరునకు ( జనమే జయుండు ... ... ... సంయాతికి రౌద్రా*
*శ్వుండు, రౌద్రాశ్వునకు ఘృతాచి యను నచ్చరలేమ యందు*
*ఋతేపువు, కక్షేపువు, స్థలేపువు, కృతేపువు, జలేపువు*
*సన్నతేపువున ధర్మేపువు, సత్యేపువు, పుత్రేపువు, వనేపువు"*

అనువారు జగదాత్మ భూతుండైన ప్రాణునకు నింద్రియంబుల చందంబున ( బదుగురు కొడుకులు జన్మించిరి.

## 5. మమత

దేవగురువు బృహస్పతి అన్న ఉచధ్యుని భార్య మమత. బృహస్పతి ఈమె గర్భవతియై ఉండగా చూచి ఈమెతో రతిక్రీడకు పూనుకున్నాడు. గర్భంలో ఉన్న శిశువు భయపడి వద్దని నివారించాడు. బృహస్పతి తమకంతో "నీవు గ్రుడ్డి వాడివై పో" అని ఆ శిశువుని శపించాడు. గర్భస్థుడైన శిశువు కోపించి తన్నగా బృహస్పతి వీర్యం నేలపై పడి ఇద్దరు కొడుకులు కలిగారు.

*సీ. "అన్న యిల్లాలి ( జూలాలని మమతాఖ్య ( జూచి బృహస్పతి సురతమునకు (*

*దొర'కొని పై ( బడ్డ ( దొల్లి గర్భంబున నున్న బాలు ( డు భయం బొదవి వలదు*

*తగదని మొఱసేయ ( దమకంబుతో వాని నంధుండవగు మన్న నలిగివా ( డు*

*యోని లోపలి వీర్యమూడ ( దన్నిన నేల ( బడి బిడ్డ ( డై యున్న ( బాయలేక"*

*ఆ. నితని బెంపు, కొడుకు లిరువురు జన్మించి,*

*రనుచు వెలయ ( జేయుమనిన మమత (*

*బెంపంజాల, నీవు పెంపు, భరింపుమీ.ద్వాజు*

*ననుచు ( జనియె దాని విడిచి"*[323]

మమత బృహస్పతిని ద్వాజుణ్ణి నీవే పెంచమని అడుగ, బృహస్పతి నేను పెంచలేను. నీవే భరించు, నీవే భరించు అని బృహస్పతి, మమత వాదులాడు కొన్నందువల్ల భరద్వాజు డయ్యాడు. ఈ భరద్వాజుణ్ణి వదలి మమత అక్రమ సంతానానికి జన్మనిచ్చిన కారణం చేత భర్త తనని వదలి వేస్తాడని ఆ పుత్రుని విడిచి పెట్టి వెళ్ళింది.

మరుత్తులు ఆ పిల్లవానిని పోషించి కొడుకు కోరిన భరతునికిచ్చారు. సంతులేక పోయిన నామకరణం చేసి భరత వంశానికి ఆ భరద్వాజుడు వంశకర్త అయినందువల్ల వితథుడని పేరు పొందాడు.

భర్త ఉండగా వావి వరుసలు లేకుండ, మమత చేసినపని, అందుకు కారణమైన బృహస్పతి తపోశక్తి తగలబడినట్లుందని మనం భావించాలా? భరత వంశం నిలబెట్టటానికి వీరికి బుద్ధి వక్రీకరించిందని సమర్థించాలో, అర్థం కాని స్థితి (దేవజాతి కదా వావి వరుసలు, సమయా సమయాలు కూడా ఉండవేమో పాపం మరి).

## 6. మిశ్రకేశి

అప్సర స్త్రీ. ఈమెకి వత్సుని వల్ల వృకుడు మొదలైన పుత్రులు కలిగారు

## 7. వాసన

అర్కుని భార్య. ఈ దంపతులకు తర్షుడు మొదలైన వారు పుట్టారు. వీరి పేర్లు చెప్పబడలేదు.

## 8. వసోర్ధార

అగ్ని భార్య. ఈ దంపతులకు ద్రవిణకుడు మొదలైన వారు జన్మించారు.

## 9. కృత్తిక

అగ్ని భార్య. ఈమెకు స్కందుడు ఉదయించాడు. ఈ స్కందునికి విశాఖుడు మొదలైన వారు పుట్టారు.

### 2.2.2. బ్రాహ్మణ జాతి స్త్రీలు

## 1. కృపి లేదా ద్రోణ కుటుంబిని

ఈమె జన్మవృత్తాంతం నవమ స్కంధంలో కన్పిస్తుంది. శరద్వంతునికి ఊర్వశికి కల్గిన సంతానం, శరద్వంతుడు ఊర్వశిని మోహించగా రేతస్ఖలనమై ఆవీర్యం రెల్లు దుబ్బుమీద పడి రెండు భాగాలై కవల బిడ్డలుగా ఉదయించారు. శంతనమహారాజు కృపతో ఈ ఇరువురిని కృపి, కృపుడనే పేర్లు పెట్టి పెంచాడు. కృపి సోదరుడు కృపాచార్యుడిగా కౌరవ పాండవులకు గురువుగా ప్రసిద్ధుడయ్యాడు.

భాగవత కథలో ఈమె పాత్ర ప్రవేశం ప్రత్యక్షంగా లేదు. ఈమె ద్రోణాచార్యుని ధర్మపత్ని. ఈ ఇరువురి (ద్రోణాచార్యుడు - కృపి) పుత్రుడైన అశ్వత్థామ ఉప పాండవులను సంహరిస్తాడు. అర్జునుడు పుత్రఘాతియైన అశ్వత్థామను పట్టి బంధించి ద్రౌపది సమక్షంలో ఉంచుతాడు. ద్రౌపది పుత్రశోకంతో కృష్ణార్జునులను చూచి ఈ క్రింది విధంగా పలికింది.

*ఉ. "ద్రోణునితో శిఖింబడక ద్రోణకుటుంబిని యున్నదింటన*
*క్షీణ తనూజ శోక వివశీకృతనై విలపించు భంగినీ*
*ద్రౌణి ( దెరల్చి తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కునో*
*ప్రాణ వియుక్తు ( డైన నతిపాపము, బ్రాహ్మణ హింసమానరే"* [324]

కురుక్షేత్రంలో పాండవ సైన్యాధ్యక్షుడైన దృష్టద్యుమ్నుని చేతిలో ద్రోణాచార్యుడు వీర స్వర్గమలంకరిస్తాడు. అతనితో పాటు అతని భార్య కృపి "శిఖింబడక" (అగ్నిలోబడక) అగ్ని ప్రవేశం చేయక ఇంటిలో జీవించి ఉందని ద్రౌపది మాటలను బట్టి మనకు తెలుస్తుంది. సతీ సహగమనం ఆనాటి సాంఘికాచారంగా ఉన్నట్లు సుస్పష్టం, భర్తృవియోగంతో విలపించే ద్రోణ కుటుంబిని ఈ అశ్వత్థామను కృష్ణార్జునులు బంధించి తీసుకు వచ్చారని తెలిసి ఎంతగా విలపిస్తుందోనని ఆమె దు:ఖాన్ని స్త్రీసహజమైన కరుణతో ద్రౌపది పలికిన పలుకుల్లో ఈమెగూర్చిన (ద్రోణకుటుంబిని) ప్రస్తావన పరోక్షంగా ఉంది. ద్రోణాచార్యుడు కౌరవ పాండవులకి గురువు. ధనుర్విద్యా విశారదుడు. ఆ నాటి కాలంలో జగమెరిగిన బ్రాహ్మణుడు ఆచార్యుడు. ఆ ఆచార్యుని పత్ని అంటే కౌరవ

పాండవులకి గురుపత్ని. గురుపత్నిగా ఆమెకి సముచిత గౌరవం కలదనే విషయం కురువంశ కోడలు, పాండవుల పట్టమహిషి అయిన ద్రౌపది మాటలను బట్టి సువ్యక్తం. జన్మత: బ్రాహ్మణుడైన ద్రోణాచార్యుడు ఆయుధం ధరించి కర్మ క్షత్రియత్వం అవలంబించాడు. అతని పుత్రుడైన అశ్వత్థామ అంతే. ఆ కారణంగా ద్రోణ కుటుంబిని గురుపత్నియే వీరపత్ని కూడ. భారత కథను బట్టి కృపాచార్యుని సోదరి ఈమె. ఈ కృపాచార్యుడు అనంతర కాలంలో పరీక్షిన్మహారాజు చేత మూడు అశ్వమేధ యాగాలు చేయించినట్లుగా భాగవతంలో ఉంది. కాబట్టి వీరి కుటుంబమంతా కురువంశ పోషణలో పౌరోహిత్యం, ఆచార్యత్వం నెరెపారని తెలుస్తుంది. ఈమె ద్రోణ పత్నిగా కురువంశస్థులచే గౌరవం పొందిన బ్రాహ్మణ స్త్రీమూర్తి (ఆచార్య పత్ని) గురుపత్ని.

## 2. అనసూయ

పవిత్ర చరిత్రుడైన అత్రి మహాముని అర్ధాంగి. దేవహూతి కర్దముల కుమార్తె. ఈమె పాతివ్రత్యంచే త్రిమూర్తులనే తనయులుగా పొందగల్గింది.

పవిత్రులైన ఈ పుణ్య దంపతులకు బ్రహ్మదేవుని అంశ వల్ల చంద్రుడు జన్మించాడు. విష్ణుదేవుని అంశవల్ల యోగవేత్త దత్తాత్రేయుడు జన్మించాడు. మహాదేవుని అంశవల్ల దుర్వాసుడు కలిగాడు. సాటిలేని పవిత్రశీలం గల్గి ఉత్తమగుణ సంపన్నులైన తనయులకు కన్నతల్లి దండ్రులు వీరు. వీరి దాంపత్యం లోకానికే ఆదర్శం.

*క. "అనఘుండత్రి మహాముని,*

*యనసూయా దేవి వలన నజహరి పుర సూ*

*దనుల కళాంశంబుల నం*

*దనులను ముప్పురను గాంచె ( దద్దయు ( బ్రీతిన్"* [325]

పవిత్రతర దాంపత్యానికి ప్రతీక. అత్రి అనసూయలు తన పాతివ్రత్యంచే త్రిమూర్తులకే స్తన్యాన్ని భిక్షగా ఆతిధ్యమిచ్చిన అతివగా అత్రి మహాముని పత్నికి పురాణేతి హాసాల్లో ప్రసిద్ధి ఉంది.

## 3. శ్రద్ధ

బ్రహ్మ మూడవ కుమారుడైన అంగిరస మునీంద్రుని అర్ధాంగి. ఈమె దేవహూతి కర్దముల తనయ. శ్రద్ధకి నలుగురు కుమార్తెలు. సినీవాలి, కుహూవు, రాక, అనుమతి, స్వారోచిష మన్వంత రంలో గొప్ప ఖ్యాతిని పొంది జ్ఞానవంతుడైన ఉచధ్యుడు, బ్రహ్మణ్యుడైన బృహస్పతి అనే పుత్రులను కన్న మాతృమూర్తి శ్రద్ధ దేవతలకు గురువునందించిన పవిత్ర మాతృమూర్తి శ్రద్ధ. (ఈ విషయం చతుర్ధ స్కంధం 24,25,26 పద్యాల్లో వర్ణింపబడింది)

## 4. హవిర్భువు

ఈమె దేవహూతి కర్దముల తనయ. ఈమె పులస్త్యుని భార్య. ఈమెకు అగస్త్యుడు మరియు విశ్రవసుడనే ఇద్దరు పుత్రులు.

## 5. గతి

ఈమె దేవహూతి కర్దముల తనయ. పులహుని భార్య. ఈమెకి కర్మశ్రేష్ఠుడు, వరీయాంసుడు సహిష్ణుడనే ముగ్గురు పుత్రులు.

## 6. క్రియ

ఈమె దేవహూతి కర్దముల తనయ. క్రతువు భార్య. వీరిరువురికి షష్ఠి సహస్ర సంఖ్య ఉన్న వాలఖిల్యులనే మహర్షులు కలిగారు.

## 7. ఊర్జ

ఈమె వసిష్ఠుని భార్య. వీరిరువురికి చిత్రకేతుడు, సురోచి, విరజుడు, మిత్రుడు, ఉల్బణుడు, వసుభృద్ధ్యానుడు, ద్యుమంతుడు అనే సప్తర్షులు జనించారు.

## 8. అరుంధతి

ఈమె వసిష్ఠుని భార్య. ఈమె పుత్రుడు శక్తి. ఈ శక్తి కుమారుడే పరాశరుడు. ఈ పరాశర పుత్రుడే వ్యాసుడు. వివాహ సమయాల్లో అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తారు. ఈమె పాతి వ్రత్యంచే

భర్త ఆదరణ పొంది సత్సంతానాన్ని లోకానికి ప్రసాదించటమే కాక ఆదర్శ మహిళగా దేవతా మూర్తులతో సమానంగా లోకంలో పూజింప బడుతుంది.

## 9. చిత్తి

అధర్వుని భార్య. వీరిరువురికి ధృతవ్రతుడు, అశ్వశిరస్కుడైన దధ్యు'చుండు జనించారు.

## 10. ఖ్యాతి

ఈమె దేవహూతి కర్దముల తనయ. భృగువు భార్య. వీరిరువురికి ధాత, విధాత అనే ఇద్దరు పుత్రులు, భగవద్భక్తురాలైన శ్రీ అనే కుమార్తె ఉదయించారు.

## 11. అయతి

భృగు పుత్రుడైన ధాత భార్య ఈమె. ఈమెకి మృకండుడనే పుత్రుడు జన్మించారు మృకండుని పుత్రుడే మార్కండేయుడు. మృత్యుంజయుడైన భక్త మార్కండేయుని ఈ లోకానికి ప్రసాదించటానికి కారకురాలైన ఈమె జన్మ ధన్యం.

## 12. నియతి

ఈమె విధాత భార్య. ఈమె పుత్రుడు ప్రాణుడు. ప్రాణుని పుత్రుడు వేదశిరుడు.

## 13. ఉశన

ఈమె భార్గవ పత్ని. ఈమె పుత్రుడు కవి.

## 14. స్వధ

ఈమెకు వయున, ధారిణి అనే ఇద్దరు కన్యలు. వారిరువురు జ్ఞాన విజ్ఞాన పరాయణులు. బ్రహ్మనిష్ఠులు.

## 15. మారిష

ఈమె కండు మహాముని ప్రమ్లోచల పుత్రిక. ప్రాచేతసుల భార్య. పది మంది ప్రాచేతసులు విష్ణువు మాట ప్రకారం విధి ప్రకారంగా ఈమెని వివాహం చేసుకున్నారు.

శివదూషణం చేసిన కారణం చేత దక్షుడు మానవుడై ప్రాచేతసులకు మారిషకి జన్మించాడు. కర్మలో దక్షుడగుట చేత అతడు అదే నామం ధరించాడు ప్రాచేతసులు కొడుకును భార్య వద్ద ఉంచి సన్యసించి నారద మహర్షి ద్వారా ఆత్మతత్వాన్ని ఉపదేశం పొంది హరిపదం పొందారు.

బహు భర్తృత్వానికి ఈ పాత్ర ఉదాహరణ.

## 16. అంగిరసపత్ని (అనామిక)

అంగిరసుడనే బ్రాహ్మణ పత్ని. ఈమె భరతునికి జన్మనిచ్చింది. ఇతడే జడ భరతునిగా ప్రసిద్ధ గాంచాడు. ఈమె భర్తతో పాటు సతీ సహగమనం చేసింది.

# భరత వంశ స్త్రీలు

## 17. దేవసేన

సుమతి భార్య. భరతుని పెద్ద కోడలు. ఈమెకి ఒక పుత్రుడు జన్మించాడు. అతనిపేరు దేవతాజిత్తు.

## 18. ఆసురి

ఈమె సుమతి కోడలు. దేవతాజిత్తు భార్య. ఈమె కుమారుడు దేవద్యుమ్నుడు. ఇతడు మహాపురుషుడు.

## 19. ధేనుమతి

దేవద్యుమ్నుని భార్య. ఈమె పుత్రుడు పరమేష్ఠి

## 20. సువర్చల

ఈమె కూడ దేవద్యుమ్నుని భార్య. ఈమె పుత్రుడు ప్రతీహుడు ఇతడు జనులందరికి బ్రహ్మోపదేశం చేసి హరిస్మరణ చేస్తుండేవాడు. ప్రతీహుడికి ప్రతిహర్త ప్రస్తోత, ఉద్గార ముగ్గురు పుత్రులు. అంటే సువర్చల మనుమలు. వీరి తల్లి పేరు చెప్పబడలేదు.

## 21. స్తుతి

ప్రతిహర్త భార్య. ఈమెకి వ్యోముడు, భూముడనే ఇద్దరు పుత్రులు.

## 22. ఋషి కుల్య

భూముని భార్య. ఈమె పుత్రుడు ప్రస్తోత.

## 23. దేవకుల్య

ఈమె కూడ భూముని భార్య. ఈమె పుత్రుడు ప్రస్తోత.

## 24. వరరుత్స

ఈమె ప్రస్తోత భార్య. ఈమె పుత్రుడు విభుడు.

## 25. భారతి

విభుని భార్య. ఈమెకి పృధుషేణుడనే పుత్రుడున్నాడు.

## 26. ఆకూతి

పృధుషేణుని భార్య. ఈమె పుత్రుడు నక్తుడు. ఈ నక్తుని పుత్రుడే గయుడు. గయుని తల్లి పేరు లేదు.

## 27. జయంతి

గయుని భార్య. ఈమెకి చిత్రరధుడు, స్వాతి, అవరోధనుడనే ముగ్గురు పుత్రులు.

## 28. ఊర్ణ

చిత్రరధుని భార్య. వీరి పుత్రుడు సామ్రాట్టు.

## 29. ఉత్కళ

సమ్రాట్ భార్య. వీరి పుత్రుడు మరీచి.

## 30. బిందుమతి

మరీచి భార్య. వీరి పుత్రుడు బిందుమంతుడు.

## 31. సరఘు

బిందుమంతుని భార్య. వీరి పుత్రుడు మధువు.

## 32. సుమనస

మధువు భార్య. వీరి పుత్రుడు వీరవ్రతుడు.

## 33. భోజ

వీరవ్రతుని భార్య. మన్యు, ప్రమన్యువు అనే ఇద్దరు పుత్రులు.

## 34. సత్య

మన్యువు భార్య. వీరి పుత్రుడు భువనుడు.

## 35. దోష

భువనుని భార్య. వీరి పుత్రుడు త్వష్ట.

## 36. విరోచన

ధర్మాత్ముడైన త్వష్ట భార్య. వీరి పుత్రుడు విరజుడు.

## 37. విషూచి

విరజుని భార్య. వీరికి శతజిత్తు మొదలైన 100 మంది పుత్రులు. ఒక కుమార్తె. గొప్పవాడైన. ప్రియవ్రతుని వంశంలో చివరివాడు విరజుడు. ఇతడు ఉపేంద్రుని వలె రాజవంశంలో రాణించాడు. ఇంతటి గొప్పరాజు భార్య ఈ విషూచి.

## 38. గోదేవి

బ్రహ్మదత్తుని భార్య. ఈమె పుత్రుడు విష్వక్సేనుడు.

## 39. నళిని

అజమీఢుని భార్య. ఈ దంపతులకి నీలుడనే పుత్రుడుదయించాడు.

## 40. అహల్య

ముద్గలుని కుమార్తె. గౌతముని భార్య శతా నందుని తల్లి.

## 2.2.3. క్షత్రియజాతి

### 2.2.3.1. మనువంశ స్త్రీలు

#### 1. సుదేవి

ఈమెకు మేరుదేవి అని నామాంతరం. నాభి భార్య. ఈ దంపతులకు హరి వృషభావతారుడై అవతరించాడు. వృషభావతారం "పరమహంసలు పొందదగిన స్థితి"గా మహర్షులు ప్రశంసించారు భగవంతుడైన, జగత్పూజ్యుడైన శ్రీహరికి జన్మనిచ్చిన సుదేవి సుచరిత.

భాగవతంలో ద్వితీయ స్కంధం 139వ వచనంలో ఈ పాత్ర గూర్చి చెప్పబడింది.

#### 2. సర్వర్ధి

వత్సరుని భార్య. అంటే ధ్రువుని కోడలు. ఈమెకి ఆర్గురు పుత్రులు 1.పుష్పార్ణుడు 2.చంద్రకేతువు 3.నిషుడు 4.ఊర్జుడు 5.వసువు 6.జయుడు.

#### 3. ప్రభ

పుష్పార్ణుని భార్య. ఈమెకు ప్రాతుడు, మధ్యం దినుడు, సాయముడను ముగ్గురు కొడుకులు జన్మించారు.

#### 4. దోష

ఈమెకూడ పుష్పార్ణుని భార్య. ఈమెకు ప్రదోషుడు, నిశీధుడు, వ్యష్టుడు అనే ముగ్గురు పుత్రులు.

#### 5. పుష్కరిణి

వ్యష్టుని భార్య. ఈమె పుత్రుడు సర్వతేజుడు.

#### 6. ఆకూతి

సర్వతేజుని భార్య. వీరి కుమారుడు చక్షుసమనువు.

## 7. నడ్వల

చక్షుస మనువు భార్య. ఈమెకు 12మంది పుత్రులు. 1.పురువు 2.కుత్సుండు 3.త్రితుడు 4.ద్యుమ్నుడు 5.సత్యవంతుడు 6.ఋతుడు 7.వ్రతుడు 8.అగ్నిష్టోముడు 9.అతిరాత్రుడు 10.సుద్యుమ్నుడు 11.శిబి 12.ఉల్ముకుడు.

## 8. పుష్కరిణి

ఉల్ముకుని భార్య . ఈమెకు ఆర్గురు పుత్రులు. 1.అంగుడు 2.సుమానసుడు 3.ఖ్యాతి 4.క్రతువు 5.అంగిరసుడు 6.గయుడు.

## 9. శిఖండిని

విజితాశ్వుని భార్య. పృధు చక్రవర్తి పెద్ద కోడలు త్రేతాగ్నులు ఈ దంపతులకు ముగ్గురు పుత్రులై జన్మించారు (వసిష్ఠుని శాపంచే) పావకుడు, పవమానుడు, శుచి అని వారి పేర్లు.

## 10. నభస్వతి

విజితాశ్వుని రెండవ భార్య. ఈ దంపతులకు హవిర్ధానుడనే పుత్రుడు జన్మించాడు.

## 11. హవిర్ధాని

హవిర్ధానుని భార్య. ఈ దంపతులకు ఆర్గురు పుత్రులు. 1.బర్హిష్మదుడు 2.గయుడు 3.శుక్రుడు 4.కృష్ణుడు 5.సత్యుడు 6.జితవ్రతుడు కలిగారు.

ఈమె జ్యేష్ఠ పుత్రుడు బర్హిష్మదుడు, సమస్త భూమిని యజ్ఞవాటం చేసి, దర్భలను భూమండల మంతా పరచి ప్రాచీన బర్హి అని పేరు పొందాడు. ఇతని ధర్మకార్యాలకు జనులంతా మెచ్చి, అతనిని యోగ సమాధి నిష్ఠుడని, ప్రజాపతి అని, హవిర్ధాని అని వేనోళ్ళ సంస్తుతించి సంతోషించారు. ఇటువంటి జ్యేష్ఠ పుత్రుని కన్న తల్లి జన్మ ధన్యమైంది.

## 12. ఊర్జస్వతి

ఈమె ప్రియవ్రత మహారాజు తనయ. ఈమె తల్లి బర్హిష్మతి. ఈమెను భార్గవునకిచ్చి వివాహం చేసారు. భార్గవుడే శుక్రాచార్యుడు. వీరివురికి దేవయాని అనే కన్యారత్నం జనించింది. ఈమె జన్మత:

రాజకన్య. ఈమె వివాహం భార్గవునితో జరిగింది. ఆ కాలంలో రాజ కన్యలను బ్రాహ్మణుల కిచ్చి వివాహం చేయటం ఆచారంగా ఉన్నట్లు ఊర్జస్వతి వివాహం వల్ల తెలుస్తుంది.

## 13. ప్రియవ్రతుని మరొక భార్య

ఈమె పేరు చెప్పబడలేదు. ఈమెకు ఉత్తముడు, తామసుడు, రైవతుడనే ముగ్గురు గొప్ప పుత్రులు కలిగి మనువులై మన్వంతరాలకు అధిపతులయ్యారు.

## 14. ధరణి

ధ్రువుని భార్య. ఈమె నానావిధ పురాలను ప్రసవించింది.

## 15. వాసన

అర్కుని భార్య వాసన. ఈ దంపతులకు తర్షుడు మొదలైన వారు పుట్టారు, వీరి పేర్లు చెప్పబడలేదు.

## 16. అంగీరస

వస్తువు భార్య. ఈ దంపతులకు విశ్వకర్మ అనే శిల్పాచార్యుడు జన్మించాడు. మంచి చిత్రకారుని లోకానికి అందించిన ఈ తల్లి కడుపు తరించింది. పుణ్యాత్మురాలు ఈ మహిళ.

## 17. ఆకృతి

విశ్వకర్మ భార్య. ఈ దంపతులకు చాక్షుష మనువు జన్మించాడు. ఆ మనువుకి విశ్వులు, సాధ్యులనే వారు జన్మించారు.

## 18. ఉష

విభావసువు పత్ని. ఈ దంపతులకి వ్యష్టి, రోచి, అతపుడు అనే వారు పుట్టారు. అతపునికి దినాధి దేవత అయిన పంచయాముడనేవాడు జన్మించటం వల్ల ఉషపౌత్రుని కూడ పొందిన పుణ్యవతి.

## 19. ఓఘవతి

సుదర్శనుని భార్య. ఓఘవంతుని కుమార్తె. ఈమె కారూశుల వంశానికి చెందిన మహిళ. ఈ కారూశులు జన్మత: క్షత్రియులు. కర్మత: బ్రాహ్మణులు.

## 20. సత్కృతి

శుకుని కూతురు. నీప మహారాజు భార్య. బ్రహ్మదత్తుడు ఈమె పుత్రుడు.

## 21. శాంత

దశరధుని కుమార్తె. రోమపాదుని పెంపుడు కుమార్తె. ఋశ్యశృంగుణి భార్య. ఈ దంపతులను తీసుకువెళ్ళి పుత్రకామేష్ఠియాగం చేసినందువల్లనే దశరధునకు సంతానం కలిగింది.

## 22. సంభూతి

రోమపాదుని వంశానికి చెందిన విజయుని భార్య. వీరికి ధృతి పుత్రుడుదయించాడు.

## 23. ఆహుకి

ఈమె పునర్వసువు కుమార్తె. ఈమెకు ఆహుకుడనే సోదరుడున్నాడు.

## 2.2.3.2. ప్రజాపతి వంశ స్త్రీలు

### 1. కళ

కర్దమ ప్రజాపతి కుమార్తె. మరీచి మహర్షి భార్య. వీరిరువురికి కశ్యపుడనే కొడుకు, పూర్ణిమ అనే కుమార్తె జన్మించారు. ఆ కశ్యపుని సంతానం, పూర్ణిమ సంతానం లోకాలన్నింట నిండి పోయింది. పూర్ణిమ విరజుడనే కొడుకును, దేవకుల్య అనే కుమార్తెను కన్నది. ఈమెయే శ్రీమన్నారాయణుని పాద ప్రక్షాళన జలాలతో స్వర్గంగా జన్మాంతరం పొందింది.

### 2. శ్రద్ధ

ఈమె దక్షప్రజాపతి ప్రసూతి దంపతుల కుమార్తె. ధర్ముని భార్య. ఈమెకు శ్రుతమనే కుమార్తె జన్మించింది.

### 3. మైత్రి

ఈమె కూడ దక్ష ప్రజాపతి ప్రసూతి దంపతుల కుమార్తె ధర్ముని భార్య. ఈమెకు ధర్ముని వల్ల ప్రసాదమనే కుమార్తె జన్మించింది.

### 4. దయ

ఈమె దక్ష ప్రజాపతి ప్రసూతి దంపతుల కుమార్తె. ధర్ముని భార్య. ఈమెకు ధర్ముని వల్ల అభయం జన్మించింది.

### 5. శాంతి

ఈమె దక్షప్రజాపతి ప్రసూతి దంపతుల పుత్రిక. ధర్ముని భార్య ఈమెకు 'సుఖం' జన్మించింది.

### 6. తుష్టి

ఈమె దక్ష ప్రజాపతి ప్రసూతి దంపతుల తనయ. ధర్ముని భార్య. ఈమెకు సంతోషం జన్మించింది.

## 7. పుష్టి

ఈమె దక్షప్రజాపతి ప్రసూతి దంపతుల తనయ. ధర్ముని భార్య. ఈమెకి స్మయం జన్మించింది.

## 8. క్రియ

ఈమె ప్రసూతి, దక్ష ప్రజాపతుల తనయ, ధర్ముని భార్య ఈమెకి యోగం జన్మించింది.

## 9. ఉన్నతి

ఈమె ప్రసూతి దక్ష ప్రజాపతి దంపతుల పుత్రిక. ధర్ముని భార్య. ఈమెకు అర్ధం జన్మించింది.

## 10. బుద్ధి

ఈమె ప్రసూతి దక్ష ప్రజాపతి దంపతుల పుత్రిక. ధర్ముని భార్య. ఈమెకు దర్పం జన్మించింది.

## 11. మేధ

ఈమె ప్రసూతి దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ధర్ముని భార్య. ఈమెకు స్మృతి జన్మించింది.

## 12. తితిక్ష

ఈమె ప్రసూతి దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ధర్ముని భార్య. ఈమెకి క్షేమం జన్మించింది.

## 13. హ్రీ

ఈమె ప్రసూతి దక్షప్రజాపతి దంపతుల పుత్రిక. ధర్ముని భార్య. ఈమెకి ప్రళయం జన్మించింది. (దక్ష ప్రజాపతి తన పదముగ్గురు (13 మంది) కుమార్తెలను ధర్మునికిచ్చి వివాహంచేసాడు. పదముగ్గురులో మూర్తి ప్రధాన పాత్రల్లో వస్తుంది. ఈ పన్నెండుమంది అప్రధాన పాత్రలు)

## 14. భ్రమి

ఈమె శింశుమార ప్రజాపతి కుమార్తె. ధ్రువుని భార్య. ఈమెకు కల్పుడు, వత్సరుడు అనే ఇద్దరు పుత్రులు.

## 15. భానువు

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల కుమార్తె. ధర్ముని పత్ని. ఈమెకు భానువనే కుమారుడు జన్మించాడు. ఇంద్రసేనుడనే మనుమడు ఉన్నాడు.

## 16. లంబ

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల కుమార్తె. ఈమె ధర్ముని పత్ని. ఈమెకు స్తనయిత్నువులు పుట్టారు.

## 17. కుకుబ్దేవి

ఈమె అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల కుమార్తె. ఈమె ధర్ముని పత్ని. కకుబ్దేవికి సంకటుడనే పుత్రుడు జన్మించాడు. ఈమె మనుమడు కీకటుడు పుత్ర పౌత్రులతో జన్మ తరింప చేసి కొన్న స్త్రీమూర్తి.

## 18. అభిమతి

ఈమె ద్రోణుని పత్ని. ఈమె హర్షం, శోకం, భయమనే బిడ్డలను కన్నది,

## 19. ఊర్జస్వతి

ఈమె ప్రాణుని భార్య. ఈమెకు సహుడు, ఆయువు, పురోజవుడనే ముగ్గురు కొడుకులు పుట్టారు.

## 20. అర్చి

అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ, కృశాశ్వుని భార్య. ధూమ్రకేశుడిని పుత్రునిగా పొందింది.

## 21. ధిషణ

ఈమె అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కృశాశ్వుని భార్య. ఈమెకు దేవలుడు, వయునుడు, మనువనే పుత్రులున్నారు.

## 22. పతంగి

ఈమె కూడ అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె తార్క్ష్య కశ్యపుని భార్య. ఈమెకు పక్షులు పుట్టాయి.

## 23. యామిని

ఈమె కూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ తార్క్ష్య కశ్యపుని భార్య. యామినికి మిడుతలు మొదలైన కీటకాలు జన్మించాయి.

## 24. కిమి

ఈమె అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ, కశ్యప ప్రజాపతి భార్య. ఈమెకు తిమింగలాలు మొదలైన జలచర గణాలు జన్మించాయి.

## 25. సరమ

ఈమె అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. కశ్యప ప్రజాపతి భార్య. సరమకు సారమేయాలు (శునకాలు) పుట్టాయి.

## 26. సురభి

ఈమె అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. కశ్యప ప్రజాపతి భార్య ఈమె. సురభికి గోవులు, గేదెలు మొదలైన రెండు గిట్టల జంతువు లుద్భవించాయి,

## 27. తామ్ర

ఈమె కూడ అసిక్ని, దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కశ్యప ప్రజాపతి భార్య. తామ్రకు డేగలు, గద్దలు మొదలైన హింస చేసే పక్షులు జన్మించాయి.

## 28. ముని

ఈమె కూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కశ్యప ప్రజాపతి భార్య మునికి అప్సరసలు ఆవిర్భవించారు.

## 29. ఇల

ఈమె కూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కశ్యప ప్రజాపతి భార్య. ఇల వృక్షాలను ప్రసవించింది.

## 30. క్రోధవశ

ఈమెకూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కశ్యప ప్రజాపతి భార్య. ఈమెకు భయంకరమైన విష సర్పాలు జనించాయి.

## 31. సురస

ఈమెకూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కశ్యప ప్రజాపతి భార్య. ఈమె యాతుధానులనేరాక్షసులను కన్నది.

## 32. అరిష్ఠ

ఈమెకూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కశ్యప ప్రజాపతి భార్య. అరిష్టకు గంధర్వులు జనించారు.

## 33. కాష్ఠ

ఈమెకూడ అసిక్ని దక్ష ప్రజాపతి దంపతుల తనయ. ఈమె కూడ కశ్యప ప్రజాపతి భార్య. ఈమెకు సంతానమున్నట్లు చెప్పబడలేదు. దక్ష ప్రజాపతి తన తనయులు 13 మందిని కశ్యప ప్రజాపతికిచ్చి వివాహం చేసాడు.

## 2.2.3.3 కురువంశ స్త్రీలు

### 1. పౌరవతి

ఈమె యుధిష్ఠరుడి భార్య. ఈమె పుత్రుడు దేవకుడు.

### 2. కాళి

ఈమె భీమ సేనుని పత్ని. ఈమె పుత్రుడు సర్వగతుడు

### 3. రేణుమతి

ఈమె నకులుని భార్య. వీరిరువురికి నిరమిత్రుడనే పుత్రుడున్నాడు.

### 4. విజయ

ఈమె సహదేవుని భార్య. వీరిరువురికి సుహోత్రుడనే పుత్రుడు జన్మించాడు.

### 5. చిత్రాంగద

ఈమె మణిపురం రాజకుమారి. అర్జునుని భార్య. వీరిరువురి పుత్రుడు బభ్రువాహనుడు. పరాక్రమంలో అర్జునునితో సమానమైన వాడు. ఈ చిత్రాంగద తన తండ్రి వంశానికి తనయుడిని వారసుని చేసి తల్లిదండ్రుల ఋణం తీర్చుకున్న తనయ.

### 2.2.3.4. సర్పజాతి స్త్రీలు

#### 1. ఉలూపి

ఈమె నాగజాతి స్త్రీ. అర్జునుని భార్య. ఈ దంపతుల పుత్రుడు ఇలావంతుడు.

#### 2. నర్మద

ఈమె నాగకన్య మాంధాత కుమారుడైన పురుకుత్సుని వివాహం చేసికొంది.

## 2.2.3.5. యాదవ జాతి స్త్రీలు

### 1.శైబ్య

జ్యామఖుడనే యదువంశరాజు భార్య. శైబ్య విదర్భుడనే పుత్రునికి జన్మనిచ్చింది.

### 2. కన్యక

ఈమె పేరు లేదు. జ్యామఖుడు తెచ్చిన కన్య. ఈమెను విదర్భుని కిచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు కుశుడు, క్రుధుడు, రోమపాదుడనే పుత్రులు కలిగారు.

దేవకుని కుమార్తెలు ఏడుగురిని వసుదేవుడు వివాహమాడాడు

వసుదేవ పత్నులు

| పత్నులు | పుత్రులు |
|---|---|
| 3. ధృత దేవకి | త్రిపుష్టుడు అనే పుత్రుడున్నాడు |
| 4. శాంతిదేవకి | ప్రశముడు, ప్రశితుడు ఇద్దరు పుత్రులు |
| 5. ఉపదేవకి | కల్పవృష్టి మొదలైన పదిమంది పుత్రులు |
| 6. శ్రీదేవకి | వసుడు, హంసుడు,సుధన్వుడు మొదలైన ఆర్గురు పుత్రులు |
| 7. దేవరక్షిత | గదుడు మొదలైన 9 మంది పుత్రులు |
| 8. సహదేవకి | పురూఢుడు, శ్రుతుడు మొదలైన 8 మంది పుత్రులు, అష్ట వసువుల అవతారం |
| 9. దేవకి కి | కీర్తిమంతుడు, సుషేణుడు, భద్రసేనుడు, ఋజువు, సవదనుడు, భద్రుడు, సంకర్షణుడు, శ్రీకృష్ణుడు, సుభద్ర అనే కుమార్తె ఉన్నారు. |

ఉగ్రసేనుని కుమార్తెలు నల్గురిని వసుదేవుని తమ్ముళ్ళు వివాహమాడారు.

### 10. కంప

ఉగ్రసేనుని కుమార్తె. దేవభాగుని భార్య. కంసుని సోదరి. ఈమెకి చిత్రకేతుడు, బృహద్బలుడనే పుత్రులున్నారు.

## 11. కంసవతి

ఈమె ఉగ్రసేనుని కుమార్తె, వసుదేవుని సోదరుడైన దేవశ్రవుని భార్య, వీరుడు, ఇషుమంతుడనే ఇద్దరు పుత్రులు ఈమెకు

## 12. సురాభువు

ఉగ్రసేనుని కుమార్తె. కంసుని తోబుట్టువు వసుదేవుని తమ్ముని భార్య.

## 13. రాష్ట్ర పాలిక

ఉగ్రసేనుని కుమార్తె. కంసుని తోబుట్టువు వసుదేవుని తమ్ముని భార్య.

## 14. మారిష

శూరుని భార్య. ఈమెకు వసుదేవుడు మొదలైన పదిమంది పుత్రులు. పృధ మొదలైన ఐదుగురు కుమార్తెలున్నారు,

## 15. శ్రుతదేవ

మారిష శూర దంపతుల పుత్రిక. ఈమె కరూశదేశ రాజైన వృద్ధ శర్మ పత్ని. వీరి పుత్రుడు దంతవక్త్రుడు.

## 16. శ్రుతకీర్తి

ఈమె కూడ శూరుని కుమార్తె. వసుదేవుని తోబుట్టువు. ఈమెను కేకయరాజైన దృష్ట కేతుడు వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదుగురు పుత్రులు.

## 17. శ్రుతశ్రవస

ఈమె మారిష శూర దంపతుల తనయ. వసుదేవుని తోబుట్టువు. ఛేది దేశపురాజైన దమ ఘోషుడు శ్రుత శ్రవసను చేపట్టాడు. ఈ దంపతుల పుత్రుడు శిశుపాలుడు.

## 18. రాజాధిదేవి

ఈమె కూడ మారిష, శూర దంపతుల తనయ, వసుదేవుని తోబుట్టువు. ఈమె భర్త జయత్సేనుడు. ఈ దంపతులకు విందుడు, అను విందుడు అనే ఇద్దరు పుత్రులున్నారు.

## 19. కర్ణిక

ఆనకుని భార్య. ఈమెకి ఋతధాముడు, జయుడనే ఇద్దరు పుత్రులున్నారు.

## 20. పౌరవి

వసుదేవుని భార్య. ఈమెకు సుభద్రుడు, భద్రబాహుడు, దుర్మదుడు, భద్రుడు, భూతుడు మొదలైన 12 మంది పుత్రులున్నారు.

## 21. మదిర

ఈమె వసుదేవుని భార్య. ఈమెకు నందుడు, ఉపనందుడు, కృతకుడు, శ్రుతుడు, శూరుడు మొదలైన పుత్రులున్నారు.

## 22. కౌసల్య

ఈమె వసుదేవుని భార్య. ఈమెకు కౌశి అనే పుత్రుడున్నాడు.

## 23. రోచన

ఈమె కూడ వసుదేవుని భార్య. ఈమెకు హస్తుడు, హేమాంగదుడు మొదలైన కుమారులున్నారు.

## 24. ఇళ

ఈమె వసుదేవ పత్ని. యదుకులంలో ముఖ్యులైన ఉరు వల్కలుడు మొదలైన వారికి జన్మనిచ్చింది.

## 2.2.3.6. రాక్షసజాతి స్త్రీలు

### 1. సుప్రభ

దానవుడైన స్వర్భానుడి కుమార్తె. ఈమెను నముచి వివాహమాడాడు.

### 2. హయశిర

దనువు పుత్రుడైన వైశ్వానరుడి కుమార్తె ఈమె. ఈమెను క్రతువు వివాహమాడాడు.

### 3. పులోమ

ఈమె కూడ దానవుడైన వైశ్వానరుని తనయ. ఈమెను బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం కశ్యప ప్రజాపతి వివాహం చేసికొన్నాడు. పులోమకి పౌలోములు జన్మించారు.

### 4. కాలక

ఈమె కూడ దానవుడైన వైశ్వానరుని తనయ. ఈమెను కూడ బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం కశ్యప ప్రజాపతి వివాహం చేసి కొన్నాడు కాలకకు కాలకేయులు జన్మించారు. వీరికి అరవై వేలమంది రాక్షసులు జన్మించారు. వీరు దను వంశీయులైన రాక్షసులు.

### 5. సింహిక

దనువు కుమారుడైన విప్రచిత్తి ఈమెను వివాహమాడాడు. వారికి రాహువు మొదలైన నూరుమంది పుత్రులు జన్మించారు. నూట ఒక్క మంది అని మూలంలో ఉంది. వీరిలో పెద్దవాడు రాహువు. మిగిలిన వందమందికి కేతువులని పేరు. వారంతా గ్రహాలుగా మారారు.

### 6. గతి

ప్రహ్లాదుని సోదరుడైన సంహ్లాదుని భార్య ఈమె. అంటే కయాధువు (లీలావతి) హిరణ్య కశిపుల కోడలు. ఈ దంపతులకు పంచ జనుడు ఉదయించాడు.

## 7. దమని

ఈమె ప్రహ్లాదుని సోదరుడైన హ్లాదుని భార్య. ఈ దంపతులకు వాతాపి, ఇల్వలుడనే ఇద్దరు పుత్రులుదయించారు. ఈ ఇరువురు అగస్త్య మహర్షి ఆగ్రహాగ్నికి ఆహుతి అయ్యారు.

## 8. సూర్మ్య

ప్రహ్లాదుని సోదరుడైన అనుహ్లాదుని భార్య ఈమె. ఈమెకి బాష్కలుడు, మహిషుడనే తనయులు జన్మించారు.

## 9. జర

రాక్షస స్త్రీ బృహద్రథుని భార్య గర్భంలో ఒకే బిడ్డ శరీరం రెండు ముక్కలైంది. ఆ ముక్కలను చూచి తల్లి పారవేసింది. జర ఆ రెండు ముక్కలను ఒకటిగా కలిపింది. వాడు జరాసంధుడనే పేరుతో గిరివ్రజపురాన్ని పాలించాడు. రాక్షస స్త్రీ అయినప్పటికి ఒకడికి ప్రాణం పోసింది కాబట్టి భాగవతం వంటి పవిత్ర గ్రంథంలో చోటు సంపాదించుకుంది.

## 10. హిడింబ

హిడింబాసురుని సోదరి. భీముని మోహించి భార్య అయింది. రాక్షస స్త్రీ. ఘటోత్కచుని తల్లి.

## 11. కంక

కంకుని భార్య. వీరికి బకుడు, సత్యజిత్తు, పురుజిత్తు అనే పుత్రులు కలిగారు.

## 12. రాష్ట్రపాలి

సృంజయుని భార్య, ఈ దంపతులకు వృషుడు, దుర్మర్షణుడు మొదలైన వాళ్ళు జన్మించారు.

## 13. సురభూమి

శ్యామకుని భార్య. ఈ దంపతులకు హరికేశుడు, హిరణ్యాక్షుడు పుట్టారు.

## 14. దూర్వాక్షి

వృకుని భార్య. ఈ దంపతులకు తక్షుడు, పుష్కరుడు, సాళ్వుడు మొదలైన వారిని పొందాడు.

## 15. సుదాముని

అనీకుని భార్య. ఈ దంపతులకు సుమిత్రానీకుడు, బాణుడు మొదలైన పుత్రులను పొందాడు.

## 16. అస్తి, 17. ప్రాస్తి

జరాసంధుని కుమార్తెలు. కంసుని భార్యలు.

శ్రీకృష్ణుడు కంసుని సంహరించిన తర్వాత తమతండ్రి జరాసంధుని వద్దకు వెళ్ళి

*శా. "వాండ్రున్ వీండ్రున్ రాజులే యనుచు గర్వప్రౌఢితో యాదవుల్*
*వేండ్రంబైన బలంబుతో మధురకున్ వేవచ్చి నిష్కారణం*
*బాండ్రున్ బిడ్డలు బంధులున్ వగవ 'గంసాది క్షమానాధులన్*
*దండ్రీ! చంపిరి కృష్ణుచేత నిటు వైధవ్యంబు వచ్చెన్‌జుమీ!"*[326]

యాదవులు లోకంలో ఉన్న వారందరు రాజు లేనా? అని యాదవులు మిక్కిలి గర్వించి ఎదురులేని బల పరాక్రమాలతో మధురా నగరాన్ని ముట్టడించి కంసుని సంహరించి మాకు వైధవ్యం కలిగించారని దు:ఖించారు.

కూతుళ్ళ దు:ఖాన్ని చూసి, 23 అక్షౌహిణుల సైన్యంతో మధురాపురంపై దండెత్తాడు. కంసుని భార్యలైన అస్తి, ప్రాస్తి తన వైధవ్యానికి కారకులైన బలరామ కృష్ణులను గూర్చి తమ తండ్రి జరాసంధునికి చెప్పి, దు:ఖించి తండ్రి వల్లనైన ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన వల్ల, వీరి పతి భక్తి వెల్లడౌతుంది.

పరాక్రమోపేతుడైన జరాసంధుని కుమార్తెలు పగ, ప్రతీకార తత్త్వం కల్గిన మహిళలు. దుష్టుడైన, దుర్మార్గుడైనా వీరు మహిళలుగా భర్త పట్ల మక్కువ చూపించి మాననీయ మహిళలయ్యారు. జరాసంధునికి శ్రీకృష్ణునిపై శత్రుత్వం కలగటానికి వీరు కారణమై, పరోక్షంగా దుష్టశిక్షణ మనే శ్రీకృష్ణావతార కార్యానికి తోడ్పడి ప్రతి నాయకుని భార్యలుగా భాగవతంలో స్థానం సంపాదించుకున్నారు.

## 18. మాయావతి

శంకరుని కంటి మంటలకు ఆహుతి అయిన మన్మధుని కోసం రతీదేవి తపించి పోతుంది. తర్వాత జన్మలో మాయావతి పేరుతో శంబరాసురుని కుమార్తెగా జన్మిస్తుంది. రుక్మిణీ శ్రీకృష్ణులకు మన్మధుడు ప్రద్యుమ్నునిగా జన్మిస్తాడు. శంబరాసురుడు ఆ బాలుడు తనకు శత్రువు కాగలడని గ్రహించి, కామరూపంలో పురుటింటిలోకి ప్రవేశించి ఆ బాలుని అపహరించుకొని వెళ్ళి సముద్రం లో పారవేస్తాడు. ప్రద్యుమ్నుని ఒక చేప మ్రింగింది. రాజాంతఃపురంలో వంటవారు ఆచేపను కోయగా రాచబిడ్డ వారికి కనిపిస్తాడు. వంటవారు ఈ విషయాన్ని నారదుడు మన్మధుడే ప్రద్యుమ్నుడని, శంబరుడు అతన్ని చంపటానికి ప్రయత్నించటం, ఆ బాలుని చేప మ్రింగటం, ఆ బాలుడే ఈ ప్రద్యుమ్నుడని తెలియ చేస్తాడు (మాయావతికి).

'భోజ్యేషుమాత' అన్న విధంగా శంబరుని అనుమతితో ఆ బాలుని (ప్రద్యుమ్నుని) వంటవారి వద్ద నుండి తీసికొని వచ్చి పోషింప సాగింది. ప్రద్యుమ్నుని సురత భ్రాంతితో చూస్తున్న మాయావతికి ప్రద్యుమ్నుడు ధర్మ ప్రబోధం చేస్తాడు.

మాయావతి (రతీదేవి) గత జన్మను గుర్తుచేసి శంబరుడు అపహరించటం, ప్రద్యుమ్నుని జన్మ వృత్తాంతాన్ని గుర్తుచేసి శంబరాసురుని సంహరించమని. ప్రబోధం చేసి 'కరణేషుమంత్రీ' అన్న సూక్తికి నిదర్శనంగా నిలిచింది. రుక్మిణీ శ్రీకృష్ణుల పుత్రుడైన ప్రద్యుమ్నునికి సర్వశత్రువుల మాయలను నాశనం చేసే 'మహామాయ' అనే విద్యని ఉపదేశించింది.

శంబరాసుర సంహారానంతరం ప్రద్యుమ్నుని తీసికొని రతీదేవి ద్వారకా నగరానికి చేరుకుంది. నారద మునీంద్రుడు వచ్చి శంబరాసురుడు ప్రద్యుమ్నుని అపహరించుకొని పోవటం మొదలైన విషయాలు శ్రీకృష్ణునకు వెల్లడిస్తాడు.

### పెద్దల ఆశీస్సులు, ప్రశంసలు

దేవకీ వసుదేవులు, బలరామకృష్ణులు రతీ ప్రద్యుమ్నులను విలువైన వస్త్రాభరణాలు అలంకారాలతో సత్కరించి, సన్మానించి సంతోషించారు. రుక్మిణీదేవి తన పుత్రుని కౌగలించుకొని కోడలి సద్గుణాలను పలుమార్లు ప్రశంసించి, ఆనందంతో కాలం గడుపుతుండగా ద్వారకా నగర వాసులందరు ఈ వార్తవిని సంతోషించారు.

తన పతి భక్తిచే మాయావతిగా జీవిస్తూ, తన భర్త జన్మను గుర్తించి తెలుసుకొని, తానే పెంచి పోషించి విద్యలు నేర్పి (దుష్ట శిక్షణ గావించి) రాక్షస సంహారం చేయించి, పతి నివాసానికి తీసుకు వెళ్ళి అక్కడ పెద్దలచే ఆశీర్వదింపబడి, అత్తగారిచే ప్రశంసింపబడి, తన జీవితాన్ని తానే నిలబెట్టుకొన్న మహిళ ఈమె. తన జీవితం కోసం, తన పతి ప్రాణం కోసం తండ్రిని చంపించటానికి వెనుదీయని ప్రవృత్తి గల రాక్షస స్త్రీగా బాహ్య ప్రపంచానికి కన్పిస్తుంది. కాని గత జన్మ దృష్ట్యా చూస్తే తన భర్తను కాపాడు కోవటానికి తన శక్తులనుపయోగించి అసుర సంహారం గావించిన ఆదర్శ మహిళ.

## 19. కోటర

ఈమె బాణాసురుని తల్లి. శ్రీకృష్ణుని భయంకర పరాక్రమానికి వెరగుపడి ముఖం కళ తప్పి బాణాసురుడు ఏమి చేయలేక నిశ్చేష్టుడైన సమయంలో

*సీ. అత్తఱి 'గోటరయను బాణ జన యిత్రి సుతు'గాచు మతము సన్మతి'దలంచి*
*వీడి శిరోజముల్ వ్రేలంగ నిర్ముక్త పరిధానయై మురాసుర విభేది*
*యెదురు నిల్చిన'జూడమది'జాలరోసి పరాఙ్ముఖు'డై యున్న నను వు వేచి*
*తల్లడించుచు బాణు'డుల్లంబు గలగంగ 'దల చీరవీడ యాదవులు నవ్వ*

*తే. "నవ్యకాంచన మణిభూషణములు రాల'*
*బాదహతినేల 'గంపింప'బాఱి యాత్మ*
*పురము వడి'జొచ్చెనప్పుడు భూతగణము*
*లాకులతతోడ నెక్కడే నరుగుట యును"*[327]

బాణాసురుని తల్లి 'కోటర' తన పుత్రుని రక్షించుకోవటానికి, తగిన ఆలోచన చేసి, తల విరబోసు కొని, దిగంబరయై యుద్ధరంగానికి వచ్చి వీడిన జుట్టుతో, వివస్త్రయై శ్రీకృష్ణుని ఎదుట నిలిచింది.

పుత్ర వాత్సల్యానికి పరాకాష్ఠ ఈ సన్నివేశం. స్త్రీపుత్ర రక్షణకై సిగ్గువిడిచి వివస్త్రయై యుద్ధ భూమికి ఏతెంచటం చరిత్రలో కనీ విని ఎఱుగని విషయం.

ఈమె రాక్షస స్త్రీ. అందు వల్లనే ఈ విధంగా చేయగల్గింది. ఈమెను చూచి అసహ్యించు కొని పెడమొగం పెట్టాడు. బాణాసురుడు యుద్ధ భూమి నుండి వెనుదిరిగాడు.

సిగ్గువిడిచి కోటర తన పుత్రుని చక్రధారి చక్రానికి గురికాకుండా కాపాడుకుంది.

షష్ఠ స్కంధంలో 'అశన' బాణాసురుని తల్లిగా పేర్కొనబడింది. 'అశన' కోటర అనే నామాంతర ముందేమోనన్న సందేహం కల్గుతుంది. పూర్వాగాథాలహరి లో కూడ బాణాసురుని తల్లి 'అశన' గానే చెప్పబడింది.

## 2.2.3.7. అన్య స్త్రీలు

### 1. నారదుని తల్లి

ఈమె వేద వాదుల ఇంటదాసి. తాను పరాధీన అయినప్పటికి బిడ్డను అల్లారు ముద్దుగా రేపు మాపు చూసుకుంటూ ముద్దు ముచ్చటలు తీర్చేది. ఒక చీకటి వేళ పాలు పితుకుచుండగా పాము కాటు వల్ల మరణించింది.

ఈమె దాసి అయినప్పటికి చిత్తశుద్ధిగ తన కర్తవ్య నిర్వహణ గావించింది. తల్లిగా తాను తన బిడ్డకు జీవితాంతం తోడు నిలువలేక పోయినా బిడ్డను సజ్జనుల మధ్య నిలిపి వెళ్ళింది. ఆవేద వాదులకు సేవలు చేస్తూ. వారు తిన్న తర్వాత మిగిలిన ఎంగిలి తిని వారి దయకు పాత్రుడై ఈశ్వర రహస్యోదార విజ్ఞానం ఉపదేశం పొందగల్గాడు.

*శా. "వారల్ కృష్ణు చరిత్రముల్ చదువ'గా వర్ణింప'గా బా'డ'గా*
*నారావంబు సుధారస ప్రతిమమై యశ్రాంతమున్ వీనులం*
*దోరంబై పరిపూర్ణమైన మది సంతోషించి నేనంతటం*
*బ్రారంభించితి విష్ణు సేవ కితర ప్రారంభ దూరుండనై"*[328]

తల్లి సేవానిరతే నారదుని విజ్ఞానిని దేవర్షిని కావించ గలిగింది. నారదుడే పరాశర నందనుడైన వ్యాసునితో తన పూర్వజన్మ వృత్తాంతాన్ని వివరించాడు.

### 2. విదురుని తల్లి

ఈమెకి పేరు లేదు. విదురుడు ధర్మ స్వరూపుడు. పూర్వ కాలంలో మాండవ్యుడనే మహర్షి శాపం వల్ల యమధర్మరాజు శూద్ర కులంలో విదురుడై జన్మించాడు. ఆ నూరు సంవత్సరాలు సూర్యుడే యధా విధిగా యమధర్మరాజు స్థానంలో ఉండి పాపాత్ముల పాపాలకు తగిన శిక్షలు విధించమన్నాడు.

*"అది యెట్లనిన మాండవ్య మహాముని శాపంబునం దొల్లి యముం*
*డు శూద్ర యోనియందు విదురుండై జన్మించియున్న నూఱు*

*వత్సరంబు లర్యముండు యధా క్రమంబునం బాపకర్ముల*

*దండించె, ... ... ... .... .... .... .... .... .... .... సుఖియై యుండెనంత"* [329]

విదురుని తండ్రి వ్యాసమహర్షి. భీష్ముని సోదరుల అకాలమృత్యు హరణం వల్ల కురువంశం అనపత్యంగా మిగిలిపోయింది. కురు వంశాభి వృద్ధి నిరోధానికి తాను కారణం కాకూడదని శంతన మహారాజు రెండవ పట్టపురాణియైన సత్యవతీదేవి ఆలోచించి, భీష్మునికి తన పూర్వ వృత్తాంతం (వివాహ పూర్వమే పరాశర ముని వల్ల వ్యాసుని సద్యోగర్భ జాతునిగా పొందటం) విన్పించి, వ్యాస మహర్షి వల్ల తన కోడండ్రు సంతానవతులైతే కురువంశం నిలబడుతుందని వివరించింది. ద్వాపర యుగధర్మాన్ని నిలబెట్టటానికి బ్రాహ్మణుల ద్వారా, ఋషుల ద్వారా క్షత్రియ పట్టమహిషిలు ఆపద్ధర్మం గా సంతానం పొందటం. దోషం కాదు. భీష్ముడు సత్యవతీదేవి తన పుత్రుడైన వ్యాసుని స్మరించింది. వ్యాసుడు ప్రత్యక్షమయ్యాడు. వ్యాసుని పిలిపించటానికి కారణం చెప్పింది. ఆపద్ధర్మం, తల్లి అభ్యర్థన కాబట్టి వ్యాసుడు అంగీకరించాడు. సత్యవతీదేవి తన కోడండ్రు అంబికకు, అంబాలికకు విషయం వివరించి ఒప్పించింది. అత్తగారి మాటలు జవదాటలేని నిస్సహాయ స్థితి అంబిక అంబాలికలది. ఇష్ట పూర్వకంగా కాక భయపడి వ్యాసమహర్షితో సమాగమం కాబట్టి అంధుడైన ధృతరాష్ట్రునికి జన్మనిచ్చింది అంబిక. భయంతో వదనం వివర్ణమై వ్యాసమహర్షితో సమాగమం కారణంగా పాండురాజుకి జన్మనిచ్చింది అంబాలిక. వ్యాసుని వల్ల విషయం తెలిసికొన్న సత్యవతి మరొకసారి అంబికను ప్రయత్నించమంటుంది. అంబికకు ఇష్టం లేని కారణంగా తన అంతఃపుర దాసికి తన వేషధారణ చేసి వ్యాసుని వద్దకు పంపించింది.

వృత్తిరీత్యా దాసియైనప్పటికి ప్రవృత్తి రీత్యా ఋషిపట్ల మహాగౌరవం ఉండటం వల్ల జన్మతః శూద్రురాలైన ఆదాసి విదురుని వంటి మహాజ్ఞాని జన్మకి కారణమై అనామకురాలైనను, అనామికయై (ఉంగరపు వ్రేలుకు అనామిక అని పేరు) భక్తి ముక్తిదాయకాలైన మహాభారత, భాగవత గ్రంథాల్లో స్థానం సంపాదించుకొని తన జన్మ సఫలం చేసికొంది.

స్త్రీ శీలం దృష్ట్యా పరిశీలించి చూడగా విదురుని తల్లి చేసింది ముమ్మాటికి దోషమే. ఆ దోషం చేయటానికి కారణం తాను ఆశ్రయించిన వారిని గౌరవించటం. ఇందులో కేవల ప్రభుభక్తి. దాసీగా తన కర్తవ్య నిర్వహణ రాణి గారు చెప్పిన పనులు చేయటం. ఆ పనుల ఉచితానుచితాలు,

దోషాదోషాలు, పాప పుణ్యాలు ఆ రాణికే చెందుతాయి. కాబట్టి విదురుని తల్లి దోషి కాదు. ఒక మహాజ్ఞాని జన్మకు కారణమైనందున, తాను దేహంతో చేసింది పాపమైనా నశించి పోతుంది కదా! పంచమవేదమైన భారతం, ముక్తి ప్రదాయకమైన భాగవతం వంటి పవిత్ర గ్రంధాల్లో ఆమె చరిత్ర ఉండటం వల్ల ఆమె జన్మ తరించిందనే మనం భావించవచ్చు, చెప్పవచ్చు.

సత్సంగం సత్ఫలితాన్నే ఇస్తుంది కదా!

*"వ్యాసాయ విష్ణురూపాయ వ్యాస రూపాయ విష్ణవే"*

విష్ణు స్వరూపుడైన వ్యాసుని సమాగమానికి విదురుని తల్లి రాణిగారి (అంబిక) భయంతోనే అంగీకరించి ఉంటుంది. అందువల్ల ఈమె దాసి కాబట్టి నీచ స్వభావి అనటం కంటే విదురుని వంటి మహా జ్ఞాని జన్మకు కారణమైనందు వల్ల పావన చరితగానే భావించటం సమంజసమన్పిస్తుంది.

## 3. హస్తినాపుర సుందరులు

కురుక్షేత్ర రణరంగ సమాప్తితో  శ్రీ కృష్ణావతార కార్యం దుష్టశిక్షణ శిష్ట రక్షణ జరిగింది. శ్రీకృష్ణుడు

*"కురు సంతతికి, బరీక్షి*

*న్నరవరు నంకురము సేసి నారాయణుడీ*

*ధరణీ రాజ్యమునకు నీ*

*శ్వరుగా ధర్మజుని నిలిపి సంతోషించెన్"* [330]

కురు సంతానానికి వంశాంకురంగా పరీక్షిత్తును నిలబెట్టి ఆ సమస్త సామ్రాజ్యానికి ధర్మరాజుని అధినేతగా నిలిపి సంతుష్టాంత రంగుడై ద్వారకకి బయలుదేరాడు.

శ్రీకృష్ణుడు ద్వారకకి బయలుదేరి రథంపై వెళుతుండగా బంగారు మేడలపై నిలబడి అంత:పుర కాంతలు పుష్పవర్షం కురిపించారు.

ద్వారకకు వెళుతున్న గోపాలుని సందర్శించటానికి పట్టణంలోని సుందరీమణులు, వీధికి ఇరువైపుల ఉన్న మేడలపైకి ఎక్కి ఒకరికొకరు శ్రీకృష్ణుని గూర్చి ఈ క్రింది విధంగా సంభాషించారు.

హస్తినాపుర సుందరీమణులు శ్రీకృష్ణుని చూచుటే మహాద్భాగ్యమని అతనిని చూడలేని రోజులు కల్పాలుగా తోస్తాయని, మనం కూడ ఇక ఇళ్ళల్లో ఉండలేము. మాధవుని వెంట వెళ్ళి ఆయనకు సేవలు చేసి అక్కడే హాయిగా ఉందామని అనుకుంటారు.

*మ. "రమణీ! దూరముపోయె గృష్ణురధమున్, రాదింక వీక్షింప నీ*
*కమలాక్షుం బొడగాన లేని దినముల్ గల్పంబులై తోచుగే*
*హములందుండగ నేల పోయి పరిచర్యల్ సేయుచున్ నెమ్మినుం*
*దము రమ్మా యనె నొక్క చంద్రముఖి కందర్పాశుగభ్రాంతయై"* [331]

శ్రీకృష్ణుడు పరమాత్మ కాబట్టి ఈ ఆత్మలన్నింటిని (జీవులను) ఆకర్షించటం సహజం. ఆ సహజమైన భక్తి (ఆరాధన) స్త్రీలకు (స్త్రీ రూపంలో ఉన్న జీవునికి) కలిగితే మన్మధ తాపంగా వర్ణించటం కవి సహజం. అదే కవయిత్రులు ఈ సంఘటనని వీక్షించి రచించి ఉంటే పరమాత్మ జీవాత్మల ఆకర్షణగా అనంతమైన, అలౌకికమైన మధురభక్తిగా వర్ణించి ఉండేవారు. శ్రీకృష్ణావతార తత్త్వాన్ని, శ్రీకృష్ణ మహిమను తెలుసుకున్న మరొక కాంతామణి ఈ క్రింది విధంగా కలిగింది.

*"తరుణీ! యాదవరాజుగా ( డితఁ డు, వేదవ్యక్తుడై యొక్కడై*
*వరుసన్ లోకభవస్థితి ప్రళయముల్ వర్తింపగా'జేయుదు*
*స్తర లీలారతుడైన యీశు ( డితనిన్ దర్శించితిం బుణ్యభా*
*సుర! నేనంచు నటించె నొక్కతె మహాశుద్ధాంతరంగంబునన్"* [332]

ఈ కృష్ణుడు వేదవేద్యుడైన ఆది నారాయణుడే గాని యాదవ ప్రభువు కాదు. ఈ మహానుభావుడు వేద విదిత సృష్టి స్థితి లయకారకుడైన దేవదేవుడు. లోకేశ్వరుణ్ణి ప్రత్యక్షంగా దర్శించిన అదృష్టవంతురాలను నేనని అంతరంగంలో ఆనందం పొంది చిందులు వేసింది.

**మరొక కలహంసగామి (హంస నడక వంటి నడక కలది)**

*క. "తామస గుణులగు రాజులు*
*భూమింబ్రభవించి ప్రజల ( బొలియింప ( గస*
*త్స్వామ లతను ( డై యీతడు,*
*భామిని! వారల వధించు బ్రతి కల్పమునన్"* [333]

తమోగుణ దూషితులైన రాజులు ప్రతి యుగంలో ఈ భువిపై జన్మించి ప్రజానీకాన్ని బాధించి వేధించే సమయంలో సత్య స్వరూపుడై సముద్భవించి ఆ జగత్కంటకులను సంహరించే స్వామిని చూడవే భామినీ! అని మరొక పుర సుందరితో పలికింది. ఈ పద్యంలో ఒక సామాన్య స్త్రీ శ్రీకృష్ణావతార కార్యాన్ని వివరించటం విశేషం. ఈ మాటలను బట్టి చూడగా స్త్రీలు కూడ లోక జ్ఞానాన్ని, పార లౌకిక జ్ఞానాన్ని కూడ కలిగి ఉన్నట్లు సువ్యక్తమవుతుంది.

పైమాటలే కాక పురసుందరీ మణులు శ్రీకృష్ణుడు జన్మించటం వల్ల ఏమి జరిగిందనే విషయాన్ని సవిస్తరంగా సుప్రకటితం కావించారు.

*సీ. "ఈ యుత్తమ శ్లోకు'డెలమి జన్మింపంగ యాదవ కులమెల్ల ననఘమయ్యె*

*నీ పుణ్య వర్తనుండే ప్రొద్దునుండంగ మధురాపురము దొడ్డ మహిమంగనియె*

*నీ పురుష శ్రేష్ఠు వీక్షింప భక్తితో ద్వారకా వాసులు ధన్యులైరి*

*యీ మహాబలశాలి యెరిగి శిక్షింపంగ నిష్కంటకంబయ్యె నిఖిలభువన"*

*తే. "మీ జగన్మోహనా కృతి నిచ్చగించి,*

*పంచశర భల్లజాల విభజ్యమాన*

*వివశమానసయై పల్లవీ సమూహ*

*మితని యధరామృతము గ్రోలునెల్ల ప్రొద్దు"* [334]

ఈ పురుష శ్రేష్ఠుడు శ్రీకృష్ణుడు జన్మించటం వల్లనే యాదవ వంశం పరమ పవిత్రతనే సంతరించు కొంది. ఈ పుణ్యమూర్తి ఎల్లప్పుడు నివశించటం వల్లనే మధురా నగరం మహిమ కలదానిగా ప్రఖ్యాతి గాంచింది. ఈ పురుషోత్తముని అనుక్షణం చూచుట చేత ద్వారకలో నివశించే పౌరులు ధన్యులయ్యారు. ఈ వీరాధి వీరుడు లోక కంటకులను, శిక్షించటం వల్ల లోకంలో ప్రశాంత స్థితి నెలకొంది. ఈ జగన్మోహనుని సౌందర్యాన్ని దర్శించి వ్రేపల్లెలో గోపికలు వశం తప్పిన హృదయాల్లో నల్లనయ్య మోవి తేనియలు సేవిస్తుంటారని పలికారు.

ఇక అష్టమహిషుల సౌభాగ్యానికి కారణాలు ఊహించారు.

*ఉ. "ఈ కమలాక్షు నీ సుభగు నీ కరుణాంబుధి ప్రాణనాధు ( గా*

*జేకొని వేడ్క ( గా ( పురము సేయుచు నుండెడు రుక్మిణీ ముఖా*

*నేక పతివ్రతల్ నియతి నిర్మల మానసులై జగన్నుతా*

*స్తోక విశేష తీర్థముల ( దొల్లిటి భామలనేమినో'చిరో!"* [335]

కమలనేత్రుని, సౌందర్య రాశిని, ఈ కరుణా సముద్రుని తమ జీవితేశ్వరునిగా స్వీకరించి ఆనందంగా కాపురం చేస్తున్న ఆ రుక్మిణీ సత్యభామ మొదలైన సాధ్వీమణులు నియమం అతిక్రమించిన నిష్కల్మష హృదయాలతో తమపూర్వ జన్మల్లో ఏ పుణ్యతీర్థాలు సేవించారో, ఏ మంచి నోములు నోచారో అని అనేక విధాలుగా శ్రీకృష్ణ పరమాత్మను గూర్చి పౌరకాంతామణులు పలుకుతున్న పలుకులు వింటూ, శ్రీకృష్ణుడు మందహాస వదనార విందంతో వారిపై దయాదృష్టిని ప్రసరింప చేసి, హస్తినా పురాన్ని వదలి ద్వారకకు పయనం సాగించాడు.

పరమాత్మ దూరమైన జీవాత్మవేదనని చెప్పి, యాదవ రాజును వేద పురుషునిగా గుర్తించి, తమస్సును నశింపచేసే పరంజ్యోతి అని పలికి, శ్రీకృష్ణ జననం లోక ప్రశాంత స్థితి కారణంగా భావించి, శ్రీకృష్ణుని చేపట్టిన పుణ్య స్త్రీల సౌభాగ్యాన్ని వర్ణించి హస్తినాపుర సామాన్య స్త్రీలు అసమాన్యుడైన శ్రీకృష్ణ దేవుని మందహాస సందర్శన భాగ్యలై, భక్తి ముక్తి దాయక మైన భాగవత గ్రంథంలో శాశ్వతంగా నిలిచారు.

## 4. మృష

అధర్ముని భార్య. ఈ దంపతులకు దంభుడనే కుమారుడు మాయ అనే కుమార్తె జన్మించారు. అధర్మ సంతానమైన వీరిద్దరు దంపతులయ్యారు,

## 5. మాయ

మాయ దంభుని భార్య. వీరికి లోభుడు అనే పుత్రుడు, నికృతి అనే పుత్రిక కలిగారు. వీరిద్దరు దంపతులయ్యారు.

## 6. నికృతి

లోభుని భార్య వీరికి 'కలి' అనే పుత్రుడు, దురుక్తి అనే కన్యక జన్మించారు. వీరు కూడ దంపతులయ్యారు.

## 7. దురుక్తి

కలిభార్య వీరికి భయమనే పుత్రుడు, మృత్యువనే స్త్రీ జన్మించి వీరిద్దరు దంపతులయ్యారు.

## 8. మృత్యువు

భయం భార్య. వీరికి యాతన, నిరయం (నరకం) అనే పుత్రిక జన్మించి దంపతులయ్యారు. సంసారానికి హేతువైన అధర్మమనే వృక్షానికి వీరందరు శాఖలై వ్యాపించారు.

## 9. వెలయాలు

అజామిళుని వెలయాలు (వేశ్య). ఈమె అంద చందాల వ్యామోహంలో పడి అజామిళుడు జప తపాలనే మరచినట్లుగా చెప్పబడింది. కాబట్టి ఆమె అందాల రాశి అని తెలుస్తుంది. ఈమె పేరు కాని, సంభాషణ కాని ఏమీ లేవు.

## 10. మధురా నగర పురస్త్రీలు

కంస సంహారానికి శ్రీకృష్ణుడు మధురా నగరం ప్రవేశిస్తాడు. ప్రవేశించిన శ్రీకృష్ణుని చూచి మధురా నగర పురస్త్రీలు తమ స్నేహితురాండ్రతో

*ఉ. "నంద తప: ఫలంబు, సుగుణంబుల పుంజము, గోపకామినీ*

*బృందము నోముపంట, సిరి విందు, దయాంబుధి, యోగి బృందముల్*

*డెందములందు 'గోరెడు కడింది నిధానము సేర వచ్చెనో*

*సుందరులార! రండుచని చూతము కన్నుల కోర్కి దీఱ 'గన్"*[336]

నందుని తప:ఫలం, సద్గుణ సంపన్నుడు, గోపికాస్త్రీల నోముల పంట, ఇందిరా హృదయాహ్లాది, కరుణా సముద్రుడు, యోగి జన హృదయానందుడైన నంద నందనుని కన్నుల కాంక్ష తీరేటట్లు వెళ్ళి దర్శిద్దాం రమ్మని పిలుస్తారు.

ఈ మధురానగర పుర స్త్రీలు తోటివారికి శ్రీకృష్ణుని దర్శనానికి రమ్మన్న తీరు చూస్తుంటే అప్పటికే ఆనాటి లోకంలో లోక రక్షకుడు శ్రీకృష్ణుడన్న సత్యాన్ని గుర్తించి, లోకులందరు దేవదేవుని దర్శనానికి అర్రులుచాచి ఎదురు చూస్తున్నారని అవగతమవుతుంది.

మధురా నగర పట్టణంలో ఎత్తైన మేడలపై గుంపులు గుంపులుగా కూడి భక్త జనులను అక్కున చేర్చుకునే విశాలవక్ష స్థలం కల్గిన కమలనేత్రుడైన శ్రీకృష్ణుని దర్శించారు.

అప్పటికి జరిగిన శ్రీకృష్ణలీలలను, ఒకరినొకరు చెప్పుకొని గొల్లకన్నెల మానధనుడు, భువనైక మోహనుడైన శ్రీకృష్ణుని పొందని స్త్రీజన్మ నిరుపయోగమనుకుంటారు.

*సీ. "వీ ( డటే రక్కసి విగతజీవ ( గ ( జన్ను ( బాలు ద్రావిన మేటి బాలకుండు!*
*వీ ( డటే నందుని వెలందికి జగమెల్ల ముఖమందు ( జూపిన ముద్దులా ( డు!*
*వీ ( డటే మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దా ( పరీ ( డు!*
*వీ'డటే యలయించి వ్రేతలు మానంబు సూఱలాడిన లోక సుందరుండు!"*

*తే. "వీ'డు లేకున్న పురమటవీ స్థలంబు*
*వీని'బొందని జన్మంబు విగతఫలము*
*వీని'బలుకని వచనంబు విహగరుతము*
*వీని'జూడని చూడ్కులువృధలు వృధలు"* [337]

ఒక చెలికత్తె మరొక చెలితో శ్రీకృష్ణునితో గోపికా స్త్రీల నిత్యానందాన్ని గుర్తుచేసి, వారు చేసిన పుణ్య ఫలాన్ని ప్రశ్నించుకుంటారు.

*మ. "చెలియా! గోపిక లీకుమార తిలకుం జింతించుచుంబాడుచుం*
*గలయం బల్కుచునంటుచున్ నరుచు నాకర్షింపుచున్ వాస్తగా*
*మలక క్రీడకు ( దెచ్చి నిచ్చలును సమ్మానంబులం బొంద ( గా (*
*దొలి జన్మంబుల నేమి నో ( చిరొకదె దుర్గ ప్రదేశంబులన్?"* [338]

మధురానగర పురస్త్రీలు దేవదేవుడైన శ్రీకృష్ణుని కన్నులారా దర్శించి, హృదయంలో నిలుపుకొని సంతోషాంతరంగులై శ్రీకృష్ణునిపై భక్తితో పూలజల్లులు కురిపించారు.

*క. "అని మఱియు ( బౌరకాంతలు,*
*మునుకొని హరిరూపు నేత్రముల వెంటను లో'*
*గొని తాల్చిరి హృదయములను,*
*జనిత ప్రమాదమున విరులుసల్లుచు నధిపా!"* [339]

పురస్త్రీలు శ్రీకృష్ణునిపై చల్లిన పూలజల్లులు ద్వాపరయుగ దుష్ట శిక్షణకి స్వాగతమిచ్చి, శిష్ట రక్షణకి నాంది పలికాయి. ధర్మ సంస్థాపనార్థం అవతరించిన శ్రీకృష్ణుడు కంస సంహారం చేసి, మధురా నగర ప్రజలకు నిత్యానందాన్ని కల్గించాడు.

## 11. కుబ్జ

సుదాముని అనుగ్రహించి వెళుతున్న శ్రీకృష్ణునకు మధురానగర రాజ వీధిలో మైపూతలుంచిన పాత్రతో వస్తున్న కుబ్జ కన్పిస్తుంది.

### శ్రీకృష్ణ దర్శనం

శ్రీకృష్ణుడు కుబ్జను చూచి

*క. "ఎవ్వరి దానవు? లేపము*
*లెవ్వరికింగోరి కొనుచు నే( గదు? నీపే*
*రెవ్వతె మాకిమ్మన్నియు*
*నివ్వటిలెదు చక్కనగుచు నీరజనేత్రా!"*[340]

ఓ పద్మాక్షి! నీవు ఎవ్వరిదానవు? నీ పేరేమి? ఈ లేపము లెవ్వరి కోసం తీసుకు వెళుతున్నావు? ఈ లేపము లెవ్వరి కోసం తీసుకు వెళుతున్నావు? ఈ లేపములన్ని మాకివ్వు. అవి అన్నీ మాకిస్తే నీవంకరలన్నీ తీరిచక్కని దానవవుతావని కాబట్టి వీటన్నింటిని మాకు ఇచ్చి పొమ్మంటాడు.

కుబ్జ శ్రీకృష్ణుని మాటలకు

*ఉ. "చక్కనివా'డవౌదు, సరసంబులనొంపకు, మెల్లవారికిన్*
*జక్క'దనంబులెక్కడివి? చారుశరీర! త్రివక్రయండ్రు, నే*
*నిక్కము కంసుదాసిని, వినిర్మలలేపన విద్యదాన, నన్*
*మిక్కిలి రాజు మెచ్చు( దగ మీరు విలేపనముల్ ధరింపరే"*[341]

శ్రీకృష్ణ సౌందర్యాన్ని ప్రశంసించి, లోకంలో అందరికి శ్రీకృష్ణుని అందం ఉండదని, తనను త్రివక్ర అంటారని, కంసుడి దాసినని చెపుతుంది, తానునేర్చిన విద్య అచ్చమైన మైపూతలు చేయటమని, కంస మహారాజు ప్రశంసిస్తుంటాడని, కావాలంటే మీరు ఈ విలేపనాలు పూసుకొమ్మని పలుకుతుంది. శ్రీకృష్ణ బలరాములకు ప్రేమతో మైపూతలు ఇస్తుంది.

### శ్రీకృష్ణానుగ్రహం

కుబ్జ ఇచ్చిన మైపూతను ఒంటి నిండా పూసుకుంటారు బలరామకృష్ణులు. శ్రీకృష్ణుడు తన మేని స్పర్శతో త్రివక్రను వంకరలు లేని చక్కని చుక్కను చేస్తాడు.

కుబ్జ నూతన సౌందర్యం కలదై కమలాక్షుని కాంక్షతో చూసి, (పద్మనాభుని) ఇంటికి ఆహ్వానిస్తుంది.

*క. "వేం చేయుము నా యింటికి (*

*బంచశరాకార! యనుచు ( బై కొంగాక*

*ర్షించి హరి ( దిగిచె ( గామిని,*

*పంచాశుగబాణజాల భగ్న హృదయమై"*[342]

ఆ కాముకురాలైన కుబ్జ కామాన్ని చూచి శ్రీకృష్ణుడు బలభద్రుని చూచి నవ్వుతూ, కుబ్జతో నేను వచ్చిన పని సాధించిన తర్వాత నీ గృహానికి వస్తానని మాటిస్తాడు.

## కుబ్జ ఆతిథ్యం

కంస సంహారానంతరం శ్రీకృష్ణుడు ఉద్ధవునితో కలిసి కుబ్జా గృహానికి వెళతాడు. పరమాప్తుడై శ్రీకృష్ణుని వెంట వచ్చిన ఉద్ధవుని ప్రీతితో పూజించింది.

## శ్రీకృష్ణుని పునర్దర్శనం

విలాసవంతురాలైన కుబ్జ తన పుణ్య విశేషం చేత దేవాది దేవుడైన శ్రీకృష్ణునితో లౌకిక సుఖాన్ని కోరుకున్నది. "యద్భావం తద్భవతి" అన్న విధంగా శ్రీకృష్ణ పరమాత్మ కుబ్జ కోరికని నెరవేర్చాడు.

వేద వేద్యుడైన ఆదేవాది దేవుడు ప్రసన్నుడైతే ఆ కుబ్జ మోక్ష పదవిని కోరక రతి సుఖం కోరుకుంటుంది.

*క. "ఏ వేదంబులు ( గానని*

*దేవోత్తము ( గాంచి ముక్తి తెరువడుగక రా*

*జీ వేక్షణ రతి యడిగెను,*

*భావింప ( దదీయ కర్మఫలమెట్టిది యో!"*[343]

కుబ్జ శ్రీకృష్ణుని సౌందర్యాన్ని ప్రశంసించింది. శ్రీకృష్ణుడు త్రివక్రయైన కుబ్జను సౌందర్యవతిని చేసాడు. కుబ్జ పరమాత్మకిచ్చింది మైపూత (మేనికి పూసుకునేది). పరమాత్మ కూడ కుబ్జకి భౌతిక దేహసుఖాన్నిచ్చాడు. కుబ్జ మోక్ష పదవి కోరలేదు కదా అనే సందేహం కల్గుతుంది. కాని కుబ్జ భగవంతుడి కివ్వగల్గింది మైపూత మాత్రమే. అందుకే ఆమె ఆలోచనలు ఆ స్థాయిలోనే ఉన్నాయి.

అందునా ఆమె వృత్తిరీత్యా దాసి. ప్రవృత్తిలో కొంత స్వతంత్రత గోచరిస్తుంది. ఆ స్వతంత్రత, ధీరత్వ వల్లనే పరమాత్మతో సౌఖ్యాన్ని పొందగల్గింది. పరమాత్మను గూర్చి చేసిన చేష్టలను బట్టే జీవాత్మపై పరమాత్మ అనుగ్రహముంటుందనేది. ఈ కుబ్జ వల్ల వెల్లడవుతుంది.

## 18. పింగళ

ఈషణత్రయంపై (భార్యపుత్ర ధనధాన్యాదులపై) మమకారం విడిచి నిర్మల చిత్తాన్ని పరతత్త్వంపై లగ్నం చేసే వారు ముక్తిని పొందుతారని శ్రీకృష్ణుడు ఉద్ధవునికి ఏకాదశ స్కంధంలో సోదాహరణంగా ఒక కథ చెపుతాడు. ఆ కథలో ఈ పాత్ర కన్పిస్తుంది.

*వ. "ఇందులకు 'బురాతన వృత్తాంతంబుగలదు ... .... ...*

*... ... ... ... ... ముక్తురాలయ్యెనని ఎరింగించి"* [344]

మిథిలానగరంలో పింగళ అనే ఉత్తమురాలైన వేశ్య ఉండేది. ఆ వేశ్యలో కొంత పరిజ్ఞానం కలిగింది. ఈ కాంత ధన వ్యామోహంతో ప్రియుని మోసపుచ్చి ధనమిచ్చే మరొక విటుని చేరింది. అతనిని తన ఇంటికి తీసుకు వెళ్ళింది, అతనితో నిద్రలేకుండా విహరించి నీరసపడి అలసిపోయింది.

చిట్టచివరికి ఆత్మసుఖం కలిగించేవాడే భర్త అని ఆలోచించింది. నారాయణుని ఈ విధంగా చింతిస్తూ కైవల్యం పొందవచ్చని ఆలోచించింది.

తన శయనాగారాన్ని, సమస్త సంపదలను త్యజించింది, వాసుదేవుని పాద పద్మాలకు నమస్కరించి తరించాలని అభిలాషకలిగిందై శరీరం మెరుపు వంటి క్షణ భంగుర జీవనకాలం కలదని నిశ్చయించి పరతత్త్వంపైన మనస్సును లగ్నంచేసి ముక్తిని పొందింది.

*క. "దేహము నిత్యముగాదని*

*మోహము'దెగ 'గోసి సిద్ధమునివర్తను'డై*

*గేహము వెలువడి నరు'డు*

*త్సాహమునుం జెందుముక్తి సంపదననఘా"* [345]

దేహం నిత్యం కాదని, మోహాన్ని త్రెంపివేసి, భౌతిక జీవనాన్నుండి మరలినవాడు సుద్ధులు, మునులు చరించే మార్గాన్ని అనుసరించి ఇల్లు విడిచిన మానవుడు మోక్ష లక్ష్మిని పొందుతాడని, పాపరహితు డైన ఉద్ధవునకు, శ్రీకృష్ణ పరమాత్మ తెలియచేస్తాడు.

**ఆత్మజ్ఞాని**

ఈ పింగళ వృత్తిరీత్యా వేశ్య, సహజంగా ఆవృత్తిలో ఉండేవారు ధనకాంక్షతో ధనం ఎవరి వద్ద అధికంగా ఉండునో, వారిని తన వైపుకి ఆకర్షింప చేసికొని వారిని కూడ పతితులను చేసి, సర్వ నాశనం చేస్తారు. "ఉభయభ్రష్టత్వం, ఉపరసన్యాసం" అన్న సామెతగా ఈ పింగళ తన వృత్తి రీత్యా చేసే పాపాన్నే కాక ధనకాంక్షతో ఒక విటుని మోసపుచ్చి మరొక విటుని చేరింది. శరీరం అలసత్వం చెందిన తర్వాత కూడ సంతృప్తి చెందక ఆలోచించింది. ఆ ఆలోచనలో శాశ్వతమైన ఆత్మ సుఖాన్ని గూర్చి ఆలోచించి "పురుష" శబ్దవాచ్యుడు నారాయణుడని గుర్తించి మనస్సు లగ్నం చేసి ముక్తి పొందగల్గింది.

భౌతిక సుఖాలపై విసుగు చెందినపుడే అజ్ఞానులకు విరక్తి కలుగుతుంది. ఆ విరక్తిలో పరతత్త్వంపై మనస్సును లగ్నంచేసిన వారికి ముక్తి కలుగుతుంది.

భక్తి, కర్మ, జ్ఞాన మార్గాల్లో పయనించి ఎంతో నియమ నిష్ఠలతో జీవితకాలం గడిపేవారు ఆ పరమాత్మ చెంతకే చేరతారు.

అజ్ఞానంతో జీవితమంతా ఎన్నో తప్పులు చేసి అవసాన దశలో పరతత్త్వంపై దృష్టిపెట్టిన వారు కూడా ఆ పరమాత్మ చెంతకే చేరతారు. అందుకే ఆ పరమాత్మ గీతలో అర్జునునకు బోధించాడు.

*"విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని*
*శునిచైవ శ్వపాకేచ పండితాస్సమ దర్శన:"॥* [346]

విద్య వినయాలతో కూడిన బ్రాహ్మణునితో, గోవులో, ఏనుగులో, కుక్కలో, కుక్క మాంసాన్ని తినే వాడిలో, పండితులు సమాన తత్త్వాన్ని చూస్తారని పండిత లక్షణంగా పరమాత్మ చెప్పినా, ఈ లక్షణం ఒక్క పరమాత్మలోనే ఉంటుంది.

"పండా అస్య సంజాత ఇతి పండిత:" అని వ్యుత్పత్తి పండానామ జ్ఞానమ్. జ్ఞాన ప్రదాత పరమాత్మ కాబట్టి ఆ పరమాత్మ దృష్టిలో జీవులందరు సములే. వారి వారి కర్మానుసారం జీవుల ఫలితాలు అనుభవిస్తూ ఉంటారు.

## 12. ద్వారకా నగర కాంతలు

శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామానంతరం హస్తినాపురం నుండి బయలుదేరి. ద్వారకా నగర ప్రవేశ సమయంలో పాంచజన్యం పూరిస్తాడు. ఆ శంఖ ధ్వనులకి పురపౌరులు యదుకుల స్వామికి ఎదురు వచ్చి అసంఖ్యాకమైన కానుకలను సమర్పిస్తారు.

ఇక ఆ పౌరకాంతలు నీలమేఘ శ్యాముడైన శ్రీకృష్ణుని సౌందర్యాన్ని చూడటానికి ఉన్నతోన్నతములైన సౌధ పై భాగాలపై నిలిచి చేతులు చాచి చూపిస్తూ ఆనందించారు.

### శ్రీకృష్ణుని ఔన్నత్యం

*సీ. కలుముల నీనెడు కలకంఠియెలనాఁగ వర్తించు నెవ్వాని వక్షమందు*
*జనదృక్చకోర సంఘంబునకు సుధా పానీయ పాత్రమే భవ్యముఖము*
*సకల దిక్పాలక సమితికి నెవ్వాని బాహు దండంబులు పట్టుఁగొమ్మ*
*లాశ్రిత శ్రేణికే యధిపుని పాదరాజీవ యుగ్మంబులు చేరుగడలు.*

*ఆ. "భువన మోహనుండు పురుష భూషణుఁ*
*డెవ్వఁడట్టి కృష్ణుఁడరిగె హర్మ్యశిఖర*
*రాజమానలగుచు రాజమార్గంబున*
*రాజముఖులు గుసుమరాజిఁ గురియ"*[347]

శ్రీకృష్ణుని వక్షస్థలం శ్రీదేవి నివాసంగా, శ్రీకృష్ణుని పవిత్ర ముఖం దర్శకులకు అమృతం చిందించే వెన్నల పాత్రంగా, శ్రీకృష్ణుని బాహువులు సర్వదిక్పాలకులకు పట్టుకొమ్మలుగా, ఆ మహితాత్ముని పాద పద్మాలు ఆశ్రితులకు అండ దండలైన భువన మోహనుడైన పురుషోత్తముని రాజమార్గంలో దర్శించి, ఆనందంతో పౌరకాంతలు సౌధ శిఖరాగ్రాలనుండి పూల జల్లులు కురిపించారు.

దుష్టులబారి నుండి శిష్ట జనులను రక్షించిన శ్రీదేవి వల్లభుడైన శ్రీకృష్ణుడు భక్తులకు సంపత్ప్రదాత మహీ మండలంలో దుష్ట రాజ్యనులను వెంటాడి వేటాడి సంహరించి దిక్పాల కుల విధికి పట్టుకొమ్మ శరణాగతి చేసిన దీనులకు అండదండగా నిలిచిన యదుకుల స్వామిని ద్వారకా నగర కాంతలు కన్నులారా దర్శించి, మనసారా ఆనందించి,స్వాగత సుమాలర్పించి ధన్యలయ్యారు.

## పాద సూచికలు

1. పోతన చాటువు
2. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 6
3. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 7
4. అంత. భాగ. పుట. 301
5. సం. భార. అ. ప
6. శ్రీవిద్యాలహరి శ్రీ. చ. వ
7. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 8
8. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 9
9. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 3
10. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 6
11. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 7
12. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 8
13. పోతన చాటువు
14. సౌందర్య లహరి శ్లో. 15
15. ఆం. భాగ. ష. స్కం. ప. 5
16. ఆం. భాగ. ష. స్కం. ప. 18
17. ఆం. భాగ. ష. స్కం. ప. 17
18. ఆం. భాగ. ష. స్కం. ప. 10
19. సౌం. ల. శ్లో. 8
20. శ్రీదేవి భాగ. (అను) పుట. 485
21. సౌం. ల. శ్లో. 8
22. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 72
23. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 73
24. శ్రీదేవి. భాగ. (ఆ.స్తు)
25. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 11
26. కనక ధారాస్తవం. శ్లో. 2
27. కన. ధా. స్త. శ్లో. 3
28. ఆం. భాగ. ష. స్కం. ప. 6
29. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 267

30. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 95

31. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 96

32. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 99

33. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 102

34. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 129

35. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 180

36. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 132

37. శ్రీలక్ష్మీ కృత మహేంద్ర స్తుతి శ్లో. 2

38. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 396

39. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 403

40. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 401

41. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 404

42. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 406

43. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 402

44. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 405

45. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 407

46. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 408

47. భగ. అ.4, శ్లో.11

48. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 409

49. ఆం. భాగ. చ. స్కం. ప. 461

50. ఆం. భాగ. చ. స్కం. ఉ. భా. ప. 202

51. ఆం. భాగ. చ. స్కం. ఉ. భా. ప. 203

52. ఆం. భాగ. చ. స్కం. ఉ. భా. ప. 204

53. ఆం. భాగ. ద్వి. స్కం. వ. 133

54. ఆం. భాగ. ద్వి. స్కం. వ. 132

55. ఆం. భాగ. నవ. స్కం. వ. 394

56. ఆం. భాగ. నవ. స్కం. వ. 398

57. ఆం. భాగ. నవ. స్కం. వ. 400

58. ఆం. భాగ. నవ. స్కం. వ. 407

59. ఆం. భాగ. నవ. స్కం. వ. 420

60. ఆం. భాగ. చ. స్కం. వ. 4

61. ఆం. భాగ. చ. స్కం. వ. 34
62. ఆం. భాగ. చ. స్కం. వ. 35
63. ఆం. భాగ. చ. స్కం. వ. 42
64. ఆం. భాగ. చ. స్కం. వ. 62
65. ఆం. భాగ. చ. స్కం. వ. 63
66. ఆం. భాగ. చ. స్కం. వ. 66
67. ఆం. భాగ. చ. స్కం. వ. 95
68. ఆం. భాగ. చ. స్కం. వ. 24
69. ఆం. భాగ. ప్ర. స్కం. వ. 26
70. ఆం. భాగ. ప్ర. స్కం. వ. 68
71. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 7
72. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 202
73. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 204
74. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 258
75. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 258
76. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 436
77. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 487
78. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 488
79. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 491
80. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 496
81. ఆం. భాగ. షష్ఠ. స్కం. వ. 497
82. ఆం. భాగ. అష్ట. స్కం. వ. 241
83. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. వ. 1727
84. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. వ. 1744
85. ఆం. భాగ. ద్వా. స్కం. వ. 38
86. ఆం. భాగ. ద్వా. స్కం. వ. 39
87. అమ. కో. ప్ర. కాం. శ్లో. 36
88. అమ. కో. ప్ర. కాం. శ్లో. 37
89. ఆం. భాగ. అష్ట. స్కం. ప.16
90. ఆం. భాగ. అష్ట. స్కం. ప.18
91. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 416

92. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 420
93. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 424
94. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 426
95. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 428
96. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 309
97. భగ, గీత. అ. 4, శ్లో. 8
98. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 15
99. అమ. కో. ప్ర. కాం. శ్లో. 296
100. ఆం. భాగ. నవ. స్కం. ప. 230
101. భగ. గీ. వి. యో. శ్లో. సం.
102. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 663
103. ఆం. భాగ. ద. స్కం. ప. 156
104. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 117
105. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 119
106. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 14
107. ఆం. భాగ. న. స్కం. ప. 530
108. ఆం. భాగ. న. స్కం. ప. 540
109. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 565
110. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 857
111. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 859
112. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 861
113. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 865
114. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 867
115. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 869
116. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 960
117. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 968
118. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 970
119. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 971
120. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1163
121. ఆం. భాగ. ఏకా. స్కం. ప. 103
122. ఆం. భాగ. తృ. స్కం. ప. 388

123. ఆం. భాగ. ద్వి. స్కం. ప. 119
124. ఆం. భాగ. తృ. స్కం. ప. 781
125. ఆం. భాగ. ద్వి. స్కం. ప. 789
126. ఆం. భాగ. తృ. స్కం. ప. 804
127. ఆం. భాగ. తృ. స్కం. ప. 828
128. ఆం. భాగ. తృ. స్కం. ప. 833
129. ఆం. భాగ. తృ. స్కం. ప. 835
130. ఆం. భాగ. తృ. స్కం. ప. 838
131. ఆం. భాగ. తృ. స్కం. ప. 869
132. ఆం. భాగ. తృ. స్కం. ప. 870
133. ఆం. భాగ. తృ. స్కం. ప. 1037
134. ఆం. భాగ. తృ. స్కం. ప. 233
135. ఆం. భాగ. చ. స్కం. ప. 219
136. ఆం. భాగ. చ. స్కం. ప. 441
137. ఆం. భాగ. చ. స్కం. ప. 657
138. ఆం. భాగ. చ. స్కం. ప. 661
139. ఆం. భాగ. నవ. స్కం. ప. 338
140. ఆం. భాగ. నవ. స్కం. ప. 355
141. ఆం. భాగ. నవ. స్కం. ప. 357
142. ఆం. భాగ. నవ. స్కం. ప. 627
143. ఆం. భాగ. నవ. స్కం. ప. 633
144. ఆం. భాగ. నవ. స్కం. ప. 520
145. ఆం. భాగ. నవ. స్కం. ప. 522
146. ఆం. భాగ. ద్వి. స్కం. ప. 125
147. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 471
148. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 486
149. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 514
150. ఆం. భాగ. తృ. స్కం. ప. 477
151. ఆం. భాగ. షష్ఠ. స్కం. ప. 253
152. ఆం. భాగ. షష్ఠ. స్కం. ప. 258
153. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 142

154. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 143
155. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 160
156. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 161
157. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 162
158. పం. తం.
159. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 178
160. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 179
161. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 180
162. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 181
163. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 184
164. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 186
165. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 188
166. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 192
167. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 193
168. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 199
169. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 200
170. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 209
171. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 317
172. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 82
173. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 23
174. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 28
175. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 59
176. సం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 44
177. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 64
178. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 125
179. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 145
180. ఆం. భాగ. నవ. స్కం. ప. 725
181. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1171
182. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1173
183. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 96
184. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 82

185. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 95
186. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 155
187. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 177
188. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 178
189. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 182
190. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 187
191. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1687
192. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1690
193. ఆం. భాగ. ద్వి. స్కం. ప. 234
194. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1697
195. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1704
196. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1705
197. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1706
198. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1707
199. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1708
200. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1709
201. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1710
202. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1711
203. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1713
204. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1714
205. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1716
206. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1717
207. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1736
208. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1738
209. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1740
210. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1744
211. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1748
212. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1750
213. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1784
214. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 231
215. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 234

216. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 235

217. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 248

218. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 247

219. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 250

220. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 255

221. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1707

222. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1708

223. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1768

224. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 230

225. సౌం. లహ. శ్లో. 1

226. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1710

227. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 131

228. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 133

229. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 137

230. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 140

231. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 147

232. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 207

233. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 209

234. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 210

235. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 212

236. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 219

237. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 276

238. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 60

239. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 64

240. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 70

241. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 223

242. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 350

243. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 375

244. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 377

245. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 374

246. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 383

247. పూర్వ. గా. ల. పు. 360

248. ఆం. భాగ. ద్వి. స్కం. ప. 165

249. ఆం. భాగ. స. స్కం. ప. 102

250. ఆం. భాగ. స. స్కం. ప. 218

251. ఆం. భాగ. స. స్కం. ప. 232

252. ఆం. భాగ. స. స్కం. ప. 233

253. ఆం. భాగ. అష్ట. స్కం. ప. 600

254. ఆం. భాగ. నవ. స్కం. ప. 260

255. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 212

256. ఆం. భాగ. ద. స్కం. ప. 225

257. శ్రీ భాగవత కథ. భాగ. కధా. గ్రం. పుట. 6

258. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 239

259. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 240

260. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 327

261. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 337

262. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 370

263. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 676

264. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 686

265. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 688

266. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 777

267. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 785

268. శ్రీ వేంకటేశ ప్రపృత్తి శ్లో 5

269. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 786

270. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 787

271. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 788

272. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 789

273. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 790

274. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 791

275. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 792

276. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 793

277. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 795

278. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 808
279. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 809
280. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 828
281. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 821
282. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 822
283. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 835
284. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 845
285. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 848
286. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 968
287. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 977
288. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 978
289. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 987
290. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 988
291. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 989
292. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 990
293. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 991
294. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 992
295. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 997
296. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1003
297. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1011
298. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1018
299. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1021
300. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1030
301. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1040
302. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1051
303. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1063
304. ఆ. మా. ఆ. 5, ప. 52
305. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1216
306. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1435
307. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1464
308. అం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1473
309. అం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1059

310. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1068
311. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1069
312. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1070
313. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1071
314. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1074
315. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1108
316. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1109
317. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 869
318. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1467
319. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 77
320. ఆం. భాగ. నవ. స్కం. ప. 47
321. ఆం. భాగ. నవ. స్కం. ప. 48
322. ఆం. భాగ. నవ. స్కం. ప. 594
323. ఆం. భాగ. నవ. స్కం. ప. 641
324. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 165
325. ఆం. భాగ. చ. స్కం. ప. 8
326. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1524
327. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 424
328. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 107
329. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 307
330. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 230
331. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 236
332. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 237
333. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 238
334. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 240
335. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 241
336. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1247
337. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1250
338. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1251
339. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1252
340. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1274

341. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1276

342. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1279

343. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1497

344. ఆం. భాగ. ఏకాదశ. స్కం. ప. 101

345. ఆం. భాగ. ఏకాదశ. స్కం. ప. 102

346. భగ. గీ. అ. 5. శ్లో.18

347. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 257

# 3. భాగవతకాలం - స్త్రీల సామాజిక స్థితిగతులు

## 3.1 పురాణ నేపథ్యం

అతి ప్రాచీన కాలం నుండి మనకు బ్రహ్మనుండి ఆవిర్భవించిన వాఙ్మయం రెండు విధాలు. ఈ రెండు పరస్పర ఉపకారకాలు, వాటిలో మొదటిది వేద వాఙ్మయం. రెండవది పురాణ వాఙ్మయం. వేద వాఙ్మయం కర్మ ప్రధానమైంది. పురాణ వాఙ్మయం కర్తృ ప్రధానమైంది. మొదట వాఙ్మయాన్ని మునులు స్వీకరించి ప్రచారం చేశారు. ఒకటే వేదంగా ఉన్న దానిని కృష్ణద్వైపాయనుడు నాలుగుగా విభజించి వ్యాసుడయ్యాడు. అలానే ఒకే పురాణ సంహితను అష్టాదశ పురాణాలుగా విభజించారు. ఋషులు, మహర్షుల ద్వారా ప్రచలితమైన సంస్కృత సాహిత్య శాఖలను పరిశీలిస్తే వేదాలు, పురాణాలు భారతీయ సంస్కృతీ పరిరక్షక సోదరులనే విషయం అవగతమవుతుంది.

వ్యాసుడు రచించిన 18 పురాణాలు

1. మత్స్యపురాణం
2. మార్కండేయ పురాణం
3. భాగవత పురాణం
4. భవిష్య పురాణం
5. బ్రహ్మ పురాణం
6. బ్రహ్మ వైవర్త పురాణం
7. బ్రహ్మాండ పురాణం
8. వరాహ పురాణం
9. వామన పురాణం
10. వాయు పురాణం
11. విష్ణు పురాణం
12. అగ్ని పురాణం
13. నారద పురాణం
14. పద్మ పురాణం
15. లింగ పురాణం

16. గరుడ పురాణం

17. కూర్మ పురాణం

18. స్కాంద పురాణం

## 3.2. పురాణ లక్ష్యం

పురాణాల ప్రధాన లక్ష్యం ఈ సృష్టిని గూర్చి వివరంగా తెలపటం. మూల తత్త్వం నుండి సృష్టి ఎలా ప్రారంభమయింది. అది ఏ విధంగా జరిగింది? ఏయే పరిణామాలను పొందింది? ప్రధాన వంశాలెలా ఏర్పడ్డాయి. ఆ వంశాల్లో కీర్తివంతులు ఎలాంటి జీవితాలను గడిపి ఆ కీర్తిని సంపాదించారు? చివరికి తిరిగి ఈ సృష్టి మూల తత్త్వంలో ఎలా విలీనమవుతుంది? అనే అంశాలు. (ఈ సృష్టి విశ్వ సర్గంతో ప్రారంభమై ప్రతి సర్గంతో అంతమౌతుంది. ఈ ఆద్యంతాల మధ్యన ఉన్నవే మన్వంతర వంశ, వంశానుచరితలు)

## పురాణ ప్రతిపాదిత విషయాలు

సామాన్య దృష్టితో చూస్తే పురాణ ప్రతిపాదిత విషయాలు సంగ్రహంగా ఈ క్రింది విధంగా భావించవచ్చని ఆర్యులు తెలియ చేస్తున్నారు.

*"ఋషిదేశ మహావీర చరితాన్యవతారకాః*

*లాజా విధి వ్రతా స్తీర్థా నామ్నాం సాహస్రమేవచ*

*ఋషిరాజ్ఞాం వంశ సూచీ, యుగాస్సృష్టిశ్చ ద్వాదశ*

*సామాన్యతః పురాణేషు విషయాః ప్రతిపాదితాః"*

1. ఋషులు 2. దేశాలు 3.మహావీరుల చరిత్రలు 4.అవతార కథలు 5.యజ్ఞాలు 6.ఆచరింప వలసిన విధులు 7.వ్రతాలు 8. తీర్థాలు 9. ఋషుల వంశాదికాలు 10. రాజ వంశాదికాలు 11. యుగాలు 12.సృష్టిక్రమం

అష్టాదశ పురాణాలన్నీ నారాయణ స్వరూపమే

*సీ. పాద్మము హృదయంబు బ్రహ్మము మూర్ధంబు*

*మజ్జగారుడము వామనము త్వచము*

*భాగవతము దొడల్ బ్రహ్మండ మస్థులు*

*మాత్స్యము మెదడు కౌర్మంబు వెన్ను*

*లైంగ వారాహముల్ దక్షిణ వామ గు*

*ల్ఫంబులు నారదీయంబు నాభి*

*రోమముల్ స్కాందము వామదక్షిణ భుజ*

*ద్వంద్వంబు శైవంబు వైష్ణవంబు*

*గీ. "వామ పాదమాగ్నేయంబు వామజాను*

*తలము బ్రహ్మ వైవర్తంబు దక్షిణోరు*

*పర్వము భవిష్యమపసవ్య భావమొంది*

*వట్టిపదము మార్కండేయ మచ్యుతునకు"!*

పురాణం తెలుసుకొంటే సమస్త వాఙ్మయం తెలుసుకొన్నట్టే

"యాస్మిన్ జ్ఞాతే భవేద్ జ్ఞాతం వాఙ్మయం సచరాచరమ్"

### 3.3. భాగవత పురాణం

నారాయణుని అంక సీమ భాగవత పురాణం. అష్టాదశ పురాణాల్లో పురాణ తిలకంగా చెప్పబడుతున్న ఈ భాగవత పురాణంలో భాగవతులకు భక్తి తిలకం దిద్దింది భాగవత స్త్రీలు. వీరు సమాజంలో ఏ విధమైన పాత్ర పోషించారు? ఆ పాత్ర పోషణకు ఆ నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితి గతులెలా ఉన్నాయనేది చర్చనీయం.

భాగవత పురాణంలో కృతయుగం నుండి ద్వాపరయుగం వరకున్న భగవద్భక్తుల గాథలు, కలి లక్షణాలు చెప్పబడ్డాయి. యుగాల వారిగా స్త్రీల సామాజిక స్థితి ఏ స్కంధంలో ఏయే యుగాలు చర్చింప బడ్డాయనే ప్రశ్న తలెత్తుతుంది.

ప్రథమ స్కంధంలో ద్వాపరయుగ లక్షణాలు, అశ్వత్థామ గర్వభంగం, శ్రీకృష్ణనిర్యాణం విషయాన్ని అర్జునుడు ధర్మరాజుకి తెలియచేయటం, కలియుగారంభం, కలిని పరీక్షిత్తు నిగ్రహించి శరణాగతి చేసిన కలికి కొన్ని ప్రదేశాలివ్వటం ఉన్నాయి. ద్వితీయ స్కంధంలో సంగ్రహ భాగవతం, వైకుంఠవర్ణన విషయాలు చెప్పబడ్డాయి.

తృతీయ స్కంధం నుండి అష్టమ స్కంధం వరకు కృతయుగ గాధలు కన్పిస్తాయి. ఆ కథా పాత్రలు ఇతి వృత్తాల్లో ఆ కాలపు సామాజిక స్థితి అవగతమౌతుంది. నవమ స్కంధంలో రాజవంశాల చరిత్ర చెప్పబడింది. (సూర్య చంద్ర వంశాలు) రాజ వంశాల్లో సామాజిక స్థితి అవగతమవుతుంది.

దశమస్కంధంలో శ్రీకృష్ణ జననాది అంశాలు, అంటే ద్వాపరయుగ చరిత్ర అంతా వర్ణింప బడింది. ఇక ఏకాదశ స్కంధంలో శ్రీకృష్ణుడు ఉద్ధవునికి పరమార్థోప దేశం చేసే విషయంలో సనాతన ధర్మాలు వివరింప బడ్డాయి.

ద్వాదశ స్కంధంలో భావికాల గతులు, యుగధర్మ ప్రాకృతాది ప్రళయ చతుష్టయ వివేచనం తెలుపబడింది.

## 3.4. కాల నిర్ణయం

*మ. "ఇరవొందన్ ద్రుహిణాత్మకుండయి రమాధీశుండు విశ్వంబును*
*స్థిరతం జేసి, హరి స్వరూపుడయి రక్షించున్ సమస్త ప్రజో*
*త్కర సంహారము సేయునప్పుడు వారాంతర్యామియై యింతయున్*
*హరియించుం బవనుండు మేఘముల మాయం జేయు చందంబునన్"*[2]

రమాధీశుడైన శ్రీ మహావిష్ణువే సృష్టి నిర్మాణంలో బ్రహ్మయై, పోషణలో హరియై, లయంలో హరుడై ఉంటాడని (త్రిమూర్తి రూపాల్లో) శుక మహర్షి పరీక్షిత్తుకి వివరిస్తాడు.

భాగవత పురాణంలో తృతీయ స్కంధంలో మైత్రేయ మహర్షి విదురునికి కాల స్వరూపాన్ని వివరిస్తాడు. విష్ణుపురాణంలో పరాశరుడు మైత్రేయునకు కాల స్వరూపం వివరిస్తాడు.

నారాయణుడే పరబ్రహ్మ లోక పితామహుడై తనంత తానే ఆవిర్భవిస్తాడు. స్వయంభువు పుట్టుకని లోకంలో జీవుల పుట్టుకతో పోల్చి చెప్పటం ఔపచారికం. అలాంటి పరమాయువు బ్రహ్మ మానంచే (100) శత సంవత్సరాలంటారు. దీనికి పరాయువని పేరు.

100 సంవత్సరాల్లో ఏభై ఏళ్ళు పూర్వ పదార్ధం. తర్వాతి 50 ఏళ్ళు రెండవ పరార్ధకాలం. విష్ణువు కాల స్వరూపమిది. 15 నిమిషాలు ఒక కాష్ట. 30 కాష్టలు ఒక కల. 30 కలలు ఒక ముహూర్తం. 30 ముహూర్తాలు ఒక దినం. 30 దినాలు ఒక మాసం. 15 దినాలు ఒక పక్షం. రెండు

పక్షాలు ఒక మాసం. ఆరు మాసాలు ఒక అయనం. రెండు అయనాలు ఒక సంవత్సరం. ఉత్తరాయణం ఆరు మాసాలు దేవతలకొక పగలు. పితృదేవతలకొక రాత్రి. దక్షిణాయనం ఆరు మాసాలు దేవతలకొక రాత్రి, పితృదేవతలకొక పగలు. దేవతల వేయి సంవత్సరాలు ఒక యుగం.

*సీ. "జననుత! కృతయుగ సంఖ్య నాలుగు వేల దివ్య వర్షములు దదీయ సంధ్య*
*లెనిమిదినూఱేండ్లు, వినుత్రేత వత్సర త్రి సహస్రములగు ( దదీయ సంధ్య*
*లాఱునూఱేఁడులునగు, ద్వాపరము రెండువేల వత్సరముల వెలయు సంధ్య*
*లోలి నన్నూఱే ( డు లోగి ( గలియుగము సహస్రవర్షములు సంధ్యాంశమరయ"*

*తే. రెండు నూఱే ( డులును నిల్చియుండు ( జువ్వె?*
*యనఘ! సంధ్యాంశ మధ్యంబు నందు ధర్మ*
*మతిశయించును! సంధ్యాంశ మందు ధర్మ*
*మల్పమై కాన ( బడు చుండు ననఘ చరిత!"* [3]

| యుగనామాలు | యుగములు | యుగసంధ్య | యుగసంధ్యాంశం |
|---|---|---|---|
| కృతయుగం | 4 వేల దివ్య సం. | 4 వందల దివ్య సం. | 4 వందల సం. |
| త్రేతాయుగం | 3 వేలు | 3 వందలు | 3 వందలు |
| ద్వాపర యుగం | 2 వేలు | 2 వందలు | 2 వందలు |
| కలియుగం | ఒక వేయి | ఒక వంద | ఒక వంద సం. |

ఈ విధమైన యుగ పరిమాణం మొత్తం 10 వేలు + సంధ్య + సంధ్యాంశం మొత్తం 2 వేలు కలిసి 12 వేల దివ్య సంవత్సరాలొక మహా యుగం.

ఇట్టి వేయి దివ్య మహాయుగాలు బ్రహ్మకొక పగలు, పగటి వేల 14 మనువులు ఆయా కాలాల్లో , సప్తర్షులు, దేవతలు, ఇంద్రుడు, మనువు, మను పుత్రులు ఏక కాలమందే సృజింప బడతారు. 71 మహాయుగాలు ఒక మన్వతరం. అది మనువు కాలం. అది ఇంద్ర, ఋషి, మను పుత్రులకాలం. 1,20,00,000 ఒక కోటి 20 లక్షల దివ్య సంవత్సరాలు బ్రహ్మదివస ప్రమాణం. 14మనువులు గతిస్తారు. ఒక్క మన్వంతరానికి 8,50,147 దివ్య వర్షాలు ప్రమాణం. అది మానవ మానమున 30,85,71,429 సంవత్సరాలు.

## ప్రళయం

బ్రహ్మ పగటి చివర నైమిత్తిక ప్రళయం కలుగుతుంది. ముల్లోకాలు తగలబడి పోతాయి. ఆ వేడికి మహా లోకమందు జనులు జనలోకానికి వెళతారు. అంతా ఒకే మహా సముద్రమవుతుంది. ఆ మహా సముద్ర మధ్యంలో శ్రీమన్నారాయణుడు శయనించి ఉంటాడు.

## 3.5. భాగవత కాలం - స్త్రీల సామాజిక జీవన చిత్రణం

భాగవత పురాణం ద్వాపర యుగంలో కృష్ణ ద్వైపాయనునిచే రచించబడింది. ఈ పురాణమంతా భగవద్భక్తుల గాథలు. భగవంతుడు శ్రీమన్నారాయణుడు, నారాయణుని అవతారాలు, సృష్ట్యాది నుండి కాల ధర్మాన్ని అనుసరించి జీవులు ప్రవర్తించటం, విది విధానం ప్రకారం నడిచే జీవులను దుష్ట శక్తులు అడ్డగించి వారి జీవన మనుగడకు విఘాతం కలిగిస్తుంటే భగవంతుడు సాకార రూపం దాల్చి వివిధ అవతారాలతో మానవుల మధ్య సంచరించి లోక కళ్యాణం కోసం శిష్టరక్షణ దుష్టశిక్షణ చేయటం జరిగింది.

శ్రీమన్నారాయణుడు లోక కళ్యాణార్థం అవతరించి భక్త జనాళిని కాపాడి దుష్టశిక్షణ చేయటం కృతయుగం నుండి జరుగుతుంది. ద్వాపరయుగంలో రచింపబడిందీ భాగవతం. కాబట్టి కృతయుగం నుండి ద్వాపర యుగం వరకు ఉన్న భక్తుల గాథలు. భక్త జనోద్ధరణకై భగవంతుని వివిధ అనతారాలు. ఆనాటి సామాజిక జీవన చిత్రాన్ని కళ్ళకు కట్టినట్లు తెలియ చేస్తున్నాయి. ముందు యుగ విభజన ప్రకారం అంటే కృత, త్రేతాయుగ, ద్వాపర యుగాల్లో సామాజిక జీవన చిత్రాన్ని పరిశీలించాలి.

వ. "మఱియు ధర్మదేవత కృత యుగంబున నాలుగు పాదం బులును, ద్రేతయందు మూ'డు పాదంబులును, ద్వాప రంబు నం బాద ద్వయంబును, గలియుగంబున నేకపాదం బును గలిగి సంచరించు నట్టగుటం జేసి" [4]

ధర్మదేవత కృతయుగంలో నాల్గు పాదాలతోను, త్రేతాయుగంలో మూడు పాదాలతోను, ద్వాపర యుగంలో రెండు పాదాలతోను, కలియుగంలో ఒక్క పాదంతో నడుస్తుంటుంది.

### 3.5.1. కృతయుగం - స్త్రీల సామాజిక స్థితి

బ్రహ్మలోక సృష్టి భాగంగా ప్రజాసృష్టి చేయటానికి దైవాన్ని ధ్యానించాడు, బ్రహ్మదేహం నిలువుగా రెండుభాగాలై కుడి భాగం స్వరాట్టు అయిన స్వయంభువు. ఎడమ భాగం నుండి దివ్య సుందరియైన శత రూపగా రూపొందాయి. వారిద్దరిని వివాహం చేసుకొమ్మని బ్రహ్మ ఆదేశించాడు. స్త్రీ పురుష సంయోగంచే సంతానోత్పత్తి విధానం. ఈ ఆది మిధునంతోనే ప్రారంభమైంది. అంత వరకు బ్రహ్మ శరీరం నుండే సృష్టి జరిగింది. ఏకాదశ రుద్రులు, ఋషులు, వేదాలు, ఉప వేదాలు మొదలైనవి.

ఈ దంపతులు సృష్టి యజ్ఞం ప్రారంభించారు. ఈ యజ్ఞానికి ప్రజలు నివశించటానికి అనువుగా ఉండే భూభాగాన్ని హిరణ్యాక్షుడనే దానవుడు భూమిని చాపగా చుట్టి సముద్ర గర్భంలో పడవేశాడు. సృష్టికర్త బ్రహ్మ శ్రీ మహావిష్ణువని ప్రార్థించగా విష్ణువు వరాహమూర్తియై దానవ సంహారం చేసి వసుంధరను యధావిధిగా ఉంచాడు.

### బ్రహ్మచర్యం - స్త్రీలు

స్వధ అనే దక్ష పుత్రికకు వయున, ధారిణి అనే పుత్రికలు జన్మించి బ్రహ్మజ్ఞానం కలవాడై, బ్రహ్మ చారిణులుగనే ఉండిపోయి బ్రహ్మోపదేశం చేసే వారయ్యారు. వారిని మేధ వైతరణి అని కూడా అంటారు,

### వివాహ వ్యవస్థ

కర్దమ మునీంద్రుని పరిశీలిస్తే, ఆ నాటి మునులు బ్రహ్మచర్య వ్రతంతో, తపశ్చర్యంతో, బ్రహ్మ తేజస్సుతో ప్రకాశించే వారని తెలుస్తుంది. స్వాయంభువ మనువు తన కుమార్తె అభిప్రాయానుసారం కర్దమ మునీంద్రుని అన్వేషిస్తూ వస్తాడు. కర్దమ మునీంద్రుని ఆశ్రమానికి వచ్చి, మునీంద్రునికి నమస్కరించి భార్యా సమేతుడై తన కుమార్తె అభిప్రాయాన్ని తెలియచేస్తాడు. తన కుమార్తెను వివాహమాడమని మనవి చేస్తాడు.

ఈ స్వాయంభువ మనువు మాటల్లో ఆనాటి సామాజిక ధర్మాలు వెల్లడవుతున్నాయి. తండ్రులు కుమార్తెల అభిప్రాయాన్ని మన్నించి గౌరవించేవారు. రాజులైనను మునులకు తన కుమార్తెల నిచ్చి వివాహం చేసేవారని వ్యక్తమౌతుంది.

కర్దమ మునీంద్రుని ఒక రాజ కన్య కోరి వచ్చిందంటే తేలికగా భావించక స్వాయంభువ మనువుతో కర్దమ మునీంద్రుడు.

*సీ. "అనఘ! నీచేతనన్య దత్తముగ ( బ్రతిష్ఠితంబైన యీ తీవ ( బో ( డి*
*కమనీయ రూపరేఖా విలాసంబుల మానిత లక్ష్మీ సమానయగుచు*
*నొక నా ( టి రాత్రియందు దురాజ చంద్రికా ధవళిత నిజ సౌధతలమునందు*
*మహిత హిరణ్మయ మంజీర శోభిత చరణయై నిజ సఖీ సహిత యగుచు"*

*తే. "గందుక క్రీడ ( జరియింప గగనమందు*
*వర విమానస్థు ( డగుచు విశ్వావసుండు*
*నా ( గ ( దనరిన గంధర్వ నాయకుండు*
*తరుణి ( జూచి విమోహియై ధరణి, బడియె"*[5]

ఓ పుణ్యాత్ముడా! అన్యులను కాదని, నా కోసం తీసికొని వచ్చిన ఈ లతాంగి లోకోత్తర సౌందర్యవతి. ఈ నీ కుమార్తె అందచందాలలో మహాలక్ష్మితో సమానురాలు. అని భావించి చెప్పటం వల్ల ఆ నాటి సమాజంలో గుణరూప శీలవంతులైన స్త్రీలకు తగు మర్యాద, మన్నన అమితంగా ఉన్నట్లు వెల్లడైంది.

కర్దమ మునీంద్రుడు వివాహానికి ముందే తన జీవితంపై తనకున్న సంపూర్ణ అవగాహనతో తన అభిప్రాయాన్ని స్వాయంభువ మనువుతో వెల్లడించటం వల్ల వధూవరులకు సంబంధించిన సమస్త విషయాలు పరస్పరం తెలియ చేసికొని, వివాహానికి సిద్ధపడి ధార్మిక నిష్ఠ కలిగి సంసార జీవనాన్ని సాగించే వారని వెల్లడవుతుంది. అందుకే ఆ కాలాన్ని సత్యకాలమన్నారు. దోషం ఇసుమంత కూడా ఉండేదికాదు. భగవదాజ్ఞను శిరసావహించి, భగవంతునే ప్రమాణంగా పెట్టుకొనే వారని స్పష్టమౌతుంది. అనులోమ వివాహాలు ఆ కాలంలో ఆచారంలో ఉన్నట్లు దేవహూతి కర్దమ మునీంద్రుల వివాహం వల్ల వ్యక్తమవుతుంది.

## పతీ పత్నుల సంబంధం

మహా సాధ్వి అయిన దేవహూతి కర్దమ ఋషికి పతియే ప్రత్యక్ష దైవమని సేవ చేస్తుండేది. భర్తయే స్త్రీకి సర్వస్వమని నమ్మిన పతివ్రత. భర్త మనోగతాన్ని తెలుసుకొని కామ, క్రోధ, కపట, లోభ, మోహాల్లాంటి చెడుగుణాలను దరిచేరనీయక తన సౌఖ్యాలను, శరీర సౌందర్య పోషణలను కూడా

అలక్ష్యం చేస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో, ప్రేమాను రాగాలతో పతిసేవ చేస్తుండేది. తానొక లోకాధీశు ని పుత్రికననిగాని, అతిలోక సౌందర్యవతినని గాని తలంపైన లేకుండా మెలగుతుండేది. దేవహూతి కర్దముల దాంపత్యం అధర్వణ వేదంలో ఈ క్రింది మంత్రానికి ప్రతి రూపంగా కన్పిస్తుంది.

*"అశీర్ణ ఊర్జముత సౌప్ర జాస్త్వం దక్షం ధత్తం ద్రవిణం సచేతసౌ జయం*

*క్షేత్రాణి సహసాయమిన్ద్ర కృణ్వానో అన్యానధరాన్సపత్నాన్"* [6]

(వధూవరుల, తల్లి దండ్రులు మొదలైన పెద్దల సమ్మతి వివాహ విషయంలో పొందాలని, పొందితేనే వారి అనుగ్రహంతో సువర్ణాది ధనాన్ని పొంది ఏకచిత్తులై నియమపాలన శక్తిని పొందుతారని తాత్పర్యం)

## గృహస్థాశ్రమంలో ధార్మికత్వం

భార్య చేస్తున్న నిరంతర సేవా శుశ్రూషలకు మిక్కిలి సంతసించిన వాడైన కర్దముడు, కరుణ రసం పొంగి పొరలి భార్యతో దేవీ! అకుంఠిత ధర్మమార్గా చరణం ద్వారా మహిమలు, భగవత్కటాక్షం లభిస్తాయి. నాకు సమకూడిన సమస్త శుభాలు, సంపదలు. నన్ను సేవిస్తున్న నీకు కూడ సంప్రాప్తిస్తాయి. నేను నీకు దివ్యదృష్టిని కూడ ఇస్తున్నాను. దాని వల్ల సృష్టిలోని సర్వం నీకు కన్పిస్తుంది. భార్య మనోగతాన్ని గ్రహించి తన యోగ శక్తిచే ఆ మునీంద్రుడు ఒక దివ్య విమానాన్ని సృష్టించాడు. అది నిజానికి విమానం కాదు, ఉద్యాన వనాలలో కూడిన ఒక మహాసౌధం.

ఆ దివ్య విమాన యానంలో కర్దమ దంపతులు మేరు పర్వతాన్ని, నందనవనాన్ని, మానస సరోవరాన్ని, కుబేరుని ఉద్యానమైన చైత్రరధాన్ని సందర్శించి, అనేక వినోద స్థలాలను తిలకించి తిరిగి తన ఆశ్రమం చేరుకున్నారు. అభీష్ట సుఖ భోగాలనుభవిస్తూ పరస్పర ప్రేమానురాగాలతో, కేళీ విలాసాల్లో సంవత్సరాలను క్షణాలుగా గడిపేశారు వారికి ఒకేసారి తొమ్మిది మంది తనయులు (కుమార్తెలు)  కలిగారు. అనుకున్న ప్రకారం (వివాహానికి ముందు పెట్టిన షరతు) సన్యసించ దలచాడు. భర్త ఆలోచన గ్రహించిన దేవహూతి పుత్రికలకు వివాహమయ్యేంత వరకు, తనకు వేదాంతోపదేశం చేసే పుత్రుడు జన్మించేవరకు సన్యసించవద్దని పతిని వేడుకొంది. శ్రీ మహావిష్ణువు చెప్పిన మాటను గుర్తు తెచ్చుకొని కర్దముడు పుత్రోదయం వరకు ఉంచదలచుకున్నాడు. భార్యతో ఏ విధమైన అన్యచింతలను నీ మనస్సులో చేరనివ్వక ఆశ్రీహరినే ధ్యానిస్తూ ఉండు. కొద్ది రోజుల్లోనే

శ్రీహరి నీ గర్భంలో ప్రవేశించి పుత్రుడై జన్మించి నిన్ను, నన్ను, లోకులను, తరింపజేస్తాడని చెప్పాడు. భగవంతుడు దేవహూతి గర్భస్థుడై ఆవిర్భవించాడు. మరీచాది ఋషులతో బ్రహ్మ వచ్చి కర్దమ దంపతులను ప్రశంసించి, మీ కుమార్తెలను పుణ్యశ్లోకులైన ముని శ్రేష్ఠులకిచ్చి వివాహం చేయమని, ఈ మీ పుత్రుడు మహనీయమైన సాంఖ్యయోగాన్ని స్థాపించి, తల్లికి తత్త్వబోధ గావించి, కపిలుడనే పేరుతో ముల్లోకాల్లోనూ ప్రసిద్ధుడౌతాడు. అని చెప్పి నిష్క్రమించాడు.

ఈ సంఘటన వల్ల ధర్మనిష్టులైన దంపతులకు దేవతలు ఏది కోరితే అది సిద్ధం చేసేవారని, ఋషిసమేతలై దేవుళ్ళు వచ్చి జరగబోయే విషయాన్ని తెలియచేసి వెళ్ళేవారని అవగతమవుతుంది.

కర్దమ దేవహూతి దంపతుల దాంపత్య జీవనాన్ని పరిశీలిస్తే గృహస్థాశ్రమ ధర్మాన్ని ధార్మికంగా నిర్వహించ గలిగిన వారికి సాధించలేనిదేది లేదనే విషయం తేట తెల్లమయింది.

దేవహూతి సనాతన వైదిక ధర్మానికి కట్టుబడిన మహిళ. ఋగ్వేదమందు

*"ఉతత్వ: పశ్యన్న దదర్శ వాచము తత్వ: శృణ్వన్ నశృణోత్యేనామ్ ।*

*ఉతోత్వ స్మైతన్వం విసస్రే జాయేవపత్య ఉశతీ సువాసా:"* [7]

పతి ననుసరించి సుఖాన్ని పొందిన స్త్రీ దేవహూతి.

## పుత్రికాధర్మ పద్ధతి

స్వాయంభువ మనువు తన తనయ ఆకూతిని రుచి ప్రజాపతికిచ్చి వివాహం జరిపించే టపుడు పుత్రికాధర్మ పద్ధతిని అవలంబించి రుచిని ఒప్పించాడు. పుత్రికకు పుట్టిన తనయుని ఆమె తండ్రి తన పుత్రునిగా పెంచుకొన వచ్చును. శ్రీమన్నారాయణుడు, ఆది లక్ష్మి రుచి ప్రార్థనలకు ప్రసన్నులై ఆకూతి గర్భాన యజ్ఞుడు అనుకున్న ప్రకారం స్వాయంభువ మనువు పుత్రునిగా పరిగణింప బడి సహోదరి అయినప్పటికి దక్షిణను వివాహం చేసుకున్నాడు.

ఈ కాలంలో (కృతయుగం) సంతానం లేనివారు పుత్రికా ధర్మ పద్ధతిని, ఉత్తర క్రియలకై అవలంబించటం ఆచారం, ఈ ఆచారాన్ని మనం కలికాలంలో కూడా చూస్తున్నాం. ఈ పుత్రికా ధర్మ పద్ధతి కృతయుగ కాలం నుండి అనూచానంగా వస్తుంది. ఈ పుత్రికా ధర్మ పద్ధతే కాక ఈ

సంఘటనలో మరొక విచిత్ర సంఘటన దాగి ఉంది. మాతామహుడు పుత్రికా తనయుని దత్తత తీసికొంటే, ఆ పుత్రిక తనయకు ఈ దత్తత గావింపబడ్డ పుత్రుడు మేనమామ వరుస అవుతాడు. కాబట్టి యజ్ఞుడు దక్షిణలు ఒకేతనువు నుండి కవలలుగా జన్మించినా, వీరి వివాహం శాస్త్రోక్త మయింది. వీరిద్దరికి 12మంది కుమారులు. దీనిని బట్టి ఆ కాలంలో గృహస్థులు అధిక సంతానాన్ని కలిగి ఉండేవారన్న విషయం విదితమౌతుంది.

## పతీపత్నుల గాఢానురాగం

దక్ష ప్రజాపతికి, ప్రసూతికి జన్మించిన సతీదేవి పాత్రని పరిశీలించినట్లయితే స్త్రీల ఆత్మాభిమానం, తనపతులకు అవమానం జరిగితే సహించక, తండ్రికి తగిన విధంగా బుద్ధిచెప్పి, ఆ తండ్రి ఇచ్చిన తనువును కూడ పతికోసం త్యజించేవారని అవగతమవుతుంది.

భార్య పుట్టింటిలో తండ్రిచే అవమానింపబడి అగ్నికి ఆహుతి అయితే, సమర్థుడైన భర్త ప్రతీకారం ఎలా ఉంటుందో పరమేశ్వరుడు చూపించి ఈ లోకానికి భర్తలు భార్యలను ఏవిధంగా మన్నించి గౌరవించాలో తెలియచేసాడు.

పరివర్తన కలిగి పశ్చాత్తాపంతో ఉన్న మామను ఎలా మన్నించాలో కూడా లోకానికి తెలియ చేసాడు (దక్షునికి మేకతలను అతికించి బ్రతికించటం)

## సపత్నీమాత్సర్యం

*శ్లో. "ఏక భార్య స్సుఖీనైవ బహుభార్యః కదాచన ।*

*గచ్ఛగంగే శివస్థానం బ్రహ్మస్థానం సరస్వతీ"* [8]

ఉత్తానపాదుని కథ వల్ల ఆ రోజుల్లో రాజుల బహు భార్యాత్వం, రాజులు భార్యలతో వ్యవహరించే తీరు సపత్నీ మాత్సర్యాన్ని తెచ్చిపెట్టింది. ఉత్తాన పాదునికి సునీతి, సురుచి ఇద్దరు భార్యలు. రాజుగారికి చిన్న భార్యపై మక్కువ. పెద్ద భార్యపై నిరాదరణ, ఇది అంతటితో ఆగక వారి సంతానాన్ని కూడ ఇక్కట్ల పాల్జేసింది.

సునీతి పుత్రుడైన ధ్రువుడు తండ్రి నిరాదరణకి గురియై కృంగిపోయాడు. తన తల్లి వచనానుసారం. శ్రీమన్నారాయణుడే దిక్కుఅని తెలుసుకున్నాడు. నారదోపదేశం వల్ల ద్వాదశాక్షరి

మంత్రజపంతో శ్రీహరి దర్శన భాగ్యం పొంది. కష్టాలు తీరి మహోన్నత పదవి నధిష్టించాడు. అది సత్యకాలం కాబట్టి కథ సుఖాంతమైంది.

ధ్రువుడు ఇంటి నుండి వెళ్ళిన తర్వాత ఉత్తానపాదుడు  పశ్చాత్తాపంతో క్రుంగి కృశించి పోయాడు. స్త్రీవ్యామోహంలో పడి సౌమ్యుడు, సుశీలుడైన పెద్ద కుమారుని తృణీకరించానని తెలుసుకున్నాడు.

రాజుల్లో బహు భార్యాత్వముండి ఇలాంటి అనర్థాలు జరిగినట్లుగా ధ్రువోపాఖ్యానం వెల్లడి చేస్తుంది. ఐదేళ్ళ పసిబాలుడు శ్రీమన్నారాయణాను గ్రహం పొంది భక్తలోకానికే సత్పథం చూపి దివ్య వైభవంతో శాశ్వత విష్ణుపదాన్ని పొందాడు.

గుణవతి, శీలవతి అయిన ఒకే ఒక భార్య ఒక పురుషునికి ఇల్లాలై ఉండటం శ్రేష్ఠం. భార్యలు ఒకరి కంటే ఎక్కువైతే బాధాకరమే.

జడ భరతోపాఖ్యానంలో భరతుని తండ్రి అంగీరసునికి ఇద్దరు భార్యలు పెద్ద భార్యకి తొమ్మిది మంది పుత్రులు. చిన్న భార్య భరతుని తల్లి, భరతునితో పాటు మరొక కుమార్తె. భరతుని తండ్రి అంగీరసునితో అతని తల్లి (ద్వితీయ భార్య) సతీ సహగమనం చేసింది. భరతుని సవతి తల్లి కొడుకులు వేద విద్యలు చదువనీయక ఇంటిపనులు చేయమని శాసించి కష్టపెట్టారు.

బహుభార్యత్వం వల్ల కలిగిన కష్టాలను భరతుడు చవిచూసాడు.

చిత్రకేతూపాఖ్యానంలో చిత్రకేతుకి వేలమంది భార్యలు. సమస్త సంపదలున్నా కాని సంతానం లేదు. సంతానం కోసం యజ్ఞం చేసి, యజ్ఞ ప్రసాదాన్ని పెద్ద భార్య కృతద్యుతికిచ్చి ఒక పుత్రుని పొందుతాడు. పుత్రునిపై మమకారంతో పెద్ద భార్యను అధికంగా ప్రేమిస్తూ మిగిలిన వారిపై నిరాదారణ ప్రదర్శిస్తాడు. దానితో ఆ భార్యలు సపత్నీ మాత్సర్యంతో ఆ బాలునికి విషమిచ్చి సంహరిస్తారు. గంధర్వరాజైన చిత్రకేతు కూడ బహు భార్యాత్వం వల్ల, సమదృష్టి ప్రదర్శింపలేక భార్యల వల్ల కుమారుని కోల్పోతాడు.

కృతయుగ కాలంలో కూడా మహీమండల రాజుల్లో, గంధర్వ రాజుల్లో, బ్రాహ్మణుల్లో కూడా బహు భార్యాత్వం వల్ల సపత్నీ మాత్సర్యం, వారి సంతానం కూడ కష్టాలనుభవించటం జరిగింది.

## వంశోద్ధరణ

వేనుడు నిరంకుశుడై, చండశాసనుడై లోక కంటకుడై యజ్ఞయాగ జపతపాది పుణ్య కర్మలను చెయ్యరాదని, తననే పూజించాలని శాసించాడు. ఋషులు, పెద్దలు సన్మార్గంలో పెట్టాలని చూచిన పెడచెవిని పెట్టి మునుల ఆగ్రహానికి గురియై ప్రాణాలు కోల్పోతాడు. వేనుని తల్లి సునీధ తన యోగశక్తిచే వేనుని శరీరాన్ని కాపాడుతూ భద్రపరచింది.

మునులు రాజులేని రాజ్యం అల్లకల్లోలమవుతుందని పునరాలోచన చేసి వేనుని బాహువులను మథించగా వారి మంత్ర శక్తిచే కుడివైపునుండి పురుషుడు, ఎడమవైపు నుండి స్త్రీమూర్తి ఆవిర్భవించారు. పృదు చక్రవర్తి, అర్చి, వేనుని తల్లి తన యోగశక్తిచే మునుల సహకారంతో పృదు చక్రవర్తి వంటి పౌత్రుని పొంది వంశాన్ని నిలబెట్టింది.

వేనుని దౌష్ట్యాలకు విరక్తి కలిగి వేనుని తండ్రి అంగరాజు అరణ్యాలకు వెళ్ళిపోయాడు. తల్లి సునీధ మాత్రం తన కర్తవ్యాన్ని విస్మరించక కనిపెట్టుకొని ఉండి వంశ నాశనం కాకుండా సంరక్షించింది. కుటుంబ నిర్వహణల్లో కూడ స్త్రీలదే పైచేయిగా కృతయుగ ఉత్తరార్ధంలో కన్పిస్తుంది.

## పితృభక్తి పరాయణులు

పృదువంశంలో జన్మించిన ప్రచేతసులు పదిమంది తమతండ్రి (ప్రాచీనబర్హి) కోరికపై సంతానాభివృద్ధి గూర్చి తపస్సు చెయ్యడానికి వెళ్తుండగా రుద్రుడు సాక్షాత్కరించి నారాయణ మంత్రాన్ని ఉపదేశించాడు. ఈ కథని బట్టి పరిశీలించగా ఆనాటి రాజవంశీకులు అధికంగా పితృ వాక్య పరిపాలకులని అర్థమౌతుంది.

ధ్రువుడు తండ్రిచేత తిరస్కరింపబడినా తండ్రిని నిందించలేదు. ప్రహ్లాదుని తండ్రియై ఉండికూడ హిరణ్య కశిపుడు ఎన్ని హింసలు పెట్టినా, తండ్రిని నిందించక ఉత్తర క్రియలు కూడ నిర్వర్తించారు.

ఋషభుని కుమారుడైన భరతుడు పితృవాక్యానుసారం రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించి చిరస్థాయిగా ఈ మహీమండలానికి తన పేరును నిలబెట్టుకున్నారు కృత యుగాంతంలో పరశు రాముడు పితృవాక్య పరిపాలకుడై తల్లినే సంహరించాడు.

ఈ విధంగా ఆ నాటి రాజులు, ముని పుత్రులు కూడా పితృభక్తి పరాయణులుగా ఉండటానికి కారణం వారి తల్లుల పెంపకమే.

**బహుభర్తృత్వం**

ప్రాచేతసుల పదివేల సంవత్సరాల తపస్సుకి మెచ్చి శ్రీహరి ప్రత్యక్షమౌతాడు. వారి ఐక్యత పరస్పర స్నేహానురాగాలను ప్రశంసించి, మారిష అనే కన్యతో వివాహమై మహా కీర్తివంతుడైన పుత్రుడు కలుగుతాడని ఆశీర్వదించి అంతర్థానమవుతాడు.

వారు శ్రీహరి చెప్పినట్లే బ్రహ్మదేవుని ఆదేశానుసారం మారిషని వివాహమాడి దక్షుని పుత్రునిగా పొందుతారు (చాక్షుష మన్వంతరంలో బ్రహ్మ నుండి ఉద్భవించిన దక్షుడు శివ దూషణ చేసిన కారణంగా మానవుడై ప్రచేతసులకు మారిషకు పుత్రుడై జన్మిస్తాడు).

మారిష పాత్ర వల్ల బహుభర్తృత్వం కూడా కృత యుగ కాలంలో ఉన్నట్లు తెలుస్తుంది.

**లోకాలోక సంబంధాలు**

ప్రియవ్రత మహారాజుకి, బర్హిష్మతి దంపతులకు జన్మించిన ఊర్జస్వతి శుక్రాచార్యుని భార్య అయింది. నాటి ప్రజాపతులు గురుస్థానంలో ఉన్న వ్యక్తులకు కూడ తమ కుమార్తెల నిచ్చి వివాహం చేసేవారని అవగతమౌతుంది. వీరి కుమార్తె దేవయాని. ప్రియవ్రతుడు ఏడుసార్లు  భూప్రదక్షిణ గావించటంతో ఈ భూమండలం సప్తద్వీపాలుగా ఏర్పడింది. చిరకీర్తి నార్జించిన భూమీశుడు ప్రియవ్రత మహారాజు.

ప్రియవ్రతుని జ్యేష్ఠ కుమారుడు అగ్నీధ్రుడు ఉత్తమురాలైన భార్య కోసం బ్రహ్మదేవుని ఆరాధించాడు. బ్రహ్మదేవుడు తన కొలువులో సంగీతాలాపన చేసే పూర్వచిత్తిని పంపించాడు. మనువంశం వారు వివాహానికి కూడ శ్రీమన్నారాయణుని ఆదేశానుసారమో, బ్రహ్మదేవుని,

ఆదేశానుసారమో నడచుకొనేవారు. ఆనాటి ప్రజాపతులు అప్సరసలను వివాహం చేసికొని సంతానాన్ని పొందేవారని వెల్లడౌతుంది.

నాభి కుమారుడై జన్మించిన ఋషభుడు ఇంద్రుని కుమార్తె జయంతిని వివాహమాడాడు. ఈ సంఘటన వల్ల దేవ లోకానికి భూలోకానికి కూడ వివాహ సంబంధాలుండేవని తెలుస్తుంది. వీరికి జన్మించిన కుమారుడే భరతుడు.

## పరస్త్రీవ్యామోహం

వృత్రాసుర సంహారంతో దేవేంద్రుడు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకొని మానస సరోవరంలో ఒక కమల నాళంలో దూరి తామర తూడులోని సన్నని తంతువుల్లో కలిసిపోయాడు. అదృశ్య రూపంలో ఐశ్వర్యదూరుడై బ్రహ్మహత్యపరిహారం కోసం విచారిస్తూ వెయ్యి సంవత్సరాలు గడిపాడు. ఆ సమయంలో దేవేంద్ర పదవిలో ఆసీనుడైన నహుషుడు శచీదేవిని కాంక్షిస్తాడు. శచీదేవి వివేకంతో దేవగురువైన బృహస్పతి సహకారం వల్ల తన శీలాన్ని సంరక్షించు కొంది. నహుషుడు బ్రహ్మర్షుల చేత పల్లకీ మోయించుకొని, ఋషిశాపగ్రస్తుడై కొండచిలువ రూపం ధరిస్తాడు.

పరస్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడు నహుషుడు.

## పరదారాపహరణం

హిరణ్యకశిపుడు తపో నిమగ్నుడై ఉండగా, దేవేంద్రుడు హిరణ్య కశిపుని నివాస భవనంపై దాడిచేసి, గర్భవతి, గుణవతి యైన హిరణ్యకశిపుని భార్య లీలావతిని చెఱ పడతాడు. లోక కళ్యాణ కారకుడైన నారదుని ఉపదేశంపై ఆమెను విడిచి పెడతాడు. లేకపోతే హరి భక్తుడైన ప్రహ్లాదుని చరిత్ర మనకుండేది కాదు.

నరసింహ స్వామిని పన్నగేంద్రులు చేసిన సన్నుతి చూస్తే

*క. "రత్నములను మత్కాంతా*

*రత్నములను (బుచ్చుకొన్న రక్కసు నురమున్*

*యత్నమున వచ్చి వైచితి*

*పత్నులు రత్నములు (గలిగి (బ్రతికితుమీశా"* [9]

పన్నగజాతి వారి రత్నాలు, రమణీమణులును (భార్యలను) కూడ హిరణ్యకశిపుడు అపహరించాడని తెలుస్తుంది.

కృతయుగ కాలంలో ప్రజాపతులు, మనువులు పాలకులు, వీరు అధికులు త్రిమూర్తుల ఆదేశానుసారం నడచుకొని ధార్మిక జీవనాన్ని కొనసాగించి యోగ మార్గంలో తనువులు త్యజించినట్లుగా విదితమౌతుంది. ఇక స్త్రీలు కొందరు సతీసహగమనం చేసారు. కొందరు పుత్రుల కోసం వైధవ్యాన్ని అనుభవించి జీవించారు భగవంతుని పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరించి, విలాసాలతో, దురహంకారంతో ప్రవర్తించిన వారు అర్ధాంతరంగా నశించారు. ఆ నశించిన రాజుల, రాక్షసుల భార్యలు కూడ వివేకంతో మసలుకొని, ధర్మబద్ధంగా నడచుకున్నారు. ఈ కాలంలో స్త్రీలల్లో ధర్మోల్లంఘన చేసినవారు కొందరున్నారు. వారు ఆవిధంగా ప్రవర్తించటానికి కారణం వారి భర్తల అజ్ఞానమే. వారు స్వభావ సిద్ధంగా ధర్మాతి క్రమణ పరులు కాదు. స్త్రీలు ఏ కొద్ది మందైనా తప్పుచేసారంటే ఆ తప్పుకు లేదా అసూయకు కారణం పురుషుల అవివేకం లేదా వ్యామోహం కారణమైంది పతివ్రతలైన స్త్రీలు ప్రమాదాల బారిన పడినపుడు ఋషులు, మునులు దైవంలా అడ్డుపడి వారిని సంరక్షించి సత్యకాలంలో ధర్మపంథాకి దోహద పడ్డారు.

### 3.5.2 త్రేతాయుగం - స్త్రీల సామాజిక స్థితి

పరీక్షిత్తు శుకమహర్షిని నవమస్కంధారంభంలో

*సీ. "మనువుల నడవళ్ళు మర్యాదలును వింటి. మన్వంతరంబున మాధవుండు*

*దిరిగిన జాడలు దెలిసి సత్యవ్రతుండను రాజు ద్రవిళదేశాధిపుండు*

*పోయిన కల్పాంతమున విష్ణుసేవించి విజ్ఞానమును బొంది వెలు (గుటేని*

*కత'డువైవస్వతుండై పుట్టి మనువయ్యె, నతనికి నిక్ష్వాకు (డాదిగా (గ"*

*తే. "బదురు గొడుకులు గలరండ్రు పర (గవారి*

*వంశమేరీతి వర్తించె? వారిలోన (*

*జనిన వారిని జనువారి (జనెడువారి (*

*జెప్పవే వ్యాసనందన! చిత్తగించి"* [10]

ఇక్ష్వాకాది వంశ చరిత్ర (సూర్య వంశరాజులు) అడగటం వల్ల నవమస్కంధ విషయం త్రేతాయుగ కాలానికి సంబంధించిందని అవగతమవుతుంది.

సూర్యవంశ రాజులతో పాటు చంద్రవంశ రాజులు, శ్రీకృష్ణుని జననానికి ముందున్న కురువంశ స్త్రీలు కూడ కొందరు ఈ స్కంధంలోనే కన్పిస్తున్నారు.

ఆర్యులు సోపపత్తికంగా కాలాన్ని పరిగణించి త్రేతాయుగం శ్రీరామావతారంగా, ద్వాపరయుగం శ్రీకృష్ణావతారంగా తెలియచేసారు. కాబట్టి నవమ స్కంధంలో కన్పించే స్త్రీ పాత్రలను పరిశీలిస్తే త్రేతాయుగకాలం నాటి స్త్రీల సామాజిక స్థితిగతులవగత మవుతాయి.

### సాంఘికాచారాలు

సంఘంలో ప్రజలు "యధారాజా తధా ప్రజా:" అన్న చందంగానే ఉండేవారు.

### రాజరికంలో స్త్రీలు

### రాజుల బహుభార్యాత్వం

దశరధ మహారాజుకి ముగ్గురు పట్టపు రాణులుండటం వల్ల, చిన్న భార్య కిచ్చిన వరాల వల్ల, సూర్య వంశపు రాజైన దశరధుడు ధర్మగతి తప్పి, జ్యేష్టునకు రాజ్యాధికారమనే కృతయుగ ధర్మాన్ని విడిచి పెట్టాల్సి వచ్చింది. రాజమాత కావల్సిన కౌసల్య దు:ఖంతో క్రుంగి పోయింది.

### సపత్నీ మాత్సర్యం

కౌసల్య రాజమాత అవుతుంది. నేను కాకపోతినే అనే సపత్నీ మాత్సర్యంతో కైకలో స్వార్ధం మంధర వల్ల ప్రకోపించి, భర్తను అడగకూడని వరాలడిగి సంకటస్థితిలో పడవేసింది. ధర్మగతి మీద స్థిరబుద్ధి లేని కైక వంటి స్త్రీలకు 'భార్య' అని ముచ్చటపడి వరాలిస్తే చివరికి ఏమవుతుందో దశరధుడు చవి చూడటం వల్ల ఆ నాటి రాజ పురుషులందరికి ఇదొక గుణ పాఠమై ఉంటుంది. నాటికే కాదు నేటి పురుషులకు కూడ తస్మాత్ జాగ్రత్త చెప్పిన అంశం.

### పరదారాపహరణం

శ్రీరాముడు లేని సమయం చూసి సీతాపహరణం చేసిన రావణుడు, దేవేంద్రుడు లేని సమయం చూసి దేవలోకాన్ని, దేవేంద్ర పదవిని అధిష్ఠించి, అధికార మదంతో దేవేంద్రుని భార్య

శచీదేవిని కోరిన నహుషుని చూస్తే, భర్త సమీపంలో లేని స్త్రీలకు రక్షణ లేదనే విషయం అవగతమవుతుంది. ఈ స్త్రీలిరువురికి వారి పాతివ్రత్యమే వారికి రక్ష అయింది,

**పరపురుష గమనం**

**1. తార**

ఈమె దేవ గురువు బృహస్పతి పత్ని. బృహస్పతి శిష్యుడైన చంద్రునిపై వ్యామోహంతో ఈమె శీలానికి ప్రాధాన్యమివ్వక, చంద్రునితో కొంతకాలం జీవించి, బుధునికి తల్లి అయింది. ఈమె చంద్రుని నుండి బృహస్పతి వద్దకు రావటానికి దేవాసుర యుద్ధం జరిగింది. చివరికి బ్రహ్మదేవుడు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఒకరి ధర్మపత్నిగా ఉన్న స్త్రీ తెగింపు ఎంత వినాశనమో ఈమె వల్ల తెలుస్తుంది. విలువలు లేని, ఇంద్రియ నిగ్రహం లేని స్త్రీలు ఏ జాతిలో ఉన్నా, ఏ స్థానంలో ఉన్నా వారి బుద్ధి వక్రీకరిస్తుందనటానికి ఈమె నిదర్శనం.

**2. అహల్య**

దేవేంద్రుడు తన అధికార స్వార్ధబుద్ధికి తమోగుణ పొరలు క్రమ్మి గౌతముడు లేని సమయంలో అహల్యపై వ్యామోహంతో గౌతమాశ్రమానికి వస్తాడు. దేవరాజనే కుతూహలంతో అహల్య ధర్మాధర్మ విచక్షణ కోల్పోయి, తానొక ఋషి పత్ని నన్న జ్ఞానాన్ని మరచి దేవేంద్రుని కోర్కె తీర్చింది. దాని పర్యవసానం పశ్చాత్తాపంతో శ్రీరామ దర్శనానికి ఎదురుచూస్తూ దీర్ఘకాలం తపస్సు చేసింది.

కామ పొరలు నిండిన దేవరాజుకి ఒళ్ళంతా కళ్ళై సహస్రనేత్రుడిగా లోక ప్రసిద్ధి మిగిలింది.

**3. మమత**

ఈమె దేవజాతి స్త్రీ. బృహస్పతి అన్న భార్య. దేవలోకం గదా! వావి వరుసలుండవేమో మరి. వదినా మరుదుల కామకేళి. దీన్ని చూచి తట్టుకోలేని మమత గర్భస్థ శిశువు పినతండ్రైన బృహస్పతిని ఒక తన్ను తన్నాడు. ఆ దెబ్బతో బృహస్పతి వీర్యం నేలపై పడి ఇద్దరు కొడుకులు కలిగారు మమతకు.

మమత రెండవ వాడిని అంటే ద్వాజుడిని బృహస్పతిని పెంచమంటుంది. బృహస్పతి మమతనే భరించమంటాడు. నీవే భరించు, నీవే భరించమని వారిద్దరు వాదులాడు కొన్నందున ఆ బాలుడు భరద్వాజుడయ్యాడు.

వివేకం నశించి కామాంధులైన వారి కలయిక ఒక మచ్చగానే ఇతిహాసంలో నిలుస్తుంది.

### వర్ణ సంకరం (సూర్యవంశంలో)

### మదయంతి

ఈమె సుదాసుడి భార్య. సుదాసుడనే ఈ రాజు వసిష్ఠుని శాపం వల్ల రాక్షసుడయ్యాడు, రాక్షసుడైన అనంతరం బ్రాహ్మణ స్త్రీ శాపంచే పుత్రహీనుడయ్యాడు. ఆపద్ధర్మంగా వంశం నిలపటానికి మదయంతి వసిష్ఠుని వల్ల సంతానాన్ని పొందింది. రాజ పత్నులు వంశం నిలబడటానికి ఋషుల వల్ల, బ్రాహ్మణుల వల్ల సంతానాన్ని పొందటం ఆకాలంలో ఆచారంగా ఉండేది. అది దోషంగా ఆ నాటి వారు పరిగణించలేదు. ఇక్కడ నుండి సూర్యవంశం బ్రాహ్మణ బీజంగా క్షత్రియ క్షేత్రంగా కన్పిస్తుంది.

### వివాహ వ్యవస్థ

1. సీతారాముల వివాహం స్వయం వర పద్ధతి, ఆర్ష సంప్రదాయంలో శాస్త్రోక్తంగా జరిగింది.

2. గాంధర్వ వివాహం - శకుంతలా దుష్యంతులు. శకుంతల దుష్యంతుని కణ్వ మహాముని (పెంచిన తండ్రి) అనమతి లేకుండా గాంధర్వ విధిలో వివాహమాడి, జీవనం గడిపినందు న శకుంతల గూర్చి దుష్యంతునికి ఆకాశవాణి చెప్పాల్సిన అగత్యమేర్పడింది.

గాంధర్వ వివాహ పద్ధతిలో పొంచి ఉన్న ప్రమాదం, వీరిరువురి వివాహం ద్వారా లోకానికి వెల్లడవుతుంది. స్త్రీలకు శకుంతల ప్రవర్తనా తీరు ఒక గుణపాఠం. పెద్దలు లేని పెళ్ళి పెడాకులయితే ఏమవుతుందన్న సత్యం తెలిసి వచ్చింది.

### వర్ణాంతర వివాహాలు

క్షత్రియ కన్యలు బ్రాహ్మణులను వివాహమాడటం కృతయుగ కాలంలో వలె త్రేతాయుగంలో కూడా కన్పిస్తుంది.

1. సత్యవతి - ఈమె గాధిరాజు కుమార్తె. విశ్వామిత్రుని సోదరి ఋచికుడనే బ్రాహ్మణుని భార్య. ఈ దంపతుల కుమారుడే జమదగ్ని. ఈ జమదగ్ని కుమారుడే పరశురాముడు. పరశురామునిలో క్షాత్రం, బ్రాహ్మణ్యం రెండూ కన్పిస్తాయి. దీనికి వేరొక కథ కూడ చెపుతారు కాని ఈ వర్ణాంతర వివాహం కూడ కారణంగా భావించవచ్చు.

2. సుకన్యక - ఈమె శర్యాతి మహారాజు కుమార్తె. ఒక రోజు రాజు సపరివారంగా కుమార్తెతో సహా అరణ్యానికి వెళతాడు. విధివశాన సుకన్యక చేష్టవల్ల తపోనిమగ్నుడై ఉన్న చ్యవనుడు అంధుడౌతాడు. వృద్ధుడైన ఆముని పరిష్కారంగా రాజ కుమార్తెనిచ్చి వివాహం చెయ్యమని శర్యాతిని కోరతాడు. తప్పనిసరి పరిస్థితుల్లో చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా సుకన్యక ఆ వృద్ధమునిని వివాహం చేసికొని పతిసేవయే పరమ కర్తవ్యంగా భావించి సేవ చేసింది.

వయస్సుతో వర్ణంతో నిమిత్తం లేకుండా క్షత్రియ కన్యలను బ్రాహ్మణులు లేదా మునులు వివాహం చేసుకున్నారు.

**3. నర్మద**

నాగకన్య మాంధాత కుమారుడైన పురుకుత్సుని వివాహం చేసికొంది. దీనిని బట్టి జాత్యంతర వివాహాలు జరిగేవని అవగతమవుతుంది.

**భిన్న దృక్పథాలు - పతీపత్నులు**

**1. శ్రద్ధ** - సంతాన విషయంలో శ్రద్ధకి, శ్రద్ధ భర్త శ్రాద్ధదేవునికి వేర్వేరు అభిప్రాయాల వల్ల సంకట పరిస్థితి ఏర్పడింది. శ్రద్ధ కుమార్తె కావాలని పయోవ్రతం చేసింది. శ్రద్ధ కోరిక ప్రకారం కుమార్తె ఇల జన్మిస్తుంది. శ్రాద్ధదేవ మనువు పుత్రుడు కావాలనుకొంటాడు. శ్రాద్ధదేవుని కోరికమేర వసిష్ఠుడు తన తపోశక్తితో ఇలను పురుషుడిగా మారుస్తాడు. అతడే సుద్యుమ్నుడు.

**2. సత్యవతి** - ఈమె, ఈమె తల్లి ఇద్దరు తమకు పుత్రులు కావాలని ఋచికుని అడుగుతారు. ఋచికుడు బ్రహ్మ మంత్రాలతో వేల్పించిన హవిస్సు, క్షాత్రమంత్రాలతో వేల్పించిన హవిస్సు, రెండు తయారుచేసి స్నానానికి నదికి వెళతాడు. ఈ సత్యవతి తల్లి కివ్వమన్న హవిస్సు తాను, తనకి తయారుచేసింది తల్లికి ఇస్తుంది.

ఋచికుడు తెలుసుకొని క్రూరుడైన కుమారుడు పుడతాడని సత్యవతితో అంటాడు. సత్యవతి భయపడి ప్రాధేయపడుతుంది. అప్పుడు పుత్రుడు సాధువు. మనుమడు క్రూరుడవుతా డంటాడు. కుమారుడు జమదగ్ని, మనుమడు పరశురాముడు.

భార్యభర్తల భిన్న దృక్పథాలు కలిగి ఉండటం వల్ల ఒక అవగాహన లేక పోవటం వల్ల సంతాన విషయంలో సమస్యలెదురయ్యాయి,

**విచిత్ర సంఘటనలు**

**1. విదర్భ రాజ పుత్రికలు**

వీరు భరతుని భార్యలు. ఈ రాజ పుత్రికలకు జన్మించిన పుత్రులు. భర్త పేరు నిలిపేవారని కాదని తెలిసిన వెంటనే పుత్రుల శిరస్సులు ఖండించారు. దుష్టులైన తనయులతో కష్టాలు పొందిన స్త్రీలు చాలామంది ఉన్నారు. పుత్రులను నరికివేసిన స్త్రీలు అరుదు. ఇదొక దురదృష్ట విచిత్ర సంఘటన.

**2. ఇల**

వసిష్ఠుని తపోశక్తిచే సుద్యుమ్నుడుగా మారిన తర్వాత ఒకసారి కుమార వనానికి వెళ్ళి స్త్రీగా మారిపోతాడు (పరమేశ్వరుడు పార్వతికి ఆ కుమార వనంలో ప్రవేశించిన పురుషులందరు స్త్రీలయిపోతారని మాట ఇస్తాడు) స్త్రీగా మారిన సుద్యుమ్నుడి దుస్థితిని శ్రాద్ధదేవ మనువు వసిష్ఠునికి వివరించగా వసిష్ఠుడు శివుని ప్రార్థించి ఒక నెల స్త్రీగా ఒక నెల పురుషుడుగా ఉండటానికి అనుమతి తీసుకుంటాడు.

పురుషుడుగా నెలమార్చి నెల ఉంటున్న సుద్యుమ్నుడు రాజ్య వ్యవహారాలు చూస్తూ ఉంటాడు. ఒక నెల స్త్రీగా మారుతున్న సుద్యుమ్నుని బుధుడు ప్రేమిస్తాడు, వీరిరువురికే పురూరవుడు జన్మిస్తాడు. ఒకే వ్యక్తి పురుషుడిగా రాజ్య పాలన చేస్తూ స్త్రీగా వేరొకరిని ప్రేమించి వివాహం చేసికొని సంతానం పొందటం విచిత్రం.

**శకుంతల**

ఈమె మేనకా విశ్వామిత్రుల కుమార్తె. దేవేంద్రుని అనుమతితో మేనక విశ్వామిత్ర తపో భంగం చేయటానికి వచ్చి, విశ్వామిత్రుడికి జీవితాన్ని పంచి శకుంతలకు జన్మనిస్తుంది. తర్వాత జ్ఞానోదయం కలిగింది. ఋషి దారి తపోవనం. మేనక దారి స్వర్గం. మిగిలిన అనాథ శిశువు. పక్షులు జాలిపడి పెంచుతుంటే కణ్వ మహాముని తన ఆశ్రమానికి తీసుకు వస్తాడు.

పక్షులు పసిపిల్లలను పెంచటం విశేషం, విచిత్రం.

**అప్సరస స్త్రీలు -** అప్సరసలు దేవేంద్రుని ఆజ్ఞతో మునుల తపో భంగానికి వచ్చి వారితో సంతానాన్ని కూడా పొందేవారు. అలాంటి వారిలో ఊర్వశి, మేనక, ఘృతాచి కన్పిస్తున్నారు.

**ఊర్వశి -** మిత్రావరుణులు శాపం వల్ల మనుష్య రూపం పొంది పురూరవునితో చాలాకాలం జీవితం గడిపింది.

**మేనక -** ఈమె విశ్వామిత్రుని వల్ల శకుంతలకి జన్మనిచ్చింది.

**ఘృతాచి -** ఈమె రౌద్రాశ్వుని వల్ల పదిమంది పుత్రులను పొందింది.

వ. "పూరునకు ( జనమేజయుండు ... ... ... రౌద్రాశ్వునకు ఘృతాచి యను నచ్చరలేమ యందు ఋతేపువు, కక్షేపువు. స్థలేపువు, కృతేపువు, జలేపువు, సన్నతేపువు, ధర్మేపువు, సత్యేపువు, వ్రతేపువు, వనేపువు అనువారు ... ... ..."[12]

## పురుషులకు విచిత్ర జననాలు

### మాంధాత

యవనాశ్వునికి వందమంది భార్యలు. సంతానం లేక సంతానం కోసం మునులు కటాక్షించి ఇంద్రుడిని గూర్చి యాగం చేయించి ఆ రాజు భార్యకు సంతానం కలగటానికి మంత్ర పూతమైన నీళ్ళను పవిత్ర కలశంలో దాచి నిద్రపోయారు. ఆ రాత్రి రాజు దాహమై ఆ కలశంలో జలం త్రాగుతాడు. ఆ బ్రాహ్మణులు మేల్కొని కలశం చూడగా కలశంలో నీళ్ళు ఉండవు. రాజ త్రాగిన సంగతిని ఊహిస్తారు. ఇంతలో యవనాశ్వుని కుడివైపున కడుపును చీల్చుకొని చక్రవర్తి చిహ్నాలతో పుత్రుడు పుడతాడు. తల్లిలేని కారణంగా ఆకలితో ఏడుస్తాడు. ఏడుస్తున్న బాలుని ఊరడించి ఆకలి తీరటానికి ఇంద్రుడు వచ్చి ఆ శిశువు నోట వ్రేలిని పెట్టాడు. ఇంద్రుడు మాంధాత అని పేరు పెట్టి వెళతాడు.

### కృపి, కృపులు

శరద్వంతుడు (శతానందుని పౌత్రుడు. శతానందుడంటే అహల్యాగౌతముల పుత్రుడు) ఊర్వశిని చూచి మోహించగా రేత స్ఖలనమై ఆ వీర్యం ఒక రెల్లు దుబ్బుమీద పడి రెండు భాగాలై కవల బిడ్డలుగా కలిగారు. శంతన మహారాజు వేటకై అడవికి వెళ్ళి ఆ కవల పిల్లలను చూచి జాలిపడి కృపి, కృపుడనే పేర్లతో పెంచాడు. ఆ కృపియే (ప్రథమ స్కంధంలో) ద్రోణ కుటుంబిని.

స్త్రీ ప్రమేయం లేకుండా పురుషుని మోహం వల్ల సంతానం కలగటం నాటి కాలంలో ఉన్నట్లు తెలుస్తుంది.

**ముని పత్నుల స్థితిగతులు**

**రేణుక** - జమదగ్ని భార్య జలం కోసం గంగానదికి వెళ్ళి జల క్రీడలాడే చిత్రరథుడనే గంధర్వరాజును చూస్తూ, ఆశ్రమానికి తిరిగి వెళ్ళటం ఆలస్యమయింది. మానసిక వ్యభిచారం చేసిన భార్యను బ్రతక నివ్వకూడదని జమదగ్ని కొడుకులను, తల్లిని నరకమంటాడు. కనిష్ఠుడు తల్లిని నరుకుతాడు (అతడే పరశురాముడు. తర్వాత తల్లిని బ్రతికించమంటాడు తండ్రితో. తండ్రి బ్రతికిస్తాడు). మనస్సులో ఆలోచన గతి తప్పినా, తప్పుగా భావించే సత్యకాలం కృతయుగం. ఈమె కృత యుగాంతంలో మానసిక ఆలోచనతో తప్పుచేసి త్రేతాయుగారంభానికి నాంది పలికింది. (నవమ స్కంధం రాజ వంశాల చరిత్ర కాబట్టి రాజులను నరికిన పరశురామ చరిత్ర ఈ స్కంధంలో వచ్చినందు వల్ల ఈమె విషయం ఇక్కడ చెప్పవలసి వచ్చింది).

**రాక్షస స్త్రీలు**

**తాటకి** - ఈమె ఋషులు చేసే యజ్ఞాలను విధ్వంసం చేసేది. ఈమె విశ్వామిత్ర యజ్ఞం విధ్వంసం చేయటానికి ప్రయత్నించి. విశ్వామిత్ర మహర్షి ప్రేరణచే శ్రీరాముని చేత సంహరింప బడింది. ధర్మ కార్యం కోసం స్త్రీవధ చేయటంలో దోషం లేదని తీర్మానం ఈమె నుండే ఆరంభమైంది.

**శూర్పణఖ** - ఈమె రావణాసురుని చెల్లెలు. ఈమె శ్రీరాముని కామించి, ఆ కోరిక నెరవేరక లక్ష్మణునిచే అవమానింపబడి, రావణుని సీతాపహరణానికి ప్రేరేపించింది.

**మండోదరి** - ఈమె రావణుని పట్టమహిషి, పాతాళలోకరాజు. మయాసురుని కుమార్తె. శ్రీహరి భక్తురాలు. హరి ద్వేషి రావణుని ఇష్టపడి వరించింది. ధర్మపరురాలు, పతివ్రత, లోకాంతర వివాహం ఈమెది.

**శర్మిష్ఠ** - వృషపర్వుడనే రాక్షస రాజు తనయ. ఈమె రాక్షస గురువైన శుక్రాచార్యుని కుమార్తెతో వన విహారానికి వెళ్ళి జలక్రీడలాడి గురుపుత్రి వస్త్రాలు ధరిస్తుంది. గురుపుత్రి ఆగ్రహం వెళ్ళ

గ్రక్కుతుంది. ఈ గురుపుత్రికి తీసిపోని విధంగా ఈ రాక్షస రాజు తనయ నగ్నంగా చెలికత్తెలచేత బావిలో పడత్రోయిస్తుంది. వేటకు వచ్చిన యయాతిచే రక్షింపబడుతుంది. జాత్యహంకారంతో శర్మిష్ట, గురుపుత్రినన్న అహంకారంతో దేవయాని, జీవితాంతం స్పర్ధతోనే ఉన్నారు. అతి పౌరుషానికి పోయిన ఆడ పిల్లల వల్ల ఎన్ని సమస్యలుత్పన్నమవ్వాలో అన్ని సమస్యలుత్పన్నం చేసారు ఈ ఇరువురు స్త్రీలు.

ఈ ఇరువురు స్త్రీలల్లో రజోగుణ, తమోగుణాలు తప్పసత్త్వగుణమనేది ఏ కోశాన కన్పించదు. స్త్రీ అనే పదానికి సకార, తకార రేఫలనే నిర్వచనంలో మొదటి అక్షరం లోపించిన పాత్రలు దేవయాని శర్మిష్ఠలు.

**జర** - బృహద్రధుని భార్య. గర్భంలో ఒకే బిడ్డ శరీరం రెండు ముక్కలవ్వగా ఆ ముక్కలను చూచి తల్లి పారవేసింది. ఈ పారవేసిన రెండు ముక్కలను జర అనే రాక్షస స్త్రీ ఒకటిగా సంధించింది. వాడు జరాసంధుడై గిరివ్రజాన్ని పాలించాడు. రాక్షస స్త్రీ ఒక శిశువు ప్రాణం పోసింది.

**హిడింబ** - ఈమె రాక్షస స్త్రీ అయినప్పటికి అరణ్యంలో నిద్రపోతున్న నలుగురు సోదరులు, కుంతీ దేవికి కాపలా కాస్తున్న భీమసేనుని అందచందాలకు మోజుపడి, సోదరుడైన హిడింబాసురుని భీమసేనునిచే సంహరింపచేసింది. అనంతరం కుంతీదేవి అనుమతితో భీముని వివాహమాడి ఘటోత్కచునికి తల్లి అయింది. రాక్షస స్త్రీలు తాము కోరుకున్న వాని కోసం మన తన అనే బంధాలకు అంతగా ప్రాధాన్యమిచ్చినట్లు గోచరించటం లేదు.

కృతయుగ కాలంలో స్త్రీలు తల్లి దండ్రులతోనే వారి ఆలోచనలు చెప్పటానికి కొంత స్వేచ్ఛ ఉన్నట్లు కన్పిస్తుంది. త్రేతాయుగం నాటికి స్త్రీలు తల్లిదండ్రులతోనే కాదు భర్తతో కూడ వారి అభిప్రాయాన్ని వెల్లడించినట్లుగా కన్పిస్తుంది. కృతయుగ కాలంలో అప్సరసలు ఋషులను తమ అందచందాలతో మైమరపించి, జీవితాన్ని పంచుకొని సంతానం కల్గిన తర్వాత కాని స్వర్గలోకానికి వెళ్ళేవారు కాదు. శాపవశాన మానవరూపం ధరించి ఊర్వశి పురూరవుని పరాక్రమాన్ని నిందించి.

"అధముడైన వాని కాలగు కంటె నత్యధికునింట దాసి యగుట మేలని" ఒక సామెతను కూడ భూలోక వాసులకు చెప్పి మరీ స్వర్గాధిపతి వద్దకు వెళ్ళింది.

కృత త్రేతా యుగాల్లో కూడ మానవులకు దేవతలకు, బ్రాహ్మణులకు, క్షత్రియులకు స్త్రీ పురుష వివాహ సంబంధాలున్నాయి. గాంధర్వ వివాహాలు కన్పిస్తున్నాయి. త్రేతాయుగంలో స్వయం వరాలున్నాయి,

ఇక త్రేతాయుగంలో రాక్షస స్త్రీలు యధేచ్ఛగా సంచరించటం, మానవ రాకుమారులను కోరటం కన్పిస్తుంది. దేవజాతిలో, బ్రాహ్మణ జాతుల్లో కూడ పర పురుష గమనం చేసిన స్త్రీలున్నారు. పర పురుష గమనం చేసిన వారిని కూడ తప్పుకు ప్రాయశ్చిత్తం చేయించారు కాని భర్తలు విడిచి పెట్టలేదు. మంచైనా, చెడైనా, భార్యను భరించేవాడే భర్త అన్న న్యాయాన్ని పురుషులాచరించి నట్లుగా కన్పిస్తుంది.

### 3.5.3 ద్వాపర యుగం - స్త్రీల సామాజిక స్థితిగతులు

భాగవతంలో ప్రధమస్కంధం, నవమ స్కంధంలో చంద్ర వంశరాజుల కథలో కురువంశ స్త్రీలు, దశమస్కంధం, ఏకాదశ ద్వాదశ స్కంధాల్లో ద్వాపరయుగానికి సంబంధించిన (శ్రీకృష్ణావతార గాధలు) విషయం ఉంది. ఈ స్కంధాల్లో స్త్రీ పాత్రలను పరిశీలిస్తే ఆనాటి సామాజిక స్థితి గతులు, స్త్రీలకు సమాజంలో ఉన్న స్థానం. ఆ కాలం నాటి స్త్రీల గుణ దోషాలు వ్యక్తమౌతున్నాయి.

### 1. వివాహ వ్యవస్థ

స్వయంవర పద్ధతే రాజవంశాల్లో అధికంగా కన్పడుతుంది స్వయంవరమంటే స్వయంగా వరించటం. ఎవరు ఎవరిని స్వయంగా వరించారంటే, స్వయం వరానికి వచ్చిన రాజుల్లో తనకు నచ్చిన రాజును స్వయంవర పుష్పమాలికతో రాజకుమార్తెలు వరించేవారు. కొన్ని సందర్భాల్లో కొన్ని స్వయం వరాల్లో పరాక్రమోపేతుడైన రాజు. ఆ కన్య తండ్రి పెట్టిన పదెం గెలిచి వరించేవాడు. కొన్ని స్వయం వరాల్లో రాజసమూహాన్ని జయించిన రాజు ఆ కన్యని తీసుకెళ్ళేవాడు. అంటే స్త్రీలకి పూర్తిగా వివాహ విషయంలో స్వేచ్ఛలేదనే విషయం స్పష్టమవుతుంది. పెద్దలు పెట్టిన స్వయంవరాన్ని వ్యతిరేకించి తన మనోభిప్రాయాన్ని తెలియ చేసిన అంబ అవమానం పాలై, జీవితం వ్యర్థమై భీష్మునిపై పగతో మహాభారత యుద్ధంలో శిఖండిగా అర్జునుని రధంపై ప్రత్యక్షమవుతుంది. ఇక భీష్ముడు తాను స్వయంవరం నుండి తెచ్చిన అంబికను, ఆంబాలికను తన తమ్ముడికిచ్చి (సత్యవతీ పుత్రుడైన విచిత్రవీర్యుడు) వివాహం చేస్తాడు. ఇది ఆనాటి కురువంశ వివాహాల స్థితి.

సత్యవతిపై శంతన మహారాజుకు కలిగిన ప్రేమను తీర్చటానికి, సత్యవతి తల్లి దండ్రులు పెట్టిన షరతులపై వారికి నమ్మకం కలిగించటానికి పరాక్రమోపేతుడైన పవిత్ర గంగా తనయుడు భీష్ముడు పితృ ప్రేమతో ఆ జన్మ బ్రహ్మచారిగా ఉండి పోయాడు. పరాక్రమంతో రాజ్యాన్ని పాలించి ధర్మాన్ని నిలబెట్టగలిగిన సత్యసంధుడు శాంతనవుడు నామ మాత్రంగా, కురు వంశ పెద్ద దిక్కుగా మిగిలి పోయాడు.

యుక్త వయస్కుడైన తనయుడున్న తండ్రికి ఒక స్త్రీపై గల్గిన వ్యామోహం ఎంత వినాశనానికి దారి తీసిందంటే తనయుడికి వివాహం చేసి, పట్టాభిషేకం గావించి వాన ప్రస్థం స్వీకరించాల్సిన శంతన మహారాజు కామాంధకారం అతని వంశాన్ని నిర్వీర్యం చేసింది. వ్యాసుని వల్ల శంతన మహారాజు పౌత్రుడిగా చెప్పబడే ధృతరాష్ట్రుడు పుట్టంధుడు. భీష్ముని ప్రతిజ్ఞకు (ఆ జన్మ బ్రహ్మచారిగా ఉండే విషయం) శంతనుని స్త్రీ వ్యామోహానికి (సత్యవతిని వివాహం చేసుకోవాలనే కోరికను) ప్రజల ముఖాలు వెలవెలబోయి ఉంటాయి. అందుకే శంతనుని రెండవపౌత్రుడు పాండురాజు పాండు వర్ణంతో జన్మించాడు. కొడుకు సుఖమాలోచించలేని తన తండ్రి సుఖ సంతోషాల కోసం, తనయుడిగా తాను లౌకిక సుఖాలు త్వజించి, జ్ఞానిగా ఉండటం వల్ల దాసీ పుత్రునిగా ధృతరాష్ట్ర పాండురాజులకు తమ్మునిగా మహాజ్ఞాని విదురుడు జన్మిస్తాడు.

భీష్ముడు కాశీరాజు స్వయంవరానికి వెళ్ళి తన పరాక్రమం చేత కాశీరాజు కుమార్తెలను రాక్షస వివాహ పద్ధతిలో తీసుకురావటం వల్ల అంబకు కలిగిన వేదన, పరశురాముడంత వానిని ధర్మమడిగినా, పరిష్కారం లేక జీవితం వ్యర్థమై అడవుల పట్టి తపస్సు చేయటం వల్ల ఆ పాప ఫలితం భీష్ముని కళ్ళముందే, నిండు సభలో కురువంశపు కోడలు, కురుపితా మహుడని భీష్ముని ధర్మమడిగినా, ధర్మం చెప్పలేని నిస్సహాయస్థితి తన కళ్ళముందే కులస్త్రీ పరాభవం, ఇవన్నీ కురు వంశస్థులు చేసిన పాపఫలితాలే.

యుక్తా యుక్త విచక్షణ లేకుండా శంతన మహారాజుకి సత్యవతిపై కలిగిన వ్యామోహం ఆ వంశ సంకరానికి కారణమైంది.

తన పరాక్రమ అహంతో భీష్ముడు కాశీరాజు కుమార్తె యెడ చేసిన కర్మఫలం ఆ వంశ నాశనానికి దోహదపడింది. ఈ యుగంలో జరిగిన సంఘటనలను పరిశీలిస్తే పెద్దలు చేసిన పాపాలు తర్వాత తరాలను పట్టి పీడిస్తాయనే సత్యం అవగతమవుతుంది.

కౌరవుల కుట్రలకు బలి కాకుండా శ్రీకృష్ణ సహాయంతో పాండవులు భిక్షాటన చేస్తూ. బ్రాహ్మణ వేషధారులై ఏకచక్ర పురంలో నివసిస్తూ ఉంటారు. ద్రౌపదీ స్వయంవరానికి రావటం, అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదించటం, ద్రౌపదిని పాండవు లైదుగురు వివాహమాడటం ద్వాపర యుగ రాజ వంశాల్లో నూతనాధ్యాయం. బహుపతిత్వంపై ద్రౌపది తన వ్యక్తిగత అభిప్రాయం తెలియపరచలేదు. వ్యాస నియమానుసారం ద్రౌపదితో పాండవులు జీవితం కొనసాగించారు. ఈ సంఘటన కౌరవుల దృష్టిలో ద్రౌపది పట్ల చులకన భావం ఏర్పడటానికి, పరాభవానికి కూడ కొంత దోహద పడినట్లుగా భావించవచ్చు.

కురువంశం నిలబడటానికి స్త్రీల కృష్ణ భక్తియే ప్రధానకారణం, కుంతి శ్రీకృష్ణుని మేనత్త అయినప్పటికి శ్రీకృష్ణుని భాగవత తత్త్వాన్ని గుర్తించి ఆదినుండి అంత్యం వరకు శరణాగతి చేసింది. పాండవులందరికి శ్రీకృష్ణునిపై అపరిమిత భక్తి. ద్రౌపది యజ్ఞజన్య. శక్తివంతురాలు కృష్ణభక్తి పరురాలు. ఉత్తర శ్రీకృష్ణుని భక్తితో ప్రార్థించటమే కాక రక్త సంబంధాన్ని గుర్తుచేసి తన గర్భస్థమైన కురువంశాంకురాన్ని రక్షించమని శరణువేడింది. కురువంశం అంతం కాకుండా కాపాడ కల్గింది ఉత్తర పాండవుల విజయానికి కారణం ద్రౌపది. పరాక్రమోపేతులైన పాండు పుత్రుల విజయానికి, కురు వంశాభివృద్ధికి కుంతి భక్తి, ద్రౌపదిశక్తి, ఉత్తర యుక్తి తోడ్పడ్డాయి,

## 2. విచిత్ర జననాలు

### కుంతీదేవి

శూరసేనుని కుమార్తె పృథ. సంతానం లేని కుంతి భోజునికి దత్తత ఇవ్వటం వల్ల అప్పటి నుండి కుంతీదేవిగా ఖ్యాతి గాంచింది. వివాహానికి పూర్వం కుంతీదేవి కుంతిభోజుని ఇంటికి అతిథిగా వచ్చిన దుర్వాస మహర్షికి అతిథి సేవచేసి మెప్పించింది. ఆ మహర్షి సేవకు మెచ్చి కుంతీ దేవికి ఒక మంత్రాన్ని ఉపదేశిస్తాడు. ఆ మంత్ర ప్రభావం చూద్దామని, కుంతి ఆ మంత్రాన్ని పఠించి సూర్యదేవుని ఆహ్వానించటం. సూర్యదేవుని వల్ల సంతానాన్ని పొందటం, లోకానికి భయపడి గంగానదిలో విడిచి పెడుతుంది.

*తే. గీ. "కుంతి పిన్ననా ( డు గోరి సూర్యుని ( బొంద,*

*బిడ్డ ( డు దితు ( డైన బెట్టె ( బెట్టి*

*గంగ నీట విడువ ( గని యతిరధు ( డంత (*

*గర్ణు ( డనుచు ( గొడుకు గారవించె "*[12]

## సత్యవతి

శంతన మహారాజు రెండవభార్య సత్యవతి శంతనునితో వివాహానికి ముందు మత్స్య గంధిగా ఉన్నప్పుడు పరాశర మునితో కలిసి గర్భం దాల్చి వ్యాసుని పుత్రునిగా పొందింది.

*ఉ. "సత్యవతీ వధూటి మును శంతను పెండ్లము గాని నా ( డు సాం*

*గత్యమునం బరాశరు ( డు గర్భము చేసిన బాదరాయణుం*

*డత్యధికుండు శ్రీహరి కళాంశజు ( డై ప్రభవించి నిత్యముల్*

*సత్యములైన వేదముల సాంగములన్ విభజింప దక్షు ( డై"*[13]

## మంత్ర ప్రభావంచే సంతానం పొందిన స్త్రీలు

**కుంతి -** వివాహ పూర్వం కర్ణునికి జననమిచ్చిన కుంతి పాండు రాజును వివాహం చేసుకుంటుంది. పాండురాజు కిందముని శాపంచే అనపత్యుడౌతాడు. పాండురాజు నియోగ పద్ధతి వల్ల సంతానాన్ని పొందమని కోరతాడు. కుంతి తనకు దుర్వాసమహర్షి ఇచ్చిన మంత్రోపదేశం గూర్చి చెప్పి, పాండురాజు అనుమతితో యమధర్మరాజు వల్ల ధర్మరాజును, వాయుదేవుని వల్ల భీముని, దేవేంద్రుని వల్ల అర్జునుని పుత్రులుగా పొందింది.

## మాద్రి

ఈమె పాండురాజు రెండవ భార్య. ఈమె కుంతి సంతానాన్ని చూసి తనకు కూడ సంతానం కావాలని పాండురాజునడుగుతుంది. పాండురాజు కుంతీదేవిచే మంత్రం చెప్పిస్తాడు. ఈమె కూడ ఆశ్వినీ దేవతలను ప్రార్థించి నకుల సహదేవులనిరువురు పుత్రులను పొందింది.

మంత్ర ప్రభావంచే దేవతలను ఆహ్వానించి, సంతానాన్ని పొందటం కురువంశ కోడలైన కుంతి, మాద్రి ఇరువురిలో కన్పించింది.

పతి నియోగంచే పత్నులు దేవతల వల్లగాని ఋషుల వల్లగాని సంతానాన్ని పొందటం ఆ కాలంలో ధర్మంగా భావించారు,

## 3 సతీసహగమనం

**మాద్రి** - పాండురాజు మరణానికి కారణమైన మాద్రి తన పుత్రులను కూడ కుంతికి అప్పజెప్పి తాను పాండురాజుతో సహగమనం చేసింది.

**గాంధారి** - కురుక్షేత్ర రణరంగమయిన తర్వాత ధర్మరాజు రాజ్యాన్ని పరిపాలిస్తూ పెద తండ్రి ధృతరాష్ట్రుని, పెద తల్లిని గాంధారిని ఎంతో ప్రేమగా సంరక్షిస్తూ ఉంటాడు. ఒక రోజు విదురుని ఉపదేశంచే వైరాగ్యం పొంది గాంధారీ ధృతరాష్ట్రులు అరణ్యానికి వెళ్ళి ప్రాయోపవేశం చేస్తారు. గాంధారి ధృతరాష్ట్రునితో సహగమనం చేసింది.

### సతీసహగమనం చెయ్యనివారు

అంబిక, అంబాలికలు విచిత్ర వీర్యునితో సహగమనం చెయ్యలేదు. వారు అత్తగారి ఆజ్ఞానుసారం వ్యాస మహర్షికి ఇష్టం లేక పోయినా సంతానాన్ని పొంది, ఆ సంతానం కోసం వైధవ్యంతో జీవించారు. ఉత్తర, దుస్సలలు కూడ అంతే. దుస్సల సైంధవుని భార్య. ధృతరాష్ట్రుని కుమార్తె. కుంతి పాండవుల బాగోగులు చూస్తూ జీవితమంతా వైధవ్యంతో, కష్టాలతో జీవించింది.

### 3.5.4. యాదవ వంశ రాజరిక వ్యవస్థ

**1. దేవకీదేవి** - దేవాది దేవుడైన శ్రీకృష్ణునికి జన్మనిచ్చిన దేవకీ దేవి కంసుని కారాగృహంలోనే గడిపింది.

*ఆ. "జ్ఞాన ఖలునిలో శారదయును వోలె*
*ఘటములోని దీపకళిక వోలె*
*భ్రాతయింటనా (కబడి యుండె దేవకీ*
*కాంత విశ్వగర్భ గర్భయగుచు"*[14]

దుర్మార్గుడు బలవంతుడైన రాజు తప్పొప్పులను సరిదిద్దటం ఆనాటి పెద్దల వల్లకాదు. ఆ దుర్మార్గుని, దుర్మార్గాన్ని రూపు మాపటానికి లోక రక్షకుడు అవతారమెత్తక తప్పలేదు.

దేవకీ వసుదేవులను గూర్చి ఆకాశవాణి పలుకులతో వివేకం కోల్పోయిన కంసుడు సోదరి అని చూడక సంహరించబోయాడు. తండ్రియైన ఉగ్రసేన మహారాజును కూడ లెక్కించలేదు.

**2. రుక్మిణీదేవి**

*ఉ. "బంధువు లెల్ల (గృష్ణునకు బాలిక నిచ్చెద మంచుశేముషీ*

*సింధువులై విచారములు సేయ (గ వారలనడ్డు పెట్టి దు*

*స్సంధుడు రుక్మి కృష్ణునెడ (జాల విరోధము (జేసి మత్తపు*

*ష్పంధయ వేణి నిత్తు శిశుపాలునకంచు (దలంచె సంధు (డై"*[15]

విదర్భరాజ పుత్రుడైన రుక్మి కూడ తన సోదరి రుక్మిణీ దేవి ఇష్టాయిష్టాలు తెలిసి కూడ ఆమె కిష్టంలేని శిశుపాలుని కిచ్చి వివాహం చెయ్యాలనుకుంటాడు. అంటే స్త్రీలు ఇష్టా యిష్టాలను తల్లిదండ్రులు కొంత ఆలోచించినా, వారు జ్యేష్ఠ పుత్రునికి ఎదురు చెప్పేవారు కాదు.

అన్నల ఆలోచనలకి చెల్లెళ్ళు బాధింపబడటం రుక్మిణీ వివాహ సంఘటన వల్ల వెల్లడవుతుంది. తమకి లొంగి ఉండే రాజులకి తమ చెల్లెళ్ళల నిచ్చి వివాహం చెయ్యాలనే ఆలోచన కన్పిస్తుంది.

**సుభద్ర**

ఈమె వివాహ విషయంలో కూడ బలరాముడు సుభద్ర ఇష్టాన్ని పరిగణించక తనికిష్టుడైన శిష్యుడైన సుయోధనుడికి సుభద్రనిచ్చి వివాహం చేయాలను కుంటాడు.

**నాగ్నజితి**

కోసల రాజైన నగ్నజిత్తు మదించిన క్రూర స్వభావం గల ఏడు వృషభాలను ఒకేసారి త్రాళ్ళతో ఎవరైతే బంధిస్తారో వారికి తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తానని స్వయం వర షరతును ప్రకటిస్తాడు. శ్రీకృష్ణుడు కొయ్య బొమ్మలను బంధించినట్లుగా అవలీలగా బంధించి నాగ్నజితిని స్వయంవరంలో వివాహమాడతాడు.

**లక్షణ** - ఈమె మద్రరాజు కుమార్తె. మత్స్యయంత్ర ఛేదనంతో శ్రీకృష్ణుడు ఈమెను స్వయం వరంలో వరిస్తాడు.

**మేనరిక వివాహాలు**

**1. మిత్రవింద** - శ్రీకృష్ణుని మేనత్త రాజాధిదేవి. ఈమె తనయ మిత్రవింద. ఈ మిత్రవిందను శ్రీకృష్ణుడు స్వయంవరంలో జయించి వివాహం చేసికొంటాడు.

**2. భద్ర** - ఈమె శ్రీకృష్ణుని మేనత్త శ్రుతకీర్తి కుమార్తె. ఈ భద్రను కూడ శ్రీకృష్ణుడు శత్రువులు తల్లడిల్లగా వివాహం చేసుకున్నాడు.

3. రుక్మవతి 4.చారుమతి 5.రుక్మలోచన వివాహాలు కూడా మేనరికమే

రుక్మవతి (రుక్మిణీదేవి మేనకోడలు) ప్రద్యుమ్నుని, చారుమతి కృతవర్మ కుమారుని, రుక్మలోచన (రుక్మి మనుమరాలు) అనిరుద్ధుని వివాహం చేసుకుంటారు.

**కన్యలను కానుకగా ఇవ్వటం**

**1. జాంబవతి** - జాంబవతుని కుమార్తె శమంతకమణి నన్వేషిస్తూ శ్రీకృష్ణుడు జాంబవంతుని నివాసానికి వెళతాడు. జాంబవంతుడు శ్రీకృష్ణునితో 28 రోజులు యుద్ధంచేసి శ్రీకృష్ణుడే శ్రీరాముడని గుర్తించి శరణువేడి శమంతక మణితో పాటు జాంబవతిని కానుకగా ఇస్తాడు.

**2. సత్యభామ** - శ్రీకృష్ణుడు శమంతక మణిని తెచ్చి సభకు పిలిచి సత్రాజిత్తుకు జరిగింది చెప్పి, మణినివ్వగా సత్రాజిత్తు భయపడి శ్రీకృష్ణునికి సత్యభామను కానుకగా ఇస్తాడు.

**కోరివచ్చిన కన్యలు**

**1. రుక్మిణీ దేవి** - దేవర్షి నారదుని ద్వారా శ్రీకృష్ణుని గుణాలు విని, శ్రీకృష్ణుని తప్ప అన్యులను వివాహమాడ కూడదని నిశ్చయించుకొని అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణునితో శ్రీకృష్ణునికి సందేశాన్ని పంపుతుంది. రుక్మిణీ సందేశంమేరకు శ్రీకృష్ణుడు రాక్షస వివాహ పద్ధతిలో రుక్మిణీదేవిని ద్వారకకు తీసుకువచ్చి వివాహమాడతాడు.

**2. కాళింది** - ఈమె సూర్య తనయ, తండ్రి అనుమతితో కాళిందీ నదీ జలాల్లో శ్రీకృష్ణుని పతిగా పొందాలని తపస్సు చేసింది. ఈమె కోరికను అర్జునుని ద్వారా తెలుసుకున్న శ్రీకృష్ణుడు ద్వారకకు తీసుకు వచ్చి వివాహమాడతాడు.

**3. 16000 రాజ కన్యలు** - నరకాసురుని చెఱనుండి విడిపింపబడిన రాజకన్యలు రక్షించిన శ్రీకృష్ణుని వారు పతిగా కోరుకున్నారు. శ్రీకృష్ణుడు వారందరిని అన్నివేల రూపాలతో వివాహమాడతాడు.

### 3.5.5. రాక్షస స్త్రీలు - వివాహ వ్యవస్థ

రాక్షస జాతి స్త్రీలల్లో కూడ రకరకాల వివాహాలు కన్పిస్తున్నాయి.

**1. అస్తి, ప్రాస్తి** - వీరు కంసుని భార్యలు. జరాసంధుని కుమార్తెలు, జరాసంధుడు తన కుమార్తెలిరువురిని కంసునికిచ్చి వివాహం చేస్తాడు. పెద్దల సమ్మతితో జరిగిన వివాహం.

**2. ఉష** - ఈమె బాణాసురుని కుమార్తె. ఈమె స్వప్నంలో చూసిన యువకుని ఇష్టపడి చిత్రరేఖ ద్వారా తన మందిరానికి రప్పించుకొంటుంది. శ్రీకృష్ణుని పౌత్రుడు అనిరుద్ధుడు. విషయం తెలిసిన బాణాసురుడు అనిరుద్ధుని నాగపాశబద్ధుని గావిస్తాడు. స్వేచ్ఛా వివాహం ఈమెది.

**3. మాయావతి (రతీ దేవి)**

ఈమె శంబరాసురుని కుమార్తె. ఈమె నారదుని వల్ల ప్రద్యుమ్నుడే మన్మధుడని తెలిసికొని పెంచి పెద్దచేసి, ప్రేమించి, తండ్రి వల్ల అతనికి ప్రమాదమని తండ్రిని ప్రద్యుమ్నునిచే సంహరింపచేసి ఆహ్వానం లేకుండా అత్తగారింటికి భర్తతో వెళ్ళిన అతివ.

**సాంఘికాచారాలు**

**అతిథి మర్యాదలు** - కుంతి పాత్రని పరిశీలిస్తే సంతానం లేనివారు ఆడపిల్లను దత్తత తీసుకునే ఆచారమున్నట్లుగా వెల్లడవుతుంది. దుర్వాస మహర్షి కుంతి భోజుని గృహానికి వచ్చినపుడు కుంతీదేవి అతిథి సేవచేస్తే, ఆతిధ్యానికి వచ్చిన ఋషులకు పరిచారికల చేత కాకుండా రాజ కుమార్తెల చేత సేవ చేయించారంటే ఋషుల పట్ల ఉన్న భయ భక్తులభి వ్యక్తమవుతున్నాయి.

**మైత్రీ సంబంధాలు**

శూరసేనుడు, కుంతి భోజుడి మధ్య మైత్రి ప్రగాఢమైందని అంటానికి నిదర్శనం. తన కుమార్తె పృధను (కుంతిని) శూరసేనుడు కుంతి భోజునికి దత్తత ఇవ్వడం.

నంద వసుదేవుల మైత్రిని పరిశీలిస్తే, మైత్రీ విషయంలో నమ్మకం, గౌరవం ఒకరినొకరి పరస్పర హితకారులుగా, ఒకే ఆత్మగా ఉండేవారని అభివ్యక్తమవుతుంది.

నందగోకులంలో తలదాచుకున్న వసుదేవుని భార్య రోహిణిని నందుడు ఎంతో గౌరవ పూర్వకంగా చూడటం. ఆమె యశోద తోబుట్టువుల వలె కలిసిమెలిసి ఉండటం వల్ల పురుషుల్లోనే

కాక స్త్రీలల్లో కూడ మంచి మైత్రి వాతావరణం ఉన్నట్లు వెల్లడౌతుంది.

జననాది కర్మలు, నామకరణం మొదలైన ఆచార వ్యవహారాల్లో ప్రభువుతో (రాచ బిడ్డ అని) పాటు ప్రజలు పండుగ చేసికొని సంతోషించే వారని శ్రీకృష్ణ జననాది విషయాలు తెలియ చేస్తున్నాయి.

వసుదేవ పురోహితుడు గర్గుడు బలరామకృష్ణులకు నామకరణం చేయటాన్ని బట్టి పురోహితులచేత శాస్త్రోక్తమైన విధానంలో నామకరణాది విషయాలు ఆచరించేవారని అభివ్యక్త మవుతుంది.

స్త్రీలు కూడ ఉత్సవాల్లో పాల్గొనేవారని యాదవులు చేసిన పర్వతోత్సవం వల్ల అభివ్యక్త మవుతుంది. గోపకన్యలు శ్రీకృష్ణుని పతిగా పొందాలని కాత్యాయనీవ్రతం చేస్తారు. రుక్మిణీదేవి శ్రీకృష్ణుని పతిచేయమని ఉమామహేశులని వేడుకొంటుంది. వివాహానికి ముందు గౌరీ ఆలయానికి వెళ్ళి వస్తుంది. ఇక వివాహాల్లో (శాస్త్రోక్తంగా జరిగిన) అల్లుళ్ళకు అరణంగా కానుకలు (గజాశ్వరథాలు, పరిచారికలను) ఇవ్వటం కన్పిస్తుంది.

**అతిథి మర్యాదలు**

శ్రీకృష్ణుడు రుక్మిణీ సహితంగా కుచేలుని పూజించి, గృహస్థులకు అతిథి మర్యాదలతో ధనిక పేద భేదముండరాదని సూచించింది.

మునులతో పాటు శ్రీకృష్ణుడు బహుళాశ్వుని ఇంటికి వెళతాడు. బహుళాశ్వుడు భార్యా సహితంగా అతిథి యజ్ఞం చేస్తాడు.

*సీ. "కూర్చుండ నియమించి కొమరారు కాంచన కలధౌత కలశోదకముల చేత (*

*బాదముల్ గడిగి తత్పావన జలములు దానును సతియు బాంధవ జనంబు (*

*గరమర్థినిజమస్తకంబుల ధరియించి వివిధార్చనములు సద్విధినొనర్చి*

*మణి భూషణాంబర మాల్యానులేపన రాజిత ధూప నీరాజనములు"*

*తే. "భక్తి ( గావించి పరిమృష్ట బహువిధాన్న*
*పాయసాపూప పరిపక్వ ఫలములోలి*
*నారగింపంగ ( జేసి కర్పూర మిళిత లలిత*
*తాంబూలములు నెయ్యమలర నొస ( గె"*[16]

బహుళాశ్వుడు తన ఇంటికి వచ్చిన కృష్ణుని, ముని సమూహాన్ని మిక్కిలి శ్రద్ధతో కనకాసనాలపై కూర్చుండ చేసి బంగారు వెండి కలశాలతో జలాన్ని తెప్పించి, పాదాలు కడిగి, ఆ కడిగిన పవిత్ర తీర్థాన్ని తానూ, తన భార్యా బంధువులు మిక్కిలి భక్తితో శిరస్సులపై చల్లుకున్నారు. శాస్త్రవిధి ప్రకారం పూజించి రత్నాభరణాలను, వస్త్రాలు, సుగంధ లేపనాలు సమర్పించి, భక్తితో గంధ హారతులనిచ్చి షడ్రసోపేతమైన భోజనం పెట్టి చందన తాంబూలాలు ప్రేమతో ఇచ్చి శ్రీకృష్ణ పాదసేవ చేస్తూ ఈ విధంగా ప్రార్థిస్తాడు.

*ఉ. "శ్రీ పురుషోత్తమాఖ్య - యదుసింహ కిశోరక! భక్తలోక ర*
*క్షా పరతంత్ర! నీవు ముని సంఘము ( గొన్ని దినంబులుండవే*
*నీ పద పద్మ రేణువులు నెమ్మి మదీయ గృహంబు సో ( కినం*
*దాపసవంద్య! యేనిపుడ ధన్యుడనయ్యెద ( గాదె మాధవా!"*[17]

అనంతరం బహుళాశ్వుని వలె (జనకుడు) శ్రుతదేవుడు కూడ శ్రీకృష్ణునికి ఆతిధ్యమిచ్చి, పాదసేవ చేసి, ఆనందంతో నాట్యం చేసాడు.

*తే. "మానితంబుగ విశ్వనిదాన మూర్తి*
*యైన కృష్ణుండు దనయింట నారగించె (*
*దన మనోరధ సిద్ధియు ( దనకునచ్చె*
*ననుచు ( బైపుట్ట మల్లార్చి యాడుచుండె"*[18]

## తీర్థక్షేత్ర సందర్శనం

శ్రీకృష్ణుడు సకుటుంబంగా గ్రహణ స్నానానికి వెళతాడు. గ్రహణ స్నానాలు ఆనాటి ఆచారంగా ఉన్నట్లు వ్యక్తమవుతుంది.

*తే. "ఏనుమడువులు గావించె నెచటనేని,*

*నట్టి పావన సుక్షేత్రమగు స్యమంత*

*పంచకంబున కపుడు సంభ్రమముతోడ (*

*జనిరి బలకృష్ణులును సంతసంబెలర్ప"*[19]

**భగవత్తత్వాన్ని గుర్తించిన స్త్రీలు** (అవతార కార్యానికి సహకరించిన స్త్రీలు)

శ్రీకృష్ణుడు జన్మించిన వెంటనే పరమాత్మగా గుర్తించి, పరమాత్మ తత్వాన్ని స్తుతించింది ముందుగా దేవకీ దేవియే. దుష్టశిక్షణ, శిష్టరక్షణార్ధం అవతరించిన శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ ఆరంభం స్త్రీతోనే (పూతన సంహారం). ఆద్యంత రహిత బ్రహ్మాండ నాయకుడు ఈ బాలుడని శ్రీకృష్ణుని గుర్తించింది ముందుగా యశోదయే (స్త్రీ)

*ఆ. "బాలమాత్రు (డగు సలీలుని ముఖమందు,*

*విశ్వమెల్ల నెట్లు వెలసి యుండు*

*బాలుభంగి నిత (డు భాసిల్లు (గాని స*

*ర్వాత్ము (డాది విష్ణు'డగుట నిజము"*[20]

కంసునితో నిన్ను సంహరించే వాడు నాతోపాటు జన్మించి మరోదిక్కున మహాగౌరవాలందు కుంటున్నాడని చెప్పింది స్త్రీ యోగమాయ.

ద్వాపరయుగంలో యాదవ రాజులు పరాక్రమ ప్రదర్శనకు బయలుదేరి మధురకు వస్తున్న బలరామకృష్ణులకు పన్నీరు చల్లి స్వాగతించినట్లుగా మైపూతనిచ్చి శ్రీకృష్ణుని సౌందర్యాన్ని కొనియాడింది స్త్రీనే, కంసుని దాసి కుబ్జ.

మధురా నగర రాజు, బలరామకృష్ణుల మేనమామ కంస సంహారం తర్వాత, రాజలోకం నల్దిశల శ్రీకృష్ణుని పరాక్రమాన్ని తెలియజేసిన స్త్రీ రుక్మిణి. (వివాహ నిమిత్తంగా) రుక్మిణీ కల్యాణంతోనే యాదవ వంశ ప్రతిష్ఠ మరింత ఇనుమడించింది.

కంసుని భార్యలైన అస్తి, ప్రాస్తి ఇరువురు వైధవ్యంతో తమ తండ్రియైన జరాసంధునికి శ్రీకృష్ణునిపై ప్రతీకార జ్వాలను రగిల్చి 20 అక్షౌహిణుల సైన్యంతో జరాసంధుడు శ్రీకృష్ణుని పైకి దండెత్తటానికి కారకులయ్యారు. శిశుపాల జరాసంధాది రాజవంశ నిర్మూలనకు పరోక్షంగా కారణమైంది స్త్రీలే అస్తి, ప్రాస్తి.

శ్రీకృష్ణుడు బాణాసుర అహంకార నిర్మూలన చేయటానికి తోడ్పడింది కూడ స్త్రీనే చిత్రరేఖ. ఈ చిత్రరేఖ తన యోగశక్తిచే ఎవరి అనుమతి లేకుండ ద్వారకలో అంత:పురంలో నిద్రిస్తున్న అనిరుద్ధుని తీసుకువెళ్ళి ఉషశయ్యపై పరుండబెట్టింది.

శ్రీకృష్ణునకు ఆపద్బాంధవుడన్న ఖ్యాతి తెచ్చింది స్త్రీనే ద్రౌపది (ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో శరణు వేడిన ద్రౌపదిని సంరక్షించటం వల్ల) శ్రీకృష్ణునకు మేనత్త అంటే మాతృ సమానురాలైన కుంతీదేవి శ్రీకృష్ణుని దైవీ తత్త్వాన్ని గుర్తించి, భవలతలు త్రుంచమని 'నిత్యాను కంపానిధి'కి (నిత్యదయకి నిధి వంటి వాడైన పరమాత్మకు) మ్రొక్కింది.

*శా. "శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!*
*లోకద్రోహి నరేంద్ర వంశదహనా! లోకేశ్వరా! దేవతా*
*నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!*
*నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యాను కంపానిధీ"* [21]

లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు వచ్చిన పని పూర్తి చేసికొని, ద్వారకకు బయలుదేరి పురజనుల పురాకృత పుణ్యఫలంగా హస్తినాపుర వీధులవెంట సాగిపోతున్నాడు. హస్తినాపుర సుందరీమణులు మేడలపై కెక్కి శ్రీకృష్ణుని చూస్తూ పలికిన పలుకులు చూస్తే (భగవంతుని గుర్తించటానికి) వేద వేద్యుని గుర్తించటానికి ఏ వేద విజ్ఞానం అవసరం లేదు. నిష్కల్మషమైన మనస్సుచాలు, అన్నట్లుగా శ్రీకృష్ణుని కీర్తించారు.

*మ. "తరుణీ ! యాదవ రాజుగా ( డితఁ డు, వేద వ్యక్తుడై యొక్కడై*
*వరుసన్ లోకభవస్థితి ప్రళయముల్ వర్తింప'గా జేయుదు*
*స్తర లీలారతుడైన యీశుండితనిన్ దర్శించితింబుణ్యభా*
*సుర! నేనంచునటించె నొక్కతె మహాశుద్ధాం తరంగంబునన్"* [22]

ద్వాపర యుగాంతానికి, కలియుగారంభానికి గుర్తుగా పరీక్షిత్తుకి జన్మనిచ్చిన ఉత్తర (సుభద్రార్జునుల కోడలు, అభిమన్యుని పత్ని) చిన్న వయస్సులోనే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీకృష్ణుడని గుర్తించి, తన గర్భస్థ శిశు సంరక్షణ చేయమని ప్రార్థించింది.

*ఆ. "గర్భమందు (గమల గర్భాండ శతములు*

*నిముడు కొన వహించు నీశ్వరేశ!*

*నీకు నొక్క మాన నీగర్భ రక్షణ*

*మెంత బరువు నిర్వహింతుగాక!"*[23]

ద్వాపర యుగంలో స్త్రీలు వివాహ విషయంలో స్వేచ్ఛను కోరుకొని వారికి నచ్చిన వారినే వివాహం చేసుకున్నారు. వృద్ధుడైన భర్త చ్యవనుని యువకుని గావించుకుంది. రాక్షస జాతిలో క్షత్రియ జాతిలో స్త్రీలుకూడ వారికి నష్టం కలిగించినవారిపై పగ, ప్రతీకారం తీర్చుకోవటానికి శతవిధాల ప్రయత్నించారు. ఈ యుగంలో స్త్రీలు భర్తలను గౌరవించారు. కాని భర్తల కర్తవ్యాన్ని కూడ క్షణ క్షణం గుర్తుచేసి, వారు కర్తవ్య నిర్వహణ గావించేవరకు ఈ స్త్రీలు కంటినిండా నిద్రపోలేదు. వారిని నిద్రపోనివ్వలేదు. భర్తకంటే భగవంతుడికే ప్రాధాన్యమిచ్చారు. దీనికి కారణం కాలమాన పరిస్థితులు. ధర్మం కరువైన వేళ, భర్తలు నిస్సహాయులైన వేళ ధర్మరక్షకుని శరణువేడి రక్షింపబడ్డారు. ఈ యుగంలో స్త్రీలు పరమాత్మనే రక్షకుడిగా గుర్తించి సంరక్షించబడ్డారు.

### 3.6 కలి ప్రవేశం

పరాక్రమోపేతుడు, ధర్మబద్ధుడైన పరీక్షిన్మహారాజుకు కలి శరణాగతి చేసి నేనెక్కడ ఉండాలో ఆనతిమ్మన్నాడు. పరీక్షిత్తు ప్రాణివధ, స్త్రీలు, జూదం, మద్యపానమనే నాలుగు స్థానాలిచ్చాడు. కలి మరలా అర్థించగా పరీక్షిత్తు సువర్ణమనే ఐదవ స్థానాన్నిచ్చాడు. ఈ స్థానాల్లో తప్ప, ఇతర స్థలాలను స్పృశించవద్దని పరీక్షిన్మహారాజు కలిసి కట్టడి చేసాడు. భాగవతోత్తముడైన పరీక్షిత్తు యుగ పురుషుడైన కలిని కట్టడి చేయగలిగాడు. శ్రీమద్భాగవత పఠనం, శ్రవణం, శ్రీమన్నారాయణ భక్తులను కలిచేరలేదన్న సత్యం లోకానికి వెల్లడయింది.

## పాద సూచికలు

1. ఆం. ప. పు. ఆది. ఖం. ప. 878
2. ఆం. ప. పు. ద్వి. స్కం. ప. 275
3. ఆం. ప. పు. తృ. స్కం. ప. 349
4. ఆం. ప. పు. తృ. స్కం. ప. 349
5. ఆం. భాగ. తృ. స్కం. ప. 350
6. అ. వే. కాండ 2. సూ. 30, మం. 3
7. అ. వే. కాండ 10 సూ. 71 మం. 4
8. శ్రీదే. భా. 9, అ.68
9. ఆం. భాగ. స. స్కం. ప. 320
10. ఆం. భాగ. న. స్కం. ప. 3
11. ఆం. భాగ. న. స్కం. ప. 594
12. ఆం. భాగ. న. స్కం. ప. 933
13. ఆం. భాగ. న. స్కం. ప. 670
14. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 77
15. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1697
16. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1183
17. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1188
18. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1193
19. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1038
20. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 343
21. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 200
22. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 237
23. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 181

# 4. భాగవత స్త్రీల సౌజన్యం - జీవన ధర్మం (ఆదర్శం)

## 4.1 భాగవత ధర్మాలు

యజ్ఞం చేస్తున్న విదేహ రాజు వద్దకు తొమ్మిది మంది మునులు యజ్ఞ సమాప్తి సమయానికి వస్తారు. వారిలో ప్రబుద్ధుడనే ముని విదేహరాజు కోరిక మేర భాగవత ధర్మాలు తెలియచేస్తాడు.

"సూర్యోదయాస్తమయంబులం బ్రతి దినంబు వాయువు క్షీణంబు నొంద, దేహకళత్రమిత్ర భ్రాతృమమత్వ పాశబద్ధులై విడివడు నుపాయంబు గానక సంసారాంధకార మగ్నులయి గతాగత కాలంబుల నెఱుంగక దివాంధంబులగు జంతు జలంబుల భంగి జన్మజరారోగ విపత్తి మరణంబు లందియు, శరీరంబ మేలనుచు 'బ్రమోదమోహమది రాపానమత్తుడై విషయ సక్తతం జిక్కితమ్ము' దారెఱుంగక యుండి విరక్తి మార్గంబు దెలియక వర్తించు మూఢులగు జనంబుల పొంతల బోవక కేవల నారాయణ భక్తి భావంబు గల సద్గురుంబ్రతి దినంబును భజియించి, సాత్త్వికంబు, భూత దయయును, హరికథామృత పానంబును, బ్రహ్మచర్య వ్రతంబును, విషయంబుల మనంబు సేరకుండుటయు, సాధు సంగంబును, సజ్జన మైత్రియు, వినయ సంపత్తియు, శుచిత్వంబును, తపంబును, క్షమము, మౌనవ్రతంబును, వేద శాస్త్రాధ్యయన తదర్థానుష్ఠానంబులును, నహింసయు, సుఖదు:ఖాది ద్వంద్వ సహిష్ణుతయు, నీశ్వరుని సర్వగతునింగా భావించుటయు, ముముక్షుత్వంబును, జన సంగ వర్జంబును, వల్కలాది ధారణంబును, యదృచ్ఛాలాభ సంతుష్టియు, వేదాంత శాస్త్రార్థ జిజ్ఞాసయును, దేవతాంతర నిందా వర్జనంబును, గరణత్రయ శిక్షణంబును, సత్యవాక్యతయు, శమదమాది గుణ విశిష్టత్వంబును, గుహా రామక్షేత్ర కళత్ర పుత్ర విత్తాదుల హరికర్పణంబు సేయుటయు, నితర దర్శన వర్జనంబు సేయుట యును భాగవతోత్తమ ధర్మంబులని చెప్పియిట్లనియె"

**భాగవత ధర్మాలు**

1. సత్త్వగుణం కలిగి ఉండటం

2. భూత దయ

3. హరికథామృతాన్ని పానం చేయటం. అంటే శ్రీ మహావిష్ణుని కథలు భక్తితో శ్రద్ధతో వినటం

4. బ్రహ్మచర్య వ్రతం

5. ఇంద్రియ సుఖాల్లో మనస్సును చేరనీయకుండటం

6. సాధువులైన పురుషులను కలుసుకొనటం, స్నేహం చేయటం

7. సజ్జనులతో స్నేహం

8. వినయ సంపద

9. శుచిగా ఉండటం

10. తపస్సు

11. క్షమ (ఓర్పు)

12. మౌనవ్రతం

13. వేద శాస్త్రాలను చదవటం, వాటి అర్థాన్ని అనుష్ఠించటం

14. అహింస

15. సుఖాన్ని గాని, దు:ఖాన్ని గాని ఓర్చుకొనటం

16. సర్వలోకాలకు అధినాయకుడైన ఈశ్వరుడు అంతటా ఉన్నట్లు భావించటం

17. మోక్షం పొందాలనే కోరిక

18. దుష్టులైన జనుల స్నేహాన్ని విడిచి పెట్టడం (వారితో కలిసి ఉండటం)

19. నార వస్త్రాలు ధరించి అలంకారాలపై ఆసక్తి లేకుండటం

20. అయాచితంగా, ప్రయత్న పూర్వకంగా కాక లభించిన దానితో సంతుష్టి చెందటం.

21. వేదాంత శాస్త్రాల అర్థాలను తెలుసుకోవాలనే కుతూహలం.

22. పూజించే పరమేశ్వరునే కాక ఇతర దేవతలను నిందించకుండా ఉండటం.

23. త్రికరణ శుద్ధి అంటే మనోవాక్కాయాల్లో దుష్టభావాలు ప్రవేశించకుండా ఉంచుకోవటం.

24. సత్యమే పలకటం

25. శమదమాది గుణ విశేషాలు

26. భోగాలన్నీ పరమేశ్వరార్పణంగా భావించటం.

(ఇల్లు, తోటలు, పొలాలు, భార్య, సంతానం, ధనం మొదలైన వాటిని)

27. భక్తులు కాని వారిని ఆశ్రయించకుండా ఉండటం ఇవి పరమ భాగలతోత్తములు పాటింప వలసిన ధర్మాలు.

## 4.2 ప్రహ్లాదుడు చెప్పిన భాగవత ధర్మాలు

సప్తమ స్కంధంలో శ్రీహరి భక్తుడైన ప్రహ్లాదుడు తన తోటి బాలకులకు భాగవత ధర్మాలు తెలియజేస్తాడు.

వ. "అదిగావున గురు శుశ్రూషము సర్వలాభ సమర్పణంబును, సాధు జన సంగమంబును, నీశ్వర ప్రతిమా సమారాధనంబును, హరి కథా తత్పరత్వంబును, వాసుదేవుని యందలి ప్రేమయు, నారాయణ గుణకర్మ నామ కీర్తనంబును, వైకుంఠ చరణకమల ధ్యానంబును విశ్వంభరమూర్తి విలోకన పూజనంబులును మొదలయిన విజ్ఞాన వైరాగ్య లాభ సాధనంబులైన భాగవత ధర్మంబులపై రతి గలిగి సర్వ భూతంబుల యందు నీశ్వరుండు భగవంతుడాత్మగలడని సమ్మానంబు సేయుచు'గామ క్రోధలోభ మోహ మద మాత్సర్యం బులన్ గెలిచి యింద్రియ వర్గంబును బంధించి భక్తి సేయుచుండు నీశ్వరుండయిన విష్ణుదేవుని యందలి గతి సిద్ధించు" [2]

1. మానవుడు ప్రామాణికుడైన గురువునాశ్రయించి భక్తి శ్రద్ధలతో గురువుకు సేవ చేయటం.
2. సమస్త ఫలితాన్ని భగవంతునికి సమర్పించటం.
3. సజ్జన స్నేహం
4. గురు శాస్త్రాదేశాన్ని అనుసరించి, సాధు భక్త సాంగత్యమున భగవంతుని అర్చించాలి
5. శ్రద్ధతో భగవన్మహిమలను వినాలి.
6. భగవంతుని దివ్యగుణ కీర్తనం.
7. శ్రీహరి కథా శ్రవణం.
8. ప్రతిజీవి హృదయంలో పరమాత్మ రూపం ఉన్న వానిగా దేవ దేవుని సదా స్మరించాలి.
9. భక్తుడు నిరంతరం చేసే వాసు దేవ మననం.
10. నారాయణ సంకీర్తనం.
11. విష్ణు పాద ధ్యానం.
12. విరాట్ స్వరూప దర్శనం, పూజనం మొదలైనవి జ్ఞాన వైరాగ్యాలను కలిగిస్తాయి. ఇవి భాగవత ధర్మాలు.

ఈ ధర్మాలపై ఆసక్తి కల్గి ఈశ్వరుడైన భగవంతుడే ఆత్మ స్వరూపంతో సర్వప్రాణికోటిలోనూ ఉన్నాడని తెలుసుకొని మనం వాటిని ఆదరించాలి, కామ క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలను జయించి ఇంద్రియ చాపల్యాన్ని అరికట్టి భక్తితో భజిస్తే భగవంతుడైన శ్రీహరి సాన్నిధ్యం తప్పకుండా లభిస్తుంది

### 4.2.1 ధర్మ నిర్వచనం

*"ధారణాత్ ధర్మం ఇత్యాహు:"*

ధర్మం అంటే ధరించతగిందని అర్థం. మన కట్టుబాట్లుకు ఎల్లవేసి కాపాడుతుంది ధర్మం.

ధర్మం మూడు రకాలు

**1. నైజధర్మం** - సహజ లక్షణం, ప్రకృతి సిద్ధం గాలి వీస్తుంది. అగ్ని మండుతుంది. అలానే మనిషి శరీరానికి వ్యాధి, జర, మృత్యువయో ధర్మాలు, అలాగే ఋతువులు. దీన్ని నైజ ధర్మం అంటారు.

**2. న్యాయ ధర్మం** - ఒక వస్తువు వల్లకాని, ప్రాణి వల్ల కాని, తమ నైజ గుణాల వల్ల వేరే ప్రాణికి, పరిసరాలకు, హాని కలగకుండా ప్రవర్తించడం న్యాయధర్మం అంటే అన్యోన్యత న్యాయధర్మం, వృత్తి ధర్మం కూడా న్యాయధర్మమే.

**3. మైత్రీధర్మం** - మైత్రి అంటే అందరిపై ప్రేమ, ప్రీతి, మమత, తన నైజ ధర్మంతో అందరికీ ప్రయోజన కారిగా నడుచుకోవడం మైత్రీ ధర్మం. అదే లోక స్నేహం "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" ఇది మైత్రీధర్మం. మన స్నేహ భావంతో అందరిలో ఐక్యతా భావం పెంచాలి. అది మహోన్నత ధర్మం.

### 4.3. భాగవతుల లక్షణాలు

1. శ్రీహరి భక్తుని, శ్రీహరియందు ఆసక్తి కలవాని పాద ధూళిని తవ దేహానికి ధరించేవాడు.
2. శంఖ చక్రముద్ర ధారులకు, హరి దివ్య నామాలు ధరించేవారికి అన్నం పెట్టేవాడు.
3. వాసుదేవ భక్తులను చూచి సంతోషించేవాడు.

### 4.3.1. భాగవత స్త్రీలు

భాగవత ధర్మాలు పాటించి, భాగవతులైన స్త్రీలు ఐహికా ముష్మిక సుఖాలందు కొన్నారు. ఈ భాగవత స్త్రీలల్లో కొందరి జీవన విధానం భావితరాల వారికి ఆదర్శమై సందేశాత్మకమై, ఆచరణాత్మకంగా కన్పిస్తుంది. యుగాల వారిగా అలాంటి ప్రాధాన్యత ఉన్న స్త్రీల సౌజన్యాన్ని తెలియచేయుటమే ఈ అధ్యాయం.

### 4.3.1 కృతయుగం

సత్యం, తపస్సు, ధర్మం, దయ మూర్తీభవించిన కాలమిది. శక్తుల సదుపయోగం జరిగిన రోజులివి. సాధారణ పరిస్థితుల్లో కూడ మనుష్యులు శాంతంగా ఉండి, సుఖ శాంతులు నిండిన వాతావరణంలో జీవించేవారు. విజ్ఞానం వ్యక్తిని అనంతశక్తి సంపన్నునిగా చేస్తుంది.

అనంతశక్తి సంపద ప్రదాయినులైన త్రిదేవతల సౌజన్య భక్తులపై అపరిమితంగా ఉంది. అందువల్లనే భాగవతం వంటి గ్రంథాలు మానవాళికి లభించాయి.

**1. దేవజాతి**

**1. సరస్వతీదేవి - వాగధిష్ఠాత్రి**

పోతన భాగవత కృతిని కర్ణాటకిరాట కీచకులకి అమ్మకుండా నివారించింది.

చతుర్దశ విద్యల్లో మిన్న అయిన సాధు కవిత్వాన్ని రచించమని సింగనని ప్రోత్సహించి కోటి సూర్య బింబ కాంతితో సింగనకి ప్రత్యక్షమై శ్రీమన్నారాయణ దివ్య కవచ మహిమని సాహిత్య లోకానికి వెల్లడి చేయించింది.

క్షరం కాని అక్షరాన్ని ఈ భువికి అందించాలంటే ఆ బ్రహ్మరాణి కృపారసం కవికి అవసరం. ఈ భాగవతంలో సాధు కవిత్వ వైభవాన్ని గుర్తుచేసి భక్తులైన పోతన సింగనల వెన్నంటి నడిపించటం నలువ నగిషీమణి బ్రాహ్మీ సౌజన్యమే.

**2. దుర్గామాత** - పోతన ఇలవేల్పులు పార్వతీ పరమేశ్వరులు పోతన దేవతాస్తుతిలో "దుర్గమాయమ్మ కృపాబ్ధియీవుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్" అనటం దుర్గమ్మ దయా సాగరగా గోచరిస్తుంది.

రుక్మిణీదేవి గౌరి ఆలయానికి వెళ్ళి "నమ్మితి నామనంబున... ..." దుర్గమ్మను నమ్మిన వారికి నాశనం లేదని చెప్పటం వల్ల భక్తులకి అవినాశ స్థితి కల్గించటం ఆ తల్లి అపార సౌజన్యానికి దర్పణం

.... .... .... .... ఘనుడా భూసురుడేగెనో.... .... ...."

అన్న రుక్మిణీదేవి మాటల్లో ఆర్యా మహాదేవి తలంపు ఉంటేనే కల్యాణం జరుగుతుందన్న సత్యం, ఆర్యా మహాదేవి అనుగ్రహంతోనే ఇహలోక భాగ్యం సంప్రాప్తమవుతుందని అవగతమవుతుంది.

**3. లక్ష్మీదేవి** - "హరికిం బట్టపురాణి ... ..."

అని పోతన దేవతాస్తుతిని బట్టి జగములు గౌరవించే ఇల్లాలు, లేమిని పోగొట్టి కలిమినిచ్చే నిత్య కల్యాణి లక్ష్మీదేవి అని వ్యక్తమవుతుంది. ప్రజల ఈతి బాధలు పోగొట్టి సంపదలతో ప్రోచి సంరక్షించే పురుషోత్తమరాణి సౌభాగ్యమే భక్తులభాగ్యమన్న విషయం అభివ్యక్తమవుతుంది.

ఈత్రి శక్తుల లేదా త్రిదేవతల సౌజన్యరూపమే అమృత మహాంబురాశి మన ఆంధ్ర మహాభాగవతం.

**4. భూదేవి** - సద్గుణ సంపన్నుడైన చక్రి తనపై సంచరించటం లేదని వేదన చెందటం, సత్యధర్మాలు భువిపై సంరక్షించాలని చేసే ప్రయత్నం భూదేవి సౌజన్యం. పాప పుణ్యాలను భరించ గల్గిన శక్తి శాలి భూదేవి. సత్యకాలాన్ని ఆనందంతో అనుభవించి కలి కాలాన్ని చూసి దు:ఖంతో పరితపించి, పరమాత్మ స్పర్శ కోసం ఒళ్ళంతా కళ్ళు చేసికొని ఎదురుచూసే విశ్వంభర సౌజన్యం వర్ణించటం సాధ్యం కాదు, అనంత తత్త్వం తెలిసిన అవని తల్లి. ఈమెకు ఈమెయే సాటి. "క్షమయాధరిత్రీ" అని ఆర్యులచే ప్రశంసింపబడిన పూజ్యురాలు పృథ్వీదేవి.

**5. ఊర్వశి** - నారాయణుని ఊరువుల నుండి జనించి నాటికి నేటికి అందచందాలకి అపరరూపంగా పేరొందిన అప్సరస.

**6. స్వాహాదేవి** - అగ్నులకి తల్లియైన స్వాహాదేవి అగ్ని దేవుని పత్నిగా యజ్ఞకార్యాల్లో శబ్దరూపంలో శాశ్వత కీర్తి సంపాదించుకున్న మహిళ.

**7. సతీదేవి** - పతివ్రతా శిరోమణి, ధర్మనిబద్ధ స్వతంత్రురాలు. తప్పుచేసిన తండ్రినైనా విడిచిపెట్టక ధర్మోపదేశం చేసిన ధార్మికురాలు.

**8. పార్వతి** - స్త్రీ సౌందర్యంతో సకల సద్గుణ సంపన్నుడైన పురుషుని ఆకర్షించటం కంటె తపస్సుతో ఆరాధించి, మెప్పించి శాశ్వత ప్రేమను పొందవచ్చనే సత్యాన్ని మహిళా లోకానికి తెలియచేసిన సర్వమంగళ, సదాశివ పత్ని పార్వతి.

**9. కాళీమాత** - నిఖిలలోక నమస్కారిణి, కవితావేశానికి పట్టుకొమ్మ కాళీమాత (ఈ కాళికి దాసుడైన కాళిదాసు కవికుల గురువు, కవి కుల తిలకుడయ్యాడు. ఈ కాళిని స్తుతించిన సింగన శ్రీమన్నారాయణ దివ్య కవచం లోకానికి ప్రకటించగల్గాడు)

**10. మాతృక** - ఈమె సంతానమైన చర్షణులు మానవజాతికి మూలమయ్యారు. మానవజాతి మూలానికి కారణం మాతృక సౌజన్యమే.

**11. శచీదేవి** - దేవేంద్రునకు పదవి పోయినా, దేవేంద్రుడు పరస్త్రీ పొందు కోరి సహస్రాక్షుడైన, దేవేంద్రపత్ని పతివ్రతగా నిలిచింది. తన ధర్మ ప్రవర్తనతో శీలాన్ని రక్షించుకొని, త్రిదేవతల సరసన మహా ఇల్లాలుగా, దేవజాతి చరిత్రలో నిలిచిపోయింది.

**12. పృశ్ని** - ధర్మ కార్యానికి అవసరమైన సంతానాన్ని లోకానికి అందించి, ధర్మ ప్రతిష్టకి నాంది పలికిన నారీమణి.

**13. గౌరీదేవి** - గౌరీదేవి పోతన ద్వారా ఆంధ్రావళికి మోక్షప్రదాయకమైన భాగవతాన్ని అందించి, ఆంధ్రప్రజలకు నిత్య సుఖాన్నిచ్చింది.

**14. మోహిని** - ఆశ్రిత జన వత్సలుడైన జనార్దనుడు రాక్షసులను సమ్మోహ పరచటానికి, అమృతం దేవతల పరం చేయటానికి మోహినిగా అవతరించి లక్ష్మీదేవి అందచందాలకు అపరరూపంగా నిలిచాడు.

పాపపు చీకట్లు పారద్రోలే సూర్యుని స్వరూపమే మోహిని.

**15. గంగాదేవి (మందాకిని)** - విష్ణుపాదోద్భవయైన మందాకిని, ఆకాశం నుండి భగీరథ ప్రయత్నంలో భూలోకాన్ని, పాతాళాన్ని కూడా పావనం చేసి పాపాలను పోగొట్టే పరమ పునీతగా భూలోక ప్రజలకు ఆనందాన్నిస్తుంది (గంగ పుట్టుక కృతయుగంలో జరిగింది అందువల్ల ఇక్కడ ప్రస్తావనకి వచ్చింది త్రేతాయుగంలో భూలోకానికి వచ్చింది).

**2 ముని పత్నులు**

**1. అనసూయ** - అత్రి మహాముని అర్ధాంగి పాతివ్రత్యంచే ఈమె త్రిమూర్తులనే తనయులుగా పొంది ఆచంద్రతారార్కం ఆదర్శ మహిళగా నిలిచింది.

**2. శ్రద్ధ** - అంగిరస మునీంద్రుని అర్ధాంగియై బృహస్పతికి జన్మనిచ్చి, దేవతలకు గురువునందించిన పవిత్రమూర్తి.

**3. హవిర్భువు** - పులస్త్యుని పత్నియై అగస్త్యుని, విశ్రవసుడనే మహనీయులకు జన్మనిచ్చిన పుణ్యస్త్రీ.

**4. అరుంధతి** - ఈమె పాతివ్రత్యంచే భర్త ఆదరణ పొంది సత్సంతానాన్ని లోకానికి అందించి. ఆదర్శ మహిళగా దేవతా స్త్రీలతో సమానంగా లోకంలో పూజింపబడే మహిమాన్వితమైన మహిళ.

**ప్రజాపతి పత్ని**

**అదితి** - కశ్యప ప్రజాపతి భార్య తన జీవన ధర్మాన్ని తాను నిర్వర్తించి, పాతివ్రత్యంతో పతిని మెప్పించి, అదితి దేవమాతగా తన కర్తవ్యాన్ని నిర్వహించి, దేవదేవునికే (వామనుని) జన్మనిచ్చిన అదితి జీవనం మహిళలకాదర్శం.

**3. ప్రజాపతి పుత్రికలు**

**1. మూర్తి** - దక్ష ప్రజాపతి 13వ కుమార్తె. నరనారాయణులకు జన్మనిచ్చిన ధర్ముని భార్య. త్రినేత్రుని అర్ధాంగియైన సతీదేవికి తోబుట్టువు.

**2. కళ** - తపోధనుడైన కర్దమ ప్రజాపతి తనయ, తపోధనుడైన మరీచి మహర్షి భార్య. కశ్యప ప్రజాపతికి జన్మనిచ్చింది ఈమె పౌత్రులతో లోకమంతా నిండిపోయింది. సౌభాగ్యురాలైన మహిళ.

**3. అసిక్ని** - పంచజన ప్రజాపతి పుత్రిక. ఈమెలో దాంపత్య ధర్మాన్ని అవలంబించి ప్రజాభివృద్ధి చేయమని బ్రహ్మదేవుడు దక్ష ప్రజాపతిని ఆదేశించాడు. ఈమె వేలకొలది పుత్రులను 60 మంది పుత్రికలను పొంది, అత్యధిక సంతానం కల్గిన మహిళగా ఖ్యాతి గాంచింది. ఈమె తనయులు పుణ్యసతులై ముల్లోకాలను నింపారు.

**4. జామిదేవి** - అసిక్ని దక్ష ప్రజాపతుల పుత్రిక. ఈమె ధర్ముని పత్నియై అధిష్ఠాన దేవతల పుట్టుకకు కారణమై తన జన్మను చరితార్థం చేసుకొన్న మహిళ.

**5. వినత** - అసిక్ని దక్షప్రజాపతి దంపతుల తనయ, కశ్యపుని పత్ని. వినతకి అద్వితీయులైన ఇరువురు పుత్రులు. అనూరుడు, గరుత్మంతుడు. అనూరుడు సూర్య రధ సారధియై జగత్ప్రసిద్ధిగాంచాడు. గరుత్మంతుడు శ్రీమహా విష్ణువు వాహనమై విష్ణు భక్తులచే పూజింప బడుతున్నాడు.

**4. మనువంశ స్త్రీలు**

**1. ఆకూతి** - స్వాయంభువ మనుపుత్రి. రుచి ప్రజాపతి పత్నియై, శ్రీహరి అవతారమైన సుయజ్ఞునికి జన్మనిచ్చిన సుగుణవతి.

**2. దేవహూతి** - ఈమె అందచందాలు గంధర్వరాజునే మైమరపిస్తాయని, మహాలక్ష్మి సమానురాలని, లోకోత్తర సౌందర్యవతి అని భర్త నుండి ప్రశంసలందుకున్న అసాధారణ స్త్రీ రత్నం. మనుపుత్రికయై కర్దమ మునీంద్రుని పతిగా కోరుకుని ఆశ్రమ వాసాన్ని గడిపిన అసాధారణ మహిళ. దేవహూతి పతిసేవతో కర్దమ మునీంద్రుని మెప్పించి సాక్షాత్తు శ్రీహరి రూపమైన కపిలదేవునికి జన్మనిచ్చింది. భువిలో పుట్టి బ్రహ్మదేవుని ప్రశంసలందుకున్న వనితారత్నం. ఈమె యోగసిద్ధి పొందింది. ఈమె సిద్ధి పొందిన ప్రదేశం మాతృగయగా పిలువబడి ఈమె దేహం తీర్ధరూపం ధరించింది.

**3. ప్రసూతి** - బ్రహ్మ మానస పుత్రుడైన దక్ష ప్రజాపతి పత్ని. బ్రహ్మదేవుని కోడలు. స్వాయంభువ మనువు మూడవ కుమార్తె. శివుని అర్ధాంగి సతీదేవికి జన్మనిచ్చిన పరమ పావని.

**4. శతరూప** - స్వాయంభువ మనువు భార్య. శతరూప స్వాయంభువ మనువులు, మానవజాతిలో ఆది దంపతులు.

**5. సునీతి** - ఈమె ఉత్తానపాదుని ధర్మపత్ని. ఉత్తానపాదుడు చిన్న భార్య అందానికి దాసుడై, ఈమెను నిరాకరించినా, భర్తను తూలనాడని మహాఇల్లాలు. తన పుత్రుడైన ధ్రువుని జ్యేష్ఠ పుత్రునిగా ఆదరించక రాజు నిరాకరించినా మారు మాటాడక దిక్కులేని వారికి శ్రీమన్నారాయణుడే దిక్కని

పుత్రునికి శ్రీహరిని శరణువేడమని సలహా ఇచ్చింది. సపత్నీ మాత్సర్యం ఇసుమంతైనా లేని శ్రీహరి భక్తురాలు. ఈమె భాగవతోత్తమురాలు. అందువల్లనే అరిషడ్వర్గాలను జయించ గలిగింది. శ్రీహరి భక్తులందరికి ఆదర్శనీయమైన మహిళ, జగదధినాథుడైన శ్రీమన్నారాయణ భక్తురాలై, అపర భక్తుడైన ధ్రువునికి జన్మనిచ్చి ధ్రువతార తల్లిగా జగద్విఖ్యాతి గడించిన విశిష్ట మహిళ,

**6. సునీథ** - ధర్మపరుడైన అంగరాజుకి పత్నియై, దుర్మార్గుడైన వేనుని పుత్రునిగా పొంది, తన యోగ శక్తిచే పుత్రదేహం చెడకుండా చూసుకొని తపోబలం కల మునీంద్రులచే వంశాన్ని నిలబెట్టిన బాధ్యత కలిగిన మహిళ. కష్టాలకు భయపడి పారిపోలేదు. అంగరాజు వలె (తన భర్త వలె) వైరాగ్యంతో బాధ్యతలకి దూరమై ముక్కు మూసుకొని తపస్సు చేసుకోలేదు. భగవంతుడిచ్చిన బాధ్యతలన్నింటిని చవిచూసి, యోగ శక్తిని పెంపొందించుకొని దేవుడిచ్చిన జన్మకు జీవన ధర్మాన్ని పాటించి వంశాన్ని నిలబెట్టి, మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచిన మహిళ.

**7. అర్చి** - పృథు చక్రవర్తి పత్ని. పతి వెంటేపత్ని అన్న చందంగా ఈమె భర్తననుసరించి జీవించి పతితో సతీసహగమనం చేసి ఆదర్శ దాంపత్యానికి అర్థం చెప్పిన మహిళ.

**5. రాక్షస జాతి**

**1. ప్రహ్లాదుని తల్లి కయాధువు**

*క. "గుణనిధియగు ప్రహ్లాదుని*
*గుణములనేకములు గలవు గురు కాలమునన్*
*గణుతింప నశక్యంబులు*
*ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్"*[4]

గొప్ప గుణవంతుడైన పుత్రుని పొందటం

ప్రహ్లాదుడు రాక్షస బాలకులైన తన మిత్రులతో తల్లిని గూర్చి చెప్పిన మాటల్లో కయాధువు సౌజన్యం వెల్లడవుతుంది

*శా. "యోషారత్నము నాధ దేవత విశాలోద్యోగమా తల్లి, ని*
*ర్ద్వేషమ్యంబున నాధురాక మదిలో వాంఛించి నిర్దోషయై*
*యీషద్భీతియు లేక గర్భ పరిరక్షేచ్ఛన్ విచారించు శు*
*శ్రూషల్ సేయుచు నుండె నారదునకున్ సువ్యక్త శీలంబునన్"*[5]

రమణీ శిరోమణి, మహాపతివ్రత అయిన హిరణ్య కశిపుని ఇల్లాలు. ఎవరినీ ద్వేషింపక, భర్తనే దేవునిగా భావిస్తూ భర్త రాక కోసం ఎదురు చూస్తూ, ఆశ్రమంలో సత్ప్రవర్తనతో భర్త ఆగమానం తరమే తన ప్రసవాన్ని కోరుకుంది. తన గర్భస్థ శిశువు క్షేమాన్ని కోరుతూ, శ్రీమన్నారాయణ భక్తుడైన నారద మహర్షికి భక్తి శ్రద్ధలతో సేవ చేసిన పరమ భాగవతోత్తమురాలు.

ఈమె మహాసాధ్వి అని, హరి భక్తురాలని దేవర్షి నారదుడు దేవేంద్రునికి చెప్పి, దేవేంద్రుని చెఱనుండి విడిపించుటే కాక దేవరాజు చేత ఈమెకు నమస్కరింప చేయటాన్ని బట్టి ఈమె సౌజన్యం, మహిమ వెల్లడయ్యాయి.

హిరణ్య కశిపుని ఇల్లాలి సేవకు మెచ్చిన నారద మహర్షి గర్భస్థ శిశువుని దృష్టిలో పెట్టుకొని ధర్మరీతిని, నిర్మల జ్ఞానాన్ని ఉపదేశించటం కయాధువు సౌజన్యమే.

**2. దితి** - ఈమె దక్ష ప్రజాపతి తనయ, కశ్యప ప్రజాపతి పత్నియైనను, ఈమె దైత్యులకు తల్లి అయిన కారణం చేత ఈమె రాక్షస స్త్రీగా పరిగణింపబడింది.

ఈమె సమయాసమయాలు ఆలోచింపక చేయకూడని పనిచేసి, సిగ్గు భయం వీడి ప్రవర్తించింది. అందుకు కశ్యపుడు దితి చేసిన తప్పును వివరించి రాక్షసులకు జన్మనిస్తానన్నాడు. భర్త తప్పును తెలియచేస్తే అంగీకరించి పరితపించింది. సతీదేవి వల్లభుడైన సర్వేశ్వరుడు తనని మన్నించాలని సర్వ భూత సంరక్షకుని సన్నుతించింది.

తన కుమారులు భగవంతుడైన శ్రీహరి చేతుల్లో మరణిస్తారని భర్త తెలియచేస్తే మహా భాగ్యంగా భావించింది. ఈమె మానసిక పరిపక్వతకు నిదర్శనం. అందువల్లనే ప్రహ్లాదుని వంటి పౌత్రుని పొందటానికి ఈమె కారణమైంది.

అజ్ఞానంతో తప్పుచేసిన, ఆ తప్పును సరి దిద్దుకోవటానికి నివారణోపాయం ఆలోచించ టం చేసిన తప్పుకు చెంపలేసుకొని శివ శివ అని సర్వేశ్వరుని శరణు వేడటం సరియైన మార్గమని దితి పాత్ర స్త్రీ జాతికి సందేశమిచ్చింది.

**3. వింధ్యావళి -** బలిచక్రవర్తి భార్య. శుక్రాచార్యుడు బలిదానం వల్ల రాక్షస వంశం పతనమవుతుందని తెలియచేసిన ఈమె భర్త చేసే దానాన్ని నివారించలేదు సరికదా! పతి ధర్మానుసరణమే తన కర్తవ్యంగా భావించి సహకరించటం వింధ్యావళి వివేకానికి, సౌజన్యానికి నిదర్శనం.

**4. కైకసి -** ఈమె విశ్రవసుని భార్య. ఈమె శివ భక్తి పరాయణురాలు. ఈమె తన పుత్రుడైన దశకంఠుని కూడా శివ భక్తి పరుడిగా తీర్చి దిద్దింది. ఆత్మలింగమే భువికి రావటానికి కారణమైన కైకసి జీవనం ప్రశంసనీయం. మాతృ మూర్తులకు ఆదర్శం.

### 4.3.3 త్రేతాయుగ స్త్రీలు

#### 1 దేవజాతి

#### 1. గంగాదేవి (భాగీరథి)

విష్ణు పాదోద్భవ అయిన గంగ, ఆకాశ గంగగా మందాకిని నామంతో ప్రసిద్ధి. భగీరథ తపస్సుకి మెచ్చి దయాంబు రాశిగామారి, భూలోకాన్ని పావనం చేస్తూ, పాతాళానికి వెళ్ళి, సగర పుత్రులను 60 వేల మందిని పావనం చేసి భోగవతీ నామంతో ముల్లోకాలను పావనం చేయటం మహాద్భుత కార్యం. దేవి దశనామాల్లో తొలి నామంగా కీర్తింపబడే గంగ విష్ణు పాదాల నుండి పుట్టి (త్రివిక్రమావతార సమయంలో) భువికి దిగేముందు శివుని జటా జూటాన్ని అధిరోహించటంలో విశేషార్థం గోచరిస్తుంది.

శ్రీమన్నారాయణుడే సృష్టి స్థితి లయ కారకుడు.

*"ఇరవొందన్ ద్రుహిణాత్మకుండయి రమా ధీశుండు విశ్వంబు సు*
*స్థిరతం జేసి హరి స్వరూపుడయి రక్షించున్ సమస్త ప్రజో*
*త్కర సంహారము సేయునపుడు హరాంతర్యామియై యింతయున్*
*హరియించుం బవనుండు మేఘముల మాయం జేయు చందంబునన్"*[6]

సృష్టి చేసేటపుడు బ్రహ్మయై, స్థితిలో (పోషణలో) విష్ణువై, లయంలో రుద్రుడవుతాడు. విష్ణుపాదాల నుండి పుట్టిన గంగ మూడు లోకాలను పావనం చెయ్యాలనే గంగ సంకల్పానికి భగవంతుడే (తన పోషణత్వాన్ని జల రూపంలో స్వీకరించిందని) మెచ్చి శివ రూపంలో శిరస్సున దాల్చాడు. ముల్లోకాలను పావనం చెయ్యాలన్న గంగ సౌజన్యానికి భగవంతుడే మెచ్చి గంగా దేవిని భూలోక వాసుల భక్తికి, శక్తికి, ముక్తికి కారణం చేసాడు.

**2 రాక్షస జాతి**

**మండోదరి** - ఈమె రాక్షస స్త్రీ అయినప్పటికి శ్రీహరి భక్తురాలు, నీతిలో, ధర్మంలో సీతాదేవితో సమానంగా భావింపదగిన మహిళ వాల్మీకి రామాయణంలో మండోదరి శ్రీరాముని గూర్చి రావణునికి

*"మానుషం రూపమాస్థాయ విష్ణు: సత్య పరాక్రమ: !*

*సర్వై: పరివృతో దేవైర్వానరత్వము పాగతై:"*[7]

సామాన్య మానవుడు కాదు శ్రీరాముడు, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు లోక హితార్థం విష్ణువు మనుష్యుడిగా అవతరిస్తే దేవతలు వానరులై అవతరించారు అని హితోపదేశం చేసింది.

మహా జ్ఞానియైన ఆంజనేయుడు మండోదరిని చూచి సర్వాత్మనా ఆమెను సీతయని విశ్వసించాడు, ఆమె మంచి ధర్మనిష్ఠ కలిగిన ఇల్లాలు, భార్య చెప్పిన హిత వాక్కులు వినని పురుషుడు ఎంత పరాక్రమ వంతుడైనా అధోగతి పాలవుతాడన్న విషయాన్ని పురుష లోకానికి వెల్లడి చేసిన సౌజన్యవతి మండోదరి. భర్త ఎలాంటి వాడైనా, అతని హితాన్ని కోరి భార్య ధర్మబోధ చేసి ధార్మికంగా జీవించాలని నారీ లోకానికి తెలియ చేసిన రాక్షస జాతి స్త్రీ మండోదరి. జాతిలో రాక్షస స్త్రీ అయినా గుణాల్లో దేవతా మూర్తుల వరుసలో కూర్చోదగిన మహిళ.

**3 క్షత్రియ జాతి**

**1. సుకన్యక** - ఈమె విధివశాత్తు వృద్ధుడైన చ్యవన మహర్షిని వివాహం చేసుకొని, తన పాతివ్రత్యంచే భర్తకి యౌవన ప్రాప్తి కలిగించిన అసాధారణ మహిళ.

**2. సీత** - వాల్మీకి మహర్షి శ్రీరామ చంద్రునితో

*ఆ. "సీత శద్ధురాలు, చిత్తవాక్కర్మంబు,*

*లందు సత్యమూర్తి యమలచరిత*

*పుణ్య సాధ్వి (విడువ ( బోలదు చేకొను*

*రవికులాబ్ధిచంద్ర! రామచంద్ర!)"*[8]

వాల్మీకి చేత భాగవతంలో పోతన చెప్పించిన పద్యం "సీతాయా: చరితం మహత్" అన్న విషయం వెల్లడౌతుంది. స్త్రీ పురుషుల దాంపత్యమెలా ఉండాలో తెలియ చేసిన మహా తల్లి భూజాత. దాంపత్యంలో ద్వైత భావన (భర్త, భార్య అనే భేదం) కాదు ఉండాల్సింది అద్వైత భావన అన్న విషయాన్ని తెలియ చేసిన మహిళా శిరోమణి.

సీతారాములు నాటికి నేటికి, రేపటి తరానికి కూడ ఆదర్శ దంపతులు.

**4.3.4. ద్వాపరయుగ స్త్రీలు**

**1 దేవజాతి**

**1. యోగమాయ** - పసి పిల్లలను చంపిన కంసుని వీరత్వాన్ని ఛీ కొట్టి తన మహిమను వెల్లడించింది.

*ఉ. "తెంపరివై పొరింబొరిని దేవకి బిడ్డల (జిన్నికుఱ్ఱలం*

*జంపితివింక నైన నుపశాంతి వహింపక ఱాలమీ (ద నొ*

*ప్పింప (గనిస్సిరో యిదియు బీరమె? నాసరసన్ జనించినిన్*

*జంపెడు వీరు (డొక్కదెస సత్కృతి నొందెడు వా (డుదుర్మతీ"*[9]

యోగమాయ 14 రూపాల్లో భువిలో భక్తులకు కొంగుబంగారమై కోరిన కోరికలు తీరుస్తూ అనంత ఖ్యాతి నార్జించింది.

**2. కాళింది** - సూర్యతనయ తన తపోశక్తిచే శ్రీకృష్ణుని ప్రసన్నం చేసుకొని. చతుర్విధ ఫల ప్రదాయకుడైన శ్రీకృష్ణుని అష్ట మహిషుల్లో చతుర్ధ స్థానాన్ని పొందింది. నరుని (అర్జునుని) ద్వారా నారాయణునికి తన సంకల్పాన్ని సందేశ రూపంలో పంపిన వనితా శిరోమణి.

**2. రాక్షస జాతి**

**1. పూతన** - ఈమె రాక్షస స్త్రీ అయినా కంసుని ఆజ్ఞపై పసి పిల్లలను సంహరిస్తూ, శ్రీకృష్ణుని వద్ద కేతెంచింది. తాను రాక్షసిగా వికృతాకారంలో వచ్చి భయపెట్టి చంపాలనుకోకుండా స్తన్యమిచ్చి సంహరించాలనుకోవటం, రాక్షసత్వంలో సౌజన్యం.

**2. కుబ్జ** - కంసునిదాసి: క్రూరుడైన కంసుని దాసి అయినా ఈమె బలరామ కృష్ణులకు మైపూతనిచ్చి, శ్రీకృష్ణుని చక్కదనాన్ని ప్రశంసించిన సౌజన్యవతి.

**3. అస్తి, ప్రాప్తి** - వీరు పతి భక్తి పారాయణులు. కంసుని భార్యలు. జరాసంధుని కుమార్తెలు. తమ భర్తను చంపిన శ్రీకృష్ణుని, యాదవ వంశాన్ని నిర్మూలించాలని తన తండ్రిని పురికొల్పారు. జరా సంధుడు ద్వారకపై 17 సార్లు దండెత్తాడు. రాక్షస జాతి స్త్రీలల్లో పగ, ప్రతీకారానికి నిదర్శనంగా కన్పించినా పతిభక్తి వీరిలో ఉన్న సౌజన్యం.

**4. మాయావతి** - ఈమె పూర్వ జన్మలో రతీదేవి ప్రద్యుమ్నుడు మన్మధుడన్న విషయాన్ని నారద మహర్షి వల్ల తెలిసికొంటుంది. ఈమె ఈ జన్మలో తన పతిని సంరక్షించుకోవడానికి తండ్రియైన శంబరాసురుని సంహరింపచేసింది. 'మహా మాయ' విద్యని ప్రద్యుమ్నునికి ఉపదేశిస్తుంది. స్త్రీలు పురుషునికి విద్యని ఉపదేశించటం, అందునా భర్తకి ఉపదేశించటం అరుదు.

"పతినే ప్రత్యక్ష దైవంగా భావించుకొని, పెంచి పోషించి కాపాడుకొన్న విశిష్ఠ మహిళ మాయావతి". భర్త తర్వాతే ఎవరైనా. పతియే ప్రాణమనుకున్న సతి మాయావతి (నేటి కాలంలో కూడ ఈ తరహా మహిళలు కొంతమంది కన్పిస్తుంటారు. అయితే ఇప్పుడు కూడ చాలా అరుదుగానే ఉన్నారు).

**5. ఉష** - ఈమె బాణాసురుని కుమార్తె. రాక్షస జాతిలో జన్మించినప్పటికి తాను స్వప్నంలో కాంచిన పురుషునినే పొందింది. కాని అన్యపురుషుని వాంఛింపలేదు. ఇది ఈమె సౌజన్యం, స్వతంత్రురాలు. నీతి మంతురాలు.

**6. చిత్రరేఖ** - ఈమె ఉష చెలికత్తె. ఈమె తన కామరూప విద్యతో లోకాలోకాలకే వెళ్ళగలిగిన స్త్రీ. స్నేహశీలి. ఈమె స్నేహం కోసం ఎంత త్యాగానికైనా సిద్ధపడే మనస్తత్త్వం కలిగిన కన్య.

**7. కోటర** - ఈమె పుత్ర రక్షణకై దిగంబరంగా రణ భూమికే వచ్చి నిలబడిన ప్రత్యేక మహిళ. అపరిమిత పుత్ర వాత్సల్యం ఈమెలో సౌజన్యం.

**3. సర్పజాతి**

**నాగ కాంతలు**

పతి భక్తితో పాటు పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకున్న వనితలు. పతికి బుద్ధిచెప్పి దారిలో పెట్టు కొంటామని సాక్షాత్తు పరమాత్మయైన శ్రీకృష్ణునికే విన్నవించిన సౌజన్యం గల స్త్రీలు. వీరి జీవన ధర్మం మహిళాలోకానికి ఆదర్శం.

**4. బ్రాహ్మణ జాతి**

**1. కృపి** - ఈమె ద్రోణాచార్యుని ఇల్లాలు. ద్రౌపది అశ్వత్థామను అర్జునుడు బంధించి తీసుకు రాగా కృపి దు:ఖాన్ని గూర్చి ఆలోచించటం వల్ల గురుపత్నిగా గౌరవ మర్యాదలు పొందినట్లు అభివ్యక్తమవుతుంది.

**2. ముని పత్నులు** - వేద విదులైన తమ పతులకంటె, భగవద్విషయజ్ఞానాన్ని కలిగి ఉన్న పత్నులు. చతుర్విధ పురుషార్థ సాధకుడైన శ్రీకృష్ణ పరమాత్మకి చతుర్విధ పురుషార్థ సాధకుడైన శ్రీకృష్ణ పరమాత్మకి చతుర్విధ ఆహారాలను సమర్పించి త్రివిధ తాపాలు చల్లార్చుకొన్న మహిమాన్విత స్త్రీలు.

లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుని స్వరూప దర్శనం చేసికొన్న మహిళలీ మునిపత్నులు. వీరు కులభేదాన్ని పాటించక శ్రీకృష్ణ లీలలు విని, వారిని చూడాలనే ఉబలాటంతో వచ్చి బాహ్య బంధాలను లెక్కించక భగవంతునికి ఆహారం సమర్పించిన అతివలు.

**3. కుచేలుని భార్య** - ఈమె మహా ఇల్లాలు. పట్టెడన్నం కూడా పెట్టలేని కటిక దారిద్ర్యాన్ని చవి చూసిన గృహిణి. అనూన సంపదలిచ్చే (కొరత లేని సంపదలు) శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళమని భర్తకి సలహా ఇచ్చి, శ్రీకృష్ణ తత్త్వాన్ని తెలియచెప్పింది. 'కరణేషుమంత్రీ' అనే విధంగా తగు సమయంలో తగిన విధంగా స్పందించే సమయ స్ఫూర్తి గల్గిన స్త్రీ.

**5. వైశ్యజాతి**

**యశోదాదేవి** - కన్న ప్రేమ కంటే పెంచిన ప్రేమ అధికమన్న సూక్తికి యశోదాదేవి నిదర్శనం మరియు ఆదర్శం.

**6. క్షత్రియ జాతి**

**1. ద్రౌపది** - ఈమె యజ్ఞజన్య. ఈమె ధర్మాధర్మాలుపదేశించి పాండు పుత్రుల ధర్మపంథాకి దోహద పడిన ఇల్లాలు. తనను కష్ట పెట్టిన వారిని కూడా ధర్మమాలోచించి, క్షమించ గల్గిన ధరిత్రీ సమానురాలు. తన కన్నబిడ్డలైన ఉప పాండవులను సంహరించిన అశ్వత్థామను విడిచిపెట్టమని, హింసించవద్దని ధర్మం కాదని బోధించటం సౌజన్యం.

పుత్రాకృతి నున్న ద్రోణుడవని, భూసురుడవని, బుద్ధి దయాభాసురడవని గురుస్థాన మహిమని, చేయకూడని పని చేసావని, చేసిన తప్పును ఎత్తి చూపి విడిచి పెట్టమంది. ధర్మజ్ఞానమున్న మహిళ ద్రౌపది.

**2. ఉత్తర** - కురువంశాకురాన్ని సంరక్షించుకోవాలనే ఆతురతతో, ఆర్తితో శ్రీకృష్ణుని ప్రార్థించటంలో ఈమె సౌజన్యం, భగవత్తత్త్వం అభివ్యక్తమవుతుంది.

*"గర్భమందు (గమలగర్భాండ శతములు*
*నిముడు కొన వహించు నీశ్వరేశ!*
*నీకు నొక్క మానినీ గర్భరక్షణ*
*మెంత బరువు నిర్వహింతుగాక!"* [10]

**3. దేవకీదేవి** -

భర్తృ సమేతంగా 12 వేల దివ్య సంవత్సరాలు తపస్సు చేసింది. ఆ తప:ఫలమే మూడు జన్మల్లో దేవమాత అయింది. శ్రీకృష్ణ జననంలో కూడ దేవకీ వసుదేవులిరువురు పురిటిబిడ్డ మహా పురుషుడని గుర్తించి మహదానందద మొందారు. వసుదేవుడు దేవదేవుని గూర్చి కందంలో కష్టపడితే, దేవకీదేవి అతి సులభంగా సీసంలో ఆ పరంజ్యోతి రూపాన్ని మూస పోసింది.

*సీ. "అట్టిట్టి దనరానిదై మొదలై నిండుకొన్నదై వెలు (గుచు గుణములేని*
*దై యొక్క చందంబుదై కలదై నిర్విశేషమై క్రియలేక చెప్పరాని*
*దే రూపమని శ్రుతులెప్పుడు నొడివెడి యారూపమగుచు నధ్యాత్మ దీప*
*మై బ్రహ్మ రెండవ యర్థంబు తుదిజగంబులు నశింప'గ బెద్ద భూతగణము"*

*ఆ. "సూక్ష్మ భూతమందు (జొరగ నా భూతంబు,*
*ప్రకృతిలోన (జొర (గ (బ్ర కృతి వోయి*
*వ్యక్తమందు (జొర (గ వ్యక్తమడంగను,*
*శే షసంజ్ఞ నీవు సెలువ మగుచు"* [11]

విశ్వేశ్వరుని విశ్వలీలా వినోదాన్ని కలువమాలతో స్వాగతించింది.

*ఉ. "విశ్వము లీల ( బ్రిప్పుచు నవిద్యకు ( జుట్టమవైన నీకు ( దా*

*శాశ్వతమైన కాలమిది సర్వము వేడబయందు, రట్టి వి*

*శ్వేశ్వర! మేలుకుప్ప నిను నెవ్వ ( డుగోరి భజించు వా ( డపో*

*శాశ్వత లక్ష్మి మృత్యుజయ సౌఖ్యయుతుండ భయుండు మాధవా!"[12]*

ప్రకృతిలో సుస్వరాన్వితయై (మత్త కోకిల వృత్తంలో) నమస్కరించింది.

*"ఒంటి నిల్చి పురాణ యోగులు యోగమార్గ నిరూఢులై*

*( కంటి ( మందురు కాని, నిక్కమ కాన! రీ భవదాకృతిం*

*గంటి భద్రము ( గంటి, మాంసపు ( గన్నులంగన ( బోల, దీ*

*తొంటిరూపు ( దొలంగ ( బెట్టుము తోయజేక్షణ! మ్రొక్కెదన్"[13]*

విశ్వగర్భుని ప్రకృతి లీలా వినోదాన్ని ఆటవెలది నటనతో పోల్చి చెప్పింది.

*ఆ. "వియకాలమందు విశ్వంబు నీ పెద్ద,*

*కడుపులోన దా ( చు కడిమి మేటి*

*నటు ( డ వీవు, నే ( డు నాగర్భజు ( డవౌట,*

*పరమ పురుష! వేడబంబి గాదె! [14]*

దుష్టశిక్షణ చేసి తనువిచ్చిన తమరిని తరింపచేయమని దేవ దేవుని తరళంలో అభ్యర్థించింది.

*త. "నలినలోచన! నీవు నిక్కము నాకు ( బుట్టెద వంచు నీ*

*ఖలు ( డుగంసు ( డు పెద్దకాలము కారయింట నడ ( చె, దు*

*ర్మలిన చిత్తుని నాజ్ఞసేయము, మమ్ము ( గావుము భీతులన్,*

*నులుసులేక ఫలించె నో ( చిన నోములెల్లను నీవయై"[15]*

ఈమె పరమాత్మ తత్త్వాన్ని తెలిసికొని దర్శించి ప్రస్తుతించిన ఈమె ఘనత కొనియాడదగింది. ఈమె జీవన విధానం భావితరాలకు కూడ వందనీయం.

### 4. రోహిణి

ఈమె చక్కని గుణగణాలు కలదని విష్ణువు యోగమాయకి చెప్పి శేషాంశను ఆమె యందు ప్రవేశపెట్టమంటాడు. భూమండలాన్నంతటిని తన పడగలమీద మోసే ఆదిశేషువుకి జన్మనిచ్చిన తల్లి. ఈమె పతి దగ్గర లేక పోయిన నందగోకులంలో తలదాచుకొని, సత్త్వవర్తనతో నడిచిన తీరు నారీ లోకానికి ఆదర్శం.

*సీ. "గోపికా జనములు గోపాలకులు నున్న పసులమందకు ( బొమ్ము భద్ర! నీవు*
*వసుదేవు భార్యలు వరుస ( గంసుని చేత నా ( కల ( బడియుండ నందు ( జొరవే*
*తల ( గి రోహిణి యను తరళాక్షి నంద గోకులమందు నున్నది గుణ గణాఢ్య*
*దేవకి కడుపున దీపించు శేషాఖ్యమైన నా తేజ మీ వమర'బుచ్చి"*

*ఆ. "నేర్పు మెఱసి రోహిణీదేవి కడుపున (*
*జొనుపు దేవకి కిని సుతు ( డనగుదు*
*నంశభాగయుతు ( డనై, యశోదకు నందు,*
*పాల ( తి కంత మీ ( ద ( బుట్టె దీపు"[16]*

## 5. రుక్మిణీదేవి

మానవైభవ గాంభీర్య విహారిణి, నిఖల సంపత్కారిణి, సాధు బాంధవ సత్కారిణి, పుణ్య సంచారణి, మహా దారిద్ర్య సంహారిణి, సువిభూషాంబర ధారిణి, గుణవతి రుక్మిణీదేవి. ఈమె గుణాలు నారీ లోకానికి ఆదర్శం. ఈమె నడవడి, దాంపత్య ధర్మం, ఋగ్వేదకాల స్త్రీధర్మానికి అద్దం పట్టింది. దాస్య భక్తితో శ్రీకృష్ణుని హృదయమై నిలిచిన నారీ రత్నం.

## 6. సత్యభామ

ఈమె సాత్రాజితి అనే నామంతో (సత్రాజిత్తు తనయ కాబట్టి) ప్రఖ్యాతి చెందింది. భయంతో శ్రీకృష్ణుని చెంతకు భార్యగా వచ్చిన ఈ భామ, తన తెలివి తేటలతో, వినయంతో శ్రీకృష్ణుని మెప్పించింది. నరకాసురునిపై శ్రీకృష్ణుడు యుద్ధానికి వెళుతుంటే, తాను కూడ తోడుగావెళ్ళి, తన విలు విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించి శ్రీకృష్ణుని ప్రేమకి పాత్రమై పారిజాతాన్ని భువికి రప్పించిన భామామణి. "ఎంత వారలైనా కాంతదాసులె". అన్న సామెతకి సత్యభామ తెలివితేటలే కారణం.

దేవాది దేవుడైన శ్రీకృష్ణ పరమాత్మనే సత్యా ప్రియునిగా చేసుకొన్న నెఱజాణ.

## 7. నాగ్నజితి

ఈమె శ్రీరాముడు పరిపాలించిన కోసల దేశపు రాజ కుమార్తె. పూర్వజన్మ పుణ్య ఫలంతో శ్రీకృష్ణుని పతిగా పొంద గల్గింది. శ్రీకృష్ణునిచే కోరబడి వరించబడిన మహిళ

*క. "అన్యుల యాచింపరు రా*

*జన్యులు సౌజన్య కాంక్ష ( జనుదెంచితినీ*

*కన్యన్ వే ( డెదనిమ్మా!*

*కన్యా శుల్కాదుల మేముగా మునరేంద్రా!"* [17]

అష్టమహిషుల్లో ఆరవస్థానం పొందిన మహిళ, ఈ రాజకన్య జగన్మోహనుడైన శ్రీకృష్ణుని పతిగా కోరుకొని సఫలీకృతురాలైన సౌభాగ్యవతి.

**8. లక్షణ**

ఈమె శుభ లక్షణ. శ్రీకృష్ణుని వేణుగానాన్ని గూర్చి నారదుని ద్వారా విని ఆకర్షితురాలైన స్త్రీ. ఈమె సౌభాగ్యవంతమైన పుట్టింటిలో పెరిగి, గౌరవమున్న మెట్టింటిలో మెలగిన మహిళ. శ్రీకృష్ణుని ధనుర్విద్యా నైపుణ్యాన్ని ద్వాపరయుగ రాజలోకానికి చాటిన మహిళ. తన భర్తను మించిన వీరుడు ఈ భూమండలంలో లేడనే నమ్మకం కలిగిన భార్య. ఈమె అష్టమహిషుల్లో అష్టమ స్థానం పొందింది.

**9. కుంతి (యాదవ జాతి)**

శ్రీకృష్ణుడు తన మేనల్లుడే అయినప్పటికి అది లౌకిక బంధమని తెలుసుకొని, శ్రీకృష్ణుడే జగన్నాయకుడని గుర్తించి ఆ పరమాత్మని ఏది కోరుకోవాలో స్త్రీజాతికి తెలియజేసింది. కుంతి పాండుపుత్రులను పెంచి పెద్ద చేసింది. ధర్మరాజు పట్టాభిషేకం చూసిన తర్వాత తన భాధ్యత తీరి పోయిందని భావించి శ్రీకృష్ణుని "ఘన సింధువు 'జేరెడి గంగ భంగి నీపాద సరోజ చింతనముపై" నిరంతరం బుద్ధి లగ్నం కావాలని, భవలతల్ త్రుంపమని కోరింది.

శ్రీకృష్ణుని మరణ వార్త విన్నంతనే ప్రాణాలు విడిచిన కృష్ణ భక్తురాలు

**10. గాంధారి** - గాంధారదేశ రాజ కుమార్తె. ధర్మానికి కట్టుబడిన మహిళ. ధృతరాష్ట్రుని పత్ని. అంధుడైన ధృతరాష్ట్రుని వివాహం చేసుకొని, తన పతికి లేని నేత్రాలు తనకెందుకని కళ్ళకు గంతలు కట్టుకొని జీవితమంతా లోకాన్ని చూడకుండానే జీవించిన ప్రత్యేక మహిళ.

కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మంజయించాలని కోరుకుంది కాని తన బిడ్డడే గెలవాలని స్వార్థంతో అనుకోలేదు. కురు క్షేత్రం ముగిసిన తర్వాత ఈ తల్లి మనస్సు ఆందోళనతో నిగ్రహం

కోల్పోయింది. నూరుగురు పుత్రులను పోగొట్టుకున్న కడుపుకోత ధర్మరక్షకుడుదయించిన యాదవ వంశాన్ని శపించే విధంగా చేసింది.

శ్రీకృష్ణ పరమాత్మ పతివ్రత శాపం వ్యర్థం గాదని, తప్పక జరిగి తీరుతుందని, అంగీకరిస్తాడు. యాదవ వంశాన్ని ఏ రాజు జయించలేక పోయినా, పతివ్రత అయిన గాంధారిశాపం ఆ వంశాన్ని నిర్మూలించిందని మహాభారతం తెలియచేస్తుంది. అంటే పతివ్రత అయిన స్త్రీ వాక్కు బ్రహ్మర్షి వాక్కుతో సమాన మన్న సత్యం పరోక్షంగా మనకు వెల్లడవుతుంది.

ఈమె పతి వెంటే పత్ని అన్న చందంగా మరణంలో కూడా ధృతరాష్ట్రునితో పాటు యోగాగ్నిలో దగ్ధమైంది.

**11. గోపికలు** - జగధీశ్వరుడైన శ్రీకృష్ణునిపై భక్తితో, రక్తితో నిరంతర ధ్యానంలో ముక్తిని పొందటం గోపికల సౌజన్యం.

**12. సుభద్ర** - బలరామ కృష్ణుల సోదరి. ఈమె ప్రతి విషయంలోను సోదరుడైన శ్రీకృష్ణుని పైనే భారం వేసింది. జ్యేష్టుడైన బలరాముని కంటె శ్రీకృష్ణుని పైనే ఈమెకు మక్కువ అధికం. నన్ను విడువని వారిని నేనెన్నడు విడువనని లక్ష్మీదేవితో శ్రీహరి పలుకుతాడు (గజేంద్ర రక్షణానంతరం)

*క. "ఎఱు ( గదు తెఅవా యెప్పుడు*

*మఱవను సకలంబు నన్ను మఱచిన యెడలన్*

*మఱుతునని యెఱి ( గి మొఱ ( గక*

*మఱవక మొఱయిడిన యేని మఱియన్యములన్"* [18]

సుభద్ర శ్రీకృష్ణునినే అన్ని విషయాల్లో నమ్మింది. శ్రీకృష్ణుడు సోదరియైన సుభద్రను కంటికి రెప్పలా కాపాడాడు. చివరికి సుభద్ర పౌత్రుడే కురువంశ వారసుడయ్యాడు.

### 4.3.5. అన్య స్త్రీలు

#### హస్తినాపుర సుందరులు

వీరు యాదవ ప్రభువైన శ్రీకృష్ణుని వేదవేద్యుడైన ఆది నారాయణునిగా, సత్య స్వరూపుడిగా భావించారు. లోకేశ్వరుణ్ణి ప్రత్యక్షంగా దర్శించిన అదృష్టానికి ఆనందంతో నాట్యం చేసారు. పురుషోత్తముడైన శ్రీకృష్ణుని నిరంతరం దర్శించటం వల్ల ద్వారకా వాసులు ధన్యులయ్యారని భావించారు.

వీరి మాటలను బట్టి చూస్తే సామాన్య స్త్రీలు కూడా లౌకిక, పారలౌకిక జ్ఞానం కలిగి ఉండేవారన్న సత్యం వెల్లడవుతుంది.

## జగన్నుత స్త్రీలు

లౌకిక తత్త్వాన్ని గూర్చి ప్రహ్లాదునకు అజగరుడు చెప్పుతూ, లౌకిక తత్త్వాన్ని తెలిసిన స్త్రీ లోకాన్ని మెప్పించ గల్గుతుంది. ఆ స్త్రీ వల్లనే పురుషుడు సంతృప్తితో చతుర్విధ పురుషార్థాలను తెలుసుకో గల్గుతాడు.

*ఆ. "జనక గురులనైన ( జంపు నర్థమునకై*
*ప్రాణమైన విడుచు భార్య కొఱకు*
*నట్టి భార్య ( బురుషు ( డతిథి శుశ్రూషసే*
*యించి గెలుచు నజితు నీశునైన"* [19]

అని తెలియచేస్తాడు. అ జగరుని మాటల్లో ఉదాహరణంగా భాగవతంలో దేవహూతి కర్దములు, ఊర్వశీ పురూరవులు, దేవకీ వసుదేవులు మొదలైన వారు కన్పిస్తున్నారు.

ఈ స్కంధంలోనే నారదుడు ధర్మరాజుకి వర్ణాశ్రమ ధర్మాలను తెలియచేసే ఘట్టంలో స్త్రీ ధర్మాలు తెలియచేస్తాడు. (బదరికావనంలో నారాయణముని నారదునకు చెప్పగా, నారదుడు ధర్మ రాజుకి చెపుతాడు)

*సీ. "నిలయము పాటించి నిర్మల దేహయై శృంగారమే ప్రొద్దు జేయ వలయు*
*సత్యప్రియాలాప చతురయై ప్రాణేశు చిత్తంబు ప్రేమ రంజింప వలయు*
*దాక్షిణ్య సంతోష ధర్మమేధాదుల దైవతమని ప్రియు ( దల ( ప వలయు*
*నాధుడే పద్ధతి నడచు నా పద్ధతి నడచి సద్బంధుల నడుపవలయు"*

*ఆ. " మార్దవమున ( బతికి మజ్జన భోజన,*
*శయన పాన రతులుజరపవలయు*
*విభు ( డు పతితు ( డైన వెల ( ది ప్రాతివ్రత్య*
*మహిమ ( బుణ్యు ( జేసి మనుపవలయు"* [20]

1. స్త్రీలు గృహాలను చక్కగా తీర్చి దిద్దుకోవాలి. ఉదా. దేవహూతి, సుకన్యక మొదలైనవారు.

2. శరీరాన్ని సుందరంగా నిర్మలంగా ఉంచుకోవాలి. అలంకరణ చేసుకొవాలి. ఉదా. అదితి.

3. సత్యం ప్రియంగా పలకాలి. ఉదా. పరమేశ్వరుడితో సతీదేవి.

4. చాతుర్యంతో కూడి వచన మాధుర్యంతో పతి మనస్సును ప్రేమతో రంజింపజేయాలి. ఉదా. కయాధువు

5. దాక్షిణ్యం, సంతోషం, ధర్మచింతనం, మేధా సంపద మొదలైన సుగుణాలకు తన పతి అధిపతి అని భావించాలి. ఉదా. కర్దమ మునీంద్రుని దేవహూతి

6. నాధునికి ఇష్టమైన పద్ధతిలో నడవాలి. ఉదా. దేవహూతి, సుకన్యక

7. బంధువులను చక్కని మార్గంలో నడపాలి. ఉదా. రుక్మిణీదేవి.

శ్రీకృష్ణుని (రుక్మిణీదేవి వివాహ సందర్భంలో) చులకన చేసి మాట్లాడిన రుక్మి తన కుమార్తెలను యాదవ వంశస్థులకే ఇచ్చి వివాహం చేస్తాడు.

8. మృదు స్వభావంతో పతికి స్నాన పాన ఆహారాదులు సమకూర్చి రతి సౌఖ్యం కలిగించాలి. ఉదా. ప్రసూతి, ఆకూతి, దేవహూతి

9. ఒక వేళ పతి పతితుడైతే తన పాతివ్రత్య బలంతో అతనిని ఉత్తమునిగా దిద్ది తీర్చుకోవాలి.

ఉదా. దేవేంద్రుడు వృత్రాసుర వధతో బ్రహ్మహత్యాపాతకం చుట్టి పదవీ భ్రష్టుడుకాగా శచీదేవి పాతివ్రత్య బలంతో దేవేంద్రుని యధాస్థితిలో ఉంచగలిగింది.

*క. "తరుణి దన ప్రాణవల్లభు*
*హరి భావముగా భజించి యత (డును దానున్*
*సిరికైవడి వర్తించును,*
*హరిలోకము నందు సంతతానందమునన్"* [21]

10. కాంత తన కాంతుణ్ణి శ్రీవిష్ణువుగా భావించాలి. ఉదా. దేవహూతి.

11. పతి పట్ల తాను లక్ష్మీదేవి వలె ప్రవర్తించాలి. ఈ విధంగా ప్రవర్తించే ఆ దంపతులు విష్ణులోకంలో నిత్యానందమనుభవిస్తారు.

*క "ఉపవాసంబులు వ్రతములు (*
*దపములు వేయేల భర్తదైవతమని ని*
*ష్కపటత ( గొల్చిన సాధ్వికి*
*నృపవర! దుర్లభము లేదు నిఖిల జగములన్"* [22]

12. ఉపవాస, వ్రత, తపస్సులనేకం చేయటం కంటె నిష్కపటంగా, నిర్మలంగా, నాధుణ్ణి నారాయణునిగా భావించి సేవించటమే నారీమణుల ధర్మం. ఉదా. అనసూయ అటువంటి పతివ్రతకు జగత్తులో దుర్లభమన్నది లేదు.

నారాయణ ముని చెప్పిన స్త్రీ ధర్మాలు భాగవత స్త్రీలు పాటించి భక్తితో శ్రీమన్నారాయణుని దర్శించి ముక్తి పొందారు. నారీ లోకానికి వీరి జీవన విధానం ఆదర్శమైంది.

## పాద సూచికలు

1. ఆం. భాగ. ఏకాదశ స్కం. ప. 54
2. ఆం. భాగ. స. స్కం. ప. 239
3. ఆం. భాగ. ఏకాదశ స్కం. ప. 105
4. ఆం. భాగ. స. స్కం. ప. 120
5. ఆం. భాగ. స. స్కం. ప. 233
6. ఆం. భాగ. ద్వి. స్కం. ప. 275
7. శ్రీమద్రా, యుద్ధకాం. స. 114, శ్లో.16
8. ఆం. భాగ. న. స్కం. ప. 355
9. ఆం. భాగ. ద. స్కం. ప. 154
10. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 181
11. ఆం. భాగ. ద. స్కం. ప . 126
12. ఆం. భాగ. ద. స్కం. ప . 127
13. ఆం. భాగ. ద. స్కం. ప . 128
14. ఆం. భాగ. ద. స్కం. ప . 129
15. ఆం. భాగ. ద. స్కం. ప . 130
16. ఆం. భాగ. ద. స్కం. ప. 59
17. ఆం. భాగ. ద. స్కం. ప. 133
18. ఆం. భాగ. అ. స్కం. ప. 130
19. ఆం. భాగ. స. స్కం. ప. 446
20. ఆం. భాగ. స. స్కం. ప. 416
21. ఆం. భాగ. స. స్కం. ప. 417
22. ఆం. భాగ. స. స్కం. ప. 418

## 5. భాగవత మహిళల మహనీయత

భాగవతమంటే భగవద్భక్తులగాథలు. భగవంతుడే వ్యాసరూపం దాల్చి ("వ్యాసాయ విష్ణురూపాయ, వ్యాసరూపాయ విష్ణవే" అని విష్ణుసహస్రనామస్తోత్రం) తన భక్తుల గాథలు రచించాడు. ఆ వ్యాస రూపుడైన విష్ణువుకి మాతృమూర్తి మత్స్యగంధి సత్యవతి. ఈ సత్యవతి కన్యగా ఉన్నప్పుడే పరాశరమునిచే ప్రబోధింపబడి వ్యాసమహర్షికి జన్మనిచ్చిన శక్తివంతురాలు. శక్తి అంటే శరీర గత సామర్థ్యం అని అర్థం, ఈమె కన్యాత్వం దూషితం కాక పోవటమే కాక యోజనగంధి యైన మహనీయ మహిళ. ఈమె సాహసోపేత చర్యవల్లనే (వివాహానికి పూర్వం పరాశర మునితో సమాగమం) సంస్కృత సాహిత్యలోకానికి, చతుర్వేదాలు (వేద విభజన), మహాభారతం అష్టాదశ పురాణాలు లభించాయి. అంతేకాక కురువంశం అంతరించకుండా నిలువరించగలిగింది.

ఇక భాగవత కథాబోధకుడు వ్యాస పుత్రుడైన శుకమహర్షి జన్మకు కారణం ఘృతాచి. ఈమె దేవజాతి అప్సరస. ఘృతాచి ఆకాశంలో విహరిస్తూ వ్యాసాశ్రమం చెంతకు చేరి ఇది వ్యాసమహర్షి తపోభూమి, తపోధనుడైన వ్యాస మహర్షికి తాను కన్పించటం భావ్యంగాదని భావించి మహోన్నతమైన, వివేక యుక్తమైన ఆలోచనతో చిలుకగా మారింది. అయినా ఆ అప్సరస సౌందర్యాన్ని తిలకించి వ్యాస మహర్షికి కలిగిన పుత్రకాంక్ష వల్ల బ్రహ్మజ్ఞాని శుక మహర్షి ఉదయించాడు.

భాగవత రచయిత పుట్టుటకు సత్యవతి శరీరగత సామర్థ్యం అంటే శక్తి కారణమైతే, శుక మహర్షి జననానికి ఘృతాచి న్యాయమాలోచించింది. తపోవన పరిసరాలు దాటి వెళ్ళటానికి ఉపాయం యోచించింది. అయినా శుక మహర్షి జననానికి తానే కారకురాలైంది. ఈ స్థితి ఘృతాచి గొప్పతనమే.

ఈ విధంగా భాగవత మహిళలను పరిశీలిస్తే వీరి ఘనత భక్తి, శక్తి, యుక్తి అనే త్రివిధమార్గాల్లో గోచరిస్తుంది.

## 1. భక్తి మార్గం

భాగవతం తొమ్మిది విధాల భక్తితో ముక్తిని పొందిన జీవుల గాధను వివరించింది. అసలు భక్తిమార్గం ఎలా ఉంటుంది. ఏ విధంగా ఉన్నవారు భగవంతుని పొందుతారనే విషయం, భాగవత కథా నాయకుడు శ్రీకృష్ణ పరమాత్మ గీతలో భక్తి యోగాన్ని గూర్చి అర్జునునికి తెలియచేస్తూ

*"మయ్యావేశ్య మనోయేమాం*

*నిత్యయుక్తా ఉపాసతే*

*శ్రద్ధయా పరయోపేతా:*

*తేమే యుక్త తమా మతా:"*[2]

నాలో మనస్సు నిలిపి నిత్యయుక్తులై పరమమైన శ్రద్ధతో ఎవరు నన్ను ఉపాసిస్తారో వాళ్ళు యోగులలో శ్రేష్ఠులు. జీవాత్మ పరమాత్మను చేరటం ముక్తి.

తనను జీవులు ఏ విధంగా చేరుతున్నారో గీతలో శ్రీకృష్ణభగవానుడు తెలియచేసాడు.

*"యేత్వక్షర మనిర్ధేశ్యం*

*అవ్యక్తం పర్యుపాసతే*

*సర్వత్ర గమచింత్యంచ*

*కూటస్థమచలంధ్రువమ్"*[3]

అన్ని ఇంద్రియాలను నిగ్రహించి, అన్నిటా సమబుద్ధితో వ్యవహరిస్తూ, అన్ని ప్రాణుల హితాన్ని కోరుచు ఎవరు ఉంటారో వారు నన్నే చేరతారు. ఈ శ్లోక విషయానికి లక్ష్యంగా భాగవత మహిళల్లో అత్రిమహాముని పత్ని అనసూయ కన్పిస్తుంది.

*"యేతుసర్వాయి కర్మాణి*

*మయి సన్నస్య మత్పరా:*

*అనన్యేనైవ యోగేన*

*మాం ధ్యాయంత ఉపాసతే"*[4]

ఈ శ్లోక విషయానికి లక్ష్యంగా గోపికలు, రుక్మిణీ దేవి, నాగ్నజితి, లక్షణ కన్పిస్తున్నారు. సర్వ కర్మలను నాలో వదలి నన్నే లక్ష్యంగా పెట్టుకొని అనన్య యోగంతో ధ్యానిస్తూ ఎవరు ఉపాసిస్తారో

*"తేషామహం సముద్ధర్తా*

*మృత్యు సంసార సాగరాత్*

*భవామి న చిరాత్ పార్థ!*

*మయ్యావేశిత చేతసామ్"*[5]

అర్జునా! నాలో మనస్సు నిలిపిన వారిని త్వరగా మృత్యు సంసార సాగరం నుండి నేనే ఉద్ధరింతును. ఈ శ్లోకానికె కుంతి, ద్రౌపది ఉదాహరణలుగా సరితూగాడు.

అంతేకాక అర్జునునితోశ్రీకృష్ణుడు

*"మయ్యేవ మన అధత్స్వ*

*మయి బుద్ధిం నివేశయ*

*నివనిష్యసి మయ్యేవ*

*అతఊర్ధ్వం నసంశయ:"*[6]

నాలో మనస్సుని నిలుపు. బుద్ధిని నాలోనే ఉంచు. ఆ తర్వాత నాలో నివశింతువు? ఇందులో సందేహం లేదు. ఈ శ్లోక లక్షణానికి లక్ష్యంగా భాగవత మహిళల్లో కపిల మహర్షి మాతృమూర్తి దేవహూతి గోచరిస్తుంది.

భక్తి మార్గంలో భాగవత మహిళలు తమ రక్షణకై భగవంతుని శరణు వేడారు. ఆ శరణాగతి చేసిన మహిళల్లో కొందరు లౌకిక కోర్కెలు నెరవేర్చుకున్నారు, మరికొందరు ఆత్మ పరివర్తనతో ముక్తి పొందారు. ఇంకొందరు భక్తి మార్గాల్లో ముక్తి పొందారు.

### అ) భక్తితో లౌకిక కోరికలు నెరవేర్చుకున్న స్త్రీలు

**1. నాగ కాంతలు** - శ్రీకృష్ణుని పరమాత్మగా గుర్తించి, ప్రస్తుతించి శరణాగతి చేసి పతిభిక్ష నర్థించిన ఆత్మజ్ఞానం కల కాంతలు వీరు. శ్రీకృష్ణుడు వారి భక్తి ప్రపత్తులను మన్నించి కాళీయుని సంహరించ లేదు.

**2. నాగ్నజితి** - శ్రీకృష్ణుని మహా పురుషునిగా భావించి, భూభారాన్ని తగ్గించటానికి వచ్చిన సర్వేశ్వరుడని, అతడే తన పతి కావాలని ప్రార్థించి భర్తగా పొందిన పుణ్యాత్మురాలు.

**3. లక్షణ** - నారద మహర్షి వల్ల విని, శ్రీకృష్ణునికి వేణుగానానికి పరవశయై శ్రీకృష్ణుడే తనపతి కావాలని కోరుకున్న వనిత.

**4. 16000 రాజకన్యలు** - వీరు నరకుని చెర నుండి శ్రీకృష్ణునిచే విడిపించ బడ్డారు. శ్రీకృష్ణుని సౌందర్యాన్ని, శౌర్యాన్ని, గాంభీర్యాన్ని చూచి మోహావేశంచే శ్రీకృష్ణుని భర్తగా భావించారు. పరంధాముడైన శ్రీకృష్ణుని పతిగా పొంది ఈ రాజకన్యలు పతిసేవతో పునీతులయ్యారు.

**అ) భక్తితో వంశోద్ధరణ చేసిన స్త్రీ**

**1. కయాధువు లేదా లీలావతి**

హిరణ్యకశిపుని పత్ని. ఈమె హరి భక్తురాలు. హిరణ్యకశిపుడు ఉగ్రతపం చేస్తున్నాడని దేవతలు హిరణ్యకశిపుని నగరంపై దండెత్తి, అంత: పురంపై దాడిచేసి గర్భవతియైన కయాధువుని దేవేంద్రుడు చెఱపట్టాడు. ఈమె భక్తి బంధుత్వాన్ని చెప్పి దేవర్షి నారదుడు దేవేంద్రుని చెఱ నుండి విడిపించి, తన ఆశ్రమానికి తీసుకెళ్ళి సంరక్షిస్తాడు. ఈమె సేవలకు మెచ్చి నారదుడు గర్భస్థ శిశువైన ప్రహ్లాదుని దృష్టిలో ఉంచుకొని ధర్మ రీతులను, నిర్మల జ్ఞానాన్ని బోధిస్తాడు. ఈ ధర్మ జ్ఞాన బోధతోనే ప్రహ్లాదుడు హరిభక్తుడై నరసింహావతారాన్ని ప్రసన్నం చేసికొని 21 తరాలు రాక్షస వంశస్థులకి కూడా ముక్తి కలిగే విధంగా చేయగలిగాడు. లీలావతి శ్రీహరి భక్తురాలగుట వల్లనే ప్రహ్లాదుని పుత్రునిగా పొందగల్గాడు. లీలావతిని భార్యగా పొందటం వల్లనే హిరణ్యకశిపుని వంశమంతా ఉద్ధరింపబడింది.

**ఇ) ఆత్మ పరివర్తనతో ముక్తి పొందిన మహిళ**

**1. పింగళ**

ఈమె తనవేశ్యా వృత్తిచే చేసే పాపమేగాక, ధనకాంక్షతో ఒక విటుని మోసపుచ్చి మరియొక విటుని చేరింది. శరీరం అలసత్వం చెంది, సంతృప్తి చెందక శాశ్వతమైన ఆత్మ సుఖాన్ని గూర్చి ఆలోచించింది. 'పురుష' శబ్ద వాచ్యుడు నారాయణుడని గుర్తించి మనస్సు లగ్నం చేసి ముక్తి పొందింది.

ఈమె గూర్చి స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మ ఉద్ధవునితో చెప్పాడు.

**ఈ) శత్రుత్వంతో ముక్తి పొందిన మహిళ (వైర భక్తి)**

**పూతన**

కంసుని ఆజ్ఞపై శ్రీకృష్ణునికి విషస్తన్యమిచ్చి చంపాలనుకొంది. కాని స్తన్య మిచ్చిన పూతనను మాతృస్థానంతో మన్నన చేసి ప్రాణాలు లాగేసి ముక్తినిచ్చాడు శ్రీకృష్ణ పరమాత్మ.

## ఉ) భక్తి మార్గంలో ముక్తి పొందిన స్త్రీలు

**1. కుంతి** - శ్రీకృష్ణుని మేనత్త, యాదవుల మరణం, మాధవుని నిర్యాణం చెందటాన్ని ఆలకించిన కుంతీదేవి నిర్మలమైన భక్తితో హరిచరణ సంస్మరణంతో సంతోషంగా శరీరాన్ని విడిచి పెట్టింది.

*క. "యదువులనాశము మాధవు*
*పదవియు విని కుంతి విమలభక్తిన్ భగవ*
*త్పద చింతాతత్పరియై*
*ముదమున సంసార మార్గము నకుంబాసెన్"*[7]

తాను పుట్టిన వంశం అంతరించింది. తాను నమ్మిన, తనని, తన పుత్రులను కష్టాల నుండి కడతేర్చిన ఆ శ్రీకృష్ణుడే ఈ భువి నుండి వెళ్ళాక తన ఉనికి ఈ భువిపై అవసరం లేదని నిర్ధారించుకొని అపరిమితమైన హరిపద చింతా తత్పరతతో శరీరాన్ని సంతోషంగా విడిచి పెట్టింది. సర్వాత్మనా శ్రీకృష్ణుని నమ్మి భక్తితో ముక్తిని పొందింది పాండవ మాత.

**2. దేవహూతి**

కర్దమ మునీంద్రుని ధర్మపత్ని. ఈమె పతిసేవలో పునీతయై వేదాంతోపదేశం చేసే తనయుడు కావాలని భర్తని కోరి పరమాత్మనే (కపిల దేవుని) తనయునిగా పొందింది.

తన తనయుడు ఉపదేశంతో ఆత్మలకధీశ్వరుడు, సర్వాంతర్యామి, అనంతుడు అద్వితీయుడు, అజుడు, లీలా వినోది, అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే ఆమేయుడు. అఖిలేశ్వరుడైన పరబ్రహ్మయందు మనస్సు లగ్నం చేసింది. నిరంతర నిష్ఠ వల్ల ఆమెకు నిర్మలమైన తత్త్వజ్ఞానం అలవడింది. సమాధి సిద్ధించింది. పునరావృత్తి రహితమైన ప్రవృత్తి ఏర్పడింది.

దైహిక జీవితం స్వప్నం వలె దేవహూతి తన అస్తిత్వాన్ని మరచి, పొగలేని అగ్నివలె ప్రకాశించింది.

*క. "గురు యోగ శక్తిచే( నం*
*బర తలమున కెగసి సత్యపామయు'డగునా*
*పర వాసుదేవు చరణాం*
*బురుహ యుగన్యస్త చిత్తము గలది యగుచున్"*[8]

అఖండమైన యోగ ప్రభావం వల్ల ఆమె మనస్సు ఆకాశానికి ఎగసి పరమ కరుణామయుడైన పర వాసుదేవుని చరణ కమలాల్లో విలీనమయింది. దేవహూతి పరబ్రహ్మనే పుత్రునిగా పొంది (కపిలుడు), అతని ఉపదేశంచే బ్రహ్మజ్ఞానం పొంది, పరమాత్మ చరణ సన్నిధికి చేరి ముక్తి పొందిన మహిళ.

### 3. సునీత

భక్తితో భగవంతుని చేరిన మహిళ. ఈమె ఉత్తానపాదుని పెద్ద భార్య. ధ్రువుని తల్లి. భర్త ప్రేమకు నోచుకొని ఈమె నిరాశకు లోనవ్వక శ్రీమన్నారాయణ చరణాలాశ్రయించి, పుత్రుని కూడ శ్రీమన్నారాయణ భక్తుని గావించి విష్ణులోకాన్ని చేరింది.

*క. "జనని సునీతని మునుగను (*

*గొని యవల విమానమెక్కి గొనకొని విబుధుల్*

*దనమీ ( ద ( బుష్ప వర్షము*

*లనయము ( గురియింప ధ్రువుడు హర్షముతోడన్"* [9]

ధ్రువుని వంటి మహాభక్తుని కన్నతల్లిగా సునీతికి శ్రీమన్నారాయణుడు విష్ణుపదాన్ని అనుగ్రహించాడు

### 4. గోపికలు

'కృష్ణ' పదానికి 'కృష్ణ్యతే అనేన ఇతి కృష్ణ' పైకి ఆకర్షించేదని అర్థం. గోపికలు శ్రీకృష్ణుని శరద్రాత్రివేళ పలికిన వేణుగానానికి పరవశులయ్యారు తొలుత. అనంతరం శ్రీకృష్ణుని పతిగా భావించి కాత్యాయనీ వ్రతం చేసారు. అనంతరం శ్రీకృష్ణుని సంసార భయాన్ని పోగొట్టే శ్రీమన్నారాయణుడని గుర్తించి

*ఉ. "నీవు యశోదబిడ్డ ( డవె? నీరజనేత్ర! సమస్తజంతుచే*

*తో విదితాత్మ వీశుండవు తొల్లి విరించి దలంచి లోకర*

*క్షావిధ మాచరింపుమని సన్నుతి సేయంగ సత్కులంబునన్*

*భూవలయంబు ( గాన నిటు పుట్టిది గాదె మనోహరా కృతిన్"* [10]

మధురభక్తితో మమ్ము రక్షించమని శరణాగతి చేసారు. గ్రహణ స్నాన నిమిత్తమై వెళ్ళి, గోపికాస్త్రీల మధుర భక్తిని ప్రశంసించి, శ్రీకృష్ణుడు ఆలింగన సౌఖ్యాన్ని అనుగ్రహించి.

*సీ. "తరళాక్షులార! మద్భక్తి చేతసులకు ( దనరు మోక్షానంద దాయ*
*జపతపోవ్రతదాన సత్కర్మముల ముక్తి కలుగంగ నేరదు కాన ( దలప*
*విధి శివ సనకాది విమల చిత్తంబుల ( బొడమిన భక్తి మీబుద్ధులందు*
*జనియించె మీపూర్వ సంచిత సౌభాగ్యమెట్టిదో యది తుదముట్టెనింక"*

*తే. "నటమటముగాదు మీకు నెన్న ( టికి నైన (*
*గలుగనేరవు నిరయ సంగతములైన (*
*జన్మ కర్మములిటమీ ( ద మన్మనీష*
*సుమహిత ధ్యానలార! యోరమణులార!"*[11]

ఇకపై మీకు జన్మ కర్మలుండవని, మీ పురాకృత సుకృత విశేషం పరిపూర్ణంగా ఫలించిందని ముక్తిని ప్రసాదించాడు.

## 5. మునిపత్నులు

లోకంలో ఎవరికైనా ఏదైనా దానం చేసేటపుడు "శ్రీకృష్ణార్పణమస్తు" అని సమర్పిస్తే అనంత పుణ్యం లభిస్తుందని ఆర్యులంటారు. అలాంటిది లౌకిక బంధాలను లెక్కచేయక బలరామ కృష్ణులు ఆకలితో ఉన్నారని తెలిసి, ఆహారం గోప బాలురకిచ్చి పంపక తామే స్వయంగా చతుర్విధ ఆహారాలను తీసికొని మునిపత్నులు స్వయంగా శ్రీకృష్ణుని వద్దకు వెళతారు.

వెళ్ళిన మునిపత్నులకు శ్రీకృష్ణ దర్శన ప్రాప్తి లభించింది. త్రివిధ తాపాలు ఉపశమించాయి. చతుర్విధ పురుషార్థ సాధకుడైన శ్రీకృష్ణుడు కుశలమడిగి తన సందర్శనం మోక్ష ప్రదాయకమని తెలియచేసాడు. మునిపత్నులు భక్తితో తెచ్చిన చతుర్విధ ఆహారాలను ఆప్తవర్గంలో కలిసి హరి ఆరగించాడు.

## 6. యశోద

ఈమె శ్రీకృష్ణుని పెంచిన తల్లి. ఈమె శ్రీకృష్ణుని నోటిలో అండపిండ బ్రహ్మాండాన్నంతా దర్శించిన పుణ్యాత్మురాలు. అయినా ఎప్పటి కప్పుడు శ్రీకృష్ణుని కన్నబిడ్డగానే భావించి పెంచి పెద్ద చేసింది.

కాళీయ మర్దనం సన్నివేశంలో ఈమె శ్రీకృష్ణుని పాము కరిచిందేమోనని.

*క. "పన్నగము మమ్ము గఱవక,*

*నిన్నేటికి ( గఱచె ( గుఱ్ఱ! నెమ్మి గలిగి నీ*

*వున్నను మము రక్షింతువు,*

*నిన్నున్ రక్షింపసేయు నేరము తండ్రీ!"*[12]

నాయనా! ఈ పాపిష్ఠి పాము మమ్ములనన్నా కరవక నిన్నెందుకు కరిచింది? నీవు క్షేమంగా ఉంటే మమ్ములను రక్షిస్తావు. కానీ నీవే ఆపదలో పడితే మేము నిన్ను రక్షింపలేము గదా? అని విలపించింది. తన బిడ్డే తనకు రక్షకుడని నమ్మిన తల్లి. శ్రీకృష్ణుని నీవులేని ఈ లోకం, ఈ జీవితం, మాకక్కర లేదన్న వాత్సల్య భక్తి నిండిన తల్లి యశోదమ్మ.

శ్రీకృష్ణావతార ఘట్టం ముగింపుకి వస్తున్న సందర్భంలో శ్రీకృష్ణుడు సకుటుంబంగా గ్రహణ స్నానానికి వెళతాడు. బలరామ కృష్ణులు నంద యశోదలకు వినయంతో నమస్కరిస్తారు.

*వ. "అట్లు నమస్కృతులుసేసి, యాలింగనంబుల గావించి, నయనార విందంబుల నానంద బాష్పంబుల దొర ( గ నఱలేని స్నేహంబులు చిత్తంబుల నత్తమిల్ల నేమియుం బలుకకుండి, రంత నయ్య శోదాదేవి రామకృష్ణుల నిజాంక పీఠంబుల నునిచి యక్కునం గదియం దిగిచి, చెక్కిలి ముద్దుగొని, శిరంబులు మూర్కొని, చిబుకంబులు పుడుకుచు ( బున: పునరాలింగనంబులు గావించి, పరమానందంబునం బొందుచు నున్నంత ( బదంపడి"*[13]

యశోదాదేవి బలరామకృష్ణులను ఒడిలో కూర్చుండ బెట్టుకొని, వారిని తన గుండెలకు హత్తుకొని, కపోలాలు ముద్దాడింది. మూర్ధాఘ్రాణం చేసింది. చిబుకాలు నిమురుతూ పలుమార్లు కౌగిలించు కొని పరమానందం పొందింది. గీతాకారుని పసి పిల్లవాని చేసి ముద్దాడిన మాతృమూర్తి. ఈ తల్లి వైకుంఠానికి వెళ్ళినా, నన్ను విడిచి ఇక్కడ ఉన్నావేంటి కృష్ణయ్యా! అని ఆశ్చర్యంతో ఆ పరంధాముని ముద్దు పెట్టుకోగల్గిన మహెూత్కృష్ట మహనీయ మహిళ యశోద వాత్సల్య భక్తికి పరాకాష్ఠ ఈ పై సన్నివేశం. మాతృత్వమంటే అర్థం యశోద. యశోద అంటే అర్థం మాతృత్వం.

## 5.2. శక్తిమార్గం

### అ) శక్తిచే వంశోద్ధరణ చేసిన స్త్రీ

### 1. సునీథ

అంగరాజు పత్ని. వేనుని తల్లి. వేనుడు దుర్మార్గుడై మునుల ఆగ్రహానికి గురియై మరణించాడు. సునీథ తన యోగశక్తిచే పుత్రుడైన వేనుని శరీరాన్ని చెడకుండ భద్రపరచి కాపాడుతుంది. సునీథ మునుల అనుగ్రహంతో శ్రీహరిభక్తులైన ధ్రువవంశాన్ని సంరక్షించి పృధు చక్రవర్తి లాంటి ధర్మబద్ధుడైన రాజుని ఈ భువికి అందించిన శక్తివంతురాలైన మహిళ.

### ఆ) భాగవత ధర్మాలు పాటించి శక్తి పొందిన మహిళలు

**1. శచీదేవి** - పరమాత్మ చెప్పిన స్త్రీ ధర్మాలను పాటించిన ఈ దేవేంద్ర పత్ని తన పాతివ్రత్య బలంతో శక్తివంతురాలై స్వర్గాధిపత్యం కోల్పోయిన తన పతికి మరల స్వర్గాధిపత్యాన్ని ప్రాప్తింప చేసింది.

**2. అరుంధతి** - ఈమె భర్తనే పరదైవంగా భావించి తన పాతివ్రత్యంచే స్త్రీలకు ఆదర్శమై లోక ప్రసిద్ధి చెందిన మహిళ.

**3. సుకన్యక** - తన పాతివ్రత్యమహిమచే వృద్ధుడు, అంధుడైన పతి చ్యవన మహర్షికి సేవలు చేసి అశ్వినీ దేవతలకు మెప్పించి, యౌవనం సంప్రాప్తింప చేసి, నేత్ర దృష్టి కలిగింప చేసింది.

**4. సీత** - పాతివ్రత్య ధర్మంతో పతితో అద్వైత భావన కల్గిన మహిళ.

**5. గాంధారి** - అంధుడైన పతిని వరించి, తన భర్త చూడలేని లోకాన్ని తాను చూడవలసిన పనిలేదని, తన అంధత్వాన్ని తాను తెచ్చిపెట్టుకొని సతీధర్మాన్ని పాటించి పతితో సహగమనం చేసిన మహనీయ మహిళ గాంధారి.

**6. అహల్య** - చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా కొన్ని వేల సంవత్సరాలు తపస్సుచేసి శ్రీరామ దర్శనంతో పునీతమైన మహిళ. తన తపశ్శక్తిచే శ్రీరామునిచే పాదాభివందనం చేయించుకున్న (శక్తి సంపన్నురాలైన) మహిళ.

*"రాఘవౌతు తతస్తస్యా: పాదౌ జగృహతుస్తధా"*

అని శ్రీమద్రామాయణం తెలియచేసింది.

**7. యోగమాయ**

తనమాయాశక్తిచే పురుషోత్తమ కార్యానికి సహాయపడి భగవంతుని ప్రసన్నతకు పాత్రురాలై భూలోకంలో 14 రూపాల్లో పూజింపబడు తున్న దేవతామూర్తి.

**8. సత్యభామ** - ప్రేమతో, వినయంతో, తన విలువిద్యా నైపుణ్యంతో భర్తయైన శ్రీకృష్ణుని మెప్పు పొంది. 16008 మంది భామల్లోను తన ప్రత్యేకతను లోకానికి చాటుకున్న మహిళ.

**9. కాళింది** - ఈమె సూర్యతనయ, శ్రీకృష్ణుని పతిగా పొందాలని కాళిందీ నదిలో తండ్రి అనుమతిపై తపస్సు చేసింది. ఈమె తపస్సుకి మెచ్చి శ్రీకృష్ణుడు ప్రసన్నుడై వివాహం చేసి కొన్నాడు. ఈమె తపశ్శక్తిచే లోకాధిపతి అయిన శ్రీకృష్ణుని పత్ని కాగల్గింది.

**ఇ) శక్తితో ముక్తిని పొందిన మహిళలు**

**1. దేవకీదేవి**

దేవకీదేవి తన బిడ్డగా జన్మించిన శిశువని గుర్తించి పరంజ్యోతి స్వరూపాన్ని స్తుతించింది. తనునోచిన నోములన్నీ సంపూర్ణంగా ఫలించాయని పరమానంద పడుతుంది.

దేవకీదేవి సంతోషాన్ని చూసి ఈశ్వరుడైన మహా విష్ణువు దేవకీ వసుదేవుల పూర్వ జన్మ వృత్తాంతాన్ని విన్పిస్తాడు. 12 వేల దివ్య సంవత్సరాలు నామ జపంతో తపస్సు చేసి, తనని ప్రసన్నం చేసుకొన్నారని. ఆ ఫలితంగా మూడు జన్మల నుండి తాను వారికి పుత్రుడిగా జన్మిస్తున్నానని చెపుతాడు. నన్ను మీరు కుమారునిగా పొందినప్పటికి పరబ్రహ్మంగానే తలుస్తుంటారని, నిరంతరం సంస్కరణం వల్ల నా అద్భుతమైన అపవర్గమార్గాన్ని పొందుతారని చెపుతాడు. నా పై మీకున్న ప్రేమ వల్ల జన్మ రాహిత్యాన్ని పొందుతారని వరమిస్తారు.

*క. "నందను ( డనియు బరమా*
*నందంబగు బ్రహ్మమనియు నను ( దల ( చుచునా*
*పెందెరువు నొందెదరు, నా*
*యందలి ప్రేమమున భవమునందదరు మీరల్"* [12]

దేవకీదేని తన తపశ్శక్తిచే భగవంతుని కృపకి పాత్రయై జన్మరాహిత్యం పొందింది.

## 2. ద్రౌపది

పాండవ పట్ట మహిషియైన ద్రౌపది నిరపేక్షులైన భర్తలచే ఉపేక్షింపబడింద్రై దేవదేవుడైన వాసుదేవాయత్త హృదయంతో పరమేశ్వర సాన్నిధ్యం పొందింది.

*వ. "అంత విదురుండు ప్రభాస తీర్థంబున హరియందు ( జిత్తం బుసేర్చి, శరీరంబు విడిచి, పితృ వర్గం బు తోడ దండధరుండ గుటం జేసి నిజాధికార స్థానంబునకుం జనియె, ద్రుపద రాజ పుత్రియు ( బతులవలన నుపేక్షితయై జగత్పతియైన వాసుదేవునందు ( జిత్తంబు సేర్చి తత్పదంబు సేరెనిట్లు"*[13]

యజ్ఞజన్య ద్రౌపది స్వతహాగా జన్మత: శక్తివంతురాలు సామాన్య స్త్రీలవలె అబలకాదు, సబల. ద్రౌపది పాత్రను ఆద్యంతం పరిశీలిస్తే (మహా భారతం), ఆమె శక్తి కొలది మానవ కాంతగా ఆమె ప్రయత్నించి, ఆ ప్రయత్నానికి మానవ శక్తి చాలదనుకొన్నపుడే శ్రీకృష్ణుని (ధైవీశక్తిని) శరణాగతి చేసింది. సర్వాత్మనా శ్రీకృష్ణుని నమ్మి తన లక్ష్యాన్ని నెరవేర్చుకొని ముక్తి పొందిన మహిళ.

## 5.3. యుక్తిమార్గము

## అ) యుక్తితో లౌకిక కోరికలు తీర్చుకున్న స్త్రీలు

## 1. ఉత్తర

ఈమె విరాట మహారాజు తనయ. సుభద్రార్జునుల పుత్రుడైన అభిమన్యుని ప్రేమించి, పెద్దల అంగీకారంతో వరించిన యుక్తి గల్గిన మహిళ. ఈమె యుక్తితోనే తన గర్భస్థ శిశువైన కురు వంశాంకురాన్ని నిలబెట్టగలిగింది.

*క. "చెచ్చెర బాణ జ్వాలలు,*
*వచ్చిన విష్ణుండు గానవచ్చు ననుచు ( దా (*
*ముచ్చటలు సెప్పు సతులకు*
*నిచ్చలు మాయవ్వ నే ( డు నిజమయ్యెడి నో"*[16]

అశ్వత్థామ బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భాన్ని బాధించగా శ్రీకృష్ణునితో ఉత్తర నీచరణ కమలాలు తప్ప వేరేమో తెలియదు. కరుణతో కాపాడమని ప్రార్థించింది.

*మ. "ఇదె కాలానల తుల్యమైన విశిఖంబేతెంచె దేవేశ! నే (*
*డుద రాంతర్గత గర్భదాహమునకై యుగ్ర ప్రభన్ వచ్చుచు*

*న్నది దుర్లోక్యము మానుపన్ శరణమన్యం బేమియున్ లేదు నీ*

*పద పద్మంబులె కాని యొండెఱుగ నీబాణాగ్ని వారింపవే"*[17]

అధిక దాక్షిణ్యంతో తన బిడ్డను రక్షించమని లోకరక్షకుడు, నిఖిల లోక స్తుత్యుడైన వాసుదేవునికి తన భూలోక చుట్టరికాన్ని విన్నపం చేసింది.

*క. "చెల్లెలి కోడల, నీమే*

*నల్లుఁడు శత్రువుల చేత హతుఁ డయ్యెను, సం*

*ఫుల్లార వింద లోచన!*

*భల్లాగ్ని నడంచి శిశువు బ్రతికింపగదే!"*[18]

ఉత్తర చిన్న వయస్సులోనే శ్రీహరి చరణ కమలాలను ఆశ్రయించటమే కాక యుక్తితో భగవంతునికి తన కోరిక నివేదించి సఫలీకృతురాలైన స్త్రీ మూర్తి.

**కుబ్జ** - ఆమె కంసదాసి. భక్తితో బలరామ కృష్ణులకు లేపనమిచ్చి, శ్రీకృష్ణుని అందాన్ని కొనియాడి శ్రీకృష్ణ పాద స్పర్శచే తాను సౌందర్యాన్ని పొందింది.

కుబ్జ కమలాక్షుని కాంక్షతో చూస్తూ

*క. "వేంచేయుము నాయింటికిఁ*

*బంచశరాకార ! యనుచుఁ బైకొంగాక*

*ర్షించి హరిఁ దిగిచెఁ గామిని,*

*పంచాశుగ బాణజాల భగ్నహృదయమై"*[19]

తన ఇంటికి రమ్మని ఆహ్వానించింది. శ్రీకృష్ణుడు కంసవధానంతరం కుబ్జ ఇంటికి వెళ్ళి ఆతిధ్యాన్ని స్వీకరించి, ఆమెని సంతోషింప చేశాడు.

యుక్తితో కుబ్జ తన త్రివక్రతను పోగొట్టుకొని చక్కని చుక్కై దేవాదిదేవుడైన శ్రీకృష్ణునితో లౌకికానందాన్ని అనుభవించిన "మాయ"లో పడ్డ అమాయకపు స్త్రీ. మోక్ష ప్రదాయకుడైన దేవాది దేవుడినే సంతోష పరచిన కుబ్జ లౌకిక సుఖాన్ని కోరుకుంది గాని అలౌకికానందాన్ని గూర్చి ఆలోచించలేక పోయింది. దీనికి కారణం తమోగుణ ప్రవృత్తి గల కంసుని దాసి అవ్వటమే కారణమై నుండవచ్చు. యధారాజా తధా ప్రజా! కదా!

| స్కంధం | భక్తి | శక్తి | యుక్తి | ముక్తి |
|---|---|---|---|---|
| ప్రథమ స్కంధం | కుంతి | ద్రౌపది | ఉత్తర | కుంతి |
| తృతీయ స్కంధం | దేవహూతి | అరుంధతి | | దేవహూతి |
| చతుర్ధ స్కంధం | సునీతి | సునీధ | | సునీతి |
| | | | | (విష్ణుపదం) |
| షష్ఠ స్కంధం | కయాధువు | శచీదేవి | | |
| నవమ స్కంధం | | సీత, అహల్య | | |
| దశమ స్కంధం | యశోద,నాగకాంతలు | దేవకీ దేవి | కుబ్జ | పూతన |
| | గోపికలు, మునిపత్నులు | యోగమాయ | | దేవకీదేవి |
| | రుక్మిణీ దేవి, నాగ్నజితి, | సత్యభామ | | యశోద |
| | లక్షణ, 16000 రాజ | కాళింది | | గోపికలు |
| | కన్యలు | | | మునిపత్నులు |
| ఏకాదశ స్కంధం | పింగళ | | | |

**మహనీయులు భాగవత మహిళలు**

*క. "ధర్మము, సత్యము, గీర్తియు,*
*నిర్మలదయ విష్ణుభక్తి నిరుపమ ఘన స*
*త్కర్మ మహింసా వ్రతమును*
*నర్మిలిగలవారె పుణ్యులవనీ నాధా!"*[31]

శుక మహర్షి పరీక్షిన్మహరాజుకి ధర్మం, సత్యం, కీర్తి, నిర్మలదయ, విష్ణుభక్తి, సాటిలేని మహనీయ సత్కర్మ అహింస అనే గుణాలు కలవారు పుణ్యవంతులు. వారే మహనీయులని స్పష్టంగా తెలియ చేసాడు.

*తే. "ఉత్తమ శ్లోకు డన నెవ్వ (డున్నవాడు*
*సన్నుతండగు నెవ్వ ( డు సకల దిశల*
*నట్టి పరమేశ్వరుని ( జిత్తమందు నిలిపి*
*తద్గుణంబులు వర్ణింపు ధరణి నాధ"*[32]

పరమేశ్వర లక్షణాన్ని నిర్వచించాడు. ఉత్తములచే కీర్తించబడేవాడు సర్వ దిశల్లో నుతించబడేవాడు పరమేశ్వరుడు. ఈ పరమేశ్వరుని పుణ్యాత్ములే తెలుసుకోగల్గుతారు.

మహనీయులైన భాగవత మహిళలు భగవంతుని కీర్తించి, భగవద్వైభవాన్ని సర్వదిశల్లో చాటి పుడమిని, పుట్టింటిని, మెట్టింటిని పునీతం చేసి పరమపురుషుని (పరమాత్మని) చేరి, లోకజనులకు లోకేశుని చేరే మార్గం చూపి వారి మానవ జన్మను చరితార్థం చేసుకున్నారు.

# పాద సూచికలు

1. సం. ని.
2. భ. గీ. అ. 12, శ్లో. 2
3. భ. గీ. అ. 12, శ్లో. 3
4. భ. గీ. అ. 12, శ్లో. 6
5. భ. గీ. అ. 12, శ్లో. 7
6. భ. గీ. అ. 12, శ్లో. 8
7. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 381
8. ఆం. భాగ. తృ. స్కం. ప. 1050
9. ఆం. భాగ. చ. స్కం. ప. 377
10. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1040
11. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1071
12. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 659
13. ఆం. భాగ. ద. స్కం. ఉ. భా. ప. 1063
14. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 134
15. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 388
16. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 282
17. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 178
18. ఆం. భాగ. ప్ర. స్కం. ప. 180
19. ఆం. భాగ. ద. స్కం. పూ. భా. ప. 1279
20. ఆం. భాగ. ద్వా. స్కం. ప. 16
21. ఆం. భాగ. ద్వా. స్కం. ప. 19

# ఉపసంహారం

కనిపించే చరాచర జగత్తు అంతా భగవంతుని సృష్టి. ఈ సృష్టిలో ఏ జాతిలోనైనా స్త్రీ పురుషులున్నారు. ఈ స్త్రీ పురుషుల్లో బాహ్య ప్రపంచానికి పురుష ప్రాధాన్యత కన్పించినంతగా, స్త్రీల ప్రాధాన్యత కన్పించటం లేదు. సంస్కారులైన పురుషులు స్త్రీలను ఎంతో గౌరవంగా, సున్నితంగా, తన వెంట నున్న నీడవలె, కంటికి రెప్పలా సంరక్షించారు. స్త్రీలు పురుషుల రక్షింప బడటమే కాదు. స్త్రీలు కూడ తన వంతు కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా ఆలోచించారు. స్త్రీలు ఈ సమాజంలో ధర్మాన్ని నిలబెట్టటానికి దక్ష ప్రజాపతి పత్ని ప్రసూతి కర్దమ మునీంద్రుని పత్ని దేవహూతి కృంగి కృశించారు. కుటుంబ వ్యసస్థని కాపాడటానికి మాతృవాత్సల్యాన్ని అమితంగా కనపరిచారు. తమకు ఇష్టం లేక పోయినా మనస్సుకి నచ్చచెప్పుకొని అంబిక, అంబాలికలు వ్యాస సంపర్కాన్ని అంగీకరించి పెద్దల మాటను శృతి వాక్యం వలె గౌరవించి ఆదరించారు.

పురుషులతో సమానంగా తపస్సు చేశారు. పృశ్ని తన భర్తయైన సుతపుడితో 12వేల దివ్య సంవత్సరాలు శ్రీహరినామ సంకీర్తన చేసి దేవదేవుని (శ్రీమన్నారాయణుని) మూడు జన్మల్లో పుత్రునిగా పొందగలిగింది. అత్రిమహాముని భార్య అనసూయ 12 సంవత్సరాలు ఒంటి కాలితో తపస్సు చేసి దేశంలో దుర్భిక్షాన్ని పారద్రోలింది. మారిష కూడ పూర్వ జన్మలో భర్తను కోల్పోయి శ్రీహరిని గూర్చి తపస్సుచేసి, అనంతర జన్మలో ప్రచేతసులకు పత్ని అయింది. అంగరాజు పత్ని సునీధ దుర్మార్గుడైన పుత్రుడు వేనుని వల్ల రాజవంశం అంతరించకుండా తన యోగశక్తిచే పృధు చక్రవర్తి లాంటి పౌత్రుని పొందగల్గింది. భగవన్నిర్ణయాన్ని పాటించి బహుభర్తృత్వాన్ని పాటించి మారిష దక్షుని పుత్రునిగా పొందింది పెద్దల నిర్ణయానికి తలొగ్గి, బహు భర్తృత్వాన్ని పాటించిన ద్రౌపది ద్వాపర యుగంలో ఏ స్త్రీ పొందరాని అవమానం పొందింది. అవమాన భారంతో కృంగి కృశించక, తనను అవమానించిన కౌరవులపై పగ తీర్చుకుని తన ప్రతీకార శక్తి రూపాన్ని, తాను కారణ జన్మురాలినని, యజ్ఞజన్యనని లోకానికి చాటింది. పాండవులు అసహాయులై విధికి తలొగ్గినపుడు అనాధ నాధుడైన శ్రీకృష్ణుని శరణువేడి స్వసంరక్షణ కావించుకుంది. బిడ్డల ఉన్నతికోసం దాయాదుల పంచన చేరి అమిత కృష్ణ భక్తితో పాండు పత్ని పృధాదేవి తన పుత్రులకు రాజ్య సంప్రాప్తిని కలిగింప చేసింది. ఎంత సంకట పరిస్థితులనైనా భగవంతునిపై అచంచల దృఢ విశ్వాసంతో ఎదురీదారు కాని వెనుకడుగు వేయలేదు.

ధర్మాన్ని అతిక్రమించిన స్త్రీలు ఒకరిద్దరున్నా, నిషిద్ధ సమయంలో పతితో కూడిన దితి, గౌతముని భార్య అహల్య దేవేంద్రుని కలయికతో, రాజకుమార్తెనని అహంకరించి, గురు పుత్రికని బావిలో పడద్రోయించిన వృష పర్వుని కుమార్తె శర్మిష్ఠ, వారి తప్పుకు వారు పదింతలు ప్రాయశ్చిత్త మనుభవించి ప్రక్షాలన చేసికొన్నారు.

పతినే ప్రత్యక్ష దైవంగా భావించి, త్రిమూర్తులనే శిశువులుగా చేసి, ఆతిధ్యమిచ్చి జగత్తుకి పాతివ్రత్య మహిమను చాటి అనసూయ స్త్రీ శాసక శక్తిని తెలియచేసింది. పర పురుషుల బారినుండి తన శీల సంరక్షణ గావించుకున్న సహనమూర్తులుగా హిరణ్యకశిపుని పత్ని లీలావతి, దేవేంద్రుని భార్య శచీదేవిలు కన్పిస్తారు. తమ పతి భక్తితో శ్రీకృష్ణుని శరణువేడి నాగాంగనలు తమ భర్తయైన కాళీయుని సంరక్షించుకున్నారు. తమ పతి భక్తితో కంసుని భార్యలైన అస్తి, ప్రాస్తి తమ తండ్రి జరాసంధునిలో ప్రతీకార జ్వాల రగిల్చి, శ్రీకృష్ణునిపై పగ పెంచి యుద్ధానికి సిద్ధంచేసి ద్వాపర యుగ రాజ వంశ వినాశానికి దోహద పడ్డారు.

సనాతన ధర్మానికి కట్టుబడి కడుపేదరికంలో ఉన్న బ్రాహ్మణ జాతి స్త్రీలు కుచేలుని భార్య, పురాతన పుణ్యకథలో కన్యకారత్నం ఆత్మాభిమానంతో తమ కుటుంబాలను తమ తెలివితేటలతో చక్కబెట్టుకున్న మహిళలుగా కన్పిస్తారు. సునీతి, సపత్నీ మాత్సర్యానికి గురియై, రాజుచే, సవతిచే తాను, తన పుత్రుడు అవమానింపబడినప్పటికి అచంచలమైన నారాయణ భక్తితో ఉత్తమగతి పొందారు. కురువంశం నిలబెట్టడానికి సత్యవతి కన్యగా ఉన్నప్పుడు తానుచేసిన దోషాన్ని సిగ్గువిడిచి, సవతి కొడుకుకి చెప్పుకొని తన పుత్రుడైన వ్యాసుని అభ్యర్ధించింది. రాక్షస పత్నులై నప్పటికి లీలావతి, వింధ్యావళి, మండోదరి ధార్మికంగా జీవించారు. వింధ్యావళి త్రివిక్రమ దేవుని తనపతి బంధనం గూర్చి ప్రశ్నించి పతిభిక్ష అర్ధించి సౌభాగ్యవతి అయింది. మునిపత్నులు సనాతన ధర్మపరులైనప్పటికి భర్తలు నివారించినా అతిథి ధర్మపరులై నప్పటికి భర్తలు నివారించినా అతిథి ధర్మాచరణలో ఒక అడుగు ముందుకు వేసి బలరామ కృష్ణులను దర్శించాలనే కుతూహలంతో చతుర్విధ ఆహారాలు తీసికొని, శ్రీకృష్ణ స్వరూప సందర్శనంతో ముక్తిని సాధించగలిగారు. గోపకాంతలు, గోపికలు శ్రీకృష్ణుని వేణుగానానికి పరవశలై శ్రీకృష్ణుని పతిగా భావించారు. పతులను వదిలి దేవాదిదేవుడైన శ్రీకృష్ణునిపై మధుర భక్తితో మరులుగొన్నారు. ద్వాపరయుగ కాలం నాటికి స్త్రీలల్లో స్వతంత్ర ప్రతిపత్తి పెరిగింది. ఇక బాణాసురుని కుమార్తె ఉష తండ్రిని లెక్కచేయక,

స్వతంత్రించి తన వివాహ విషయంలో నిర్ణయం తీసుకొని, చెలికత్తె ద్వారా తాను కోరుకున్న వరుని, తన అంత:పురానికి రప్పించుకొని, సంసార జీవితం కొనసాగించి, యుద్ధమే సృష్టించింది. కాని బాణాసురుని తల్లి కోటర పుత్రుని శ్రీకృష్ణుని నుండి సంరక్షించుకోవటానికి యుద్ధ భూమిలో సిగ్గువిడిచి జుట్టు విరబోసుకొని నగ్నంగా నిలబడి, ఆ రోజుకి యుద్ధమాపగల్గింది. పుత్ర వాత్సల్యం ముందు సామాజిక ధర్మాన్ని తన ఉనికిని కూడ వదులుకోవటానికి సిద్ధమైన మహిళ కోటర. యోగ విద్యా నైపుణ్యంతో తాను కోరుకున్న ప్రదేశానికి ఎవరినైనా తరలించుకు రాగలిగిన శక్తి సంపద ఉన్న స్త్రీలు కన్పిస్తున్నారు. వారిలో ఉష చెలికత్తె చిత్రరేఖ ఒకరు. రెండు ముక్కలై పారవేయబడిన బిడ్డ శరీరాన్ని కలిపి 'జర' అనే రాక్షస స్త్రీ ప్రాణం పోసింది. రాక్షస జాతి స్త్రీలల్లో శక్తివంతురాలైన మహిళ. 'మహామాయ' అనే విద్యని పతికి ఉపదేశించి తండ్రిబారి నుండి తన భర్త ప్రాణాలు కాపాడుకున్న స్త్రీమూర్తి మాయావతి.

విదురుని తల్లి, నారదుని తల్లి అనామకులై ఉండి దాసీలుగా జీవిస్తూ, సద సద్వివేకంతో మసలుతూ మహాజ్ఞానులకు జన్మనిచ్చారు. కంసుని దాసి కుబ్జ కంసుని కోసం తయారుచేసి తీసుకెళ్తున్న మైపూత శ్రీకృష్ణుడు పలకరించగనే ఇచ్చి పరవశంతో శ్రీకృష్ణ సౌందర్యాన్ని కొనియాడి తాను సౌందర్యవతియై, కంస సంహారానంతరం తొలిగా తన ఇంటికి రప్పించుకొని ఆతిధ్య మిచ్చిన మహిళ.

సామాన్యలైన హస్తినాపుర స్త్రీలు, మధురా నగర స్త్రీలు కూడ భువనైక మోహనుడని కొనియాడి, వేద వేద్యుడైన శ్రీకృష్ణుని మహిమ గుర్తించారు. ద్వారకా నగర కాంతలు కూడ శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడని గుర్తించారు. వేశ్యావృత్తితో విసిగిపోయి అసలైన పురుష శబ్ద వాచ్యుడు శ్రీమన్నారాయణుడు అని గుర్తించిన పింగళ కూడ ఆత్మపరివర్తనతో ముక్తి పొందింది. నరకుని చెఱనుండి విడువబడిన 16000 రాజ కన్యలు శ్రీకృష్ణుని పతిగా అభ్యర్థించి, ఏక కాలంలో 16000 రాజ కన్యలు 16000 రూపాల శ్రీకృష్ణునితో వివాహం చేసికొని, పతిభక్తితో కొలిచి తమ జీవితాలకు నరకుడు బంధించటం వల్లనే మేలు జరిగిందని భావించారు.

ఇక గోపికల మధుర భక్తి, రుక్మిణీదేవి పతిభక్తి వర్ణించ నలవికానివి. భగవంతుడినైనా వశం చేసికొనగల్గిన శక్తి భామకే ఉందని నిరూపించిన సత్యభామ, గోపాల దేవుని ధనుర్విద్యా నైపుణ్యాన్ని,

వేణుగానాన్ని లోకానికి వెల్లడిచేసిన లక్షణ. మదించిన ఏడు వృషభాలను బంధించి అతిలో కవీరుడిగా శ్రీకృష్ణునికి ఖ్యాతి తెచ్చి వివాహమాడిన నాగ్నజితి. శ్రీరాముడే శ్రీకృష్ణుడని లోకానికి వెల్లడిచేసి కానుకగా వచ్చిన జాంబవతి. అత్త కుమార్తెలుగా పుట్టి శ్రీకృష్ణునికి సతులయిన మిత్రవింద, భద్రలు. కాళిందీ నదిలో శ్రీకృష్ణుని పతిగా పొందాలని తపస్సు చేసి పార్థుడి ద్వారా తన కోరికను శ్రీకృష్ణునికి తెలియ చేసిన సూర్యతనయ కాళింది. అష్టైశ్వర్య ప్రదాత అయిన శ్రీకృష్ణునికి అష్ట మహిషులై భువిలో "షట్కర్మ యుక్తలై" విలసిల్లారు.

సుభద్ర సోదరప్రేమ, విశ్వాసం తనపతి అయిన అర్జునుని కంటికి రెప్పలా శ్రీకృష్ణుడిచే కాపాడేటట్లు చేసి, సుభద్ర పౌత్రుడే కురువంశాంకురమై కురురాజ్యంలో కలిని నిగ్రహించి ధర్మ సంరక్షణ చేసి శ్రీకృష్ణ భక్తుడై తరించేటట్లు చేయగలిగింది.

సృష్ట్యాదినుండి స్త్రీలు పుట్టుకలో సగభాగమై (ప్రజాభివృద్ధికై బ్రహ్మదేహం రెండు భాగాలవ్వగా ఒక భాగం స్వాయంభువ మనువు, మరొక భాగం శతరూప ఉదయించారు) నేటి వరకు స్త్రీలు తన శక్తి వంచన లేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తూ భూదేవి వలె సహనంతో, వాగ్దేవి వలె మృదు మధుర వాక్కులతో దు:ఖ నివారణ శక్తిని పెంపొందించుకొని, కాలాన్ని వెళ్ళదీసారు. అందువల్లనే తల్లి స్థానంలో "మాతృదేవోభవ" దేవతామూర్తిగా తొలి గౌరవ స్థానాన్ని పొందగలిగారు. జీవన మనుగడకు తగిన శక్తి యుక్తులను కలిగి భాగవత మహిళలు స్త్రీశక్తి ఔన్నత్యాన్ని భక్త లోకానికి చాటి, తమ ఘనతను భాగవతం వంటి పవిత్ర గ్రంథంలో పదిలపరచుకో గలిగారు.

*"శ్రీవిద్యాం పరిపూర్ణమేరు శిఖరే బిందుత్రికోణే స్థితాం*
*వాగీశాది సమస్త భూత జననీం మంచే శివాకారకే*
*కామాక్షీం కరుణా రసార్ణవ మయీం కామేశ్వరాంక స్థితాం*
*కాంతాం చిన్మయ కామకోటి నిలయాం శ్రీ బ్రహ్మవిద్యాం భజే".*

# ఉపయుక్త గ్రంథ పట్టిక


**1. తెలుగు**

1. అంతరార్థ భాగవతం - డా. వేదుల సూర్యనారాయణ శర్మ
గంగాధర పబ్లికేషన్స్, రామ మందిరం వీధి, విజయవాడ - 2.

2. ఆంధ్ర మహా భాగవతము - పోతన, తంజ నగరము
తేవన్పెరుమాళ్ళయ్యగారిచే పరిశోధితము, ఆనంద ముద్రాక్షర శాల, మద్రాసు - 1911

3. ఆంధ్ర మహాభారతము - కవిత్రయము
తెలుగు విశ్వ విద్యాలయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు-1971.

4. ఆముక్త మాల్యద - శ్రీకృష్ణదేవరాయలు వావిళ్ళ రామ స్వామి శాస్త్రులు అండ్ సన్స్,
వావిళ్ళ ముద్రణాలయం, మద్రాసు-1969.

5. పురాణ పరిచయము - డా.జానమద్ది రామకృష్ణ,
శారదా పబ్లికేషన్స్, తిరుపతి-1997.

6. పూర్వగాధాలహరి - శ్రీవేమూరి శ్రీనివాసరావు, అడ్వకేట్, తణుకు
పబ్లిషర్స్ వేంకట్రామ అండ్ కో, విజయవాడ - ఏలూరు - హైదరాబాదు, 1986.

7. పోతన భాగవత పంచశతి నీరాజనము -
ప్రొ. ఏ.రాజేశ్వర శర్మ మరియు డా. కె. సంపత్కుమారాచార్య
శ్రీ పి.వి.ఆర్.కె ప్రసాద్ ఐ.ఏ.యస్, తిరుమల తిరుపతి దేవస్థానం

8. భాగవతంలో కృష్ణ తత్త్వం - డా.సూరంపూడి సుధ ప్రథమ ముద్రణ 2006
నవోదయ పబ్లికేషన్స్, కాచిగూడ, హైదరాబాద్.

9. భాగవత సుధ - డా.య.జి.పి.శ్రీరామ చంద్రమూర్తి
నవోదయ పబ్లికేషన్స్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్.

10. మనుస్మృతి: (సవ్యాఖ్యాన ఆంధ్రతాత్పర్య సహితము) - శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం
శ్రీ పరమేశ్వరీ ప్రెస్, విజయవాడ-2.

11. వేదాలలో దేవతలగాథలు - పి.యస్.సుబ్రహ్మణ్యం
తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు-1995.

12. వైదిక సాహిత్య చరిత్ర - డా. ముదిగంటి గోపాలరెడ్డి మరియు డా.ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, ద్వితీయ ముద్రణ,1997.

13. శ్రీదేవి భాగవతం (వేద వ్యాస మహర్షి కృత) తెలుగు అనువాదం - భాగవతుల సుబ్రహ్మణ్యం, నవరత్న బుక్ హౌస్, విజయవాడ ప్రథమ ముద్రణ 2006. 28-22-20, రహిమాన్ వీధి, ఏలూరు రోడ్.

14. శ్రీ భాగవతము - ఉపాఖ్యానములు - శ్రీమతి ప్రభల వేంకట నాగలక్ష్మి లక్ష్మీవైభవ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, గాంధీనగర్, విజయవాడ-3.

15. శ్రీమద్రామాయణ రమ్యగాథలు - చెవుటూరి కుసుమ కుమారి శ్రీమాన్ ప్రింటర్స్ అండ్ ప్రాసెసర్స్, సీతానగరం, గుంటూరు జిల్లా, ప్రథమ ముద్రణ 2005.

16. శ్రీమద్భాగవత సంగ్రహము - బాల గంగాధర పట్నాయక్ (తెలుగు వ్యావహారిక భాషావచన గ్రంథం) గీతా ప్రెస్, గోరఖ్ పూర్, 2009, నాలుగవ ముద్రణ.

17. శ్రీ విష్ణుపురాణం (ఆంధ్రానువాదం) - శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం శ్రీ చైతన్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ 2009

## 2. సంస్కృతం

1. అథర్వణ వేదము, శంకర పాండు రంగ పండిట్, గవర్నమెంట్ సెంట్రల్ బుక్ డిపో, బొంబాయి, 1895.

2. ఉత్తర రామ చరిత్ర - భవభూతి విద్యా తరంగి ణ్యాఖ్య, స్వీయ ముద్రాక్షరశాల, మైసూరు 1891.

3. ఋగ్వేదము, శంకర పాండురంగ పండిట్ శాయనాచార్య, గవర్నమెంట్ సెంట్రల్ బుక్ డిపో బొంబాయి 1810.

4. నారద భక్తి సూత్రములు, అనువాదకులు: శ్రీ దోడ్ల వేంకట రామారెడ్డి, శ్రీరామ కృష్ణ మఠము, క్రాంతి ప్రెస్, మద్రాసు, చతుర్థ ముద్రణం, 1987.

5. దేవ్యపరాధ స్తోత్రము - శంకరాచార్యులు, బాల సరస్వతీ బుక్ డిపో, కర్నూలు, 1991.

6. భగవద్గీత (శంకరభాష్య - ఆంధ్రానువాదము) వ్యాస మహర్షి, అనువాదకులు, శ్రీరామసం వీరేశ్వర శర్మ, శ్రీ సీతారామ ఆదిశంకర ట్రస్టు, హైదరాబాదు, 2001.

7. భర్తృహరి సుభాషితములు - భర్తృహరి శ్రీ ప్రభాస్ ముద్రాక్షరశాల, రాజమండ్రి

8. భవిష్య పురాణం - వ్యాసమహర్షి శ్రీక్షేమరాజ్ కృష్ణదాస్,
శ్రీ వెంకటేశ్వర స్టీమ్, యంత్రాలయము, ముంబాయి.

9. మత్స్య పురాణము - వ్యాస మహర్షి వర్తమాన తరంగిణీ, ముద్రాక్షరశాల, చెన్నపురి 1877

10. మనుస్మృతి, హరిదాస సంస్కృత గ్రంథమాల,
చౌకాంబా సంస్కృత సీరిస్ ఆఫీస్, వారణాసి, 1952.

11. మార్కండేయ పురాణము - వ్యాస మహర్షి
సరస్వతీ యంత్రాలయము, కలకత్తా, 1879.

12. ముండకోపనిషత్తు (శాంకర భాష్య సహితము) తెలుగు అనువాదము,
శ్రీ కొంపెల్ల దక్షిణా మూర్తి, తృతీయ ముద్రణము, 2003.

13. యజుర్వేదము, విద్యారణ్య భాష్యము, పూనె (ప్రతి)

14. రఘువంశము - కాళిదాసు, క్షేమరాజ్ కృష్ణదాస్
శ్రీ వెంకటేశ్వర స్టీమ్ ప్రెస్, బొంబాయి 1850.

15. వైయాకరణ సిద్ధాంతకౌముది - పాణిని తత్త్వబోధినీ వ్యాఖ్య సహితము
పాండురంగ జవాజీ, నిర్ణయ సాగర్ ప్రెస్, బొంబాయి - 1929.

16. శ్రీమద్రామాయణము - వాల్మీకి గీతాప్రెస్ - గోరఖ్‌పూర్, 2003.

17. శ్రీమద్భాగవతము - వ్యాస మహర్షి, వావిళ్ళ ముద్రణాలయము
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి - 1927.

## 3. నిఘంటువులు

1. అమరకోశము - అమర సింహుడు
శ్రీరాజ రాజేశ్వరీ నికేతన ముద్రాక్షరశాల, చెన్నపురి-1972

2. సంస్కృతాంధ్ర నిఘంటువు (సంకలనము) శ్రీ చలమచర్ల వేంకట శేషాచార్యులు
ప్రకాశకులు, శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్స్, హైదరాబాదు, 1987.

3. సూర్యరాయాంధ్ర నిఘంటువు - తెలుగు విశ్వవిద్యాలయము,
హైదరాబాదు, తృతీయ ముద్రణ, 1988.

4. సర్వశబ్ద సమ్బోధిన్యాఖ్యోయమ్ సంస్కృత నిఘంటువు ఆన్ధ్రటీకాసహిత:
శ్రీ పరవస్తు శ్రీనివాసాచార్య ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్, న్యూడిల్లీ, చెన్నై, 2005.

## సాంకేతిక పదసూచిక

| | | | |
|---|---|---|---|
| 1. | అగ్ని. పురా | - | అగ్ని పురాణం |
| 2. | అధ. వే | - | అధర్వణ వేదము |
| 3. | అ. వే. సం | - | అధర్వణ వేద సంహిత |
| 4. | అభి.శా | - | అభి జ్ఞాన శాకుంతలం |
| 5. | అమ. కో | - | అమర కోశము |
| 6. | అం. భాగ. | - | అంతరార్ధ భాగవతము |
| 7. | ఆ. | - | ఆశ్వాసము |
| 8. | ఆం. పద్మ. పురా. | - | ఆంధ్ర పద్మ పురాణము |
| 9. | ఆం. మ. భాగ | - | ఆంధ్ర మహా భాగవతము |
| 10. | ఆం. మ. భార | - | ఆంధ్ర మహా భారతము |
| 11. | ఋ. వే | - | ఋగ్వేదము |
| 12. | ఐ. బ్రా | - | ఐతరేయ బ్రాహ్మణము |
| 13. | కాం. | - | కాండము |
| 14. | కు. సం | - | కుమార సంభవము |
| 15. | కూ. పురా | - | కూర్మ పురాణము |
| 16. | గరు. పు | - | గరుడ పురాణము |
| 17. | నా. పురా | - | నారద పురాణము |
| 18. | నా. భ. సూ | - | నారద భక్తి సూత్రములు |
| 19. | పద్మ. పురా | - | పద్మ పురాణము |
| 20. | ప. | - | పర్వము |
| 21. | పం. తం | - | పంచ తంత్రము |
| 22. | బ్ర. వై. పుర | - | బ్రహ్మ వైవర్త పురాణము |
| 23. | బ్ర. సూ | - | బ్రహ్మ సూత్రాలు |
| 24. | భగ | - | భగవద్గీత |
| 25. | భ. పురా | - | భవిష్య పురాణము |
| 26. | భాగ. మా | - | భాగవత మహాత్మ్యము |
| 27. | భా. సు | - | భాగవత సుధ |

| | | | |
|---|---|---|---|
| 28. | మత్స్య. పురా | - | మత్స్య పురాణము |
| 29. | మను | - | మనుస్మృతి |
| 30. | మం | - | మంత్రము |
| 31. | యజు | - | యజుర్వేదము |
| 32. | యో | - | యోగము |
| 33. | లిం. పురా | - | లింగ పురాణము |
| 34. | వరా. పురా | - | వరాహ పురాణము |
| 35. | వామ. పురా | - | వామన పురాణము |
| 36. | వా. పురా | - | వాయు పురాణము |
| 37. | వా. రా. | - | వాల్మీకి రామాయణము |
| 38. | వి. పురా | - | విష్ణు పురాణము |
| 39. | వే. దేవ. గా | - | వేదాలలో దేవతల గాధలు |
| 40. | వై. సాహి. చ | - | వైదిక సాహిత్య చరిత్ర |
| 41. | శ్రీ. ధరీ. వ్యా | - | శ్రీధరీయ వ్యాఖ్య |
| 42. | శు. నీ | - | శుక్ర నీతి |
| 43. | సం. భాగ | - | సంస్కృత భాగవతము |
| 44. | సం. భార | - | సంస్కృత భారతము |
| 45. | సం. సా. చ | - | సంస్కృత సాహిత్య చరిత్ర |
| 46. | సం. ని | - | సంస్కృత నిఘంటువు |
| 47. | స్కం | - | స్కంధం |
| 48. | స్కాం. పురా | - | స్కాంద పురాణము |
| 49. | సూ | - | సూక్తము |
| 50. | సూ. ము | - | సూక్తి ముక్తావళి |
| 51. | సూ. రా. ని | - | సూర్య రాయాంధ్ర నిఘంటువు |
| 52. | శ. ర | - | శబ్ద రత్నాకరము |
| 53. | శ్రీ. భాగ. ఉ | - | శ్రీ భాగవతము ఉపాఖ్యానములు |